
# కాశీమజిలీ కథలు

5



శ్రీ

# కాశీమజిలీకథలు

## ఐదవ భాగము

ఇది గోదావరీ తీరస్థితంబగు
రాజమహేంద్రవరంబున నివసించియున్న

**బ్రహ్మశ్రీ మధిర సుబ్బన్న దీక్షితకవిచే**

రచింపబడినది


**పుట్టగుంట వీరయ్యా చౌదరి**
అరండల్ పేట : : విజయవాడ - 2
చే ప్రచురింపబడినది


కాపీరైటు] **1983** [వెల : రూ. **20-00**

# విషయసూచిక

## 48 వ మజిలీనుండి 56 వ మజిలీవరకు వచ్చు కథలు


| | |
|---|---|
| 1. శివగురుని కథ | 14 |
| 2. శివగురుని వివాహము | 18 |
| 3. ఉపమన్యుని కథ | 19 |
| 4. సతీదేవి గర్భవర్ణనము | 23 |
| 5. శ్రీశంకరాచార్యుని యవతారఘట్టము | 23 |
| 6. శంకరుని బాల్యక్రీడలు | 26 |
| 7. శంకరుని విద్యాభ్యాస వైచిత్ర్యము | 28 |
| 8. శంకరుని మాతృసేవ | 32 |
| 9. రాజశేఖరుండను రాజు శంకరుని నాశ్రయించుట | 34 |
| 10. శంకరుని యొద్దకు మహర్షులు వచ్చుట | 36 |
| 11. శంకరు డల్పాయువని విని తల్లి విలపించుట | 37 |
| 12. శంకరుడు తల్లికి వైరాగ్యోపదేశము చేయుట | 38 |
| 13. శంకరుడు మకరగ్రస్తుడై తల్లిని సన్యాసమున కాజ్ఞ యిమ్మనుట | 40 |
| 14. శంకరుడు తల్లిని జ్ఞాతుల కప్పగించుట | 42 |
| 15. శంకరుడు సన్యాసాశ్రమ స్వీకారమునకై గోవిందయతి యొద్ద కరుగుట | 43 |
| 16. సనందుని ప్రవేశము | 52 |
| 17. విశ్వేశ్వర దర్శనము | 53 |
| 18. భాష్య ప్రచారము | 57 |
| 19. వ్యాస దర్శనము | 60 |
| 20. భట్టపాదుని కథ | 67 |
| 21. శంకర మండన మిశ్రుల సంవాదము | 77 |
| 22. ఉభయభారతి బాల్యదశ | 90 |
| 23. శంకర సరస్వతుల సంవాదము | 92 |
| 24. ఉగ్రభైరవుని కథ | 119 |
| 25. అహోబల నృసింహుని కథ | 122 |
| 26. హస్తామలకుని కథ | 127 |
| 27. తోటకాచార్యుని కథ | 130 |
| 28. హస్తామలకుని పూర్వకథ | 134 |
| 29. పద్మపాదుని తీర్థయాత్ర | 145 |
| 30. శాక్త మతఖండన | 153 |
| 31. పాషండ మతఖండన | 157 |
| 32. వైష్ణవ మతఖండన | 160 |
| 33. గాణపత్య మతము | 168 |
| 34. క్రకచుని కథ | 172 |
| 35. కాపాలిక మంత్రము | 179 |
| 36. చార్వాకాది మతఖండనము | 180 |
| 37. నీలకంఠుని కథ | 188 |
| 38. గౌడపాదముని దర్శనము | 196 |
| 39. మహాశక్తిని గురించి జరిగిన కథ | 204 |
| 40. త్రిమూర్తుల కలహము కథ | 207 |
| 41. ఈడిగి బావుల కథ | 227 |

మరియు

| | |
|---|---|
| కాదంబరి, మహాశ్వేతల కథలు | 230 - 330 |

శ్రీ ర స్తు

# కాశీమజిలీకథలు

## శ్రీ శంకరాచార్య చరిత్రము

## ప్రథమోల్లాసము

## 48 వ మజిలీ

క. శ్రీవిద్యాతీర్థాకా
రావిర్భూతుం బరాత్ము నాత్మం బ్రణుతుల్
గావింతుశంకరగురు
శ్రీవిజయము గురుకటాక్ష సిద్ధివహింపన్.

మ. చెలురారన్ ఘటియించుగాత గృపమ జ్జిహ్వాగ్రసింహాసన
స్థలినాచార్య పదాంబుజస్తుతికథా సంతుష్టయై భారతీ
లలనారత్నము నృత్యదీశ్వర జటాలంకార గంగాసరి
చ్చలదూర్మిప్రకర స్వనప్రబల వాక్చాతుర్య విద్యాకృతిన్.

గీ. అల్పమగుదర్పణంబున నద్రికోటి
గానబడురీతి సంగ్రహ మైననిందు
తొంటిశంకరవిజయమందు దనరారు
తత్పవిత్రాంశమెల్ల వ్యక్తపడుగాదె.

గీ. అతిరుచివహించుమధుర మంధితరరుచి జ
నింపరుచ్యంతరము ఘటియించునట్లు
ప్రాకవీశ్వరకృత హృద్య పద్యగతికి
దెచ్చు వేరొక్క రుచిని మదీయకవిత.

ఉ. గరసగతిం బురాణ కవి సన్నుతుఁడైనను భాష్యకర్త శం
కరుఁడు మదల్పవాక్యకృతి గౌరవబుద్ధి సపుగ్రహింపఁడే
యితరము దుగ్ధవార్ధి శయనించెడు విష్ణుఁడు ప్రీతిగోపికా
తరుణులొసంగు దుగ్ధములు దక్కువనాక పరిగ్రహింపఁడే.

శా. ప్రారంభించి కదంక శంకరగుణవ్రాతంబు వర్ణింపగా
టీకల్ పెక్కుచు శ్లోకపాదమును బూరింజేయలేరైరహో
యేరీతిన్ రచియింతు వత్కథలనం చెంతే విలక్షింపక
ప్రాంశుం బట్టగరంబు లెత్తుగతి నా యత్నంబు చిత్రంబగున్.

శా. ఐనన్ మ్లాగలనైన వక్తలుగ జేయం జాలి దుగ్ధార్ణవా
సూనోక్తి ప్రకరోల్లసత్కరుచి వ్యూహంబులన్ జేయుచున్
జ్ఞానై యొప్పెడు దేశికోత్తమకటాక్షంబుల్ కరంబిప్పు నా
పైనిండారంగ నొప్పుచున్నవి యలక్ష్యంబెద్దినాకింకిటన్.

ఉ. పరమహితోపదేశమునఁ బామరకోటి దరింప జేయఁగా
ధరనుదయించినట్టి పరతత్త్వవిదుండు మహేశ్వరుండు శం
కరగురుసచ్చరిత్రము ప్రకాశముగా రచియించనేనెద
న్మురియుట యబ్బురంబె పరిపూర్ణదయం బుధజనంబులెన్నగన్.

చ. శుభకరవారిజాసన వ్యకృతిత్ఫృచ్ఛకోల్లస
ద్విభవకరశూన్యనందగిరి శుభ్రమయూఖశకాబ్ద కొల్లస
ద్విభవసమాసుమార్గసిత విశ్రుతమౌ విదియం జనించితిన్
త్రిభువనవంద్య వేదజన నీ కరుణావిలసద్విలోకన
ప్రభవకవిత్వవైభవుఁడ భవ్యకవీంద్రవపటో విధేయుడన్.

నేను జన్మసాఫల్యంబు శ్రీశంకరాచార్య చరిత్రము రచింప నెంచితి తత్కథా క్రమంబెట్టిదనిన, మణిసిద్ధయతీంద్రుఁడు గోపాలునితోఁగూడ నలువది యెనిమిదవ మజిలీనెలవుజేరి యందుఁగాల్యకరణీయంబుల దీర్చుకొని తన్ను జూడవచ్చిన చిదానందయోగితోఁ బెద్దతడ వద్వైతజ్ఞానమును గురించి ముచ్చటించెను. వారి ప్రసంగ మంతయు దాపున గూర్చుండి గోపాలుండు వినుచుండెను. తత్ప్రసంగానంతరమున మణిసిద్ధుండు శిష్యుని మొగము జూచి నవ్వుచు, వత్సా! మా ప్రసంగము నీకేమయిన నర్థమయ్యెనా? శ్రద్ధగా వినుచుంటివని యడిగిన గోపాలుండు, స్వామీ! నా

కేమియుఁదెలియలేదు. ఆ విషయములెల్ల దరువాత మీ వలనం దెలిసికొనునభిలాషతో నిందు గూరుచుంటి నాయందక్కటికముంచి యత్తెరంగెఱింగింపుడని కోరిన నాయతి శేఖరుండిట్లనియె.

శ్లో॥ అశ్వాలంభం గవాలంభం సన్న్యాసం పలపైతృకం
దేవరాచ్చసుతోత్పత్తిః కలౌ పంచవిసర్జయేత్.

కలియుగమున సన్న్యాసము స్వీకరింపగూడదని మునులచే నిరూపింపబడి నది. శంకరాచార్యు లవతరించి సన్న్యాసము స్వీకరింపవచ్చునని ప్రమాణములు చూపుచుఁ దిరిగి స్థాపించెను. ఆ శంకరయతీశ్వరులచేఁ బ్రస్థానత్రయమునకు భాష్య ముల ద్వైతపరముగా రచింపఁబడినవి. అందలి విషయములు ముముక్షువులకుఁ జాల నింపుగా నుండును. గాన మేము ముచ్చటించితిమని చెప్పిన శిష్యుండు, స్వామీ! శంకరాచార్యులు పరకాయప్రవేశము చేసిననియు నెవ్వరితోనో వాదించెననియు నొకప్పుడు నాకు సంక్షేపముగాఁ జెప్పితిరి. మీరు చెప్పినంత కథయే యెంతో రుచిగా నున్నది. అప్పుడు వేరొక కథాసందర్భములో నాకథఁ జెప్ప మానివేసితిరి. నేఁటికి వెండియు నామహాత్ముని పేరు జ్ఞాపకము జేసితిరి. నేడు నేను మీ ప్రసంగము వినుచు నెక్కటికింటొక నిందే గూరుచుంటిఁ గావున నిప్పుడా శంకరాచార్యు కథయంతయు సాంతముగాఁ జెప్పవలయునని వేడుకొనుటయు మణిసిద్ధుండిట్లనియె.

వత్సా! యెన్ని దినముల నుండియో నీకీ పుణ్యచారిత్రము చెప్పవలయునని సంకల్పము గలిగియున్నది. యెప్పటికప్పుడేదియో ప్రశంసమీద మానివేయుచున్నాను. నేడు సుదినము. తద్వృత్తాంతమంతయు వక్కాణించెద సావధాన మనస్కుండవయి యాకర్ణింపుమని శంకరులకు నమస్కరించుచు నిట్లు చెప్పందొడంగెను.

శ్రీరస్తు — శుభమస్తు

# శ్రీ శంకరాచార్య చరిత్రము

## ప్రథమోల్లాసము

### కథా ప్రారంభము

శ్రీరమణీయమై విబుధ సేవితమై ఫలపుష్ప సమృద్ధా
శ్రితమహాకల్పితోపవన దీపితమై సుమనోజ్ఞ గేహసం
గారతరాంతరంబగుచుఁ గాలటినాఁజను నగ్రహారము
క్కేరళదేశమందమరుఁ గేవలమయ్యమరాలయంబనన్.

సీ. కలనైననసత్య శక్యముగాదువిద్యా ప్ర
 సక్తిగాననియతా జాతునచట
ఘనమతి వెదుకంగఁ గానరాఁదటనాహి
 తాగ్నిగానట్టి గృహాధికారి
మందునకైన లేదందుసాంగాగమా
 ధ్యయనంబుసేయని యజ్ఞుఁడొకఁడు
పన్నిదంబునకైనఁ బడయఁజాలముశాస్త్ర
 ధీయుక్తి లేనివై ధేయునొకని.

గీ. సందరయను భూరితత్త్వవిద్యామహత్త్వ
ఘనులనువతోషితామరుల్ వినుతయశులు
వేదశాస్త్రాదివిద్యా ప్రవీణబుద్ధు
లవనీసురులందు రయ్యగ్రహారమందు.

అయ్యగ్రహారంబు పరిసరంబునం బవిత్రోదకంబై పూర్ణయను మహానది ప్రవహింపుచుండు. దానిసమీపమున వృషాచలంబను ఖ్యాతంబై విరాజిల్లు నప్పుణ్యగిరి కూటంబున మహేశ్వరుండు జ్యోతిర్లింగ స్వరూపంబున నావిర్భవించి తద్దేశాధిపతి యైన రాజశేఖరుండను నృపాలుని స్వప్నంబునఁ దోదసూపి యాలయ ప్రాకారమంటపాదులఁ గట్టింపుమని నియమించిన నంచినసంతసముతో నానరపతి యట్లు కావించి కృతార్థుండయ్యె. నాఁటఁగోలె నయ్యగ్రహారంబు పుణ్యక్షేత్రంబై వృషాచలేశ్వరుని మహిమాతిశయంబునంజేసి యీతిబాధా శూన్యంబై యొప్పుచుండు. మఱియునందు—

క. విద్యాధిరాజునానిర
వద్యయశోసిద్ధియొకండు బహుళకళాసం
పద్యోగశాలిదనరున్
సద్యోగాన్వితసుపర్వ సంఘుండగుచున్.

సీ. సతతంబుశాస్త్ర చర్చలు సేయుచుండుఁ
ద్దేహంకళాళికా కీరచయము
నిగమశేఖరతత్త్వ నిశ్చయార్థముల భా
షింపఁదన్మందిర స్త్రీజనంబు
నవిధాధ్వరక్రియా నివహంబులను బ్రస్త
రింతు రర్చకులు గ్రీహాంతరముల
సత్పురాణకథా ప్రసంగముల్గావింపఁ
జెలఁగితద్దాసదా సీజనంబు.

గీ. లనినదో నమ్మహాత్మ విద్యాతిశయము
వేజేవర్ణించినుతులు గావింపనేల
సార్థకాహ్వయుఁడాసూరి చక్రవర్తి
సాధుమతిదానజిత బలిచక్రవర్తి.

అట్లు విద్యాధిరాజు సకల విద్యా ప్రవీణుండై సురభూసుర నవనీయ చరిత్రుండై యయ్యగ్రహారమున వసియించి పూర్ణానదీస్నానంబు వృషాచలేశ్వరుని సేవయుం బ్రధానములుగాఁ జేసికొని తత్వగోష్ఠి విశేషములచేఁ గాలక్షేపము సేయుచుండఁ గొండొక కాలంబునకుఁ దత్పత్ని యంతర్వత్నియై శుభముహూర్తంబునఁ బుత్త్రరత్న మును గనియెను. మిగుల సంతోషముతో నాపాపనికి విద్యాధిరాజు యథాశాస్త్రముగా జాతకర్మాది సంస్కారముల నిర్వర్తించి శివగురుండని నామకరణము గావించెను.

## శివగురునికథ

ఆ బాలుండు శివవిలక్షణ వ్యాపారములు గలిగి దివ్యతేజస్సంపన్నుండై బాలమృగాంకుని పగిది దినదిన ప్రవర్ధమానుండై యొప్పుచుండెను మఱియు నప్పం డితుండు శివగురునికి యథాకాలంబున నుపనయనము గావించి సమీపగ్రామంబున వసి యించియున్న యొక పండితునొద్ద విద్యాభ్యాసము గాపింప నప్పగించెను. శివగురుఁడు గురుని శివునిఁగాఁదలంచుచు యథావిధి బ్రహ్మచర్యవ్రతం బొనరించుచు జ్ఞానంబున శివుఁడే యనఁదగి సతతము గురుశుశ్రూషాపరుండై యశనపాననయనాది వ్యాపార

షుల యందు నియమములను విడువక కాలముల యందు నగ్ని నారాధించుచు గురు నింట వేదాధ్యయనము గావించుచుండెను. అతండు మిగుల బుద్ధిమంతుండగుటచే స్వల్పకాలములో వేదముల సాంగముగా నధ్యయనముచేసి శాస్త్రములయం దసమానమైన పాండిత్యము సంపాదించి వేదార్థావబోధము జక్కగాఁ జేసికొని యనుభవమునకుఁ దెచ్చుకొనుచుండెను.

ఒకనాఁడు గురుండు శిష్యులకు వేదార్థమంతయు నుపన్యసించిన విని శివగురుండవల్లన నాచార్యునితో నిట్లనియె, ఆర్యా! అర్థావబోధము క్రియానుష్ఠానమే ఫలముగాఁ గలది గదా? వేదము మొదటఁ గర్మ చేయుమని యెంతయో చెప్పిచెప్పి చివరఁ గర్మవలన నేమియుఁ బ్రయోజనము లేదనియు జ్ఞానమునఁగాని మోక్షము కలుగదనియు నుడువుచున్నది. అట్లు చెప్పుటకు గారణమేమియో తెలియకున్నది తదభిప్రాయము వక్కాణింపుఁడని వేఁడుకొనియెను. అప్పుడు గురుండు మిగుల సంతసించుచు వత్సా! నీ ప్రశ్నము కడు గూఢార్థమైనది. వినుము. జననమరణాది సుఖదుఃఖములకుఁ గర్మయే కారణమై యున్నది. కర్మవలన జంతువు బొందుచున్నది. ఆ కర్మ యజ్ఞాన మూలకమైనది. యా యజ్ఞానము మాయాజనితంబు. కర్మవలనఁ బుట్టిన జంతువులకు నజ్ఞానము సహజంబై యుండును. జ్ఞానమాగంతుకము గావున సహజ గుణంబైన యజ్ఞానమెట్టివారికిని విడుచుట కష్టము. దేహధర్మము లెంతవానినైన మోసము చేయక మానవు. ఇంద్రియ ప్రవృత్తి బలవంతమైనది. ఉపాధ్యాయుండు బాలురకు సారబోధ చేయు తలంపుతో రుచులఁజివిజూపు చందంబున వేదము ప్రవృత్తి వలన జనించి ఫలాపేక్షగల జంతువులకు ఫలము లెరఁజూపి కర్మలఁ జేయుమని చెప్పినది. కర్మలయందు నియమింపబడిన చిత్తము గలవాఁడు దృఢవ్రతుం డగుటచే నైన నెట్లు చేయుటకును సమర్థుండగును. కావునఁ గర్తవ్యాంశములఁ బిమ్మట యథార్థముగా వక్కాణించినది. ఈ విషయ మనుభవగోచరము. పిమ్మట విమర్శింపవచ్చును. నీవు సమస్త విద్యలం జదివితివి. నీవు వచ్చి పెద్దకాలమైనది. మీ తలిదండ్రులు నీ కొఱకు వేచియుండురు. సత్వరముగా నింటికి బొమ్ము. బంధువులకు సంతోషము గలుగఁజేయుము. కాలమునకు మిక్కిలి వేగము గలదు. దేహంబుల క్షణభంగురములు. రేపు జేయఁదలంచికొనిన కార్యములు నేటి యుదయముననే చేయవలయును. కాలమున నాటినసస్యమువలె విపరీతకాలమున నాటిన సస్యము సంపూర్ణ ఫలము నీయజాలదు. అట్లే వివాహాది కృత్యంబులు యథాకాలంబున నిర్వర్తించిన మంచి ఫలంబుల నీయఁజాలును మఱియుం గుమారుండుదయించినది మొదలు తల్లిదండ్రులు వత్సరములు గణించుచు వివాహోద్యుత్సవములఁ జేయఁదొందరపడుచుందురు. తమకు పిండధాన్యలోపము గలుగునని పితృదేవతలు తమకులీనుని వివాహక్రియఁ గోరుచుందురు. కావున నీవును సుగుణయగు కన్యం బెండ్లియాడి గార్హస్థ్యధర్మముల యథాశాస్త్రముగా నడుపుచు యజ్ఞములచే వేల్పుల దృప్తిపరచి నిష్కామ్యుండవై ప్రవ

రింపుము ఇదియే వేదార్థావబోధమునకు ఫలమని యుపదేశించిన పిమ్మట శివగురుండిట్లనియె.

ఆర్యా ! మీరనినది యదార్థమేకాని బ్రహ్మచారి వేదాధ్యయనమును జేసిన పిమ్మట గృహస్థే కావలయు. మఱియొక మార్గమవలంబింపఁగూడదను నియమ మెందును గనబడదు. బ్రహ్మచారియు నిహాముత్రార్థభోగముల యందు విరక్తుండై నిత్యానిత్య వస్తు వివేకము గలిగిన సన్యాసాశ్రమమును స్వీకరించినచో సమంజసముకాదా ? గృహస్థునకి ఋణాపకరణము సత్వశుద్ధి కొఱకుంగాని మఱియొకటి కాదని నా యభిప్రాయము. అట్టి వైరాగ్యము గలుగనివాఁడు గృహస్థుఁడై రాజయోగపదం బనుసరించుచున్నాఁడు.

మహాత్మా ! నేను మరణాంతర బ్రహ్మచర్యవ్రతము గైకొని దండాజినములు దాల్చి యగ్ని వేల్చుచు, వేదములు జదువుచు, జదివినది మఱువక యనుభవ గోచరముఁ జేసికొనుచు మీ యొద్దనే వసియించెదను. చక్కని భార్యం బెండ్లియాడి నప్పుడు సుఖముగానే కనంబడును. అనుభవమున విమర్శింప నందున విరసత్వము గనంబడక మానదు. అవియే దుఃఖములకు నాదికారణము. ఐహిక సుఖములేకున్న వివాహకృత్యమువలన యాగాదిసుకృతంబు సంపాదించుకొనవచ్చును. దానంజేసి పారలౌకికఫలము గలుగునందురేని వినుండు. నవనకర్మలు యథాశాస్త్రముగా నాచరించుట దుర్ఘటము. అశాస్త్రీయ పశుహింసనమువలన మహాపాతకములు రాఁగలవు. అదియునుంగాక గృహస్థుండు దరిద్రుండయ్యెనేని త్యాగభోగముల కణుమాత్ర సమర్థుండు కానేరడు. అంతకన్న గష్టము మరియొకటిలేదు. ప్రజలు వానిని జీవచ్ఛవముగా జూచుచుందురు భాగ్యవంతుడైనచో విషయ సుఖ ప్రమత్తుండై సర్వానర్థహేతుభూతమగు తృష్ణచే గట్టబడి లేశమైన సంతోషము బొందనేరడు.

శ్లో॥ యాన్యేతానిదురంతానిదుర్గరాణ్యన్న లాన్యపి
తృష్ణావల్ల్యాః ఫలానీహతానిదుఃఖానిరాఘవ
యావతీయావతీజంతోరిచ్ఛా దేతియథాంసథా
తావతీతావతీదుఃఖబీజముష్టిః ప్రరోహతి.

అంతము మొదిమియులేని దారుణములగు దుఃఖములన్నియుఁ దృష్ణాలతా ఫలములని తెలిసికొనుము. జంతువులకు నెంతవఱకు హృదయంబుల నిచ్ఛతీగెలు సాగుచుండునో యంతవఱకుదుఃఖబీజములు మొలకలెత్తుచుండునుగదా మఱియుం గామంబు లనుభవము వలన నశింపవు.

శ్లో॥ నజాతుకామఃకామానా ముపభోగేనశామ్యతి
హవిషాకృష్ణవర్త్మేవభూయ ఏవాభివర్ధతే.

ఉద్యాది పాపిస్ఠులవలన సన్నిధర్లాలక మఱియుం బెమ్మపెటకి సట్లను భరించుటచే గామంబులు వృద్ధియగును. కాని క్షీణించును. గృహస్థుడు గృహోపకరణముల బూర్తిజేయు తలంపుతో నున్నవారివలన దృప్తినొందక లేనివాని విషయమై కృతప్రయత్నుండగుచు సంసార సాగర మగ్నుండగును. దానంజేసి పూర్వపుణ్యము నశించుటయు, రాబోవు సుకృతముచెడుటయు, నిలిచియున్న పుణ్యము క్షీణించుటయు దటస్థించును. కావున గృహస్థాశ్రమమున సర్వదా దుఃఖమేకాని సుఖలేశము లేదు. నేను భవదీయకృపావిశేషంబుచేం బొడమిన వైరాగ్యలాభంబునం జేసి యీ బ్రహ్మచర్యాశ్రమము నుండియే తురీయాశ్రమమును స్వీకరింతు నన్ననుగ్రహింపుడని యనేక ప్రకారముల స్తోత్రంబులు గావించెను. అప్పుడుపాధ్యాయుడు తదీయ వైరాగ్య ప్రవృత్తికి మిక్కిలి యచ్చెరువందుచు విద్యాధిరాజునకు నవ్విషయము వార్తనంప దలంచునంతలో దైవవశంబున బుత్రుండీసి కొనిపోవ నప్పండితో తమతుం దమదెంచిన జూచి యుపాధ్యాయుండు సహాధ్యాయునకు నాదరంబున నర్ఘ్యపాద్యాది క్రియకలాపంబులు నిర్వర్తించి స్వాగతంబడిగి పిమ్మట నిట్లనియె.

సూరిసత్తమా ! నీ కుమారుండఖిలవిద్యా పారంగతుండయ్యెను ఉపనిషదర్థముల జక్కగా దెలిసికొనియెను. వైరాగ్యోదయము లెస్సగా జనించినది. మీ కులంబునకు మిగుల ప్రఖ్యాతి యీతని మూలమున రాగలదు. ఇప్పుడు గృహస్థాశ్రమమును స్వీకరింపదగియున్నవాడు వీని యింటికి గొనిపొమ్ము. నామతి యతోకరీతిగా నున్నదని పలికిన విని సంతసించుచు విద్యాధిరాజిట్లనియె. ఆర్యా ! యిదియంతయు నీ యక్కటికంబున లభించినది. పుత్రునివలె జూచి విద్యలంగఱపితివి. నీ యుపకార మెన్నటికిని మఱువము. వీనింజూడ వీని తల్లి మిగుల నుత్సుకత్వముం జెందుచున్నది. వివాహ ప్రయత్నమును జేసితిమి. పెక్కండ్రు విద్వాంసులు కన్నెల నిత్తుమని మా యింటికి వచ్చుచుండిరి వీనికి గృహాగమనంబున కనుజ్ఞయిమ్మని పుత్రుండు వినుచుండ నగ్గురుని గోరికొనిన నతండును [సాదరముగా] సమ్మతించితిని. సంతోషవార్త వింటినని యుత్తరమిచ్చెను. అప్పుడు శివగురుండు గురుని మోము జూచుచు మెల్లగా దన యుద్యమము వెల్లడియుంజెప్పిన విని శివగురుండు యగ్గురుండేకాంతముగా వాని చెవిలో నేడియోచెప్పెను. ఆమాటవిని శివగురుండు మాఱుమాట పలుకక గురునాజ్ఞగైకొని తండ్రి వెంట నింటికిం జని జనని పాదంబులంబడి నమస్కరించెను. ఆమెయు నతని గ్రుచ్చియెత్తి ముద్దాడుచు చిరవిరహమువలనం గలిగిన పరితాపము శమింప సంతోషసముద్రంబున మునింగెను. తరుచు పుత్రాలింగన సుఖము కర్పూర చందనాదులకన్న జల్లగా నుండి యాహ్లాదపెట్టును గదా ! చిరకాలము గురుకులవాసముజేసి సకలవిద్యలం జదివి

యింటికి వచ్చిన శివగురుని నార్తవిని బంధుజనము సంతోషముగావచ్చి చూచుచుండు టయు శివగురుండు వారినెల్ల నాదరపూర్వకముగా పలుకరించుచు సంతోషపెట్టు చుండును.

మఱియు విద్యాధిరాజు బంధుసమక్షమందు శివగురుని విద్యాపాటవము దెలియఁగోరి వేదమునందు భట్టపాద ప్రభాకర కణాద గౌతమ సాంఖ్యాది మతసిద్ధాంతముల యందును తర్క వ్యాకరణాది శాస్త్రములయందును ప్రశ్నలువేసి యడుగుటయు నవ్వటూత్తముండు గురునికి నమస్కరించి మందహాసశోభితవదనారవిందుఁడై యా ప్రశ్నములకెల్ల యుక్తియుక్తముగా దేటమాటలతో సమాధానము జెప్పెను. విద్యాధిరాజు పుత్రుని పాండిత్య ప్రకర్షకు మిక్కిలి సంతోషమును జెందెను. సంస్కార రహితములైనను గుమారుని వచనంబులు శ్రవణసుఖం బొనరించుచుండఁగా సంస్కార యుక్తము లయ్యెనేని యేమి నుడువదగినది. అల్పకాలములో శివగురుని విద్యాతిశయము బంధుముఖముగా నాదేశంబంతయు వ్యాపించినది. విద్యాకులగుణశీలాదులచే నిరుప మానుండగు శివగురునికి గన్నియనిచ్చు తాత్పర్యముతో పెక్కండ్రు ధనికులైన బ్రాహ్మ ణులు విద్యాధిరాజు మందిర మలంకరించిరి.

## శివగురుని వివాహము

అప్పండితుండు వారిచరిత్రల నెల్లవిని వారిలో ధనమున సామాన్యుండైనను గుణశీలాదులచే ప్రఖ్యాత ప్రభావుండగు శుభపండితుండను విద్వాంసుని పుత్రికను గుమారునకు జేసికొనుటకు సమ్మతించెను. పిమ్మట దైవజ్ఞులచే నిరూపింపబడిన శుభలగ్నమందు శుభపండితుండు సతియను పేరుగల తనకూతును సతీతిలకమును దీసికొనివచ్చి విధివిధానమున విద్యాధిరాజు మందిరమునందే కన్యాదానము గావించెను. ఆ వివాహ దినములలో గావించిన యుత్సవములదేశ ప్రజలు పెద్దకాలము వఱకు నచ్చెరువుగా జెప్పుకొనుచుండిరి. అప్పుడువచ్చు పెండ్లివారల నాదరించి యపూర్వ సంతోషమును జెందుచు పార్వతీపరమేశ్వరులవలె ప్రకాశించిరి. మఱికొంతకాల మరిగిన వెనుక శివగురుండు యజమానుండై సతీదేవితోగూడ ననేకాధ్వరములు గావించి దేవ భూదేవతల సంతుష్టులం జేసెను పెక్కేల నతండు గావించు యజ్ఞములలో హవిస్సుల సేవించెడు వేల్పులు అమృతమును మఱచిపోయిరి. తత్తత్ఫలార్థములచే పితృ దేవ మనుష్య కోటుల వాంఛితముల దీర్చుచు సుమనోమనోహరుండగు నా శివగురుని జంగమ కల్పద్రుమమని యెల్లవారు పొగడదొడంగిరి.

ఆ సుకృతికి బరోపకారమే వ్రతము. వేదపఠనమే నియమము. పరహితములే నిత్యకృత్యములై యున్నవి. అతండు రూపంబున మన్మథుండు క్షమచే ధరిత్రియు

విద్యల బృహస్పతియు, ధనంబున గుబేరుండునై గర్వమనునది యించుకయు నెఱుం గక వినయసంపత్తితో నొప్పుచుండ బెద్దకాలమరిగెను. సంతానము కలిగినది కాదు.

క. వింతగృహంబులు భూముల
సంతతకనక ధేనుహస్తి హయపశుచయముల్
సంతోషపెట్టజాలవు
సంతానములేని యట్టి జనునెవ్వేళన్.

గీ. కలుగుకప్పక యీ శరత్కాలమందు
బొదమునీబై తమున నది గడచెనేని
దాటిదీనసకారు సంకసుడువౌదమ
నసుచు దలపోయుచుండనేం దల్లగె బెస్క.

అట్లు పెద్దకాల మరిగెనంత సంతానవిహీనతా సంతాపంబు స్వాంతము త్తల పెట్ట శివగురుండొక్కనాడు భార్యతో నిట్లనియె.

సాధ్వీ! మనకు సగము కాలము గతించినది. సంతానము వొదమదయ్యెను. కర్తవ్యమేమియు తెలియకున్నది. సంసారమసార మనియే నేను మొదట పెండ్లి జేసికొననని నిశ్చయము జేసికొంటిని. గురుండు నీకు లోకవిఖ్యాతుండగు కొమరుండు గలుగు సతనివలన లోకోపకృతి గాఁగలదు. పెండ్లియాడుమని రహస్యముగాఁ జెప్పి నన్నీయరణ్యమునఁ బ్రవేశపెట్టెను. రెండింటికిం జెడితిని. అపత్యరహితులమగు మనల నెవ్వరు స్మరింతురు. పల్లవఫలదళశరితమైన వృక్షమును విడిచి గొడ్డుచెట్టు నెవ్వరైన నాశ్రయింతురా! ఇప్పుడు నేను వంశహర్తనైతిని. పితౄణబద్ధుండ నైతినని యనేక ప్రకారముల విచారింపుచు భార్యతోఁ బ్రసంగించిన నమ్మహాసాధ్వి యిట్లనియె.

ప్రాణేశ్వరా! దీనికై మీరింత చింతింపనేమిటికి? మనము భక్తజన కల్పద్రుమమైన చంద్రశేఖరు నాశ్రయింతము. మనకు స్థిరమైనఫలము లభించును. దీనికుపమన్యువే ప్రమాణము. వినుండు.

## ఉపమన్యుని కథ

తొల్లి యుపమన్యువను ముని బాలకుండాడుకొనుచు నొకచోట బాల్యుద్రావుచున్న కొందఱు మునిబాలకులతోఁ గ్రహించి యింటికిఁ దల్లియొద్దకువచ్చి, "అమ్మా నేనిప్పుడుకొలనుఁ బోయితిని. అందుఁగొందరు పిల్లవాండ్రు తెల్లనివేమియో త్రాగుచున్నారు. నాకు గొంతెండెనిమ్మని యడిగిన వెక్కిరించిరి. వానిపేరేమి" యని యడిగిన విని యతని తల్లి, నాయనా! అవి పాలు గోవులవలనం బుట్టునని చెప్పినది.

ఆ మాట విని యబాలుండమ్మా! నాకాపాలు దెచ్చియిమ్ము గ్రోలవలయు

నని యడిగిన విని తమ దారిద్ర్యదోషమునకు వగచుచు నాయింటి తెల్లనిపిండిని నీటిలోఁ గలిపి యిచ్చినది. నానిండ్రావి యాయర్భకుండు గంతులువైచుచు నా బాలకులయొద్దకుం జని చూడుఁడిదిగో నేనును బాలు ద్రావుచుంటిని. కొంచెమిమ్మని యడిగిన నిచ్చి తిరికారు గదాయని వారినూరించెను. అప్పుడా బాలకులు పరికించి ఇస్సిరో ? నీవు పిండినీటిం ద్రావుచుఁ బాలని మమ్ము వెఱపించెదవా ? చాలుఁ జాలు. పాలెక్కడ. నీవెక్కడ పో పొమ్ము. దరిద్రుఁడాయని పరిహసించిరి

వారి మాటలు విని యుపమన్యువు సిగ్గుపడుచు మరలఁ దల్లియొద్దకువచ్చి అమ్మా ? నీవు నాతోఁ బాలనిచెప్పి పిండిని నీటిలోఁగలిపి యిచ్చితివా ? ఎంత మోసముఁజేసితివి. అయ్యో నీమూలమున నాకెట్టి యవమానము వచ్చెనదో చూచితివా? నన్నువారందరు దరిద్రుడా నీవెక్కడ ! పాలెక్కడనని పరిహసించిరి. మనము దరిద్రులమా ? దరిద్రులన నేమియని తల్లి పైఁబడి నిర్బంధింపఁదొడంగెను. అప్పుడామె మిగుల జింతించుచు, నాయనా యేమియు లేకపోవుటయే దారిద్ర్యము. మన పూర్వ పుణ్యమట్టిదని నుడివినది. ఆ మాటవిని యా పిల్లవాఁడు, అమ్మా ! ఆ దారిద్ర్యమేమి చేసినం బోవునో చెప్పుము. అట్లు కావించెదనని యడిగిన నా సాధ్వి, పట్టీ ! యైశ్వర్యసంపన్నుఁడగు నీశ్వరునారాధించిన నాదారిద్ర్యము త్రుటిలోఁ బాసిపోవునని చెప్పినది. అప్పుడా బాలుఁడు తల్లితో నాయీశ్వరుడెందున్నవాఁడో చెప్పుము పోయి యాశ్రయించెదనని యడిగిన నప్పుడది గుడిలోనున్న శివలింగమును జూపి యితడే యీశ్వరుఁడని పలికినది.

అప్పుడుపమన్యువు గుడిలోనికింజని తలుపులు మూసికొని యా లింగమును రెండు చేతులతోఁబట్టికొని, స్వామీ ! నీవు సమస్త లోకనాయకుండవనియుఁ గామితములఁ దీర్పువాఁడవనియు భాగ్యవంతుఁడవనియు మాయమ్మ నాతోఁ జెప్పినది నీవు మాత్రము సిరిగలవాఁడవై మాకేమియు లేకుండఁజేయుట నీకు దగునా ? నేను మొన్నటిదినము పాలులేక మునిబాలకుల వలన నెంత యవమానముఁ బొందితిని. అట్టిది నీ కొడుకులకు వచ్చిన నెంత చింతింతువు. నాయందుం గృప లేకపోవుటచే నిన్నింత భ్రమాలవలన వచ్చినది. లేకున్న నాతఁడే నాకుఁబాలు దెచ్చియిచ్చును. తండ్రిలేనివారలకు నీవే తండ్రివని మాయమ్మ చెప్పుటచే నిన్నాశ్రయించుచుంటిని. మాటాడవేమి కోపమా ? ఇంతకఠినుండవని మా తల్లి చెప్పలేదేమి మిక్కిలి దయాళుఁడవనియు నడిగిన తోడనే కార్యంబులఁ దీర్పునతఁడనియుఁ జెప్పినదే నీసంగతి యెఱుఁగదు. లేక నీబుద్ధి మారినదా ? నిజముఁజెప్పుము నాపట్టు నీవెఱుంగవు. క్షణమూరకున్న వీఁడేపోవునని యూరకుంటివి కాబోలును. విడుచువాఁడనుకాను. నేను నీకంటె మొండిని. తండ్రీ ! కనంబడుము. మాటాడుము అనుగ్రహింపుము. అవమాన దుఃఖముచేత నింత ధైర్యముఁ బొందవలసి వచ్చినది. నాకుఁ గోపము దెప్పింపకుము. వద్దువద్దు మాట్లాడమని యనేక ప్రకారములఁ బ్రతిమాలెను కాని యమ్మహానుభావునకు దయ వచ్చినది

కాదు అప్పుడప్పుడు తన్ను నిందించుకొనుచు ఛీ! యిక నా జన్మమేల పాలు గొనక వెందియుం జనితినేని మునిబాలకులు నన్ను మిక్కిలి యక్కసక్కెము లాడుదురు. ఈతండు మాటాడఁడు. నా తల్లి యున్నను బరిహసించును. ఈమాట వీనికే దక్కునుగాక వీనిపైఁబడి శిరము పగులఁగొట్టుకొని ప్రాణములు విడిచెదనని లేచి తన శిరమెత్తి వ్రక్కలగునట్లు గట్టిగ నా లింగముపైఁ గొట్టికొనునంతలోన

శా. సోమేనంబొలుపొందునిందుమకుటితోఁ బ్రమోదతరీయంబుతో
సోమార్ధాంచితమౌళితోఁ గరలసచ్చూలంబుతో దేవతా
స్తోమారాధితపార్శ్వభాగములతో బ్రహ్మాంగకశ్రేణితోఁ
గామారాతిరడంగ దేశమున సాక్షాత్కారమయ్యెన్ గృపన్.

అట్లు ప్రత్యక్షంబై యుపమన్యుం దబ్బాలు నెత్తుకొని, వత్సా! నీ మాటలు విని నేను వచ్చుచుంటి నింతతొందరపడుటకు నేమిటికి? నీకామితంబేమియో చెప్పుమని యడిగిన విని యుపమన్యుండు సంతసించుచుఁ, చండీ! నాకేమియు నక్కఱలేదు. నాకుఁదండ్రిలేఁడు కావున నేను పిలిచినప్పుడెల్ల నా పాలంజిక్కి పెట్టుచుండుము. మాయింట పాలు సమృద్ధముగా నుండునట్లనుగ్రహింపు మిదియే నా కోరిక యని పలికిన విని యట్లొసఁగి కమ్మరంబులొసంగి యయ్యనంగవైరి యంతర్హితుండయ్యె. పిమ్మట నయ్యుపమన్యువు తల్లి యొద్దకుం జని యా వృత్తాంతమెఱింగించినవిని యామె విస్మయావేశహృదయయై పరమేశ్వరుని దయావిశేషంబు నెల్లకాలము గొనియాడుచుండెను. ఉపమన్యుఁడును శివభక్తుండై మహర్షికోటిలోఁ జేసి మిగుల విఖ్యాతుండయ్యెను. మహాత్మా! అట్టి మహానుభావుండు భక్తకల్పద్రుమంబై యెప్పుడుండ మనము చింతింపనేల యతని నాశ్రయింతము మనకామితము దీర్పక మానడు. దేవతలయందు జడత్వమెన్నఁడులేదు. అది మనుష్యుల హృదయములయందున్నది. వీరి చిత్తములు నిశ్చయాయత్తము లయ్యెనేని వేల్పులు తప్పక వరమిత్తురు. కావున శివుని గురించి తపంబొనరింతమని బోధించినవిని సంతసించుచు శివగురుండమ్మరునాఁడే భార్యతోఁగూడ బూర్ణానదిని స్నానమునుగావించి దీక్షవహించి కందమూలఫలాశనుఁడై యావృషాచలేశ్వరు నారాధించెను.

మఱియు—

క. పన్నగకేయూరుమహా
పన్నగసుశతాను నెదద భావించుచు భా
స్వన్నియతిఁ దపముఁ జేసిరి
కొన్ని దినంబులు జలంబె క్రోలుచువారల్.

ఇట్లత్యంతనియమంబుల నాదంపతులు తపంబొనరింపుచుండ నొకనాఁడు కృపాపరవశుండైన మహాదేవుండు శివగురునికి బ్రాహ్మణ వేషంబున స్వప్నమునం

బొడసూపి, అన్నా! నీవేమిటికిట్లు కాయమును గ్లేశపరచుచుంటివి. నీ యభీష్టమేమి యని యడిగిన శివగురుండు పుత్రసిద్ధి మని యాకలకోనే యుత్తరముఁజెప్పెను.

అప్పుడు శివుండు శివగురునితో నీకు నల్పాయువు సుగుణ సంపన్నుండు లోకైకవిఖ్యాతుండైన సుతుండొక్కరుండు కావలయునా? యల్పబుద్ధులు, దుర్గుణులు, దీర్ఘాయువులు నగు సుతులు పెక్కండ్రు కావలయునా? యని యడిగిన నా విప్ర పుంగవుండు ధ్యానించి యల్పాయువయ్యు లోకైక విఖ్యాతుండైన వాని నొక్కనినే దయసేయుండని కోరికొనియెను.

అప్పు డప్పరమేశ్వరుఁ డట్టి వరమిచ్చి యంతర్హితుండైనతోడనే శివగురుండు మేల్కొని యల్పాయువనుమాట తప్ప తక్కిన స్వప్న వృత్తాంతమంతయు సతీదేవి కెఱిగించిన నమ్మించుబోఁడియు మంచి కుమారుం డుదయించునని మిగుల సంత సించెను. ఆ దంపతు లంకడితో నియమములుచాలించి బ్రాహ్మణసంతర్పణంబుగావించి తదాశీర్వాదములనంది యానందింపుచు విప్రభుక్తావశిష్టమగు నన్నమును భుజించిరి.

## సతీదేవి గర్భవర్ణనము

ఆ దినమందే శైవతేజ మాయన్నమునఁ బ్రవేశించి శివగురుని శరీరమున వ్యాపించి పిమ్మట నతని పత్నియందుఁ బ్రవేశించినది

క. వనితారత్నముగర్భం
బునవాసరమధ్యమందుఁ బొలుపొందుచికా
రను గాంతివోలె నతఁడి
ఘనతేజంబొకటి మెఱసెఁ గడుచిత్రముగన్.

గీ. అఖిలవిష్టపభరవహుఁ డష్టమూర్తి
గర్భగతుఁడై ప్రకాశింపఁగా నొకింప
యలసగతియయ్యె నయ్యంబుజాక్షియనుచు
బలుకుటిదియొక యబ్బురంబా? తలంత.

క. గురుకుచ గురుకుచయుగమిష
నరవిందభవుండు సూతనామృతపూర్ణాం
తరకనక కలశయుగ్మము
విరచించెన్ దుగ్ధపాన విధియోగ్యముగాన్.

ఉ. ఆ తరణాక్షి గర్భగతుఁడైన కుమారుఁ డనంతరంబునన్
ద్వైతమత ప్రశాన్యమత వాదములన్ని రసించియంచితా

ద్వైతము సెల్పుటల్ దెలుపఁ దత్కుచకుంభయుగంబు గౌరవ
త్యాతిశయంబుచే నొకటియై గతమధ్యగతావకాశమై.

ఉ. చారుపయోధరాద్రివిల సద్రుచిశైవలినింబసించి చె
న్నారెడునాభినాదసరు నాసరసీరుహపత్రనేత్ర సూ
గారవిరాజిరేఖగల నాశిశుమౌనినిమిత్తమై తదం
భోరుహసంభవుండవని బూనిరచించిన దండమోయనన్.

సీ. రమణీయధవళ గోరాజవాహనమధి
ష్ఠించియల్లన సంచరించినట్లు
గంధర్వులగియంత్ర గాత్రంబులనుబట్టి
బలసిసంగీతము ల్పాడినట్లు
జయజయరక్ష రక్షకృపానిధేహి
యంచు దేవతలు ప్రార్థించినట్లు
వాదంబులను బ్రతి వాదుల నోడింప
యెలమి విద్యాపీఠ మెక్కినట్లు.

గీ. నిద్రలోఁగాంచి యంతలో నేత్రయుగము
దెఱచియేమియుఁగాన కచ్చెరువుఁజెంది
దెసలఁబరికించి యుర్విధూతిలక మెల్ల
మరల మరలను గనుచుమాయం గడంగు.

## శ్రీ శంకరాచార్యుని యవతారఘట్టము

శా. సూర్యాదిగ్రహకోటిస్వోచ్చగతమై సొంపార నిర్దుష్టమై
యార్యంబై తగులగ్నమందుఁగనె సౌఖ్యంబొప్ప శ్రీశంకరా
చార్యుం డత్తరుణీశిరోమణియునా శర్వాణిసేనాని స
ట్లాస్యల్పాంతసమందమందుభులు మ్రోయందివ్యమార్గంబునన్

సీ. ధృతివోవవిపరీత మతవాదిహస్త పు
స్తక మతస్మాత్తుగా జారిపడియె
జెలఁగివేదవ్యాసు చిత్తరాజీవంబు
వికసించెనిగమ మస్తకములలరె
గాడ్పులద్భుతదివ్య గంధబంధురములై
వీచెవేల్పులు పుష్పవృష్టిగురిసి

రమలంబులై దిక్కు లమరె బల్లవపుష్ప
ఫలదీపితము లయ్యెఁ బాదపములు.

గీ. నదులు నిర్మలసలిల సంపదఁ దనర్చెఁ
బొదలె నగ్ని ప్రదక్షిణ భూతశిఖల
మృగములు పగతవైరంబు లగుచు మెలఁగె
శంకరాచార్యుఁ డుదయించు సమయమందు.

అట్లుదయించిన కుమారు వృత్తాంతమాకర్ణించి శివగురుండా సందనదీ ప్రవాహంబున మునింగియుఁ బూర్ణానదిం గ్రుంకువెట్టి బ్రాహ్మణుల కనేక దానంబులు గావించి దైవజ్ఞుల జన్మకాల విశేషంబులం జెప్పుఁడని కోరిన వారును లగ్నఫలము విమర్శించి యచ్చెరువందుచు నయ్యారే! యీ బాలుండు సర్వవిద్యా విశారదుండై శారదను సైతముఁ దిరస్కరింపఁగలఁడు. స్వతంత్రముగా శాస్త్రముల రచింపఁగలఁడు తనకీర్తి నాచంద్రతారకముగాఁ బుడమి వ్యాపింపఁ జేయును. పెక్కేల నీశవాక్కుమంద లోకంబులం జాటనవాఁడగునని నుడివిరి. శివగురుండా బాలుని యాయువును గురించి యడుగలేదు. కావున వారును చెప్పరయిరి. తెలిసియున్నను దైవజ్ఞు లశుభంబులఁ జెప్పరుగదా.

## శంకరుని రూపము పుణ్యాంగనలు వర్ణించుట

పిమ్మట శివగురుండా యర్భకునికి జాతకర్మాది కృత్యంబులు నిర్వర్తించి శ్రీశంకరుండని నామకరణము గావించెను. ఆ మహోత్సవంబునకు సహాయసంబులుగా వచ్చి విచ్చేసియున్న పేరంటాండ్రగు యువతు లాసూతికాగృహంబున దీపము లేకయే యద్భుత తేజంబునఁ బ్రకాశింపఁజేయు నాశిశురత్నమును జూచి విస్మయముఁ జెందుచు నొండొరు లిట్లు సంభాషించుకొనిరి.

భవాని—బోధినీ! యీ యర్భక మూర్తికి శంకరుండని పేరుపెట్టిన శివగురుని యభిప్రాయమేమియో నీవు గ్రహించితివా?

బోధిని—శంకరుని కరుణావిశేషంబునం బుట్టుటచే నట్టిపేరు పెట్టెనని తలంచెదను.

భవాని—కాదు. కాదు. శివగురుండు బిడ్డండు శంకరుఁడను సుఖముచేయు వాఁడను నర్థముగఁబట్టి వీనికీపేరు పెట్టెను. నిశ్చయము. వీఁడు కన్నుల కెట్టి యాహ్లాదము చేయుచున్నవాఁడో చూడుము. ఆహా? వీని రూపమాసేచనకమై యున్నదిగదా.

భవాని—సాధు సాధు బోధిని! నీ బుద్ధి మెచ్చుకొనఁ దగియున్నది. చక్కగా గ్రహించితివి. వీనింజూడఁ గన్నులు చల్లబడుచున్నవి. శివగురుండు వీనికిఁ దగిన పేరుపెట్టెను.

కృత్తిక—అక్కలారా ! మఱియొక విశేషము గనంబడుచున్నది. చూచితిరా మస్తకమున.

బోధిని—(విమర్శించి) ఇది శశిచిహ్నము లాగున్నది సుమీ.

కృత్తిక—అది యొక్కటియే? నిటలమునను్న నేత్రచిహ్నమునుగూడఁ జూడుము.

బోధిని—అగునగు నిదిగో భుజములపై నున్న త్రిశూలాకృతులఁ బరిశీలించితిరా ?

కృత్తిక—ఓహో ! వీనిందప్పక శంకరావతారమనియే చెప్పఁదగినది.

భవాని—సందియమేల? కాకున్న వక్షమున నీనాగరేఖ యెవ్వరికిఁ గలిగియుండును.

కృత్తిక—చెలులారా? కలకల నవ్వుచున్న వీని మొగమెంత సోయగముగా నున్నదో చూచితిరా ?

తిలక—ద్విజరాజమండలమును బరిహసించుచున్నదిగదా.

బోధిని—ద్విజరాజమండల శతంబులు ప్రేష్యత్వము వహించి సేవించుచుండ ముఖముతో సాటిఁజెప్పవచ్చునా.

తిలక—మంచిశ్లేషకవివి. నీ మాట మెచ్చుకొంటిని వీని పాదములు పద్మసమములని చెప్పుటకేమైన నాక్షేపణమున్నదా ?

బోధిని—ఉన్నది. ద్విజరాజకరోపలాలితములగుటచే వీని పదంబులఁ బద్మమదాపహరంబులని చెప్పవలయును.

తిలక—బాగు ! బాగు !! నీయొద్ద మాటాడుటకే భయమగుచున్నది. కవాట ఫలకమువలె విశాలమైయొప్పుచున్న యీ ముద్దు బాలుని వక్షస్థల మెట్లున్నదో నీవే చెప్పుము.

బోధిని—దేశాటనము చేయుటచే నలసిన జయలక్ష్మికి విశ్రమింప యోగ్యమగు శయ్యవలెనున్నదని నాకుఁదోఁచినది.

తిలక—బాహువులో.

బోధిని—బాహ్యాభ్యంతర శత్రువులం బరిభవింప సమర్థములగు పరిఘలవలె మనోహరములైయున్నవికాదా ?

తిలక—కపోలములఁగూడ వర్ణించుము.

బోధిని—వదనమునాశ్రయించియున్న సరస్వతికి నుపయోగించునని సంకల్పించి విరించి నిర్మించిన దర్పణమువలెఁ బ్రకాశించుచున్నవి.

తిలక — బాపురే నీ యుత్ప్రేక్షములన్నియుఁ బ్రౌఢకవివాక్యస్తుత్యములై యున్నవిగదా. ఈ పాపనివృత్తిప్రకారములు నాకు మిగుల వింతగాఁ గనంబడు చున్నవి. ఎద్దియో యలంకారముఁ గల్పించి చెప్పుము.

బోధిని — మదనదావానల జ్వాలాసంకులమై యామయకంటక భయంకరమై యొప్పు సంసారతాపంబునం దపించువారికి సమ్మతమైనను వర్షించు వీని దృష్టి ప్రసారములు రక్షకములగుం జూమీ.

తిలక — కృత్తికా! యిక్కాలికి పలుకు లసత్యములు కావు. ఈ శిశుతిలకము లోకైక విఖ్యాతుండగునని దైవజ్ఞులు చెప్పియున్నారు గదా!

కృత్తిక — అవును. కానిచో నిట్టి యద్భుత రూపలక్షణములు సామాన్య శిశువులకుం గలిగియుండునా?

బోధిని — పురాకృతసుకృత విశేషంబునంగాక వీనిఁ జూచుట లభించునా? మనము కృతకృత్యులమైతిమి. ప్రాకృతులు వీని మహిమఁ దెలిసికొనఁజాలరు సుమీ.

తిలక — మనము వచ్చి పెద్దతడవైనది. పోవలదా వీని రూపమెంతసేపు చూచినను జూడవలయుననియే యుండును.

అని యమ్మహాడింభకుని వర్ణించుచు నా సాధ్వీరత్నములు కొంతసే పందుండి తమతమ నివాసంబులకుం జనిరి.

శంకరుండును దినదినప్రవర్ధమానుండగుచుఁ దలిదండ్రుల మనోరథము లభివృద్ధిఁ బొందఁ గ్రమముగ నవ్వుటయుం, బొర్లుటయు మణి గుచ్ఛంబుల పీకుచుటయుఁ, బలుకుటయు, నడచుటయు నాయా మాసములకు నేర్పు కొనియెను.

# శంకరుని బాలక్రీడలు

మఱియు నాశిశువు సంవత్సరము ముగియువరకు స్వభాషనంతయు లెస్సగా గ్రహించి నిర్దుష్టముగా మాటాడ! దొడంగెను. సంవత్సర ప్రాయముగల యాపాపండు సంస్కార యుక్తముగా మాటాడుటఁ జూచి యెల్లవారు విస్మయ సంతోషములఁ జెందుచుండ దల్లిదండ్రుల మాట జెప్పనేమిటికి? అబ్బాలుండు రెండవ యేట సమస్తభాషలు లిపులు వ్రాయుటకును, జదువుటకును సమర్థుఁడయ్యెను. మూఁడవయేఁడు జొరఁబడిన తోడనే శంకరుఁడు శ్రవణములేకయే కావ్యనాటక పురాణాది గ్రంథ విశేషములు స్వయముగాఁ దెలిసికొనియెను. శంకరుని విద్యాగ్రహణ శక్తి యరసి శివగురుండంతరంగమున వెఱఁగందుచుఁ గంటకమందగులునని వెఱచి యప్పుడా శిశువునకుఁ జదువఁ జెప్ప నొక యుపాధ్యాయుని నియమించెను. కాని వాని కతనివలన నించుకయుఁ బ్రయోజనము లేకపోయినది. అది గ్రహించి శివగురుండు

మఱల సకల శాస్త్రపారంగతుండగు గురుని మఱియొకని నియమించెను. ఏక సంథగ్రాహియగు శంకరుఁ డా యుపాధ్యాయునికించుకయు శ్రమ గలుగనీయక మణిదర్పణమువలె సకల విద్యలం గ్రహించి యుపాధ్యాయునకుఁ బాఠములు జెప్పునప్పుడు తప్పులు దిద్దుచుండును.

ధూళిచే నాడుకొను నీడుగల యా బాలునకుఁ గావ్యనాటకాలంకారాదిగ్రంథములు క్రీడనకములై యొప్పుచుండెను. అప్పుడు శివగురుండతని శరీరమును జౌలకర్మచే సంస్కరింపజేయుటయు నది యాహుతులచేఁ బ్రజ్వరిల్లు నగ్ని తేజమువలెఁ బ్రకాశించినది. బృహస్పతినిఁ దిరస్కరించు బుద్ధిబలముగల శంకరుని మొలబాల్యదశయందే యెట్టి పండితుఁడును నోరు మెదల్పుటకు వెఱచుచుండెను. చిన్నతనమునందే యతండు కుత్సిత మతముల ఖండించుచు స్వమతమును బ్రతిపాదించుచుండెను. అంత నొకనాఁడు శివగురుండు కుమారుని యపూర్వ ప్రజ్ఞావిశేషంబులం దలంచుకొని యచ్చెరువందుచు నాహా! వీని ప్రాయమెంత? విద్యాగ్రహణశక్తి యెంత? వీనికి గురువులు నిమిత్తమాత్రులే కాని వారివలన నొక విషయము వీఁడు గ్రహించుచున్నట్లు కనుబడదు. ఎన్నడో నేర్చికొనియున్నట్లు విద్యలన్నియు వీని ముఖమునుండి వెలువడుచున్నవి యని శంకరుని మాట యేల తప్పును. వీనికి బ్రాయము చాలదని యుపనయనముఁ జేయనిచో వేదపఠనాధికారము లేకపోవును. గ్రహణశక్తినింబట్టి వీని కుపనయనముగావించెద. వీనిచే నా కులమంతయుఁ బవిత్రముగాఁగలదని తలంచుచు దత్ప్రయత్నము చేయుచున్నంతలోఁ గృతాంతుండతని నిజభువనాగంతుకునిఁ జేసికొనియెను. కట్టా! యముఁడు జంతువుల కృతాకృతముల నరయఁడు గదా! శివగురుని నాముద్దుబాలుని కుపనయనమైనం జేసికొననీయక కాలధర్మము నొందించెను. ఈ సంసారమున నుత్తముఁడగు కొడుకు గలుగుటయే దుర్లభము. కలిగినను లోకోత్తరమైన తదీయ వైభవముఁ జూచుట కడు దుర్లభమని చెప్పుటకు శివగురుఁడే నిదర్శనము. అట్లు నాకలోకమలంకరించిన శివగురుని కళేబరముపైఁబడి సతీదేవి ప్రాజ్ఞురాలయ్యు లోకవాసనావిశేషంబునం జేసి శోకించుచు, హా ప్రాణనాథా! నీముద్దుకుమారుని విడిచి యెక్కడికిఁ బోయితివి. వీనిపై నీకుఁగల ప్రేమయంతయు నేమయ్యెను. వీని యుపనయనమున కెంతయో ప్రయత్నముఁ జేసితివే యేదియు లేకపోయెను. ఇఁక వీని విద్యాబుద్ధులు జూచి సంతసించువారెవ్వరు. మాకు దిక్కెయ్యది. అయ్యో యేమి చేయుదుము. ఈ వైధవ్య వ్యథ నెట్లు సైతును. కట! కటా! విధి యెంత క్రూరుఁడవైతివిరా యని యనేక ప్రకారముల విలపింపఁ దల్లి నూరడించుచు శంకరుం డిట్లనియె.

జననీ! జననము గలవానికి మరణము రాకయుండునా? జంతువులకుఁ గృతాంతుఁడు బంధువుఁడా? శరీరములు శిలానిర్మితములా? యిట్లెఱింగియు మమత్వమే సంసారవృక్షమునకు బీజము. మనము మాత్ర మెల్లకాలము జీవింతుమా.

కాలమునఁ బరిపక్వమైన ఫలము చెట్టునుండి రాలినట్లు మనుష్యులు గాలానుసరణముగా సమయుచుందురు. దానికిఁ గర్మమే కారణము. కర్మబద్ధులగుటయే బంధమునకు హేతువు. మా తండ్రి కృతకృత్యుండై స్వర్గంబలంకరించెను. అతని విషయము చింతించినఁ బ్రయోజన మేమియున్నది. నేను గలిగియుండ నీకేమి కొఱంత. తల్లీ ? దుఃఖమును విడువుము వైరాగ్యవృత్తి నవలంబింపుమని తత్త్వోపదేశముగాఁ బలికిన విని సతీదేవి తదీయ ప్రౌఢ వాక్యంబుల కచ్చెరువందుచు శోకోపశమనము గావించు కొనియెను. పిమ్మట నామె శివగురునికి దహనాద్యపర సంస్కారములు జ్ఞాతులచేఁ జేయించి కుంతియుంబోలెఁ బతితో సహగమనముఁ జేయక కుమారుని రక్షించుచు నొక సంవత్సర మతికష్టముగాఁ గడిపినది.

పిమ్మట సతీదేవి శంకరునికి మిగుల వైభవముగా నుపనయనము గావించి నది. అప్పటికే శంకరుండు సకల విద్యాపారంగతుండైనను లోకవిరుద్ధము గాని యట్లుగా గురుకులవాసముఁజేసి వేదవేదాంగములఁ జదువఁ బ్రారంభించెను.

## శంకరుని విద్యాభ్యాస వైచిత్ర్యము

శంకరునితో విద్యాభ్యాసముఁజేయుచున్న సహాధ్యాయులొకనాఁడు రహస్య ముగా నిట్లని సంభాషించుకొనిరి.

సుమతి—గుణవర్మా ! యిది యేమి చిత్రము శంకరునిం జూడ జేనెదు లేదు. వీఁడీ విద్య లన్నియు నెప్పుడు చదివెనో తెలియదు. మొదట నన్ను వీనితో సహాధ్యాయునిగా నియమించి నప్పుడీ యబ్బునితో సముముగా నెంచిరేయని గర్వపడి తిని. ఇప్పుడు వాని ముందర నేనేమిటికిఁ బనికివచ్చితిని గాను.

గుణవర్మ— మీ యిరువురను సమముగాఁ బరీక్షఁజేసితిరా ఏమి ?

సుమతి—నిన్న నీవు లేవా యేమి ?

గుణవర్మ—లేను గురుపత్నీశుశ్రూషార్థమై యరిగితి నప్పుడేమి జరిగినదో చెప్పుము ?

సుమతి—నేను వేదమంతయు నొక సంవత్సరములోఁ జదివి ప్రథమ పరీక్షలో సుమతియను బిరుదు వడసితి. నది యెఱుంగుదువా ?

గుణవర్మ—ఆ మాట విని యుంటిని.

సుమతి—అట్టి నన్ను నిన్నఁగాక మొన్న వేదము ప్రారంభించిన శంకరు నితో కలిసి పనసవప్పు పెట్టుమని మన గురువుగారు నాకు నియమించిరి.

గుణవర్మ—దానందప్పేమి యతండు క్రొత్తవాఁడు గావున నీతోఁ గలిపి చెప్పుమనిరి. వానికిఁ దప్పులు వచ్చిన నీవు దిద్దుదువనియే వారి తాత్పర్యము. తరుచు బుద్ధిమంతులతో మందమతులం గ ల్పుచుందురు గదా ?

సుమతి—ఉపాధ్యాయుని యభిప్రాయమది కాదు. నా తప్పులే వాఁడు దిద్దునని.

గుణవర్మ—అలాగునా? తరువాత తరువాత.

సుమతి—ఆ మాట విని నేనసూయ చెందుచు నా తప్పులీ బాలుఁడు దిద్దినప్పుడు చూతము లెండని పలికి యెఱింగియుఁ దప్పు త్రోవలు త్రొక్కితిని.

గుణవర్మ—మంచి యుపాయమే యూహించితివి. పిమ్మట.

సుమతి—ఆ డింబకుఁడు నా పెడ త్రోవలం బడక సవరించి చక్కఁగాఁ జదివెను.

గుణవర్మ—అట్టి సామర్థ్యము వాని కెట్లు వచ్చినది?

సుమతి—పూర్వకృతసుకృతము వలన. పిమ్మట నన్ను మన గురువుగారు పరిహసించిరి.

గుణవర్మ—తరువాత.

సుమతి—నేనెఱింగియే వీని బుద్ధి దెలియుటకై తప్పితిని. మఱల మా యిరువురను బరీక్షింపుఁడని పలికితిని.

గుణవర్మ—అది యుచితమే. తరువాత.

సుమతి—అప్పుడు మా యిరువురను వేదము ఘనలో స్వస్తి చెప్పుమని నియమించిరి.

గుణవర్మ—దానిలో నీకు జయము గలిగినదా?

సుమతి—నాకుఁ గాదు పరమేశ్వరునికి గలుగదు వినుము. వేదములో శంకరుండు గావించిన విచిత్రావధానముల నేమని చెప్పుదును. నాకుఁ బనస లందిచ్చుచుఁ దప్పులు దిద్దుచుఁ దాఁజెప్పవలసిన వాక్యములు తలక్రిందులుగాఁ జెప్పె.

గుణవర్మ—నీకు మఱలఁ దప్పులు వచ్చెనా యేమి?

సుమతి—అతఁడు దిద్దిన తప్పులు నేనును మన గురువుగారును గురువుగారి గురువుగారికూడ నెఱింగినవికావు.

గుణవర్మ—వానికి మన గురువుగారు సమ్మతించితిరా?

సుమతి—మొదట నొప్పుకొనిరికారు. తరువాత నతం డర్థము చెప్పి శాస్త్ర దృష్టాంతములు జూపి సమాధానపరచెను.

గుణవర్మ—శాస్త్రప్రసంగము గూడ జరిగినదా యేమి?

సుమతి—అయ్యో! యేమని చెప్పుదును. తర్కవ్యాకరణముల యందసమాన ప్రజ్ఞ గలిగి పెక్కుబిరుదులు గైకొనియున్న మన గురువుగారి సహాధ్యాయు లిరువురు వానితోఁ బెద్దతడవు ప్రసంగించిరి.

గుణవర్మ—తమ సహాధ్యాయుని వాదము నిల్పవలయుననియా యేమి?

సుమతి—అవును. ఆశ్రమమున వారిని శాస్త్రములలో నియత్తవలం గావించి తప్పులు దిద్దెను.

గుణవర్మ—ఆహా! శంకరుని విద్యార్థియనియు, బాలుండనియు సామాన్యునిగాఁ దలంచుచుందురు. విద్యామూర్తి యని యెరుంగరు. వీనిలో దైవశక్తి యున్నది సుమీ, కాకున్న వీని ప్రాయమెంత? విద్యయెంత?

సుమతి—ఈతండు మనుష్యమాత్రుఁడుకాఁడు. అవతారమూర్తి యనియే తలంపవలయు. నిశ్చయము. ప్రసంగము గావించినపుడు వీని వదనమునుండి శబ్దజాలము గంగాప్రవాహమువలె గలగల ధ్వనితో నూరక వెలువడుచున్నట్లే బయలు వెడలును గదా.

శ్లో॥ నృత్యద్భూతేశవల్గన్మకుటకటత్స్వర్ధునీ స్ఫూర్తిసీభి
ర్వాగ్భిన్నిర్భిన్నకూలోచ్ఛలదమృతసరస్సారిణీధోరణీభిః
ఉద్వేల ద్వైతవాది స్వమతపరిణతాహంక్రియాహుంక్రియాభి
ర్భాతి శ్రీశంకరార్యస్సతతముపనిషద్వాహినీగాహినీభిః.

గుణవర్మ—మనకు శంకరుని సహాధ్యాయులమని చెప్పుకొనుటయే ప్రతిష్ఠ గదా అదిగో మనరామభట్టిటుగున వచ్చుచున్నాఁడు చూచితిరా.

సుమతి—మనకొఱకే కావచ్చు.

రామభట్టు—[ప్రవేశించి] మిత్రులారా! యుంటేదియో మంతనమాడుచున్నారే.

సుమతి—మంతేమియులేదు. నిన్న శంకరుఁడు గావించిన యద్భుతచర్యల వీరితోఁ జెప్పుచున్నాను.

రామభట్టు—నీవు శంకరుని మహిమ యెరుంగక వానితో వాదమునకుఁ బూనుకొంటివి. వానికి గురువులు నిమిత్తమాత్రులుగాని వాఁడు విద్యార్థికాఁడు వాని మహిమ నేనంతకుఁ బూర్వమే యెరుంగుదును.

శ్లో॥ అజ్ఞానాంతర్గహనపతితానాత్మవిద్యోపదేశై
స్త్రాత్రితుంలోకాన్భవదవశిఖాతాపపాపచ్యమానాన్
ముక్త్వామౌనంవటవిటపినోమూలతో నిష్పతంతీ
శంభోర్మూర్తిశ్చరతిభువనేశంకరాచార్యరూపా.

అజ్ఞానారణ్య మధ్యంబునందు త్రివిధ తాపవియోగ సంతాపమునుగల సంసారదావానలంబునఁ బరితపించెడు జనులకు నాత్మవిద్యోపదేశముచే రక్షింపనవతరించిన శంభుమూర్తియని నమ్ముము.

సుమతి—సందేహమేల! ఆ మాటయే నేను వీరితోఁ జెప్పుచున్నాను.

రామభట్టు—నిన్న యుదయమున జరిగిన యద్భుతము నీవు వింటివా.

సుమతి—లేదు. మదీయ పరాభవదుఃఖమువలన మూఁడు రోజులనుండి నేను బయటకేరాలేదు. ఏది మరొ చెప్పుము.

రామభట్టు—శంకరుండును సోమశర్మయు చిన్నను మాధుకర భిక్షకై యొక పేద పాఱునింటికిం జని భవతి భిక్షాం దేహి యని యడిగిరఁట

సుమతి—తరువాత.

రామభట్టు—ఆ మాట విని యాయింటి యిల్లాలు వాకిటికివచ్చి వారింజూచి, వత్సలారా! మీరు వామనమూర్తుల వలె వచ్చి నన్ను భిక్ష నడిగితిరి. నేనేమి చేయుదును. మీయట్టి వారికిఁ బెట్టుకొను భాగ్యము నాకు లభించినదికాదు నేను మహాపాపాత్మురాలను. ఇంట నేమియును లేక మూఁడు దినములనుండి యుపవాసము చేయుచున్నాము. తొలుతనే యీ పాడుకొంప కేమిటికి వచ్చితిరి. మఱియొక చోటనుగూడ లభింపదు. పూరక పోవకుఁడీ యుసిరికకాయమాత్రమున్నది. ఇది గైకొనుఁడని యా ధాత్రీఫలం బిచ్చి యూరక విచారింపఁ దొడంగినది.

సుమతి—అయ్యో! యీ యగ్రహారంబున నంతకటికి దరిద్రులున్నారా? శివశివా యప్పుణ్యపవిత్రాత్మురాలి మనస్సెంత తపించినదో కదా. తరువాత.

రామభట్టు—భక్తిపూర్వకముగా నిచ్చిన యా ధాత్రీఫలము గైకొని శంకరుండు తదీయదారిద్ర్యదోషమునకు మిక్కిలి వగచుచు నప్పుడే సద్వృత్తరత్నములచే మహాలక్ష్మిని స్తోత్రముఁజేసి సాక్షాత్కరించిన యమ్మహాదేవిని నప్పేదల దారిద్ర్యము వాయఁజేయుమని వేడికొనియెను.

సుమతి—దీన నతండు దీనదయాళుండైనట్లు స్పష్టపడుచున్నది గదా. పిమ్మట.

రామభట్టు—పిమ్మట నయ్యిందిరాదేవి యతని యనుమతి గతి వారి మందిరములోఁ గనకామలకవర్షము గురిపించినది.

సుమతి—ఆ యిల్లాలి పూర్వసుకృత పరిపాకంబునంగాక యబ్బాలుండు వారింటికి భిక్ష కిరుగునాఁ తరువాత.

రామభట్టు—వానచినుకులవలెనుఁ దమవాకిటంబడిన పైఁడి యుసిరిక కాయలం జూచి యా యిల్లాలు సంతోషము పట్టఁజాలక యబ్బురముఁ జెందుచు నా వృత్తాంత మెల్లరకుం జెప్పినది.

సుమతి—ఆ యుసిరికాయలం నీవు జూచితివా?

రామభట్టు—సోమశర్మతో నీ కథఁ జెప్పుచు నామె వానికా కాయలం జూపినదఁట. అతండు నాకీ కథ రాత్రిఁ జెప్పెను.

సుమతి—మనముగూడ నతని నాశ్రయించుచుందము. మహాలక్ష్మి వాని చేతిలో నున్నది గదా. యెప్పుడైన దయ రాకపోవునా ఏమి?

రామభట్టు—ఈ యువతి సీతతోనేమి యతని యనుగ్రహము కలిగినచో మనకు శాశ్వత సుఖపదమే కలుగునుగాదా.

సుమతి—అవును. ఇది మొదలు మనమతని సహాధ్యాయ బుద్ధి విడిచి దైవముగా భావించుదముగాక.

రామ—అతం డవతారమూర్తియే కానిచో నేడేండ్ల ప్రాయము గలవానికి ప్రజ్ఞ లెట్లు కలుగును.

సుమతి—అతం డు కొంతకాల మిందుండునా ?

రామ—ఇక నైదుదినములు మాత్రముండి పిమ్మట నింటికిం జనునట. తల్లి యొద్దనుండి రమ్మనుమని వార్తరాగా దివుగనట్లు ప్రతి వార్త నంపెను.

సుమతి—అట్లైన మనముగూడ నతనితో బోవుదము కృతకృత్యుల మగుదుము.

అని యెరింగించి మణిసిద్ధుం డప్పటికి కాలాతీతమగుట దదనంతరోదంత మవ్వలి మజిలీయం దిట్లు చెప్పదొడంగెను.

—:●:—

శ్రీ రస్తు

# కాశీమజిలీకథలు

## 49 వ మజిలీ

## ద్వితీయోల్లాసము

అట్లు శంకరుండ పూర్వ ప్రభాప్రచారములచే నేడవయేడు ముగియు వరకు గురుకుల వాసముజేసి సర్వవిద్యలయందు ననమానపాండిత్యము సంపాదించి సర్వభాషాకవిత్వచాతురీధురీణుండై సరస్వత్యవతారమని యెల్లరు గొనియాడుచుండ నింటికిం జని తల్లికి నమస్కరించెను.

### శంకరుని మాతృసేవ

సతీదేవియు దదీయాద్భుత విద్యాగ్రహణసామర్థ్యము విని వెరగుపడుచు పుత్రుం దీవించి కౌగలించుకొని శిరము మూర్కొని ముద్దాడి తద్దయు గారవించి విద్యాభ్యాస కాలవిశేషము లడిగెను.

శంకరుడు తత్సమయోచితములగు మాటలచే దల్లికి సంతోషము కలుగ జేసి మాతృసేవ జనులకవశ్యకర్తవ్యమను విషయము బోధించుకొరకు గొన్ని దినములు దల్లిని సేవింపుచు సూర్యాగ్నుల నారాధింపుచు నింటవసించెను. ప్రాయముచే నల్పుండైనను విద్యామహిమలచే నధికుండయిన శంకరుం జూచినతోడనే యందలి జనులాబాలవృద్ధముగా మిక్కిలి గౌరవము చేయుచుందురు. మరియొకనాడు సతీదేవి మండు వేసవిని మిట్టమ్యధాహ్నంబున బూర్ణానది కరిగి నీరు దెచ్చుచుండ నడుమదారిలో స్వభావ మృదువులగు తత్పదములు సూర్యాతపతప్తమగు నిసుకలో నంటికొనుటయు నడచుటకు దొట్రుపడుచుండెను.

అప్పుడు కొందరు జనులామెంజూచి తొందరపడుచు పరిపడి శంకరునొద్ద కరిగి, మహాత్మా ! సతీదేవి నియమములచే శరీరమును మిక్కిలి కేశపరచియున్నది. దుర్బలశరీరముగల యామె యిప్పుడు మిగుల తపించిన యిసుకలో నడువలేక చిక్కు పడుచున్నది వేగబోయి తీసుకొనిరమ్ము. మేమంటుకొనుటకు వీలులేకపోయినదని పలికిన విని యతండదరిపడి పరిపడిజని తామరాకులం దీసికొనివచ్చి, నేలంబరచి వాని మీద నడపించుచు దుర్ఘమస్వేదజలంబు హరింప దాళవృంతంబుల వీచుచు నాయాసము వాయజేసి, యింటికిం దీసికొనిపోయి మిక్కిలి పరితపించుచు పెక్కు పచారముల గావించెను.

మరియు నాత్రి నియమితచిత్తుండై శంకరుండు తత్తటినీ వరంబును గృహనికటంబుగా ప్రవహింపజేయు తలంపుతో మనోహర వృత్తరత్నములచే గంగాస్తవము గావించెను. సత్యవచనుండగు శంకరుని భక్తికి మెచ్చి యమ్మహానది మరునాడుదయకాలమునను దద్గృహముదాపుగా మందస్మితాసిత యిలగు జలశీకరములచే లోపల బవిత్రముజేయుచు ప్రవహింపజొచ్చినది. తత్ప్రాంతమున మాధవుని యాలయమొకటి విరాజిల్లుటంజేసి తదీయపాదంబుల సేవింప నరుదెంచిన మందాకినియో యన నవ్వారినిధికళత్రం బచ్చటివారి కవ్వారిగ విస్మయ సంతోషములు గలుగజేసినది. దూరముగానున్న పూర్ణానది యప్పుడగ్రహారము దాపుగా ప్రవహించుచుండుటంజూచి యందలి ప్రజలు తల్లిమూలమున శంకరుడే దానినట్లు కావించెనని యతని మహిమ నద్భుతముగా జెప్పుకొనదొడంగిరి.

అట్లు గోపాలకృష్ణుండువోలె నబాల్యుండద్భుత విద్యా విశాలుండై యమానుషకార్యంబులం గావింపుచుండ గ్రమంబున దదీయ మహిమాతిశయంబు లాదేశంబంతయు వ్యాపించినవి.

## రాజశేఖరుండను రాజు శంకరు నాశ్రయించుట

అప్పుడు ప్రజలం బాలించు రాజశేఖరుండను నృపాలశేఖరుండతని విఖ్యాతి విని మిగుల వెఱఁగుపడుచు నొకనాఁడతనిం దీసికొని రమ్మని తన ప్రధానమంత్రిని గాలట్యగ్రహారమున కనిపెను. అయ్యమాత్యోత్తముండల్లన శంకరునొద్దకుం జని నమస్కరించి, మహాత్మా ! నేను రాజశేఖర నృపాలుని యమాత్యుండ. నా పేరు సుబుద్ధియండ్రు. అమ్మహారాజు భుజబలంబున సకల భూభుజుల జయించి యీదేశంబు నిరర్గళ ప్రతాపంబున బాలింపుచున్నాఁడు తత్త్వజ్ఞానంబున జనకుని యంతవాఁడు. దాతృత్వంబునఁ గర్ణాదుల మించినవాఁడు. తదీయ సభామంటపంబున సంతతము పండిత పుండరీకులు సరసవాద ప్రసంగంబుల గర్ణసుఖం బొనరింపుచుందురు.

ఆ నృపతిలకుండు పండిత ప్రియుండు. సరసకవితాధురంధరుండు. అవధాన్యుండు భవదీయ దర్శనలాలసుండై నన్ను బుత్తెంచెను. సంసార సాగర నిమగ్నుల నుద్ధరింప గంకణము గట్టికొన్న మీ పాదరేణు వాదరముతో శిరంబున దాల్ప నౌత్సుక్యము జెందుచున్నాఁడు. ఈ భద్రదంతావళము నెక్కి విచ్చేయుఁడు. అని యనేక ప్రకారముల బ్రార్థించిన విని మందహాసము జేయుచు శంకరుండిట్లనియె. సుబుద్ధీ ! మీరాజు సద్గుణవిశేషముల కెంతయు సంతసించితిమి. మేము నిత్యాన్నము భుజించుచు చర్మమె పరిధానముగా ధరించి త్రికాలనియమములతో కాయమును గ్లేశపరచుచు వేదాధ్యయనము గావించు బ్రహ్మచారులము. ఇట్టి మేము సహజకర్మల విడచి కుత్సితభోగములగు గజాశ్వాందోళికాదుల నపేక్షించి మీరాజు నొద్దకు వచ్చి మా ప్రజ్ఞాప్రభావముల జూపి ద్రవ్యము సంపాదించి యేమి చేయుదుము. మాకీ తుచ్ఛభోగములం దభీప్సితము లేదు. కావున నీవు యథాగతముగా నింటికింజని మా వాక్యముగా మీ రాజును బలుమారు నిట్లు బోధింపుము.

రాజు ప్రజలకుఁ దగినవృత్తు లేర్పరచి వర్ణాశ్రమాచార నియమంబులు దప్పకుండ ధర్మనిరతులం గావించి పాలింపవలయును. ప్రజల సుకృతదుష్కృతములలో నాలవవంతు నృపాలునిం జేరునండ్రు. సక్తవ్యసన విరక్తిబొందిన నరేంద్రుండు పరమసుఖంబొందు. నిదియె మదీయ హితోపదేశంబని యుపదేశించిన విని యామంత్రి మాఱు మాటపలుకక యతని యనుమతిం గైకొని మరల రాజశేఖరునొద్ద కరిగి యతని మాటల తెఱంగెఱింగించి మఱియు.

చ. అఱువదినాల్గువిద్యల రహస్యములం గ్రహించి యేను వ
త్సరముల ప్రాయమందె నియతవ్రతుఁడై యొక విప్రకాంత పే
దరికము వాపి యేటిని లు దాఁపునఁబెట్టిన దిట్ట తుచ్ఛపున్
సిరులకు నాసఁజెందిన మన చెంతకు వచ్చునె పిల్చినంతటన్.

గీ. అతని మాటల వినిన వాఁ డమృతమేవ
గించు భోగములఁ దృణీకరించుఁ ద్రుంచుఁ
జిత్తమోహంబులను విమర్శించు శ్రుతుల
మించు జనకాదియతుల భూమీశభర్త.

క. ఆ మహితాత్మునిగనుఁగొనఁ
గామదిఁగామితమునికిఁ గలిగిన యేనిన్
భూమీశ ! రమ్ము పోవుద
మామహితకననలయాతఁ దతివేగముగాన్.

వ. చతురంగబలపరివృతుండై యయ్యగ్రహారంబునకుంజని యందు.

సీ. క్షితిసురార్భకులచే సేవింపఁబడువాని
ధవళయజ్ఞోపవీతములవాని
గంగాతరంగిణీ కమనీయహిమమహీ
ధరముతో నెనయింపఁ దగినవాని
శరదంబుధరనిభాం బరముదాల్చిన వాని
ఘనమృగాజినముమైఁ గప్పికొనుట
నీలాంబుదనిబోలు మేలిరూపమువాని
మంచికృత్యములాచరించువాని.

గీ. మిసిమి మేలిపసిండి క్రొమ్మించులీను
మౌంజికటిసీమనింత సంఘటింపఁ
బీతల కావ్యతిమ్యుతిభూజాతమట్లు
మురువుఁజెందెడు వాని శంకరునిఁ గనియె.

వ. కనుంగొని మనంబునఁ దదీయ మహానుభావతకు విస్మయముఁ జెందుచు నానృపాలుండా బాలునకనేక సాష్టాంగ నమస్కారములు గావించినఁజూచి శంకరుం డతని మన్నించుచు నాశీర్వచన పూర్వకముగా నాగమన కారణంబడిగెను. అప్పుడు పదివేలదీనారము లతని మ్రోల బ్రోగువెట్టి యానృపతి యల్లన నిట్లనియె. మహాత్మా! నేనతి ప్రయత్నముతో మూఁడునాటకములఁ గావించితిని. వాని విమర్శించి గుణదోష వివేచనము గావింపవలయును. ఇదియే మదీయ వాంఛితమని పలికి యతని యనుమతి వడసి యా మూఁడునాటకములను సంగ్రహముగాఁ జదివి వినిపించెను.

రసపూరితములై, మనోహరగుణరీతి విశిష్టములై యొప్పు నా నాటకముల మూఁటిని విని శంకరుఁడు సుస్మితాంకురములు మోము నలంకరింప నృపాలా! నీ నాటకములు నిర్దుష్టములై సుకవిజనస్తోత్ర పాత్రములై యున్నవని మెప్పువల్కె. నీ యభీష

మేమియని యడిగిన విని యానృపాలుండు, స్వామీ! నీ యనుగ్రహంబునఁ గృతి సంతతిచేఁ గృతార్థుండనైతిని. పుత్త్రినొక్కని దయసేయుఁడని కోరికొనియెను. అప్పుడు శంకరుఁడు, రాజా నీవు తెచ్చిన ధనము మాకవసరములేదు. ఈ యగ్రహార బ్రాహ్మణులకుఁ బంచిపెట్టుము సుపుత్త్రుఁ డుదయించు నని పలికి రహస్యముగాఁ బుత్త్రేష్టిగావింపుమని బోధించి తద్విధాన మంతయు నెఱింగించెను. పిమ్మట రాజశేఖరుండు తదుక్త ప్రకారము ధనము బ్రాహ్మణులకుఁ బంచిపెట్టి యింటికిం జని పుత్త్రకామేష్టిఁ గావించి సుపుత్త్రుఁ బడసెను. మహాత్ముల యనుగ్రహమూరకపోవునా? అట్లు నిరుపమాన కళాపరిపూర్ణుండగు నవ్వటుచంద్రుఁడు పెక్కండ్రనాత్మయతులైన ఛాత్త్రోత్తములు నేక విద్యాప్రదానంబున ననవద్యులంగావించెను. విద్వజ్జనపరిసేవితుండగు శంకరుండు సర్వార్థతత్త్వములం దెలిసినవాఁడయ్యెను. శాస్త్రోక్తమగు భక్తిచేఁ దల్లికి నుపచారములం గావింపుచుఁ గొన్నిదినములు గడపెను.

చ. శరణముతల్లి కాసుమతి చంద్రుఁడురక్షకమావధూటికిం
కరుసకువారలొఁ దొంరులఁ గానక తాళరొకింతసేపహా!
వరమతినైననాతఁడు వివాహముసేసికొనండలంపుఁడౌ
నయుదగు మేరువెక్కి యెవఁడైననుగోరునె దుష్ప్రవేశమున్. 31

చ. సకలకలాప్రవీణుఁడగు శంకరునిస్తిఁగేస్తు జేయను
త్సుకమతులై తదాప్తులు యశోమహితప్రథితంబులైనవి
ప్రకులములంగళామతివి రాజితరూపగుణాభిధన్యఁ గ
న్యక వెదుకందొరంగిరి నియంత్రితులై సతిచేమిధోగతిన్. 22

## శంకరునియొద్దకు మహర్షులు వచ్చుట

మఱియొకనాఁడు బృందారక పరివృతుఁడగు బృహస్పతి వోలె శిష్యగణసేవ్యమానుండై విద్యావ్యాసంగము చేయుచున్న శంకరుని మందిరమునకు నుపమన్యు దధీచి గౌతమాగస్త్య ప్రముఖులగు తపోధనులు విచ్చేయుటయు దూరమునం దతండు వారిఁజూచి లేచి శిష్యగణముతోఁగూడ నెదురేగి యాతిథ్యంబిచ్చి యుచితసపర్యలం గావించి పీఠంబుల సుఖోపవిష్టులంగావించి యంజలి ఘటియింపుచు వినయంబున స్వాగతమడిగిన నమ్మహర్షులాదరపూర్వకముగా నిట్లనిరి.

మహాత్మా! నీవు సుకరమైనమతముల నుద్ధరింప నవతరించిన శంకరుండవు. నీ వచ్చిన కార్యము మఱచి మాతృసేవకుఁజిక్కి యిల్లు విడకున్నవాఁడవు ఇటుపిమ్మట నైనఁ గర్తవ్యాంశ మేమఱకు సుమీ యని పలుకుచుఁ గొంతసేపు రహస్యకథావిశేషంబుల ముచ్చటించిరి.

అట్టి సమయమున శంకరుని తల్లి యగు నార్యాంబ వారి పాదపల్లవములకు నమస్కరించుచు, మహాత్ములారా! నేడుగా మేము కృతార్థులమైతిమి. ఊరక మీ యట్టి యవధూతలిట్టికాలమున దర్శనమిత్తురా! అయ్యారే! మావంశము కడు చిత్రమైనదని యనేక స్తోత్రములు సేయుచు "అయ్యా! యీ శిశువు చిరుతతనంబుననే సకలశాస్త్ర పారంగతుండగుటయు నద్భుతకార్యములు గావించుటయుఁజూడ లోకులకు విస్మయము గలుగక మానదుగదా. అదియునుంగాక మీ బోటి మహాత్ములరుదెంచి యీ చిన్న వానితో ముచ్చటించుట యచ్చెరువుగదా? నే నద్ధరాలనైతినేని వీని పుణ్యమెట్టిదో వక్కాణింపవేడెద మీరు త్రికాలవేదులగదా" యని సానునయముగా నడిగిన విని యందుఁ గుంభసంభవుండని పేరుపొందిన మహర్షి యల్లన నిట్లనియె.

సాధ్వీ! నీవును వల్లభుడును బుత్రార్థులై చంద్రశేఖరు నారాధించితిరి గదా. ఆ కృపాళుండు మీ తపంబునకు మెచ్చి భవదీయ వల్లభుని స్వప్నంబునం దోడ సూపి, దుష్టుండ శతాయుస్సంపన్నుండగు. సర్వోత్కృష్టుండు మితాయుస్సంపన్నుం డగు. వీరిలో నీ కెట్టి సుతుండు కావలయునని యడిగిన నావిద్వాంసుం డుత్తమసుతునే కోరికొనియెను. దానంజేసి తదంశంబున మీకీ పట్టి యుదయించెను.

అట్టివాఁడెట్టి వాఁడును గాకుండ నాయని పలికిన విని యులికిపడి యక్కలికి మునితిలకునకు వెండియు నిట్లనియె, మహాత్మా! యేమంటిరి. యామాట నా ప్రాణ వల్లభుండు నాకెఱింగింపలేదే మితాయువన నెంతయో తెలియకున్నది. కనికరముతోఁ దత్పరిమాణ మెంతయో వివరింపుఁడు. తల్లడిల్లుచున్నదని పలికిన విని సత్యమైన నప్రియవాక్యము చెప్పఁగూడదను నిషేధవచనము గలిగియున్నను నేమి కారణము ననో యా మహర్షి వీనికి శంకరుఁడు పదియాఱేఁడుల యాయుర్దాయమిచ్చెను. కాని మఱికొన్ని కారణములచే మఱియన్ని యేఁడులు జీవించునని పలుకుచుండఁగనే వలదు వలదుడుగుమని యితర మునులు కనుసన్నలచే వారింపుచు నతనితోఁగూడ శంకరు ననుమతిఁ గైకొని యథాగతముగా నరిగిరి.

## శంకరుఁ డల్పాయువని విని తల్లి విలపించుట

పిమ్మటఁ బుత్రవత్సలయగు సతీదేవి యమ్మహర్షి మాట వినిన తోడనే యంకుశమునఁ బీడింపఁబడిన కరిణి గ్రీష్మంబున నెండిన తరంగిణివగిది వాయుకంపిత మగు కదళియుంబోలెఁ జలించుచు నేలఁబడి మూర్ఛిల్లి శోకరసావేశంబునఁ బెద్దతడ వొడలెఱుంగక యెట్టకేలకు దెప్పిరిల్లి యల్లము పగుల శంకరునిం గౌఁగిలించుకొని.

సీ. హా! కుమార! సుపుత్రప్రాప్తికాలైకఖ్యాత
సకలకళాపూర్ణ చంద్రవదన

నా తండ్రి నిన్నుఁ బన్నగశిరోభూషణుం
    డల్పాయువుగఁజేసె నయ్యయిట్టు
లయ్యయో నీ విద్యలన్ని యేమైపోవు
    నేనేమి సేయుదు నింకమీఁద
నీ తండ్రితో నేఁడు నిన్నుఁ దగాఁగొని
    యరుగంగలేనైతి నమరపురికిఁ.

గీ. గన్నతండ్రివేడ్క గదుర నీ ముద్దు ము
చ్చటలఁ జూచుకొనుచు జాలకాల
మలరఁదలఁచుకొంటి నకట నీ నెత్తిపై
మృత్యువుంటఁ దెలిసి మెలఁగనైతి.

చ. కపటవరంబులిచ్చి మము గాసియఁబెట్టఁగనేల చిత్తభూ
రిపుడు దయాళుఁడిట్టి విపరీతముఁజేయునె మత్పురాకృత పా
పఫలరీతిగాక కులపావన ! ముప్పదియేండ్లె నీకుఁ గ
ల్పపు తుదియయ్యెనే యకట పాడువిధీ యిటుసేయుదే ననున్.

చ. చిరుతతనంబున న్ధృతిన శేషకళావిభవంబుగాంచి య
బ్బురమగు కార్యముల్సలిపి భూజను లన్నువివేకతా ధురం
ధరులుగఁ జేసినట్టి యవతారశరీరుఁడు తల్లి మోహ సా
గరమున మున్గికొట్టికొనఁగా దరిజేర్చక మోహమందునే.

## శంకరుఁడు తల్లికి వైరాగ్యోపదేశము చేయుట

శ్లో. ప్రబలానిలవేగ వేల్లితధ్వజచీనాంశుకకోటిచంచలే
అపిమూఢమతిః కళేబరేకురు తేకస్థిరబుద్ధిమంబికే
కతినామసుతానలాలితాః కతివానేహవధూరభుంజ్మ హి
క్వను తేక్వచతాః క్వవావయం భవసంగః ఖలుపాంథసంగమః.

అమ్మా ! ప్రబలవాయువుచేఁ గొట్టికొను ధ్వజపటమువలె జంచలమగు నీ కళేబరమున స్థిరబుద్ధి యుంచుటకంటె మూర్ఖత్వము గలదా. ఇంతకు వెనుకటి జన్మముల నీకు నావంటిపుత్రు లెందరు జనియించిరి. ఎందఱకు దల్లివైతివి. ఎందఱం బెంచితివి. వారందరిలో నేనొకండ. నెందఱికొఱకు విచారించెదవు. మార్గస్థులు పానీయశాల కరుదెంచినట్లు సంసారులు చేరుచుం బోవుచుందురు. మమత్వమున సంసారసాగమున మునింగి విషయసుఖగ్రాహగ్రస్తుండగు దేహియధోగతిం బొరయును. తల్లీ ! నీ దేహమే నీకెరవగుచుండ నా కొఱకు విచారించెదవేం ? దేహతత్త్వం బెఱుంగుము.

జీవులకు జననముతోనే మరణము కూడుకొనియున్నది. నూఱేండ్లు బ్రతికినను వాంఛలు నశింపవు గదా ! మమత్వము దిగి సుఖింపుమని యుపదేశించిన విని యవ్వనితామణి యొకింత ధైర్య మవలంబించి కుమారుని కిట్లనియె. తండ్రీ ! దేహాభిమానమున్నంత వఱకు మమత్వము విడుచుట కష్టము. సకల లోకస్తుత్యుండవగు నీయట్టివాని విషయమై చెప్పనేల ? కానిమ్ము విధిగతి యలంఘ్యముగదా ! నీవిఁక గృహమేధివైసుపుత్రులంగని కులముద్ధరింపుము. క్రతువులచే దేవతలఁ దృప్తిపఱుపుము. నీ తండ్రి గృతకృత్యుం
౧౦ జేయు మిదియే నాకోరిక, యని పలికిన విని నవ్వుచు శంకరుం డిట్లనియె

శ్లో. భ్రమతాంభవవర్త్మ భ్రమా
న్నహికించిత్సుఖమంబలక్షయె
తదవాప్యచతుర్థమాశ్రమం
ప్రయతిష్యేభవ బంధవిముక్తయె.

అమ్మా ! భ్రమవలన సంసారమార్గమున గ్రుమ్మరువారికి జననీ జఠరవాస మరణాది రూపమైన దుఃఖమేకాని సుఖమించుకయులేదు. మరియు నల్పాయుసంపన్నుం డగు నేను బెండ్లియాడి భార్యాపుత్రాదులఁ గ్లేశ పఱుపనేల ? కావున నేను జతుర్థాశ్రమ మును స్వీకరించి భవబంధవిముక్తి కొఱకుఁ బ్రయత్నించెద. ననుజ్ఞయిమ్మని కోరికొని
౧౪ యెను సతీదేవి కర్ణకఠోరము లైన యతని మాటలువిని చెవులు మూసుకొని రెట్టించిన శోకముతో గద్గదకంఠయై, నాయనా ! నీవు నన్ను విలపింపఁజేయుటకా జనించితివి ? నల్పాయుష్మంతుండవని వినినది మొదలు హృదయము పగిలియున్న నన్నోదార్చు రీతి యిదియా ? నాకేమిగతిఁ జూపి నీవు సన్యాసివయ్యెదవు ? అయ్యయ్యో ? నీవన్న మాట గోరుచుట్టుపై రోకలిపోటువలెనున్నదిగదా ? ముప్పదియేండ్లలోఁ బెండ్లియాడి సంతానముఁగని క్రతువులఁజేసి కృతకృత్యులైన వారనేకులుగలరు. నీవును బూర్వుల మార్గ మనుసరింపుము. వృద్ధురాలనగు నామాట నాదరింపుమని యనేక ప్రకారముల సానునయముగాఁ బలికిన విని శంకరుండు వెండియు నిట్లనియె.

శా. తల్లీ ! పుత్త్రులు శత్రులన్నలుకు వ్యర్థంబౌనెనీవంత వ
౧౧ ర్తిల్లంగాని సుఖంబెనాకతనఁ జింతింపన్మమత్వంబులోఁ
ద్రెళ్ళంజేయుము సౌఖ్యమయ్యెడు భవాబ్ధిందాటెదోయమ్మ నా
కిల్లున్వాకిలిప్రీతిలేదఖిలమున్ హేయంబుగాఁ దోచెడిన్.

అమ్మా ! నీవు నాయందు మమకారముఁ బెట్టికొంటివేని దుఃఖమే కాని సుఖము లేశమైనను లేదు. నాకీయొంటిజందెమే బరువై యున్నది. రెండవదాని నెట్లు ధరింతును. నాకీ సంసారమందిచ్చలేదు. పారలౌకిక సౌఖ్యంబు విచారించుకొనియెదనని పలికినవిని యామెగోలున నేడ్చుచు నతని గడ్డము పట్టుకొని, నాయనా! నీవు చిక్కులి యక్కటికము గలవాఁడవు. ఎందరినో రక్షించితివి నాముప్పు గడిపి పిమ్మట నీ

యిష్టము వచ్చినట్లు చేసికొమ్మని యనేక ప్రకారములఁ బ్రతిమాలికొనియెను. అప్పు డతం డేమియుఁ జెప్పలేక యూరకుండి యాత్మగతంబున నోహో! యీమె మోహము మిక్కిలి బలముగానున్నది. సన్న్యాసస్వీకారమున కాజ్ఞయియ్యదు. తదాజ్ఞలేక యది స్వీకరింపరాదు. ఏమి చేయుదునని తలంచి తదుపాయ మరయుచుఁ గొన్నిదినములు గడిపెను.

## శంకరుఁడు మకరగ్రస్తుఁడై తల్లిని సన్న్యాసమున కాజ్ఞ యిమ్మనుట

ఎనిమిదవయేట శంకరుఁడొకనాఁడు ప్రాతఃకాలమునఁ బూర్ణానది కరిగి యందుస్నానము జేయుచుండఁ దన వెనురూపునాపి రక్షింపుమని శరణుఁజొచ్చు నట్లొక మకర మతని చరణంబులఁ బట్టికొని లాగఁదొడంగినది. జలస్తంభనాది విద్యాప్రవీణుండైనను దనకార్యము సాధింప నిదియే సమయమని నిశ్చయించి యిటునటు గొట్టుకొనుచు. అమ్మా ? రక్షింపుము రక్షింపుము. నన్నొక మొసలిపట్టుకొని లాగుచున్నదని పెద్ద కేక పెట్టెను. ఆ రోదనమువిని యింటగృహకార్యములు చక్కఁబెట్టుచున్న సతీదేవి శోకపరవశయై గుండెలు బాదుకొనుచు, నొక్కడుగున రేవుఁజేరి నట్టేటం గొట్టుకొనుచు మునుగుచుఁ దేలుచున్న కొడుకుం జూచి, అయ్యో అయ్యో హా పుత్రా! హా పుత్రా యని యరచుచు లోతునీటం దిగవలదని పలుమారు బోధించినను నామాటఁ బాటింపక నీ యేటికేటికి వచ్చితివి? ఇఁక నాకు దిక్కెవ్వరు? మా శంకరుని మకరము బట్టినది వచ్చి రక్షింపరో మీ పాదములకు మ్రొక్కెదనని యరచుచు నతని మోముదమ్మింజూచుచు రక్షకుల జాడ నరయుచుఁ బలుతెరంగుల జీరింపదొడంగినది. కాని సాహసించి యేటిలో దిగలేకపోయినది ప్రాణములకన్న తీపగునది మరియొకటి లేదుగదా.

అప్పుడు శంకరుఁడు, "అమ్మా! నీవు సన్న్యాసము గైకొంటివేని నిన్ను విడిచెదనను మాట యొకటి నీటినుండి బయలువెడలుచున్నది. సత్యముకావచ్చును. అందులకు నీవంగీకరింతువే" యని యడిగిన విని యామె యోహో? యిది కపటమాయేమి ? వీడిదివరకుఁ బలుమారు సన్న్యాసముఁగైకొనఁ బ్రార్థించియున్నాఁడు. ఇట్లడిగిన నేను సమ్మతింతునని కాఁబోలు నేమిచేయుదునని దోలాయితచిత్తయై యున్నంత శంకరుం డొక మునుంగుమునిఁగి యంతలోఁదేలి తల్లి కిట్లనియె.

తల్లీ! యిది కడపటిమాట యింక నిలుచుటకు శక్యముకాదు. మకరగ్రహణ వేదన బరుగుచున్నది యిదిగో మ్రొక్కుచుంటి సన్న్యాసమునకో, స్వర్గమునకో యాజ్ఞ యిమ్మని వేఁడుకొనియెను.

ఆ మాట విని యామె యంతట ధైర్యము నవలంబనోపక పుత్త్రుండెట్టైన బ్రతికి యుండినం జాలునని నిశ్చయించుకొని, "పుత్రా ! నీకు సన్న్యాసమున కాజ్ఞ యిచ్చితిని. పరమానందమును బొందుము. ఆ మకరమునకు సైతము నీ మతమే యిష్టమైనది కాఁబోలు. నిఁక నిలువనేల ? వేగర"మ్మని పలుకఁగావిని శంకరుండా జలాంతరమునసే మనసుచేత సన్న్యసించి యల్లననా నక్రముఖమునుండి తప్పించుకొని భవబంధవిముక్తుండు వోలె నవలీలం దీరంబుఁజేరి తల్లికి నమస్కరించెను.

సతీదేవి బాష్పజలములచే సన్న్యాసస్వీకారమున కభిషేకము చేయుచున్నది వోలె నతని శిరంబు దడుపుచుఁ, దండ్రీ! మకర దంష్ట్రిక సోకి నీ యొడలెంత బడలి నదోకదా. అయ్యయ్యో! అయ్యార్తి నెట్లు సైరించితివి. నీరెక్కువ ద్రాగితివా యింటికిఁ బోవుదమురమ్మ. వైద్యుల రప్పించి తగిన చికిత్సం జేయించెదనని పలుకఁగా నవ్వుచు శంకరుం డిట్లనియె.

శం—జననీ నీ యాజ్ఞచే నేను మానసన్న్యాసము స్వీకరించితిని. ఇఁక నేనింటికి రాను. యతికిఁ గర్తవ్యమేదియో యది నాకుపదేశింపుము.

తల్లి—నీవు సన్న్యాసివై పోవుచుండ నన్ను రక్షించువారెవ్వరు ! నాకేమి గతిఁజూపి యరిగెదవు ?

శం—మదీయ పైతృకధనంబెవ్వరు దీసికొనుటకుఁ గర్తలో వారలే నిన్ను రక్షించుచుందురు.

తల్లి—ఓహో మంచిదారిఁజూపితివి. మదీయదేహపాతము ఫలహేతువుగాఁ జూచు జ్ఞాతులా నన్నురక్షించువారు? అన్నన్నా? యెందరా యింత నిర్దయుండవైతివేమి. వ్యాధిపీడిత నయ్యెదనేని నన్నెవ్వరు జూతురు? నాకౌర్ధ్వదైహిక క్రియలు గావించు వారెవ్వరు ?

శం—రోగము వచ్చినప్పుడు [illegible] మరణానంతరమున నపరసంస్కారమును దాయాదులే చేయుదురు అట్లు చేయనిచో లోకాపవాదము బొందరా !

తల్లి—లోకులకు వెరచిచేయు దాయాదుల యుపచారములు నాకుఁ బ్రీతి కరముగా నుండునా ? నీవంటి పుత్త్రునిఁబడసియు నీచేత సంస్కారమును బొందక యనాథవలె నే నెవ్వరిచేతనో సంస్కారమును బొందవలసినదా ? కటకట ? యెంత పాపాత్మురాలనైతిని.

శం—అమ్మా ! నీకట్టి కోరిక యుండినచోఁ బ్రాణోత్క్రమణ సమయంబున నన్నుఁ దలంచుకొనుము. ఎంత దూరములో నున్నను యోగబలంబున దెలిసికొని వచ్చి నీ దేహ సంస్కారము గావింతును.

తల్లి—అట్టి వరము నాకిమ్ము. సన్యాసికృత్యము కాదని మానెదవేమో సుమా!

శం—తల్లీ? యుల్లంబునఁ జింతింపకుము. నీకట్టి వరమిచ్చితిని మఱియు ననాథనగు నన్ను విడిచి యేగుచున్నవాఁడు వీఁడు నిర్దయుఁడని తలంపవలదు. దూరమున నున్నను నీయొద్దనుండు నప్పటికంటె నూరు రెట్లధికముగాఁ బరామర్శింపు చుందును సుమీ.

తల్లి—బిడ్డా? అదియే నేను గోరుచుంటిని. అయ్యో నీవడిగెదవనిన నా గుండెలు కొట్టికొనుచున్నవి యింటనుండి యేమి చేయుదును. నీవరిగిన నిమిషము బ్రతికియుందునా? నన్నుఁ గూడఁ దీసికొనిపొమ్ము.

శం—తల్లీ? మరల మోహమందెదవేమిటికి నద్వైతతత్త్వమును దెలిసి కొనుము. ఎవ్వరికెవ్వరును లేరు. తన్నుదా రక్షించు కొనవలయు. నీవు నావెంట రారాదు. ఆత్మతత్త్వమును ధ్యానించుకొనుచు నింటియొద్ద నుండుము. మమకార ముడుగుమని యనేక ప్రకారముల బోధించి యామెకు వైరాగ్యప్రవృత్తి గలుగఁజేసి పిమ్మట జ్ఞాతులనెల్ల రప్పించి యిట్లనియె.

## శంకరుండు తల్లిని జ్ఞాతుల కప్పగించుట

ఉ. ఎడదను గన్నతల్లియని యించుకయుం దలపోక వృద్ధను
న్విడిచి విరాగినై యరుగు వీఁడనియారటమందు నీమ మీ
కడనిడి యేగుచుంటి నెటు గాంచెదరో కద బంధులార! యీ
బడుగుబడంతి మీ జనని భాతిఁ దలంచి కృపన్ భజింపుడీ.

క. ననుమరచునట్టు లాదర
మున జూచుచునుండుఁ డీమె మోహం బొప్పన్
ననుదలచి కంటఁదడి పె
ట్టిన మీకును నాకునున్ ఘటించునఘంబుల్.

క. ఇరుమల నెరుఁగదు మాట
ల్వ్రతదిమ్మని యడుగదేమి లాతులయింటన్
గుడిచి యెరుంగదు తలఁపఁగఁ
గడుమెత్తని దీమె నెట్లు కాపాడెదరో.

గీ. సకలభూమిత్త పశుగృహ సహితముగను
నాదుజనయిత్రి మీయధీనఁగ నొసర్చి
యేగుచుంటిని దయమాలి యింతమీఁద
మీదె యామెభరంబు దాయాదులారా.

అని పలికి శంకరుండు కన్నీరు గార్చుచున్న తల్లి రెండుచేతులం బట్టికొని జ్ఞాతుల కప్పగించెను. అట్టి సమయంబున నాయగ్రహారపు బ్రాహ్మణులెల్ల నచ్చోటి కరుదెంచి యామె దైన్యము జూచి విచారింపుచు నతనివైరాగ్యమున కచ్చెరువందఁ జొచ్చిరి. అంతలో శంకరా! నీవు దూరమునసుండిన పూర్ణానదిని దల్లి యిడుమలు వాయుటకై యగ్రహారము దాపునకుం దెచ్చితివి తత్తరంగముల రాయిడిచే గోపాలస్వామి యాలయము బీటలువారినది. యాస్వామిని మరియొకచోట స్థాపించి పొమ్ము. అనుమాట యొకటి వినంబడుటయు నావచన మెవ్వరు పలికినది నిశ్చయింపలేక యెల్లరు విస్మయమంది నలుమూలలు చూడఁదొడంగిరి. అది భగవదుక్తిగాఁ దలంచి శంకరుం డప్పుడేపోయి యాగుడి పగిలియుండుటఁ జూచి వెరఁగుఁజెందుచు నాస్వామిని భుజములతో మెల్లగానెత్తి మరియొక తావున స్థాపించి యాలయ మంటపప్రాకారాదులఁ గట్టింప నియమించి యనంతరమున.

## శంకరుఁడు సన్న్యాసాశ్రమ స్వీకారమునకై గోవిందయతియొద్ద కరుగుట

గీ. తల్లిపాదాబ్జములకు వందన మొనర్చి
ఫాలమున గేలు ఘటియించి బంధువులకు
వారిదీవెనలంది యిల్వెడలెనాతఁ డ
ద్దిఁబడు నొక్క.కల మెక్కి నట్టి యతఁడు.

మ. చతురాస్యాదులు మున్ను దుర్మదమునో జప్రౌఢిమై చాల మో
హితులై రేనన మోహినీకుచకచా స్వీకారతం బొల్చి వీ
డితి ధైర్యంబు తిరస్కరింపఁడీస్మరుఁడు దంతిఁవన్ భరంబంచు న
య్యతియైకామకృతార్తివార్తయెవినం వయ్యెన్ శివుండయ్యెడన్.

క. సురగరుడోరగ విద్యా
ధరగంధర్వాది దేవతలనైన వశం
కరులుగఁజేసెడు మన్మథుఁ
బరిభవమొందించెయతి ప్రభావమలతియె.

సీ. శాంతిమానసము వశంబుఁ జేసికొనంగ
గమనాదిక క్రియ లగ్గ దాంతి
యుపరతివిషయాంత రోత్సుకత్వముమూనె
క్షాంతిమృదుత్వంబుఁ జక్కఁజేసె

గురుతరధ్యానైక నిరతిఁజేసెసమాధి
సంతతియత్యంత సాధనస్ఫూర్తి
వేదాంతవాక్య సద్విశ్వాసరూపక
శ్రద్ధసుప్రియయలెస్స సంశ్రయింప.

గీ. శంకరునిభూరివైరాగ్య శక్తిపట్టె
మహిమగలదియొకో తలంపఁగ నిన్ని
సద్గుణంబులుగల్గించె సముచితమరచి
విరులవాసనలావిర్భవించినట్లు.

శంకరుండు శుభముహూర్తమున బయలువెడలి యుత్తరాభిముఖుండై యరిగి యరిగి.

శా. దాఁటింబోవుచుశంకరుండు ధరణీధ్రప్రాదిసీభూరికాం
తారగ్రామపురీ మనుష్యపశునానాజంతుసంతాన మిం
పారంగాంచుచు నైంద్రజాలికుఁడు మాయాజాలమున్వోలె దు
ర్వాదాద్వైతమతింపలంచెనుబర బ్రహ్మంబుగానంతయున్.

అట్లు దృశ్యంబంతయు బరమతత్వముగా బోధించుచు శంకరుండు కులమతవాదులచే, బెడమార్గముల నడిపింపఁబడి బడలియున్న శ్రుతిధేనువునిక్కముంటకి మగు నద్వైతమార్గంబున నడిపించుటకుంబోలె నుత్తమదండంబు ధరించి కాషాయాంబరము కటిస్రగాలు నరుగుచుండెను. అతండు దండధరుండై రక్షకుండు కానిచో మొఱయుచు వేఁటకుక్కలు సారంగములంబోలె బాషండులు వైదికులం బాఱఁద్రోలకుందురా అద్దేశిక పుంగవుండట్లరిగి యనేకపురనదీపర్వతారణ్యంబుల దాటి యొకనాఁటి సాయంకాలమునకు నర్మదానదీ తీరంబునం బొలుపొందు గోవిందయతి చంద్రుని యాశ్రమాంతరమున కరిగెను.

సీ. మువ్వన్నె మొకము మూపులునాకిపాలిచ్చు
ధేనువత్సముల కెంతేని ప్రీతి
కటికిటవాయ భీకరసింహదంష్ట్రాగ్ర
ములగోకికొను మదంబునగజంబు
ఫణమల్లవిప్పి తాపసాంగవృకు
నడుపడుగడురక్షి నీడవట్టు
గంతులవేయుఁ జక్కఁ గమ్మగాడనకిశో
రములకుఁగలిగె సారంగసమితి.

గీ. చెలఁగిలెక్కించు వృషదంశ మెలుకపండ్లు
కాసరములశ్వములచెంత గతులెఱుంగు
నలఁగిగోవిందయతిచంద్రు నాశ్రమాంత
రమున మృగములు జాతి వైరములుమాని.

అందుశంకరుండట్టి విశేషములుచూచి తదీయ మహానుభావతకు నాశ్చర్యము నొందుచు నర్మదానదీశీకరచోరకములగు మలయానిల కిశోరములు మార్గాయాసం బపనయింప నవ్వనములోఁ గొంతదడవు విశ్రమించి తద్విశేషములరయుచు నలుమూలలుదిరిగి యతఁడొకచో దత్త్వగోష్ఠీ విశేషములచేఁ బ్రొద్దులు గడుపుచున్న కొందరఁ దాపసులగాంచి నమస్కరించి వారి కిట్లనియె.

గీ. భూరిసంసారవహ్ని తప్తుండనగుచు
ననఘుగోవిందయతిచంద్రు నాశ్రయింప
నరుగుదెంచితి మునులార? యమ్మహాత్ముఁ
డెందు వసియించెనో వచియింపుడయ్య.

అనియడిగిన శంకర డింభకుని వచనంబులకు సజ్జకదారులు విస్మయముఁ జెందుచు, అప్పా! నీవిప్పగిది బాల్యంబున విరక్తిజెందుటకు గతంబేమి? నీప్రాయ మల్పమైనను వాక్యంబులు ప్రౌఢములుగా నున్నయవి. నీవెవ్వండవు? మేము చిరకాలము నుండి గోవిందయతీశ్వరుని దర్శింప నిందువేచియున్నారము. అమ్మహానుభావుండు ప్రాదేశమాత్ర వివర ముఖముగల యగ్గుహాంతరమున నున్నాఁడని చెప్పుదురు. యోగశక్తింగాని దానిఁ బ్రవేశింప శక్యముగాదు. మాకట్టి సామర్థ్యములేదు. ఎప్పటికేని నమ్మహాత్ముండు ప్రసన్నుండగు నాయని యిందుఁ గాలక్షేపము సేయుచున్నారము. ఇప్పుడువచ్చి నీవతనిఁ జూడ వేడుకపడుచున్నావు. సామాన్యముగా నతనిం గాంచుట శక్యముగాదు. మాతోఁగొంతకాలమిందు వసియింపుము. సద్గోష్ఠినుందమని పలికిన విని శంకరుండు నవ్వుచుఁ దత్సమయోచితముగా వారికిఁ బ్రతివచనములిచ్చి యపుడు వారెల్లనచ్చెరువంది చూచుచుండ దృఢసమాధియోగంబున యోగంబువట్టి యగ్గుహం బ్రవేశించి యందు సమాధినిశ్చలచిత్తుండై యున్న గోవింద యతీంద్రుం జూచి ముకుళితకర కమలుండై యిట్లు వినుతించెను.

చ. హరునకుఁ బాదభూషయు మురారికిఁ దల్పమునై యెవండు భూ
ధరధరణీజ సాగర యుతంబుగ ధారుణినుత్తమాంగ మం
దిరవుగఁదాల్చెనట్టి యురగేంద్రుఁడవీవెకదా మహాత్మా! నీ
చరణసరోరుహద్వయికి సాగిలి మ్రొక్కెద భక్తి నియ్యెడన్.

గీ. మనుసహస్రముఖంబులఁ బనరునిన్నుఁ
గాంచితిమ్మలు భయమందఁ గనికరమున

నేకముఖమునవారి రక్షింప నవత
రించినట్టి పతంజలి నీవెగావె.

గీ. అలరసాతలమునకేగి యటభుజంగ
సాధుముఖమున నధ్యయనంబుఁజేసి
యోగశాస్త్రములతోఁ గూడ నుర్వీశబ్ద
శాస్త్రభాష్యము నెరపిన సామివీవె.

మ. శుకశిష్యుండగు గౌడపాదువలనన్ క్షుణ్ణంబుగాఁ దత్త్వముల్
సకలార్థంబులు సంగ్రహించిన దృఢ స్వాంతుండవత్యుత్తమ
ప్రకటప్రజ్ఞుఁడ వీవు నీవలన భాస్వద్బ్రహ్మనిష్ఠన్ సమా
ధికృతాత్మన్ గ్రహింపవచ్చితిని ప్రీతిన్నాకు బోధింపవే.

అని సుతియించుటయు నాలించి యయ్యతిచంద్రుండు కన్నులందెఱచి నిజ చరణ పరిసరధరణీతలంబున నిటల తటఘటితాంజలి పుటుండై యున్న శంకరుం గాంచి తదీయ ప్రభా విశేషమున కచ్చెరువందుచు [కస్త్వం] నీ వెవండవని యడిగినఁ బూర్వ పుణ్యోపార్జిత బోధాంకములగు వచనంబులచే నమ్మహాత్మున కిట్లుత్తరముఁ జెప్పెను.

శ్లో. స్వామిన్నహంన పృధివీనజలంనతేజో
నస్పర్శనోనగగనంనచతద్గుణావా
నాపీంద్రియాన పితువిద్ధితతోవిశిష్టో
యః కేవలోస్తి పరమస్సశివోమహాస్మి.

స్వామీ! నేను పృథివియు నుదకములు నగ్నియు వాయువు గగనము శబ్దస్పర్శరూపరసగంధములు నింద్రియములుంగాను, తద్బాధావిశిష్టుండై కర్తృత్వ భోక్తృత్వాదివినిర్ముక్తుండై సర్వోత్తముఁడై చిదానందమయుండైన పరమశివుండెవ్వఁడు గలడో యాతండ నేనేయని పలికిన విని యమ్మహర్షి హర్షపులకితగాత్రుండై సౌమ్యా! నీవు సాక్షాచ్ఛంకరుండవు అతనిగూఢంబగు నద్వైతమార్గంబు దెరంగెఱింగింప నవత రించితివి. సమాధి దృష్టిసంతయుంగంటి. రమ్ము రమ్ము. లోకవిడంబరమునకై నీకుఁ బ్రణవమంత్రోపదేశముఁ గావించెదను. మదీయపాదంబుల నర్చింపుము అని పలికెను. అప్పుడు శంకరుండు యతిసంప్రదాయమును బరిపాలించు తాత్పర్యముతోఁ దానెరింగినవాడయ్యును సవినయోపచారములచే గోవిందయతీంద్రు ననేక ప్రకారముల సేవించెను. తత్సేవవలన మిగుల సంతుష్టినొందుచుఁ బ్రణవమంత్రోపదేశపూర్వకముగాఁ జతుర్వేద శేఖరవచనములచేఁ గ్రమముగా,

ప్రజ్ఞానం బ్రహ్మ
అహం బ్రహ్మాస్మి
తత్త్వమసి
అయమాత్మా బ్రహ్మ ?

అను నాలుగు మంత్రములచేతను బ్రహ్మభావ యుపదేశముగా భావించెను. పిమ్మట శాస్త్రగూఢములగు వ్యాసమహర్షి హృదయాశయములఁ బ్రకటింపుచు బ్రహ్మసూత్రముల యందుఁగల సంప్రదాయార్థములనెల్ల నయ్యతి తల్లజుండు శంకరునకుఁ జక్కగాఁ దెలియఁజేసెను. వ్యాసమహర్షి వలన శ్రీశుకుండు శ్రీశుకుని వలన గౌడపాదుండును, గౌడపాదుని వలన గోవిందతీర్థులను, బ్రహ్మసూత్రార్థముల సంప్రదాయసిద్ధముగాఁ దెలిసికొనిరి. కావున గోవిందయతి యెఱింగించిన విషయములు యథార్థములని చెప్పుటకేమియును సందియములేదు. మఱియు గోవిందతీర్థులు పాతాళమునకేగి యనంతుని వలన సంగ్రహించుకొనిన విద్యలు యోగములును, మంత్రములుఁ దంత్రములును చతుష్షష్టికళలను ఆ శంకరాచార్యున కుపదేశముఁగావించి తత్సంప్రదాయముల నెల్లఁ గరతలామలకముగాఁ దెలియఁజేసెను. అనేక జనన కృతసుకృతపరిపాకంబునం గాని పొందశక్యము గాని సన్న్యాసాశ్రమమును స్వీకరించి శంకరాచార్యులు ధ్రువుండు వోలె పరమోన్నతస్థానమును బొంది ప్రకాశించెను. అప్పుడందున్న తాపసులు కొందఱతని యాకృతి విశేషమునుం జూచి విస్మయముఁ జెందుచు నొండొరు లిట్లు సంభాషించుకొనిరి.

వరరుచి—ఆర్యా ! యీ బాలయతి యతిపాటవమగు శాటీపటముచేఁ గప్పఁబడి యెట్లుండెనో చూచితివా ?

మతంగుఁడు— దివసావసానంబున రక్తమేఘాచ్ఛాదితమగు హిమగిరి కూటమువలె నొప్పుచుండెంగదా.

వరరుచి — అగునగు. గజాసురుని సంహరించి రుధిరాప్లుతమగు తచ్చర్మంబు నరుణశాటీపల్లవము నెపంబునఁ బూనిన శంకరుండే యితండని యూహింపుము.

మతంగుఁడు— మేలుమేలు. చక్కని పోలికఁ దెచ్చితివి. ఇతండు భూతాశక్తియు గోపిహరణమున భూతిసంగమును భోగుల సహవాసమును బరిహరించినను స్థూలసూక్ష్మ కారణంబులను త్రిపురంబులు దహించుటచే నపరశివునిగాఁ జెప్పఁదగినదేకదా.

వరరుచి—దుఃఖహేతువై దురంతమై దుష్కృతమేఘయుక్తమైయొప్పు సంసారవర్షర్తును దూరముగా బరిహరించి ప్రతిపక్ష పండిత మృణాలనాళాంకుర గ్రాసలత్వంబుగలిగి సన్న్యాసక్రియావిశేషంబుఁ జెందుచుండుటచే నితనినిఁ బరమహంస శిరోమణియని చెప్పుటకేమి సందియమున్నది.

మతం—సందియమేల ? ఈ ద్విజకులావతంసము పరమానంద స్వరూప

మగు బ్రహ్మమనుక్షీరము దుఃఖాత్మకమగు జగత్తను నీరముతో దాదాత్మ్యము నొంది యుండ విడఁదీసి స్పష్టపరచుటచేఁ బరమహంసమని నిస్సంశయముగా వర్ణింప వచ్చును.

వర — తమంబున మందీకృతంబగు దృష్టిని ప్రకర్షగుణయుక్తముగాఁ జేయుచు లోకబాంధవుండన నెసంగి సుహృచ్చక్రముల యార్తి హరింపుచు సన్మార్గములఁ బ్రకటనఁ జేయు నీయతికి యంసాభిఖ్య వేఱొకరీతిం గూడ నన్వర్థమగుచున్నది సుమీ.

మతం — ఓహో. సూర్యునితోఁ బోల్చితివా ? చక్కగా నున్నదిగదా. ఈ మహానుభావుండు పరమహంసయై సంసృతి ముక్తి కొఱకు గోవిందయతిచంద్రుని కతంబునఁ బరమాత్ముని ధ్యానించుచుండ నింద్రియతండంబుల నిట్టి చాంచల్యము గలదని చెప్పుచున్నవి వోలె మేఘములు సంచరించుచున్నవి చూడుము.

వరరుచి — వార్షిక దినములలో యతు లాత్మీయస్థానమును విడువకుండుట యాచారము గావున బాలయతియు నీ వర్షాకాల మిచ్చటనే యుండును. సత్యము నీ మహాత్ముని దర్శనముఁ జేయింపుచున్న యీ ఋతువు మనకు మహోపకారియైనది గదా.

అని చెప్పుకొనుచు వారు నిష్క్రమించిరి — శంకరాచార్యులు గురుశుశ్రూష యతులకవశ్య కర్తవ్యమని తెలుపునట్లనేకాగ్రహారములతో నొప్పుచున్న నర్మదానదీ తీరంబున వసించి యాత్మధ్యానముఁ జేసికొనుచు గోవిందయతి నారాధింపుచు వర్షకాలము గడుపుచుండెను.

ఇట్లుండ నొకసారి భూరిస్తనిత ఘోషములచే భూనభోంతరాళములు పగులఁ జంచలాసంచయంబులు దృష్టిఘాతములకు భీతిగలుగఁజేయ గల్పాంతమోయని జనులు వెఱచి మొఱలిడ దెసలావరించి వారివాహతతంబులు వేదండశుండాదండ సదృశంబులగువారి ధారలచేఁ బంచరాత్రంబు లేకరీతివర్షించుచు ధారుణీతలంబెల్ల ముంచుటయు నప్పుడు గొప్ప చప్పుడుత్పత్తిల్ల గల్పవారినిధియుంబోలె నుత్తుంగ తరంగంబులతో నర్మదానదిపొంగి తీరములయందలి యగ్రహారముల ముంచినది.

అప్పుడందలి ధరణీబృందారకులు హాహాకార నినాదములతో సస్త్రీ బాల వృద్ధముగా గృహంబులువిడిచి యొండొరులం జీరికొనుచుఁ బ్రాణతుల్యములగు యజ్ఞోపకరణముల నరణులఁ బుస్తకముల భారంబున పిల్లలతోఁగూడఁ గషస్కంధాది ప్రదేశములంబాఱి యతికష్టంబున గోవిందయోగిచంద్రుని యాశ్రమమున్న శిఖరమెక్కి యొక్కచో స్త్రీ బాలవృద్ధుల నిలిపి గుంపులుగా నరుదెంచి మహానుభావుండైన గోవింద యతీంద్రుఁ డెందున్నవాఁడని యెందున్న వారినడిగి యోగసిద్ధులకుఁ గాని ప్రవేశింప శక్యముగాని గుహయందున్నవాఁడని తెలిసికొని యగ్గుహాముఖంబున నిలువంబడి ఫాల భాగంబులఁ గేలుదోయిం గీలింపుచు నేకముఖముగా నిట్లు వేడికొనిరి.

క. గోవింద యతీంద్ర ! భవ
త్సేవానిరతులము మేమధిక ఖిన్నమనీ
షావివశులమైతిమిగదె
కావవె మాయార్తివిని ప్రకాశగుణాఢ్యా.

సీ. అటుకలఁద్రాళ్ళ ప్రేలాడఁగట్టినపువు
స్తకములువరదఁ గొట్టికొనిపోయె
సుడిగుండములు పెట్టి కడిదిగుండములయ్యె
నగ్నికుండముల గేహంబులెల్ల
నరణులతో స్రుక్స్రు వాదిపాత్రలునీటఁ
దేలివారిధిఁజేరెఁ దెప్పతోడఁ
బెనురాలతోడఁ గట్టినమేడయిండ్లతో
గోడలెల్లను నీటఁ గూలిపడియె.

గీ. పాతరలుమున్నైగాదుల పసయడంగె
ధ్యానములువోయెఁ జేలు గుండంబులయ్యె
నరుతనిడుకొని మా యగ్రహారములను
దాచికొన్నది యీ నర్మదాస్రవంతి.

గీ. చెట్టుచేమలపైఁ బ్రాకి చెదరిజనులు
ప్రాణములఁ గాచికొనుచుండి రనఘ ? యిప్పు
డీ యుపద్రవముడిసి రక్షింపుమయ్య
శరణుఁజొచ్చితిమయ్య మీ చరణయుగము.

గోవిందయతి యప్పుడు సమాధిబద్ధచిత్తుండై బాహ్యేంద్రియ వ్యాపారముడిగి యున్నవాఁడు గావున వారిమాట నాలింపకయ్యెను. తచ్ఛుశ్రూషాపరాయణుండై యున్న శంకరుఁ డయ్యార్తధ్వని నాలించి యగ్గుహాంతరమునుండి యరుదెంచి గుహాముఖమున వారిం గాంచి మీరెవ్వరు ? ఏమిటికి మొఱపెట్టుచున్నవారని యడిగిన నతండు బాలుండు ఏమియు నేమిచేయఁగలవాఁడని నిరసించుచుఁ బ్రత్యుత్తర మీయకిప్పౌరులు నలుమూలలకుఁ బరుపఁ దొడంగిరి. అందుఁ గొందరు బుద్ధిమంతులు శంకరునిమాటఁ బాటించి, ఆర్యా ! నీవు ప్రాయమునను నల్పుండవయ్యును దేజంబుఁజూడ నధికుండువలెఁ గనంబడుచున్నాఁడవు. వినుమా నడుమ గురిసిన ప్రకర్షవర్షప్రవాహము మీరెరింగియే యుందురు. పర్వతగుహావాసులగుటఁ దద్బాధ మీకెఱుక పడక పోవ

చ్చెను. అయిదుదినము లహోరాత్రంబు లేకరీతి వర్షము గురియుటచే భూమియంతయు జలమయమైనది. మేము నర్మదానదీ తీరవాసులము. బ్రాహ్మణులము. నర్మదానది పొంగి మా యగ్రహారములన్నియు ముంచివేసినది. సస్త్రీబాల వృద్ధముగా బ్రాణములు దక్కించుకొని యీమెట్ట యెక్కితిమి వరద హెచ్చు పెరుగుచున్నది. ఇప్పటికైన వరద తీసినచోఁ గొన్నియిండ్లు నిలుచును. కొందరు బ్రదుకుదురు. కొన్ని సస్యములు ఫలించును. కొంతసొమ్ము దొరుకును. గోవిందయతి యార్తత్రాణపరాయణుండనియు మా యార్తి బోఁగొట్టసమర్థుఁడని యతని నాశ్రయింపవచ్చితిమి. ఆ దయాహృదయం డెందును గనంబడకున్న వాఁడిదియే మా వృత్తాంతమని చెప్పిన విని మందహాసముఁ గావింపుచు శంకరుఁడు ఒక కడవ నభిమంత్రించి వారికిచ్చి, విప్రులారా! మీరు చింతింపకుఁడు. ఈ కుంభమును వేగముగాఁ దీసికొనిపోయి నర్మదానదీ ప్రవాహంబున విడువుఁడు. మీయార్తి వాయునని చెప్పి యది వారికిచ్చెను. అప్పుడే వారాఘటమును దీసికొనిపోయి నర్మదలో విడిచినంత——

క. బుడబుడయను చప్పుడుతో
గడగడ నీరెల్ల ద్రావెఁ గడవ యపుడియగ
స్త్యుఁడుమున్ను వార్ధిఁ గ్రోలిన
కడిదిని నక్కడవ కెంత కడుపున్నదియో.

గీ. కడవవాఁ గ్రోలఁ గడపకుఁ బొడమిన
బుడుతగ్రోలెఁ గడప గడలినెల్లఁ
దల్లిగుణ మొకింత తగులనిచో నట్టి
ఘనతగాంచునే యగస్త్యుఁడపుడు.

గీ. ఇవముతో నట్లు గడవ నీరెల్లఁ ద్రావఁ
గడిగినట్లున్న దెప్పటి కరణిఁ జెక్కు
చెదర కిండ్లును వాకిండ్లు జెట్లు చేలు
మందునకునైన లేదందు బిందువొకటి.

మహూర్తకాలములో నద్దేశమెల్ల నిర్జలమగుటయు జెరఁగుపడుచు నప్పుడు మివేల్పులా శంకరుని సుతసతీయుతముగాఁ గొనియాడుచు మితిలేని సంతసముతోఁ దమతమ నెలవులకుంబోయిరి. గోవిందయతియు సమాధినుండి లేచి యా వృత్తాంతమంతయు విని, ఔహో! యీతండు యోగసిద్ధుండయ్యె. నీతనికసాధ్యం బేదియును లేదని సంతసించెను. అతండు మరియొకనాఁడు శంకరుఁజూచి, వత్సా! శంకర! అవిద్యావరణమునుబాసి జ్ఞానంబునం బ్రకాశిల్లు పరతత్త్వమువలెనే మేఘముక్తమై శరదృతువుచే గగనమెంత నిర్మలముగా నున్నదియో చూచితివా? మరియు బాలిశంబులు ఘనసముపార్జితంబులగు జీవనంబుల లోకంబులకుఁ దృప్తిఁజేసి తటాకాంతల విడచి గగనగృహములందుండి సన్యసించిన యతులవలె నరిగినవికంటివే! శ్రవణమనన నిధి

ధ్యానలచే నీ వార్షిక దినములను గడిపి మహాత్ములీ శరత్సమయంబునఁ బాదరజంబున జగంబుఁ బవిత్రము సేయుచు సంచరింతురు. కావున నీ విప్పుడు కాశీపట్టణమున కరుగుము అందు వేదచోదితమగు తత్త్వపద్ధతి వివరింపుమని పలికి వెండియు నిట్లనియె.

తొల్లి యొకప్పుడు హిమగిరియం దత్రిమహాముని సత్త్రియాగము గావించెను. తదా లోకనార్థమై త్రిలోకంబులంగల తాపసులచ్చోటికి విచ్చేసి వేదశాస్త్ర పురాణగోష్ఠులతోఁ గాలక్షేపము గావించుచుండిరి. అమ్ముని సభామండలమున రెంటవ పుండరీకభవుండువోలె నొప్పుచు వ్యాసభట్టారకుఁడొకనాఁ డుపనిషత్తుల కర్థముఁజెప్పుచుండ విని వినయంబునఁ జేతులఁజోడించి యిట్లంటిని. మహాత్మా! నీవు నాలుగు వేదంబులను విభజించితివి. భారతంబు రచించితివి. యోగశాస్త్రముఁ జెప్పితివి. బ్రహ్మసూత్రములు నిర్మించితివి. లోకంబునకు మంచి యుపకారంబు గావించితివి. కాని యా సూత్రములకుఁ గొందరువిప్రతి పన్నులు తమతమ మతానుసారముగా విపరీతార్థములం గల్పించుచున్నవారు. కావున నీనా సూత్రంబులకు నిశ్చయార్థంబు దేటపడు నటుల భాష్యంబు రచియింపు మిదియే నా ప్రార్థనయని పలికిన విని యమ్మహాత్ముండు నవ్వుచు నిట్లనియె. సూరివరేణ్యా! పూర్వ మొకప్పుడు కైలాసమందీ విషయమే వేలుపులును ప్రస్తావించిరి. వినుము. ముందు నాయంతవాఁడు నీకు శిష్యుండు కాఁగలడు. ఆ సర్వజ్ఞునిచే నభిమంత్రితంబగు కుంభము నర్మదానదీ ప్రవాహోదక మంతయుఁ ద్రుటిలోఁ బానముఁ జేయఁగలదు. అదియే నీకు గురుతు. ఆ పండిత శేఖరుండే దుర్మతంబులనెల్ల ఖండించుచు మదీయ బ్రహ్మ సూత్రములకు యథార్థముగా భాష్యముఁ జేయఁ గలఁడు. తన్మూలంబున నీ కీర్తియు లోకంబుల నెల్ల వ్యాపించును. ఇదియే కైలాసంబునందెలిన విషయమని చెప్పి యా వ్యాసమహర్షి యెందేనింపోయెను. శంకరా! అమ్మహర్షి యెఱింగించిన విషయంబులన్నియు నీ యందు గనంబడుచున్నవి. నీవు సర్వోత్తముఁడవు. తత్త్వజ్ఞానంబున నిన్నుఁ బోలిన వారెందును లేరు. కావున సజ్ఞానంబునం గొట్టుకొను లోకము నుద్ధరింపఁ బ్రయత్నింపుము. కాశి కరిగి యందు సూత్రభాష్యము రచించుము. ఇది దేవ సమ్మతము. అని పలికి నిర్మలమగు దృష్టి ప్రవారములచేఁ బవిత్రముఁజేయు వాఁడు వోలె శంకరాచార్యుం జూచెను.

అప్పుడు శంకరుండు తత్పాదపంకేరుహంబులకు నమస్కరింపుచుఁ దదనుజ్ఞగైకొని యెట్టకేఁ గదలి కతిపయ ప్రయాణంబులఁ గాశీపట్టణంబునకుఁ జనియెను. అందు గంగానదిం గృతావగాహుండై విశ్వనాథు నర్చించి యన్నపూర్ణం గొలిచి వటుకభైరవాదుల సేవించి మఱియుంగల తీర్థంబులనెల్ల మోక్షలక్ష్మిం గొల్లాడి సద్గోష్ఠిం గాలక్షేపము జేయుచుఁ గొన్ని దినంబులు కాశీపట్టణంబున వసించెను.

# సనందుని ప్రవేశము

అట్లు శంకరాచార్యుండు కాశీపురంబున వసియించి యున్న సమయంబున నొకనాఁడొక విప్రకుమారుండు బ్రహ్మచారి బ్రహ్మతేజంబున దెసలం బ్రకాశింపఁ బద్మపత్త్రంబులఁ బరిభవించు నేత్రంబులు నాజానుబాహువులుం గలిగి చూచువారి కచ్చెరువు గలుగఁజేయుచు దురంతరంబగు సంసార సముద్రమును గురుకారుణ్య నౌకా సహాయంబున దాట నిశ్చయించి వైరాగ్యబుద్ధితో వచ్చి శంకరుని పాదంబులంబడి నమస్కరించెను. అప్పుడమ్మహాత్ముండతని లేవనెత్తి నీ వెవ్వఁడవు? నీ నివాసమెచ్చట నేమిటికిట్లు వచ్చితివి? నీ వృత్తాంతం బెఱింగింపుమని యడిగిన నవ్వటూత్తముం డిట్లనియె. ఆచార్యా! నేను బ్రాహ్మణుఁడను. కావేరీనదీ విరాజితమగు చోళదేశము మదీయ నివాసము మహాత్ములదర్శించు నుత్సుకతతో నిల్లు వెడలి తిరిగితిరిగి యిచ్చటికి వచ్చితిని. మత్పూర్వ పుణ్య పరిపాకంబున నిన్నుఁ గనుఁగొంటి. మహాత్మా! సంసారసముద్రంబున మునింగిన జనుల నుద్ధరింపఁ గంకణము గట్టికొంటివని నీ వృత్తాంతమాలించి నిన్నాశ్రయింప వచ్చితిని. అమ్మహా ఘోర తరంగములగు నపాంగములచె నన్ను వీక్షింపుము మద్గుణ దోషంబుల విచారింపవలదు. పీఁదనర్హుఁడని నన్ను విడచితి వేని నిన్ను నిరవధిక కృపారధి వని యెవ్వరు స్తుతియింతురు! నీవు దీనదయాళుండవైనచోఁ గారుణ్యంబున నన్ను రక్షింపకమానవు. మరుస్థలంబున వర్షించిన మేఘమునే యెక్కుడుగాఁ గొనియాడుదురు. నా మానసంబు భవదీయ సారస్వత సుధాసాగర జలంబులం గ్రీడింప నుత్సుకత్వముఁ జెందుచున్నది. ఆహా! భవద్భక్తి ప్రవృత్తి యందు శ్రద్ధగల శుద్ధాద్వైతవేత్త సూర్యచంద్ర పురందరాది బృందారక పురగతంబులగు దివ్యభోగంబుల నతి నీచంబులు గాఁదలంచునుగదా! తావకవాక్యామృతంబు శ్రుతిపుటంబులం గ్రోలినవాడు విషయసుఖంబుల విషవల్లీ ఫల సఖంబులగాఁ దలంచును. రంభాఘనస్తన పరీరంభాగంభోజ్వలంబగు పౌరందరలోక పుణ్యం బగణ్యంబుగా నెంచును. విరించి పదంబున ననాదరము వహించును.

అయ్యారే! పూర్వభర్వతపఃపచేళి మఫలంబులు సంసార ప్రనాయమాణంబులు, సర్వాధిహరణంబులునగు తావకచరణసేవా నివహంబులు మామక మానసమాసక్తిఁ జెందియున్నది. దేవా! నేను సంసారబంధామయ విముక్తి కొరకు నిన్నాశ్రయించుచుంటి. ఈ తెవులు బాపుట కుదయించిన వైద్యుఁడవు నీవని యెల్లరుం జెప్పుచున్నారు. నన్ను రక్షింపుమని వేఁడుకొనియెను. శంకరాచార్యు లతని మాటలు విని సంతసించుచు వాని భక్తి విశ్వాసములు మెచ్చుకొని యొకనాఁడు యథాశాస్త్రముగా బ్రహ్మభావమతని కుపదేశించి సన్న్యాస మిప్పించెను. అతండే శంకరాచార్యుల ప్రథమ శిష్యుఁడని వాడుకఁబడసిన సనందనుఁడు, తరువాత నాసనందనుచే నట్లు సంసారసాగరంబున మునుంగకుండ నుద్ధరింపుమని ప్రార్థింపంబడి వామదేవాది శిష్యులఁ దురీ

యాత్ర మను నోడ నెక్కించి కృపారసనౌకాదండ సహాయంబున దరిం జేర్చుటయుఁ గ్రమంబున నతని వాడుక నలుదెసల వ్యాపించినది. మరియు నాయవిముక్త క్షేత్ర వాసులగు జనులా యతి పతి నారాధించి వక్రమార్గమున నడుచుచున్నను దమబుద్ధిని సాధువగు నట్లు నియమించుకొనిరి.

## విశ్వేశ్వర దర్శనము

మరియొకనాఁడు కిరణ నికరంబుల ఖరకరుండువోలెఁ బ్రసూన సంతానం బులఁ బారిజాతంబట్లు శంకరయతి మిట్టమధ్యాహ్నసంబునఫాలలోచన లోచనాగ్నింబోలె దపనకాంతశిలలు విస్ఫులింగజ్వాలలఁ గ్రక్కుచుండఁ జండభానుండు బ్రహ్మాండకరండ మును మంగలము పగిదివేప నోపికతో గంగానదికి నాహ్నిక కృత్యముల నిర్వర్తింప నరుగుచు ముందర :—

సీ. నాల్గుకుక్కలతుఁ గంతములఁ జిక్కపుత్రాళ్ళ
 దగిలించి మడిచి చేతనుధరించి
 మెలితోలు మొల్లత్రాటఁ గలిపి కూర్చినపీలి
 గోచిమంగిటను చెంగులనుదీర్చి
 కఠినాంగకములందుఁ గలయఁబూసిన సురా
 రసము వాగనల్లి దెసలఁ గ్రమ్మ
 చింతనిప్పుల భంగి వింతగా నెరుపెక్క
 కరకుచూపులు భయంకరముగాఁగ.

గీ. వారుణీ పానమత్తత పెంపుఁ దూలి
 పడుచు లేచుచు నవ్వుచుఁ బాడికొనుచు
 వింతమాటల జనుల నవ్వించుచొక్క
 మాలఁడెదురయ్యె నయ్యతి మౌళికపుడు.

వానిరాక కేవగించుకొనుచు శంకరాచార్యుండు.

క. ఓరీ చండాలుండా
 సారాదారపార సంపన్నులమా
 పారులము మమ్మొరుంగవో
 దూరముగాఁ బొమ్మ దరియ దోషముసుమ్మా.

ఆ మాటలు విని యామాఁడదట్టి నిలువంబడి కడు నెరుపెక్కియున్న కన్నులెత్తి చూచుచు ఓహో! నీ యాకారంబుచూడఁ గొప్పవాఁడవువలెఁ గనంబడు చుంటివి. మాటలు విపరీతముగాఁ దోచుచున్నవేమి? నన్నేమిటికి దూరముగాఁ

బొమ్మంటివి. సత్యజ్ఞానానంద స్వరూపంబగు బ్రహ్మతత్వము సర్వాంతర్యామియై యుండెనని శ్రుతిశేఖరంబులు వక్కాణింపుచుండ నీకీభేదబుద్ధి యేమిటికిఁ గలుగవలయును. నీవు నిగమాంతంబులఁ జూచియున్నచో నిట్లనవని తలంచెదను. దండకమండవులందాల్చి కాషాయాంబరములు మేనం బొలుపుఁజెంద యతి వేషంబుధరించి కొందరు జ్ఞానగంధరహితులయ్యుఁ బ్రౌఢవాక్యంబులచే గృహస్థుల వంచింపుచుందురు గదా !

విద్వాంసుడా ? నీవు దూరముగా దేహమును బొమ్మంటివా చెప్పుము. దేహమునంటివేని యన్నమయమగు నీ దేహమునకును నా దేహమునకును భేదమేమి యున్నదిఁ దేహినంటివేని ప్రత్యగాత్మకు మునుపే భేదము లేదుగదా వీఁడు బ్రాహ్మణుండనియు వీఁడు శ్వపచుండనియు నీవు ప్రత్యగాత్మయందు భేదవిచారము చేయఁ గలవాయేమి. సూర్యబింబము గంగయందును సురయందునుంగూడ ప్రతిఫలింపదా ? అతిపవిత్రంబగు బ్రాహ్మణశరీరమునకును, నతిపాపిష్టుండగు ఛండాలు శరీరమునకును భేదములేదా ? దానంజేసి దూరముగాఁ బొమ్మంటినని పలికెదవేని మునివర్యా ! వినుము, అచింత్యుఁడు నవ్యక్తుండు ననంతుండు పరిపూర్ణుండగు పురాణపురుషుండు సర్వశరీరములయందు సూత్రముపగిది నుండుట యెఱింగియు నిట్లనుట యనుచితంబు. కరికర్ణాంత విలోలమగు నీ కళేబరమున నహంభావము నీకేటికిఁ గలుగవలయును. ముక్తిమార్గదర్శకమగు విద్యను సంగ్రహించియు నీకి తుచ్ఛసంగ్రహేచ్ఛ గలిగినదేమి ? అన్నన్నా ? మహామాయావియగు పరమేశ్వరుని యింద్రజాలంబున మహాత్ములుసైతము మునుంగుచుందురు గదా యని పలికి యూరకుండెను. ఆతనిమాట లాలించి యత్యుదార చరితుండగు శంకరుండు విస్మయమానసుండై యిట్లనియె.

దేహభృత్ప్రవరా ? నీవు పలికినదంతయు యథార్థమగును. ఆత్మవేత్తవగు నీ వాక్యంబులచే నీయందుఁ జండాలబుద్ధిని విడిచితిని. లోకంబున గొందఱుపనిషదర్థముల శ్రవణముచే దెలిసికొనుచున్నారు. కొందరు జితేంద్రియులు మననము జేయుచున్నారు. మరికొందరు నిదిధ్యాసనము జేయుచున్నారు. కాని యెవ్వరును బుద్ధియందు గల భేదభావమును విడలేకున్నవారు.

ఎవ్వనికి నెల్లపుడు జగంబంతయు నాత్మస్వరూపమున దోచునో యట్టి వాడు ద్విజుండైనను శ్వపచుండైనను వందనీయుడని నా దృఢమైన నిశ్చయము. బ్రహ్మ విష్ణు శివాదులయందే చైతన్యంబు స్ఫురించుచున్నదియో యదియే పశుపక్షి కీటకాదులయందును బ్రకాశించుచున్నది. అదియే నేను. అంతకన్న దృశ్యము మరి యొకటి లేదని సంతతము నెవ్వని మనంబున దోచుచుండునో వాడు ఛండాలుండైనను నాకు గురువగుగాక. పెక్కులేల ? ఈ లోకంబున విషయానుభవ కాలంబున విషయదర్శకమగుబోధ యెద్దిగలదో సర్వోపాధిసూక్ష్మమగు నాతెలివియే నేను.

కద్వ్యతి రిక్తమింపకయు లేదని యెవ్వని మనంబున దృఢ నిశ్చయము గలిగి యుండునో వాడెట్టివాడైనను నాకు గురువుసుమీ. నిన్ను దేహాభిమానంబున దూరముగా బొమ్మనలేదు. ఆత్మజిహ్వచేతను బొమ్మనలేదు. తదుభయతాదాత్మ్యాధ్యాసచే నట్లంటిని. నీవు నే జెప్పిన యట్టివాడవైనచో నాకు గురుండవే యని పలుకుచున్న సమయంబున.

సీ. సుమనస్తరంగిణీ కమనీయ జటలతో
నాగరాట్సు విభూషణములతోడ
నద్రికన్యాచంద దర్ధ దేహముతోడ
మృదుహాసలలిత చంద్రికలతోడ
నుద్యత్కరీంద్ర చర్మోత్తరీయముతోడ
మకుటనిస్తార్థ శీతకరుతోడ
ధవళ ప్రభా ధగద్ధగిత గాత్రములతో
సత్సాధనాఢ్య హస్తములతోడ.

గీ. విమల గోరాజ వాహనోత్తమముతోడ
బ్రమథగణ సేవితాంఘ్రి పద్మములతోడ
విశ్వనాథుండు మాతంగు విధమువిడిచి
శంకరాచార్యునెదుట సాక్షాత్కరించె.

అట్లు ప్రత్యక్షంబైన యాజగద్రక్షకుంగాంచి శంకరుండు మేను పులకింప భయభక్తి వినయ విస్మయ సంభ్రమకలిత హృదయుండై సాష్టాంగ నమస్కృతులుగావించి ముకుళిత కరకమలుండై యిట్లు వినుతించెను.

గీ. దేహదృష్టిచే ద్వదాసదాసుండ జీ
వాత్మదృష్టిచే ద్వదంశకుండ
నాత్మదృష్టిచేత స్వతి నీవె నేను
దేవ! యిదియెనాదు దృఢమతంబు.

సీ. శాస్త్రమెంతయు సమంజసమగుఁగాని శ్రీ
గురుకృపాగరిమ చేకూరకున్న
చదువదేమిటికి నెంచంగనట్టియాచార్య
కరుణగల్గినను జక్కఁగసుబోధ
ముదయింపఁగా జేయకుండిన ఫలమేమి
కలిగించుఁబోదాని గరిమనవియు

నిరుపమ పరతత్త్వ నిరతత్వము వహింప
వలయు గావున నట్టి పరమతత్త్వ.

గీ. లలిత సుజ్ఞానమునకు నాలంబనుఁడవు
పరుఁడ వాద్యంతశూన్యుఁడ వురుమహత్త్వ
ఖనివి యస్మదభిన్నుఁడ వనుపమ ప్ర
భావుఁడవు నీవు నీకిదే వందనంబు.

వ. అనియిట్లు గంభీరవాగ్గుంభనలచే నానందబాష్పపూర్ణలోచనుండై వినుతించు యతిపతింగాంచి జగత్పతి కృపారసంబు లొలుకు పలుకుల నిట్లనియె. వత్స ! శంకర నీతపోధనవైశిష్ట్యము పరీక్షించుటకై యిట్లువచ్చితి. నీ యద్వైత బుద్ధికి మెచ్చవచ్చినది. వ్యాసుండువోలె నీవును మదనుగ్రహపాత్రుండవైతివి. అబ్బాదరాయణుండు వేదంబుల విభజించి యందు సమంచితముగా శిక్షితుండై బ్రహ్మసూత్రముల రచించెను. కాణాదసాంఖ్య పాతంజల ప్రభృతులగు మతంబులందు జక్కగా ఖండింపబడినవి.

కలిదోషంబున గొందరు మూఢమతులు తత్సూత్రసంతతులకు గల్పిత భాష్యంబుల విరచించిరి. అవియు బ్రసిద్ధులచే నిరసింపబడినవి. నీవు నిగమశిఖార్థముల జక్కగా నెరింగిన ధన్యుడవు. గోవిందయతీంద్రుని వలన దశార్థములన్నియు సంగ్రహించిన ప్రోడవు అన్నింటికిం దగియున్నవాడవు. కావున నిగమార్థావితము లగు యుక్తిప్రయుక్తులచే దుర్మతంబుల ఖండింపుచు సూత్రభాష్యంబు రచియింపుము. నీ రచించినభాష్యంబు సవద్యంబై పురందరాది బృందారకసందోహముచే సన్నుతియై బ్రహ్మ సభయందు సైతము పూజింపబడగలదు. [illegible] నిర్ణయించుము [illegible] భాస్కరప్రభాకర మండనమిశ్రాది పండితమండల ప్రచండవిద్యావాదంబుల ఖండించి యద్వైతమతావలంబకులుగావింతువు. మోహధ్వాంత పద్మినీకాంతులగు భ్రాతృత్రయముల బరతత్త్వసరణి బరిపాలింపసందందునిలిపి పిమ్మట నన్ను గలిసికొందువని యనుగ్రహపూర్వకముగా నెరిగించి వృషభతురంగుండు నిగమములతో గూడ నంతర్ధానము నొందెను. శంకరయతిచంద్రుండు నతి విస్మితస్వాంతుడై యా వృత్తాంతమునే ధ్యానించుకొనుచు నంతేవాసి సంతతితోడ గంగానదికింజని స్నానాది నిత్యకృత్యంబులం దీర్చుకొని యా వసథంబుజేరి సనందనునితో నిట్లనియె. వత్సా ! సనందన ! సనకసనందనాది వందిత చరణారవిందుఁడగు నిందుమౌళియు సూత్రభాష్యము రచియింపుమని స్వయముగా నానతిచ్చెను. వ్యాసభట్టారకు నభిలాషయు నట్లేయున్నదనిపించి. గురునానతియును ప్రేరేపించుచున్నది. కావున నిఁకభాష్యయు రచింపవలయు. అందులకు బదరికారణ్యము కడు బవిత్రమైనది. అది యేకాంతప్రదేశము. అందలి మహర్షులీ కార్యంబునకు సహాయ్యము సేయుదురని పలుకుచు శుభముహూర్తంబున శిష్యులతో

బయలువెడలి యుత్తరాభిముఖుండై యొకచో నత్యుష్ణమై యొకచో నతిశీతలమై యొకచో వక్రమై యొకచో నత్యంతకంటకమై మూర్ఖచిత్తంబువలె నొప్పుచున్న మార్గంబున నడచుచు నవ్యయుండు నక్రియుండునగు పరమాత్మ స్వరూపుండు తానయ్యును లోక రీతి ననుసరించి పాంథులతోఁ గూడ నడుమ ఫలంబులందినుచు నీరు ద్రావుచుఁ గూర్చుండుచుఁ బండుకొనుచు నతిప్రయాసమునఁ గతిపయ ప్రయాణముల బదరికా రణ్యమున కరిగెను.

అందు గంగా ప్రవాహశీకర పరంపరోద్ధూతములగు వాతపోతంబులచే గమనాయాసంబుఁ బాయఁజేసికొని శంకరుండు శిష్యవర్గంబుతోఁ గూడ నందలి ముని బృందములచేత నర్చితుండై తద్గోష్ఠీ విశేషంబులచేఁ గొన్ని దినంబులఁ గడపెను.

## భాష్య ప్రచారము

శ్రీ శంకరాచార్యశేఖరుండా బదరీవనంబునఁ బండ్రెండవ యేట సమాధి నిష్ఠులగు బ్రహ్మఋషులతోఁ గూడ బహుమా రుపనిష దర్థంబుల విమర్శించి షడూర్ముల చేతను సప్తధాతువులచేతను, విషయ పంచకముచేతను, అంతఃకరణ చతుష్టయముచేతను, అభివ్యక్తమగు శరీరతత్త్వ మెఱింగించుటకై భవ్యంబై మధురంబై గంభీరార్థ యుక్తంబై యొప్పునట్లు సూత్రభాష్యము రచించెను.

గీ. కరగతంబగు నుసిరిక కాయవోలె
మేటి యద్వైతతత్త్వంబుఁ దేటపరచి
నిరసితాజ్ఞానమై మనోహరతనొప్పి
శంకరాచార్యసూత్ర భాష్యంబుదనరె.

మఱియు నందయ్యతిచంద్రుండు బ్రహ్మవిద్యాప్రతిపాదకంబులగు నీశ కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీ, యైతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యాద్యుపనిషత్తులకును మహాభారత సారభూతంబులగు గీతలకును నిరవద్యములైన భాష్యంబుల రచించెను. వానినేకదా ప్రస్థానత్రయమని వాడుదురు. పిమ్మట భారతమునకు సనత్సుజాతీయమను వ్యాఖ్య రచించెను. తరువాత నుపదేశసహస్రికా గ్రంథముల నసంఖ్యాకముల రచించి విద్వజ్జన గీయమానుండై పరమార్థోపదేశంబున లోకోపకారంబు గావించెను. శంకరుండను దినకరుండుదయించి ప్రకాశింపుచుండఁగ కుమతి ప్రణీతంబులగు వ్యాఖ్యాంధకారంబులు దుర్వాదిచంద్ర ప్రభతోఁ గూడ నాశనము నొందినవి. శంకరుండట్లు భాష్యములరచించి తన శిష్యులకుఁ బాఠములఁ జెప్పి తదర్థముల నెల్ల జక్కఁగా బోధించెను. నిరుపమాన భక్తి విశ్వాస సముచిత చిత్తుండగు

సనందనునకి సూత్రభాష్యమును మువ్మారు పఠింపఁజేసి యందలి గూఢార్థము లెల్ల వివరించి వక్కాణించెను. దానంజేసి వామదేవాది శిష్యులు నను యాచార్యులును సనందనునియం దెక్కుడు పక్షపాతము గలదని మనంబులందుఁ జింతిల్లుచుండిరి. తదభిప్రాయముల గ్రహించి శంకరాచార్యుం డొకనాఁడు సనందనుని భక్తివిశేషమితర శిష్యుల కెఱింగింపఁదలంచి సనందనుండు గంగానది కవ్వలి యొడ్డున నుండఁగా వత్సా ! సనందనా ! వేగముగా నిటురమ్ము ? పనియున్నదని కేకవైచెను.

గురువచనము వినినతోడనే సనందనుండు దురంతమగు సంసార సాగరమునే దాటింప సమర్థమగు గురుపాదభక్తి యీ చిన్ననదిం దరింపఁజేయదా ? యని నిశ్చయ భక్తి విశ్వాసములతో గంగానది నీటిపై వడివడి నడుగులిడుచు నడువఁదొడంగుటయు నత్తటినీవరం బతని యడుగుల పద్మంబుల నూతగా నిల్పినది. దృఢ భక్తి తాత్పర్యములతో నప్పద్మంబులం బాదంబు లిడుచుఁ గ్రమముగాఁ దన యొద్ద కరుదెంచిన సనందనునిం గాంచి యానంద విస్మయ కందళితహృదయారవిందుండై యయ్యతిచంద్రుం డతని గౌఁగిలించుకొని యవ్విశేష మెల్లరకుం దెలియఁజేయుచు వానికిఁ బద్మపాదుం డను సన్వర్థ నామధేయం బొసంగెను. నాటంగోలె యమ్మేటి పద్మపాదుండనఁ బరఁగుచుండెను.

శంకరయతి యొకనాఁడు శిష్యగణంబునకు భాష్యము పాఠము జెప్పుచున్న సమయంబున పాశుపతాదిభేదవాద మతస్థులు తద్భాష్యమును బూర్వపక్షము నేయుట శంకరుండు ప్రత్యుదాహరణ పూర్వకముగాఁ దదాగమముల మథింపుచుఁ గులిశ కఠినంబులగు తర్కప్రహరణంబులచేఁ ద్రుటిలో వారిని గాందిశీకులం గావించెను. అట్లు శంకర కంఠీరవంబు వేదాంతకాంతారంబున సంచరింపుచుఁ దీక్ష్ణములగు యుక్తి నఖాగ్రదంష్ట్రలచే భయంకరమై కుమతవాది మత్తగజంబుల మదం బడఁగింపుచుండెను. ఘర్షణచ్ఛేదన తాడనాములచే సువర్ణంబు మెరుగుఁజెందెడి పగిది వాదులచే మథింపఁబడిన శంకరభాష్యంబు మిక్కిలి ప్రఖ్యాతి నొందినది. తద్భాష్యామృతమును గ్రోలి పద్మపాదాది శిష్యు లొకనాఁ డిట్లు సంభాషించుకొనిరి.

పద్మపాదుఁడు.—వామదేవా ! మన గురువరుని యాత్మనిష్ఠాతిశయత్వమునకుఁ బరితుష్టి వహించి విశ్వనాథుండు శారీరక సూత్ర భాష్యమును రచింపుమని స్వయముగా నానతిచ్చెనుగదా ! అమ్మహానుభావుం డట్టి భాష్యమును రచించి కుమత పంకనిర్మగ్నమై వ్యాసమహర్షిచే లేవనెత్తఁబడిన శ్రుతిలక్షణమగు వృద్ధధేనువును భాష్య సూక్త్యమృత సేచనంబున సేదదేర్చి ప్రబలఁజేసెను. గాంచితివే ?

వామదేవుఁడు.—అన్నా ! శంకరదుగ్ధ వార్ధింబొడమి విబుధుల కమృత మిచ్చుచు గోసమూహంబున గుమతాంధకారంబుల నడఁగించు భాష్యచంద్రునిం బడసి నిర్వచకోరముల సంతోషపరచుట యబ్బురమా !

పద్మ—అగు. శంకరార్యుని భాష్యార్థపథ సజ్జనహృదయాబ్జములఁ బ్రకాశింపఁజేయుచు దమస్సముదయంబుల విదళింపుచుఁ బ్రతివాది ఘూకములఁ జీకాకు నొందించుచు బ్రకాశించుచున్నదిగదా?

వామ—గంగా ప్రవాహము పద్మనాభుని పాదంబునం బుట్టి సేవించిన వారిని ముంచుచున్నది. సూత్రభాష్య ప్రవాహము శంకరుని వక్త్రంబునం బొడమి సేవించిన వారిం దేల్చుచున్నది ఇది యంత కన్న నెక్కుడుకాదా?

పద్మ—వ్యాసమహర్షి సూత్రకలితములగు న్యాయరత్న మాలికల నమ్మ దెచ్చిన సర్థలాభముఁ బడయమింజేసి బుధులు చిరకాలము గొనలేకపోయిరి. ఇప్పుడీ యతిపతి వలన సర్థాప్తిఁబడసి తత్సూత్రరత్న మాలికచేఁ బండితులు పండితు లగు చున్నారు. వ్యాసుండును గృతార్థుండయ్యె. అహా? శంకరగురుని యౌదార్య మెంత యాశ్చర్యకర మైనదో చూచితివా!

వామ—బాగు. బాగు. లెస్సగా వర్ణించితివి! మఱియు వేదబాహ్యులచే మిథ్యా వ్యక్తియని దూరముగాఁ ద్రోయఁబడి భట్టప్రభాకరాదులచే గర్మవియోజ్యుఁడగు పురుషునిం బరివర్జింపఁదగునని పీడింపఁబడి పదార్థవంచనలం జేయు నైయాయికాదులచే మృదువుగాఁ గ్లేశము నొందింపఁబడిన యుపనిషద్వని మన శంకరగురుని శరణుఁజొచ్చి పరమానందమును బొందుచున్నది. అరసితివా?

పద్మ—తదభివ్యక్తుండగు పరమపురుషునిఁ జంపుటకై బౌద్ధుండు తరుముగాఁ గణాదుం దద్దమువచ్చి యాత్మలాభము గలుగఁ జేసి యా వెరపుడిపెను. పిమ్మట భట్టపాదుండు నిజపదగమనమునకు మాత్రము మార్గముఁ జూపెను. తరువాత సాంఖ్యులు దుఃఖమును బోగొట్టిరి. పాతంజలులు ప్రాణధారణంబున నతనికిఁ బుజ్యత్వముం గలుగఁజేసిరి. ఇట్లు పెక్కు చిక్కులఁబడిన పరమపురుషునిఁ గరుణచే మన శంకరగురుండు పరేశునిగాఁజేసి యానందముఁ గలుగఁజేసెను.

అని బ్రహ్మసూత్రభాష్యమును పెక్కు తెరంగుల స్తోత్రములు సేయుచు వారు నిష్క్రమించిరి.

# వ్యాసదర్శనము

మరియొకనాఁడు శంకరయతిచంద్రుండు గంగానదీ సమీపంబునం గూరుచుండి సూత్రభాష్యము శిష్యులకుఁ బాఠముఁ జెప్పుచుఁ దదీయశంకల కుత్తరంబులు సెప్పుచుండఁ గుతపకాలంబగుటయు నలసి స్నానముఁ జేయుటకై లేవఁ బ్రయత్నించు చున్న సమయంబున నొక వృద్ధబ్రాహ్మణుం డచ్చోటికి వచ్చి దండంబూతగాఁబూని శంకరాభిముఖుండై నిలువంబడి అయ్యా! నీవెవ్వండవు? శిష్యుల నేమి చదివింపుచుంటి వని యడిగెను. అప్పుడు శిష్యులా బ్రాహ్మణునితో నాన్నా! ఈయన మాయాచార్యుండు,

సమస్తోపనిషత్స్వతంత్రుండైన యీ శంకరాచార్యుని ప్రభావము మీరు వినియే యుందురు. దూరీకృతభేదవాదముగా నిమ్మహానుభావుండు బ్రహ్మసూత్రములకు భాష్యముఁజేసె యది మాకుఁ బాఠముఁ జెప్పుచున్నాఁడు అని చెప్పిరి.

ఆ మాటలువిని యా వృద్ధబ్రాహ్మణుండు ఏమేమీ! మీ గురుండు సూత్ర భాష్యమునే రచించెనా! అయ్యారే! ఎంతచిత్రము! బాపురే! ఎట్టి మాటవింటిని! భళిరే! ఎట్టి పండితునిం గనుఁగొంటిని! ఆహా! నేఁడెంత సుదినము. అని పెక్కు తెరంగుల విస్మయమభినయించుచు శంకరునితో, స్వామీ! మీరు సూత్రభాష్యమును రచించితిరని మీ శిష్యులు చెప్పుచున్నారు. మీ ప్రజ్ఞాప్రభావంబు లనన్యసామాన్యములని కొనియాడఁ దగినదే! ఏదీ! ఒకసూత్రమును జదివి యర్థమును జెప్పుఁడు! మీ సామర్థ్యమెట్టిదో విని యెదంగాక యని యడిగిన శంకరుడిట్లనియె. అయ్యా! నేను సూత్రార్థముల లెస్సగా నెరిగినవాఁడనని చెప్పుకొనఁజాలను. సూత్రార్థవేత్తలను గురువులఁగా నెంచి నమస్కరింపుచు నాయెరింగినంత వక్కాణించెద. ఏ సూత్రమున కర్థముఁ జెప్పవలయునో తమరే వ్యాకుచ్చుఁడు. అని ప్రత్యుత్తర మిచ్చెను. అప్పుడాబ్రాహ్మణుండు, యతీంద్రా! మీ మాటలకు సంతసించితిని. వినుము. మూఁడవ యధ్యాయములో మొదటి సూత్రము.

సూ॥ తదంతర ప్రతిపత్తౌరంహతి సంపరిష్వక్తః ప్రశ్ననిరూపణాభ్యాం.

ఈసూత్రమునకు భాష్యములోనెట్టి యర్థము వ్రాసితిరో వక్కాణింపుఁడు. అని యడుగుటయు శంకరుండు తదంతర ప్రతిపత్తౌ రంహతి సంపరిష్వక్తః ప్రశ్ననిరూపణాభ్యాం- అని పదవిభాగముజేసి జీవుఁడు ఎందువిషయములనుభవింపక యవసానమును అనగా మరణసమయమున దదంతర ప్రతిపత్తౌ దేహాంతర సంప్రాప్తియందు [illegible] సంపరిష్వక్తం దేహబీజములగు భూతసూక్ష్మములతోఁ గూడికొని వెళ్ళు చున్నాడు. ప్రశ్న నిరూపణాభ్యాం ఈ యర్థము ఛాందోగ్యశ్రుతియందుగల గౌతమ జైమినులయొక్క ప్రశ్నోత్తరములచేఁ బ్రఖ్యాతమగుచున్నది.

ప్రశ్న—వేత్థయథా పంచమ్యామాహుతావాపః

ఉత్తరము—పురుషవచసో భవంతి.

ఆకాశము, మేఘము, భూమి, పురుషుఁడు, స్త్రీ, వీని నైదగ్నులుగా నిరూపించి ఈ యగ్నులయందు అపః అనగా శ్రద్ధ చంద్రుడు వర్షము అన్నము రేతస్సు. వీని నైదింటిని నాహుతులుగా నిరూపించి ఈయాహుతుల నాయగ్నులయందు హోమము సేయగా నేమగును! అని గౌతముఁడు ప్రశ్నవేయగా జైమిని పురుషవచసో భవంతి. పురుషుఁడని పిలువఁబడుచున్నాడు. అని యుత్తరమిచ్చెను. అనగా జీవుడు. దేహాంతరప్రతిపత్తికై దేహమునకు విత్తనములైన భూతసూక్ష్మములతోఁ గూడికొని తొలుత నాకాశములో శ్రద్ధారూపముగాఁజేరి (అనగా వివేకానుసారముగాననుట) చంద్ర కిరణముద్వారా మేఘములయందుం బ్రవేశించి వర్షరూపముగా భూమికివచ్చి అన్న

రూపముగాఁ బురుషుని యందు ప్రవేశించి రేతోరూపముగా స్త్రీగర్భములోఁజేరి పురుషుఁ డగుచున్నాడు. ఈయర్థమునే సూత్రకారులు వ్రాసిరని శ్రీశంకరాచార్యులు చెప్పఁగా విని నవ్వుచు నావృద్ధబ్రాహ్మణుఁడు ఓహోహో! నీ భాష్యము చాల బాగున్నది. ఇది యెక్కడి యర్థము; ఎక్కడికల్పన చాలు! చాలు! అని యాక్షేపించుచు దేహాంతర ప్రతిపత్తియందుఁ గర్మవశంబున వృత్తిలాభము. వ్యాపులగు నింద్రియములకు నాత్మకుఁ గూడ గలుగుచున్నదా! కేవలము ఆత్మకే కలుగుచున్నదా? ఇంద్రియములు దేహము వలెనే క్రొత్తవియేకదా! అక్కడక్కడ భోగస్థానమును బుట్టించుచున్నవి. లేక మనస్సునైన జెప్పికొనవచ్చును. అదియట్లుండ చిలుక యొకచెట్టు నుండి మరియొక చెట్టునకెగిరిపోవునట్లు జీవుఁడు ఒకదేహమును విడిచి మరియొక దేహమున కెగిరిపోవునా ఏమి? దేహాంతర ప్రతిపత్తియందు నింద్రియములు జీవునితోఁ బోవుననుట శ్రుతివిరుద్ధము వినుము.

శ్రు॥ యత్రాస్యపురుషస్య మృతస్యాగ్నిం వాగప్యేతివాతం
ప్రాణశ్చక్షురాదిత్యం మనశ్చంద్రమసందిశశ్శ్రోత్రమితి॥

మృతినొందిన పురుషుని యొక్క వాక్కు అగ్ని ప్రాణములు వాయువును చక్షుస్సులు సూర్యుని మనస్సు చంద్రుని శ్రోత్రములు దిక్కులనబడును. అని శ్రుతి చెప్పుచున్నది అవి జీవునితో నెట్లుపోవును. అదియునుంగాక మీరు చెప్పినట్టి శ్రుతి యందుగల పంచమ్యామాహుతావాపః పురుషవచసో భవంతి యని నిర్ధారణ చేయుటకు వీలులేదు. ప్రథమాగ్నియందు నుదకాహుతి పరికల్పనము అసమంజసము. ద్యులోక ప్రముఖములగు పంచాగ్నులు క్రమంబున శ్రద్ధాదిరూపములగు నాహుతులకు నాధారముగాఁ బరి కల్పింపఁబడినవి. ప్రథమాగ్నికిఁ బ్రసిద్ధమగు శ్రద్ధనువిడిచి యప్రసిద్ధమగు నుదకమును జెప్పుట మీ సాహసము గాని వేఱొకటికాదు. మఱియు జీవుఁడు భూత సూక్ష్మములతోఁగూడికొని పోవుననుట మీ కల్పితము. శాస్త్రసమ్మతము కాదని వాదించుచు శంకరోక్తమును నూఱువిధముల ఖండించెను.

అప్పుడు శంకరులు చిరునగవుమొగంబునకు నగయై మెరయ, అయ్యా! తాముపన్యసించిన విషయంబులు సాంఖ్యబౌద్ధ వైశేషిక దిగంబరులయొక్క కల్పనలు గాని వేదసమ్మతములు గావు వినుండు. కేవలము జలప్రతి వచనములలోని యప్ఛబ్ద ప్రయోగమువలన నొక్క యుదకములతోనే కూడికొనిపోవుచున్నాడని చెప్పరాదు అవి కలసియుండుటచే నట్లు ప్రయోగింపఁబడినది. కేవలము ఉదకములతోఁకూడిన దేహారంభమగునా! కాకున్నను నితరభూతాపేక్షచేత నుదకము లెక్కువగా నుండుటచేత నప్ఛబ్దము ప్రయోగింపఁబడినది. అప్ఛబ్ద ప్రయోగము వలన దేహబీజములగు భూతసూక్ష్మములన్నిటియొక్క యుపపాదనము గలుగుచున్నది.

మరియు దేహాంతర ప్రతిపత్తియందుఁ బ్రాణములయొక్క గతి శ్రుతి రచితమైయున్నది.

శ్రు. తముత్క్రామంతం ప్రాణోనుత్క్రామతి
ప్రాణము త్క్రామంతం సర్వే ప్రాణా అనుత్క్రామంతి.

జీవుండు దేహమును విడిచిపోవునప్పుడు వాని ననుసరించి ప్రాణము పోవును. ఆ ప్రాణము ననుసరించి యితర ప్రాణములు పోవును. ఆశ్రయములేక ప్రాణములయొక్క గమన మసంభవము. కావున దదాశ్రయములగు భూతసూక్ష్మముల యొక్క గమనమర్థాత్తు తోచఁబడుట లేదా ? నిరాశ్రయములై ప్రాణము లెక్కడికి బోవును ? ఉన్నప్పుడెవ్వరికైనఁ గనంబడుచున్నవియా ? మృతుని వాగాదు లగ్న్యాదులఁబొందుచున్నవని చెప్పిన శ్రుతి గౌణమైనది. కాని ముఖ్యమైనదికాదు. జీవము ప్రాణోపాధిశూన్యుఁడై యరుగునని చెప్పుటకు వీలులేదు. దేహాంతరమందుఁ బ్రాణములు లేక యుపభోగము సంభవింపదు కావున వాగాదుల కుపకారములై యధిష్ఠాతృదేవత లగుట మరణకాలమున నవి చేయు నుపకారము నివృత్తియైనది. కావున వాగాదు లగ్న్యాదులను బొందుచున్నవని చెప్పఁబడినది.

మఱియు బ్రథమాగ్నియందు బంచమాహుతియగునప్పుడు ప్రయోగింపఁ గూడదంటిరి. అట్లు ప్రయోగించుట దోషముకాదు.

అప్పుడు ప్రథమాగ్నికి హోమద్రవ్యమగు శ్రద్ధాశబ్దాది ప్రాయముగాఁ బ్రయోగింపఁబడినది. మఱియు

ఉదకములు పంచమాగ్నియందుఁబడి పురుషుఁడెట్లగునని ప్రశ్న వేయగాఁ బ్రథమాహుతికి హోమద్రవ్యమగు శ్రద్ధను బ్రతివచనముగాఁ జెప్పినచోఁ బ్రశ్న యొక్కటియు సమాధానము మఱియొకటియు కాదా శ్రద్ధజీవునియొక్క మనోధర్మమై యున్నది. అది ధర్మివలన విడదీసి హోమము చేయుట శక్యముకాదు. కావున అప్పుడే శ్రద్ధాశబ్దముచేత గ్రహింపఁదగినది. శ్రద్ధా వా ఆపః అను వైదిక ప్రయోగము వలన శ్రద్ధాశబ్దమున కప్పులనుటయందుపపత్తి చెప్పవచ్చును. పిండరూపముగా నరుగుచున్న యప్పుల సూక్ష్మత్వగుణయోగముచేత మాణవకునియందు సింహశబ్దమువలెనే వాని యందు నిష్పన్నమగుచున్నవి అని యీరీతి నుపన్యసించి వృద్ధబ్రాహ్మణుని శంకల సహస్రముఖంబుల ఖండింపుచుఁదానుచెప్పిన యర్థము స్థిరపఱచుకొనియెను. పిమ్మట శంకరుఁడు నుడివిన యర్థముల వేయు మార్గముల ఖండించి యావృద్ధబ్రాహ్మణుఁడు స్వపక్షమును రక్షించుకొనియెను. ఈరీతి వారిరువురకు నెనిమిది యహోరాత్రంబులు లేక రీతి సంవాదంబు జరిగినది. తదీయ విద్యామహత్త్వమునకు విస్మయమును బొందుచు శంకరాచార్యుండెనిమిదవనాఁడు సాయంకాలమున రహస్యముగాఁ బద్మపాదుఁ జూచి, వత్సా ఈ బ్రాహ్మణుని యాకారమునఁ జూడ సామాన్యముగాఁ గనఁబడుచున్నది. ఈతండు సకల విద్యాపరిపూర్ణుండనుటకేమియు సందియములేదు. తప్పుతోవలఁ ద్రొక్కియుఁ బ్రసంగములో యుక్తులచేఁ దన వాదమును నిలుపుకొనుచున్నవాఁడు. వీనింగెలుచుట యెట్లో తెలియకున్నయది. ఉపాయమేమని యడిగినఁ బద్మపాదుండు,

మహాత్మా ! ఈతండు బ్రాహ్మణమాత్రుండుఁగాడు. యుష్మత్పాండిత్యపరీక్షము సరయు తలంపుతో వ్యాసమహర్షి యిట్టివేషముతో నరుదెంచెనని తలంచెను. కానిచో నొరునకిన్ని దినంబులు మీతో వాదించుటకు శక్యమా ! నీవు శంకరుండవు. అతండు నారాయణుండు మీరిరువురు ప్రసంగము సేయుచుంత మాబోఁటి కింకరుల మేమి దెలిసి కొనఁగలము. మీయిరువుర ప్రసంగములు వినుచుంటిమి. పూర్వపక్ష సిద్ధాంతముల ప్రసక్తియుంచుకయు మాకు బోధపడలేదు. మీరు మహానుభావులగు మీమహత్త్వము మీకే యెరుకయని పలికిన విని శంకరుండు పులకాంకురంబులు మేనంబొడసూప నతండు వ్యాసుండుగా నిశ్చయించి నిటల తటఘటితాంజలిపుటుండై యిట్లని నుతించెను.

మ. యతిరాట్చంద్రమ ! నీకు నా రచితమౌ సద్వైతభాష్యంబు స
మ్మతమే నిస్పృహదీయ సూత్రములకు న్మన్నించి నా తప్పు ల
ద్భుత విద్యుద్విల సజ్జటామకుటమై సూర్యద్వినీకాంబు దా
యత దారుద్యుతి భాసమానమగు నీ యాకారమున్ జూపవే.

అని ప్రార్థింపనంతలో సమ్మహానుభావుండు.

సీ. కనకవల్లీ లసద్ఘనజటాతతివానిఁ
దటిదంచితాబ్ద సుందరము వాని
జ్ఞానముద్రావిరాజత్కరాబ్జమువానిఁ
బ్రవరదండ కమండలువులవాని
రుద్రాక్షమాలికా రుచిరవక్షమువాని
వసితాజినోత్తరీయంబువాని
సద్వైతతత్త్వ విద్యావేత్తయగువాని
ఛాత్రసంఘాఢ్య పార్శ్వములవాని.

గీ. నతిశయకృపాకటాక్షవీక్షామృత ప్ర
వర్షధారానివారితాప్తజనతాను
తావు విభజితనిగమకలాపుఁదాప
సనివహోల్లాసుఁ వ్యాసుఁ గన్గొనియె నెదుట.

గీ. కని వినేయులతో నెదుర్కొనితదీయ
చరణపద్మములకు మ్రొక్కి శంకరుండు
పూతచరితుని సత్యవతీతనూజుఁ
బలికెభయభక్తి వినయసంపదచెలంగ.

మహాత్మా ! నేఁడు భవదీయ దర్శనమునం జేసి మేమెల్లరం గృతార్థుల మైతిమి. పరోపకారవ్రత దీక్షితుండవైన నీకు లోకంబులం బవిత్రంబులం జేయుట యుచితంబుగదా ? ప్రశస్తార్థగర్భంబులగు సప్తాదశపురాణంబులు రచించుట నీకుంగాక యొరులకు శక్యంబే ? నిర్దుష్టముగా బస్యద్వయము రచించుట దుష్కరము కదా ? అదియునుంగాక కలియుగంబున బ్రాహ్మణులు మందబుద్ధులని యెఱింగి వేదంబుల విడదీసితివి. త్రికాలవేదివగుట భవిష్యత్కథా విశేషముల వర్ణించితివి. వేదంబులు వేదాంగములు భారతాది గ్రంథములు పురాణములు భవదీయ వాఙ్మయంబులు గదా ? నిగమంబులెవ్వని సచ్చిదానంద స్వరూపునిఁగా వర్ణించుచున్నవో యట్టి నారాయణుండవు నీవేకదాయని యనేక ప్రకారముల స్తుతియించుటయు వ్యాసుండు తదీయభక్తి విశేషంబున కుల్లాసంబు వహించి యల్లన నిట్లనియె.

యతిసార్వభౌమా ! నీవు మావలెనే ప్రఖ్యాతుండవైతివి. నీదగు సఖంత పాండిత్యము దెలిసికొంటిని శుకుండువలె నీవు నాకత్యంత ప్రీతికరుండవైతివి. శిష్యులతోఁ గూడ నిక్షభమను బొందకుము. నీవు మదీయ సూత్రములకు భాష్యము రచించి నాఁడవని చంద్రశేఖరుని సభయందు సిద్ధులవలన విని మిగుల సంతసించుచు నిన్నుఁ జూడవచ్చితి నీరచించిన భాష్యంబు నాకు మెప్పు వచ్చెనని పలికిన విని శంకరుండు హృదయంబునం బొడమిన సంతోషమున కవకాశము చాలక రోమాంచ రూపంబునఁ బొంగుచున్నదో యన మేను గగుర్పొడవ గద్గదకంఠంబుతో నిట్లనియె. మహాత్మా ! భవదీయ శిష్యులు జైమిని వైశంపాయనాది మహర్షులు లోకాతీతులై యున్నవారలు. వారి యెడ నేనెంతవాఁడ నిట్టి దీనుని యందు దయజూపి ప్రసన్నుడవైతివి. నీకంటె గృపాళుండు గలడా ! ఆహా ! సకల నిగమశేఖరార్థ విశేషకమగు భవదీయ సూత్రచయమునకు సహస్రాంశునకు భాష్య ప్రదంబున నీరాజనమిచ్చి యధికుండనని గర్వపడుచుంటి నెంత సిగ్గులేదో కదా ! అయినను భవదీయ శిష్య ప్రశిష్య భావబుద్ధిం జేసి యీ సాహసంబునకుం బూనుకొంటి. కావున నాదరంబున మదీయ సూక్తిదురుక్తి జాలంబుల సవరింప వేడుకొనుచున్నాఁడనని పలుకుటయు నప్పారాశర్యుండనురాగముతో శంకరుని చేతిలో నున్న పుస్తకమును రెండు చేతులతో స్వీకరించి గంభీర గుణంబులచే మనోహరంబై యున్న యా భాష్యమంతయు లెస్సగా విమర్శించెను. సూత్రానుసారములగు మృదువాక్యములచే నర్థములం దెలుపుచు స్వపద విశేషంబు చేతనే పూర్వపక్షముల నిరాకరింపుచు సిద్ధాంత యుక్తిప్రయుక్తులచేఁ దదర్థంబు నిలుపుచు నొప్పుచున్న యా భాష్యమంతయుం జూచి పరమానందము నొంది సత్యవతీ నందనుండతని కిట్లనియె.

తాతా ! శంకర ! గురువినీతుండవగు నీ విషయమేమియు సాహసముం జేయలేదు గాని మదీయ సూక్తిదురుక్తి జాలముల సవరింపుమని నన్నడుగుటయే సాహసమని తలంచెదను. మీమాంసకాగ్రేసరుండవై సకల వ్యాకరణంబులను బూర్తిగ

నెఱింగితివి. అవియునుంగాక గోవింద శిష్యుండవైన నీ ముఖమునుండి దురుక్తికాలమెట్లుగా వచ్చెడిని నీవు ప్రాకృతుఁడవు గావు. సకలార్థముల నెఱింగిన మహానుభావుండవు. బ్రహ్మచర్యమునుండియే సన్యసించి సూర్యుం డంధకారంబువగిది విషయసుఖంబులఁ బరిభవించితివి. బహ్వర్థగర్భంబులు గూఢ భావంబులు నగు మదీయ సూత్రములను వివరింపనీకుఁగాక యొరులకు శక్యమా! స్వభావముచేతనే తెలియశక్యముగాని యా సూత్రముల కర్థముల నెవ్వఁడెఱుంగును. సూత్రకర్తక్లేశము కన్న భాష్యకర్తకష్టమెక్కుడని దేవతలు చెప్పియున్నారు. మదీయభావంబుల నెఱింగి సాంఖ్యాది శాస్త్రములచే విపరీతమై యున్న వేదాంత మార్గమును జక్కఁబరచుటకు సమర్థుండవగు నీకుఁగాక యొరులకు శక్యమా? సర్వజ్ఞా! మదీయ సూత్రజాలమున కింతకుఁబూర్వమెందఱో పండితులెన్నియో వ్యాఖ్యానములు రచించి యున్నారు. ఒక్కటియైనను నీ భాష్యమువలె మదీయహృదయానుగుణ్యమై యుండలేదు. నీ వన్నిటికిం జాలినవాఁడవు. గావున వేదాంత విద్యను బుడమియంతయు వ్యాపకము సేయుము. భేదవాదులగు విద్వాంసుల నోడింపుము. సానుబంధములగు గ్రంథముల రచింపుము. నీకు విజయమగుంగాత నేను పోయి వచ్చెదనని పలుకుచున్న వ్యాసునకు వినయపూర్వకముగా శంకరుండిట్లనియె.

స్వామీ! నీ యనుగ్రహంబున భాష్యములఁబెక్కు రచియించితిని. శిష్యుల బఠింపఁజేసితిని కుమతవాదుల నోడించితిని. ఇక నాకుఁగర్తవ్యమేమి యున్నది? ముహూర్తమాత్రంబీ మణికర్ణికాక్షేత్రంబున వసియింపుఁడు. మీ మ్రోలను బ్రాణంబులువీడి కైవల్యంబు నొందెదను కాలంబు సమీపించియున్నది. ఆజ్ఞయిండని పలికిన విని వ్యాసభట్టారకుండొకింత చింతించి సౌమ్యా! అట్లు కావింపవలదు. ప్రౌఢ విద్యాశాలులగు పండితులు గొందఱు పుడమియందద్వైత విద్యా విరోధకులై యున్నవారలు వారి నెల్లర జయించు నిమిత్తము కొంతకాల మీ పుడమియందు నీవుండవలయును. లేనిచోఁ దల్లిలేని పిల్లవాని యునికివలె మోక్షేచ్ఛ దుర్లభమగును.

యతివరేణ్యా! ప్రసన్న గంభీరార్థములతో నొప్పుచున్న భవత్ప్రణీతంబగు భాష్యప్రబంధంబుఁ జూచుటవలనం గలిగిన యానందము నీకు వరమిమ్మని నన్నారక ప్రేరేపించుచున్నయది. ఎనిమిది యేండ్లు యాయువు నీకు విధినిరూపితమై యుండఁ నీ బుద్ధిబలంబున మరియంతయాయువు సంపాదించుకొంటివి ఇటువిమ్మట వెండియుం బదియాఱేఁడుల యాయు వీశ్వరాజ్ఞచేఁ గలుగునట్లు నీకు వరమిచ్చితిని నీరచించిన భాష్యం బాచంద్రతారకంబై వసుధరఁ దిరంబై యుండుగాక. నీవీ పదియాఱేఁడులలో దేశాటనము చేయుచు. విరోధిగర్వాంధకారంబుల నిర్మూలింప జాగరూకంబు

లగు యుక్త్యనీకములచే నద్వైత విద్యాపరిపంథులగు భేదవాదుల నభేదబుద్ధులం గావింపుము. అని పలుకుటయుం గుఱుకుచు నయ్యతితిలకుం డిట్లనియె.

స్వామీ ! పరసవేది సంపర్కంబున లోహంబు బంగారమైనట్లు తావక పదీయ సూత్రసంబంధ వశంబున జేసినా భాష్యంబు పన్నెకెక్కి ధరణిజిజ్ఞాసువారంబు వహించుచున్నయది. నాపుణ్యమేమని చెప్పవలసినది. ఏపగ యుజ్జ్వలట్లోపట్లగావించి కృతార్థుండయ్యెదనని పలికి యతని పాదంబులకు నమస్కరించెను. అవ్వ్యాసుండును దతని దీవించుచు సద్వరంబులిచ్చి యంతర్ధానంబు నొందెను. నద్వ్యాసగమనంబునం సంతాపంబు కొంతసేపు స్వాంతంబున నుంచి శంకర యతికాంతుడు పిమ్మట వ్యాస శాసనంబునం జేసి దిగ్విజయంబు సేయ నిశ్చయించి శిష్యసహితముగా శుభముహూర్తంబున గాశీపురంబు బయలువెడలి కతిపయ ప్రయాణంబుల బోలుత ప్రయాగకరిగి తన్మహాత్త్వంబంతయుఁ గరణగోచరము జేసికొని పద్మపాదునితో నిట్లనియె.

వత్సా ! పద్మపాద ? యిమ్మహాక్షేత్రం బొకదినంబున వసించిన వారికి యాగంబులకన్న ప్రకర్షఫలం బిచ్చునది కావున బ్రయాగ యను యన్వర్థనామంబు వహించుచున్నది. మునింగినవారి దేహంబుల సితాసితంబుల జేయు తలంపుతో నిందు మందాకిని కాళిందీనదితో గలసికొనుచున్నది చూచితివా? యిందు మునింగిన మనుజులు దివ్య శరీరముల దాల్చి యాధివ్యాధుల నెఱుంగక పరమసౌఖ్యంబుల నొందుదురని వేదములో జెప్పబడియున్నది సుమీ ! మాఘమాసంబున మకరంబున హిమకరుం డున్న తరి నీతక్షేత్రప్రభావం బింతయని వక్కాణింపదరంబుగాదు. ఇమ్మహానది పురవిరోధి జటోపరోధంబునం గోపించి తజ్జటావరోధంబు తనకు గలుగునని యెఱుంగక యట్టి వాంద్రం బెక్కండ్రను సృష్టింపుచున్నది కంటివే ? జన్మప్రకృతులు రాబోవునది యెఱుంగవుగదా? తేసునాపగ, సన్మార్గవర్తన ప్రసక్తిగలది యైనను నిత్యము నపవిత్రములగు నస్థుల నేమిటికి స్వీకరింపుచున్నదో తెలిసికొంటివా ? ఇందుమునుంగు సజ్జనుల దేహము లలంకరించు తలంపుతో సుమీ! అని యనేక ప్రకారంబుల దన్మహాత్త్వమగ్గించి శిష్యుల కెఱిగించుచు నయ్యతిసత్తముండు త్రివేణికరిగి శాటీపటంబు కటిం బిగియించి వేణుదండంబు పైకెత్తియఘమర్షణ స్నానము లాచరింపుచు దన్నుగన్న తల్లిని స్మరించుకొనుచు ననుష్ఠానంబు దీర్చికొనిన పిమ్మట గల్హారశీతలంబులగు వాత పోతంబుల సేవించి హాయిసేయ శిష్యులతో ననేక కథాకాలక్షేపము సేయుచు గొంత సేపు తత్తీర సైకత తలంబున విశ్రమించెను.

# భట్టపాదుని కథ

సీ. వేదమెక్కడటంచు వాదించి యెవ్వాడు బెనుకొండ తుదినుండి పృథివి కుఱికె
సురగణంబెవ్వాని కరుణచేత మహావిరాగంబురసు దృష్టి బడసెమిగుల
ధరణిసర్వామ్నాయ తంత్రస్వతంత్రుడై యేసూరికీర్తినెల్లెడల నిలిపె
బటుశక్తిబౌద్ధచార్వాకాదిమతముల దండింప జేసెనే పండితుండు.

గీ. అట్టి శ్రీ భట్టపాదుండు ప్రాప్తమైన
గురుమథన దోషమును బాపుకొనుట కిప్పు
డురుతుషాగ్నిం బ్రవేశించు చున్నవాడు
అహహ ! విజ్ఞానపరమార్థ మగుటజేసి.

అని యెవ్వరో చెప్పుకొనుచుండ విని యదరిపడిలేచి శంకరుండు శిష్యులతో గూడ నమ్మహాత్ముండెక్కడ నెక్కడనని యడిగి తెలిసికొని సత్వరముగా నచ్చటికింజని యంతికప్రోగుగాసిడిన యూకపై శయనించి యందుంచిన యనలంబును ప్రథిత ప్రభావులగు ప్రభాకరాది శిష్యులు చుట్టునుం బరివేష్టించి కన్నీటిధారలచే దడుపుచుండ ధూమాయమానంబగు తదనలంబున నొడలెల్ల గమలినను వదన కమలంబు మాత్రము వికాసస్వాస్యమంగాక యొప్పుచున్న యబ్భట్టపాదుం గాంచెను. వేదమార్గ రక్షకుండగు నా సూరి రేవణ్యుండును దూరంబున నోరచూపులచే దన దెసకరుదెంచు నప్పారికాంక్షింగాంచి యతని నంతకుమున్న జూచి యెరుంగకున్నను దదీయప్రఖ్యాతి వినియున్నవాడు గావున గురుతు పట్టి పట్టరాని సంతోషంబుతో దుషానలబాధం బాటింపక తన శిష్యగణంబులచే శిష్యులతోగూడ శంకరాచార్యున కిచ్చగింపకున్నను నపూర్వాతిథిసత్కారముల గావింపజేసెను. అట్లచ్చితుండై శంకరుండు గుశల ప్రశ్నానంతరంబున దనరచించిన సూత్రభాష్య మా విద్వాంసునకు సంక్షేపముగా జదివి వినిపించెను. దాని విని విస్మయమునొందుచు నప్పండిత పురందరుండు ఆహా ! భవదీయ భాష్య ప్రభావంబు వర్ణింప నాకశక్యమైన వశంబా; అందు మొదటి యధ్యాయ సంబునంగల నిబంధన లేశమాత్రములే? అది యొకండే యెనిమిదివేల వార్తికములతో నొప్పియుండవలయుం గదా ! నేనీ దీక్షయే వహింపకుండినచో నీ భాష్యంబునకు సద్వార్తికంబు రచియించి కృతార్థుండ గాకపోవుదునా ! అట్టి యోగము నా కేల తటస్థించును. అది యట్లుండె మీవంటి మహాత్ముల దర్శనమగుటయే దుర్ఘటము. విశేషించి యట్టి సమయంబున లభించుట మదీయపురాకృత భాగధేయంబు గదా ! సంసారసాగరంబున మునింగియున్నవారిం దరిజేరుటకు మీవంటి యుదార వృత్తుల సాంగత్యముగాక మఱియొక సాధనమేమి యున్నది. చిరకాలమునుండి మిమ్ము జూడ వలయునని నాకు దలంపు గలిగియున్నది. నేడుగదా నా మనోరథము సఫలమైనది. నరులకీ సంసారంబున సభిమతంబు దీరుట దుర్ఘటము. కాలం బొకప్పుడు మంచియు

నొకప్పుడు చెర్దయుం గలుగఁ జేయును. ఒకప్పుడు కలఁగజేసి విడఁజేయును. పెక్కు-లేల ! సుఖాసుఖంబులు కాలకృత్యములు గదా !

ఏను వేదమునకు గర్మమార్గము నిర్ణీతముసేసితిని నైయాయికుల యుక్తి జాలముల ఖండించితిని విషయ సుఖంబుల ననుభవించితిని. కాని యీ కాల ప్రవృత్తిని మాత్రమతిక్రమింప లేకపోయితిని. సరులకుగాలానుగుణ్యమైన బుద్ధి పొడముచుండును. వేదంబులకు స్వాతంత్ర్యము కల్పించి యీశ్వరు నిరాకరించితి. గురుద్రోహంబు గావించితి నీ రెండు పాతకంబుల బాయుటకై తుషానలంబు బ్రవేశించుచున్నవాడనని పలికిన విని శంకరుడతి విస్మయము జెందుచు మహాత్మా ! నీవు గురుద్రోహమేమిటికి గావించితివి. తద్వృత్తాంతము వక్కాణింపుమని యడిగిన నతండిట్లని చెప్పదొడంగెను.

## భట్టపాదుని పూర్వ వృత్తాంతము

ఏను జనించు వరకు జగంబంతయు బౌద్ధమతము వ్యాపించియున్నది వైదిక తంత్రములాకాశ కుసుమంబులై యున్నవి. అట్టియెడ నేను స్వల్పకాలములో వేద వేదాంగముల జదివి క్రమ్మర వేదమార్గము నక్కఁజేయవలయునని తలంపుతో సద్ధతులైయున్న సుగతు బరాజితులం గావించినంగాని యిట్టిపని నెరవేరదని నిశ్చయించి యచ్చటచ్చట వారితో బ్రసంగములు సేయుచుంటిని గాని తదీయమతశాస్త్రప్రవృత్తి దెలియమింజేసి నాకు వారితో మాటాడుటయే దుర్ఘటమైనది. అప్పుడు నేను వినీతవేషముతో నొక బౌద్ధమతగురువు నొద్దకుబోయి అయ్యా ! నేను బౌద్ధమతస్థుండ దచ్ఛాస్త్రంబులన్నియు నాకు బోధింపుడని వేడుకొనిన నిక్కువమనుకొని యాసుగత గురువు తన శిష్యులతో గూడ దన్మతమర్మంబులన్నియు నాకు బోధించెను.

ఒకనాడాసభయందు దుష్టబుద్ధిగల బౌద్ధుడొకడు నిలువంబడి యోహో ! వేదములు ప్రత్యక్షప్రమాణ విరుద్ధముగా నీశ్వరుడెవ్వడో యున్నాడని చెప్పుచున్నవి. తద్వాక్యమెంత సత్యమో చూచుడు ఉన్నవాడు కనబడకుండునా ! మొదట గర్మ చేయుమనిచెప్పి తరువాత గర్మతో నేమియు బ్రయోజనము లేదని చెప్పుచున్నది. సీ ! యింతయసత్యవాది యెందైన గలదా ! యిట్టి దానిమాట ప్రమాణముగా దీసికొని జీవ హింసల జేసెడు వైదికుల నేమి చేసినను దోసము లేదు కదా ! ఓటటా ! యింత పాడుశాస్త్ర మెందునులేదు. వైదికులంజూచిన మహాపాతకములు గాగలవు అని యూరక వేదదూషణచేయుచు నుపన్యాసము జెప్పెను.

ఆ మాటలు విని తథాగతులందరు జయబుద్ధా ! యని పలుకుచు గరతాళంబులు వాయించిరి. కర్ణకఠోరంబులగు నా వాక్యములు నేను వినలేక చెవులు మూసికొని కన్నీరు విడువజొచ్చితిని. అప్పుడు నా ప్రాంతమందున్న బౌద్ధశిష్యులు నా దుఃఖమును జూచి శంకించుకొనుచు దమగురువుతో, అయ్యా ! వీడెవ్వడో వైదికుండట్లు

తోచుచున్నాడు. మన మతధర్మములం గ్రహింపవచ్చెను గాబోలును. వేదనిందా వాక్యంబులు విని యుబ్బక కన్నీరు విడిచినాడని యతనికి బోధించిరి. అది మొదలా యుపాధ్యాయుడు నా యందు నమ్మకము విరచి మర్మముల జెప్పుమానుటయేకాక యొకనాడు నేను నిద్రించుచుండ నెత్తుగల మేడపై నుండి నన్ను నేలంబడ ద్రొబ్బించెను. పడియెడు సమయంబున నాకు దెలిసివచ్చినందున వేదమే ప్రమాణమైనచో నేను పతన బాధంబొరయక జీవింతునని పలికితిని. ప్రమాణమైనచో నని సందేహపూర్వకముగా బలుకుట జేసి నా కేమియు దెబ్బ తగులక యొక కన్ను మాత్రము పోయినది. అది విధి కల్పనయని నిశ్చయించి నేను సుగతమతమర్మము లన్నియుం గ్రహించియున్నవాడ గావున బౌద్ధుల నవలీల జయింప సామర్థ్యము గలిగియున్నందున వారిం బరిభవింపు నుపాయం బాలోచించి యప్పుడు రాజుగానున్న సుధన్వునొద్దకుం బోయితిని. బౌద్ధులా మహీపతి గృహంబున శిష్యప్రశిష్య సహితముగా బ్రవేశించి యతనికి స్వమతబోధయంతయుం జేసి వైదికుల జేరనీయవలదని జెప్పియున్నను మదీయ విద్యాపాటవంబు దేటపరచి యతని మన్ననలం బడసితిని.

బౌద్ధమతస్థులచే నిండియున్న యప్పేరోలగంబున నాన్నృపాలుని మ్రోల నేను వసియించి యున్న సమయంబునఁ దత్సమీపవిటపి నాశ్రయించియున్న కోకిల యొకటి మనోహరముగాఁ గూయుటయు నారవము నెపముగాఁ జేసికొని యీ పద్యమునుం జదివితిని.

క. పికమా! నీ కల శ్రుతిదూషకదుర్ఘోషకములు మలిన సంగతిగలనీ
చక కాకవితతిరతిగలుగక యున్నం బొగడఁబడుదు గాదె ధరిత్రిన్.

అని చదువుటయు భావగర్భితమైన నా పద్యమును విని షడభిజ్ఞులు చరణ తాడితంబగు భుజంగమంబు పగిది రోజుచు ఔరా! యీ వైదికుండీ సభాంతరంబున నిర్భయుండై యెంతమాట పలికెను! మనను కాకులమంట మనసాంగత్యము లేనిచో నీ రాజు స్తోత్రపాత్రుండగునట. ఎట్టి మాటలవింటిమి! వీనిం బరిభవింపక పోనీయరాదని పలుకుకొనుచు సంనద్ధండులైన వారలు నాతో నప్పుడు ప్రసంగమునకుఁ బూనుకొనిరి. నేనును సద్దండిపాండిత్యప్రకర్షంబుఁ జూపి యుక్తికుఠారంబున బౌద్ధ సిద్ధాంత శాస్త్ర వృక్షంబుల నఱకుచు జీర్ణంబులగు తద్గ్రంథంబులింధనములుగాఁజేసి వారి క్రోధానల జ్వాలల వర్ధిల్లజేసితిని. అప్పుడు బౌద్ధులు మోములు జేవురింపఁ దెంపుతో నా వాక్యంబులు పూర్వపక్షంబులఁ జూపుచుయు నేనవలీలగా సిద్ధాంతముఁ జేయుచుండగా నప్పుడు పాతాళము భేదిల్లునట్లు పెనురవము బయలు వెడలినది. అప్పుడు విజృంభించి నేను తదీయసర్వజ్ఞపదంబు సహింపక కర్కశతర్కవాక్య ప్రసంగముచే వారిఁ గ్రుదుటిలో నిరుత్తరులం జేసితిని. బౌద్ధులు దర్పంబు లుడిగి యూరకున్నంతనమ్మేదినీ కాంతునకు నేను వేదప్రభావమంతయు బోధించిన విని యతండును విస్మయము నొందుచు

నిట్లనియె. ఆర్యులారా ! జయాపజయంబులు విద్యాయత్తంబులగుటం జేసి దీనివలన మతప్రాముఖ్యము తేటపడనేరదు. దైవతంత్రంబున దత్ప్రధానత్వము బరీక్షించెదకాక. ఏ మతస్థుడు కొండ శిఖరంబునుండి నేలంబడి యక్షతుండై యుండునో యాతని మతమే నాకు సమ్మతమని పలికిన విని బౌద్ధు లొండొరుల మొగములు జూచుకొన దొడంగిరి. అప్పుడు నేను చేతులెత్తి నృపాలోత్తమా! సత్వరముగా నేనట్లుజేసి మన్మత ప్రాబల్యంబు జూపించెదం బరీక్షింపుమని పలుకుచు వడివడి బోయి యొక యున్నత పర్వతమెక్కి యకల్మషుని వేదపురుషుని భక్తితో ధ్యానించుచు వేదమే ప్రమాణమైనచో నందు దైవమే కలిగియుండినచో నా కించుకంతయు దెబ్బ తగులనేరదని పలికి దుమికితిని. నిగమము తన్ను నమ్మియున్నవాని నేల రక్షింపకుండును.

అప్పుడు నేను దూదిబంతియుంబోలె నేలంబడి కనుగంపకచెక్కు చెమర్పక యుంటిని. మేఘరవంబు విని నికుంజంబుల నుండి బయట వచ్చిన మయూరంబుల చందంబున మదీయవార్త నాలించి దిక్కులనుండి పెక్కండ్రు బ్రాహ్మణు లచ్చటికి వచ్చిరి. అట్లక్షతుండనైయున్న నన్నుంజూచి యన్నరపతి శ్రుతిప్రభావంబు వేతెరంగుల గొనియాడుచు ఖలసంపర్కము వహించియున్న తన్ను పెక్కుగతుల నిందించి కొనియెను.

చ. అకట! మహాప్రభవ సముపంచితమున్ నిగమంబునట్టి నా
నికిఁగల సారముందెలియనేరక యూరకనిందసేయు నా
స్తికుల మహాత్ములంచు గణుతించి మతింబరమార్గమిగా
నక చెడిపోయితిన్ విబుధ నాథ! యటంగితి నేమి సేతుఁ గృపన్.

అని పలుకుచున్న సమయంబున నాసౌగతులా నృపతింగాంచి నరేంద్రా! ఇంతమాత్రమునకే మీరీతని మతము నవలంబింపవలదు. మంత్రౌషధ ప్రభావంబుల దేహరక్షణంబు జేసికొనవచ్చును. అంతియకాదు యిది నవరీతి కాదని పలికిన విని యబ్బక మెయి వికటభట కటీకరణముగుండై యేమంటిరి! అది కపట మైనచో మరియొక దృష్టాంతము పరీక్షించెద నంటోడిపోయిన వాని యంత్రతోపలంబులం బెట్టించి మర్దింపజేసెదనని యుగ్రముగా శపథముజేసి యొకమంచిలో గాలసర్పమునుంచి మూత పెట్టి దీనిలో నేమియున్నదో చెప్పుడని నన్నును సౌగతులను నడిగెను. అప్పుడు మేమా విషయము రేపు చెప్పెదమని యొకదినము గడువు పుచ్చుకొని యిండ్లకుం బోయితిమి. కంఠదఘ్నంబగు జలంబున నిలిచి నేనాలోకబాంధవు నారాధించితి. నన్నిగమస్వరూపుండు నాకు బ్రత్యక్షంబై వక్తవ్యాంశమును బోధించి యంతర్హితుండయ్యె. మరునాడు మేమందరము రాజసభకు బోయితిమి. రాజు మమ్మందరి వస్తువెద్దియో చెప్పుమని యడిగిన బౌద్ధులు భుజంగమందున్నదని చెప్పిరి అప్పుడు నేను భోగిశ భోగశయనుండైన శ్రీవిష్ణువున్నాడని వ్రాసియిచ్చితిని నా మాట వినిన తోడనే యా

పుడమిఱేడు వాడిన మోముతో నేమియుం బలుకక తలకంపించుచు నల్లన నాకుంభము మూత తీయించి చూడ నందు శేషశయనుండైన వాసుదేవుని యాకృతి గనంబడినది. పుడమి యొడయయుం డాశ్చర్యవశంబున దానినుంచినది మొదలు మదుక్తి ప్రకారముగా నుండుట తిలకించి దేహము పులకింప సందేహరహితుండై శ్రుతుల ప్రామాణ్యము సాధ్యమని నిశ్చయించి యహంకారముతో భయంకరులగు కింకరులం జూచి యిట్లనియె.

ఆసేతుహిమాచల మధ్యమునను న్న బౌద్ధులనెల్ల నాబాలవృద్ధముగా వధియించిరండు జాలిచేనెవ్వడు చంపక విడుచునో వానిఁ జంపించెద నిది సత్యమని యెక్కుడు కోపముతో భృత్యుల కాజ్ఞాపించి యట్లు చేయించెను. మహాత్మా విప్రుడైనను దుష్టుడయ్యెనేని పరిభవింపక మానడు పరశురాముండు మున్ను దల్లిం జంపలేదా? అట్లల్ప కాలములో సుధన్వుండు భృత్యులచే జైనుల నెల్ల వెదకి వెదకి చంపించి వేద మార్గము నిష్కంటకముగాఁ జేసెను. అప్పుడు నేను భూమియంతయు వేదశాఖల వ్యాపింపజేసితిని. కర్మప్రతిపాదకమైన దారి బాగు జేసితినని యెఱింగించి భట్టపాదుండు వెండియు నిట్లనియె.

మహాత్మా! యొక యక్షరము జెప్పినను గురువని చెప్పబడుచున్నాడు. శాస్త్రములనుపదేశించినవానిమాటచెప్పనేల? ఏనుబౌద్ధగురువునొద్దదర్శనశాస్త్రములన్నియుం జదివితిని. చివరకు దత్కులమును నాశనము జేయించితిని. ఇంతకన్న మహాపాతకమేమి యున్నది. అదియునుం గాక బౌద్ధశాస్త్రంబుల జదువునప్పుడు పరమేశ్వరుని లేనివానిగా నిందించితి నీ పాతకంబులు బాపుకొనుతలంపుతో నీ తుషాగ్నిం బడితి నంతకన్న భవదీయ పాదదర్శన లాభం బెక్కుడు నిష్కృతియని తలంచెదను. యోగీంద్రా! నీవు భాష్యము రచించితివని విని దానికి వార్తికముజేసి యెక్కుడు కీర్తి బొందెదనని తలంచితివి కాని యా మాటలతో నిప్పుడేమి ప్రయోజనమున్నది.

నీ వద్వైతమార్గము రక్షించుకొరకు నవతరించిన పరమేశ్వరుండవని యెఱుంగుదు. అయ్యో! నే నీ తుషానలంబుఁ బ్రవేశింపక పూర్వమైనం దర్శనమిచ్చితివి కావే? యీ ప్రాయశ్చిత్తముతో నవసరము లేకయే కృతార్థుండనగుదుంగదా? అన్నా! నీ భాష్యమునకుఁ గొంచెమైనను వార్తికముఁ జేయు భాగ్యము నాకు లభింపకపోయెనే. ఇప్పుడేమి చేయుదునని చింతించుచున్న భట్టపాదు నాదరించుచు దయామేదురములగు విలోకనము లతనిపైఁ బరగించుచు శంకరుండల్లన నిట్లనియె. ఆర్యా! నీవు వేదచోదిత కర్మ విముఖులగు బౌద్ధుల దండింప నవతరించిన షణ్ముఖుండవని యెఱుంగుదును. నీకేమి పాతకంబు గలదా? సజ్జన ధర్మముల బోధించు కొఱకు నిట్టి నియమమునకుఁ బూనికొంటివి. మదీయ కమండలు జలంబుఁ బ్రోక్షించి నిన్నుఁ బ్రతికించెదను. సూత్ర భాష్యమునకు వార్తికము రచియించెదవేయనుటయుధర్మజ్ఞుండైనభట్టపాదుం డిట్లనియెను.

యతివర్యా ! నీకట్ల యుచితంబా మహాత్ములు కూరులు ధనస్సు నందు వలెఁ గుటిలునియందుసైతము గుణము నారోపింతురు గదా మరియు లోకవిరుద్ధంబగు కృత్యంబు శుద్ధమైనదైనను నాచరింప నిష్టములేకున్నయది. నన్ను బ్రతికించుట నీకేమి యబ్బురము భూతకాలము నెల్ల సంహరించి వెండియు సృష్టించు సామర్థ్యము నీవుఁ గలిగియున్నది. నీ ప్రభావము నేనెఱుంగుదును అయినను సంకల్పించిన వ్రతమును జీవితాంశం జేసి విడిచితినేని నిందాపాత్రుండ నగుదును. కావున నన్ననుగ్రహింప దలంచితివేని జన్మతారకంబగు బ్రహ్మముపదేశించి కృతార్థునిం గావింపుము. పండిత వర్యా ! మండనమిశ్రుని ప్రఖ్యాతిని నీవును వినియుందువు. అతండు మదీయ శిష్యుండే కాని నాకంటె నెక్కుడు విద్వాంసుం డయ్యెను. వైదికకర్మ తత్పరుఁడై ప్రవృత్తి శాస్త్రములయందే నిరతుండై యుండెను. నివృత్తి శాస్త్రములయం దేమియు నా శక్తి లేదు. అతనియొద్దకుంజని వానిం జయించి వశంవదునిగాఁ జేసికొనుము. లోకమంతయు నీ చేతిలోని దగును. అతని భార్యయు మిగుల విద్వాంసురాలు. సరస్వతియనియే తెలిసికొనుము. ఆమెను మధ్యవర్తినిఁగాఁ జేసికొని వాదమునకుఁ బూనుకొని జయించి యతని చేతనే నీ భాష్యమునకు వార్తికములఁ జేయింపుము. కాశికా పురంబున విశ్వనాథుండు వోలెఁ గాలంబున వచ్చితివి. తారకోపదేశముఁ జేయుము. కృపాల్వా ! ముహూర్త కాలం బిందు వసియింపుము. యోగీశ్వరుఁడు నీ రూపము చూచుచు బ్రాణంబుల విడిచి కైవల్యంబందెదనని పలుకఁగా శ్రీ శంకరాచార్యులవారు గరుణ యుప్పొంగ సమిద్ధసుఖ ప్రకాశమగు బ్రహ్మ [illegible] ముపదేశించి [illegible] జేసెను.

తదీయ సంవాదమాకర్ణింపు వారలు [illegible] తుం డంతయును దహించుటఁజూచి తద్భృత్యపహోక్తి ప్రదేశానంతరమున [illegible] మహాత్ముఁ డాతని బ్రత్యక్షిల్లం జేయుటయు నా భట్టపాదుండు మాటాడుట యుడిగి కన్నుల మూసికొని చిత్తంబున నద్వైతతత్త్వధ్యానంబు సేయుచు మమతా మోహాద్యనేకంబులగు బంధములవిడిచి కైవల్యము నొందెను. శ్రీ శంకరాచార్యులును భట్టపాదునట్లు ముక్తినొందించి మాహిష్మతీ నగర గమనోన్ముఖుండయ్యెను.

అని యెఱింగించి మణిసిద్ధుండప్పటికి కాలాతీతమగుట దదనంతరోదంత మవ్వలి మజిలీ యందిట్లు చెప్ప దొడంగెను.

—:●:—

శ్రీ ర స్తు

# కాశీమజిలీకథలు

## 50 వ మజిలీ

## తృతీయోల్లాసము

ఒకనాఁడు నారదుండు దేవలోకమునుండి పుడమికి వచ్చుచుండఁ దుంబురుం డెదురుపడుటయు వారిరువురకును నిట్లు సంవాదము జరిగినది.

తుంబురుఁడు—దేవమునీంద్రా! తొందరగాఁ బోవుచుంటిరి నెక్కడికేమి? ఎందుండి వచ్చుచుంటివి?

నారదుఁడు—తుంబురుడా యేమి! నేను కైలాసమునుండి వచ్చుచున్నవాఁడ. భూలోకమునకుం బోవుచుంటి. తొందర పనియే యున్నది.

తుంబు—అది యేదియో చెప్పవచ్చునా! రహస్యమా?

నార—రహస్యము వంటిదే. అయినను నీవు నాకుఁ బరమాప్తుండవు గావున వక్కాణించెద నెక్కడను వెల్లడి చేయవు గదా!

తుంబు—నీవు వలదని నుడివినప్పుడు ప్రకటింతునా?

నార—[మెల్లగా] మహేశ్వరుండు పుడమియందు శంకరావతారమెత్తిన కథ నీ వెఱుంగుదువా?

తుంబు—ఎఱుఁగ నెఱుఁగ నది చెప్పవలయు.

నార—విష్ణుండు బుద్ధవతారమెత్తి తద్ధర్మముల నెల్ల బుడమి వ్యాపింపఁ జేసిన వార్తయేని విని యుంటివా?

తుంబు—ఆ కథ యెఱుంగుదును. త్రిపురదానవకాంతల వంచించుటకై వైకుంఠుండు బుద్ధుఁడై యవతరించినదియేనా?

నార—అగునదియే తచ్ఛాస్త్రంబులం జదివి బుద్ధమతస్థులు వర్ణాశ్రమాచారంబులు వమ్ముసేయుచు శ్రుతిదూషకులగుటయుఁ గ్రతుభోక్తలు హవిర్భాగంబులిచ్చువారలు లేమింజేసి చింతించి యా వృత్తాంతముఁ గంతువైరి కెఱిఁగించిరి.

తుంబు—అన్నప్రదాతలు లేనిచో విచారముకాదా! తరువాత తరువాత.

నార — అతిదయాళుండగు భూతపతి వారిమొఱ నాలించి యభయం బొసంగుచు మానుషశరీరము వహించి శంకరనామమున మీ మనోరథమును దీర్తు(ను యానతిచ్చెను.

తుం — భక్తజనపరిపాలన మా విభునకు సహజమై యున్నది కావున నట్లు నుట యుచితమే. తరువాత.

నార — పిమ్మట( గుమారస్వామిం జూచి భట్టపాదుండను పేరితో బౌద్ధ మతంబు ఖండింపుచు ముందు నిగమంబుల కర్మకాండంబు నుద్ధరింపుమని యాన తిచ్చెను.

తుం — తరువాత.

నార — తదాజ్ఞానుసారముగా షణ్ముఖుండు పుడమి భట్టపాదుండై యవత రించి యింద్రాంశ వలన జనించిన సుధన్వుం డాశ్రయించి బౌద్ధులనెల్ల దండింపఁజేసి కర్మమార్గమును ధరణి నిష్కంటకముగ వెలయంజేసెను.

తుం — పితృవాక్య పరిపాలన శీలురకదియేకదా ధర్మము తరువాత.

నార — తరువాత( బరమేశ్వరుండు దక్షిణదేశంబున శివగురుండను బ్రాహ్మణోత్తమునకుఁ బుత్రుండై యుదయించి బాల్యంబుననే సకల విద్యాపారం గతుండై బ్రహ్మచర్యము నుండియే సన్యసించి గోవిందయతి యనుమతిని వ్యాస సూత్రములకు నద్వైతభాష్యము రచించి యుపనిషత్తుల వలనం బ్రకాశించిన శిష్య బృందముఁ గూడికొని భట్టపాదుని ముక్తినొందించి తచ్ఛిష్యుండగు బ్రహ్మాంశ సంభూతుండగు మండనమిశ్రు ననుసరించి సన్యసింపఁజేసి మతప్రవర్తనము గావింప నరుగుచున్నాఁడు.

దూర్వాస శాపంబునంజేసి సరస్వతి యుభయభారతియను పేరితో సర్వ ద్ర్యాంసునకు భార్యయై యుదయించినది. ఇప్పుడు వారిద్దరు నన్యసించుటలు ప్రసంగ సంగరంబున మదీయాంతరంగమునకు వేడుక గలుగఁజేసికొను తలంపుతో నరుగు చున్నవాఁడ. అయ్యుభయ భారతియే వారికి మధ్యవర్తిగా నుండునను కైలాసంబున నొకసిద్ధుఁడీశ్వరుని కెఱింగింపుచుండ వింటిని.

తుం — ఆహా ! నీకు మంచి భోజనమే దొరకినది. కాని దూర్వాసయతి సకలలోక పూజ్యురాలగు సరస్వతిని సైతము శపించెనా ? ఆహా కోపశీలురకు యుక్తా యుక్త వివేకముండదుగదా ! అమ్మహాదేవి యేమిటికిఁ దత్కోపపాత్రురాలయ్యెను.

నార — అదియుం జెప్పవలయునా ! సమయము మిగులునేమో కదా, కానిమ్ము మహాత్ముల చరిత్రలు స్మరించుకొనినను కృతను గలుగఁజేయునని చెప్పు దురు. వినుము వెనుక సత్యలోకములో జరిగిన మహాసభకు నీవు వచ్చితివా ?

తుం — రాలేదు. జరిగినదని మాత్రము వినియుంటిని.

నార—సురగరుడోరగ గంధర్వాది దివిజగణంబులు దిక్పాలుర మహర్షులు పెక్కండ్రు తత్సభాంగణము నిండించి తమ తమ విద్యాపాటవము లా చతురాననునకుఁ జూపుచుండిరి.

తుం—మునీంద్రా! భవదీయ వీణాగాన మాధుర్యమున సామాజికులకానందముఁ గలుగఁ జేసితివా?

నార— అంతవరకు నవకాశమేదీ? వినుము. అతికోపనుండైన దుర్వాసుండు తనకు సామగానను మిగుల ప్రౌఢిమ గలదని పలికి యుచ్చస్వరంబున సన్వేదంబు పఠింపుచు నొక్కచో స్వరంబు దప్పుటయుఁ దెప్పున నప్పరమేష్ఠి మ్రోలనున్న సరస్వతి ఫక్కున నవ్వినది.

తుం—వర్ణంబులం బట్టిన శబ్దసంగతి తదవయవమగుటచే నామె నవ్వుటయు సంతోషముగాదని తలంచెదను.

నారద—అప్పుడు తత్పరిహాస కృతావమానను సహింపక దుర్వాసుండు క్రోధానలజ్వాలామాలికలలో యన్నగాలు జటాజాలంబులు విరజిమ్ముచు హుమ్మని కటమ్ములదరఁ బరమేష్ఠిపత్ని ననుగరువముతోఁ జిన్న పెద్ద తారతమ్యంబులరయక మాబోటి తపోధనులను సైతము పరిహసింపుచుంటివా కానిమ్ము. పుడమి మనుష్య జాతిం బుట్టిన సిగ్గెన్నఁడును బెద్దల బరిహసింపవుగాయని శపించెను.

తుంబు—శివశివ. ఇంత మాత్రమునకే యమ్మహాదేవిని శపించుట. అయ్యయ్యో దుర్వాసుఁ డెంత కఠినచిత్తుఁడో కదా? తరువాత.

నారద—అతని యలుకంజూచి యందున్న మునితిలకులుగాని దివిజులు గాని యేమియుం బలుకనేరక వెఱపుతో మెల్లమెల్లగా నవ్వలికిం జారఁబోదంగిరి.

తుంబు—పరమేష్ఠియు నూరకుండెనా?

నార—లేదు. తరువాత నాధాత విషాదమేదుర హృదయమైయున్న భాషాదేవిం జూచి పరితపించుచు నమ్మునిసత్తముని శాపనివృత్తికై బ్రతిమాలుకొనియెను.

తుంబు—ఆ కఠినహృదయుని హృదయమేమైనం గరఁగినదా?

నార—ఎట్టకేఁ గోపము విడిచి శాపము త్రిప్పనోపనని పలుకుచు మనుష్య శంకరుం జూచి ప్రసంగించినప్పుడు శాపవిమోచన మగునని యనుగ్రహించెను.

తుంబు—అదియు నతనియందు గుణమేయని తలంచెదను. తరువాత తరువాత!

నార—అప్పుడా వాగ్దేవి భూతలంబున శోణానదీ తీరంబున విష్ణుమిత్రుండను శ్రోత్రియ బ్రాహ్మణునకు బుత్రియై యుదయించి యుభయభారతియను

పేరుతో సకల కళాప్రవీణతబడసి చతురాననాంశవలనం జనించిన మండనమిశ్రునకు భార్యయై శాపావసానసమయమరయుచున్నది.

తుంబు—ఓహో ! ఇదియా కథాసందర్భము ! తెలిసినది. తరువాత !

నార—తరువాత నేమియున్నది. ఇప్పుడా శంకర యతీంద్రుడు శిష్యులతో గూడ మండనమిశ్రునియొద్ద కరుగుచున్నవాడు. కావున నా సంవాదము వినవలయునని పోవుచుంటి నిక నిలువరాదు. మంచి సమయము మిగిలిపోవును. పోయి వచ్చెద నీ రహస్యమెచ్చటను జెప్పకుమీ యని పలుకుచు నారదుండు నిష్క్రమించెను.

గీ. ఛాత్రసంయుక్తుఁ డైయట్లు శంకరుండు
అల్పప్రయాసము వెడలియో గానుగతిని
మింటి తెరవున మండన మిశ్రపాలి
తంబుమహిష్మతీ నగరంబుఁ జేరె.

మ. కనియెం దన్నికటంబునందతిచల త్కల్లోలరంగత్ప్రవ
ర్తనకృత్కోకముఃఖాంబుసిదజము పద్మవ్యాప్తకోలంబ ని
స్వన సంగీత మనోజ్ఞమంచితసభ సత్పూరితాంతఃకస
ద్వనజామోదసుతోషి తాధ్వగము రే వావినీ రత్నమున్.

కనితదీయశీకరనికర [illegible]లగు శిశిరసమీరములు మార్గాయాసం బపనయింప గొంతసేపు తదంతిక భూమి విశ్రమించి యందు మాధ్యాహ్నిక కృత్యంబులు నిర్వర్తించుకొని శిష్యసహితముగా నరుగుచు దారిలో నారసిల్లిన మండన పండితుని దాదుల మువ్వర జలంబులం దేరనరుగుచున్న వారింగాంచి మండనమిశ్రుని గృహం బెందున్నదని యడిగిన విని యప్పరిచారికలును దదీయరూప విశేషమున కచ్చెరువందును ముందు నందొకమందయాన యిట్లనియె.

గీ. నిగమము స్వతః ప్రమాణమో నిర్ణయించి
యరయఁ బరతః ప్రమాణమో యనుచు నెచట
ద్వారనీడాంతరస్థిత కీరచయము
పలుకునదిసూవె మండనేశ్వరుని గృహము.

మరియొకతె.

గీ. ఇలను సుఖదుఃఖరూప ఫలమొసంగ
గర్తపరమాత్మయో లేక కర్మయనుచు
ద్వారనీడాంతరస్థిత కీరచయము
పలుకునదిసూవె మండనేశ్వరుని గృహము.

ఇంకొకతె.

గీ. నిత్యమోలేక లోకము నిత్యమో య
టంచు సందియమందుచు నరయనెందు
ద్వారసీదాంతర స్థిత కీరచయము
పలుకునదియె మండనేశ్వరుని గృహము.

అని పలికి యరిగిన యమ్మగువల మధురోక్తి విశేషముల కలరుచు శంకరుండరిగి యరిగి మరియొకచో శూలకవాటగుప్తమగు తన్మందిరము గనుగొని ప్రవేశింప శక్యము కాకుండుట దిలకించి శిష్యుల నందుండ నియమించి యోగశక్తిచే గగన మార్గంబున లోనికింజని తదంతర్భవనంబు ప్రవేశించెను.

అట్టి సమయంబున మండన పండితుండు శ్రాద్ధవిధియందు వ్యాసజైమిని మునులు భోక్తలుగా నియమించు వారికి గాళ్ళు కడుగుచున్నవాడు గావున జ్ఞానశిఖోపవీతుండై యరుదెంచిన యయ్యతిపతింగాంచి ప్రవృత్తి శాస్త్రైకరతుండగుటచే సన్న్యాసి యని మిగుల గోపించుచు నిట్లు సంవాదము గావించెను.

## శంకర మండనమిశ్రుల సంవాదము

మండనుడు—కుతో ముండీ! సన్న్యాసి! యెచటనుండి వచ్చుచుంటివి? దానికి ముండన మెంతవరకను నర్థముంజేసికొని.

శంక—ఆగళాన్ముండీ నేను కంఠమువరకే ముండిని అనగా క్షౌరముం జేయించుకొందును.

మండ—తే పంథా మయా పృచ్ఛ్యతే? అదిగాదు నాచే నీ మార్గ మడుగబడుచున్నది. తెలిసికొనలేవేమి?

శంక—కిమాహ పంథాః? పథియే? మార్గమేమని నీ కుత్తరం మిచ్చినది?

మండ—[కోపముతో] త్వన్మాతా ముండేతి. నీ తల్లి ముండయని చెప్పినది.

శంక—తద్దైవహి. బాగు బాగు. నీవు మార్గము నడిగినందులకు నీ తల్లి ముండయని నీకు మంచియుత్తరమే చెప్పినది.

మండ—సురాపీతా కిము! పిచ్చిమాటలాడుచున్నావు కల్లు ద్రాగితివా యేమి?

శంక—[పీతా అను పదమునకు "పచ్చని" అని యర్థముంజేసి] నహి నహి శ్వేతా స్మర. కల్లు పచ్చగానుండదు. తెల్లగా నుండును. జ్ఞాపకము తెచ్చుకొనుము.

మంద—త్వంతద్వర్ణం జనాసికిం ! అలవాటుగనుక దానిరంగు నీకు బాగుగాఁ దెలిసియున్నదా ?

శంక—అహంవర్ణం భవాన్ రసం. అగు, నేను రంగు నెఱుంగుదు. నీవు రుచి నెఱుంగుదువు.

మంద :- మత్తోజాతఃకళంజాశీవికరీతాన్భాషసే. కలంజమనగా సలుగు దెబ్బతినిన మృగమాంసము. అట్టి దానిం దిని మత్తుఁడవై యున్నావా యేమి ? విపరీతముగాఁ బలుకుచుంటివి.

శంక—సత్యం బ్రవీషి. పితృవత్ త్వత్తోజాతఃకళంజభుక్. మత్తఃనావల ననుకళంజమును తినువాఁడు బుట్టెనని సత్యము పలికితివి. నీ వట్టివానికిఁ దండ్రి వగుదువు, సందియము లేదు

మంద—దుర్మతీ ! గాడిదసైతము మోయలేని గంతను మోయుచున్నావు గాని శిఖాయజ్ఞోపవీతములు నీకు బరువయ్యెనా ?

శంక—నీ తండ్రియైనను మోయలేని గంతను మోయుదును. శిఖాజ్ఞోపవీతములు నాకు బరువుగావు శ్రుతులకు బరువైనవి.

మంద—చాలుచాలు. పెండ్లియాడిన భార్యను బోషించుకొను సామర్థ్యము లేక శిష్యపుస్తకభారముల వహించెడి నీ బ్రహ్మనిష్ఠయంతయుఁ దెల్లమైనదిలే.

శంక—గురుశుశ్రూష చేయలేక యలసి యడివిడచి స్త్రీ శుశ్రూషఁజేయుచున్న నీ కర్మనిష్ఠంతమాత్రము వెల్లడిలేదనుకొంటివా !

మంద—స్త్రీ గర్భములోఁ బెరిగి స్త్రీలచేఁ బోషింపబడి స్త్రీలను నిందించుచున్నావేమిరా ? మూర్ఖా నీ కృతఘ్నత యంతయు వెల్లడియైనది గదా ?

శంక—నీవు స్త్రీలస్తన్యముఁ గ్రోలి స్త్రీల యోనిలోనుండి పుట్టి యట్టి స్త్రీలచే పశువులాగున రమించుచుంటివేమిరా ? బాలిశా ?

మం—అగ్నులను విడచినవాఁడు వీరహత్యను బొందునని వేదములో నున్నదిగదా.

శంక—పరమాత్మతత్త్వమును దెలిసికొననివాఁడాత్మహత్యను జెందుననియు వేదములోనేయున్నది చూచుకొనుము.

మం—ద్వారపాలుర వంచించి దొంగలాగున లోనికి వచ్చితివే.

శంక—భిక్షువులకన్నమిడక దేగలాగున నీవు భోజనము సేయుటకుఁ బ్రయత్నింపలేదా ?

మం – సీ. యట్టి కర్మకాలమున మూర్ఖుఁడవగు నీతో మాటాడుట తటస్థించినదేమి.

శంక—అహో, యతిభంగముగా మాటాడెడి నీ జ్ఞానము వెల్లడియైనదిలే.

మం—యతిభంగమునకు ప్రవర్తించువానికి యతిభంగము దోషము కాదు గదా ?

శం—యతివలన భంగమని దానికిఁ బంచమ్యంతమర్థము చేసికొనుము.

మం—అహో. యీ కాలములోనా సన్న్యాసము ? ఈ దుర్బుద్ధులెక్కడ ? బ్రహ్మవేత్తృత్వమెక్కడ ? స్వాదు పదార్థములఁ దినుటకై యోగివేషము వేసికొందురు.

శం—అహో. యీ కలికాలములోనా స్వర్గము ? ఈ దురాచారులెక్కడ? అగ్నిహోత్రములెక్కడ? మైథునకాములై కర్మిష్ఠులవేషము వేసికొందురు. నిశ్చయము.

అనియిట్లు రోషకషాయిత స్వాంతుండై మండనుండు దుర్వాక్యము లాడుచుండుటయు వానికి దగిన యుత్తరములు శంకరయతి యిచ్చుచుండుటయుం జూచి యందుఁబోక్తగా నియమింపఁబడిన వ్యాసుండు జైమిని చేత సపరిహాసముగా జూడబడుచుండెడి మండనమిశ్రుం జూచి యల్లన నిట్లనియె. వత్సా ! మండన ! తత్త్వవేత్తయైన యతి యతిథియై యింటికి వచ్చిన నర్చింపక యిట్లు దుర్భాషలాడుచుంటివేమి అభ్యాగతస్స్వయం విష్ణువనుమాట మఱచితివా యేమి ? చాలు జాలు ఈ ప్రసంగము గట్టిపెట్టుము. ముందుగా నతిథిపూజం గావింపుమని యాజ్ఞాపించెను. అమ్మునివరుని శాసనంబునంజేసి మండనుండు శాంతుండగుచు మాఱుమాట పలుకక జలము స్పృశించి శాస్త్రోక్తరీతి నతనిం బూజించుచు భిక్షకొఱకు నిమన్త్రితుంజేసెను. అప్పుడు శంకరాచార్యుడు మండన పండితునితో నార్యా ! నేనన్నార్థినై నీయొద్దకు వచ్చియుండలేదు. వివాదభిక్షను యాచింపవచ్చితిని. సమర్థుడవేని యదిపెట్టి పంపుము. అంటోడినవారోడని వారికి శిష్యులై యుండునట్లు పణమేర్పరుపవలయును. యతినిషిద్ధమగు వాదభిక్ష నీకేమిటికంటివేని యుపనిషన్మార్గము వెల్లడిచేయుటకంటె నాకు వేఱొక కోరిక యందిష్టములేదు.

సంసార తాపపరిహారకమై పరమానంద సుఖంబొనరించు సన్మార్గంబు కర్మతింత్రుండవగు నీచే దిరస్కరింపఁబడినది గదా? భవాదృశులనెల్ల వాదంబున భరిభవించి పుడమినెల్ల సన్మార్గంబు రాజమార్గమై ప్రఖ్యాతి నొందజేసెను. నీవును బరమోత్తమమైన మదీయ మతంబు స్వీకరింపుము. కానిచో వాదమునకు బూనికొమ్ము. దానికిం జాలనివాడవైతేని యోడిపోయితినని పలుకుమని యతి గంభీర వాగ్గుంభనలచే బలికెను.

మండనుండయ్యతి కులమండనుని వాక్యములు విని నూతన పరాభవము వలనం గలిగిన విస్మయముతో నాత్మగౌరవము ననుసరించి యిట్లనియె. ఏమంటివి? మండనుని పాండిత్య ప్రకర్ష మెఱుంగవు నీవనెంత ? ఇతండు సహస్రముఖుండైన యనంతుడు వచ్చినను బరిభవించునుగాని జితోస్మియని పలుకువాడుకాడు. మఱియు వేదసమ్మతమగు మతమునువిడిచి క్రొత్తగాగల్పించిన వ్యాసునియొక్కయు నీ

యొక్కయు మతమందు ప్రవేశించువాడుకాడు. ఎన్నడైన బుధమిత్రపంక్తితో గూడ యుంచునా సరసప్రసంగకథ యెన్నడైనం జరుగునాయని యెల్లప్పుడును వేడుకపడు చుందును. ఇప్పుడట్టి జయమహోత్సవము స్వయముగా వచ్చినదిగదా నా భాగ్యమేమని కొనియాడుకొందును? ఇప్పుడు మనయిరువురకు ప్రసంగము జరుగుచుండగా పుష్కలమైన మదీయ శాస్త్రపరిశ్రమ ఫలించుగాత. స్వయముగా వచ్చియమృతము నోటబడుచుండ భూతలవాసిమాత్రము వలదనునా? అయ్యో! దుర్వినయ గర్వకాంతార కుఠారమగు మదీయ వాక్చాతుర్యము నెరుంగక నన్ను వాదమునకు బిలుచుచుంటివిగదా! ఇసిరో! నన్ను వాదభిక్ష పెట్టుమని యడుగుట యత్యల్పమని తలంచెదను. నీకు వాదేచ్ఛ గలిగియున్నచో నాకు బందువేకదా! ప్రసంగవార్త వినినంతనే నాకు సంతోషము గలుగుచుండును. ఈ కోరిక నాకు చిరకాలమునుండి కలిగియున్నను నేపండితుండు దీర్చకున్నవాడు.

మంచిది తప్పక నీతో నిప్పుడు వాదము గావింతును. సందియములేదు. కాని మనవాదమునకు జయాపజయంబులు నిశ్చయించు మధ్యవర్తి యెవ్వడు? అట్టి మధ్యస్థుండు లేనిచో బరస్పర విజిగీషులగు వాది ప్రతివాదుల సంవాదము కంఠశోషమే ఫలముగాగలది యగుంగదా! మరియు ప్రసంగించునప్పుడు మనకు జేయదగిన ప్రతిజ్ఞయేమి? యందలి ప్రమాణము నీకేది సమ్మతము? నేను గృహస్థుడ నీవు భిక్షుండవు పిమ్మటనేమి యనినను లాభములేదు. కావున జయాపజయంబులకు బణము లేర్పరచుకొనినచో నవ్వుచు వాదమునకు బూనుకొనవలయును.

వాదము రేపు ప్రారంభింతము. ఇప్పుడు మాధ్యాహ్నిక కృత్యంబులు నిర్వర్తించుకొని యాతిథ్యమందుమని పలికిన విని శంకరుండును సమ్మతించిన పిమ్మట మండనుండు మధ్యస్థులుగా నుండుడని వ్యాసజైమినుల బ్రార్థించెను. వారప్పుండ తో త్తమునితో నార్యా! నీ భార్య సరస్వతి యంతటిది. ఆ సాధ్వీరత్నంబు మధ్యస్థురాలై న్యాయంబున జయాపజయంబులు నిశ్చయింపగలదు. అందులకు మీ యిరువురను సమ్మతింపుడని పలికి వారియువురి నాదంబున జేసిరి. పిమ్మట నమ్మండనుండు వారి మువ్వురను త్రేతాగ్నుల బోలె నర్పించుచు మధురాహార సంతృప్తులం గావించెను.

ఉపనిషదర్థంబుల నెరింగిన వ్యాసజైమిని శంకరులు మువ్వురును భుజించిన వెనుక నొకచోగూర్చుండి మండనుని శిష్యులు పార్శ్వంబుల నిలిచి వింజామరల వీచుచుండగొండొక సేపిండారులెద్దియో యాలోచనం జేసికొనిరి. వారట్లు కొంతసేపు సంతతముతో మంతనమాడి తద్గృహము నుండి వెడలి వ్యాసజైమినులంతర్ధానము నొందిరి. శంకరుండు నర్మదానదీ పరిసరంబున నెఱయు నుద్యానవనములో నున్న దేవాలయములో వసించి శిష్యులతోగూడ సచ్చరిత వార్తలం జెప్పికొనుచు నా దివసము గడిపెను.

అమ్మఱునాఁడు హిమకరుం డుదయగిరిశిఖరం బధిరోహింప రేవానదిం గాల్యకరణీయంబులం దీర్చుకొని శంకరయతి పద్మపాదాది శిష్యులతోఁగూడ మండన పండితుని సభాభవన మలంకరించుటయు వారింజూచి మండనుండు సంతసించుచు యథావిధి సత్కరించి యుపవిష్టులం గావించి సమస్త విద్యావిశారదయగు శారదను స్వదారనాదరంబున మధ్యవర్తినిగానుండ నియమించెను. పతివ్రతాశిరోమణి యగు నయ్యుభయభారతియును, ఉభయభారతీ తారతమ్యంబు నిరూపింప నరుదెంచిన భారతియుం బోలె నాసభాభవనంబున మిక్కిలి ప్రకాశించెను. అప్పుడు పరాపరజ్ఞుండైన శంకరయతీంద్రుఁడు వృద్ధినొందుచున్న తదీయ వాదోత్సుకత నాలోచించి ముందుగాఁ దాను బరాపరైక్యపరమగు ప్రతిజ్ఞ నిట్లు గావించెను.

మ. పరమానందము నిత్యబుద్ధము పరబ్రహ్మంబు దోచున్న హో
విరళాజ్ఞాన సమావృతంబగుచు నీ విశ్వప్రపంచంబుగా
నరయన్ జ్ఞానము చేతనంతయు లయం బౌనట్లు వాక్రుచ్చు వి
స్ఫురదామ్నాయశిరోమణుల్వెలయుమత్ప్రోక్త ప్రమాణంబులై

చ. ఉరుగతి నేను వాదమున నోడితినేనిఁ గషాయదండ స
త్కరకములంద్యజించియతి ధౌతపటంబుధరించి గేస్తునై
వరఁగెదసాధ్వి యీయుభయ భారతియే వివరించుఁగాత ప
క్షరహితబుద్ధియైమన ప్రసంగజయాపజయంబు లేర్పడన్.

అని యిట్లుపనిషదర్థంబులు ప్రమాణంబుగాఁ జేసికొని వాదింతుననియు నందుఁబరాజితుండనగుదునేని సన్న్యాసము విడిచి గృహస్థుండనయ్యెదనని శంకరయతి ప్రతిజ్ఞఁ జేయుటయు సంతసించుచు మండనమిశ్రుండు తన ప్రతిజ్ఞా ప్రకారం బిట్లని వక్కాణించెను.

ఉ. వేదశిఖల్ ప్రమాణపద విస్వహియింపవు చిత్స్వరూప సం
బోధము సేయదానఁ బరిపూర్ణత గల్గదులేదు ముక్తి య
య్యాదిమకాండమేపరమమై తగి ముక్తి ఘటించునంచునే
వాదము సేయుదుం బ్రజల వైఖరి గర్మమహత్త్వమేర్పడన్.

ఉ. ఓసుయతీశ ! వాదమున నోడితినేని శిఖోపవీతము
ల్దీసి కషాయచేల మవలీలధరించి జగంబెఱుంగ స
న్న్యాసముఁబూనియేను భవదగ్రవినీతుఁడనౌదుఁదీనికి
న్నాసురగాత్రియీయుభయ భారతిసాక్షిణియై తలిర్పఁగన్.

అని యిట్లిరువురు శపథములు చేసికొని యయ్యుభయ భారతిని సాక్ష్యాధికారమున కల్పించి పథముపహారమునఁ బ్రసంగమునకుఁ బూనుకొను టయు నద్దేవి వారిరువుర కంఠంబులను బుష్పమాలికలు వైచి యోడినవారి మెడనున్న దండవాడఁగలదిదియే నిదర్శనమని యెఱింగించి యయ్యింటఁబోయి గృహకార్యములం జక్కఁబెట్టనరిగినది.

తత్ప్రసంగ మాలకించు తలంపుతో వచ్చిన బ్రహ్మాది దేవతలు తద్గృహ ప్రాంతాంతరిక్షంబున విమానములపై వసియించి వినుచుండిరి.

అప్పండితపుంగవు లిరువురు సభిముఖముగా బద్ధాసనులై కూర్చుండి మందహాస శోభితవదనారవిందులై తొందర యేమియుం బూనక స్వాదుపద ప్రయోగ ములచే హృద్గతాభిప్రాయంబుల వెల్లడిఁ జేయుచు నిరువురును వేదమే ప్రమాణముగాఁ దీసికొని యిట్లు వాదించిరి.

మండనుఁడు — ఓ యతిసార్వభౌమా? నీచే జీవేశ్వరుల కేకరూప మంగీక రింపఁబడుచున్నది. అందులకుఁ బ్రమాణమేమి ? హేయోపాదేయ రహితమగు దానిఁ బురుషార్థములేమిం జేసి వేదాంత వాక్యములు నేను ప్రమాణములుగా స్వీకరింపను.

శంకరుండు — మహాత్ములైన యుద్దాలక జనక యాజ్ఞవల్క్య ప్రభృతులైన గురువులు శ్వేతకేతుఁడు లోనగు శిష్యులకు తత్త్వమస్యాది వాక్యములచేఁ బరమాత్మ నాత్మతత్త్వముగా బోధించిరి. ఇదియే ప్రమాణము. అయ్యర్థంబున శ్రు॥ తత్త్వమసి శ్వేతకేతో శ్రు॥ అభయంవైజనక ప్రాప్తోసితదాత్మానమేవావేదాహం బ్రహ్మాస్మీతితస్మా త్తత్సర్వ మభవత్తత్రకోమోహః కశ్శోక ఏకత్వమనుపశ్యతః॥ ఇత్యాది శ్రుతుల వలన స్పష్ట మగుచున్నది.

మండను — హుం ఫట్ ఇత్యాది శబ్దములవలెనే వేదాంతముల యందలి తత్త్వమస్యాది వాక్యములు పాపములు పోవు నిమిత్తము జపింపఁబడుచున్నవి కాని వానికి నొకానొక యర్థమందు వివక్షతలేదు.

శంకరు — ప్రాజ్ఞులు హుంఫడాది శబ్దముల యందర్థమేమియుఁ దోఁచక పోవుటచేత జపోపయుక్తములని పలికిరి. విద్వాంసుఁడా! తత్త్వమస్యాది వాక్యముల యందు స్పష్టముగా నర్థము కనంబడుచుండఁగా జపార్థత వీని యందెట్లుగాఁ బ్రాప్తించెడిని.

మండ — యతీంద్రా! జీవేశ్వరులకుఁ దత్త్వమస్యాది వాక్యములచే నభే దము బోధింపఁబడఁగాక యెదియెట్టి దందేని యజ్ఞాదులం గావించు కర్తలను స్తుతిఁజేయు నప్పుడు ఈ మఖకర్త యజమానుఁడని స్తావకముగాఁ జెప్పిన మాటగాని మఱియొకటి గాదు. విధియొక్క స్తావకము విధి విశేష మనంబడును.

శం — శ్రుతియూపాదికముల దేవతా స్వరూపములుగా వర్ణించెడు వేద

వాక్యములఁ గ్రియాకాండ గతములగుటచే విధిశేషములని చెప్పవలయును. కాని జ్ఞాన కాండగతములగు తత్త్వమస్యాది వాక్యముల విధిశేషములని యెట్లు చెప్పఁదగినది.

**మండ**—యతీంద్రా ! నీ వనిన యట్లే జీవునియందుఁ బరమాత్మ దృష్టి యుండఁగాక అన్నము బ్రహ్మము. మనసు బ్రహ్మము. ఆదిత్యుఁడు బ్రహ్మము. వాయువు బ్రహ్మము. అని కర్మసమృద్ధికొరకు అబ్రహ్మనుఁ బ్రహ్మనుగాఁ జెప్పినట్లే తత్త్వమస్యాది వాక్యములును గర్మసమృద్ధికొరకు నట్లు చెప్పినవి. కావున నుపాసనాను గుణ్యముగా నుపాసనావిధిశేషములని చెప్పవలయును.

శంక—మనో బ్రహ్మేత్యుపాసీత ! మనస్సునే బ్రహ్మగా నెంచి యుపాసింపఁదగినది. ఇత్యాది వాక్యముల యందు విధింపఁబడినలింగాదికము తత్త్వమస్యాది వాక్యములందుఁగలిగియున్నదా ? దానినుపాసనావిధిశేషమని యెట్లుచెప్పెదవు. విద్వాంసుడవయ్యు నిట్లు పలికెదవేల ? విధియొక్క యభావముచేత నారోపింపఁబడిన బ్రహ్మ భావము గల జీవుని యొక్క యుపాసనా పరత్వము వేదాంత వాక్యములకు సంభవించదు. బ్రహ్మయగుటయే ప్రమాణముగలవి.

**మండ**—యతివర్యా ! వేదాంత వాక్యములు బ్రహ్మాత్మత్వంబునం బ్రమాణంబగుంగాక. సోమయాగ విశేషములయందు ఫలదర్శనము కొఱకు విధి యెట్లు గల్పింపఁబడినదో యాలాగులననే యిచ్చటను "బ్రహ్మవేద బ్రహ్మైవభవతి" అను ముక్తిఫలమును దెలుపు శ్రుతికి బ్రహ్మలబ్ధుమః బ్రహ్మవేదనంకుర్యాత్. బ్రహ్మకా నిచ్ఛయించిన వాడు జ్ఞానమును దెలిసికొనవలయును. అని విధి కల్పించుకొనుట యుక్తము. అట్లైనచో బ్రహ్మయననేమి యాత్మయననేమి యని శంకించుకొని తత్స్వరూప సమర్పణముచేత నిత్యుండు సర్వజ్ఞుండు సర్వగతుండు విజ్ఞానానంద స్వరూపుండు అను మొదలైన వేదాంత వాక్యముల నుపయోగించుకొని తెలిసికొనవలయును. తదుపాసన వలన మోక్షము ప్రత్యక్షంబైనను శాస్త్రదృష్టంబు కాఁగలదు. అట్లు విధి కల్పించనిచో హనోపాదానశూన్యము వలన రాజాగచ్ఛతి. సప్తద్వీపా వసుమతీ ఇత్యాది వాక్యములకుంబోలెఁ దత్త్వమస్యాది వాక్యములకు నర్థక్యము గలుగునుగదా ! మఱియు బ్రవృత్తిని వృత్తుల బోధింపని వేదాంతవాక్యములకు శాస్త్రత్వము గలుగనేరదు.

శంక—అయ్యో ! అట్లు విధి కల్పించినచో మోక్షము క్రియాజన్యమగుట స్వర్గాదికమువలెనే నశించునదియగుం గదా? స్వర్గాదికమువలెనే మోక్షమునకు ననిత్యత్వ సాతిశయత్వములు లేమింజేసి దానికిఁ గ్రియారూపము గల్పించుట యుక్తముగాదు. జ్ఞానము మాత్రము మానసక్రియాజన్యము గాదు ? మీ మతంబున ముక్తిక నిత్యత్వమేల ప్రాప్తించలేదంటివేని వినుము. జ్ఞానము మనోధర్మమైనను యథాభూత వస్తుప్రమాణాదికము మాత్రము దెలిసికొనుచున్నది. ఏ దేవత కొరకు హవిస్సు గ్రహింపఁబడునో వషట్కారములో నా దేవతను ధ్యానింపవలెను. తచ్చింతనంబే మానసం బనంబడు.

అది పురుషతంత్రమైనదగుటచే నిష్టమువచ్చినట్లు చేయుటకును జేయకపోవుటకును మరి యొకరీతిఁ జేయుటకును శక్యమగుచున్నది. కాని జ్ఞానంబున కట్లుగాదు. కావునఁ దజ్జన్యమగు ముక్తికనిత్యత్వము సిద్ధించదు.

మండ — మునిసత్తమా! తత్త్వమసీతివాక్య మఁపాసనాపర్యవసాయికాక పోయినను జీవునకుఁ బరమపురుషునితో సాదృశ్యమును బ్రతిపాదించుచున్నది గదా?

శంక — ఓహో! పండితాగ్రేసరా? తత్త్వమసీతివాక్యము జీవున కీశ్వరునితోఁ జేతనత్వసాధర్మ్యము చేత సాదృశ్యమును బ్రతిపాదించుచున్నదాలేక సర్వజ్ఞత్వ సర్వాత్మత్వ సర్వశక్తిత్వాదిగుణములచే సాదృశ్యమును జెప్పుచున్నదా? నుడువుము. చేతనత్వముచేత నంటివేని యయ్యది ప్రసిద్ధమైనదగుటచేత నుపదేశమున కేయవసరము లేదు. సర్వజ్ఞత్వాదిగుణముల చేత నంటివేని, జీవునకుఁ బరమాత్మ స్వరూప పత్తితోన భేదము లేదని చెప్పెడు స్వసిద్ధాంతమునకు విరుద్ధమగును గదా! కావున నీ ప్రశ్న మైక్యమునే ప్రతిపాదించుచున్నది సుమీ?

మం — తత్త్వమసీతి వాక్యము అవిద్యావృతివలనఁ బ్రతీతములు గాని సుఖబోధానంత్యాది గుణములచే జీవునకుఁ బరమాత్మతో సాదృశ్యమును జెప్పంగాక దాననుక్తదోషము లేదు గదా?

శంక — సుహృద్వరా! భవదీయ వాక్యంబే జీవునకుఁ బరమాత్మత్వమాపాదించుచున్నయది యిఁకఁదద్విషయమై కోపమేమిటికిఁ జేసెదవు. సుఖబోధానంత్యరూపమగు పరమాత్మతత్త్వమునకుఁ బ్రతిభాసకంబయి విద్యావరణము వలన నీవే తీసివేసితివి గదా?

మం — భోయతిశ్రేష్ఠా. తత్త్వమసీతివాక్యము జగత్కారణుండైన యీశ్వరునితో జీవునకుఁ జేతనత్వసాధర్మ్యము వలన సామ్యమును జెప్పుగాక. జగము చేతనము వలన బుట్టినదగుటచే సాంఖ్యాదులచే జెప్పబడెను ప్రధానపరామాణ్వాదులకు నిరాసము కాగలదు

శం — అయ్యో పండితపుంగవా! అట్లైనచో ద్వన్మతంబున దత్త్వమసీతి ప్రయోగము తప్పగును. తత్త్వమస్తియని యుండవలయుం గదా! తత్ అఙలాత్కారణముత్వం. త్వత్సదృశము అస్తియగును. అని యర్థము వచ్చును. జగంబునకు జడత్వశంక పోవుకొఱకు నట్లు చెప్పవలయు నంటివేని శ్రు॥ తదైక్షత బహుస్యాం ప్రజాయేయేతి. అను శ్రుతి యందుగల యీ ఈక్షణశబ్దసామర్థ్యంబున నది స్పష్టమగుచుండ నఙ్ప్రధానాదుల యొక్క నిరాస కొఱకని చెప్పుట యుచితముగా లేదు.

మం — తత్త్వమసీతి వాక్యమునకు నేనీశ్వరుడనాను అను ప్రత్యక్షజ్ఞానము గలుగుచుండగా నైకపర్యతము జెప్పుట యుచితము కాదు కావున సాఖ్యాయోధ్యేతవ్యః అను విధివాక్యము ననుసరించి తత్త్వమసీత వాక్యము జపింపదగినదై యున్నది. అంతకన్న వేరొక ఫలమేమియు గలుగదు.

శం—విబుధేంద్రా! ఇంద్రియమునకు భేదగ్రహణ సామర్థ్యము గలిగి యున్నయెడల నభేదవాద శ్రుతివాక్యము బాధించెడిని. ఇంద్రియమునకు భేదముతో సన్నికర్షము లేమింజేసి తద్భేదజ్ఞానమే కలుగనేరదు. కావున జీవేశ్వర భేదము ప్రత్యక్షమని యెట్లు చెప్పదగినది.

మం—ఈశ్వరునికంటె నేను వేఱైనవాడను అనుచో భేదశబ్దము జీవాత్మకు విశేషణమగుచున్నది. కావున భేదేంద్రియములకు సంయోగసన్నికర్ష లేకపోయినను విశేషణతాసన్నికర్ష యున్నది కాదా.

శం—కేవల విశేషణతా సూత్రమునకు సన్నికర్షము జెప్పిన యెడల నతి ప్రసక్తి వచ్చుంకదా భేదాశ్రయము ఇంద్రియమునకు సన్నికృష్టమగుచుండగా విశేషణతాసన్నికర్షము చెప్పదగినది. ఇక్కడను, ఇంద్రియమందు ఆత్మకుసన్నికృష్టత్వము లేదు గావున నది చెప్పుట యనుచితము గదా.

మం—భేదాశ్రయమైన యాత్మకు నింద్రియముతో సన్నికర్షము లేదని చెప్పుట యెంతయు నిపుణతగా లేదు. చిత్తాత్మలు ద్రవ్యములగుటచే రెంటికిని సంయోగ సమాశ్రయత్వమేమిటికి గలుగదు.

శం—ఆత్మ ప్రభువగుగాక యణువగుగాక రెండుపక్షములు యందును జిత్తములో సంయోగత యెట్లు కలిగెడిని? లోకములో నవయవములు గలవానికి నవయవములు గలవానితో గదా సంయోగము. మనస్సు ఇంద్రియమని యొప్పుకొని యట్లు చెప్పితిమి నిజమరయ జిత్తమింద్రియము గాదు చక్షురాది సహాయము గలిగిన దీపమువంటిది. "ఇంద్రియాణాంమనశ్చాస్మి" అనువచనము "నక్షత్రాణామహంశశీ" అనునట్టిదే కదా?

మం—పారికాంక్షీ! భేదజ్ఞానమింద్రియము వలన గలుగనేరదు. సాక్షి స్వరూపమని యొప్పుకొనియెదను సాక్షిస్వరూపమగు భేదజ్ఞానముతో విరోధముగలుగు చుండగా బరమాత్మ జీవాభేదమును బోధించుకొఱకు దత్త్వమసీతివాక్యమెట్లుగా బ్రమాణమగు చున్నది.

శం—సాక్షిస్వరూపమగు ప్రత్యక్షము అవిద్యావృతుండగు జీవాత్మకును మాయావృతుండగు పరమాత్మకు భేదమున్నట్లుతోపింప జేయుచున్నది. తత్త్వమసీతి వాక్యము అవిద్యామాయావినిర్ముక్తులగు శుద్ధజీవేశ్వరుల కభేదమును దెలుపుచున్నది. శ్రుతిప్రత్యక్షములు భిన్నాశ్రయములగుటచే విరోధము లేదు. ఒకవేళ శ్రుతి ప్రత్యక్షములకు విరోధమున్నను ముందుగా బ్రవర్తించెడు బలహీనమగు ప్రత్యక్షము చరమ ప్రవృత్తమగు శ్రుతిచే నపచ్ఛేదన న్యాయమును బట్టి బాధింపబడుచున్నవి. ప్రథమ ప్రవృత్తమగు రజితజ్ఞానము పశ్చాత్ప్రఖ్యాతమగు శుక్తిజ్ఞానము చేత నెట్లు బాధింపబడునో యట్లే.

మం——సంయమిచక్రవర్తి! జీవుడు ఘటాదికము వలెనే యసర్వజ్ఞత్వము కలిగియుండుటచేత నీశ్వరభిన్నుడగుచున్నాడు. అనెడు నీ యనుమానము చేతనే వేద శ్రుతికి బాధకము రాలేదా! తర్కము నీవు చూచియుండినచో నందీ విషయము నీవు దెలియను గదా!

శం——తర్కము నేనెఱుంగునది కాదు. నీ వుపిపినట్టి బ్రహ్మనిరూపిత మగు భేదము పరమార్థభూతమైనదియా లేక కల్పింపబడినదియా? పరమార్థ భూతమ వండివేని దృష్టాంతము లేదు. కాల్పనికమంటివా? పరస్పర వ్యావహారిక భేదములేదన మేమును సమ్మతించితిమి. కావున సాధింపబనిలేదు.

అని యిట్లు మృదువాక్య చాతుర్యంబున శాస్త్రదృష్టాంతములచే మండన మిశ్రప్రశ్నములనెల్ల ఖండింపుచు స్వమతము శిద్ధాంతపరచుచున్న శంకర యతి చంద్రుని పాండిత్య ప్రకర్ష నరసి నిరుత్తరుండై యున్న ప్రాణేశ్వరు మెడలో నున్న పుష్పమాలిక వాడుటయు జూచి యుభయభారతి యచ్చెరువు నొందుచు వారిని భోజ నమునకు లెండని నియోగించి భోజనానంతరమున నల్లన శంకరునికిట్లనియె.

అర్యా! శంకర! నీవాది శంకరుడ వగుట దెలిసికొంటిని. దుర్వాస శాప దోషంబు వాసిభవదీయ దయా విశేషంబున గృతార్థురాలనైతి. నింక సత్యలోకమున కరుగుదానని పలుకుచు బ్రహ్మలోకప్రాప్తియగుటయు నామెను సైతము జయించి యద్వైతము స్థాపన జేయు తలంపుతో వనదుర్గామంత్రంబున నా మెనరుగకుండ బంధించి యల్లన నిట్లనియె. దేవీ! నీవు లోకరక్షణార్థమై యవతరించిన విరించిపత్నివని యెఱుంగుదును. నేను భవదీయభక్తుండ కృపావీక్షణంబుల నీక్షించుము. మరి కొంతకాల మిందుండి పిమ్మట నరుగుము. లోకహితమగునని పలికి మండనపండితుని యభి ప్రాయము దెలియ తాత్పర్యముతో నతని మొగము జూచెను. అయ్యతిప్రవరుని నిగ మార్థ నిర్ణయములగు వచనములచేత శాంతింపబడిన కోపము గలవాడైనను మండ నుండు, సందియముదీరక వెండియు నతనికిట్లనియె.

ఆర్యా! నాకీ నూతనాపజయంబున నించుకయు విషాదముగలుగదు. కాని జైమినీవాక్యములం బరిభవించితినని విచారింపుచుంటి అమ్మహాత్ముం డాగతానాగతము లందెలిసిన సుకృత లోకోపకారపారీణుండు నిగమ ప్రవర్తనయందభిరతుండైనవాడు. సకలకలానిపుణుండు తపోధనసత్తమున కిట్టి వ్యర్థసూత్రముల రచించు వ్యవసాయ మేటికి గలుగవలయును? అంత దెలియనివాడాయని సంశయముగా నున్నదని పలికిన విని నవ్వుచు శంకరుడిట్లనియె సౌమ్యా! జైమిని యందించుకయు నన్యాయములేదు. అత దెఱుంగనివాడు కాడు. వచనమే యసత్యమగుటచే దదభిప్రాయము దెలిసి కొనజాలకున్నాము. అనుటయు మండనుండిట్లనియెను. యతిసార్వభౌమా! పండితు లరుసు దెలియబడని జైమినిగారి యభిప్రాయము వేటెద్దియో వక్కాణింపుము. నీవుచిపి

సతి యుక్తమని తోఁచినయెడల నహంకార మమకారములు విడిచెదననుటయు శంకరుం డిట్లనియె. గృహమేధీ? జైమినిముని పరబ్రహ్మ యందభిప్రాయముగలవాఁడైనను విషయ సుఖ ప్రసక్తచిత్తులకుఁ దద్గ్రహణసామర్థ్యము గలుగనేరదని యాలోచించి తదధికారము వారికిఁగలుగఁజేయుతలంపుతోఁ బరబ్రహ్మప్రాప్తి సాధనమగుటచేతఁ గేవలము పుణ్యమును గర్మానుష్ఠానము చేత నిరూపించెను సుమీ! అదియెట్లెఱింగితి వంటేని వినుము. శ్రు॥ తమేతం వేదానువచనేన బ్రాహ్మణావివిదిషంతియజ్ఞేనదానేనతపసానాశకేన॥ అను వేదవాక్యము బోధోత్పత్తికిఁ గారణమగుటచే బ్రహ్మచర్యాది ధర్మసముదాయము చేయుమని చెప్పుచున్నది. తద్వచనాపేక్షచేతనే బ్రహ్మనిరతుండైన జైమిని ముని కర్మనిచయమును జేయుమని నిశ్చయించెను. ఇదియే తదీయాభిప్రాయము. మరి యొకటికాదని మేము నిశ్చయించితిమి అనుటయు మండనుండిట్లనియె. సూ॥ అమ్నాయ్య క్రియార్థత్వానర్థక్యమతదర్థానాం అనఁగా శ్రుతులు క్రియార్థకములగుట సఫలములైనవి. అక్రియార్థకములైన వాక్యములనర్థకములు అని సూత్రము రచించిన జైమినిమునివేదవాక్యములు సిద్ధవస్తు పరమైనవని యెట్లుగాఁదలంచెడినో సందియముగా నున్నదనుటయు భాష్యకర్త వెండియు నిట్లనియె.

పండితప్రవరా! నిగమరాశి పరంపరచే నద్వితీయబ్రహ్మయందాసక్తిగల దైనను ఆత్మబోధయే ఫలముగాఁగల కర్మయందు దృష్టివ్యాపింపఁజేయుచుఁ దత్కర్మ ప్రకరణవాక్యములయొక్క కార్యపరత్వమును సూచనజేసెనని మండనుండు, ఆర్యా! సకలవేదకదంబమునకు సచ్చిదాత్మపరత్వముకలదని జైమినిముని యభిప్రాయము పడినచోఁ బరమాత్మభిన్నమగు కర్మకు ఫలదాతృత్వముఁజెప్పుచు, బరమేశ్వరునేమిటికి నిరసించునోచెప్పుఁడు. ఈ జగము కర్తృపూర్వకమగుటచే ఘటాదికము వంటిదియని యనియెడు ననుమానమే వేదవాక్యముతోఁ బనిలేకను బరమేశ్వరునిఁ బ్రకటనఁ జేయుచున్నది. శ్రుతు లనువాదమాత్రములే సుమీ యని కాణాదుల పలుకఁగా నుపనిషదేకగమ్యుండును బూర్ణుండు నగు పరమపురుషుని వేదవేత్త కానివాఁడు దెలిసికొనఁజాలఁడు. అని వేదవచనములు పరమాత్మను వేదగోచరునిఁజెప్పుచున్నవే మీ యనుమానమెట్లుగాఁ దెలిసికొనగలదని బంధురములైన యుక్తిశతములచే నీశ్వరపరమగు ననుమానమును నిరాకరించుచు నయ్యీశ్వరునివలన జగత్తుపుట్టుటయు లయము నొందుటయులేదనియు ఫలముగలుగుటయు లేదని నిరాకరించెను. కాని వేదోక్తమగు పరబ్రహ్మవిషయముకాదు. కావున జైమినిముని వాక్యమందింతకంటె నణుమాత్రమును విరుద్ధములేదు. ఇట్టి తద్భావ రహస్యమునుఁ దెలిసికొనఁజాలక బుధులమ్మహాత్ముని నిరీశవాదియని పలుకుచుందురు.

పరమేశ్వరపరమగు ననుమానమును ఖండించినంతమాత్రముననే బ్రహ్మవిద్వరేణ్యుండైన జైమినిముని నిరీశవాదియగునా? మేచకాదులవలనంగలిగిన చీఁకటి

సూర్యకాంతుల మలినపఱచునా యని జైమినీయ వాక్యములంగల రహస్యవిశేషంబు లెఱింగించిన విని యమ్మండనపండితుండు సభ్యులతోఁ గూడ మిక్కిలి యానందించుచు నింకను సందియము హృదయమును బాధింపుచుండ నప్పుడు భక్తిపూర్వకముగా జైమినిం దలంచుకొనియెను. అట్లు మండనపండితుండు హృదయంబున ధ్యానించి నంతనే యాజైమినిముని సన్నిహితుండగుటయు నమస్కరింపుచు నతండు తమసంవాద ప్రకారమంతయు నెఱింగించి, మహాత్మా! ఈయతిచంద్రుండు కర్మకాండ యంతయు నిరర్థకమైనదనియు జ్ఞానకాండ ప్రధానమైనదనియు వాదించి భవదీయ సూత్రాభిప్రాయ మట్టిదేయని వక్కాణింపుచున్నవాఁడు. అయ్యర్థంబు మాకువిడిపోవకున్నది. అందలి నిక్కువంబెఱింగించి సంశయ నివృత్తి సేయుఁడని వేడుకొనిన నమ్మునియిట్లనియె. సుమతీ! వినుమా భాష్యకర్త మదీయ సూత్రతతికే యర్థము సెప్పెనో నాహృదయ మదీయేసుమీ ఇమ్మహాత్ముని వచనంబుల సందియమువిడచి, యదార్థములనినమ్ముము. నా హృదయ మొకండేయననేల? సకలవేదశాస్త్రములయొక్క యభిప్రాయ మెఱింగిన ధన్యుండు. పెక్కులేల? భూతభవిష్యద్వర్తమాన విషయంబులఁ దెలిసికొను మహిమ యతినికొక్కనికే కలదు. మరియు మదీయగురుండైన వ్యాసమహర్షి చేత నుపనిషత్తులకుఁ జిదేకరసతత్త్వము నిర్ణయింపఁబడినదిగదా. తత్ప్రసాదసమాసాదిత విద్యావైభవుండనగు నేను తద్విరోధముగా నొకసూత్రమైనం జెప్పుదునా? ఇంత మాత్రము దెలిసికొనరాదా?

ఈ మహానుభావుండు సంసారసాగరమున మునిగినవారి నుద్ధరింప నవతరించిన పరమేశ్వరుండని తెలిసికొనుము. ఇది పరమరహస్యము....

శ్లో॥ ఆద్యేసత్యమునిస్సుతాంవితరతిజ్ఞానంద్వితీయే యుగ
దత్తోద్వాపరనామలేతు సుమతిర్వ్యాసః కలౌ శంకరః
ఇత్యేవస్ఫుటమీరితోస్యమహిమామాపై వేపురాణేయత
స్తత్యత్వం సుమతే మతేత్వవతరేస్సంసారవార్థింత రేః.

కృతయుగంబునఁ గపిలాచార్యుండును త్రేతాయుగంబున దత్తాత్రేయులును ద్వాపరంబున శ్రీవేదవ్యాసభట్టారకుండును గలియుగంబున శ్రీశంకరుండును సజ్జనుల జ్ఞానముపదేశింతురని శైవపురాణములో నితనిమహిమ స్పష్టముగా వర్ణింపఁబడి యున్నది. కావున నీవతని మతిననుసరింపుము. సంసారసముద్రమును దరింతువని బోధించి జైమినిముని మనస్సుచేత నయ్యతిపతి నాలింగనము చేసికొనుచు నంతర్థానము నొందెను. పిమ్మట మండనమిశ్రుండును శంకరునికి నమస్కరింపుచు నల్లన నిట్లనియె. మహాత్మా! నిన్నిపుడు దెలిసికొంటిని నీవు జగత్కారణుండవైన పరమ పురుషుండవు. న్యూనాధిక్యరహితుండవు సర్వసముండవన బోధమాత్రశరీరుండవైనను మాబోఁటి పామరులరక్షింప మూర్తిభవించితివి. యతివరా! అశేష శృతి శేఖరములచే

నేపదము పరమమని నుడువఁబడినట్టి యాపదమును తత్త్వమస్యాద్యర్థముల ధరించి నీవు పరిపాలించితివి. లేనిచోఁ బురుషార్థభ్రష్టులగు సౌగతుల ప్రలాపములను చీఁకటి నూతిలోఁబడి యాపదము నాశనము నొందకపోవునా? అహా!

శ్లో॥ ప్రబుద్ధోఽహం స్వప్నాదితికృతమతిః స్వప్నమపరం
యథామూఢస్స్వప్నే కలయతితథామోహవశగా
విముక్తింమన్యంతే కతిచిదిహలోకాంతరగతిం
హసంత్యేతాన్దాస్తాస్తవగళితమాయాః పరగురో.

స్వప్నములోనుండియే మేల్కాంటిమని భ్రమఁజెందుచు మఱియొక స్వప్నములోఁ దలంచు మూఢుల పగిది మోహవశంబునఁ గొందరు మూఢు లనిత్యమగు లోకాంతరగతినే ముక్తినిగాఁదలంతురాహా! అట్టివారింగాంచి భవదీయభక్తులు పరిహసింతురుగదా!

చ. అకటలంగలంగుచు భయంపడి మేల్కొనినట్టులందె వె
ఱొకకలఁగాంచునీచవిబుధోత్తమయస్థిరజగద్గతిం భ్రమా
త్మకమతి నెంచుచుండి రమృతంబనికొందఱుజ్ఞానయుక్తిఁ దా
వకహితులట్టివారి ననపాయగతింబరిహాసమాడరే.

ఉ. ధారుణిభేదవాదికథితంబగుమోక్షముశీకరంబు ని
స్సారమహో తదాశ్రయులు సంసృతిసంగతిఁ బాయకుందురౌ
భూరితరప్రమోద పరిపూర్ణసుఖంబొనఁగూడు ఘోర సం
సారముబాయఁద్వత్కథిత సాధువిముక్తిభజించువారికిన్.

గీ. క్షితినవిద్యానిశాచరి గళితుసీత
బయలుపరచితి తత్కృతి ప్రక్కలించి
యతనిభార్యను దానవీ వృతను సీతఁ
గాంచివచ్చిన హనుమ నీకంటెఘనుఁడు.

చ. ఎఱుగక యీదృశంబగు త్వదీయలసత్పరమప్రభావము
ద్దురవముతోడనిన్నల తిఁగాఁ దలపోసి తిరస్కరించి ని
ష్ఠురములు పెక్కులాడితిని జూమెమహాత్మక! సత్కృపామతి
మఱువుము వానినెల్లను గుమారునిపల్కులఁ దండ్రియల్గునే.

మహాత్మా! కపిలగౌతమకాణాదప్రభృతులుసైతము శ్రుతిభావ రహస్యంబుల నిర్ణయించువిషయమునఁ బరశివాంశ సంభూతుండవైన నీ కెనయగుదురా! అయ్యయ్యో!

యీభూతలంబంతయు దురంతమోహమత్తులు పరమాత్మభేదకులు శ్రుతిగోభంజకులు నగు నభినవ యవనులచే నాక్రాంతమైయున్నది. అట్టివాం్రడను సేవించువారి కెన్నఁడైనను ముక్తి లభియించునా? విష్ణుతత్త్వానురక్తులగు భవదీయ శిష్యులందందు మెలంగుచుంటిరని తలంచి యాచింత విడుచుంటిని అయ్యారే! అల్పబుద్ధివ్యాళోరగములచేఁ గరవఁబడి స్మృతిచెడియున్న శ్రుతినికరముల భవదీయాసూక్తమృతసేకము దగిలి యిప్పుడు తెప్పరిల్లి హృదయాశయములఁ బ్రకటింపుచున్నవిగదా! దురంతసంసారఖర కర ప్రచురాతప పరితాపము భవద్వాక్యామృతకరశర ప్రచారమునంగాని యుపశయమించునా?

అన్నా? తపఃశ్రుతగృహదార భృత్యధనాదులతోఁ గూడఁ గర్మ యంత్ర మధిష్టించి యభిమానభరితుండనై సంసారకూప బిలంబునం బడుచుండఁ దటాలున వచ్చి నన్నుద్ధరించితివి. నీకంటె బరమగహితుండుఁ నాకెందేనిం గలడా? నేనుతొంటి జన్మమున నెక్కుడు సుకృతము గావించితిని. లేకున్న నత్యంతాయోగ్యుండనగు నాకు జగదీశ్వరుండవైన నీ సంఘటన మెట్లుగల్గెడిని? దేవతలకు సైతము పురుషార్థ మాపాదించు కరుణాంతరంగితమగు భగవత్కటాక్ష ప్రవాహంబున ధన్యతముఁడుగాక యెట్లు మునింగెడిని? మహాత్మా? భవదీయశిష్యులు స్వర్గాదిసౌఖ్యంబులు తృణముగా నెంతురుగదా! భవన్మతంబిప్పటికిఁ దెలిసికొంటి దాసానుదాసుల వరించితిని. నీ వర ణంబుల శరణుఁజొచ్చితిని. కరుణాభరిత హృదయుండవై కింకరుండనైన నన్నను గ్రహించి కర్తవ్యముపదేశింపుమని తదీయ పాదపద్మంబులఁబడియు నంతనాచార్యుఁ డతని శిష్యునిగా నను గ్రహింపదలచి తత్సహధర్మచారిణియగు నుభయభారతి యభి ప్రాయముగాఁ జూచెను.

## ఉభయభారతి బాల్యదశ

అమ్మహాదేవి యతని యభిప్రాయమును గ్రహించి యతిపుండరీకా! మండనమిశ్రుండు భవదీయ శిష్యుండగునని యింతకు బూర్వమెఱుంగుదును. వినుమొకనాఁడు నేను బాల్యంబున మా తల్లి నికటంబున వసియించియుండ రెండవ మార్తాండునివలె మెఱయుచున్న తాపసస త్తముఁ డొకండు విద్యుల్లతప్రభా ప్రతిభటంబులగు జటా పటలంబులు మకుటంబుగాఁ జుట్టికొని భూతిరుద్రాక్ష మాలికలొడలినిండఁదాల్చి విచ్చేయుటయు నమ్మహాత్ముని నర్ఘ్యపాద్యాది సత్కారముల నర్చించి ప్రసన్నుడైయున్న సమయంబున నల్లన మాతల్లి యిట్లనియె అన్నా! మీరు తపోమహత్త్వంబున త్రికాల వృత్తాంతములు కరతలామలకముగాఁ దెలిసికొందురుగదా? ఇప్పనికూన నా కూతురు, దీని నెక్కుడు గారాబముగా బెంచుచుంటిమి. దీని యాయువెంత? పిల్లల నెందఱం గనును? పతి యెట్టివాఁడగు? ధనధాన్యములేమైనం గలిగియుండునా? దీని భావి

స్థితియంతయు వక్కాణింపుడు. భవాదృశులు ప్రణత జనులయెడఁ గనికరముఁజేసి గోప్యమైనను వక్కాణింతురుగదా. అని భయభక్తి విశ్వాసములతోఁ బ్రార్థించినది. అమ్మహాత్ముం డొక్కింతసేపు కన్నులుమూసి ధ్యానించి యంతయుం గనికరముతో నోహో ! యువతీ ! భవదీయపుత్రికారత్నము నిరవద్య సౌఖ్యంబులనందఁ గలదు. వేదమార్గము బాహ్యమతములచే నావృతముగాఁగ దానిం బక్కపరచుటకై హాటకగర్భుండు మండనపండితుండై యుదయించి యున్నవాఁడు ఈ చేడియ యాతనికి భార్యయై యనేక యజ్ఞములం గావించి పుత్రపౌత్రాది సంపదలతోఁ జిరకాలము సుఖయించును. పిమ్మటఁ గురుమతములచే నష్టమగు నుపనిషత్సిద్ధాంతముల సాధింప నిమిత్తము శంకరుండు భువినవతరించి భూమిని బలవిన్యాసములచేఁ బవిత్రముజేయును. యతివేషము ధరించిన యమ్మహాత్మునితోఁ బెద్దతడవు వాదించి భవత్కామాత పరాజితుండగుచు నతనినే శరణము జొచ్చును సుమీ యని యెఱింగించి యత్తాపస సత్తముండంతర్హితుండయ్యె. తదుక్త ప్రకారమంతయుం జరిగినది. ఇతండు నీకు శిష్యుండు కాకేమగును ? అయినను నీకు సంపూర్ణజయమింకను గలుగలేదు. నేనతని సగము శరీరమునుగానా ? నన్నుం జయించి పిమ్మట నతనిని శిష్యునిగా జేసికొనుము. నీవీ జగదీశ్వరుండవైన పరమపురుషుండవని యెఱుంగుదు. అయినను నీతోఁ బ్రసంగింప నాకును ముచ్చటగా నున్నది. అనియిట్లు యాయజూక సహధర్మచారిణియగు నుభయభారతి పలికిన విని తదీయ మధురగంభీరార్థ యుక్తములగు వాక్యముల కానందించుచు శంకరు డిట్లనియె.

దేవీ ! నా హృదయము వాదకలహోత్సుకత నొందుచున్నదని పలికితివి. కాని యది యనుచితమని తలంచెదను. కీర్తిశాలురు స్త్రీలతో బ్రసంగములు సేయుటకు సమ్మతింపరుగదా ? యనుటయు నాభారతి యిట్లనియె. యతిప్రవరా ! యెవ్వఁడు స్వమతఖండనము గావించునో యట్టివానిని జయించుటకు నాడుదిగాకాని మగవాడుగా కాని తప్పక ప్రయత్నం చేయవలయుంగదా ? స్త్రీపుంసవివక్షతోఁ బనియేమి ? అదియునుంగాక మున్ను గార్గియను కాంతామణితో యాజ్ఞవల్క్యుండు ప్రసంగముచేయలేదా బృహదారణ్యకొపనిషత్తు చూచుకొనుము. మరియు మోక్షదర్శిబోధితమైన జనకసులభా సంవాదము నీవు వినియుండలేదా ? జనక యాజ్ఞవల్క్యాదులు యశోనిధులుగారా ? స్వమతరక్షణార్థమై ప్రవర్తించు నీపట్లనుట యుచితముగాదని యుక్తియుక్తముగాఁ బలికిని విని యయ్యతిప్రవరుం డనుమోదించుచు వాక్యాధిష్ఠాత్రియగు వాగ్దేవితోఁ బ్రసంగము జేయుటకు సమ్మతించెను.

# శంకర సరస్వతుల సంవాదము

పిమ్మట నా సభయందు శంకరసరస్వతులు పరస్పర విజయోత్సుకత్వముమీర మతిచాతుర్యంబునం బ్రయోగింపబడిన శబ్దప్రవాహములచే విద్వాంసులకు విస్మయము గలుగజేయుచు నద్భుతముగాఁ బ్రసంగముఁ జేయందొడంగిరి. విచిత్రపదయుక్తి ప్రయుక్తులచే వ్యాప్తమైయున్న తత్ప్రసంగ వాగ్ధోరణి నాలించి సభ్యులు గురుకవిభణితి భాస్కరాదులఁ దిరస్కరింపుచు మెచ్చుకొనఁ దొడంగిరి. వారిరువురు సంధ్యావందనాదుల నియతకాలంబుల విడిచి యహోరాత్రంబు లేక రీతి వాదింపుచుండ బదియేడు దివసంబులు గతించినవి. అట్టివాగ్దేవి పదియేడుదినములఖిలశాస్త్రముయందును శంకరునితోఁ బ్రసంగించిచూచి దేనిలో నతని జయించునుపాయముంగానక యాతండు బాల్యంబుననే సన్యసించి యుత్కృష్టములైన నియమములచే దీపించుచున్నవాఁడు. కావున మదనశాస్త్రమందితనికిఁ బ్రవేశము కలిగియుండదు. కావున దానియందడిగి యాతని నోడింపవలయు నింతకన్న వేఱొక సాధనము లేదని నిశ్చయించి యవ్విరించి మించుబోణి యిట్లనియె.

శ్లో. కలాఃకియంత్యో వదపుష్పధన్వః
కిమాత్మికాఃకించ పదంసమాశ్రితాః
పూర్వేచపక్షేకథ మన్యథాస్థితిః
కథంయువత్యాం కథమేవపూరుషే.

సంయమీంద్రా ! మన్మథకళలెన్ని ? యవి యే స్వరూపమున నొప్పునవి ? వానిస్థానములెయ్యవి ? అవి శుక్ల కృష్ణపక్షములయం దెట్టి వ్యత్యాసమును జెందును ? పురుషునియం దెట్లుండును ? స్త్రీలయం దెట్లుండు వక్కాణింపుమని యడిగెను. అయ్యతి సత్తముఁడ త్తరుణి వచనములకుఁ బ్రత్యుత్తరమీయక యోహో ! యీమె కామశాస్త్రములోఁ బ్రశ్నఁజేసినది. ఉత్తరమీకున్న సర్వజ్ఞత్వదోషము వచ్చును. చెప్పినచో ధర్మలోపమువచ్చును. ఏమిచేయుదును. అని యొక్కింతసేపు చింతించి తదర్థములన్నియు లెస్సగా నెరిఁగినవాఁడయ్యును యతుల నియమము గాపాడుతలంపుతోఁ గామశాస్త్ర మెరుంగని వాడుంబోలె నిట్లనియె.

సాధ్వీ ! నాకొక మాసమవధి నీయదగు. మాసాంతరమున నీ మాటలకుత్తరము జెప్పువాఁడ. మదీయమదనశాస్త్ర ప్రవీణతయప్పుడు జూచెదవుగాక. అట్లు గడువిచ్చుట వాదిధర్మమైయున్నదని గడువడిగిన విని యప్పు డయ్యింతియు నందులకొడఁబడియెను. అంతటితో నాసభ ముగింపఁబడినది. కావున వారి యనుమతి వడసి శంకరయతి సనందనాది శిష్యులతోఁ గూడ నచ్చటవెడలి నర్మదానదీతీరంబున నున్న యుద్యానవనములోఁ బ్రవేశించి యూరేయి సంవాదగోష్ఠివిశేష కథాలాపములచేఁ ద్రుటిగా

వెళ్ళెంచెను. అమ్మరునాఁడుదయ కాలంబున శంకరయతి శిష్యులతోఁగూడ యోగమవ ధరించి గగనమార్గంబున నడుగుచు నొకచో నరణ్యమధ్యంబున రాత్రి వేటకై వచ్చి మూర్ఛామయగ్రస్తుండై తరుమూలంబున గతాసుండైనను స్వర్గప్రాప్తుండైనయమర్త్యుండు వోలె నొప్పు నమరకుండను నృపాలుండు పడియుండుటయు నతని భార్యలు నూర్వురార్తనినాదములతో వచ్చి చుట్టుకొంబరివేష్టించి పెద్ద యెలుంగున నరణ్యము ప్రతిధ్వను లీయ నేడ్చుచుండుటయుం జూచి శంకరుండు సనందనుని కిట్లనియె. సనందనా! యిందమరకుండను నృపాలుండు గతాసుండై పడియున్నవాఁడు చూచితే! యితని భార్యలు సౌందర్య సౌభాగ్యమనోజ్ఞలై యున్నవారు. పాపమీయువతులు పతి వియోగ చింతా సంతాపముతో నెట్లు చింతించుచున్నారో చూడుము. వీఁడు హఠాన్మరణము నొందుటచే వీరికి శోకమిబ్బడించు చున్నది. నేను వీనిదేహమునఁ బ్రవేశించి యిమ్మెంచు బోఁటులశోకము కొంత యుపశమింపంజేసి వీని పుత్త్రుని భట్టభద్రుసంజేసి మఱల స్వకాయమునం బ్రవేశింతును.

అదియునుంగాక యుభయభారతి ప్రశ్నములకుత్తరముఁ జెప్పి సర్వజ్ఞత్వము నిలువుకొనవలయుంగదా. యీ మించుబోఁణులవలన గిలికించితాది లక్షణంబులును గళావిశేషంబులుం దెలిసికొని కార్యనిర్వాహకత్వము గాపించెదను. అని పలికిన విని పద్మపాదుండీషత్స్మితశోభిత వదనారవిందుండై యల్లన నిట్లనియె స్వామీ! నేమీమాట కాదనుటకెంతవాఁడ. సర్వజ్ఞులైన మీయెరుంగనిదికలదా? యైనను భక్తి నన్ను వాదాలునిఁగాఁ జేయుచున్నది. పూర్వము మత్స్యేంద్రుఁడను మహాత్ముండొకచో మృత్యుండైనమహారాజు శరీరముఁజూచి గోరక్షుండను తన శిష్యుని స్వకళేబరముం గాపాడ నియమించి తానానృప శరీరములోఁ బ్రవేశించి యారాజ్యమేలుచుండెను. ఆ మౌనిసింహుండు సింహాసన మెక్కినది మొదలు తద్దేశము తృణకాష్ఠజలసమృద్ధి గలిగి సస్యానుకూలముగా వర్షములు గురియుచుండఁ జక్కఁగా ఫలింపఁదొడంగినది. తదీయ మంత్రులా నృపవరుని యాపూర్వతేజః పటలమునకు వెఱఁగందుచు నోహో? యిందెవ్వఁడో పరకాయప్రవేశ విద్యానిపుణుండైన యోగి ప్రవేశించినాఁడు కాబోలు. కానిచోఁ జచ్చినవాఁడెందైనం బ్రతుకునా? యతండు తిరుగ స్వకాయమును బ్రవేశింపకుండ వీనినిందు నిలుపవలయునని తలంచి రూపయౌవన కళావిలాసములచే నభిరామలై యున్న రామలఁ బెక్కండ్ర నతనిసేవకు నియోగించిరి. తదీయ హావభావాది విలాసములకుఁ జిక్కి యయ్యోగిసమాధి వృత్తమఱచి తదీయ సంగీతనృత్యాది వినోదముల బద్ధాదరుండై స్మరలీలాసమాకర్షిత స్వాంతుండై ప్రాకృతుండువోలెఁ బూర్వకృతంబంతయు మఱచిపోయెను.

గోరక్షుండెంత కాలమునకు దనగురుండు స్వశరీరమునఁ బ్రవేశింపకునికి విచారించి తద్దేహము మఱియొక విధంబున నిగూఢముఁజేసి గురునన్వేషించుచుఁ బోయి

పోయి తద్వృత్తాంతముఁ దెలిసికొని స్త్రీలోలుండై యున్నవాఁడు కావున నల్లనఁ దదంతఃపురకాంతల నాశ్రయించి నృత్యంబులఁ గఱపుచు వారికాంతరంగికుండై మెలంగుచుండెను. ఇట్లుండ నొకనాఁడయ్యోగి తత్త్వవేత్తయగుటఁ బూర్వస్మృతి గలిగి నివృత్తరాగుఁడై తన స్థితికి, వగచుచున్న నెఱింగి గోరక్షుఁడు సమీపించి యోగప్రవృత్తిపూర్వకముగాఁ దనవృత్తాంతమంతయు నతనికెఱింగించి క్రమ్మఱ నాత్మీయకాయంబునం బ్రవేశింపఁజేసెను.

అయ్యారే ! విషయానురాగ మట్టువంటిదిగదా ? యూర్ధ్వరేతోవ్రత ఖండనంబునం బాపంబుగలుగునం డ్రు. ఈ కృత్యంబు పుణ్యమో పాపమో వివేచింప నీవే సమర్థుండవు. నిరుపమానసుఖులగు మన నియంబు లెక్కడ ! నతిగర్హితమగు కామశాస్త్ర మెక్కడ ? మీరే యీ పని కవలంబించితిరేని నిఁక జగంబున నీమంబు వహించువారెవ్వరు. పృథివియందు శిథిలమగు యతిధర్మమును నిలుపఁగంకణము గట్టికొనిన నీకుఁ దెలియనిది యేమియున్నది ? యైనను నీ యందుఁ గల పరిచయంబున నింత చెప్పితి, నా తప్పు మన్నింపుమని పలికెను.

వత్సా ! నీవు సత్యమే పలికితివి. విషయప్రవృత్తి యట్టిదే కాని పరమార్థ మొక్కటి చెప్పెద నాలకింపుము. అసంగునకుఁగామంబు లెన్నఁడును జనింపవు. దీనికిఁ గృష్ణుఁడే నిదర్శనము. మరియు నఖిలకామములకు మూలమైనది సంకల్పము. అట్టి సంకల్పము కృష్ణతుల్యుఁడనగు నాకు లేదు గదా ! సంసారదోషములం జూచు విరక్తుకు సంకల్పహాని యగుచుండఁగా భవనాశనమగుచుండు. ఎవ్వఁడు శరీరాదికమును విచారింపక దృఢముగా నేనని తలంచునో యట్టి మూఢుని విషయమై విధినిషేధశాస్త్రము సఫలమగుచున్నది. మహావాక్యములచేఁ గృతకృత్యమైన బుద్ధిగల ప్రాజ్ఞుండు వర్ణాశ్రమ జాతి శూన్యమగు పరతత్త్వముఁదన్నుఁగా నెన్నుకొనుచు శ్రుతి శిఖరంబు నధిష్ఠించియు విధినిషేధశాస్త్రమునకుఁ గింకరత్వము చేయునా ?

శ్లో॥ తదయంకరోతుహయమేధశతా
న్యమితాని విప్రహననాన్యథవా
పరమార్థ విన్నసుకృతై ర్దురితై
రపిలిప్యతేస్తమిత కర్తృతయా.

తత్త్వవేది కర్తృత్వభోక్తృతాది శూన్యుండగుటచే హయ మేధశతంబు నాచరించుఁగాక యనేక విప్రహత్యలు గావించుఁగాక తత్సుకృత దుష్కృతముల నంటఁడు సుమీ. ఇంద్రుండు తొల్లి త్వష్ట కొడుకగు విశ్వరూపుం బరిమార్చెను. కుపితుండై నరున్ముఖయతుల బెక్కండ్ర సాలావృకముల కప్పగించె. దత్కర్మ వలన నతనికి లోమహానియైనం గలిగెనా ? యని ఋగ్వేదము చెప్పలేదా ?

మరియుఁ బరమజ్ఞాన సంపన్నుండగు జనకుండసంఖ్యాక దక్షిణలతోఁ బెక్కులు జన్నములుసేసి దేవతలఁ దృప్తిపరచియు నంతంబున సర్వభయ శూన్యం బునఁ బరమానంద స్వరూపమగు మోక్షముఁ జెందెను కాని తత్ఫలమనుభవించు కొఱకుఁ దిరుగ దేహము నొందలేదని కొందఱు చెప్పుచున్నారు. కావున సనందనా ! పురందరుని చందంబునఁ దత్త్వవేత్త పాపములనంటడు. జనకునిపగిది సుకృతఫలమను భవింపడు నేనీ దురితమేమిటికిఁ జేసితిని సుకృతమేమిటికిఁ జేయలేదను పరితాపమును బొందువాఁడనుకాను. సౌమ్యా ! యీ శరీరముచేత ననంగశాస్త్ర పరిశీలనఁజేయుట దోషముగాదు. కాని విశిష్ట మార్గపరిపాలనము కొరకు కన్యశరీరము నాశ్రయించు చున్నాఁడ. అని యిట్లు భవభయహరణంబులగు సత్కథలం జెప్పుట శంకరయతి శిష్యులతోఁగూడ నరిగి యరిగి యందొకచోఁ బాదచారుల కధిరోహింప శక్యముగాని సముత్తుంగ శైలశృంగంబొకండు గనంబడుటయు సశిష్యముగా నక్కూటతటంబున దిగి వెండియు శంకరుం డిట్లనియె.

శా. అంతేవాసి వతంసుఁడార ! కనుఁడీ ! హర్మ్యాంతరమ్మట్టు ల
త్యంతామోదము గూర్చునీగుహ విశాలాగ్రస్థలోపేతమై
ప్రాంతోద్యత్ఫల భారసంప్రతరు దీప్యత్పుష్పలతాసారతో
యాంతఃపంకజగంధచోరకసమీరాహ్లాది తాదిత్యమై.

వ. ఇక్కందరాంతరంబున మదీయ కళేబరంబునిచి యమరక శరీరంబుఁ బ్రవేశించి పంచశరకళా పాండిత్యంబు సంపాదించుకొని వచ్చెద నంతదనుక మీరిగ్గు హాంతరంబున మత్కాయంబపాయంబు నొందకుండఁ గాపాడుచుండవలయుంబాఁడీ యని వారికిఁ జెప్పవలసిన మాటలన్నియుంజెప్పి యప్పరమహంసము గుహా బిలంబునఁ దన శరీరము విడిచి యోగబలంబున లింగశరీరముతోఁ గూడికొని చని యల్లనమరక శరీరంబుఁ బ్రవేశించెను.

శా. పాదాంగుష్ఠకమాదిగాఁగదశమ ద్వారంబు పర్యంతమున్
బ్రోదింబ్రాణసమీరణంబుల నాగిం బొందింపుచున్ నేర్పుమై !
మీఁదన్మస్తక రంధ్రమార్గమున నెమ్మింబోయి పైకమ్మహీ
నాథాంగమ్ముఁగ రంధ్రమార్గమున నిండన్ జొచ్చెనాద్యంతమున్.

అట్లా యోగీంద్రుం దన్నరేంద్రుని మేనుజొరబడినతోడనే హృదయంబు గదలఁజొచ్చినది. పిమ్మటఁగంటోయి రవికిరణప్రసారంబున వికసించు నరవిందముకు శంబునఁ దెరవపడినది. మరికొంత సేపున కద్ధరాకాంతుండు నిద్రితుండువోలె లేచి కూర్చుండెను.

అట్లు సంప్రాప్తజీవుండగు జీవితవల్లభుంజూచి యప్పల్లవపాణులు పెల్లుగ

సుపుత్రిల్లిన సంతసముతో నృపాలుండు బ్రతికె బ్రతికెనని పెద్దయెలుంగున నరచుచు నరుణోదయంబున సారసపతంగ ముఖరితములగు పద్మినులువోలెఁ బ్రకాశించిరి.

తదీయ సంతోష నినాదంబు లాలించి యాప్రాంతమందు విచారింపుచున్న యతని మంత్రులు సజీవితుండగు భూపతిని గాంచి ప్రహర్షసమంచితాంతరంగులై పటహభేరీశంఖాది నినాదంబులు భువనభోంతరాళంబులు నిండ వెలయింపఁజేసిరి.

సీ. మన యదృష్టంబు నేమనవచ్చు జమునీడు
  గనివచ్చె తిరుగ నీ ఘనుఁడటంచు
మనపుణ్యమే కాక మరల జీవించునే
  చితిఁజేర్చినట్టి భూపతియటంచు
మనపురాకృత తపం బునఁగాక మనుజునో కొ
  ప్రేతత్వ మొందిన నేతయనుచు
మన దాన ధర్మ సంపత్ఫలంబునఁగాక
  యిటువచ్చి బ్రతుకునే యనుఁడటంచు.

గీ. భార్యలును మంత్రులును హితుల్ ప్రజలుమురిసి
రండు స్త్రీఁ దించి మేల్కొని సట్టి వాని
పగిది లేచిన యజ్ఞప పాలకుఁ
గాంచి సంతోషభూరి సాగరతరంగ
దోలికలనూగి రొక్కింత కాలమపుడు.

పిమ్మట నమ్మనుజపతిని హితపురోహిత మంత్రి ప్రముఖులు శాంతికర్మ పూర్వకముగా మాంగళ్యకృత్యంబులు నిర్వర్తించి భద్రదంతావళ మెక్కించి తూర్య ధ్వనులతో నూరేగింపుచుఁ బౌరులత్యద్భుతాహ్లాద మేదుర హృదయములతో విలో కింపుచు నేనను జల్లుచుండ గ్రామంబున రాజమందిరముఁ బ్రవేశ పెట్టిరి.

అబ్భూపాలదేహముతో నున్న శంకరుండు ప్రజల నెవ్వంగకున్నను తత్సమ యోచితముగా వారి వారికిం దగినట్లు ప్రత్యుత్తరము లిచ్చుచు నాదరింపుచు సత్కరిం పుచుఁ దనవైపరీత్యము దెలియనీయక మెలంగుచు సింహాసనమెక్కి న్యాయంబునఁ బ్రజలఁ బాలింపుచుండెను.

అట్టి సమయంబున బుద్ధిమంతులగు తన్మంత్రిపుంగవు లొకనాఁడు రహ స్యముగా నిట్లు సంభాషించుకొనిరి.

ప్రథముఁడు — మిత్రులారా ! మన ధాత్రీపతి మృతుండై బ్రతికిన తరువాత, బూర్వమువలెఁగాక యపూర్వతేజోమహత్త్వంబునఁ బ్రకాశింపుచున్నవాఁడు చూచితిరా?

ద్వితీయుడు—అగునగును దేహమొక్కటియేకాదు. గుణములు సైత మపూర్వములై కనంబడుచున్నవి. యయాతి రీతినిచ్చుచున్నాఁడు గదా! అర్థజ్ఞాన సంపత్తితో బృహస్పతిగతి సంభాషించుచున్నాఁడు శర్వుండువోలె సన్నియుండానే తెలిసికొనుచున్నాఁడు యేమి చిత్రము.

తృతీయుడు :- మీ మాటలు యథార్థములె అనన్యజనసామాన్యములైనవి తరుణపౌరుషశౌర్యధైర్యాది గుణములచే నీతండు పరమపురుషుండులాగున దోచుచున్నాడు.

చతుర్థుండు :- మఱియొక యద్భుతము గనంబడుచున్నది. కనిపెట్టితిరా ?

ప్ర :- అదియేమి.

చ :- ఇతండు సింహాసన మెక్కినది మొదలు ఋతువ్యతిరిక్తకాలంబు సందరువులు ఫలించుచున్నవి. మరియు గోవులు నెక్కుడుగా పాలిచ్చుచున్నయవి తలంచినప్పుడు వానలు గురియుచున్నవిసుఁడీ.

ప్ర :- అగునగు నదిమొదలు తగవులు వినంబడమిజేసి ప్రజలు ధర్మరతులైరని తలంచెదను.

ద్వి :- ఇదియంతయు నీ మహారాజుగారి ప్రభావమే యని నిశ్చయింప వచ్చును.

ప్ర :- సందేహమేల.

తృ :- ఇతండు సమసిపరలోకంబున నెవ్వానివలననేని వరములంది రాలేదు కదా.

ప్ర :- కాదు కాదు. పరకాయప్రవేశ విద్యానిపుణుడైన మహాత్ముడెవ్వడో వీని దేహమందు ప్రవేశించెనని తలంచెదను.

ద్వి :- అగు. చక్కగా గ్రహించితిని. కానిచో జచ్చినమనుజుండెన్నడైనను జీవించునా ?

తృ :- రాత్రి రెండు జాముల వేళ వేటాడుచు చెట్టుక్రింద మూర్ఛనొంది పడెనని కింకరులెరింగింప దేవీ సహితులమై మనమందఱము పోయి చూచువఱకు దెల్లవారుచున్నది. పిమ్మట రాజపత్నుల శోకమోహములతో రెండు యామములైనది. నే నతని దేహమంతయుం బరీక్షించి చూచినాను. శవమై మిక్కిలి విపరీతముగా గనంబడెను.

ద్వి :- కన్నులు తెల్లబడి చూచువారికి వెరపుగరపుచు మోము కళదప్పియుండలేదా ? యిది పరకాయప్రవేశ లక్షణమే కానిచో నట్టివాడు తిరుగ జీవించుట కలలో వార్త గదా.

ప్ర :- ఆ మాట నిశ్చయమే యిక మనము చేయవలసిన పనియట్టిది.

ద్వి :- మనకెట్టిననేమి ? యీ కాయంబున నమ్ముపోత్తుండు. స్థిరముగా నుండిన మనదేశము ప్రజలు మిక్కిలి ధన్యులగుదురు. అదియే యాలోచింపవలయును.

ప్ర :- అతని శరీరమెక్కడనో నిగూఢ ప్రదేశమున విడువబడియుండును కావున మనమెట్టిస్థలములెల్ల వెదకించి కనబడిన శవము నెల్ల విచారింపకయే దహింపు డని కింకరుల రహస్యముగా నియోగింపవలయు. వెదకించి యతని శరీరము దగ్ధము గావించితిమేని యతండెల్లకాలము నిందేయుండును.

ద్వి :- నీ యాలోచన సమంజసముగా నున్నది. కాని రాజెరుంగకుండ మనము కింకరుల కెట్లాజ్ఞాపింతుము ?

ప్ర :- అయ్యో ప్రొద్దుటి రాజశాసనము నీవు వినలేదు కాబోలు.

ద్వి :- లేదు లేదు. ఎట్టిదో చెప్పుము.

ప్ర :- తాను జేడియలతో గూడ గ్రీడాశైలంబున కరిగియందు గొన్ని దినములు వసియించునట. రాజకార్యములన్నియు మనలనే చక్కబెట్టుకొనుడని మనకు స్వతంత్రాధికారమిచ్చి రాజముద్రికల నంపినాడు. ఇక మనమేమి చేసినను రాజుగారికి దెలియజేయవలసిన యవసరము లేదు.

ద్వి :- అలాగునా ? ఆజ్ఞాపత్రిక నేను జూడలేదు. అట్లయిన మనమను కొనినట్లు నిరాటంకముగా జరిగింపవచ్చును.

ప్ర :- ఎప్పుడో యననేల యీ దినముననే యట్టివారల నియమింపుము.

వల్లెయని పలికినంత నందరు నిష్క్రమించిరి.

అయ్యమరక నృపాలుండు రాజ్యంబు మంత్రుల యధీనంబు గావించి పట్టణంబున కనతిదూరములో నున్న క్రీడాశైలమునకు నూర్గురు భార్యలతో నరగి యందుఫలదకుశకుసుమవిసర మనోహరతరుని కరపరివృతమగు నుద్యానవనములో స్ఫటికశిలాసంఘటిత సోపానమండితంబైన సౌధాతలంబున యమునాతీరంబున గోపి కలతో శ్రీకృష్ణుండువోలె నయ్యంగనలతో ననంగతంత్రపాండిత్యంబు దేటపడ నిట్లు క్రీడించెను.

మదుపాన మదంబున గలధ్వనులు గలిగి యీషత్స్వేదయుక్తంబులై మనో హర భాషణములతో నొప్పి పులకలుదయింపసీత్కారములతో గూడి పద్మసౌరభ ములు గలిగి సిగ్గుచే మూయబడిన కన్నులతో నొప్పి వ్యాపించిన మన్మథోద్రేకముతో సలుకలు చెలింప దీపించు నించుబోణుల మోముల జుంబించి చుంబించి యబ్భూపతి కృతకృత్యుండయ్యె.

గీ. చిత్రజాతకళాతత్త్వవేత్తయగుచుఁ
గుచగురూపాసనాశక్తి కొనలుసాగ
నిర్వృత స్వాంతుఁడగుచు నా నృపవరుండు
పడసెనప్పడు నిధువన బ్రహ్మసుఖము.

గీ. సౌరిదివాత్స్యాయనోదిత సూత్రజాత
భాష్యమెల్లనుఁజూచి భూపాలవరుఁడు
దివ్యశృంగారరసము మూర్తీభవించె
ననఁగడబోఁట్లతో మోద మనుభవించె.

మఱియు శ్రద్ధ, ప్రీతి, రతి, ధృతి, కీర్తి, మనోభవ, విమల, మోదిని, ఘోర, మదనోత్పాదిని, మద, మోహిని, దీపిని, వశకరి, రంజని యనంబరగు పది యేను కళలు మదవతులందు బొదలుచు శుక్లపక్షంబున బాదాంగుళము మొదలు శిరః పర్యంతంబు నెదమభాగంబు మీదుగా నెక్కి కుడిభాగమునుండి కృష్ణపక్షమునందు దిగును. కావున దదీయస్థానంబులు గ్రహించి యందందు జేయదగిన కృత్యంబులు నిర్వర్తింపుచు వారి వివశలంజేయుచు మనోభవ సామ్రాజ్యపట్టభద్రుం డై యేల బొదం గెను. తత్కృతాపూర్వక్రీడావిశేషంబుల కచ్చెరువందుచు నొకనాడు తద్భార్య లొండొరులిట్లు సంభాషించుకొనిరి.

వసంతకళిక :- యువతులారా ! మన ప్రాణనాథుని కృత్యములు యథా పూర్వకములుగా లేవు సుడీ. యబ్బురముల గా గనంబడుచున్నవి.

మదనమోహిని :- అక్కా ! నీ వన్న మాట సత్యమగును. లోకాంతరము నుండి నేర్చుకొని వచ్చెనేమో ముద్దులం బొదల జేయుచున్నాడు.

కేసరిక :- మదనమోహినీ! నీ మాటవలన జ్ఞాపకము వచ్చినది. మొన్నను తమాలిక యచ్చతురు నెతుకొని తిరిగిన దేమిటికి ? అది మిక్కిలి లజ్జావతియే పదు గురిలో నెట్లట్టిపని జేయనోపినది ?

మదన :- అది మగనితో జదరంగమాడి యోడిపోయినది. యోడినవారట్టి పని చేయవలయునని మొదట పణముగా నియమించుకొనిరి. అందుమూలమున జేతులతో నెత్తుకొనినది.

కేసరిక :- ఓహో మనోహరుడు మంచి నేర్పరియే కాకున్ననది యట్టిపని చేయునా ?

మదన :- సరి. అదియొక్కటే ? అంతకన్న ముగ్ధయగు తమాలికిలచేత వనితా సంఘమునకు దన పెదవి కొఱికించుకొనలేదా ?

కేసరి :- ఏమి మిషచే నట్లు చేయించెను.

మదన :- అక్షక్రీడలో నోడించి.

కేసరిక :- క్రీడాకైతవంబున దనకిష్టమైన పణములు పైచి యోడించి యభీష్టములు దీర్చుకొనుచున్నాడు. లేకున్న నాగరాసులు విందురా ?

మదన :- అన్నిటికంటె జనరంజనిచేత జిత్రమైన పని చేయించినాడు వింటివా ?

కేసరిక :- లేదు. లేదు. చెప్పుము.

మదన :- తమాలికకు దనతో నెవ్వరు సమముగా కాచికలు ద్రిప్పలేరని యెక్కుడు గర్వము గలిగియున్నది నిన్నను బ్రియునితో నాడుచు నతండోడిన నేమి పణమని యడిగిన మీ యిష్టమైన పందెము వేయవచ్చునని పలికినది. అప్పుడతండు పరాజితులు పురుషాయితము చేయుట పన్నిదముగావైచి యా చిలుకల కొలికిని ద్రుటిలో నపజయము బొందచేసి చివర కట్లు చేయించుకొనెను.

హేమ :- మేలుమేలు దానికే యంతపరాభవము ? వహ్వా, మంచిపని జరిగినది.

మదన—దానిమీద నీకంత కోపమేమి ?

హేమ—నేను మగనిని దామరపూవు పుచ్చుకొని కొట్టినంతనే వింతపడి పరిహాసముగా నందఱితో జెప్పినదే. ఇట్టిపని తానెట్లు చేసినదో.

కేసరిక—నీ కేమిటికి గొట్టవలసివచ్చినది.

హేమ—నాకును బరిహాసకేళిలో నట్టి యవమానమే తటస్థించినది.

కేసరిక—మన జీవితేశ్వరుని యపూర్వ చమత్కార శృంగార చర్యలకు నింత జెప్పవలసివచ్చెను. కాని దీనికేమి. మనుపి రసజ్ఞత యెక్కడిది ?

వసంతకళిక—రసజ్ఞతయో విరసజ్ఞతయో నాకు దెలియదు కాని యతండు ముట్టినంతనే మేనువివశత్వము నొందునేమి ?

మదన—వివశత్వ మొక్కటియే? కంఠమునుండి యేదియో వింత నినదము బొడముచుండును. అట్టి విచిత్రమెప్పుడు నెరుంగమే.

హేమ - అది కళా వేత్తృత్వ మహిమవలనం గలుగునట.

మదన—మన ప్రియుండు మనలంగూర్చి యెద్దియో గ్రంథము రచించి నాడట యెరుంగుదువా ?

కాంత—రచించుట గాదు. వాత్స్యాయన సూత్రములకు భాష్యము పరిశీలించుచున్నాడు.

మదన—కాదు. అనుసకమను పేరు బెట్టి సూర్యునికి నూరు శ్లోకములు రచించినట్లు మంజుభాషిని చెప్పి కొన్ని శ్లోకములు, చదివినది.

కాంచ—అయ్యో ! ఆ మాట నే నెరుంగనే ! మంజుభాషిణి యెక్కడ నున్నదో కదా ?

హేమ—అదిగో. గ్రంథము వర్ణించుచు సిట్లే వచ్చుచున్నది.

మంజు—[ప్రవేశించి] నా దెస జూచి నవ్వుచున్నారేమి ?

కాంచ—నీ చేతిలోనిదేమి ?

మంజు—అమరుకము.

కాంచ—ఎవరు రచించిరి ?

మంజు—మన ప్రాణేశ్వరుండే.

కాంచ—అందలి కథయేమి ?

మంజు—అందు మనయందరి కథలున్నవి.

కాంచ—ఏదీ యొక శ్లోకము చదువుము.

మంజు—శ్లో॥ కోపాత్కోమలలోలబాహులతికాపాశేనబధ్వాదృఢం
నీత్వామోహనమందిరం దయితయాస్వైరం సఖీనాంపురః
భూయోప్యేవమితిస్ఖలన్మృదుగిరాసంసూచ్యదుశ్చేష్టితం
ధన్యోహన్యత ఏవనిహ్నుతిపరః ప్రేయాన్సుదత్యాహసన్.

వసంతకళిక—ఇది యెవ్వతెనుగురించి రచించినదో చెప్పుకొనుడు.

హేమ—నాకర్థము తెలియదు. చెప్పితినేని నుడివెదను.

వసంత—బాహులతికలచే ప్రియుని బిగియబట్టి మోహన మందిరమునకు దీసికొనిపోయి సఖుల యెదుట నీతండేమి చేసెనో చూచితిరాయని ప్రియురాలిచే గొట్టబడు పురుషుడు ధన్యుడు గదా ?

మదన—నా కేమియుందెలియ దేని నీవే చెప్పుము.

వసంత—హేమా ! నీకు దెలిసినదా ? లేదా ?

హేమ—ఓహో ఇదియా ? తెలిసినది ఇది కనకప్రభ యొక్క ఖండితాత్వము ప్రకటింపుచున్నది కాదా.

మంజు—హేమా ! నీవు గ్రహించితివి. మదనమోహిని చెప్పుకొనలేక పోయినది గదా.

మదన—నాకర్థము తెలిసినది కాని యా చర్యలు నేను చూడలేదు కావున దెలిసినది కాదు. మరియొకటి చదువుము.

మంజు—శ్లో॥ తద్వక్త్రాభిముఖంముఖం వినమితం దృష్టిఃకృతాపాదయోః
తత్సల్లాపకుతూహలాకులతరే శ్రోత్రేనిరుద్ధేమయా
పాణిభ్యాంచతిరస్కృతిసపులకస్స్వేదోద్గమోగండయో
స్సఖ్యఃకింకరవాణి యాంతిశతధాయత్కంచుకేసంధయః

మదన—తెలిసినది తెలిసినది. ఇది ముగ్ధయగు భ్రమరవేణి కథ కదా.

మంజు—అగునగు నీమాటు గ్రహించితిని.

హేమ—అక్కా ? నాకు దెలిసినది కాదు. భావము చెప్పవూ ?

మంజు—వినుము. సఖులారా ! మీరు చెప్పినట్లుగా ప్రియుడు పల్కరింపుచుండ, ముఖమువంచి పాదములయందు దృష్టి నిలయజేయుచు చెవులు మూసికొని కపోలములయందు పులకలతో బొడమిన చెమ్మటను జేతులతో దుడిచికొనుచు సభిలాష వెల్లడి చేయకుండ నిలిచితినిగాని యప్పుడు నాయభిలాషయెల్లను విరిగినది. దానికేమి చేయుదును ? దేలిక పడిపోయితిని గదా యని తనకు బోధించిన సఖులతో భ్రమరవేణి పలికిన కథవిని మన మనోహరుడీ శ్లోకమును రచించెను.

హేమ—మన ప్రియుండు రహస్యాలాపములు కూడ వినుచుండెనా యేమి ?

మంజు—సందియమేల ? యీ క్రింది శ్లోకము వినుము. ఆ యర్థము తెల్లమయ్యెడిని.

హేమ—చదువుము. చదువుము.

మంజు-శ్లో॥ దంపత్యోర్నిశిజల్పతోర్గృహశుకేనాకర్ణితంయద్వచ
స్తత్ప్రాతర్గురుసన్నిధౌనిగదతస్తస్యాతి మాత్రంవధూః
కర్ణాలంబితపద్మరాగశకలం విన్యస్యచంచూపుటే
వ్రీడార్తావిదధాతి దాడిమఫలవ్యాజేన వాగ్బంధనం.

మదన—భళి. భళి. భళి. భళి. శృంగారవతి చాతుర్యము వెల్లడిజేసెను.

హేమ—అక్కా ! నాకది యేమియో చెప్పుము.

మదన—శృంగారవతి రాత్రి ప్రియునితో గ్రీడావిలాసముచే నాడిన మాటలన్నియు విని చిలుక వాసినెల్ల మఱునాడుదయకాలంబున పెద్దలయొద్ద మలుమారు పలుకుచుండవిని సిగ్గుపడుచు వడివడిం బోయి కర్ణభూషణమందలి పద్మరాగశకలము దీసి దాడిమ బీజంబు నెపంబున దానినోటంబెట్టి వాగ్బంధము గావించినది.

హేమ—శృంగారవతి మంచి నేర్పరియే. ప్రౌఢత్వమునగాక యట్టిపని తోచుట కష్టము.

మంజు—మనకోసెల్ల సదియే ప్రౌఢయని మనోహరుడు దానికి బిరుదిచ్చిన సంగతి నీవెరుంగవు కాబోలు.

హేమ—ఎరుగ నెరుగ మన ప్రౌఢత్వము లేమియు నతనియొద్ద గర్వ జేయవు. మఱియొక చమత్కారశ్లోకము చదువుము. అమరుకము విన డెందమూరక యభిలాషపడుచున్నది.

మంజు—నీకే కాదు. రసికులకెల్ల నట్లనేయుండును. వినుము.

శ్లో॥ దృష్ట్వైకాసనసంగతే ప్రియతమే పశ్చాదుపేత్యాదరా
దేకస్యానయనే పిధాయ విహితక్రీడానుబంధచ్ఛలః
తిర్యగ్వక్రితకంధరసపులక ప్రేమోల్ల సన్మానసా
మంతర్హాసలసత్కపోలకాంధూర్తోపరాంచుంబతి.

మదన—బాగు బాగు. వల్లభుడెంతచతురుడే. యువతులనెట్లు వంచించు చున్నాడో చూచితివా?

మంజు—అందు మూలముననే ధూర్తయని ప్రయోగించుచున్నాడు.

హేమ—అయ్యో నాకర్థము తెలియకపోవుటచేత కదా మీతోఁ గూడ సంతోషించు భాగ్యము పట్టినది కాదు. ఇది యెవ్వరి కథ. యేమి జరిగినదో ముందు చెప్పుడు తరువాత ననుమోదింపవచ్చును.

మదన—హేమలతా! యిది కౌముదీమోదినుల కథ. వారిద్దరు నొక గద్దియంగూర్చుండి యెద్దియో మాటలాడుకొనుచుండ మెల్లగా వెనుకగా బోయి మన ప్రియుండు, తన రెండు చేతులతో గౌముది కన్నులను మూసి మెడను వంకరగా ద్రిప్పుచు మేనంబులక లుప్పతిల్ల నంతర్హాసముచేత బ్రకాశించు కపోలములుగల మోదిని మోమును జుంబించెను. తెలిసినదియా?

హేమ—ఇంకను దెలియదా? సంస్కృతభాషా పాండిత్యమెక్కుడుగా లేకపోవుటచే సిటుతఁగపలసివచ్చినది. పాపము కౌముదిముగ్ధ కావున నట్టివంచన గ్రహింపలేకపోయినది. మోదిని ప్రౌఢయని యెఱుంగును కాబోలు. దాని కన్నులు మూయలేదు.

మదన—అదియేమైనదో నా పనును దెలిసికొని వెంటనే చేతులు విడిపించు కొన లేకపోయినదా? కౌముది ముద్దరాలు గనుక కన్నులు మూయుటయే సంతోష మని యెంచినది.

హేమ—అక్కా? మఱియొక చక్కని పద్యము చదువుము.

మంజు—విను.

శ్లో॥ పటాలగ్నే పత్యౌనమయతి ముఖంజాంతవినయా
హఠాశ్లేషంవాంఛత్యపహరతిగాత్రాణినిభృతం
అశక్తాచాఖ్యాతుంస్మితముఖసఖీదత్తనయనా
హ్రియాతామ్యత్యంతః ప్రథమపరిహాసేనవవధూః॥

హేమ—అర్థము చెప్పి పిమ్మట యనుమోదింపవలయును.

మంజు—[నవ్వుచు] తారావళి ప్రథమసంగమదివసంబున గావించిన కృత్యము స్వభావోక్తిగా నిందు వర్ణింపబడినది. ప్రియుండు చేలనులాగి వినయముతో

మోముపంచుచు, నతండు గౌగిలింపబోయిన నంగంబులు ముడుచుకొనుచు నెనిమిటి నిట్లు చేయవలదని చెప్పదని చెప్పలేక నవ్వుచుండెడి సఖురాండ్ర మొగములు చూచుచు దనలో దానే సిగ్గుచే నవోఢ తొట్రుపడుచుండెను.

హేమ—లెస్సగా నున్నది యింకొక శ్లోకము.

మంజు—

శ్లో॥ కాంతేసాగసియాపితె ప్రియసఖీవేషం విధాయాగతె
భ్రాంత్యాలింగ్యదుయారహస్యముదితంతత్సంగమాపేక్షయా
ముగ్ధెదుష్కరఏషఇత్యతితరాముక్త్వాసహాసంబలా
దాలింగ్యఛ్ఛలితాస్మి తేనకితవే నాద్యప్రదోషాగమె.

మద—అయ్యో ! యీలాటి మాయలు చేయుచుండెను. ఇతనియందు శ్రీకృష్ణుని చర్యలన్నియు గనంబడుచున్నవి.

హేమ—నాకర్థము చెప్పిన పిదపగాని మిమ్ము మాటాడుకొననియ్యను.

మంజు—ఇందుమణి మంజరి నాయకునిచే వంచింపబడి యా వార్త సఖుల కెరిగించు విధయమును వర్ణింపబడినది. సఖులారా ! ప్రియుని యపరాధ మెరింగి యింటికి రాగా గోపముతో బొమ్మంటి నావంచకుండుపోయి మదీయసఖివేషముతో వచ్చి గురుతు పట్టజాలక సఖియనుకొని కౌగలించుకొని "నేటి యింటికి వచ్చిన వానిని నిష్కారణకోపముతో వెడలగొట్టితిని. నీవు పోయి వాని నెట్లయిన దీసికొని రమ్ము. లేనిచో ప్రాణములు నిలువవని" పలికిన నా రహస్యమును విని యతండు అగుంగాని యా కార్యము చేయుట దుర్ఘటమని పలికి నవ్వుచు నన్ను బిగ్గర గౌగి లించుకొని నేటి సాయంకాలమున వచించెను. అని మణిమంజరి సఖులలో జెప్పినది.

హేమ—మేలు మేలు. మణిమంజరిని జక్కగా వంచించె. మంచి చతురుం డగు నింకొక్క శ్లోకము చదివి సంతోషపెట్టుము.

మంజు—శ్లో॥ అహంతేనాహూతాకి మసికథ యామీతివిజనె
సమీపేదాసీనా సరళహృదయత్వాదవహితా
తతఃకర్ణోపాంతెకిమపివదతాఘ్రాయవదనం
గృహీత్వాధమ్మిల్లంమమసఖీ ! పీతోధరరసః॥

మదన—అమ్మక్కచెల్లా ! ప్రియుం డెంత మాయవాండే.

హేమ—అదిగో ! నాకర్థము చెప్పక పూర్వము మీరేమియు నా విష యము ముచ్చటింపగూడదని చెప్పియుంటలేదా !

మదన—తదీయభావంబు మద్భావంబు నాకర్షించుటచే మఱచిపోయితిని. ప్రియుండు మన కాంచనమాల రహస్యస్థలమందు వసియింప మాటయని పిలిచి దగ్గిరకు

బోగా జెవిలో నెద్దియో చెప్పువాడుంబోలె నూది హేమ ముఖాఘ్రాణింపుచు జడగైకొని యధరరస మానెనఁట. అయ్యర్థంబాయువతి సఖితో జెప్పుచుండనట్లిందు వ్రాసి నెంత చతురుడో చూడుము.

హేమ—అక్కా ? యీ శ్లోకములన్నియు నాకు జెప్పెదవా ? అర్థముతో వర్ణించి మన సఖురాండ్రనెల్ల వెరపించుచుందును.

మంజు—అలాగే కాని యిప్పుడు తీరికలేదు. శేవు చెప్పెద బోయి యెత్తునా ?

వసంతకళిక—చెల్పుదినాలుగ శ్లోకము చదివి పిమ్మట బొమ్ము. అది పైకి తీసితివి గదా.

మంజు—సరియే యెంతసేపు నిలువను ? సంగీతశాల కరుగవలయు నుపాధ్యాయుండు వచ్చి వేచియుండునేమో ?

వసంత—అదియొక్కటియే కాదా చదివిపొమ్ము.

మంజు—శ్లో॥ శూన్యంవాసగృహంవిలోక్యశయనాదుత్థాయకించిచ్ఛనైః
నిద్రావ్యాజముపాగతస్యసుచిరంనిర్వర్ణ్య పత్యుర్ముఖం
విస్రబ్ధంపరిరభ్యజాతపులకామాలోక్యగండస్థలీం
లజ్జానమ్రముఖీప్రియే హసతాబాలాచిరంచుంబితా.

హేమ—అర్థము చెప్పి కదలుము.

మంజు—ప్రియుం డేకాంత గృహంబున నొక్కరుడు శయనించి యుండ విద్యుమోష్టి మెల్లగా లోనికిబోయి కపటనిద్ర బోవుచున్న యతిని మొగము సోయగము వర్ణించుచు నుప్పొంగార మద్దిడుకొనబోయి యందు బులకలు పుట్ట జూచి సిగ్గుపడి తలవంచుకొనుచు, దిగ్గున లేచి యతం డాబాలను చుంబించెను. ఇదియే దీని యర్థము.

హేమ—విద్యుమోష్టి యనురాగము వెల్లడిచేయును.

మంజు—ప్రియుండీశ్లోకము చక్కగా రచించెను. నేనిక నిలువరాదు పోయివత్తు. సంగీతశాల నాచార్యుండు వేచియుండుంగదా.

హేమ—పోనీ పుస్తకమిచ్చి పొమ్ము. మేము చదువుకొనుచుందుము.

మంజు—అలాగునే యని పుస్తకమిచ్చి నిష్క్రమించినది. పిమ్మట తక్కిన యువతులు నా పుస్తకము చదువుకొన మరియొక చోటికిం బోయిరి.

అని యెరింగించి మణిసిద్ధుం డప్పటికి కాలాతీతమగుటయు దదనంతరోదంత మన్వలిమజిలీయం దిటుల చెప్పదొడంగెను.

—:●:—

శ్రీ రస్తు

# కాశీమజిలీకథలు

## 51 వ మజిలీ

### చతుర్థోల్లాసము

అట్లు శంకరయతిచంద్రుం డమరకన్యపశరీరంబు ప్రవేశించి తత్కాంతా రత్నములతో గంతుక్రీడావిశేషంబు లనుభవించు చున్నంత నియమించిన సమయ మతిక్రమించుటయు నచ్చట గొందఱిలంబునం గళేబరమును గాచికొనియున్న శిష్యులు విచారముతో నొండొరులిట్లు సంభాషించుకొనిరి.

పద్మపాదుడు :- అయ్యో ! మనయాచార్యుండు నియమించిన యవధి దాటి యైదారు దినములైనది. యిప్పటికిని దనశరీరమున బ్రవేశించి మరల సనాథులం జేయకున్నాడు ఏమి చేయుదము? ఎందు వెదకుదుము ? అతని జాడజెప్పువారెవ్వరు? అన్యశరీరమున నిగూఢుడైన యతని గురుతు పట్టుట యెట్లు ?

వామదేవుడు :- పద్మపాద ! ఆ తీర్థపాదుని దర్శనము మనకు వెండియుం గలుగునా ?

గుణనిధి :- దుర్జనుల యవినయముల బోగొట్టుచు సజ్జనుల సంసారాగ్నిం జల్లార్చునమ్మహాత్ముండు మనల నుపేక్షజేయునా ?

హంసుండు :- ఓహో సకలదురితంబుల విలయము నొందింపుచు నవన వాహ్లాదముల గలుగజేయు యతీంద్ర చరణసేవకన్న మిన్నయగు వ్రతమేమియున్నది?

చిత్సుఖుడు :- హా ! గురువరా ! నీవు శీఘ్రముగా రాకపోయితివేని మా శోకమును బోగొట్టువారెవ్వరు ?

చిత్రభానుడు :- మేమెల్ల నిన్ను నమ్మియున్నవారము. అనాథులము. సాధుమతీ ! వేగము వచ్చి మమ్మోదార్పవా ?

పద్మపాదుడు :- మిత్రులారా ! మీరూరక చింతించిన ప్రయోజనము లేదు. నేనొక యుపాయంబు వచించెద. వినుడు. మనమీ పుడమినెల్లపర్వతగుహారణ్యములు వెదకి యందు గనంబడినచో స్వర్గపాతాళముల సైతము వెదకుదము గాక.

చిత్రభానుడు :- మూడులోకములు వెదకినను అన్యశరీర నిగూఢునతని నెట్లు గ్రహింపగలము ?

పద్మపాదు :- అయ్యో ! రాహుగ్రస్తుండైనను జంద్రుండు తత్ప్రకాశ గుణములచే దెలిసికొనబడుచుండలేదా ? అమ్మహాత్ముని యునికి తద్గుణములే వెల్లడి చేయగలవు.

చిత్సుఖుడు :- సందేహమేల ? మేఘచ్ఛన్నుండైనను సూర్యుని తేజము తెల్లముగాకున్నదియా ?

పద్మ :- మన్మథకళాపాండిత్యము సంపాదింపనకామున్ డైనను కామినీజన ప్రియమగు శరీరమును ప్రవేశించియుండవోలు. అతండుండు దేశమున బ్రజలకు రోగశోకాదిబాధలు గలుగక నిత్యతృప్తులై స్వధర్మ నిరతులై యుందురు. వర్షములు చక్కగా వర్షించును. భూమిత్రుణకాష్ఠజలసమృద్ధి గలిగియుండును. ఇవియే గురుతులు.

చిత్రభానుడు :- అట్లైన నాలస్యమేమిటికి ? యిప్పుడే పోవుదము రండు. వృధా కాలక్షేపము చేయనేల ?

పద్మపాదు :- ఆచార్యశరీరము రక్షించుచు గుణనిథ్యాది విద్యార్థు లిందుండ వలయును. మనమందరము వెదుకవలయు నిదియే నా యభిప్రాయము.

చిత్సుఖు :- అందులకు మేమందరము సమ్మతించితిమి. అని యొండొరులు మాటాడికొని పద్మపాదాదిశిష్యులందు గొందరినుంచి గురున్వేషించు తలంపుతో నక్కొండదిగి యా ప్రాంతారణ్య భూముల నరసికొనుచు నరిగి యరిగి కనంబడిన గ్రామములలో నెల్ల విశేషముల నడిగి తెలిసికొనుచు దేశాటనము గావింపుచుండిరి.

గీ. శంకరాచార్యశిష్యు లాశ్చర్యలీలఁ
బురనదీపక్కణారణ్య భూములట్లు
వెదకికొనుచును ధిక్కృత విబుధదేశ
ములగు నమరు కన్యపదేశములకుఁ జనిరి.

తచ్ఛాత్రోత్తములద్దేశంబు సంపన్నశస్యంబుగాంచి వెరగుపడుచు గ్రమంబున దద్రాజధానికరిగి యొక భూసురుని యింటి కతిథులగుటయు నతండు వారినుచితసత్కారంబుల నాదరింపుచు మృష్టాన్న సంతృప్తులం గావించి పిమ్మట వినయముతో వారి కిట్లనియె. అయ్యా ! మీ నివాసదేశమెచ్చట ? ఎందుబోవుచున్నారు ? ఇచ్చటి కేమిటికి వచ్చితిరి ? భవదీయ చరణరజస్సంపర్కమున మద్గేహంబు పవిత్రమైనదిగా ! యని యత్యంతస్తోత్రపూర్వకముగా నడిగిన విని యా శిష్యులిట్లనిరి. గృహమేధీ ! మాది కాశీదేశము. గురుపిత్రార్థులమై మేము వచ్చితిమి. యీ దేశ మెవ్వరిది ? తన్నామధేయమెట్టిది ? మీ రాజు పండితుల గౌరవించునా? సరసత్వమున్నదియా ! అతండే విద్యలయందిష్టము గలవాడు ? ప్రాయమెంత ? విశేషములేమి ? యని యడిగిన విని యా బ్రాహ్మణుండిట్లనియె, ఆర్యులారా ? అమరుకుండను నృపాలుండీ దేశమును బాలించుచున్నారు. అతనిని గడుధర్మాత్ముండనియే చెప్పదగినది. యీ నడుమ

నొక విశేషము జరిగినది వినుడు. ఆతనికి నాథేపన క్రీడయందు మిగుల వేడుక యగుటచే నా జనపతి తరచు వేటలాడుచుండును. కొన్ని నెలల క్రిందట నొక మహారణ్యములో క్రూరసత్త్వములు మిక్కుటముగా నున్నవని విని కతిపయ పరిచరపరివృతుండై గుఱ్ఱమెక్కి యత్కాంతారమునకుంజని యజ్జనపతియొక చెట్టుక్రిందం గూర్చుండి యర్ధరాత్రంబునం మృగములజాడ నరయుచుండెను.

అంతలో నత్యంత శిరోవేదన యావిర్భవించుటయు నా వ్యథ సైరింపలేక యాతరువు క్రింద బరిచారిక విరచితపత్రశయ్యను శయనించి యారాజ పంచాననుండు వారు చూచుచుండగానే రెండు గడియలలో బంచత్వము నొందెను అట్లు విగతచేతనుండై పడియున్న యన్నరపతింజూచి చింతాసంతాపితస్వాంతులై కింకరు లార్త నినాదములతో వచ్చి యవ్వార్త నిప్పురంబంతయు వెలయజేసిరి. అమరుకుండు రూప యౌవన కళాన్వితలగు యువతులనేరి నూర్గురబెండ్లియాడి యున్నవాడు. కావున వారెల్ల నయ్యుపద్రవమును వినినతోడనే కలనాలఖండిత కదళీప్రకాండంబువోలె నేలం బడి దారుణశోకాయత్తములగు చిత్తముల నుత్తలమందుచు మంత్రిసామంతపౌరదాస దాసీజనంబులు వెంటనరుదేర నప్పుడయమ్మహారణ్యంబునకుంబోయి యందొక చెట్టు క్రింద స్వర్గపదభ్రష్టుండైన పుణ్యపురుషుండువోలె నేలంబడియున్న యన్నరేంద్రుం గాంచి యక్కాంచనగాత్రులొక్కపెట్టున నయ్యరణ్యంబు ప్రతిధ్వనులీయ నతని గాత్రముపైబడి యేడువ దొడంగిరి. రెండుదినంబు లేకరీతినట్లు నిద్రాహారంబులు మాని యమ్మెంచుబోణులా నృపతి కళేబరము విడువక శోకించిరి. అప్పుడు మంత్రులెట్టకేని వారినూరడింపుచు నీశరీరము నిలువదు. ఇతండు పుణ్యపురుషుండు. అగ్ని సంస్కారములు గావింపవలయునని పలికి యథాశాస్త్రముగా సంస్కారములు గావింపం జేసి యతని శరీరమును జితిపై నెక్కించిరి.

అట్టిసమయమున నేనందేయుంటిని. తత్కాంతారత్నములెల్ల జితిపైబడి మమ్ముంగూడ నిందుంగప్పుం డగ్గినంటిపుడని పలుకుచుండ మంత్రులు ...రింపుచు వారినూరడించి తీసికొనిరండని తగువారిని నియమించుచుండిరి? అంతలో నప్పుడిసి కాంతునియంగము గదలినట్లు పొడకట్టినది. అత్తెఱంగెరుగు నతడు ...చేయక యట్టే నిలువంబడి చూచుచుండ గొండొకపడికి సూపిరి. విడుచుచున్నట్లు తోచుటయు సంభ్రమముతో నుండుండుడు ఉండుడు. మనపుణ్యము ఫలించుచున్నట్లున్నది. అనిపలుకుచు జేతులుసాపుచు బరీక్షింపుచుండ నిట్టూర్పు విడుచుచు నా తిగిల్లెను. అప్పుడు రాజు బ్రతికె బ్రతికెనను నినదము లయ్యరణ్యమంతయు వ్యాపించెను. పిమ్మట నమ్మనుజపతియు నిద్రించి మేల్కొనినట్లు లేచి కూర్చుండి యున్నల నవలిమిగొనుచు నేమి యిట్లేడ్చుచున్నవారని యడిగెను. అప్పుడప్పడంతులు ప్రాణనాథునిపైబడి యేడ్చుచు దద్వృత్తాంతమంతయుం జెప్పిరి. తరువాత నాథునేత వారినెల్ల నోదార్చుచు నమా

త్యాదిమిత్రవర్గముతోఁ గూడికొని మెండువేడుకతో వెండియు నిప్పురి కరుదెంచి పట్టాభిషిక్తుండై రాజ్యము గావించుచుండెను. నాటంగోలె నానృపతి పుటంబువడిన పసిండి వోలె వన్నెగలిగి యత్యంతతేజంబు మెఱయ నొప్పుచుండెను. ప్రజలు రోగశోకాది వ్యథలు వహింపక ధర్మతత్పరులై మెలంగుదురు. ఇదియే మానృపతి వృత్తాంతము. మరియు భార్యల సంతసపరుప నిప్పుడు రాజ్యంబు మంత్రుల యధీనముఁజేసి తాను కేళీశైలంబున విహరించుచున్నవాఁడు. శృంగారలీలాకలాపంబున నానందించుచు భార్యలతో వేడుక లనుభవించుచుండుటంబట్టి యిప్పుడు మీవంటివా రాయనను దర్శించుటకు సమయముకాదు. సంగీతవిద్యాప్రవీణులకుగాక యితరులకు నమరుకుం డవసర మిచ్చుటలేదని వాడుకయున్నది. ఇదియే నాయెఱింగిన వృత్తాంతమని చెప్పి బ్రాహ్మణుం డూరకుండెను.

ఆ కథవిని పద్మపాదాదు లత్యంత సంతోషసాగరంబున మునుంగుచు అవును నాఁడు నాతో నతనిపేరే చెప్పిన జ్ఞాపకము. అయ్యారే మనయయ్యవారే యితండు సందియములేదు. తరుణీసక్తుండై యున్నవాఁడని యొండొరుల చెప్పుకొనుచు వీణలు సంపాదించుకొని గాయక వేషములు వైచుకొని గీతంబులఁ బాడికొనుచు నప్పట్టణవాసులనెల్ల రంజింపజేయుచుఁ గ్రమంబున నానృపాలుని శ్రుతిపథంబుఁ బ్రవేశించి యతనిచే నాహూయమానులై యొకనాడు తదాస్థానమున కరిగి యందు,

సీ. ఇరుగెలంకుల నిల్చి కరకంకణధ్వనుల్
        బరగఁ జేడియలు చామరము లిడఁగ
    ధర్మదండసితాత పత్రరత్నద్యుతు
        ల్మకుటమాణిక్య దీపికలఁబెనుప
    శరదిందు ముఖులు కొందరు సుందరనుగాన
        లాసస్వనముల నుత్సవముసేయ
    వాకామినులు లొక్కవంక శృంగార లీ
        లాతిచాతుర్య నృత్యములు జరుప.

గీ. అకృతింగని భువిఁజేరి నట్టి మదనుఁ
    డనఁగ యువతీతాశవృతుం డగుచుఁ దార
    కావృతుండగు హిమకరు కరణిఁగొలువు
    కూటమున నొప్పు నృపుఁగను గొనిరివారు.

కనుంగొని తదీయశృంగారలీలావినోదంబుల కచ్చెరువందుచుఁ దదాజ్ఞనందరు నుచితపీఠంబులం గూర్చుండి యాసలాసదులన పూర్వగాంధర్వవిద్యాకౌశలంబున మోహింపంజేయుచు భృంగకైతవంబున నమ్మహారాజున కీల్గాత్మవృత్తాంతంబు బోధపరచిరి.

ఉ. భృంగమ నీవుభూధరదరీవవరంబున మేసువైచి యా
సంగతి నించుకంతయు విచారము సేయక యిందుఁగావవ్ర
తింగుతుకంబుఁజెందెదవు ధీరతయే నినుఁగాంచియున్న యా
భృంగములెల్ల నీకొలఁకు భేదముఁజెందుచునుండ నయ్యయో.

క. మననకళాపాండిత్యం
బొదవఁగఁ దొలిమేనుసువిడిచి యొగి నిచ్చట ష
ట్పదమా! క్రుమ్మరెదవు నీ
వది యెరుఁగక యుల్లు మోహమందుట తగునే.

గీ శాంతిదాంత్యాదికాధార సరణిఁబడిచి
గర్వమున నాత్మవస్తువు గానపేము
తలఁచికొనుము మనంబులోపల నిజంబు
దెలియ మామాటలను భృంగ కులవరేణ్య.

గీ. నేతినేత్యాదిశా స్త్రగీతిబుధులు
శృతిజగంబంతయును నిషేధించి యంచు
సోహమనిదేసినాత్మకా నూహసేయు
దు రదియేసూవె నీవు బంభరవరేణ్య.

గీ. దంచి ధాన్యంబుఁ బొల్లు పరించితండు
లములఁ గైకొనురీతి సత్తములు యుక్తిఁ
బంచకోశమ్ములను వివేకించి దేని
నేరికొందురొతత్త్వ మీవె భృంగ.

చ. సరయతినింద్రియాశ్వములు స్వైరగతిన్విషమప్రదేశముల్
దిరుగఁగ దోషదర్శనసుతీక్ష్ణకశాపరితాడనంబుల
న్మరలచిస్వాంతలక్షణసమంచితరశ్మలదేనియందు సు
స్థిరముగఁ గట్టివేయుదుర ధీరులు నీవదికావె భృంగమా.

గీ. అరయ నేది జాగ్రదాద్యవస్థల నను
స్యూతమై యుపాధి జాలమంట
క నరుగంచు దార మట్లెరుగనుండు
నట్టితత్త్వమీవె యళివతంస.

సీ. శమదమోపరమాది సాధనంబులచేత
స్వాత్మచేతనె తమ యాత్మయందు

విద్యాంసు లెద్దాని వెదకి శ్రద్ధాభక్తి
　విశ్వాసయుక్తి దద్విధమెఱింగి
యధిగతామిత సచ్చిదానందరూపులై
　సంసారమున వెంది జననమరణ
లక్షణక్లేశంబులను జెంద రెప్పుడుఁ
　నిత్యసౌఖ్యోన్నతి నెసఁగుచుండు.

గీ. రట్టితత్త్వంబు నీవెఱుఁగు మహీవతంస
తలఁచికొమ్ము మనంబులోపల నిజంబు
దెలియుమాటలను దేట తెల్లముగను
మోహమంపుట తగదు నీ కైహికమున.

వ. అని యిట్లు వీణాతంత్రీస్వానంబులతో గంధనాదంబుల మేళగించి యాయంతేవాసులత్యంత మనోహర స్వరంబున గాంధర్వంబు బాడి తత్సభాసదుల మోహవివశులం గావించిరి. అమరకుండును దద్గానామృతంబు గ్రోలి వివశుండయ్యెనోయన దద్వాక్యంబులంగల యభిప్రాయంబు హృదయంబునకు బశ్చాత్తాపము గలుగఁజేయ సహృదయ పీఠకంబునందకు మేను జేర్చి విగతచేతనుం డయ్యెను.

అవ్విధంబుసూచి యతండు నిద్రించుచున్నవాఁడని తలంచి రాజభటులు సద్దుచేయవద్దని సఖ్యులకెల్ల దెలియజేసిరి. అప్పుడొక్కింతసేపు తత్సభాభవనము చిత్రతరంబైయున్న నిశ్శబ్దమై యుండెను. ఆ నృపాలుం డంతసేపటికిని లేవక యట్లనే పడియుండుటఁ దిలకించి మంత్రులోఁబలు కొందఱు దాపునకుఁబోయి విస్మితవదనములతో కళదప్పియున్న యతని యాకృతిం జూచుచు "అయ్యో! యిది యేమి చిత్రము? ఈ ధాత్రీపతిమునుపు మూర్ఛనొందినట్లున్నవాఁడ"ని పెద్దయెలుంగున బలికిన నా ధ్వనివిని యందున్న రాజభార్యలెల్ల బెల్లుగా నేమియేమియని యరచుచు దాపునకుం బోయి చూచి గుండెలు బాదుకొనుచు, హా! యింకేమి యున్నదనువారును, యిట్టి ప్రాణనాథుఁడు మనకేమిటికిఁ దక్కుననువారును, ఆ గండముదాటి యింతలో మరల నిట్లయ్యెనేమనువారును, మునుపోలె మరల బ్రతుకునేమోయనువారును, మనకట్టి యదృష్టము పట్టునాయనువారును, ఎంతలో నెంత సంతోషము పెట్టి నిట్లయ్యెనేయనువారును. ఈనడుమ నీ సుఖము చేయక పోయినను నింత విచారము లేకపోవునువారును నారాజకాంతలెల్ల నా నెలదినములలో నతండు గావించిన కృత్యములన్నియు స్మరించుకొనుచు నుచ్చస్వరంబున నేడ్వఁదొడంగిరి. అంతలో నా వృత్తాంత మాలించి సామంత మంత్రి పురోహితాదు లచ్చోటికివచ్చి యతండు చచ్చుటంజూచి యచ్చెరువందుచు నంతకుఁబూర్వము జరిగిన కథయంతయు విమర్శించి బుద్ధిమంతులగు మంత్రులా గాయకు లెచ్చట నున్నారని కేకవేసిరి.

గాయకులు — (ముందరికి వచ్చి) అయ్యా ! మేమే గాయకులము.

మంత్రులు — మీదే దేశము ?

గాయకులు — మా కొకదేశము విషయములేదు. సర్వదేశములు మావే. అన్ని దేశములు తిరుగుచుందుము.

మంత్రులు — మీరిక్కడికి వచ్చి యెన్ని దినములైనది ?

గాయకులు — నాలుగు దినములైనది.

మంత్రులు — మీరెవ్వరి యాజ్ఞఁబూని యీ లోపలకు వచ్చి సంగీతముఁ బాడిరి ?

గాయకులు — దేవియానతి మీఁదనే పాడితిమి.

మంత్రులు — మీరేమి గీతములు పాడితిరి !

గాయకులు — భ్రమరగీతములు లోనగునవి పాడితిమి.

మంత్రులు — వానిలో నిపుడొక గీతమునుచ్చరింపుఁడు.

గాయకులు — ఏమిటికి ?

మంత్రులు — పనియున్నది.

గాయకులు — గీ. శాంతిదాంత్యాది కాచార సరణి విడిచి
గర్వమున నాత్మవస్తువు గానవేమి
తలఁచికొనుము మనంబులో పరసిజంబు
దెలియు మా మాటలను భృంగకులవరేణ్య.

మంత్రులు — (ఒండొరుల మొగములు చూచుకొనుచు) ఇంతకుఁ బూర్వము ప్రారంభమునఁ జదివిన గీతముఁ జదువుఁడు.

గాయకులు — ఉ. భృంగమ ? నీవు భూధరదరీపరిరంభున మేనువైచియా
సంగతి నించుకంతయు విచారము సేయక యిందుగామవృ
త్తింగతుకంబుఁ జెందెదవు ధీరతఁ బూనినఁగాచియున్న యా
భృంగములెల్ల నీ కొఱకు ఖేదము నొందుచు నుండనయ్యయో.

మంత్రులు — అయ్యా ! దీనికర్థమేమియో చెప్పుము.

గాయకులు — దీనియర్థము మాకుఁ దెలియదు. మూలము మాత్రము పాఠముఁ జేసితిమి.

మంత్రు — మీరర్థముఁ దెలియకయే దీనిం జదివితిరా ? ఈ గీతములెవ్వరు రచించినవి ?

గాయకులు — అదియుం దెలియదు. మాకు సాహిత్యములేదు మేము వట్టి మూఢులము. మమ్మిన్ని ప్రశ్నములు వేయుటకుఁ గారణమేమి యున్నది.

మంత్రులు — మీరు మూఢులా సత్యము చెప్పుఁడు.

గాయకులు—ప్రపంచకమే యసత్యమైయుండ మా మాటలు సత్యములని మిమ్మెట్లు నమ్మింతుము ? సత్యమసత్యము. అసత్యము సత్యము నెన్నఁడును కానేరదు గదా.

మంత్రులు—ఓహో మీరు గాయకులమని మోసపుచ్చి లోపలకు వచ్చి మా రాజుగారి ప్రాణములు గ్రోలితిరే.

గాయకులు—అయ్యో ! ఏమేమి చేసితిమి. దూరముగా నుండియే పాడితిమి. గానాంతరమున విమర్శింప నవసరము గలుగదయ్యె. మాయపరాధమేమియున్నదియో యంతఃపురకాంతల నడిగి తెలిసికొనుఁడు.

మంత్రులు—అంతయు నెఱుంగుదుము. ఎవ్వరిని నడుగనక్కరలేదు. కానిండు, మీ యపరాధము ముందు విమర్శింతుము. మా యానతిలేక యెందునుం బోవలదు.

అని పలికి వారింగాంచియుండఁ గొందఱఁ గింకరుల నియమించి యా మంత్రులు రాజకార్యములనెల్ల నూహించుచు నా నృపతికి శాస్త్రగతి నపరసంస్కారాది కృత్యంబులు నిర్వర్తించి సమంచితమగు ముహూర్తంబునఁ దత్పుత్త్రునిం బట్టాభిషిక్తుం గావించిరి. ఇంతలోఁ బూర్వమమాత్యప్రేషితులగు భృత్యులు కొందఱు వచ్చి మంత్రులతో నిట్లనిరి. అయ్యా మేము మీయానతినరిగి యరణ్యములు, కొండలు, గుహలు లోనగు రహస్యస్థలంబులెల్ల నరసితిమి. నరసింహశైలంబున మాత్ర మొండువింత గంటిమి చిత్తగింపుడు. అత్యున్నతంబగు తదీయశిఖరం బెక్కి నలుమూలలు వెదకితిమి. ఒక గుహాముఖంబునఁ గొందరు బోడిబాపనయ్యలు జేగురుగుడ్డలు కట్టికొని నివసించియుండిరి.

వారింజూచి మీరిందేల యుంటిరి ? ఈ గుహ విమర్శింపవలయు లోపలికిఁ బోవలె నడ్డము లెండని పలికిన విని మఱేమియు నుత్తర మియ్యక వారు లోనికి బోవలదని సంజ్ఞ జేసిరి. వారి మాటలు పాటింపక మేము త్రోసికొని లోనికిం బోయితిమి. అందొక పాషాణముమీఁద జేగురు వస్త్రము ముసుంగిడుకుని యొకఁడు శయనించి యుండెను. వాని ప్రాయంబిరువది యేండ్లకు లోపుగానున్నది ఆయనను జూచి మేము లెమ్ము లెమ్ము నీవిందేమిటికిఁ బరుండితివని యెంత బిగ్గరగా నరచినను లేవక మాటాడక యట్లేపడియుండెను.

అప్పుడది శవమని తలంచి మేము మీ యానతి చొప్పున దానిని దహింప యత్నింపుచుండ నందున్న బాపనయ్యలు మాతోఁ గలహించి యతండు తమ గురువనియు ముట్టగూడదనియు యోగనిద్రఁ జెందియున్నవాఁడనియుఁ బెద్దతడవు చతుర

పాయములచే నాటంకము పెట్టిరి. కాని వారి మాటలు లెక్కసేయక యది నిద్రకాదని యట్టితల్లక్షణములన్నియుఁ బరీక్షించి యాశవమును బలాత్కారముగఁ బట్టుకొని యందొక చితి యేర్పరచి వానింపై పెట్టి యగ్ని యంటించితిమి.

ఆ బాపనయ్యలు తమ శక్తికొలది యాశవమును గాపాడుటకుఁ బ్రయత్నములఁ జేసిరి. కాని వారికంటె మేమెక్కుడుగా నుండుటచే వారి యుద్యమములేమియుఁ గొనసాగినవికావు. చిటచిటా రావములతో నగ్ని ప్రజ్వరిల్లుచుఁ బెల్లగు జ్వాలలుత్పతిల్లనా శవమును చేతులు మాత్రమంటుకొనువఱకుఁ దటాలునలేచి కూర్చుండి ప్రాణములతో నాయన చితినుండి నేలకురికెను. అప్పుడు మేము భయపడుచు బారిపోయి యీ ప్రాంతమందున్న కుంజములఁ దాగి చూచుచుంటిమి.

అప్పుడాయనను జుట్టుకొని యా బ్రాహ్మణులెద్దియో ప్రసంగముఁ గావించిరి. పిమ్మట నతండు కన్నులు మూసికొని యేవియో కొన్ని శ్లోకములు చదివెను. అంతలో నతని చేతులు యథాపూర్వముగా విరాజిల్లినవి. ఇంతవట్టుచూచి వేగముగా నా వృత్తాంతము మీకెఱింగింప వచ్చితిమి. అతఁడు మిక్కిలి మహానుభావుండని తోచుచున్నది. తెలియక యపరాధము గావించితిమి. మాలోనొకని కింటికివచ్చునరికిఁ గన్నులు పోయినవి. వాఁడా బ్రాహ్మణులతో నెక్కుడుగాఁ గలహించి వారిందరనకరించుకొనుటకు మట్టుపడదనుచుండ నాశవమునుఁ బాదముతోఁ దాకెను అదియేకదా మూఢత్వము, గర్వము. యుక్తాయుక్త వివేకము గలుగనీయదు. ఆ సాధువును దహించినందుకు మాకేమి ముప్పువచ్చునో యని వణకుచున్నవారము. ఇదియే మాయెఱిగించు విజ్ఞాపనమని చెప్పి యాదూతలు తమ నెలవునకుం బోయిరి.

అప్పుడా మంత్రు లొండొరు లాలోచించుకొని యోహో! అతండే యీతండు. వీండు చెప్పిన సమయమున రాజు సమసిన సమయము నొక్కటియేయైనది. మనమనుకొనినట్లే జరిగినవి. ఈ గాయకు లాతనిశిష్యులై యుందురు. వీరిలో వీరికెద్దియో సాంకేతికము గలిగియున్నది. ఏది యెట్లైనను వీరినింక మనము నిర్బంధింపరాదు. వీరు మహాత్ములని తద్గీతములే చెప్పుచున్నవి. అని నిశ్చయించి యప్పుడే పద్మపాదుల రప్పించి యపరాధముఁ జెప్పికొనుచు యథేష్ట గమనంబున కనుమతించిరి.

పిమ్మటఁ బద్మపాదుం డతిరయముగా నరసింహక్షేత్రమున కరుగుచుండ దారిలోఁ గొందరు శిష్యులెదురుపడి యోహో మీరింత జాగుచేసితిరేల? మన గురువుగారు జీవించిరి. మీరాక కెదురుచూచుచున్నారు. కొందరు క్రూరులు మేమున్న గుహకు వచ్చి యందాచార్య శరీరముఁ జూచి దహింపఁజేయ దొడంగిరి. ఇంతలో సమ్మహానుభావుండు శరీరమునఁ బ్రవేశించెను. దగ్ధములైన యవయవముల రక్షించుటకై నరహరిస్తుతి గావించి తత్ప్రసాదంబున నగ్నిబాధం బొరయక యథా పూర్వావయవములతో విరాజిల్లుచున్నారు. తత్కృతస్తుతిశ్లోకంబుల మేమెల్లరము వర్ణించితిమి. మిక్కిలి వైరాగ్యోపబోధకములై యున్నవి వినుండు.

శ్లో॥ శ్రీమత్పయోనిధినికేతనచక్రపాణి
భోగీంద్రభోగమణి రాజితపుణ్యమూర్తె
యోగీశశాశ్వతశరణ్యభవాబ్ధిపోత
లక్ష్మీనృసింహమమదేహికరావలంబం॥

శ్లో॥ సంసారసాగరవిశాలకరాళకాల
నక్రగ్రహగ్రసననిగ్రహవిగ్రహస్య
వ్యగ్రస్యరాగలసదూర్మినిపీడితస్య
లక్ష్మీనృసింహ మమదేహి కరావలంబం॥

శ్లో॥ లక్ష్మీపతె కమలనాభసురేశవిష్ణో
వైకుంఠకృష్ణమధుసూదనపుష్కరాక్ష
బ్రహ్మణ్యకేశవజనార్దనవాసుదేవ
లక్ష్మీనృసింహ మమదేహికరావలంబం॥

అని తచ్ఛ్లోకంబులనెల్లఁ జదువుటయు నాలించి పద్మపాదాదులత్యంత సంతోషముతో గురుప్రభావ మగ్గింపుచు నరిగి యరగి యగ్గిరి శిఖరంబునకు జని యందాచార్యవర్యుం గాంచి మేనంబులకలుద్భవింప నానందబాష్పములచేఁ గంఠంబు డగ్గుత్తికఁబొరయ నరయముగాఁ బచ్చరణ రాజీవంబుల కెరంగుటయు నమ్మహాత్ముండు వారినెల్ల లేవనెత్తి మన్నించుచుఁ బెద్దతడువ వారితో వియోగచింతా సంతాపంబువాయ ముచ్చటించెను.

పదంపడి యయ్యతిపతి శిష్యులతోఁ గూడికొని సనందనాది యోగులంగూడిన సనకమహర్షియుంబోలె విరాజిల్లుచు యోగంబున నెగిరి యల్పకాలములో మండన మిశ్రునిమందిర మలంకరించెను. అట్లాకాశమార్గమున వచ్చిన శంకరుంజూచి మండన మిశ్రుఁడు ప్రాంజలియై వినయమున నతిథిపూజ గావింపుచుఁ బాదంబులంబడి, మహాత్మా ! మదీయగృహశరీరాదికములు నీ యధీనములు. నీకు నేను ప్రేష్యుండఁ గర్తవ్యముపదేశింపుమని పలికెను. అప్పుడు భయభారతిచే నర్చింపబడిన శంకరయతి చంద్రుంజూచి మహాత్మా ! నీవు పరమేశ్వరుండవు. నన్ను సభలోఁ గామశాస్త్రప్రసంగములో నోడింపక వాని నేస్సకొను వాడుంబోలె మిన్నిఁగొరి యనుగట మర్త్యవిడంబన కాని నీ యెఱుంగనిది కాదు. నీచే మేము పరాజితులమైతిమని యుంచుకయు సిగ్గు వహింపము సహస్రకరునిచే నిర్జితవముఁబొందుట చంద్రాదులకు నపకీర్తి హేతువగునా ? నీవు సర్వేశ్వరుండవు. నీ యెఱుంగనిదిలేదు. నేను సత్యలోకమున కరిగెద నన్ను జ యుమ్మని పలికి యంతర్హితత్వము వహించి యున్న యవ్వరించి పత్ని యోగశక్తిచే నవలోకించుచు నా భాష్య కర్త యిట్లనియె. దేవీ! నిన్ను విధాతపతివ్రతవైన వాగ్దేవతఁగా నెఱుంగుదు. నీవు చిత్స్వరూపిణివి. లక్ష్మ్యాది రూపముల నీవతాల్తువు నీవాది

దేవతవు. అస్మత్కల్పితములగు ఋష్యశృంగాదిక క్షేత్రముల యందు శారదాభిఖ్య వహించి సన్నిహితవై యిష్టార్థముల నొసంగు చుండవలయును. ఇదియే నా ప్రార్థన యని పలికిన విని యప్పలుకుల వెఱంది కులుకుచు నయ్యతిపతి కట్టివరంబిచ్చి యచ్చి గురుబోణి బ్రహ్మలోకంబునకుం జనియెను.

ఆత్మీయసన్న్యాస స్వీకారంబునంగలుగు వైధవ్యవ్యథ నెఱుంగకుండ నుభయ భారతి యంతర్హితయయ్యెనని మిగుల సంతసించుచు మండనమిశ్రుండు విధిపూర్వకముగా సప్పుర ప్రాజాపత్యేష్టిం గావించి ధనకనకవస్తు వాహనాదికమంతయు బ్రాహ్మణులకుం బంచిపెట్టి యగ్నుల నాత్మారోపణం జేసికొని యాశాపాశంబులం ద్రెంచి శంకరాచార్యునొద్ద కరిగెను.

గీ. ఘనతసన్న్యాసగ్రహసూక్తవిధిచిత
సకలకర్మలందీరిచి శంకరుండు
ప్రౌఢిజపియించె సంసార భయమువాయ
తత్త్వమసియనువాక్యమత్తపసిచెవిని.

ఉ. మండనమిశ్రుఁడున్విహిత మార్గమునంజరమాశ్రమవ్రత
స్థుండగుచు న్నియామకము తోహితభీషణగోరనయ్యతీ
శుండునునాత్మతత్త్వమును సూచినఁజేయుచు వేదమస్తకో
న్మండనమైన తత్త్వమసి నాఁజను వాక్యమె పల్కెఁ గ్రమ్మఱన్.

శంకరుఁడు—తత్త్వమసియనఁగా అయ్యాత్మ తత్త్వము నీవయితివని యర్థము.

మదనుఁడు—నీవనఁగా నీ దేహమేనా ?

శంకరుఁడు—కాదు. కాదు. జాతిరూపాదికము గలుగుటచేతను దేహమనాత్మయైన ఘటాదికము వంటిది అదియునుంగాక యీ దేహము నాదియను భేదప్రథ గలిగి యుండుటంబట్టి నీవను శబ్దార్థము దేహమునకుఁ జెల్లదు.

మండనుండు—పోనీ యింద్రియములకు వర్తించునా యేమి ?

శంకరుఁడు—ఇంద్రియములకును వర్తించదు. ఇంద్రియములు దాత్రాదికము వలెనే సాధనములైనవి. అవియు ఘటాదికము వంటివే ఈ చక్షురాదికము నాయది యనుభేదభావము వాని యందు సైతము పొడముచుండలేదా ? కావున నింద్రియముల నాత్మగాఁ జెప్పరాదు.

మండనుఁడు—మనస్సు నాత్మయని చెప్పిన దోషమేమి ?

శంకరుఁడు—అదియు నింద్రియమే. నా మనస్సు మరియొక లాగునఁ బ్రసరించుచున్నదను భేదభావము దానియందునుఁ గలుగుచున్నది. సుషుప్తియందు

మనస్సు లయమగుచుండుటచేఁ జిన్మనస్సులకు వైలక్షణము గనుక మనస్సు ఆత్మగా నంగీకరింపఁబడదు.

మందనుఁడు—అహంకారమో.

శంకరుఁడు—అది యెన్నఁడును కానేరదు.

మందనుఁడు—సుషుప్తియందు నైతము లయమొందని ప్రాణంబులనైన నాత్మయని చెప్పవచ్చునా?

శంకరుఁడు—సర్వోపసంహారకమగు సుషుప్తియందు నిలిచియున్నను, ఇవి నా ప్రాణములను భేదభావము నాసియందును గలుగుచుండలేదా? ప్రాణము లాత్మ యెట్లగును?

వినుము వివేకింప దేహేంద్రియాది విలక్షణమగు నాత్మయే త్వంశబ్దవాచ్యము తత్పదార్థము జగత్కారణమైన బ్రహ్మము. అసి యనునది యారెంటికి నైక్యానుసంధానము చేయుట. ఇదియే తత్త్వమసి యనర్థము.

మందనుండు—సర్వజ్ఞత్వాది పదవాచ్యమగు తత్పదార్థమునకును మూఢత్వాది పద వాక్యమగుత్వం పదార్థమునకును నైక్యాను సంధానమెట్లు? తేజస్తిమిరముల కెన్నఁడైన నైక్యము గలుగునా?

శంకరుఁడు—ఒకనాఁడు సాయంకాలమున నొక క్షేత్రంబున నొకరూపంబున గనంబడిన పురుషుండు మరియొకనాఁడు ప్రొద్దుట మరియొక చోట మరియొకవేషముతోఁ గనంబడినప్పుడుఁ గురుతెరింగినవాఁడుఁ అతఁడే యీతండనికొనినట్లు దేశకాలాదివైపరీత్యము గలుగుటచే వాచ్యార్థమునకు దోషమువచ్చినను లక్ష్యార్థమున కెన్నఁడును బాధకము రానేరదుగనుక నీవును దేహాదులయం దహంభావమును విడువుము. వివేకబుద్ధిచే సంతతము నాత్మభావనఁజేయుచుండుము కాక జంబుకాదుల యధీనము కానున్న తుచ్ఛశరీరమున దుఃఖహేతువగు మమత్వమును విడువుము. సమస్తశంకాకళంకవినిర్ముక్తమును నిజాతీయప్రత్యయరహితంబునగు చిత్తమును బరమాత్మయందు వ్యాపింపఁజేయుము. తీరమునుండి మరియొక తీరమునకుఁ గ్రుస్సురుచు మత్స్యము తత్తీరముకంటే భిన్నమై దానినంటనట్లే దేహిజాగ్రదాద్యవస్థల ననుభవించుచున్న వానికి వేఱై తద్ధర్మముల నంటడు అనుభూయమానంబులగు జాగ్రదాద్యవస్థ లెవ్వని కంటివేని వినుము.

రజ్జువుంగని భ్రమసినప్పుడు భూచ్ఛిద్రసర్పదండాదులు కల్పితములైనట్లు భ్రాంతునకేయవస్థాత్రయము గలుగుచున్నది. కాని యాత్మవేత్తకీయవస్థలు లయమగుచున్నవి సుమీ. కావున నీవును బ్రహ్మవైతివి పూర్వభ్రమ విడువుము. అహా! సచ్చిదానంద స్వరూపమగు చైతన్యము బాహ్యాభ్యంతరముల యందంతటను నిండియుండ మూఢమతులు దెలిసికొనఁజాలకున్నారు. ఆత్మమహిమ యెట్టిదో కదాయని యుపదేశించి మరియును.

గీ. గరిమఁబానీయశాలఁజెక్కంౘుడుగూడి
యంతలోభిన్న మార్గులై యరుగునట్లు
పెక్కు పేరుల నింటిలోఁ బెరిగి పెరిగి
సమయుదురు దేహలాత్మీయ సంచయమైన.

గీ. భువిసుఖంబుకొఱకు బొనరింతురుద్యోగ
దాన వెతయకాని తగదుసుఖము
కారణంబులేక కలుగదుసుఖవృత్తి
హేతువునకునొండు హేతువుండు.

క. పరిపక్వమతికినొకమా
టరసిన శ్రుతివచనసరణి యవబోధ మగున్
బరి మందమతికి మెల్లన
గురుపాదాంభోజసేవ గూర్చున్ దానిన్.

ఇందులకు గురుబోధము ప్రధానకారణంబనియాత్మతత్త్వ ప్రకారంబంతయు బోధించినం దెలిసి మందనమిశ్రుండు తయ్యతీంద్రునిచరణ పద్మంబులవ్రాలి, మహాత్మా ! నీ కటాక్షంబున నజ్ఞానంబు వాసితి. నద్వైతతత్త్వంబు దెల్లమైనది. కృతకృత్యుండ నైతినని పలుకుచు తత్త్వసాక్షాత్కారుండై యదిమొదలు సురేశ్వరుం డనునామము వహించి శ్రీ శంకరాచార్యుని పాదసేవ గావింపుచుఁ బద్మపాదాది శిష్యులతోఁ జేరి యతని సేవింపుచుండెను.

శంకరయతిచంద్రుడట్లు మండనమిశ్రునకు బ్రహ్మతత్త్వంబుపదేశించి ప్రధానశిష్యుంగాఁ జేసికొని యందుశిష్యులతోఁ గూడ బయలువెడలి మహారాష్ట్రదేశమున కరిగి యందుభాష్యంబెల్లెడఁ వ్యాపింపఁ జేసెను. అందుఁగొన్ని దినంబులుండి యచ్చటనుండి శ్రీశైలమునకుం జని యందుఁ బాతాళగంగాంబువులఁ దీర్థములాడి మల్లికార్జునలింగము నర్చింపుచు శివానందలహరి యను స్తోత్ర శ్లోకంబుల స్తుతియించెను.

శ్లో॥ సంధ్యారంభవిజృంభితం శ్రుతిశిరస్థానాంతరాధిష్ఠితం
సప్రేమభ్రమరాభిరామ మసకృత్సద్వాసనాశోభితం
భోగీంద్రాభరణం సమస్తసుమనఃపూజ్యం గుణావిష్కృతం
సేవే శ్రీగిరిమల్లికార్జునమహాలింగం శివాలింగితం.

శ్లో. భృంగీచ్ఛానటనోత్కటః కరమదగ్రాహీ స్ఫురన్మాధవా
హ్లాదో నాదయుతో మహాసితవపుః పంచేషుణాదావృత
సత్పక్షస్సుమనోవనేషు సపునస్సాక్షాన్మదీయే మనో
రాజీవే భ్రమరాధిపో విహరతాం శ్రీశైలవాసీవిభుః.

మఱియు సందష్టాదశపీఠంబులలోఁ బ్రధానమగు భ్రమరాంబా దేవినాగ మోక్షవిధానంబున మహాశక్తిగా స్థాపనంజేసి యందుశిష్యులతోఁ గూడఁ గొన్ని దినంబులు వసియించెను. ఒకనాఁడు శంకరయతీంద్రులు పద్మపాదాదిశిష్యులతోఁ భాష్యంబు ముచ్చటింపుచుండ నాశిర్ణించి యందున్న పాశుపతులు వైష్ణవులు వీర శైవులును మాహేశ్వరులు దానిసధిక్షేపించి తచ్ఛిష్యులచేరనే పరాజితులై కొందరత నికి శిష్యులైరి. మరికొందరు కోపమువిడువక వారికి సమాధానము చెప్పలేక తదీయ మరణావసాన సమయ మరయచుండిరి.

## ఉగ్రభైరవుని కథ

ఒకనాఁడు శంకరాచార్యవర్యుండు పాతాళగంగానదీ తీరంబున వసియించి భాష్య రహస్యంబులాలోచించుచున్న సమయంబున గాపాలికుఁడొకఁడు సీతాపహరణా ర్థమై యరుదెంచిన రావణుండు వోలె నవధూతవేషము వైచికొని యమ్మహాత్ముని యొద్దకు వచ్చి మిగుల సంతసించుచు నల్లనల్లనియె. యతీంద్రా! సర్వజ్ఞత్వానద్య త్వాది భవద్గుణ విశేషంబు లెల్లెడం జెప్పుకొన మిగుల వేడుకపడుచు మిమ్ముఁ జూడ నిచ్చోటి కరుదెంచితిని. నిరస్త మోహుండవని నీవొక్కండవే కదా దేహాభిమానాదుల విడిచి భేదబుద్ధి నించుకయుంబూనక శుద్ధాద్వైత సిద్ధింబొందితివి. నీవు పరోపకారము నకై యవతరించిన మూర్తివని నీకీర్తి యమర్త్యలోకములపఱకు వ్యాపించియున్నది నీ కటాక్షపాతమాత్రంబున శైజగంబులయార్తి పోవుచున్నది నీవు గుణాకరుండవు. సర్వజ్ఞుం డవును జితేంద్రియుండవు. వదాన్యుండవునగుటచే భువనైక మాన్యుండవై యుంటివి పరాపరజ్ఞులును సమస్త శిల్పాణ గుణసిలయులుసగు భవాదృశులు లోకంబున బ్రకా శింపుచుండ నర్థిజనుల కామ్యంబు లెట్టివైనను సఫలకుండునా? నేనొక్క కార్యంబు కొఱకు నీ పరిసరంబున కరుదెంచితి దాని సఫలమైన దానిఁగా నేఁడలంచుచుంటిని. వినుము.

నేనీ దేహముతోఁ గూడఁ గైలాసంబున కరిగి యగ్నిపియం దీశ్వరునితో సమముగా విహరింప నుత్సకముఁజెంది శతాబ్దంబు లుగ్రతపం బీశ్వరునిఁగూర్చి కావిం చితిని అమ్మహాత్ముండు ప్రత్యక్షంబై మత్కామితంబు దెలిసికొని యొక్కింత యూహించి యోహో! నీవసాధ్యపు కామంబు గోరికొంటివైనను నీ వ్రతంబులు మదీయహృదయంబు నచ్చెరువు పరచెంగావునఁ దీపకతీరదు. పుడమియందు సార్వ భౌముని శిరంబుగాని లేక సర్వజ్ఞుండైన యతీశ్వరుని శిరంబుగాని నా నిమిత్తమగ్ని యందు హోమముఁ జేసితివేని నీ కార్యంబు సాఫల్యంబు నొందఁగలదని పలుకుచునే యంతర్హితుండయ్యెను.

నాటంగోలె నేనీభూమియంతయుం దిరుగుచుంటిని. సార్వభౌమ శిరంబు నాకెట్లు లభించెడి ? సర్వజ్ఞుండగు యతియు నింతకు మున్నెందునుం గనఁబడలేదు. నేఁడు నా పురాకృతంబునఁజేసి లోకహితమునకై సంచరించెడు సర్వజ్ఞుండవగు నిన్నుం బొడగంటిని. నా కార్యమింకఁ దీరఁగలదని యుత్సుకము నొందుచుంటిని. సజ్జనదర్శన మూరకపోవునా ? ఇటు పిమ్మట మత్కార్యసిద్ధికి నీవే ప్రమాణము. శిరః ప్రదానంబున నాకుఁ గార్యలాభమును నీకు శాశ్వతకీర్తి లాభముం గలుగఁగలదు. ఈ దేహము యొక్క నశ్వరత్వమాలోచించి యెట్లు తోచిన నట్లు చేయుము. నీ శిరంబిమ్మని కోరుటకు నా మనంబున మిగులఁ గ్లేశము నొందుచున్నది. దేహపాతంబున కెవ్వఁడైన సమ్మతించునా ? నీవు విరక్తుండవనియు దేహాభిమాన శూన్యుండవనియుఁ బరోపకారమునకై యవతరించిన మూర్తివనియు విని యీ సాహసమునకుఁ బూనుకొంటిని. జనులెల్లరును స్వార్థపరులై పరక్లేశముల గణియింతురుగదా ! తొల్లి యింద్రుండు శత్రుజయమునకై దధీచిమహామునిని వజ్రాయుధమును యాచింపలేదా ? దధీచి ప్రముఖులును క్షణభంగురమగు తుచ్ఛశరీరమును విడిచి పరోపకారపారీణులై శాశ్వతకీర్తి దేహంబులం దాల్చి పుణ్యలోకంబు లలంకరింపుచుండలేదా ? దయామతులై కొందఱు పరహితమునకై దేహత్యాగము జేయుదురు. దయాహీనులై మా వంటివారు స్వార్థైకపరులై కొందరు పుడమినుందురుగదా ! పరోపకారము వినగా నీకించుకయు ప్రయోజన మీ పుడమిని లేదుగదా ! కామపరులగు మావంటివాండ్ర కన్నియుం బ్రయోజనములే కనంబడును విరక్తి పూర్వపుణ్యంబునంగాక లభించునే ? నాగోరిక గర్హితమేయైనను విరాగముగల పరమార్థవేత్తల కీయరానిదిగలదే ? భవచ్ఛిరంబుకన్న మదీయకామితంబీడేర్పునది మఱియొకటిలేదు తప్పక నీ శిరంబిమ్ము. నీకు నమస్కారమని పలికి యమ్మహాత్ముని పాదంబుల మ్రోలంబడియెను. అప్పుడా శంకర యతిపుంగవుండు దయాళుండగుట నక్కాపాలికుని లేవనెత్తి యుల్లన నిట్లనియె. "ఆర్యా ! నీ కామిత విషయము నాకించుకయు నసూయ జనింపదు. సంతోషముతో నాశిరంబు నీకిచ్చెదను. తెలిసియు నేప్రాజ్ఞుండు బహ్వపాయములగల కాయంబు నర్థిసాద్గుణ్యము గావింపకుండెడిని ? ఎంత రక్షించినను గాలమాసన్నమైనతో నీ శరీరము నశించునదియేకాని నిలుచునదియా ? అట్టిదానిచేతనే పరంబు సాధింపఁబడినచోఁ బురుషుని కంతకంటెఁ బురుషార్థమేమియున్నది ? కావున సిద్ధుఁడా ? నీ సమాధి విజనప్రదేశమునఁ గావింపుము. రహస్యముగా నా శిరంబు భేదించి అగ్నియందు వేల్చుకొనుము. నేను ప్రకాశముగా నప్పని సేయ సమ్మతింపను. ఏమిటికంటివేని మదీయశిష్యు లెఱింగిరేని నిప్పని గానసాగనీయరు. మదేకశరణులై యున్నారు కావున వాండ్రిందులకు సమ్మతింపరు.

స్వశరీరమును విడుచుటకును స్వనాథశరీర మోక్షమునకును నెవ్వఁడైనను సమ్మతించునా ? యని పలికిన విని యాకాపాలికుండు మిగుల సంతసించుచు శంక

రుండు నియమించిన సంకేతసమయమునకు వచ్చునట్లు నిశ్చయించి యెచ్చటికో పోయెను. పదంపడి శంకరయతి యా రహస్యం బెవ్వరికిం దెలియనీయక యమ్మరునాడు శిష్యులందరు స్నానాదివ్యాపారతంత్రులై తలయొకచోటికిం బోవ నిరూపింపబడిన రహస్యప్రదేశంబున సనందనుండు దెలిసికొనునేమోయను వెరపుతో నిగూఢుండై యున్న సమయంబున.

క. కేలఁ ద్రిశూలముఁగొని కం
కాళాలంకృతులు మేనఁ గ్రాలఁ ద్రిపుండ్రో
త్కీలితఫాలుండై కా
పాలికుఁ డేతెంచె నరుణ భయదాక్షుండై.

అభైరవాకారు రాకంజూచి యమ్మహాత్ముం డింద్రియముల నుపసంహరించుకొనుచు స్వాత్మను బరమాత్మయం దైక్యానుసంధానము గావించి జత్రుప్రదేశంబున గడ్డంబు మోకాళ్ళమీఁద మూఁచేతులు నునిచి మోము దెరచుచుఁ గన్నులు సగము మూసికొని సిద్ధాసనమున గూర్చుండి సమాధిచేఁ బ్రపంచకమంతయు మరచియున్న సమయంబున నా భైరవుం డయ్యతీంద్రుఁ జంపుటకు నించుకయు సంశయింపక సంతోషముతోఁ ద్రిశూలమెత్తి యతని కంఠం బుత్తరింపఁ బోవునంతలో దైవప్రేరితమైన బుద్ధిచేతఁ బద్మపాదుండేఁటికో యచ్చటి కరుదెంచి గురుని శిరంబు దరుగఁ బ్రయత్నించు నా క్రూరుని యుద్యమంబు జూచి తొందరపడుచు నాత్మీయాభీష్టదేవతయైన శ్రీమన్నృసింహసమంత్రకముగా ధ్యానించుటయు.

సీ. భూరిసటాచ్ఛటా స్ఫోటవంబులమింట
జీమూత సంఘము ల్చెదరిపోవ
దంష్ట్రికరాళ వక్త్రచ్ఛిద్రసంజాత
పావకార్చుల జగత్ప్రతతిగమలఁ
బెడుబొబ్బవెట్టి కుప్పించి దాటినవేగ
మున భూతసంతతు ల్మార్చనొంద
నిదియేమియని వేల్పులెల్ల దల్లడమంద
జలనిధుల్మిగులనా! కులతనొందఁ.

గీ. పద్మపాదుండు నరసింహ వర్యరూపుఁ
డగుచు రయమున నురికి శూలాయుధమున
నాత్మగురుఁజంప గమకించు నద్దురాత్ము
పొట్టఁజీలిచి వెసఁగాలు ద్రోలికనిచె.

అమ్మహారవం బాలించి యందున్న శిష్యులెల్లరుఁ దల్లడిల్లుచు నచ్చోటి కరుదెంచి చచ్చిపడియున్న కాపాలికుని నృసింహాకృతితోనున్న పద్మపాదుని సమాధిలోనున్న గురువరునింగాంచి విస్మయాకుల హృదయులై చూచుచున్న సమయంబున శంకరయతి వర్యుండును సమాధి చాలించి కన్నులం దెరచి యందు జరిగిన వృత్తాంతమంతయు శిష్యులవలనం దెలిసికొని పద్మపాదు నావేశించియున్న నరసింహమూర్తి నిట్లని స్తుతియించెను.

శ్లో॥ కల్పాంతోజ్జృంభమాణ ప్రమథపరివృఢ ప్రౌఢలాలాటవహ్ని
జ్వాలాలీఢ త్రిలోకీజనితచటచటధ్వానఫూత్కారధుర్యః।
వర్ధ్మ బ్రహ్మాండభాండోదర కుహరమనై కాంత్యదుస్త్యామవస్థాం
స్త్యానస్త్యానో మహాయందః యతుమహితం శ్రీనృసింహాట్టహాసః॥

వ. అని యనేక ప్రకారంబుల నమ్మనుజసింహమూర్తిని స్తోత్రముఁజేయుటయు నాభక్తప్రియుండు నృగమూర్తి నుపసంహరించుకొని యంతర్ధానమునొందెను. పిమ్మట శాంతుండైయున్న పద్మపాదుంజూచి వెఱఁగుపడుచు శిష్యులెల్లరు "ఆర్యా! నీవీదేవునెటు ప్రసన్నుం జేసికొంటి వీకపటం బెట్లెఱింగితివి? ఇద్దురాత్ముం డెవ్వండని" యడిగిన నతం డిట్లనియె.

## అహోబల నృసింహునికథ

నేను పూర్వమొకప్పు డహోబలక్షేత్రంబున కరిగి యందొక యరణ్యంబున భక్తవశ్యుండగు నరసింహమూర్తిం గురించి పెక్కు దినంబులు తపంబు గావించుచుంటిని. అట్టిసమయంబున నొక దినమున నాయొద్ద కొక కిరాతకుమారుం డరుదెంచి "అయ్యా! నీవెవ్వండవు ? ఒక్కరుండ విక్కాంత బిలంబున నేమిటికి వసియించెదవు? నీవు చేయుపనియేమి?" యని యడుగుటయు వానిమాటఁ బాటింపక మౌనముతోఁ బోబొమ్మని హస్తసంజ్ఞ చేసి నిరాకరించితిని.

వాఁడంతటితో బోక యప్పుడప్పుడు నాకుఁ గనబడుచు నిట్లే యడుగుచుండ నొకనాఁ డిట్లంటిని ఓరీ! నీవు మూఢజాతివాఁడవు. [illegible] బాలుండవు. అట్టి నీకు మాబోంటివారిం బల్కరింప నుచితముకాదు. [illegible] గంతమున సింగమును గ్రింద మానిసిరూపుంగల సామియొకం [illegible] అట్టివాని నెందేనిఁ గంటివేనిఁ జెప్పుము. వానింజూచు తలంపుతో నేనే నిందున్నవాఁడ. అతండు నాకుఁ జుట్టమిదియే నాపని వానిందీసికొని రాఁగలవా ? యని పరిహాసముగా నడిగితిని.

అప్పు డబ్బోయండు నవ్వుచు స్వామీ! ఇంతపనికేనా యింత శ్రమపడుచుంటివి. నాకీపని మొదటనే చెప్పితివేని యప్పుడే తీసికొని రాకపోవుదునా? అయనను

నేనెఱుంగుదును. తరచు మేమిరువురము కలిసికొని యాడుకొనుచుందుము. ఆయన యున్న చోటు నేనెఱుంగుదునని పలికిన విని నేను వెరఁగందుచు వానిమాటనమ్మక, మఱియు నిట్లంటిని.

ఓరీ! నీవతండు సామాన్యుఁగనఁ గొంటివి కాఁబోలు. నేనన్నమాట నీకుదెలిసినదా? కంఠమువఱకు మనుష్యుఁడు శిరము సింగము ఇదియే పోలిక. అట్టివాని నిశ్చయముగాఁ జూచితివా? యెట్లునీకుఁగనంబడియెను. నిజముఁజెప్పుమని యడిగిన దిరుగ వాఁడిట్లనియె అయ్యా! నాతో నన్ని మాటలు చెప్పనక్కఱలేదు. మీమాట నాకర్థమైనది. మీరడిగినవాఁడు నేనాడుకొనువాఁడే సందియములేదు. ఇంతయేల? ఇప్పుడే పోయి నీయొద్దకుం దీసికొనివచ్చెదం జూడుము. అప్పుడును నామాటనమ్మకపోవుదువా? యని పలుకుచుఁ దటాలునలేచి యాయరణ్యములోని కరిగి రెండుగడియలలో నక్కిరాతుండా నరసింహమూర్తి నొకలతాపాశంబునంగట్టి భుజముమీఁదఁ బెట్టికొని యమ్మహాత్ము నాయొద్దకుఁ దీసికొనివచ్చి ముందుఁబెట్టి యీతండేనా నీయడిగిన యతండని పలికెను. అప్పుడు నేనమ్మహాత్ముంజూచి యాశ్చర్య సంభ్రమ సాధ్వసంబులు మనంబున నొక్కసారి యంకురించి త్రొటుపడుప నిరుపమాన కౌతూహలంబుతో మేనం బులకలుద్భవింప సాష్టాంగనమస్కారము గావించి చేతులుఁ జోడించి.

సీ. నిరుపమాత్మసమాధినిష్ఠులయోగిచే
  జనులాత్మ నెవ్వానిఁ గనఁగనోప
 రామ్నాయ తత్త్వర హస్యంబులెవ్వాని
  సన్మహత్త్వము దెల్పఁజాలవయ్యె
 బ్రహ్మదినిర్జరుల్ ప్రౌఢనెవ్వాని మా
  యాజాలములఁ దెలియంగలేరు
 బ్రహ్మాండములనెల్ల రచియింపఁ బాలింపఁ
  బొలియింప నెవ్వాఁడు మూలకర్త

గీ. అట్టినీవిప్పుడొక్క మూఢాత్ముఁడైన
 బోయిబాలునకగ్గమై పోయితేమి
 చిత్రమిదియెట్టిపుణ్యంబుఁ జేసెవాఁడు
 పూర్వభవమున గరుణాప్రపూర్ణహృదయ.

వ. అనినేను వేఁడుకొన నమ్మహాత్ముండు నవ్వుచు వత్సా! వీనికి నాయందు గల భక్తివిశ్వాసములు బ్రహ్మాదులకులేవు. నిరుపమానైకాగ్రచిత్తముతో వీఁడు నన్నారాధించెను దానంజేసి వీనికింత వశ్యుండనైతిని నేను భక్తికి వశ్యుండనైనట్లు తపోదాన యాగాదులకుంగాను. నీవును నాకుభక్తుండవైతివి. అవసరంబైనప్పుడెల్లఁ దలంచు

కొనుము. ప్రసన్నుండనై కామ్యంబు లిచ్చెదనని పలుకుచు నాన్నృసింహదేవుండంతర్హితుం డయ్యెను. నాటంగోలె నాకమ్మహానుభావుం డభీష్టదేవతయై తోడ నుండుచుండును. ఇందాక యిద్దరాత్ముండు మనయాచార్యుని మోసముచేసి శూలంబున శిరంబు దరుఁగ బ్రయత్నించుచున్న సమయంబున నే నేమిటికో యచ్చటికరిగి యయ్యుపద్రవము గాంచి మదభీష్టదేవతం దలంచితిని. అతండు నన్నావేశించి శత్రువధ గావించెను. యించుక దడసినఁ గార్యంబు మిగిలి మనయాచార్యుండు మనకుఁదక్క కపోవును. ఇప్పటికి దైవము మనయందేయుండెను. వాదవిజితులు పెక్కండ్రు మనయాచార్యునికి మోసము చేయదలంచుచుండిరి. మనము ఏమరకకాచియుండవలయు. సగ్నింగిట కములు చేరిన నశింపకుండునా? యవతారమూర్తి యగు మనయాచార్యునెవ్వడేమి చేయఁ గలఁడని పలుకుచుఁ బద్మపాదుండు వారికెల్ల నామోదము గలుగఁజేసె. అట్లు శంకరాచార్యుండు శ్రీశైలంబునఁ గొన్నిదినములుగడపి యటఁగదలి శిష్యులతోఁగూడ ననేక పుణ్యతీర్థంబులు సేవించుకొనుచు క్రమంబున గోకర్ణక్షేత్రంబున కరిగెను. కైవల్య కల్యాణలాభంబొనఁగూర్పు నద్దివ్యక్షేత్రంబున మూఁడుదినంబులు వసించి మహాకాళ నాథు నారాధించి యచ్చటి కనతిదూరములో నున్న హరిశంకరంబను దివ్యస్థలంబున కరిగి యంచద్వైతబుద్ధితో హరిహరస్తుతి గావించెను.

పదంపడి మూకాంబికాగేహమునకరిగినంతఁ దదీయద్వారదేశంబున బ్రాహ్మణ దంపతులు మృతుండైన కుమారుని కళేబరమునువైచికొని యిట్లు విలపించుచుండిరి.

ఉ. హాకులదీపకా! హిమకరాధికతేజ! కళానిధాన ల
క్ష్మీకరమూర్తి సద్గుణనికేతన హాసుకుమార హాకుమా
రా! కడతేర్చెనేనినుదయారహితుండుకృతాంతుఁడయ్యయో
యేకడకేగు వారముత్వదేక శరణ్యులమేది దిక్కుఁడకన్.

క. నీవలనఁగులముదీపక
మెవక్తిల్లెదునటంచు నౌత్సుక్యం బెం
తేవెలయ నలరుచుందుమిఁ
కేవిధమున బ్రతుకువార మేము కుమారా!

అని యనేక ప్రకారంబుల దుఃఖించు నద్దంపతుల పరిదేవనంబు విని దయాళుండైన శంకరాచార్యుండు సైరింపక తాను వారికన్న నెక్కుడు విలపించు చున్న సమయంబున నాకాశవాణి యిట్లు వినఁబడియె.

క. అనఘా! ప్రోవఁగన సమ
ర్థునిదయ కేవలము శోకదోహలమగుఁగా
వినిజ ప్రజ్ఞాన్వితుఁడవు
చనునేసికిట్లువగవ సామాన్యు క్రియన్.

అని వినంబడిన యద్దివ్యవాణినాలించి యమ్మహాత్ముండు చేతులు జోడించి వెండియు నిట్లు వక్కాణించె.

గీ. ఎల్లలోకంబులను జేర్చి నేల నేర్పు
గలుగనీయనుకంపకుఁ గాకయట్టి
నిరుపమప్రజగలుగునే యెరులదయకు
ద్రికరణాగోచరోరు శక్తిప్రభావ
ప్రోవుమీబాలుఁగరుణా ప్రపూర్ణహృదయ.

అని యనేక ప్రకారంబుల నయ్యతిచంద్రుడు ప్రార్థించుటయు నావిప్రకుమారుండు నిద్రించి మేల్కొనునట్లే లేచి కూర్చుండెను. అప్పుడా ప్రాంతమందా యద్భుతము చూచినవారు శంకరాచార్యుని దైవప్రభావమును వేతెఱంగులఁ గొనియాడిరి ఆ బ్రాహ్మణ దంపతులును శంకరాచార్యుఁ బ్రస్తుతించుచు నాపుత్రునెత్తుకొని యింటికిం జని తద్వృత్తాంతమెల్లరకుఁ జెప్పిరి. శంకరాచార్యుండును నమ్మూకాంబనిట్లు స్తుతియించెను.

శ్లో॥ అష్టోత్తరత్రింశతియాః కలాస్తాస్వర్ధాః కలాః
పంచనివృత్తిముఖ్యాః । తాసాముపర్యంబ తవాంఘ్రిపద్మం
విద్యోతమానం విబుధాభజంతే
యేప్రత్యభిజ్ఞామతపారవిజ్ఞార్థన్యాస్తు తేప్రాగ్విపితాంగురూక్త్యా
సైనాహమస్మీతి సమాధియోగాత్త్వాం ప్రత్య
భిజ్ఞావిషయం విదధ్యుః.

శ్రీచక్రషట్చక్రకయోః పురోధశ్రీ చక్రమనోర్వరపిచింతైక్యం చక్రస్య మంత్రస్యతత స్తదైక్యం క్రమాదన ధ్యాయతిసాథ కేంద్రః॥ అని పెక్కుభంగుల నమ్మహాదేవిని శ్రీచక్రయంత్రోద్ధారణప్రకారంబునం బ్రస్తుతిజేసి ప్రసన్నురాలింజేసికొని యయ్యతిపతి యటఁగదలి శిష్యులతో నాప్రాంతమందుయున్న శ్రీబలియను నగ్రహారమునకుం జనియెను. అయ్యగ్రహారంబున నాహితాగ్నులును శ్రుతిపాఠకులు నిగమచోదితక్రియాతంత్రులునగు బ్రాహ్మణులు వేన వేలు గలిగియుండిరి. నిజకర్మనిష్ఠులు ప్రమాదశూన్యులునగు నందలి బ్రాహ్మణుల నియమమునకు వెఱచి యపమృత్యువప్పురంబుఁ బ్రవేశింపనేరకున్నది. స్వాహావషట్కారసినందంబులెల్లప్పుడు నప్పురంబున మ్రోగుచుండును. సకలకళానిలయంబగు నయ్యగ్రహారము శంకరుండు శిష్యులతోఁ బ్రవేశించినంత సంతసమున్నతద్విఖ్యాతి వినియుండిరి కావున నందలి బ్రాహ్మణులు సగౌరవముగా నతనికెదుర్కొని పెక్కు తెఱంగులఁ గొనియాడుచు నాయకమణియుంబోలె నందువిరాజిల్లు పినాకపాణియాలయంబునం బ్రవేశపెట్టఁ దీసి

కొనిపోవుచున్న సమయంబున వీధుల నిలువంబడి పౌరకాంతలెల్ల నిట్లు చెప్పుకొనఁ దొడంగిరి.

సీ. ఇతఁడఁటే పేదపారు తనింట గనకామ
లకవృష్టి గురిపించిన కరుణాత్ముఁ
డితఁడఁటే తనతల్లి వెతఁబాయఁ బూర్ణాన
దిని పెరటికిఁ దెచ్చిన మహాత్ము
డితఁడఁటే యమృత గతిం బొంగు నర్మదా
ధుని గుంభమున నిమిడ్చిన ఘనుండు
ఇతఁడఁటే యద్వైతమతము నిల్పఁగవాద
మున సరస్వతి జయించిన మనీషి.

గీ. ఇతఁడఁటే మొన్న మూకాంబయింటి మ్రోలఁ
గాలగతినొందు బ్రాహ్మణ బాలకుఁగని
గరిమఁ బ్రతికించి నట్టి విఖ్యాతయశుఁడు
శంకరాచార్యుఁడితఁడఁటే చంద్రవదన.

అనియిట్లు పౌరకాంతలు కొనియాడుచుండ శంకరాచార్యుండు శిష్యులతోఁ గూడఁ బినాకపాణియాలయంబునఁ బ్రవేశించి బృందారక బృందపరివృతుండగు పురుహూతుండువోలె నా బ్రాహ్మణబృందము నడుమ విరాజిల్లుచు నల్లనయ్యతి తల్లజుండు వారికిట్లనియె.

ఆర్యులారా ! మీ యగ్రహారమున నెవ్వరేని పండితులుండవలయును. అద్వైతమార్గ రోధకులై ప్రవృత్తిశాస్త్రరతులైన పండితులెవ్వరేని గలరేని వక్కాణింపుడు. అట్టివారితో వాదించి వారి దురూహలం బోగొట్ట నరుదెంచితిమి. అని యడిగిన నా బ్రాహ్మణులు సవినయముగా నిట్లనిరి. ఆర్యా ! భవదీయ ప్రజ్ఞాప్రభావంబు లింతకు బూర్వమే మేము వినియున్నవారము బృహస్పతియు ఫణిపతియు సరస్వతియు మీకు జాలరనుచో మా బోటులమాట జెప్పనేల. మా యగ్రహారంబున బ్రభాకరుండను పండితుం డొకండున్నవాడు. అతండు ప్రవృత్తిశాస్త్రరతుండై కర్మకాండయందు మిగుల నాసక్తిగలిగి యనేకాధ్వరంబులు సేసి వేల్పులం దృప్తిపరచి యున్నవాడు. ధనధాన్యకనకవస్తువాహనసమృద్ధి యద్ధరణీసురునకెంతేనిం గలిగియున్నది. అతండు భట్టపాదుని శిష్యుండై పూర్వము దిగ్విజయము చేసినాడు. కాని యతనికి లేక లేక కలిగిన పుత్రుండున్మత్తుండయ్యెను. కావున నిప్పుడతం డాచింతచే నేపని బూనుకొన కున్నవాడని చెప్పుచుండగానే యా ప్రభాకరుడు కుమారునితో గూడ నచ్చటికివచ్చి యుపాయనార్పణపూర్వకముగా శంకరాచార్యునకు నమస్కరించెను.

# హస్తామలకుని కథ

పిమ్మట దన కుమారుని నైతడతని పాదంబులకు నమస్కరింపజేసెను. అప్పుడు శంకరుండతని లేవనెత్తుచు సాదరముగా నాగమన కారణంబడిగిన నతం డిట్లనియె. ఆర్యా! వీడు నా కుమారుండు వీనికి బదమూడేండ్లు దాటినవి. వీడు పుట్టిననాటంగోలె నిట్లే యుండెను. ఎవ్వరితో నేమియు మాటాడడు. ఎవ్వరు పల్కరించినను బల్కడు. మందమతియై యెద్దియో ధ్యానించుచు నట్లుండును. రూపము తేజము నద్భుతమై యున్నవి. మొగముజూచ జంద్రబింబమును దిరస్కరింపుచున్నది. ఇది గ్రహదోషమో స్వభావమో పూర్వార్జిత ప్రారబ్ధమో యున్మత్తవికారమో తెలియదు. వీనికక్షరాభ్యాసమైనం జేయలేదు. చదువుమాట చెప్పనేమి యున్నది. ఉపనయన సంస్కారము మాత్రము గావించితిని. ఆడుకొనుటకు బాలుర పిలిచినను వెళ్ళడు. వాండ్రు వీనింగొట్టినను గోపము జెందడు. వానికిష్టమైనప్పుడెప్పుడో భుజించును. చెప్పినట్లు చేయడని వానిపై నాకు గోపమువచ్చును గాని కొట్టుటకు జేతులురావు. లేక లేక నాకీకొమరుండుగలిగె నిది యేమి పాపమో తెలియదు. ఎన్నియో వైద్యములు చేయించితిని. ఎన్నియో రక్షలు గట్టించితిని ఎన్నియో జపములు చేయించితిని యెందరికో సిద్ధులకు జూపించితిని. ఏ క్రియవలన నేసిద్ధుని వలనను నుపయోగము లేకపోయినది. నీవు పరోపకార పారీణుండవు. దయాళుండవని వింటిని. మృతుండైన విప్రకుమారుని బ్రతికించితివట. నీ చర్యలద్భుతముగా జెప్పుకొనుచున్నారు. నీ కటాక్షలేశము వీనిపయిం బ్రసరింప జేసితివయేని వీని మాంద్యము నడలిపోవును. మహాత్మా! వీని శిష్యునిగా ననుగ్రహింపుమని యనేక ప్రకారముల బ్రార్థించి వాని నయ్యతిపతి పాదంబుల వెంబడియుం బడవైచెను.

అప్పుడు శంకరాచార్యుండు దయామేదురములగు దృష్టులు వానిపై బరగింపుచు శిరంబున జేయిడి, డింభకా! నీవెవ్వడవు? జడునిభాతి నిట్లు బ్రవర్తించెద వేమిటికి? చెప్పుమని యడిగిన నతండు గురుండా! నేను జడుండగాను. జడంబు మత్సన్నిధిం బ్రవర్తింపుచున్నయది షడూర్మిషడ్భావవికార రహితంబగు తత్పదార్థం బునేనైతిని. ఈ నా యనుభవము ముముక్షువర్గమునకు గలుగుగాక యని యప్పు డాశుకవిత్వముగా బండ్రెండు శ్లోకములు రచించెను.

శ్లో. నిమిత్తంమనశ్చక్షురాది ప్రవృత్తౌనిరస్తాఖిలోపాధిరాకాశకల్పః
రవిర్లోకచేష్టానిమిత్తం యథాయస్సనిత్యోపలబ్ధి స్వరూపోహమాత్మా 1
యమగ్న్యుష్ణవన్నిత్య బోధస్వరూపం
మనశ్చక్షురాదీన్యబోధాత్మకాని

ప్రవర్తంత ఆశ్రిత్యనిష్కంపమేకం
సనిత్యోపలబ్ధిస్వరూపోహమాత్మా.

ముఖాభాసకోదర్పణేదృశ్యమానో
ముఖత్వాత్పృథక్త్వేననైవాస్తివస్తు
చిదాభాసకోధీషుజీవోపితద్వత్ ॥స.

యథాదర్పణాభావ ఆభాసహానౌ
ముఖంవిద్యతే కల్పనాహీనమేకం
తథాధీవియోగే నిరాభాసకోయః॥స.

మనశ్చక్షురా దేర్వియుక్తస్స్వయంయో
మనశ్చక్షురా దేర్మనశ్చక్షురాది
మనశ్చక్షురాదేర గమ్యస్వరూపః॥స్స

యఏకోవిభాతిస్వతశ్శుద్ధచేతాః
ప్రకాశస్వరూపోపి నా నేవధీషు
శరావోదకస్థోయథాభానురేకః॥స్స.

యథానేకచక్షుః ప్రకాశోరవిర్న
క్రమేణప్రకాశీకరోతి ప్రకాశ్యం
అనేకాధియోయస్తథైక ప్రబోధః॥స్స

వివస్వత్ప్రభాతంయథారూపమక్షం
ప్రగృహ్ణాతినాభాంతమేవంవివస్వాన్
తథాభాత ఆభాసయత్యేకమక్షం॥స్స.

యథాసూర్యఏకోప్స్వనేకశ్చలాసు
స్థిరాస్వప్యనన్యగ్విభావ్యస్వరూపః
చలాసుప్రభిన్నాస్వధీష్వేక ఏవం॥స.

ఘనచ్ఛన్నదృష్టిర్ఘనచ్ఛన్నమర్కం
యథామన్య తేనిష్ప్రభంభాతిమూఢః
తదాబద్ధవద్భాతి యోమూఢదృష్టేః॥స.

సమస్తేషువస్తుష్వనుస్యూతమేకం
సమస్తానివస్తూనియంనస్పృశంతి
వియద్వత్సదాశుద్ధమచ్ఛస్వరూప ॥స్స.

ఉపాధౌయథాభేదతాసన్మణీనాం
తథాభేదతాబుద్ధిభేదేషుతేపి
యథాచంద్రికాణాంజలే చంచలత్వం
తథాచంచలత్వంతవాపీహవిష్ణో॥

పరమాత్మతత్త్వమును హస్తామలకములభంగి నీ శ్లోకములు దెలుపుటచే వీనికి హస్తామలక శ్లోకంబులని వాడుక వచ్చినది. మఱియు నిట్టి శ్లోకంబులనుపదేశము లేకయే రచించుటచే నా బ్రాహ్మణ కుమారునికిని హస్తామలకుడని పేరు వచ్చినది. అట్టి శ్లోకంబులం జదివి యా బ్రాహ్మణ పుత్రుఁడు తన యింటికిం జనియెను. అంతకు బూర్వమట్టివైనం దెలియని యతఁడట్లు శ్లోకములు రచించుట జూచి యెల్లరు విస్మయమును జెందుచు నది శంకరాచార్యుని యనుగ్రహ లాభమని నిశ్చయించిరి. తరువాత శంకరాచార్యుఁడు ప్రభాకరునిం జూచి, "ఆర్యా! నీ కుమారుండు నీ యొద్దనుండ నర్హుండు కాఁడు. వీనితో నీకేమి ప్రయోజనమున్నది? వీఁడు పూర్వభవాభ్యాసవశంబున సర్వము నెఱుంగును. ఎఱింగియే లోకమునకు గల యజ్ఞానమును గురించి చింతించుచు నిట్లు జడునిభాతి గ్రుమ్మరియెను. వీనికి గృహాదికముందు మమత్వము లేదు. తన శరీరమునే యెసవుగా జూచుకొనుచుండ బాహ్య వస్తువుల మాట జెప్పనేల? వీఁడు నీకేమియు నుపచరించఁడు. వీని నే దీసికొనిపోయెదం బంపు" మని పలికిన విని ప్రభాకరుండు సంతసించుచు దన కుమారుని రప్పించి శంకరునికి శిష్యునిగా సమర్పించెను. శంకరాచార్యుండును వానికి హస్తామలకుండని పేరు పెట్టి బ్రహ్మభావముపదేశించి తన ప్రధాన శిష్యులలో జేర్చికొనియెను. అనంతర మతండచ్చోటు గదలి క్రమంబున నరిగియరిగి.

సీ. తుంగభద్రానదీ తుంగ తరంగ శీ
　　తల మారుత ప్రమోద ప్రదంబు
దర్శనమాత్ర విధ్వంసితాఖిల ఘోర
　　పాతకం బమృత సంపాదకంబు
అభ్యాగతజనార్చనార్పితమందార
　　పాదపంబుతీర్థ పాదపంబు
అద్వైత విద్యారహస్యజ్ఞ గురుతపో
　　ధనజ నాంచితము బాధారహితము

గీ. ఋష్యశృంగ మహాతాపసేంద్రభూరి
తరతపః పావనంబు సుందరవనంబు

దురిత భంగకమగు శృంగ గిరిపురంబు
శంకరాచార్యుడరిగె సచ్ఛాత్రుడగుచు.

వ. అమ్మహాస్థలంబు శృంగేరియనియు శృంగగిరియనియుం బ్రఖ్యాతి వహించియున్నది. అప్పవిత్రక్షేత్రంబు బ్రవేశించి శంకరాచార్యుడందుగల సత్పురుషులను దారచించిన భాష్యాది గ్రంథము లన్నియు జదివించి వ్యాపింపజేసెను. మరియొకనాడు శంకరుండు పద్మపాదుంజూచి "వత్సా! యీ పుణ్యస్థలంబు శారదాంబను నిలుపుటకుత్సాహము గలుగఁజేయుచున్నది. తత్పరికరముల సమకూర్పవలయును. ఇందు మఠము గట్టింపవలయును" నని పలుకుచు స్వశిల్పుల నావిర్భవింప నింద్రవిమానకల్పమగు ప్రాసాదమొకటి కల్పించి బ్రహ్మాది దేవతలకు సైతము వందనీయయగు మహాదేవిని బ్రతిష్ఠ జేసెను.

అమ్మఠంబున నా శారదకు విద్యాపీఠపూజ గావింప దన శిష్యులలో బ్రధానుండగు సురేశ్వరుని నధ్యక్షునిగా నియమించెను. ఆ శారదాంబయున్ను దాఁ గావించిన ప్రతిజ్ఞ పరిపాలించుచు నిప్పటికి శృంగేరిపురంబున భక్తాభీష్ట ప్రదానకల్పకంబై విరాజిల్లుచున్నది.

## తోటకాచార్యుని కథ

శంకరాచార్యుడందు శిష్యులతోఁ గొన్నిదినంబులు వసియించియుండ నొకనాఁడొక బ్రహ్మచారివచ్చి యతని పాదంబులంబడి, "మహాత్మా! నేను మూఢుండ, విద్యాశూన్యుండ, బుద్ధిహీనుండ, నీకు శిష్యత్వముజేయు తలంపుతో నరుదెంచితి. నాపేరానందగిరి. యెందరో విద్యాగంధరహితులగువారి నెక్కండ్రు శిష్యులగా స్వీకరించి విద్వాంసులంజేసితివనిన ఖ్యాతి విని నిన్నాశ్రయింపవచ్చితిని. నీవు పరమకారుణికోత్తముఁడవట. నిన్ను శరణుఁ జొచ్చితిని. నన్ను రక్షింపుము. శిష్యునిగా ననుగ్రహింపు"మని యనేక ప్రకారంబుల బ్రార్థించెను. అప్పుడు శంకరాచార్యుఁడు మందహాసము సేయుచు నాని శిష్యునిగా గైకొనియెను. అది మొదలా బ్రహ్మచారి గురుండు గూర్చుండిన గూర్చుండును. నిలుచుండిన నిలువంబడును. నడచిన ననుగమించి నడుచును. పరుండినఁ దల్లిగా బాదము లొత్తును. చెప్పిన పని శ్రద్ధాపూర్వకముగా గావించును. [illegible]ండుగా స్నానము జేసి గురుండు గూర్చుండునంత గంటలకొలఁది పనులను బోటితో నుండి భక్తితో నుడుకును. గురుండు బాహ్యక్రియల కరిగినపుడు నంత నిష్ఠాపరుండై తప్పి యమరించియుండును. గురుని సమీపమున నెన్నఁడు నావులింపఁడు. పాదముల జాచఁడు. పెక్కులు పలుకఁడు. ఛాయవలె గురు ననుసరించి తిరుగుచు భక్తిపూర్వకముగా శుశ్రూష గావింపుచుండెను. చిత్తానువర్తియైన యా శిష్యుని నిష్కాపట్య భక్తి విశ్వాసములకు శంకరాచార్యు లంత

రంగమున మెచ్చుకొనుచుండెను. ఇట్లుండ నొకనాడు శంకరుండు వాడుక సమయమునకు మఠంబునం గూర్చుండి శిష్యులకు పాఠము జెప్పఁబోవు సమయమున నా బ్రహ్మచారి యెందుఁబోయెనని యడిగెను. అప్పుడు మరియొక శిష్యుడు స్వామీ యతండును నేమును దమ కాటిపటంబుల నుదుకుటకై తుంగభద్రకుం బోయితిమి. నేను నా పని వేగముగా దీర్చుకొని పాఠము చదువువేళ మిగులునను తెలివితో వడిగా జనుదెంచితిని. వాడూరక యుదికినదే యుదుకుచు గాలహరణము జేయుచున్నాడు. నేను పాఠము చదువ రమ్మని పిలిచినను వినుపించుకొనక యిదిగో వత్తు నదిగో వత్తునని నన్నుఁ గూడ రెండుగడియలు నిలిపెను. వానికిఁ బనియందుఁగల శ్రద్ధ చదువునం దుండదు. కాకున్న నింతవాగు సేయునా? యని పలికి యూరకుండెను. అప్పుడాదయాళుండైన శంకరుండు వానిరాక నిరీక్షించుచు రెండుగడియలు పాఠము చెప్పుట నిలిపివేసెను. వాఁడప్పటికిని రాకున్నఁ బద్మపాదుండు లేచి స్వామీ! యతండు మందబుద్ధి. గోడ వంటివాఁడు. ఏమియుం దెలియదు. ఊరక వినుటయేకాని విద్యాగ్రహణశక్తి యించుకయును లేదు, శబ్దములైనను రావు. అట్టి మూఢునకు మాపాఠములను వినుటవలనం బ్రయోజనమేమియున్నది? వానికి శాస్త్రాధికార మెక్కడనున్నది? మాకుఁ జెప్పుడని పలికిన విని పద్మపాదుని గర్వోక్తులఁ బరిహసించు తలంపుతో శంకరుం డిట్లనియె.

పద్మపాదా! వానిసామర్థ్య మేమియరసి నీవట్లంటివి. వాఁడు మీయందరికన్న విద్యలలో నధికుండు. కవి, వక్త, ప్రౌఢుండు. అంతర్ముఖుండగుటచే వాని మహిమ మీకుఁ దెలిసినదికాదు. వచ్చిన తరువాతఁ బరీక్షించి చూడుఁడని పలుకుచుండఁగనే యుదికిన కషాయ చేలంబులు భుజములమీఁద నిడికొని దచ్చోటి కరుగుదెంచెను.

వానిం జూచి గురుండు గిరీ? పాఠము చదువవలయు వడిగా రమ్ము. కాటులఁ బిమ్మట నారవేయుదువుగాని యనిచీరినను వాఁడు వినయశ్రద్ధగా బట్టలు నారవేసి యచ్చోటి కరుదెంచెను. అప్పుడు శంకరుండు వానికి మనసుచేతఁ బదునాలుగువిద్యలు వచ్చునట్లనుగ్రహించెను. అప్పుడు వాఁడఖిలవిద్యాప్రవీణుండై చేతులు జోడించుచు శంకరాచార్యునిఁ దోటకవృత్తములచే నిట్లు స్తుతిఁజేసెను.

శ్లో॥ భగవనుదధౌమృతి జన్మఝలె
సుఖదుఃఖఝరె పతితంవ్యథితం
కృపయాశరణాగతముద్ధరమా
మనుశాధ్యుపపన్నమనన్యగతిం॥ 1

శ్లో॥ వినివర్త్యతరీం విభయేవిషమాం పరిముచ్యశరీరవిబద్ధమతిం॥
పరమాత్మ పదేభవనిత్యరతోజహి మోహమయం భ్రమమా
త్మమతే॥ 2

విసృజాన్నమయాదిషు పంచసుతామయమస్మి మమేతిమ
తిం సతతం। దృశిరూపమనంతమజం విగుణం హృ
దయస్థమవేహిస దాహమితి॥ 3

జలభేదకృతా బహుతేవరవేర్ఘటికాదికృతా
నభ సోపియథా। మతిభేదకృతానతథాబ
హు తాతవబుద్ధికృతో వికృతస్యసదా॥ 4

దినకృత్ప్రభయాసదృశేనసదా
జనవిత్తగతం సకలం స్వచితా।
విదితం భవతావికృతేనసదా
యతఏవమతోసి సదేవసదా॥ 5

అని యిట్లద్వైతమత ప్రతిపాదకంబులగు తోటక వృత్తములచే నా యానందగిరి యాచార్యునిస్తుతియించుటయు నాలించి పద్మపాదాది శిష్యులు తెల్లవోయి చూచుచు నిది యస్మద్గురు కారుణ్య మహిమకాక వేఱొండుకాదని నిశ్చయించి సిగ్గుపడి యూరకుండిరి.

పిమ్మట శంకరుండు గటాక్షాంకురముల వానిపై వెలయఁ జేయుచుఁ దోటకాచార్యులని పేరుపెట్టి పద్మపాదాది ప్రధాన శిష్యులలోఁ జేర్చుకొనియెను. పద్మపాద సురేశ్వరహస్తామలక తోటకాఖ్యులచే నొప్పుచుండెడి శంకరాచార్యుని నలువుర శిష్యులను ధర్మార్థకామ మోక్షములనియు ఋగ్యజుస్సామాథర్వణ వేదములనియు సాలోక్య సామీప్య సారూప్య సాయుజ్యనామకము క్తి భేదంబులనియు బ్రహ్మ ముఖంబు లనియు విద్వాంసులు సంతతము వర్ణింపుచుందురు. అట్టి శిష్యులతోఁ గూడికొని శంకరాచార్యుండు శృంగ గిరియందు వసియించి భాష్య వ్యాపనము చేయుచున్న సమ యంబున భారతీపీఠసుండగు సురేశ్వరుం డొకనాఁడు శంకరాచార్యుం జూచి నమస్క రింపుచు, మహాత్మా ! నేను నీవలనఁ బరమార్థోపదేశము వహించి కృతార్థుండనైతిని. నీరచించిన శారీరకసూత్ర భాష్యమునకు వార్తికముచేయు నుత్సుకత్వము నాకుఁ గలిగి యున్నది. గంభీరవాక్య యుక్తమగు భవదీయ భాష్యమును జూచుటకైనను నాకు సామ ర్థ్యములేదు. అయినను భవదీయ కటాక్షలేశపాతంబునంజేసి యథాశక్తి నాచరింతు నను జ్ఞ యిత్తురేయని యడిగిన శంకరుండు సంతసించుచు నీవు నా భాష్యమునకు వార్తి కముఁజేయుట నాకెంతయు సమ్మతమైయున్నది. అట్లవశ్యము గావింప వలసినదే యని శిరఃకంపమున నంగీకారము సూచించెను.

అవ్వార్త విని పద్మపాదుని కత్యంత మిత్రులును సతీర్థులునగు చిత్సుఖుఁడు మొదలుగాఁగల మరికొందరు శిష్యులొకనాఁడు శంకరాచార్యునితో రహస్యముగా నిట్ల

నిరి. గురువరా ! ఇప్పుడు తమ భాష్యమునను సురేశ్వరుని వార్తికము గావింపుమని యానతిచ్చినట్లుగా వింటిమి. యప్పని మన మనోరథము సఫలము గావింపనేరదు. ఏమిటికంటిరేని వినుండు. ఈ సురేశ్వరుండు, కర్మయే స్వర్గనరకాది ఫలమునిచ్చునని వాదించుచు యుక్తిప్రయుక్తులచే బ్రహ్మాదులకునైన మీశ్వరుండైన పరమేశ్వరుని నిరాకరించెను. ప్రత్యక్ష సన్నిహితంబగు జగంబులకుఁ బ్రళయము పురాణములు చెప్పుచున్నవి. అట్టి పురాణకర్తయగు వ్యాసమహర్షికి శిష్యుండైన జైమినిముని మతము విరుద్ధమేమిటి కంటిరేని గురుశిష్య మతములు రెండును పరస్పర విరోధకములై యున్నవి గదా. దానంజేసి శిష్యుని మతముపూర్వపక్షమైన దానిఁగాఁ దలంపవలయు అట్లు తలంపక సురేశ్వరుండు పుట్టినది మొదలు కర్మలయందిష్టము గలిగి సంతత కర్మలం జేయుచు నెల్లరను "గర్మలంజేయుఁడు స్వర్గాది ఫలంబులంబొందుఁడు. వృథాగా మరియొక మార్గంబునంబడి చెడిపోవకుఁడు" అని బోధించుచుండెడివాఁడు. అట్టివాఁడు మీయానతిఁ బొంది భాష్యమునకు వార్తికము రచించినను దానిఁ గర్మపరత్వముగా సూచింపక మానఁడు. మరియు సన్న్యాసియయ్యు గర్మరతుండగునా ? యంటిరేని యితండు బుద్ధిపూర్వకముగా సన్న్యాసమును స్వీకరించిన వాఁడుకాఁడు. కాదంబున నోడి బలవంతముగ నట్టి నియమమును స్వీకరించినది మీయెరింగినదేకదా. కావున నితనియందు విశ్వాసము సేయరాదు. ఇతనిచే వార్తికము రచించుకొనుట లెస్సగాదు. మీ యెరుంగనిది కలదా ? కర్మాసక్తుండెన్నఁడైనఁ గర్మవిడుతునని చెప్పుట కిష్టపడునా ? భట్ట మత పక్షపాతియగు నితని సన్న్యాసము జాత్యంధాదుల సన్న్యాసమువంటిది కాని మరియొకటికాదు.

మీరిప్పనిఁ జక్కగా నాలోచించి చేయవలయును. మీ శిష్యులలోఁ బ్రథానుండగు పద్మపాదుని సామర్థ్యము మీరెరుంగనిదియా ?

సీ. గురుభక్తి నవ్వలి దరినుండి పిల్చినం
తనవచ్చెఁ గంగఁ బాదములనిడుచు
నరయక వ్యాసమహర్షితో వాదించు
నప్పుడు నేప్పుతో నతఁడెల్పె
నమరుక నృపశరీరమునను న్నప్పుడు
గాయకుండై బోధ గుఱుగఁజేసెఁ
గాపాలికుఁడు మస్తకముఁద్రెంపఁ గమకింప
నరసింహుఁడై వానిఁ బరిభవించెఁ.

గీ. ఛాయపోలిక మీవెంట సంచరింపు
చాంతరంగికభక్తుఁడై యలరెనట్టి

పద్మపాదుండుగలుగ మీ భాష్యమునకు
వార్తికము సేయ నల సురేశ్వరుఁ డుదగునే ?

మహాత్మా ! పద్మపాదుండే మీ భాష్యమునకు టీక రచింపవలయును. కానిచో నుగ్రతపంబున సరస్వతిం బ్రసన్నురాలిం గావించిన యానందగిరి కప్పని సేయ నిరూపింపుడు. అంతియకాని కర్మైకతానమతియగు సురేశ్వరుని యందట్టి యనుగ్రహము గలిగించుట యుచితము కాదని చెప్పుచుండగానే పద్మపాదుండచ్చోటి కరుదెంచి వినయవినమితశిరస్కుండై యాచార్యునకిట్లనియె ఆచార్యా ! భవదీయ కృపారసవిశేషంబునంజేసి పదునాలుగు విద్యలును హస్తామలకంబు భాతి దెలియబడెను. గావున హస్తామలకుడని సార్థకనామము వహించిన శిష్యవరుండు మీ భాష్యమునకు వార్తికము జేయుట కర్హుఁడు కాఁడా ? కర్మప్రియుండై బలాత్కారంబున సన్న్యాసియైన సురేశ్వరుని యందట్టి యనుగ్రహమేమిటికి గలుగవలయునని యడిగిన మందహాస శోభితవదనారవిందుఁడై శంకరాచార్యుం డిట్లనియె.

వత్సా ! పద్మపాద ! హస్తామలకం డట్టివాఁడే కాని యితనికి బాహ్య ప్రచారమించుకయు లేదు. బాల్యమునుండియు నాత్మప్రచారముగల యీతం డత్యుదారమగు మదీయభాష్యమునకు వార్తికమెట్లు చేయగలఁడు. ఇతండు బాల్యంబున నేమియుం జదువనివాఁడు. వీనిచర్యలన్నియుం జూచికదా భూతగ్రస్తుండని తలంచి వీని తండ్రి నా యొద్దకు దీసికొనివచ్చెను. నేను వీని శిరంబున గరంబిడి నీవెవ్వండవని యడిగినప్పుడుకాదే యానందఘనస్వరూపం బ్రకటించుశ్లోకంబుల జదివెను. దీనికొక యద్భుతకారణమున్నదని చెప్పినవిని శిష్యులెల్లరు నమస్కరింపుచు స్వామీ ! యీతండు బోధలేకయే యిట్టిప్రజ్ఞావంతుడెట్లయ్యె నెఱిగింపుడని యడిగిన నయ్యాచార్యుండు వారికిట్లనియె.

## హస్తామలకుని పూర్వకథ

కొన్ని యేండ్లక్రిందట ప్రభాకరుని భార్య రెండేడులప్రాయముగల బాలు నెత్తుకొని యమునానదికి స్నానార్థమై యరిగినది. అమ్మహానదీతీరంబున సంసారవిరక్తుఁడై యొక సిద్ధుండు తపంబు గావింపుచుండెను. ప్రభాకరుని భార్య తన కుమారుని నా సిద్ధుని మ్రోలనునిచి మహాత్మా ! నేను స్నానముసంజేసి వచ్చునందాక యీ బాలుం జూచుచుండుడు. ఎత్తుకొనువార లెవ్వరును లేరు. తృటిలోవత్తు. దయాహృదయు లగు మీ యెరుగనిదికలదే ! యని వేఁడుకొనిన నతండు తలయూచుచు నందులకియ్య కొనినట్లు సూచించెను.

అయ్యువతియు సుతునతని ముందర నాడుకొనవిడిచి ముద్దిడుకొని వడిగా సఖులతో స్నానముచేయ నదికరిగినది.

అంతలోపల దైవవశంబున నా బాలుండాడుకొన నిటునటు దిరుగుచు దళాలున నిన్ని కటంబునను న్న యమునానదింబడి ప్రాణములు విడిచెను. అప్పుడు తదాప్తులాక్రందనముచేయుచు పడిపడిం బోయి నీటినుండి యబ్బాలుందీసి ప్రాణములు పోవుటచూచి గోలున నేడ్చుచు నా సిద్ధుని మోల నా బాలవశమును బడవైచిరి. ఇంతలో బ్రభాకరుని భార్య యవ్వార్తవిని యడలుచు నచ్చోటికివచ్చి చచ్చియున్న సుతుని కళేబరముపైబడి అయ్యో ! నా ముద్దుకూన ! యెంతలో నీల్గితివిరా ! నీ ముద్దుమోమెంతలో గళదప్పినది నీ చిట్టిపలుకులు విని యెన్నియో దినములైనట్లున్నదియో అన్నన్నా. యీ సిద్ధుండు మమ్మెంత మోసము చేసెను. తాను మొదట సమ్మతింపకున్నను మాకీముప్పు రాకపోవునే ఇంత దయాహీనుండని యెఱింగినచో నితని కురంగట విడువక పోవుదునే. ఇంతలో నెంతపుణ్యము సంపాదించుకొనవలయుననియో యీ సిద్ధుండు వీనింజూడ కుపేక్షించెను. ఇట్టి కఠినాత్మునకు దపంబెట్లు సిద్ధించును ? నియమంబులేమిటికి ? సమాధి కాల్పనా ? యీ బాలఘాతకుని మొగంబు జూచిన, బాతకము రాదా ! కటకటా పెక్కేండ్లు తపంబుజేసికన్న ముద్దుపట్టిని వీని పొట్టం బెట్టితినే ఏమి చేయుదును. దిక్కెయ్యది ? పతి కేమని వక్కాణింతును ? సుతుండేమయ్యెనని చెప్పుదును ? ఈ పాడునది కేమిటికి మునుంగవచ్చితిని; హా దైవమా ! యని ప్రకారంబుల వగచుచు నా సిద్ధుని దిట్టుచు నాపాంతబిట్టు వాపోవజొచ్చెను.

అప్పుడమ్మహర్షి తదీయశోకాలాపంబు లాకర్ణించి వగచుచు దన యుపేక్షకుఁ బశ్చాత్తాపము జెందుచు నయ్యుపవాదము సైరింపక సమాధివిడిచి యా బాలుని బరీక్షించుచు అయ్యో వీనికొరకు చింతించెదరేల ? వీడు బ్రతుకగలడు. క్షణకాలము నిరీక్షించుచుండుడని పలికి యవ్వల నెక్కడనో తనకాయంబు పాఱవైచి యోగసామర్థ్యంబుల బరకాయప్రవేశ విద్యానైపుణ్యంబు దీపింప నబ్బాలుని యందు బ్రవేశించెను.

అప్పుడయ్యర్భకుండు కదలియేడ్చుటయుంజూచి సిద్ధునికృపావిశేషంబున బాలుడు బ్రతికెనని సంతసించుచు దల్లి యాప్తులతో గూడ నా పుత్రునెత్తికొని తన నెలవునకుం బోయినది. పిమ్మట నక్కుమారుండు శిశువిలక్షణ వ్యాపారములతో మెలంగుట చూచి ప్రభాకరుండున్మాదవికారంబులనుకొని యెన్నియో ప్రక్రియలు గావించెను. తరువాయి వృత్తాంతము మీరెఱింగినదేకదా ! అతడే హస్తామలకుండు దానంజేసియే యుపదేశము లేకయే సర్వజ్ఞుండయ్యెను. ఇతండెరుగనిది యేమియు లేదు. కాని యీతండు బాహ్యప్రవృత్తి శూన్యుండగుటచే భాష్యంబునకు వృత్తిరచించుటకుం దగడు. సమస్త శాస్త్రసముద్రపారంగతుండగు సురేశ్వరుండ యప్పని కర్హుండు. అతండొరులబడసిచో దదన్యుండంతవాడుమరియొకడుగానరాడు. పెక్కండ్ర క్లిష్టములేని కార్యము కావించుట నా కిష్టములేదు. ఒక మహాకార్యమునకు పెక్కు

విఘ్నములు సమకూడుచుండునని పలికిన శిష్యులు వెండియు నిట్లనిరి. స్వామీ! హస్తామలకునిమాట యటుండనిండు. మీ సెలవైనచో బద్మపాదుండు వార్తికము సేయ నోపడా? అతండు బ్రహ్మచర్యము నుండియే సన్న్యసించిన ధన్యుండగుటయు లోకమాన్యుం డనియు బుద్ధిమంతుడనియు జగద్విదితమైనదియే కదా! తమకు వానియం దనుగ్రహమేమిటికి గలుగలేదని యడిగిన శంకరుండిట్లనియె. మీ కందరికి నట్టి యభిప్రాయము గలిగియుండినచో బద్మపాదుండు మదీయభాష్యమందొక నిబంధము రచించుగాక. వార్తికము మాత్ర మా సురేశ్వరుండే చేయవలయునని చెప్పి యంతటితో నా ప్రస్తావము గట్టిపెట్టెను.

మరియొకనాడు శంకరాచార్యులు సురేశ్వరుంజూచి "ఆర్యా! దుర్విదగ్ధులగు మదీయశిష్యులెల్లను నీవు వార్తికము జేయుటకు సమ్మతింపకున్నవారు. నీవు కర్మతంత్రుడవనియు గృహస్థధర్మరతుండవనియు నిన్ను శంకించుచున్నారు. కావున భాష్యమునకు వార్తికము రచింపకుము. భవదీయ సామర్థ్యము దెలియునట్లుగా సుందరగా సద్ధ్యాత్మతత్త్వంబు దేటపడునట్లు స్వతంత్రముగా నొక గ్రంథము రచించి నాకు జూపుము. నీ గ్రంథరచనా సామర్థ్యముజూచి యీ శిష్యులకు నమ్మకము గలుగునట్లు చేయు"మని యానతిచ్చి అయ్యో! మదీయ భాష్యమునకు వార్తికము లేకపోయెనే యని యించుక విచారించెను.

అట్లు శిష్యుల ప్రేరణమువలన శంకరాచార్యుండు తన్ను వార్తికము చేయ వలదనియు స్వతంత్రముగా నద్వైతగ్రంథమొకండు రచింపుమని చెప్పిన విని సురేశ్వరుండు మిగుల నీసుంజెందియు నేమియుం బలుకక యల్పకాలములో నైష్కర్మ్యసిద్ధియను గ్రంథమొకండు రచించి యాచార్యునకు జూపెను. అగ్గ్రంథమును జూచి శంకరుండు మిగుల విస్మయము నొందుచు దానిని శిష్యులకు జూపి పెక్కుతెరంగుల గొనియాడెను. ఇప్పటికిని యతీశ్వరులా గ్రంథమునం దెక్కుడు విశ్వాసము చేయుచుందురు. అట్లు తన గ్రంథమునుజూచి యాచార్యుండు సంతసించినంత సురేశ్వరుం డలుకతో నాహా! యీ లోకమున మత్సరగ్రస్తులు పెక్కండ్రు గలిగియుందురు. నేనాచార్యవాక్యంబునంజేసి వార్తికము సేయ నుద్యోగించినంతననవసరముగాఁ గొందరు విఘ్నము గావించిరి. కావున మదన్యం డెవండా గ్రంథమునకు వార్తికము జేసినను నిలువక నశించెడుంగాతయని శాపంబిచ్చి యల్లన నాచార్యునకిట్లనియె. గురువరా! నేను గీర్తికొఱకుఁగాని లాభముకొఱకుఁ గాని వార్తికముచేయ నుద్యోగింపలేదు. గుర్వాజ్ఞ యనుల్లంఘనీయమని యప్పనికిఁబూనుకొంటిని. పూర్వమితండు గృహస్థుండనియుఁ గర్మరతుండనియు నాక్షేపించుచు నీశిష్యులు నన్నప్పని కనర్హునిగాఁ దలంచిరి. ఇంతకన్న నవివేకమెందైనం గలదా? అనుభూతంబులైనను బాల్యచేష్టలు యౌవనంబునం బొడకట్టునా? వార్ధకంబున యౌవనచిహ్నములు దోచునా? అట్లే సన్న్యసించిన తరు

వాతఁ బూర్వధర్మముల యందాసక్తి యేమికిఁగల్గెడిని ? గృహస్థుండైనను సన్న్యాసి యైనను మనస్సే కదా ప్రధానము. నీచే వాదంబున నోడిపోయి దృఢమైన బుద్ధితోఁ దురీయాశ్రమము స్వీకరించితిని. పూర్వాశ్రమ విడిచితిని పూర్వము నేను గృహస్థుండై యున్నతరి నైయాయకాది గ్రంథము లయందెక్కుడు నమ్మకము కలుగునది భవదీయ పాదసేవ లభించిన పిమ్మట నా యనుమానమంతయు వదలిపోయినది. అద్వైత మతమునం దెక్కుడు విశ్వాసము గలిగియున్నది. అట్టి నా మనోధర్మముఁ దెలిసికొనఁ లేక నీ శిష్యులు నన్ను నిరాకరించిరని పలుకుచున్న సురేశ్వర భారతీస్వాముల వారి కోపవహ్నినివివేకోదకములచే నడంచుచు శంకరుం డిట్లనియె.

అన్నా ! నీవు తొందరపడి మదీయసూత్రభాష్యమునకు వార్తికము నిలువ కుండునట్లు శపించితివి. అది దైవకృతము సూత్రభాష్యమునకు వార్తికము లేదను చింత మదీయాంతఃకరణమున మిక్కిలి బాధింపుచున్నది. ఏమి చేయుదును? కానిమ్ము నేను మదీయశాఖయగు తైత్తిరీయోపనిషత్తునకు ద్వితీయ శాఖయగు కాణ్వోపనిషత్తు నకు భాష్యములు చేసియుంటిని. ఆరెంటికిని నీవు వార్తికములు రచియింపు మానంద తారకములై పుడమివెలయునని యానతిచ్చెను. సురేశ్వరుండు గురునానతి శిరంబున బూని యప్పుడ వాసికతోఁ దైత్తిరీయకాణ్వోపనిషత్తులకు శంకరాచార్యుండు రచించిన భాష్యములకు వార్తికములు రెండు విద్వాంసులు మెచ్చునట్లు కావించి యవి యాచార్యుని పాదమూలమునఁ గానుకగా సమర్పించి యతని కామోదముగలుగఁ జేసెను. పిమ్మటఁ పద్మపాదుండును శారీరకసూత్రభాష్యమునకు నాత్మకీర్తి విజయడిండిమమగు టీకను నిరవద్యయుక్తిసూతమైనదానింగా రచియించి గురుదక్షిణగా సమర్పించెను. అందు బూర్వభాగము పంచపాదికయనియు, నుత్తరభాగము వృత్తియనియుఁ బ్రఖ్యాతిఁబొంది నది. పిమ్మట హస్తామలకాది శిష్యులును గుర్వాజ్ఞఁగైకొని మరియు నాత్మతత్త్వప్రఖ్యా పకములగు గ్రంథంబు లనేకములు రచించిరి. అట్లు శంకరాచార్యులు శిష్యులచేఁ బెక్కు గ్రంథములు రచియింపఁజేసి కొన్ని దినములు శృంగగిరియందు సంతోషముతోఁ గాలక్షేపము జేసిరి. ఒకనాఁడు హస్తామలకుండును జిత్సుఖుండును దుంగభద్రకు స్నానార్థమైయరిగి యిట్లు సంభాషించుకొనిరి.

చిత్సుఖుండు—హస్తామలకా ! మన యాచార్యుఁడు నేఁడేమియో ఖిన్న మానసుండై యున్నవాఁడేమి ? పద్మపాదుండు సేతుయాత్రకరిగెననియా యేమి ? మనయందరికన్న వానియందెక్కుడు తాత్పర్యము సుమీ ! హస్తామలకుఁడు—అగు నందులకే కావచ్చును. పద్మపాదుండు సేతుయాత్రకరిగెదనని యడిగినప్పుడు మార్గ గమనము కష్టమనియు నొంటరిగా పరదేశయాత్రచేయుట క్లేశకరమనియు దారిలో

రోగాదికములు బాధించునప్పుడు సహవాసము కావలయునని నాత్మతీర్థ మాడువారికిఁ దీర్ఘయాత్రవలన బ్రయోజనములేదనియుఁ బెద్దతడవు చెప్పి పోవలదని బోధించెను.

శిష్యుఁడు—గురువచనము తిరస్కరించి పద్మపాదుండేమిటికిఁ దీర్థయాత్రకరిగెను.

హస్తామ—తిరస్కరించియరుగలేదు. తీర్థసేవవలన మనస్సు నిర్మలమగుట, దేశవిశేషదర్శనలాభము అనర్థములుపోవుట, సజ్జన సాంగత్యము, పండిత విశేషసంవాద లాభము లోనగు కార్యములు సంఘటించును గావున నందుకాజ్ఞ యిమ్మని పద్మపాదుండు గురునిఁ బెక్కుగతులఁ బ్రార్థించిన నాయన యంగీకరించి యతండరుగునప్పు డిట్లుపదేశము గావించెను.

సీ. అరుగకు మొక్కండ వధ్వనెన్నడుఁ బహు
బ్రాహ్మణుల్గలుగు నూరనె వసింపు
తరచు సజ్జనులతోఁ బరిచయంబొనరింపు
మతిమార్గభేదంబు నపనయించు
జలమెనఁగొనకుము దెలియకుండఁగదాన
సర్వస్వహరణదోషముఘటించు
గూఢరూపములఁ గైకొని దారిఁ బోవ
వత్తుర చోరులట్టి ధూర్తుల్గ్రహింపు.

గీ. మరుగునప్పుడు దారిలో సత్తవిస
భిక్షుకులనాదరింపుము పృథుమనీష
ధ్యానమొనరింపు మప్పుడ యాత్మతత్త్వ
మనఘ సుఖమగు దారిని కట్టుపడ.

శిష్యుండు—ఓహో! మహనీయవచనములు [illegible] నాశ్చర్యమున్నదియో చూచితివా? యతండు తిరుగ నెన్నిదినములకు మనలం గలిసికొనునో తెలియునా?

హస్తామలకుఁడు—రెండు నెలలలోపున వత్తునని చెప్పిపోయెను. అదిగో తోటకాచార్యులు సొన్నమునకు వచ్చుచున్నాఁడు. మన గురుండు సమాధినుండి లేచినేమో యడుగుదము.

తోటకుఁడు—ప్రవేశించి అయ్యో! మీరిందు బాగుసేయుచున్నారేమి మన యాచార్యుఁడు యోగశక్తిచే మాతృవృత్తాంత మెద్దియో యంతఃకరణగోచరముఁ జేసికొని యచ్చటికిఁ బోవలయునని ప్రయత్నము చేయుచున్నాఁడు. త్వరగారండు సురేశ్వరునితో నెద్దియో ముచ్చటించుచున్నాఁడు.

చిత్సుఖుఁడు—హస్తామలకా! మనసందియము దీరినది. యందులకే మన గురుండు సమాధిగైకొనియె మనకేమి చెప్పునో వడిగా బోవుదము లెమ్ము.

అని పలికికొని తోటకునితోఁగూడ నిష్క్రమించిరి. పిమ్మట శంకరాచార్యులు ప్రాణోత్క్రమణ సమయమగుచుండ స్మరింపఁబడి యందుబోవుచుఁ శిష్యులనెల్లఁ దానువచ్చునందాక నందుండ నియమించి యోగశక్తిచే గగనమార్గంబున ముహూర్తకాలములోఁ దల్లియున్న నెలవునకుం జని "అయ్యో! కుమారా! యిట్టి సమయమున నీవు నా యొద్ద లేకపోయితివే. నీ వంటి యుత్తమపుత్త్రుంగనియు గొడ్డురాలివోలెఁ ననాథనై పొలియవలసెనే! కటకటా! భవద్దర్శనలాలసంబులై యీ బొంది విడువక కృపణప్రాణంబులు నన్నునరకక్లేశమనొందుచున్నవి. హా! యెంత పాపాత్మురాలనైతిని. నందనా యెందుంటివి? ఎవ్వరికి బోధ సేయుచుంటివి? ఒక్కసారివచ్చి నా కన్నులం బడరాదా? నిన్ను జూచినంత నాయాపదలన్నియు నడిగిపోవకుండునా? నాతో నెన్నియో చెప్పిపోయితివే అవి యన్నియు మఱచితివి కాఁబోలు తండ్రీ యీ వృద్ధమాతయందింత యక్కటికములేకపోయెనే. ఆహా! మరణకాలంబున స్మరించినంతనే వచ్చి యూర్ధ్వదైహికక్రియలు గావింతునని శపథముగాఁ బలికితివే నాయనా! యేమిటికి రావు? ఎందున్నావు క్షేమముగానుంటివో లేదో హాపుత్రా! హాపుత్రా!" యని పలవరింపుచున్న తల్లింజూచి శంకరుండు నిస్సంగుడైనను దయాళుండగుటఁ గన్నులనీరుగార్చును నిట్లనియె.

అమ్మా! ఇదిగో నేను వచ్చితిని. నీ పుత్త్రుండ శంకరుండ ఇక నీవు విచారింపకుము. నీయభీష్ట మెద్దియో చెప్పుము వెచ్చెరం గావింతునని పలుకుచుఁ బాదంబులకు నమస్కరించెను. అప్పుడామె నిదాఘార్త దంబుదనాదంబునం బోలె నాత్మీయపరితాపంబు వదలి సంతోషమునఁ బుత్త్రుం గౌఁగిలించుకొని తండ్రీ నాయీయవస్థలో నీవు కుశలముగా వచ్చి నాకన్నులంబడితివి. ఇంతకన్న సంతోష మేమి యున్నది? పుత్రా! జరాశీర్ణంబగు నీగాత్రంబింకమీఁద వహింపలేకున్నదాన. యథాశాస్త్రముగా నా దేహము సంస్కరించి పుణ్యలోకముల నొందింపుము. ఇదియే నా కోరిక యని పలికినది.

తల్లి మాట విని శంకరాచార్యుం డఁశరూప్యత సర్వలోకసుఖమగు బ్రహ్మానందము నొందింపు తలంపుతోఁ దల్లికి స్వప్రకాశమగు శుద్ధనిర్గుణతత్త్వ ముపదేశించెను. అప్పు డయ్యంబ శంకరునితో, నాయనా! నీవేమో నాకుఁ జెప్పితివికాని యేమియుం దెలిసినదికాదు ఇట్టిసమయమున నిర్గుణుని నెట్లు మనస్సునం బట్టించుకొందును? అతి మనోహరమగు సగుణతత్త్వ ముపదేశింపుము. ఆనందింతునని పలికిన విని శంకరుండు దయాళుండగుచుఁ దల్లికి దర్శనమిచ్చుటకై భక్తవశంకరుండైన శంకరుని భుజంగప్రయాతవృత్తములచే నిట్లు స్తుతియించెను.

శ్లో॥ అనాద్యంతమాద్యం పరం తత్త్వమర్థం
చిదాకారమేకం తురీయం త్వమేయం
హరిబ్రహ్మమృగ్యం పరబ్రహ్మరూపం
మనోవాగతీతం మహాశైవమీడే.

2. స్వసేవాసమాయాతదేవాసురేంద్రా
నమన్మౌళిమందారమాలాభిషిక్తం
నమస్యామిశంభోపదాంభోరుహంతే
భవాంభోధిపోతం భవానీనిభావ్యం.

3. అకంఠేకళం కాదనంగే భుజంగా
దపాణౌకపాలాదఫాలేనలా క్షాత్
అమౌళౌశశాంకాదవామె కళత్రా
దహం దేవమన్యం నమన్యే నమన్యే.

వ॥ అని యిట్లు శంకరుండు శంకరుని భుజంగ ప్రయాతవృత్తంబుల స్తుతిఁ జేయుటయుఁ బ్రసన్నుండై యాభక్తవత్సలుం డాత్మీయ దూతలం బుచ్చుటయు.

ఉ. శూలధనుఃకపాలపరిశోభితహస్తులఁభూతిసంచయో
ద్ధూళితగాత్రుల శ్శశిధనుస్ఫురితోరుకిరీటులన్ జటా
జాలసమున్నతాపగుల శంకరకింకరులన్ భుజంగభూ
షాలలితాంగులం బ్రదినయ నాంచితులంగనెనా పెముందటన్.

వ॥ కనుంగొని మనంబున సందియమందుచు వత్సా! వీరెవ్వరో నన్ను రమ్మని పిలుచున్నవారు వీరి యాకారములు తమోగుణమును సూచింపుచున్నయవి వీరితోఁబోవుటకు నాడెందఁబొదంబడకున్నది. కావున వీరిం బంపివేయుమని తల్లి పల్కుటయు నయ్యతివల్లభుండు వారిని సానునయముగాఁ బోవం బ్రార్థించి మించిన భక్తితోఁ గేలుదోయి ఫాలంబున గీలించి యనంతభోగపర్యంకంబున నిండినాసుందర పర్యంకపీఠంబునజరణపంకేరుహంబులునిచి నీలావసుధావధూటులిరుగెలంకులనిల్చి చామరములిడుచుండ గరుడుండగ్రభాగంబున దోసిలి యొగ్గి నిలువంబడ శంఖచక్రాది సాధనంబులు మూర్తీభవించి యాశ్రయింప మకుటకేయూరకుండలాద్యలంకారపరిశోభితుండై నీలనీరదనీకాశదేహంబు దీపింప మందహాసశోభితవదనారవిందుండై శయనించియున్న యిందిరావల్లభుం బ్రార్థించి తల్లికట్టిరూపము బోధించి "అమ్మా! నీకిప్పు డెట్టివారు గనంబడుచున్నవారి"ని యడిగెను.

ఉ. చందనచర్చితాంగుల విశాలసరోరుహపత్రనేత్రులన్
సుందరనీలనీరద విశోభితగాత్రుల విస్ఫురద్గదా

నందకముఖ్యసాధనకసత్కలయలన్మణికింకిణీరణ
త్స్యందనయుక్తులన్సుగుణసక్తులవెన్నునికూర్మిభక్తులన్.

వ॥ ఆ వృద్ధాంగనముందరఁ గనుఁగొని యానందముతోఁ దండ్రీ యిప్పుడు శాంతులైన వారెవ్వరో వచ్చి మెఱుపువలె మెఱయుచున్న రథముమీదికి నన్ను రమ్మని పిలుచుచున్నారు. పోయివత్తు నిదియంతయు నీ మహిమయేకదా? వెనుకయిచ్చిన వరము మఱువకుమీ యని పలుకుచు నామె ప్రాణములు విడిచి దివ్యదేహంబుఁ దాల్చి యవ్విమానం బధిరోహించి పరమపదము నొందినది

పిమ్మట శంకరుండు తల్లికిచ్చిన వరము చెల్లించు తలంపుతో నపర సంస్కారములు సేయఁదలంచి ప్రధానజ్ఞాతియగు యజ్ఞభట్టారకుం జీరి యందులకుఁ దగిన సన్నాహముఁ గావింపుమని చెప్పెను.

ఆ వార్త విని కాలట్యగ్రహారములో నున్న బ్రాహ్మణులెల్లరు నొకచోట సభఁజేసి యిట్లు సంభాషించుకొనిరి.

సభాపతి—ఏమండోయి శివగురుని కొడుకు తల్లిని జ్ఞాతుల పాలుజేసి సన్యాసము తీసుకొని యిప్పుడామెకుఁ గర్మచేయఁదలచుకొన్నాఁడట. రమ్మనమని గ్రామస్థులకు యజ్ఞభట్టారకుండు కబురుఁజేసెను. మనమందరము పోవలసినదా? మానవలసినదా ?

కొందరుబ్రాహ్మణులు—సన్యాసికిఁ గర్మచేయు నధికారమే శాస్త్రములోఁ జెప్పబడియున్నది ? ఆ కార్యకారణము చేయునప్పుడు మన మేలాగున వెళ్ళుదుము ?

మఱికొందరు—అతఁడు జగత్పండితుఁడుగాని సామాన్యుఁడుకాఁడు అది యకార్యమో కార్యమో యతనికన్న మనకెక్కుడుగా దెలియునా యేమి ?

కొందరు—ఇదియే మూర్ఖత. ఏ కాలములోనైన సన్యాసి కర్మ చేసినట్లు చెప్పికొనుటగాని వినుటగాని యున్నదా ? శాస్త్రముమాట యటుండనీయుఁడు.

సభాపతి—కర్మయే పనికిరాదని దేశముల నెల్లెడల వాదించుచుఁ దాని ప్పుడు తల్లికెటు కర్మచేయఁ బూనుకొనుచున్నాఁడు ? చెప్పునది యొకటి చేయునది యొకటియునా ?

మఱికొందరు—ఇంత వితర్కమేల ? పోయి యడుగరాదా ?

సభాపతి—వీరవర్మ యడిగినంత నేవియో నాలుగు దాంబికములు చెప్పి యతనిని మాఱాడనిచ్చినాఁడు కాఁడట.

మఱికొందరు—పోనీ నీవు వెళ్ళి యడుగుము.

సభాపతి—నా కంత యవసరమేల ? అచ్చటి కెవ్వరు పోకుండే నా యొద్ద కతండేవచ్చునుకదా ?

మఱి—మనలో మనము తగవులాడుట మంచిదికాదు. మనమందరము పోయి యతనితో మాటాడి యుక్తానుసారముగా నాచరింతుముగాక.

కొందరు — మీకేమో దానధర్మములుచేయుననుతలంపుతో జెప్పుచున్నారు. అతఁడు సన్యాసి. ఇచ్చుట కతనియొద్ద నేమియులేదు. ఎదురు మనలనే యాచించును. కావున మా కిష్టము లేదు. మేము రాము. మీరు పోతిరేని మీకును మాకును భోజనములు లేవు. మొదటనే చెప్పుచున్నాము.

మరికొందరు - అతండు బంధువుఁడని యంటిమి. మీ కట్టి తాత్పర్య మున్నది. కావున బ్రీదయఁడని యిట్టియూహ చేయుచున్నారు. చాలు చాలు మీతో మాకు సహపంక్తి లేకపోతే మాకేమియు లోపము లేదు. మొన్నను ఘటశ్రాద్ధము గావించిన విస్సన్నసోమయాజి నెవ్వఁడు నాక్షేపించినవాఁడు కాఁడేమి ? అంతకంటె శంకరుఁడకార్యకరణమేమియుఁ జేయలేదు. మేము పోవకమానము. అదియునుంగాక యజ్ఞభట్టారకుండు మాకు మిత్రుండైయున్నవాఁడు. అతని మొగమైనంజూచి పోవక తప్పదు. మీరు మాకు వెలివేయించినప్పుడు చూతములే.

సభాపతి — ఓహో ! మీరిట్లు స్వతంత్రులై మాటాడుచుండ నా సభా పతిత్వమేమిటికో ? ఏదీ మీరు నా యాజ్ఞలేక శంకరుని యింటి కరుగుఁడు మఱఁడు చెప్పెదను.

మరికొందరు — పోనీ యీ గ్రామములో సంసర్గకుండఁ జేయుదువింతేనా? మరియొకచోటికిఁ బోయెదము. ఇంతకు మేమేమంటిమి ? ఊరక మీరు మమ్మాక్షేపించు చుండ నూరకుందుమా ?

సభాపతి — పైన నేనుండఁగా మీకీ తగవులేలా ! నేనెట్లనిన నందరు నట్లు చేయుఁడు. అదిగో యజ్ఞభట్టారకుం డిట్లు వచ్చుచున్నాఁడు. అతనినిఁ గూడ మనము చెప్పునట్లు నడుచు నాగా జేయుదు. చూడుఁడు నా ప్రభావము.

యజ్ఞభట్టారకుఁడు — [ప్రవేశించి] ఏమండోయి సభాపతిగారు అందరు నిచ్చటనే యున్నారు, గనుక చెప్పుచున్నాను. మా శంకరుని తల్లి రాత్రి స్వర్గస్థు రాలైనది. ఇప్పు డపర సంస్కారము శంకరుఁడే చేయ నిశ్చయించినాడు. మిమ్ముల నందరినిఁ దీసుకొనిరమ్మన్నాఁడు.

సభాపతి — భట్టారకా చెప్పువానికి మతిలేకపోయిన వినువానికి నీకైనను మతిలేదా యేమి? శంకరుండా కర్మచేయుట? ఇట్టి విరుద్ధ మెందైనఁగలదా? విద్యార్థి రాజవంశము వారెట్టి యకార్య కరణము జేసినను సాగునని యేమి

యజ్ఞ — అతఁడు తల్లికిఁ గర్మ చేయుదునని వరమిచ్చెనఁట. అందు మూలమునఁ జేయుచున్నాఁడు. ఎవ్వరేని వచ్చి యడిగిన సమాధానము చెప్పెదనను చున్నాఁడు. ఈ విషయమిందాక మీరవర్కు యడిగిన సమాధానముచెప్పి యతని నొప్పించెనే.

సభాపతి—ఈ సమాధానముల కేమి లెండి. ఇవేమియు మాకు నచ్చవు. తల్లి బ్రతికియుండఁగా పెండ్లియాడుమని యెంత ప్రతిమాలినను వినక చచ్చిన తరువాతఁ గర్మచేయుమని చెప్పినమాటమాత్రము విని యకార్యకరణమున కుద్యోగించుచున్నాఁడా? భట్టారకా! నీవు వట్టి వెఱ్ఱివాఁడవు సుమీ.

భట్టారకుడు—అట్లనుచున్నావేమి? మరియొక హేతువేదియైనంగలదా?

సభాపతి—[రహస్యముగా] శంకరుండు మొదట విరక్తుడై సన్యసించి తన యాస్తినంతయుఁ దల్లితోఁ గూడ నీ యధీనము గావించి యరిగెను గదా? ఇప్పుడా యాస్తియంతయు దాసజనించి తాను స్వాధీనపఱచుకొను తలంపులోఁ దల్లికిఁ గర్మచేయఁబూనుకొనుచున్నాఁడు. ఈ మర్మము నీవెఱుంగక వేఱొక విధమునఁ దలంచుచున్నావు.

భట్టారకుడు—[ఆలోచించుచు] ఇందులకు నేనేమి జేయవలసినది?

సభాపతి—కర్మచేయనీయకుము. మేమందరము నీకుతోడు పడుదుము. మనకు మనకు విధాయకుము. అతండీవేళనుండి తేపుపోవువాఁడు.

యజ్ఞ—అయ్యో! నా కతనితో నేమాట చెప్పుటకు నోరాదు ఏమి చేయుదును?

సభాపతి—నీవేమియుఁ జేయవద్దు. ఇందేయుందుము. అతనికి నిప్పైనను దొరకనీయను. వాహకులు మునుపే లేదు. ఏమి చేయునో చూతము.

యజ్ఞ—అదిగో మా పినతండ్రి పశుపతి నా కొరకు వచ్చుచున్నాఁడు. అతనితోఁ గూడఁ జెప్పుము.

సభాపతి—ఎవరు వచ్చిననేమి? గ్రామస్థులలో బాలుండైన నచ్చటికి రాఁడు.

పశుపతి—[ప్రవేశించి] ఏమిరా భట్టారకా! యిందు జాగుచేసితివి శంకరుఁడు తొందరపడుచున్నాఁడు? వాహకులేరీ?

భట్టారకుఁడు—శంకరుఁడు శాస్త్రదూష్యమైన పనిచేయుచున్నాఁడని గ్రామస్థులెల్లను సభచేసి శంకరునికి వెలివేసిరఁట. వాహకులెవ్వరు రారఁట! మన మేమిచేయుదుము!

పశుపతి—ఆహా! శంకరునికా వెలి! గ్రామస్థులెంత మూర్ఖులు అగ్నికిఁ జెదలుపట్టునా? వీరికెద్దియో మూడినది.

సభాపతి—వీరకేదియు మూడలేదు వారికి మూడియే యిట్టి యకార్యకరణములకుఁ బూనుకొనుట.

పశుపతి—ఛీ. ఛీ. నోరుమూయి. అతండల్గిన మూడులోకములను భస్మము చేయఁగలఁడు.

సభాపతి — ఈ బెదరింపులకు మేము వెరవము. గ్రామస్థు లెవ్వరును రారు. మీ యిష్టము వచ్చినట్లు చేసికొనుఁడు.

పశుపతి — భట్టారకా ! నీవును రావాయేమి ?

భట్టారకుఁడు — బాబూ ! తొందరపడకుము గ్రామస్థులందరు నొక్కటి యైనచో మనము మాత్రము వెళ్ళి ఏమి చేయుదుము ?

పశుపతి — ఛీ ! నీ జ్ఞాతిత్వమూరకపోనిచ్చితివికావు. అతండు మహానుభావుండు. మనలనందరను భస్మము చేయకమానఁడు. చూడుము అదిగో మనమిందు జాగుచేసితిమని మనకొరకు మనకుమార పాలితుని వెండియుంబంపియున్నాఁడు. రెండుయామము లైనది పోదమురమ్ము.

భట్టారకుడు — కుమారపాలితు నచ్చటి విశేషములడిగి పోవుదముండుము.

కుమార — [ప్రవేశించి] పశుపతి తాతా ! నీవునిందు జాగుచేసితివేల ? మనయగ్రహారము పనిదీరినదిలే.

పశుపతి — ఏమి ! యేమి ! యతండు కోపించినా యేమి ? నేనేమిచేయుదును. గ్రామస్థులందరు నగనికి వెలివేసిరఁట

కుమార — ఎంతసేపటికి నీవును భట్టారకుండును రామి, నొక్కండును తల్లి శవము దాపునసుంచి పసిగి కోపముజనింప వీరగుణజగుణల సతంబెరిగి తల్లి కుడి భుజముమథించి యందగ్నిఁ బుట్టించి యయ్యగ్నిచేతమముస బొడ్డిలోఁ జితినేర్పరచి తల్లిని దహించెను.

పశుపతి — అతని సామర్థ్యమెట్టిదో చూచితిరా ? నేను మొదటనే చెప్పితిని. సన్నికల్లు దాచిన బెండ్లి యాగునా ? తరువాత.

కుమార — తరువాత నీ గ్రామస్థుల నుద్దేశించి.

క. శ్రుతిబాహ్యులగుదురిటుపై
యతులెప్పుడు వీరి గృహములందుఁగుడువరు
ద్రతివీర పెరటి భూములఁ
బితృవనములు వెలయుఁగని శపించె నలుకతోన్.

పశుపతి — అయ్యో అయ్యో ! వీరికతంబున విహితులమగు మనముసయితము శాపదగ్ధులమైతిమే. యికేమి చేయుదుము ? వేదబాహ్యులమైపోతిమిగదా. మన గృహములు శ్మశానము లైనవి.

గ్రామస్థులు — [దుఃఖముతో] ఇంతయు నీ సభాపతి మూలమున మూడినది. ఏమియు నెరుంగని వారిని దీసికొనివచ్చి సభలు చేయించి యిట్లనుమని మమ్ము గంగిలో దింపినాడు. మేమేకాక మా కులస్థుల నెల్ల జెరిపికొంటిమి. కటకటా !

కాలట్యగ్రహారము నకెట్టి యాపద ఘటిల్లినది. జన్మభూమి యని యతడెంచుకొనియు కనికరించక క్రూరముగా శపించెనే యిది కాలట్యగ్రహారమైపోయినది

పశుపతి — ఇతండు శాంతుండని పీడించిన గోపగింపకుండునా? చల్లనిదైనను చందనవృక్షము మథింపబడిన నగ్నిజనకము కాకుండునా? తేజశ్శాలులకృత్యములు క్షాత్రియములైనను సింహ్యములు కావు. మున్ను పరశురాముండు పితృశాసనంబున దూష్యంబైనను మాతృవధ గావింపలేదా? అని వారు పశ్చాత్తాపతప్తులగుచు నిష్క్రమించిరి.

అట్లు శంకరాచార్యులు దల్లిని ముక్తినొందించి పద్మపాదుని రాక నరయుచు గేరళదేశమున గొన్ని దినములు కాలక్షేపము గావించిరి.

## పద్మపాదుని దీర్ఘయాత్ర

పద్మపాదుండును గురుచరణ సరసిజంబుల హృదయంబున ధ్యానించుచు సేతుయాత్రకు బయలువెడలి సముచిత శిష్య సహితుండై చనిచని.

క. శ్రీకాళహస్తిగిరిగి సు
ధాకర శేఖరు భజించి తానంతనతం
డే కామ్రనాథు గామా
క్షీ కాంతుంగాంచి సేవించెదగన్.

మఱియును—

గీ. అని శమీకుండు తాండవమాడుచుండ
నద్రికన్యకవీక్షించు సమయమంద
హాసశోభితవదనాబ్జ యగుచు నెచట
గదలెడానట్టి పుండరీకమునకతండు.

అందు శివుండు తాండవమాడునప్పుడు తచ్ఛ్రమాపనయనార్థమై దివ్యగంగం బార్థించిన తీర్థంబు సన్నిహితంబైనది. దానఁజేసి యత్తీర్థంబు శివగంగయని ప్రఖ్యాతి వడసినది. మరియుం బార్వతీవల్లభుని నాట్యశ్రమ మపనయింప గంగారూపంబున సన్నిహితయగుటం జేసి యది శివగంగయని పిలువంబడుచున్నదని కొందరు చెప్పుదురు. మరికొందరు నాట్యమాడునప్పుడు శివుని జటాజూటమునందలి జాహ్నవీబిందునందు జారిపడినకతంబున బుణ్యతీర్థంబై శివగంగయని వాడుక వడసినదని వక్కాణింతురు. ఆ శివగంగయందు మునింగి శివుని తాండవమీక్షించిన మానవులు విధూతపాపులై ముక్తి కరుగుదురు.

పద్మపాదుం డట్టి శివగంగ మునింగి గౌరీనాథు నారాధించి తాండవము జూచి పరమానందము నొందెను. పదంపడి శ్రీరంగమున కరిగెను.

క. శ్రీరంగపతింగావే
రీరంగద్భృంగపవన తృప్తమతిమసం
బారంగఁ గొలిచె సుకృతము
మీరంగొన్నాళ్ళు యతి సమీహితభక్తిన్.

అట్లు దక్షిణ యాత్రలన్నియు గ్రమంబున సేవింపుచు బద్మపాదుం డొక నాఁడు దారి దారసిల్లిన మేనమామ యింటికిం జనుటయు నతండు పరమానందము జెందుచు భాగినేయుని శిష్యయుక్తముగా నర్చించి నానా భోపచారములచే నతనికి సంతోషము గలుగఁజేసెను.

అప్పు డవ్వార్త నాలించి యందుగల బంధువులందరు సందోహముగా జనుదెంచి ప్రేమానుబంధపూర్వకముగా నాలింగనాది కృత్యంబు లొసరించి,

శా. అన్నా ! నీ విటకుంజిరాగతుఁడవైతంచుం బ్రమోదంబుతో
నిన్నుం జూడఁగ వచ్చినారముగదా నీ వెన్న సంసార దు
స్స్వప్నాహంబుల నెల్లఁ బ్రదెంచి పరమాద్వైతస్థాయివై
చెన్నారన్సుఖియింపుచుంటి పెక మా స్నేహంబు నిన్నంటునే.

గీ. లేదుగద నీకుదారసుతాదిబంధు
గతవిషాదంబు గలుగదు గద స్పృహాల
బాధ తస్కరభీతి యెప్పటికి నహహ
కనఁగ నీ వంటిసౌఖ్య మెక్కడిది మాకు.

చ. అనఘ కుటుంబరక్షణ సమాపనసీమలమై సదా ధనా
ర్జనగతి నొప్పి యించుకయు సౌఖ్యముగానక నిద్రజెంద కి
ల్లను పెనునూతిలోనఁ బడియారటమందెదు మాకు దేవతా
ర్చనయును దీర్థయాత్రలును సజ్జనసేవయుఁ గల్గనేర్చునే.

క. నిను సన్యాసకృతునిఁగా
వినినారము పూర్వమొక్క విప్రునివలనన్
గనుఁగొనఁగోరుదు మిప్పుడు
కనఁబడితివి తీర్థయాత్ర కతమున మాకున్.

గీ. పశులచే బెంపఁబడినట్టి పాదపములు
లావులుగఁ జేసికొను శకుంతములభాతి

యతులు పరకృత మఠదేవతాలయములఁ
దిరుగుచుందురు మమతా విధేయులగుచు.

క. యతి కేమిగావలయు సం
యతమే సౌఖ్యంబు పూజ్యులగు శిష్యజనుల్
సుతలాత్మగలి కళత్రం
బతిశయముగ దనువె గేహమై యొప్పంగన్.

గీ. కామవశునకు దుఃఖంబె కాని సుఖము
లేశమైనను దలపోయలేదు లేదు
పురుషునకు గానను విరక్తిఁ బూనవలయు
దానఁ గలిగెడు సౌఖ్య మెద్దానలేదు.

వ. మహాత్మా ! అధ్యాత్మతత్త్వవేత్తలగు మీ వంటివారు యదృచ్ఛాలాభ సంతుష్టి నొందుచు గుణశీలనామంబుల దెలియనీయక యజ్ఞజడమూకనులభాతి దోచుచు బరోపకారమునకే తీర్థాటనంబు గావింతురు. కాని తీర్థయాత్రవలన నించుకయుఁ బ్రయోజనంబు మీకు లేదు. విశేషించి తీర్థములే మీ పాదరేణువులు సోకి పవిత్రము లగుచుండును. మీరు కొన్ని దినంబు లిందుండుఁడు. భవదీయ దర్శన లాభంబునఁ బాపంబులంబాసి యభీష్ట సుఖంబుఁ నొందఁ గలమని పలికిన విని పద్మపాదుండు వారి కిట్లనియె.—

గీ. ఆకలియు దప్పిగొనుచు మధ్యాహ్నవేళ
నన్న మిడియెడు సుకృతి యెందున్నవాఁ డ
టంచు నతిథులు వెసనే గృహస్థుఁజేరి
తృప్తివడయుదు రతని నుతింపవశమె.

ఉ. స్నానముఁజేసి యగ్నిపరిచర్య నొనర్చుచు వేళలందుఁ గౌ
పీనము దాల్చి వేదము జపించుచు దండము చేతఁబూని వి
ద్యానిధి బ్రహ్మచారి జఠరాగ్ని జ్వలింపఁగ భిక్షఁగోరి యె
వ్వాని గృహంబుజేరుఁ దలపన్మరి యట్టి గృహస్థుఁ డల్పుడే.

శా. వైరాగ్యంబు దృఢంబుఁజేసి పరతత్త్వజ్ఞానసంయుక్తి సం
సారంబున్మదిరోసి క్రమ్మరెడు నా సన్న్యాసియున్నిష్ఠ నోం
కారంబుం జపియించుచు వ్రతతమున్ ఘస్రార్థభాగంబునం
జేరుంగాదె గృహస్థునింటి కుదరార్చిష్మచ్ఛిఖల్వెల్గఁగాన్.

గీ. వసుధ నెవ్వని యన్నంబు వఁసఁ దనువు
బలియఁ దపమాచరించుఁ దాపసజనంబు

శతపోర్ధ ఫలంబన్న దాతఁజేసు
నను చు స్మృతులెన్న వినమె మహాత్ములార

గీ. ఉర్విగృహపతి చలగా నుంటఁగాదె
సాగుచున్నది తాపస జనతపంబు
యతులనియమంబు పింగుల వ్రతములును
కులప్రవాసంబు మహిదైర్ధి కులప్రసేవ.

గీ. కాన గృహపతి యంచఁజికన్న నధికుఁ
డన్న మన్నమటంచు గృహంబుఁజేసు
నతిథిఁ బూజింపరయ్య సత్యముగదాన
గలుగు సుకృతము కోటియాగములరాదు

క. భగవత్ప్రీతిగ నిత్యము
లగుకర్మలఁ జేయుఁడీ ఫలాపేక్ష దృఢం
బుగవిడువుఁ డట్టులైనన్
జగతిని మిముఁబోలె రెట్టి సాధువులైనన్.

అని గృహస్థధర్మంబులం గొనియాడుచు నీతిమార్గం బుపదేశించి బంధుజనంబునెల్ల సాదరంబుగా నసిపెను. పసంపని మేనమామచే సత్ప్రీతుండై యతని గృహంబున భిక్షగావించెను. అద్దినమయంబున మాతులుఁడు శిష్యహస్తమ్మున్నంబైన యొకపుస్తకమును జూచి యదియేమని యడిగిన బద్మపాదుండు అర్యా! యిది శంకరాచార్య కృతంబగు సూత్రభాష్యమునకు టీక నాచే రచింపఁబడినది. వినుమని యంతయుం జదివి వినుపించుటయు నతండతని ప్రబంధనిర్మాణ నైపుణ్యమున కెంతయు వింతపడుచు మతాంతరఖండనల నిమిత్తకముగాఁ జేయఁబడిన తద్రచనకుఁ బ్రభాకరశిష్యుండగుట నీసులనింప స్వమత తిరస్కారంబువలనం గలిగిన మత్సరంబు వెల్లకిగానీక మందహాసముఁ గావించి మిక్కిలి స్తోత్రము గావించెను.

అక్కపటం బెరుంగక పద్మపాదుండు ప్రయాణసమయంబున నాపుస్తకము మాతులహస్తమునసిడి ఆర్యా? నాకు దీనియందు జీవితముకన్న నెక్కుడు ప్రీతిగలిగి యున్నది మార్గమధ్యమందుఁ బత్యాయనమేమైనఁ గలుగునేమో యనివెఱచి ఇది నీకడ నప్పగించుచున్నవాఁడ. నేను సేతుయాత్రఁ జేసికొని సత్వరముగా వచ్చువాఁడ? నంతదనుక భద్రముగా దీని గాపాడవలయు. నీకన్న నాకుఁ బరమాప్తుడు లేఁడుగదాయని పలుమారు చెప్పి చెప్పి యతండు శిష్యులతోఁ గూడ రామేశ్వరమున కఱిగెను.

పిమ్మట మాతులుం డాలోచించి యాహా! యిప్పుడీ పుస్తకము నాచేతం బడినదిగదా. దీని రూపుమాపితినేని గురుమతరక్షకుండ నగుదును. కానిచో నింతలి మతఖండనల కుత్తర మెవ్వఁడు సెప్పఁగలఁడు? విశ్వాసఘాతుక పాతకమువచ్చిన

వచ్చుంగాక. దీని నిర్మూలించుటయే కర్తవ్యము. గృహముతోఁగూడ దీని దగ్ధము గావించెను. స్వపక్ష నాశనముకన్న గృహనాశనమే శ్రేయము. అట్లైనఁ పద్మపాదునకు నిందించుట కవకాశము గలుగదని దలంచి యొక రేయిఁ దనయింటికి నిప్పంటించుకొని నాయిల్లు దగ్ధమగుచున్నదో యని పెద్ద యెలుంగున నరచెను.

అప్పుడు గొప్పచప్పుడు లుప్పతిల్లగుప్పునఁ బొగ గ్రమ్మియమ్మంటలము దగ్ధమగుచుండ గ్రామస్థులెల్ల సత్వరముగా నరుదెంచి తగు ప్రయత్నముఁ జేసిరికాని యించుకయుం బ్రయోజనము లేకపోయినది. భస్మావశేషమైన తనయింటింజూచి యా బ్రాహ్మణుండు గుండెలు బాదుకొనుచు, అయ్యో నాకీగృహము నాశనమైనదని యించుకయు విచారములేదు పద్మపాదుండు నాకొసఁగు పుస్తక మిచ్చిపోయెను. అది యందు దగ్ధమైనది. దానిగురించి చింతించుచున్నవాఁడని పదుగురు విన శోకించుచు బంధు జనప్రబోధితుండై యెట్టకేని యాదుఃఖము వాసికొనినట్లభినయించెను. పద్మపాదుండును సేతుయాత్రఁజేసికొని వెండియుం గొన్నిదినంబులకు మాతులగృహంబున కరుదెంచెను. అతండతనిఁ గౌగిలించుకొని యాహా! దైవమెట్లుగావించెనో చూచితివా? నాకు నీ మొగముచూచుట సిగ్గగుచున్నది. నీవు ప్రాణపదముగా నాకప్పగించిన పుస్తకము దిరుగ నీచేతఁబెట్టుభాగ్యము నాకుఁబట్టినదికాదుగదా. గృహముపోయిన విచారముకన్న నీవిచారమే నన్నెక్కుడుగా బాధింపుచున్నది. ఏమిచేయుదును. సంతతము నిన్నే తలంచుకొనుచుఁ గృశింపుచుంటినని బుడిబుడిదుఃఖంబభినయించిన వారించుచు పద్మపాదుం డిట్లనియె.

మామా గతమునకు వగచుట సాధుధర్మముగాదు. పోనిమ్ము దైవికమునకు నీవేమిచేయుదువు పుస్తకముపోయినం బోవుఁగాక నా బుద్ధియెక్కడికిఁ బోయినది. కొన్నిదినములిండఁ యింకి వెండియు నాగ్రంథము రచించెదఁ జూడుమని పలికి యప్పుడే గంటము చేతంబూని గ్రంథరచనఁ బ్రారంభించెను.

అప్పుడు మాతులుఁడు అయ్యో! నాచేసిన ప్రయత్నమంతయు వ్యర్థమై పోయినది మరల నితండా గ్రంథమును జేయుచున్నవాఁడు. దీనికంతరాయమెట్లుగలుగునని యాలోచించి యాలోచించి యతండు భుజించునప్పు డిన్నములో బుద్ధిమాంద్యము గలుగఁజేయు నౌషధీ విశేషము గలిపెను. దానిచేదిని యతండు మందబుద్ధియై మును పోలె గ్రంథరచనా పాటవంబులేక విచారింపుచుండె.

అట్టిసమయంబున శ్రీశంకరశిష్యులుకొందఱాకస్మికముగా నచ్చటికివచ్చుటయు వారింగాంచి పద్మపాదుండు ప్రహర్షసాగరంబున మునుంగుచు నాలింగనముఁ జేసికొని మిత్రులారా! మీరెందుండి వచ్చుచుంటిరి మనగురుండెందున్నవాఁడు. విశేషములేమనియడిగిన వారిట్లనిరి.

ఆహా! నీవరిగిన కొన్నిదినంబులకు మన గురుండు తల్లికిఁ బ్రాణోత్క్రమణసమయ మగుచున్నదని యెఱింగి మమ్మువిడిచి శృంగగిరినుండి యోగశక్తి

నింటికిం జనియెను. నాటంగోలె నమ్మహాత్ముని పాదసేవ మాకులేదు. మేమును నీవలెనే తీర్థాటనము సేయుచున్నవారము. అమ్మహాత్ముండిప్పుడు కేరళ దేశమందు మహా సురేశ్వరుని యాలయంబునకున్నాడని యొక బ్రాహ్మణుఁడుచెప్పెను. అచ్చటికిఁబోవు చున్నారము. దైవికమున నీవిందుఁ గనంబడితివి. పోదము రమ్మనుటయుఁ బద్మచర ణుండు సంతసించుచు వారితో బయలుదేరెను.

వారందరుంగలసి కతిపయప్రయాణంబుల మహాసురేశ్వరుని యాలయంబు నకుంజనియందు దేవస్తుతిగావించు గురువరునింగాంచి ప్రహర్షపులకితశరీరులై సాష్టాంగ నమస్కారములు గావించిరి. శిష్యుల నందఱ గ్రుచ్చియెత్తి కరుణాకటాక్షవీక్షణంబుల విలోకింపుచు వేరు వేర కుశలమడిగి సాదరంబుగ గారవించుటయు నప్పుడుపద్మపాదుం డతి దీనమనస్కుండగుచుఁ గంఠంబున గద్గదికటోప మెల్లననిట్లనియె. మహాత్మా నేను దేవరయానతివడి రామేశ్వరమునకరుగుచుఁ బూర్వాశ్రమబంధుండగు మేనమామ యింటికింబోయి యతనికే నర్పితుండనై యతనియొద్ద నారచియించిన టీకంజదివితిని. అతండందుఁ గొన్ని శంకలం గావించెను. అప్పుడు ఓద్వస్తతర్కగురుకాపిలతంత్రము లగు భవదీయ సూత్రజాలనులచే నతనిఁ గ్రుదటిలో నిరుత్తరుం జేసితిని.

ఆ మత్సరంబుమనంబున నడంచుకొని యతండు యదాపూర్వముగా నన్నభి నందించిన సంతసించుచు నేనా టీకగుతనియొద్ద దాచి సేతుయాత్రకరిగి వచ్చితిని. ఆ లోపలనావంచకుండిటింతోఁ గూడ నా గ్రంథమును దగ్ధముగావించెను. అంతటితో విడువక నాకు గ్రంథరచనా పాటవము లేకుండ నన్నముఁలోమ దిడి నాడెందమునకు మందత గలుగజేసెను. ప్రభాకర శిష్యుండగు నతనియూహ తెలిసికొనలేక మోస పోయితిని. స్వామీ యేమిసేయుదును. నా సుపటి యూహలేమియు స్ఫురించవు. కరుణాసముద్రుండవగు నీదాసునకిట్టి యవమానమేమిటికి రావలయు. భవదీయ పాద పద్మదర్శనమైనది నాచింతనాయఁగలదని పలికినవిని శంకరాచార్యులు కృపారసపూరి తాంతరంగులై యమృత సమంబులగు పలుకుల నూరడింపుచు నిట్లనిరి.

వత్సా! పద్మపాద! దైవమునుమీరిన వాఁడెవ్వఁడును లేఁడు. కర్మపరి పాకము కడువిషమమైనది. విసుమీతెరంగు మునుపే నే నెరుంగుదును. సురేశ్వరునితోఁ గూడఁ జెప్పియుంటిని కానిమ్ము. పూర్వము శృంగగిరియందు నీవు నా చెంతఁ జదివిన పంచపాది నాకు జ్ఞాపకమున్నది. అదియంతయుం జదివెద వ్రాసుకొనుమని పలికిన విని యతండు మితిలేని సంతుకమ్మతో నదియంతయు వ్రాసికొనియెను.

ఆ కృతి యాకృతిసంతయు యధాపూర్వకముగా వక్కాణించెను. సర్వ విద్యాప్రవృత్తిగలిగి త్రిభువనగురుండగు పరమపురుషుని కొక్కసారి వినిన గ్రంథము మరలఁ జదువుట యొకయబ్బురమా? అట్లు పద్మపాదుండు పంచపాదిని వ్రాసికొని యన్ని యానందంబు పట్టఁజాలక గంతులువైచుచు నానందాశ్రులుగార నసంగుం బాడుచుం బలు తెరంగుల సంతోషము నభినటించుకొనియెను.

అప్పుడావార్త యాదేశమంతయు వ్యాపించినది. కేరళదేశాధీశ్వరుండైన రాజశేఖరుండను నృపాలుండు సత్వరముగా నరుదెంచి నిజకిరీట కోటిఘటితమణిగణ కిరణనిచయములచే శంకరగురుని చరణ సరసిజములకు నీరాజన మిచ్చుటయు నమ్మహానుభావుండు గురుతుపట్టి రాజా! నీకుభద్రమా! నీరచించిన నాటకములు వ్యాపకముగా నున్నవియా? యిట కేమిటికి వచ్చితివని యడిగిన నయ్యుదయుండు ఫాలంబునఁ గేలుఁగీలించి యల్లన నిట్లనియె.

మహాత్మా! భవదీయకరుణావిశేషంబున నేకొరంతయులేదుగాని నాచే రచింపఁబడిన నాటకములుమూడును ప్రమాదవశంబునంజేసి దగ్ధములైనవి. మరల వానిరచించుట కట్టి బుద్ధిపాటవములేదు. తన్నాశనదుఃఖంబు నన్నూరక బాధింపుచున్నది. మీరల్లనాఁడు వాని వింటిరిగద. ప్రథమశిష్యునకుఁ బంచపాది నన్నుగ్రహించితిరని లోకమంతయుఁ జెప్పుకొనుచున్నది. కరుణాళుండవై నన్నుఁగృతిచేఁ గృతకృత్యునిఁగాఁ జేయవేఁడుచున్నానని ప్రార్థించిన విని యయ్యతిచంద్రుఁడు మందహాసచంద్రికలు గండఫలకల వ్యాపింపఁజేయుచు నామూఁడు నాటకములు నామూలచూడముగా నేకరువు పెట్టెను.

నిస్సంశయసంతోషంబుల మనంబున నెనంగొన వానిని వ్రాసికొని యారాజు మహాత్మా! నీవవతారశరీరుఁడవు. నీప్రభావంబెన్న మావంటివారలకు శక్యముకాదు. నీకు నేను కింకరుండఁ బనులకు నియోగింపుమని ప్రార్థించిన నాగురుండు రాజా! నీవు నాకుఁ గావింపవలసిన దేమియును లేదు కాలట్యగ్రహారవాసులగు బ్రాహ్మణులు ద్విజకర్మలకుఁ దగరని శపించితిని. మచ్ఛాపంబు మన్నించి నీవును వారికట్లు విధింపుము. పాపమతులఁ గనికరింపరాదుగా యని యాజ్ఞాపించిన వల్లెయని యానృపతల్లజుండతని పాదపల్లవములకు నమస్కరింపుచుఁ దడనుజ్ఞవడసి నిజపురంబున కరిగె.

—:●:—

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

## 52 వ మజిలీ

## పంచమోల్లాసము

శ్రీశంకరయతి సార్వభౌముండు, పద్మపాద, హస్తామలక, సమిత్పాణి, చిద్విలాస, జ్ఞానకంద, విష్ణుగుప్త, శుద్ధకీర్తి, భానుమరీచి, కృష్ణదర్శన, బుద్ధివృద్ధి, విరించిపాద, శుద్ధాంతానందగిరి ప్రముఖులు శిష్యులు వెనువెంట భజియింప, సుధన్వుం డనురాజు చతురంగబలపరివృతుండై తోడరా దిగ్విజయము సేయ శుభముహూర్తంబున బయలు వెడలి ప్రమథసహితుండగు భర్గుండువోలె నొప్పుచు నొకనాఁడు మధ్యార్జునం బను శివక్షేత్రంబున కరిగి యందుఁగల ద్వైతమతస్థుల నెల్ల కర్కశతర్కయుక్తి ప్రహరణములచేఁ బరాజితులం గావించుటయు వారిలో నొకవృద్ధుఁడు లేచి స్వామీ! నీవు సకలశాస్త్ర పారంగతుండవు నీతో మేము సమముగా వాదింపఁజాలము. కాని యపండితుండైనను నీ మతప్రాబల్యము దగ్గునా? భేదము ప్రత్యక్షముగాఁ గనంబడు చుండ నభేదవాదము నెట్లంగీకరింతుము. ఇందుల కెద్దియేని దైవదర్శనముఁ జూపెదవేని నీ మాటల విశ్వసింతుమని పలికెను.

ఆ మాటలఁ బాటించి శంకరయతిశేఖరుండు వారినెల్ల మధ్యార్జునస్వామి యాలయంబునకుం దీసికొనిపోయి స్వామియెదుర నిలువంబడి చేతులు మొగిడ్చి జగదీశ్వరా! ద్వైతాద్వైతమతతారతమ్యంబు వివరింప నీవె సమర్థుండవు అందలి నిక్కం బెఱింగించి మా సందియము వోఁగొట్టుమని ప్రార్థించుటయు నమ్మహాలింగాగ్రంబున నొక్క దివ్య పురుషుండావిర్భవించి "సత్యమద్వైతం సత్యమద్వైతం సత్యమద్వైతం" అని ముమ్మాఱు పలికి యంతర్ధానము నొందెను. అద్దివ్యవచనంబుల నాలించి ద్వైతు లందఱు విస్మయమునొందుచు నద్వైతము సర్వోత్కృష్టమని యొప్పుకొని యమ్మహాత్ముని శిష్యులై వెనువెంట దిరుగఁజొచ్చిరి.

అందుండి యయ్యతిచంద్రుండు శిష్యసహితముగాఁ గతిపయ ప్రయాణంబుల రామేశ్వరమున కరిగి యందుఁ గలుషనిచయధూమకేతువగు సేతువున గ్రుంకి రామనాథు నర్చించి తక్కుంగల తీర్థంబుల నెల్ల సేవించి యందుఁగల యద్వైతమత విరోధుల నిరోధింప రెండు మాసములు నివసించెను.

## శాక్తమతఖండన

ఒకనాఁడు తులాభవానీమందిర నివాసులగు శాక్తమతస్థులెల్ల గుమిఁగూడి యిట్లు తమలో సంభాషించికొనిరి.

భవానీసేవకులు—లక్ష్మీభక్తులారా! మనయూరు శంకరుండను సన్యాసి మిగుల జంరుటముతో నరుదెంచుట మనమతముల నిర్మూలించుటకఁట వింటిరా?

లక్ష్మీసేవకులు—వింటిమి. వింటిమి. ప్రొద్దుట నతని శిష్యుండొకండువచ్చి బీరములు పలికిపోయెను. అద్వైతమతమొక్కటే ముక్తికిహేతువట. తక్కిన మతము లన్నియు దబ్బరలఁట. ఆహా! యెంత విచిత్రముగా నున్నది.

భవానీ—ఇప్పుడు మనమంపరము గలసి యేకముఖముగా నతనితో వాదింపమేని శాక్తేయమత మథోగతిపాలై పోఁగలదు సుఁడీ?

లక్ష్మీ—అవును. అతఁడు సామాన్యుఁడుకాడు. మనలో మనకు భేదము లుండుఁగాక. కలసి శత్రువును పరిభవించుటయే లెస్స.

భవానీ—వామాచారులు మాలోనిబారఁగుట వారి నడుగ నవసరములేదు గాని సారస్వతుల కెరింగింపవలయు.

లక్ష్మీ—అదిగో వారును మాటలోనే వచ్చుచున్నారు.

సారస్వతులు—(ప్రవేశించి) రామనాథుని యాలయమునందుండి బాలయతి యెవ్వడో మనలనందఱ రమ్మని వార్తలంపెనఁట యేమిటికి?

భవానీ—ఏమిదికా! మనమతము ఖండించుటకఁట.

సార—(నవ్వుచు) బాగు బాగు. చిరకాలమునుండి ప్రబలియున్న మన మతమును ఇతఁడా ఖండించువాఁడు!

భవానీ—అట్లనరాదు. అతండు లోకసామాన్యుండుగాఁడు. సకలవిద్యాపారంగతుండని యెల్లరు చెప్పుకొనుచున్నారు. కావున మనమందఱమును గలసి వానితో వాదింపవలయునని యూహింపుచున్నాము.

సార—అది యుక్తమే.

భవానీ—సరే! మనమేదేవతను ప్రధానముగాఁ జేసికొని వాదించవలయునో ముందుగ నిపు డూహించవలయును.

లక్ష్మీ—మనము లక్ష్మిని ప్రధానదేవతగా నెంచి వాదించితిమేని తప్పక గెలువఁగలము.

భవానీ—ఆదిశక్తి పార్వతిగాని లక్ష్మిగాదు. కావునఁ బార్వతికే జగత్కారణత్వముఁ జెప్పి వాదింపవలయును.

సార—ఓహో! మీరిరువురును ప్రమాదము నొందుచున్నారు. మీకు వాదమున గెలుపుగోను తలంపుగలిగియున్న సరస్వతిని ముఖ్య దేవతగాఁ జెప్పి వాదింపుఁడు. అతండు శారదారాధకుండగుట నామతము నిరాకరింపఁజాలఁడు.

లక్ష్మి—సరస్వతి నెన్నఁడును జెప్పఁదగదు. జగత్కారణత్వ మామెకు లేదు.

సార—లక్ష్మికి మాత్ర మున్నదియా?

భవా—లక్ష్మీసరస్వతులు కిరువురకును ప్రధానత్వము లేదు.

లక్ష్మి—భవానికి మును పేలేదు.

భవా—పోనిండు. మీ దారిని మీరు పొండు మాకర్మము మాది అని వారు సంభాషించుకొనుచుండ సమయంబున శంకర శిష్యుం డొకండువచ్చి వారి సందఁబంటోట్కొనిపోయి వాదింప శంకరాచార్యు నెదుటంబెట్టెను. అప్పుడు వారికిట్లు సంవాదము జరిగినది.

శంకరయతి—మీరెవ్వరు?

భవానీ—అయ్యా! శాక్తమతస్థులము.

శంక—నాలుగు తెగలుగా నిలువంబడితిరేమి?

భవా—మా మతము నాలుగుభేదములు గలదిగానున్నది. దానంజేసి యిట్లు నిలువంబడితిమి.

శంక—(నవ్వుచు) బేధమా? భేదమా?

భవా—కొందరచే నట్లుపల్కినది. భేదముగాదు. భేదము.

శంక—కానిమ్ము. మీమతప్రవృత్తి యెట్టిదో ముందుగ వక్కాణింపుఁడు.

భవా—చిత్తము.

శ్లో॥ ఆద్యాశక్తి రశేషకార్యజననీ శంభో ర్గుణేభ్యః పరా
యన్మాయావశతో మహత్ప్రముఖరం సర్వం జగజ్జాయతే॥

శ్లో॥ తస్యా వాగాద్యగమ్యత్వా త్సేవాయోగ్యత్వహేతుతః।
తదంశాయా భవాన్యాస్తు పాదసేవాపరా వయం॥

స్వామీ! ఆదిశక్తియే భవాని. సర్వకార్యములకు జనని తన్మాయాప్రభావంబు వలన మహదాదికమైన జగత్తంతయు జనించినది. తత్ప్రభావమువాఙ్మనసగోచరమై యున్నది మేము తత్పాదసేవకులమై ముక్తినొందుచున్నారము. కాంచనవికారములైన తత్పాదచిహ్నము కంఠములయందును భుజములయందును ధరింతుము. ఇదియే మా మతము.

శంక—ఇదియా సరియే. మీ ప్రక్కన వారెవరు?

లక్ష్మి—స్వామీ! మేము లక్ష్మీ సేవకులము.

శంక—మీ మత స్వభావముగూడ వ్రాకువ్వఁడు.

లక్ష్మి—చిత్తము.

శ్లో॥ మహాలక్ష్మిరాద్యా ప్రకృతిరసదిత్యాదినిగమె
స్వదేవేతి శ్రుత్యా పరమపురుషశ్యామలతనో॥

శ్లో॥ లక్ష్మ్యాస్సమారాధనతత్పరాణాం
పద్మాక్షమాలాభిరలంకృతానాం
బాహోశ్చ్రకంజాంకిభూషితానాం
సుకుంకుమేనాంకితమస్తకానాం
హస్తస్థితాముక్తిరతోభవద్భి
రుపాసనీయః సకలేశ్వరేశ్వరీ.

స్వామీ ! మహాలక్ష్మియాది ప్రకృతియని వేదములలో నున్నది గదా ! పద్మాక్షమాలచే నలంకరింపంబడి కుంకుమ మొగమున నలమికొనుచు బాహువుల పద్మాంకములు వెలయునట్టి మహాలక్ష్మిని సేవించిన లక్ష్మిభక్తులకు మోక్షమరచేతిలోనున్నయది. ఇదియే మా మత సిద్ధాంతము.

శంక—[నవ్వుచు] తరువాత వారెవ్వరో చెప్పవలయు.

సార— అయ్యా ? మేము సరస్వతీసేవకులము వినుండు.

శ్లో॥ స్వామిన్వేదస్యనిత్యత్వా చ్ఛారదానిత్యరూపిణీ
కారణం సర్వలోకానాం పరాత్పరతరామతా।
జగత్కర్త్రీతినిత్యావాగితిచ శ్రుతివాక్యతః
సైవాత్మబ్రహ్మవిష్ణ్వాదిశబ్దజాలైరుదాహృతా।
గుణాతీతస్వరూపాచసీ వ్యాసర్వస్సుముక్షుభిః॥

ఆర్యా! వేదము నిత్యమగుట తత్స్వరూపిణియగు శారదయు నిత్యయగుచున్నది. శ్రుతులయందు సరస్వతియే బ్రహ్మవిష్ణ్వాదిశబ్దవాచ్యయని చెప్పఁబడియున్నది. సరస్వతియే పరాత్పరురాలు. వాణియే జగత్కర్త్రి. శారదయే ప్రధానశక్తి. గుణాతీతస్వరూపిణియగు వాగ్దేవి నారాధింపుచు తచ్చిహ్నములందాల్చి మేము ముక్తులమగుచున్నాము.

శంక—ఓహో? మీలో మీకిట్లు పరస్పరభేదములు గలిగియున్నవే ! లోకమంతయు నిట్లేయున్నది. వినుండు తాల్వాదిసంగమున జనించిన వేదమునకు నిత్యత్వమెట్లు సిద్ధించును. వేదముపరమపురుషుని శ్వాసములని చెప్పఁబడియున్నది. ఏది పుట్టునో యదిలయమగునుగదా ఇదియునుంగాని యుగాంతరములయందు వేదము సాంగముగా నశించునని రవిమహర్షులతోఁ జెప్పినట్లు సూర్యసిద్ధాంతములోనున్నది.

నాశనమొందుదానికి నిత్యతకలుగదు. చతుర్ముఖునికే నాశనముగలుగుచుండఁ దన్ము ఖంబునం బొడమిన శారదనిత్యయెట్లగును ? పరమాత్మవ్యతిరిక్తమగు పదార్థమేదియును నిత్యము గాదు. లక్ష్మియు భవానియు సరస్వతియుఁగూడఁ బ్రధానదేవతలుగారు. మోక్షేచ్ఛతో వారి నారాధించిన లాభములేదు ముక్తికి నద్వైతజ్ఞానము కావలయును. ముముక్షువు లాత్మనాత్మచే ధ్యానింపు చుండవలయు. శంఖచక్రాద్యంకధారణము శాస్త్ర దూష్యము. ఫలాపేక్షతో వారి నారాధించిన నారాధింపవచ్చును. జ్ఞానులకు బ్రహ్మతో నైక్యము చెప్పఁబడియున్నది. బ్రహ్మజ్ఞుఁడే బ్రహ్మయగును గావున మీరందరు భేద బుద్ధినివిడిచి యద్వైతమత మవలంబింపుఁడు. ముక్తులయ్యెదరని యద్వైతజ్ఞానఁబంతయు నుపదేశించుటయుఁ దెలిసికొని పరమానంద కందళితహృదయారవిందులై వారెల్ల శిష్యులై తత్పదపల్లవంబుల నాశ్రయించిరి వారిలో వామాచార మతస్థులు సమ్మతింపక యెదుర నిలువంబడి యిట్లు వాదించిరి.

వామ — సన్యాసీ ! నీ ప్రజ్ఞమిగులఁ గొనియాడఁదగి యున్నది గదా ? ఏవియో నాలుగు మాయమంత్రములను జెప్పి వీరినెల్ల శిష్యులఁగా జేసికొంటివి. చాలు చాలు వంధ్యాపుత్త్రసమంబగు నద్వైత జ్ఞానంబున వేషధారివై తిరుగుచు లోకుల మోసముఁ జేయుచున్నావు గదా. సంవిత్స్వరూపమేదియో నీవెఱుంగుదువా? ఏశక్తిలేక పరమేశ్వరుండు తృణమునైనఁ గదల్పఁజాలఁడో యట్టియాదిశక్తియే స్వతంత్రురాలు. సకలవిద్యాస్వరూపిణి, జగత్కారణమైయున్నది. అట్టిశక్తి సేవకులమగు మాకుముక్తి గలుగదని నీవాడితివి. నీ యజ్ఞానమేమని చెప్పఁదగినది.

శ్లో॥ తపస్యాస్వైవానిరతమనసాం నోనిషేధోధికారో
నాస్త్యేవైవంహితకరణే సిద్ధతామాగతానాం
నిస్త్రైగుణ్యేపథివిచరతాం కోవిధిః కోనిషేధో
భృగ్వాదీనామమలమనసాం నః ప్రవృత్తిర్హి మానం.

శక్తిసేవా పరతంత్రులకేదియు నిషేధములేదు. తపస్సిద్ధులగు వారికి విహిత కార్యములనాచరించుపనిలేదు. త్రిగుణాతీతమగు మార్గమందు సంచరించువారికి విధి నిషేధములులేవు. అని చెప్పెడి భృగ్వాది మహర్షులయొక్క ప్రవృత్తియే మాకుఁ బ్రమాణమైయున్నది. మఱియు

శ్లో॥ మత్స్యమాంసంచ మద్యంచముద్రామైథున మేవచ
మకారపంచకం జ్ఞేయం వామాచార విశారదైః.

ఈమకార పంచకము మేము సేవింపవచ్చును. మాకిందేమియు విధినిషేధ ములులేవు. నీవుగూడ మాయాచారమును గైకొని సుఖింపుమని పలికిరి.

శంక — మూఢులారా ! భృగ్వాదిమహర్షులప్రవృత్తియే మాకు ప్రమాణ

మని పలికితిరి. వారికింగల చిత్తశుద్ధి మీకుఁ గలిగియున్నదా? భృగుండు విష్ణునిదన్నె, నగస్త్యుండు సముద్రమునఁ గ్రోలెను.

అట్టిసామర్థ్యము మీకులేకున్నను విధినిషేధములు లేవనిచెప్పెదరా? వినుండు. అనాత్మకెన్నఁడును సత్యత్వములేదు. అనిత్యప్రకృతియొక్క యుపాసన సత్యమగు ముక్తి నెట్లొసంగఁగలదు. ప్రకృతిభిన్నమగు చిదాత్మయే ముముక్షువులచే సేవింపఁదగినది. మద్యమాంసముల శక్తినైవేద్యపు నెపంబున భుజించు మీకు ముక్తి కలుగునా, మీకు బ్రాహ్మణ్యంబులేదు అపాఙ్క్తేయులు. ప్రాయశ్చిత్తముఁజేసిన కాని మీతో సంభాషించదగదు. అని యుక్తిప్రహారణంబులచే వారిం బ్రదుటిలో నిరుత్తరులం గావించి తనశిష్యులఁగాఁ జేసికొనెను.

అట్లు శంకరాచార్యపర్యంత శాక్తమతఖండనంబుగావించి పదంపడి తనయంతేలాసులచేఁ దోడ్కొనిరాబడిన త్రిశూలవ్యాప్తవ్యులగు శైవమతస్థులతో నిట్లు వాదించెను.

## పాషండ మతఖండనము

శంక—శైవులారా! మీమతప్రవృత్తియెట్టిదో వక్కాణింపుఁడు.

శైవు—శ్లో॥ ఈశ్వరంచ్యుతమవ్యక్తం వ్యక్తరూపం జగల్లయే యేర్చయంతినరశ్రేష్ఠాస్తేషాంముక్తిః కరేస్థితా॥ ఇత్యతఃపరమాత్మాసౌ సేవనీయోముముక్షుభిః.

వ్యక్తావ్యక్తస్వరూపుండగు రుద్రునెవరర్చింతురో వారికి మోక్షము కరతలామలకముగా నుండునని మున్ను శివుండు దూర్వాసమునికానతిచ్చెను. మేమట్టిశివుని సేవించుటచే శైవులమని చెప్పఁబడుచుంటిమి. శివసేవాపరాయణులకుఁ గర్మతోఁబని లేదు. శివుండు వినాజడంబగు కర్మశుభాశుభఫలంబుల నీయఁజాలునా? మహేశ్వరుండే మోక్షదాత. తదారాధనము ముక్తికారణము. తచ్చిహ్నధారణంబు సాయుజ్యప్రదంబు. ఇదియే మా మతసిద్ధాంతము.

శం—శివుండు సర్వోత్కృష్టుండను జగత్కారణుండునగుగాత. తత్సేవ వలన ముక్తియుఁగలుగుఁగాత. ముక్తియననేమియో మీకుఁదెలియకున్నది. అది యట్లుండె. మఱియు దేహమంతయు శూలాదిచిహ్నవంలచేఁ గాల్చికొనుచున్నారు. సర్వదేవమయమగు బ్రాహ్మణదేహముఁ దపింపఁజేయుట పాపకారణము.

శ్లో॥ శ్రుతి స్మృతో దేవకిలాహి దేవానసంతి దేహేఖలు
భూసురస్య! తతోస్యతాపేతుకృతేసురాస్తే
పలాయనంయాంతిశరీరతోస్య
వ్యాధింవినాకర్మయోగ్యేవిప్రాంగేచిహ్నమీ
స్యచ। లోకేశ్వరంభానుమిషేతాధవాప్రహ
దమాపిశేత్॥

వేదవేదాంగపారగుఁడగు బ్రాహ్మణుశరీరమున సమస్తదేవతలు వసింతురని శ్రుతులు చెప్పుచున్నవి. అట్టివిప్రశరీరము చిహ్నములచేఁ గాల్పఁబడెనేని యందున్న దేవతలు పారిపోవుచున్నారు. కావున వ్యాధిలేక విప్రశరీరముఁ గాల్పరాదు. కర్మయోగ్యమగు బ్రాహ్మణ శరీరమున వాతలుజూడఁబడెనేనిఁ బ్రాయశ్చిత్తముఁ జేసికొనవలయును. కావున మీమతము శ్రుతిసమ్మతముగాదు.

శైవు—అయ్యా! తమవాక్యంబులు వినుటచే నీశ్వరారాధనము పుణ్యప్రదముగాదని తేలుచున్నది. శివునిఁబూజింపవలయునని చెప్పెడి గ్రంథములన్నియును బూటకములేనా.

శంక—మీకు ధర్మరహస్యములు తెలియవు. భక్తిజ్ఞానవైరాగ్యములు బ్రాహ్మణునికిఁ గలిగియుండవలెను. కేవలము భక్తియొక్కటియే బ్రాహ్మణేతరులఁ దరింపజేయును. అదిశుద్ధకైవల్యమీఁజాలదు. శివవిష్ణ్వాది శబవాచ్యత్వము నిర్గుణునికిఁ గల్పితము. సగుణోపాసనమున నజ్ఞానముబోదు. అజ్ఞానముపోవుటయేముక్తి. వహ్నిలేకపాకము సిద్ధించనట్లు తత్వజ్ఞానంబులేక మోక్షముదొరకదు. బ్రహ్మాది స్వరూపములచే నొక్కడే సృష్టిస్థితివినాశనములం జేయుచున్నాఁడుకాని వానికిన్ని రూపములు లేవు. భేదయుక్తమగు నుపాసన నిద్యమని శ్రుతిచెప్పుచున్నది. లోకమంతయుఁ గర్మబద్ధమైయున్నది. జ్ఞానము సిద్ధించువఱకుఁ గర్మనువిడువరాదు. పురుషుఁడు బ్రహ్మబోధకాలకు బ్రహ్మజ్ఞ నాశ్రయింప వలయును.

గురుకారుణ్యమున సద్వైతబోధగలిగి సుస్థిరంతగు. అద్వైత జ్ఞానంబే పునరావృత్తిరహితమగు ముక్తినిచ్చు నదియే సన్యాసుఁడు చిహ్నధారణమునుమానుఁడు. అని తత్త్వోపదేశమునుజేసి వారినెల్లర స్వమతానుయాయులంజేసికొనెను.

అప్పుడు వారిలో లింగధారు లిద్దరక్షోయిత ముఖ్యులగువారిని సందించుచు శంకరుని కభిముఖముగా నిలువంబడి యిట్లు వాదించిరి.

లింగ—యతీంద్రా! మాయావేషమును గైకొని ప్రామాణిక మతమునుండి మాశైవులనెల్లర భ్రష్టులం జేసితివిగదా?

శ్లో॥ బ్రాహ్మణ్యాదుత్తమం ప్రోక్తంవైష్ణవంమునిసత్తమ
వైష్ణవాదధికం శైవమిత్యాహ ప్రాహనారదం

బ్రాహ్మణ్యముకంటె వైష్ణవమతము వైష్ణవమతముకంటె శైవమతము గొప్పదని నారదునితో బ్రహ్మచెప్పియున్నాఁడు.

శ్లో॥ సర్వాననశిరో గ్రీవస్సర్వభూతగుహాశయః
సర్వవ్యాపీసభగవాన్‌తస్మాత్సర్వగతశ్శివః॥

అని శాస్త్రములు ఘోషింపుచుండు. శివమతము నిరాకరింప నీ తరమా!

శ్లో॥ శివతేజస్సముద్భూతాహరిబ్రహ్మాదికోటయః
క్రియంతేషున రేవైతేతత్రతత్రలయానుగాః
ఇతిసస్మాచ్ఛివస్యైవతత్త్వతిత్వంసునిశ్చితం

శివుండు సర్వాధికుండగు నట్లనేక విదర్శనములున్నవి!

మఱియు—

శ్లో॥ అతప్తాత్మతనుర్నైవతద్ధామైతీతిమానతః
లింగాంకనమవశ్యంవైకి ర్తవ్యంమోక్షకాంక్షిభిః
శ్రుతి॥ "అతప్తతనుర్నతదామో అశ్నుతే"

అను శ్రుతివలన శరీరతాపనంబునఁగాని మోక్షము జెందనేరఁడని స్థిరపడు చున్నది. అందులకే త్రిశూలాది చిహ్నములచే సంకితులగువారికి ముక్తిగలుగునని మా మతసిద్ధాంతము.

శం.—అయ్యో ! మీకు విద్యాగంధమే లేకపోవుటచే జ్ఞానసూక్ష్మము దెలియకున్నది. శివుండు సర్వోత్తముండని యభేదబుద్ధిం జెప్పిన నొప్పుగదా ? శివుం డుత్తముండని చెప్పుచు విష్ణుండతని దాసుండని నిందించుచుందురు. అదియే మూఢత. శివవిష్ణ్వాది శబ్దములు పరమాత్మయొక్క సగుణరూపవాచకములు. ఈ రహస్యం బెఱుంగక శివుండధికుండు విష్ణుఁడు దాసుఁడు బ్రహ్మపరిచారకుండు అని శివాధిక్యము స్థిరపరుచుకొనుచున్నారు. "అతప్తతను" అను శ్రుతికది యర్థముకాదు. కృచ్ఛ్ర చాంద్రాయణాది వ్రతములచే శరీరమును దపింపఁ జేసికొనవలయునని వేదాభిప్రాయము. పశువువలెఁ గాల్చికొనిన మోక్షము సిద్ధించునా ?

శ్లో॥ లింగాంకితతనుదృష్ట్వా శంఖచక్రాంకితంతథా
స్నానమేవతదాకార్య మథవాసూర్యమీక్షయేత్
విత్తితంతపలింగాద్య చక్రాంకితమథాపివా
వాఙ్మాత్రేణాపినార్చేత పాషండాచారతత్పరం
అపిశూద్రేక్షణాద్భుంజే ల్లింగచక్రాంకితంవినా
అపిచేన్నిగమాచార రతోవేదాంగ తత్పరః॥
లింగచక్రాంకమాత్రేణ ససద్యః పతితోభవేత్॥

అను మొదలగు ప్రమాణములచే చిహ్నధారణము నింద్యమని బృహన్నారదీయములోఁ జెప్పఁబడియున్నది. శ్రు॥ "యతోవాచోనివర్తంతే అప్రాప్య మనసాసహ" అను శ్రుతివలన సవాఙ్మానసగోచరుండగు పరమేశ్వరుండొక్కఁడే నిత్యుఁడు. శివ కేశవాది నామములు సగుణోపాసకులగు మూఢులకు నియమింపఁబడినవి. ఈశ్వరా రాధనము వలదని నేను చెప్పుచుండలేదు. నింద్యమునుగాదు. భూతి రుద్రాక్షాదులను ధరింపవలసినదే.

లింగ — స్వామీ! త్రిపురాసుర సంహారకాలంబున రుద్రుండు శంఖచక్రా యుధముల ధరించినట్లు పురాణములలోనున్నది కదా! సేవ్యసేవక సంబంధమున మనము సేవకులము గావునఁ దదాయుధములఁ జిహ్నములుగా ధరింతుము. దీనం దప్పేమి!

శం — తప్పని యెన్నిసారులు చెప్పవలయును. రాజు ఛత్రచామరములఁ దాల్చెనని సేవకుఁడు తచ్చిహ్నంబులఁ దాల్చిన నెట్టుండునో యూహింపుఁడు. దాన నించుకయుఁ బ్రయోజనములేదు. లేదు. పాతిత్యముగూడ రాఁగలదు. ముక్తికి జ్ఞానము కన్న వేరొక సాధనము లేదు. పామరబుద్ధి విడువుఁడు. అద్వైతజ్ఞానమార్గ మవలంబింపుఁడు. అని తత్ప్రకారంబంతయు నుపదేశించి వారినెల్ల శిష్యులం జేసికొనియెను.

శంకరయతి పుండరీకుంటట్లు రామేశ్వరములో రెండుమాసములుండి పాశుపతాద్యద్వైతమత విరోధులనెల్ల వశపరచుకొని యచ్చటనుండి బయలువెడలి సపరివారముగా ననంతశయనమున కరిగెను.

## వైష్ణవమత ఖండనము

అందు ననంతపద్మనాభస్వామి నారాధింపుచు నెలదినములు వసియించెను. మరియు నందుఁగల వైష్ణవమతస్థులెల్ల నొక నాదయ్యతి తల్లజునితో వాదింప నరుదెంచుటయు నిట్లు సంవాదము జరిగినది.

శంక — మీరెవ్వరు మీ మతప్రవృత్తి యెట్టిదో వక్కాణింపుఁడు.

విష్ణుశర్మ — అయ్యా! వినుండు భక్తులు, భాగవతులు, వైష్ణవులు, పాంచరాత్రులు. వైఖానసులు, కర్మహీనులు. అని వైష్ణవు లారువిధంబుల జెప్పఁబడుదురు. అందు మేము భక్తులము, జ్ఞానక్రియా విభేదముల మా యాచారము రెండువిధముల నొప్పుచున్నది. వాసుదేవుం డనేకావతారలెత్తి భక్తజనసులభుండై యున్నవాఁడు తదుపాసనచే మూఢులుసైతము తత్సాయుజ్యము నొందుదురు. అనంత పదకమలధ్యానమే మాకురక్షకము. అది యేమియుఁ జేయక ధ్యానించుటయే జ్ఞానము. తదాజ్ఞలేక తృణమైనఁగదలదు. తదుపాసనమే క్రియ. ఇదియే మా మతము.

శంక — క్రియ యనఁగాఁ దదుపాసనయని చెప్పుట మూర్ఖత.

శ్లో. జన్మనాజాయతేశూద్రః
కర్మణాజాయతేద్విజః
నిత్యంసంధ్యాముపాసీత
ప్రత్యవాయోన్యథాభవేత్॥

బ్రాహ్మణుండు జన్మచే శూద్రుండై కర్మచే ద్విజుండగుచున్నాఁడు. విప్రుండు నిత్యము సంధ్య నుపాసింపఁదగినది. అట్లు చేయనిచో ప్రత్యవాయము

వచ్చెడిని. అను మొదలగు శ్రుతినిబంధనలు కర్మను స్తుతిఁ జేయుచున్నవి. విష్ణు సేవయే బ్రాహ్మణకర్మ యని చెప్పుట యపాండిత్యము. వేదవిహితమైనదే కర్మ. కర్మ విడచిన వాఁడు జీవచ్ఛవము. యతులకుసైతము దేవతార్చనాది మగు కర్మ విధింపఁబడియున్నది మీరు కర్మభ్రష్టులైతిరి గావున ప్రాయశ్చిత్తముఁ జేసికొనినగాని మీతో సంభాషింపరాదు. అని యుక్తియుక్తముగా వారికి బోధించి శ్రుతిలో నియత్త రులంజేసెను.

తరువాత భాగవతులు ముందరికి వచ్చి స్వామీ! మా మతము వినుము.

శ్లో॥ సర్వవేదేషుయత్పుణ్యం సర్వతీర్థేషుయత్ఫలం।
తత్ఫలంపురుషఆప్నోతి స్తుత్వాదేవం జనార్దనం॥

సర్వ వేదముల యందు సర్వ తీర్థముల యందు నే పుణ్యము గలదో విష్ణు స్తుతి వలన నట్టి పుణ్యము రాగలదు. అను వచనము ననుసరించి రాత్రింబవళ్ళు హరికీర్తనం జేయుచు శంఖచక్రాది చిహ్నలం బూని తులసి మాలికల ధరించి యూర్ధ్వపుండ్రములు మెఱయ నసింతుము. ముక్తి మా హస్తమందున్నది. దీనికేమి లోపము లెంచెదవో చెప్పుము.

శంక—చక్రాద్యంకనము శాస్త్రదూష్యమగుట మీ మతము దూషణీయము. మఱియు,

శ్రుతి—"యతోవాచోనివర్తంతే అప్రాప్యమనసాసహ"

మనసుతో గూడ వాక్యములెవ్వని మహిమఁ దెలిసికొనలేక మరలుచున్నవో అను శ్రుతివలన నవాఙ్మానసగోచరుండగు భగవంతుని మీరెట్లు స్తుతియింపఁ గలరు. ఈ జడశంఖాదు వలనఁ గలిగిన చిహ్నములఁ దాల్చుటయంటె లోహచక్రాదుల ధరియించిన విష్ణుండువోలె నొప్పుచుందుమ అంతకన్న మఱియొక విశేషము వినుండు. కరచరణాద్యవయవ విశిష్టులగు విష్ణుశిలామూర్తికే సర్వరూపమంతయు వ్యక్తమగు నట్లు మేనంగాల్పించుకొనుఁడు. మీకుముక్తి నశ్యఫలంబొసంగెడిని మూఢులారా! హిమ్ము విష్ణుభక్తులనుటకంటె పాషండులని చెప్పిన నొప్పిదమగును. ఈశ్వర చెశిపోవ కుడు. ఫలమీశ్వరార్పణము చేయుచు విహితకర్మ నొనరింపుఁడు దానశుద్ధులగుదురు. పిదపనద్వైతవైత్తయగు గురునాశ్రయించుఁడు తదుపదేశలబ్ధంబున నష్టకర్మబంధులై ముక్తులగుదురు. మోక్షమునకంతకంటె వేఱొకదారిలేదు. సగుణోపాసనము స్థిరముక్తి నీయఁజాలదు. అని యద్వైతజ్ఞానబోధఁజేసి వారనెల్ల శిష్యులగాఁ జేసికొనెను.

పిమ్మట భార్గపాణియనువైష్ణవుఁడు లేచి నమస్కరించుచు స్వామీ! మేము నమోనారాయణాయయను మంత్రము నెల్లపుడు జపము సేయుచుందుము. శంఖచక్రాదు

లచేఁజిహ్నితులమై సంసారంబుబాసి వైకుంఠపదంబు నొందుచుందుము. చక్రాంకిత మునకు శాస్త్రదృష్టాంతములు లేవని చెప్పిరి.

శ్లో॥ యేబాహుమూలపరిచిహ్నితశంఖచక్రా
యేకంఠలగ్నతులసీనళినాక్షమాలాః
యేవా లలాటఫలకేలసదూర్ధ్వపుండ్రా
స్తేవైష్ణవాభువనమాశు పవిత్రయంతి॥

ఈ శ్లోకము ప్రమాణముగాదా ? ఇట్టి వైష్ణవులు లోకమును బవిత్రమును జేయుదురని చెప్పఁబడి యుండలేదా ! దీనికేమి చెప్పెదరు.

శంక—[నవ్వుచు] ఓహో ! వైష్ణవోత్తమా ! నీవు చదివిన శ్లోకము శ్రుతి సమ్మతమైనదికాదు. శ్రుతివ్యతిరిక్తమైన దానిని మేము ప్రమాణముగా స్వీకరింపము. అతప్తతనుండుము క్రిఁ జెందఁడను శ్రుతి ననుసరించి యీ శ్లోకము రచింపఁబడెనంటి వినుము. ఆ శ్రుతి కది యర్థముగాదు. తప్తతనుఁడన లోహచక్రాదులచేఁ గాల్చుకొనుట గాదు. కృచ్ఛ్రచాంద్రాయణాది నియమవిశేషములచే శరీరము తపింపఁజేసిన మోక్షము గలుగునని శ్రుతి యభిప్రాయము. అయ్యో ! అట్టి యభిప్రాయమును గ్రహింతక యూరక శరీరమును గాల్చికొనుచున్నారే.

శ్లో॥ బ్రహ్మజ్ఞోయస్సోఽశ్ను తేమోక్షమిత్యా
దేర్వాక్యాన్మోక్షస్య హేతుర్విబోధః
క్షీణేపుణ్యేమర్త్యలోకంవిశంతీ
త్యాదేర్వాక్యాదన్యతస్సంసృతిస్స్యాత్॥

బ్రహ్మజ్ఞుండే మోక్షమును బొందుచున్నాడు. మోక్షమునకు బోధయే కారణము. పుణ్యముక్షీణింపఁగాఁ దిరిగి మర్త్యలోకమును బొందును స్వర్గాదికము ముక్తికాదు. దానివలన సంసారము విడువదు. అని శ్రుతులు ఘోషించుచున్నవి. స్వాభిమానమును విడచి ధర్మసూక్ష్మముల నెక్కుడుగా గ్రహింపుఁడు. ఆత్మ యొక్కటియే నిత్యమైనది. అదియే జగత్కారణము. పరమాత్మకు నామరూపాదులు లేవనుచుండ శంఖచక్రాది ధారణము పూర్వపక్షము గాదా ? రూపములేనివాని ధ్యానించుట కష్టమని మందబుద్ధుల కొఱకు భగవంతునికి నామరూపాలంకారాదులు గల్పింపఁబడినవి. బ్రహ్మాహమస్మియని సర్వదాధ్యానింపుఁడు. భేద బుద్ధివిడువుఁడు జీవుఁడే యీశ్వరుండని తోచును. దాసం జేసి సంసారమునశించును. బ్రాహ్మణునికి శిఖాయజ్ఞోపవీతంబులు దాల్చుట వేదవిహితమై యున్నది. చిహ్నధారణము నిషేధమని బృహన్నారదీయాది మహాగ్రంథముల యందు వ్రాయఁబడియున్నది. తద్ధారణంబున హరిసమానుల మగుదుమనుకొనుట మనో రాజ్యమువంటిదేసుఁడీ. అని యెన్నియో దృష్టాంతరములఁజూపి యాత్మబోధఁజేసి యతని శిష్యునిగా జేసికొనెను.

తరువాత పంచరాత్రాగమ దీక్షితుండగు మాధవుండను వైష్ణవుండు స్వమతస్థులచే శంకరునియెదుటకుఁ ద్రోయఁబడి సభాకంపముచేఁ గాళ్ళుచేతులు వడఁకుచుండఁ జూచినవ్వుచు.

శంక—అట్లువణఁకెదవేల? నీ మత ప్రచార మెట్టిదో నుడువుము భయము లేదు.

మాధ—స. స. సామి! మె. మె. మేము. ప. ప. పాంచ. ర. ర. రాత్రులము.

శంక—నీకు సత్తి యున్నదా యేమి?

ప్రద్యుమ్నాచారి—అయ్యా! ఆయనకు సత్తిలేదు. కొంచెము సభాకంపమున్నది, వాదములోఁ బ్రౌఢుండే!

శంక—వైష్ణవప్రవరా! మనస్సుస్థిరపరచికొని నెమ్మదిగాఁ గూర్చుండి నీ మత ప్రవృత్తిఁదెలియఁజేయుము.

మాధ—చిత్తము. చిత్తము. ఇప్పుడు భయముదీరినది. చెప్పెదవినుఁడు. స్వామీ! భగవత్ప్రతిష్ఠకు మాయాగమమే మూలమైనది. మాయాగమము లేనిచో భగవంతునికిఁ బ్రతిష్ఠయేలేకపోవును. కావున మాయాచారమెల్ల బ్రాహ్మణులు స్వీకరించిన జక్కఁగా నుండును. ఇదియే మా మతము.

శంక—వేదవిరుద్ధముగానిచో మీయాగమము మంచిదే. గాయత్రివలనంగాని బ్రాహ్మణ్యము సిద్ధించదు. ఆగమవ్యతిరిక్తమంత్రంబుల గ్రహించుట బ్రాహ్మణుల కనుచితంబు. గాయత్రీశూన్యులగుట మీరు బ్రాహ్మణులుకారు. బ్రాహ్మణ్యహీనమగు వైష్ణవత్వము పతితముగాఁ జెప్పఁదగినది. పతితుఁడవగు నీతో మాటోఁటులు సంభాషింపరాదు. నీవు జీవన్మృతుండవైతివి.

మాధ—స్వామీ! చిహ్నధారణమువలన వైకుంఠము వచ్చునని మాపాంచరాత్రాగమములో నున్నది. మాయాగమమే మాకుఁ బ్రమాణము.

శంక—ఆగమాదులయందుఁ జెప్పఁబడిన యాచారము వేద విరుద్ధము కానిచోఁ గ్రహింపదగినదే తద్విరోధంబైన మతము గ్రాహ్యముకాదు. పాంచరాత్రాగమము వేదవిరుద్ధమయినది స్వీకరింపఁబడదు. అతీంద్రియార్థముల నెరిఁగింప శ్రుతియే సమర్థమైనది. బ్రాహ్మణ్యసిద్ధి కొరకు వేద విహితాచారములఁ గైకొనుడు. దాసభూతుఁడవయ్యెదవు.

శ్లో॥ సర్వభూతేషు చాత్మానం సర్వభూతానిచాత్మని
సంపశ్యన్ బ్రహ్మపరమం యాతినాన్యేనహేతునా.

సర్వభూతములయందుఁ దన్నును దనయందు సకలభూతముల నెవ్వఁడు చూచునో వాఁడేముక్తుఁడు యథాజాతుఁడా! పాషండ ధర్మముల విడిచి యద్వైతజ్ఞాన

మును సంపాదించుకొనుము. మునులంత వయ్యోదపని యుపదేశించినంత పంథావా చార్యులు సంతోషింపుచు స్వకులగ్రామదేశస్థులతోఁగూడ నమ్మహాత్మునిపెంపొందఁ బడి యుని గ్రహపాత్రుం డయ్యెను.

తరువాత వైఖానసమతాచారుండు వ్యాసదాసుండను వైష్ణవుండు ముందరికి వచ్చి యతీంద్రా! బ్రహ్మదేవుండైనను మా మతము నిరాకరింపలేఁడు. నీవు వేదసమ్మతము వేదసమ్మతమని పలుమారు భాషింపుచున్నావు. మా మతము వేదసమ్మతమని మీకే తెలియఁగలదు వినుము.

శ్రుతి॥ తద్విష్ణోః పరమంపదం అను శ్రుతివలన విష్ణుపదము సర్వోత్కృష్ట మని స్పష్టమగుచున్నది గదా! మరియు ॥ శ్రు॥ నారాయణాద్బ్రహ్మాజాయతే రుద్ర ఏవచ. అనుటవలన నారాయణునివలన బ్రహ్మయు రుద్రుండు జనించినట్లు తేలు చున్నది. ఈ రెండు శ్రుతులని నీ వొప్పుకొనకతీరదు. వీనివలన నతండు బ్రహ్మ రుద్రాదులకన్న నధికుండని తేలుచున్నది మేము తత్సేవకులము మావైఖానసమతము శ్రుతి సమ్మతమని దీనఁ దెల్లమగుచుండలేదా? శంఖచక్రపవిత్రాంగుఁడు నూర్ధ్వ పుండ్రవిరాజమానుండు పూజ్యుఁడని మా మత సిద్ధాంతము అనుటయు.

శంక—వ్యాసదాసా! మీకుఁ బాలకుఁడు విష్ణుఁడుగాని బ్రహ్మగాని యగుం గాక. దానికి వివాదములేదు. నీవు విష్ణుభక్తుండవైతివేని దత్ప్రీతి కొఱకు గర్మలం జేయుము. అంతియకాని తత్స్వమముగాఁ దప్తచక్రాదుల ధరింపవలదు. అది యొక్క టియే వేదవిరుద్ధమైన పని.

వ్యాసదాసు—స్వామీ! దీనికిఁ బ్రమాణము లేకపోలేదు. పూర్వ యుగం బున దత్తాత్రేయమహర్షి పంచముద్రలందాల్చి యున్నట్లు పురాణములలోఁ జెప్పఁబడి యున్నది. ముముక్షువులమగు నేము తన్మార్గమే కైకొంటిమి. చక్రాదిధారణము చేసి కొనక వైష్ణవత్వమునకే హాని రాఁగలదు. చిహ్నధారణ మవశ్యము చేసికొనఁదగినది.

శంక—బాలుబాలు. నీ వివేక మేమనఁదగినది? ముద్రలవలన బ్రయోజనము లేదని బాలురకు సైతము దెలియఁగలదు. తత్త్వదర్శియగు దత్తాత్రేయ మహా యోగికి ముద్రలవలన నేమి ప్రయోజన మున్న. అతండు ముద్రలం దాల్చినట్లే పురాణములోను జూడలేదు. మూర్ఖబుద్ధిని విడిచి సుఖింపుము.

శ్లో. ప్రహ్లాదస్య విభీషణస్య గజరాజస్య ధ్రువస్యానిలే
ద్రౌపద్యా వ్రజవాసినాంచఖలుశఙ్ఖచక్రాంకసంరేకరోత్
తస్మాన్మూఢమతిం విహాయసకలం పాషండచిహ్నం త్యజ
బ్రహ్మస్మీతినిభావనేనసుసుఖం గచ్ఛాశుమోక్షం పరం.

వైధేయా! ప్రహ్లాదనారదాదిభక్తులకు జక్రాంకనము లున్నవని గాంచితివా. వారు చిహ్నితులైనట్లు లేపురాణ మందైన వ్రాయఁబడియున్నదా? మూఢబుద్ధిని

విడిచి పాషండధర్మములను మాని "బ్రహ్మాస్మి" యని ధ్యానించుకొనుము. దాన మోక్షము నొందగలవు అని చెప్పి యతని నద్వైతమతావలంబనునిగాఁ జేసెను.

పదంపడి కర్మహీనమతవాదియగు నామతీర్థుండను వైష్ణవుండెదుర నిలువంబడి, యతిశేఖరా ! నీ చాతుర్యంబు గొనియాడఁదగినదియే ! త్రుటిలో వీరినెల్ల విధేయుల జేసికొంటివి. ఇంటియొద్దఁ బెద్దపెద్ద మాటలంజెప్పి వీరట్లొప్పుకొనుట చిత్రముగా నున్నది. కానిమ్ము మా మతపంతం బదిగాదు. శేషుండైన దీనిం గదలుపఁ జాలడు వినుండు

శ్రుతి॥ సర్వం విష్ణుమయం జగత్॥ అను వాక్యంబు మా గురుండు శిష్యునికి బోధించుచు "స్వామీ ! నా శిష్యుండు నీ పాదారవిందంబుల నమ్మియున్న వాఁడు. ఏ కర్మయు నెఱుంగఁడు. వానికి భవదీయ సాయుజ్య మొసంగుము" అని కోరుచుండును. భగవంతుఁడట్లు ప్రార్థితుఁడై మా మతస్థులనెల్ల ముక్తులం జేయుచుండును. మాకే కర్మయును లేదు. దానం జేసి పునర్జన్మ కలుగదు. కర్మవలనఁగదా జన్మము గలుగుచున్నది. జీవన్ముక్తులమై మేము వర్తింపుచుందుము. ఇదియే మా మత సిద్ధాంతము. సన్యాసివైన నీవు సైతము మా మత మంగీకరింపవలయును.

శంకరు— బాలకా ! నీవు సత్యము పల్కితివి. కర్మభ్రష్టుండవైన నీవు జీవన్ముక్తుండవే సంశయము లేదు. నిత్యసంధ్యవిహీనుండవై పిశాచంబులాగున వర్తించుచున్నాఁడవు. వేదోక్తకర్మంబుం జేయుచు దత్ఫలమీశ్వరార్పణముఁ గావించుట జ్ఞానమార్గము. ఫలముఁగోరి కర్మలం జేయుట కర్మమార్గంబు. ఈ రెండుమార్గముల విడిచియుండు నీవు రాజదండనకుఁ బాత్రుండవైతివి వినుము.

శ్లో॥ నచలతి నిజవర్ణ ధర్మతో య
స్సమమతి రాత్మసుహృద్విపక్షపక్షే
నహరతి న చ హంతి కించిదుచ్చై
స్సితమనసం తమవేహి విష్ణుభక్తం.

నిజవర్ణధర్మముల విడువక శత్రుమిత్రపక్షముల సమముగా జూచుచు దేని ఫలమును గోరక నిర్మలమైన బుద్ధికలవాఁడు వైష్ణవోత్తముఁడని చెప్పఁబడుచున్నాడు. శ్రుతిస్మృతులు భగవంతునియొక్క యాజ్ఞలు. అట్టి యాజ్ఞల ద్రోహముఁజేసినవాఁడు నా భక్తుండైనను నరకమును బొందునని విష్ణుండే చెప్పియున్నవాఁడు. కావున వేదోక్త కర్మ విడువఁగూడదు. బ్రాహ్మణులకు నగ్నియే దేవుఁడు. బ్రహ్మచర్యాదులకు సైత మగ్నిసేవ విధియై యున్నయది. అట్టి కర్మను మీరు విడిచిరి కావున మీరు పతితులైతి రని పలికిన విని నామతీర్థుండు రక్షింపుమని నయ్యతిపాదంబులంబడి వేఁడికొనెను. అట్లు వైష్ణవులనెల్ల శిష్యులంజేసికొని శ్రీ శంకరాచార్యు లచటనుండి బయలువెడలి కతిపయ ప్రయాణంబుల సుబ్రహ్మణ్యంబను పేరుగల కుమారస్థానమును గరిగిరి.

అట్లు సుబ్రహ్మణ్యక్షేత్రంబున కరిగి యందుఁ గుమారధార యను నదిం గ్రుంకువెట్టి శేషస్వరూపుండగు షణ్ముఖు నారాధింపుచు శ్రీ శంకరాచార్యు లైదు దినము లట వసియించిరి.

ఒకనాఁడమ్మహాత్ముండు దండకమండలు మండితుండై కాషాయాంబరముతో భూతిభూషితసర్వాంగుండై రెండవ మేరుకోదుడు నింభాతివిరాజిల్లుచు సుబ్రహ్మణ్యస్వామి యాలయంబున గూర్చుండియున్న సమయంబున నాప్రాంతదేశముల నుండి కొందరు బ్రాహ్మణులరుదెంచి తత్తేజంబునకు వెరగుపడుచు నెదుర నిలువంబడి నమస్కరింపుచు నిట్లనిరి.

స్వామీ ! మీరు సర్వమతంబులను ఖండింపుచు నద్వైతమత మొక్కటియే శ్రేష్ఠమని చెప్పుచున్నారఁట. మీతో వాదించి మా మత ప్రాబల్యము నిలుపుటకై యరుదెంచితిమి. మేము చతుర్ముఖమతస్థులము. మను ప్రభృతులచే గదితమగుకర్మను జేయుచుందుము. సంతతము చతుర్ముఖునర్చింపుచుందుము.

శ్రుతి॥ హిరణ్యగర్భస్సమవర్తతాగ్రే భూతస్యజాతః పతిరేకఆసీత్।
సదాధారపృథివీంద్యాము తేమాంకస్మైదేవాయహవిషావిధేమ.

అని శ్రుతిచే బ్రహ్మయే నికర్తయనియుఁ బాలకుండనియు హంతయనియు సర్వాధికుఁడనియు నానంద స్వరూపుండనియుఁ దెల్లమగుచున్నది గదా ? ఆబ్రహ్మ లోకముల సృజించి యందాత్మస్వరూపంబునఁ బ్రవేశించి [తదైక్షత] అను శ్రుతులచే గొనియాడఁబడుచు శివవిష్ణువుల భుజములుగాఁ జేసికొని ప్రకాశింపుచుండును. మే మమ్మహాత్ముని భక్తులము. జ్ఞాననిష్ఠులము. కృతార్థులమై ముక్తినొందుచుందుము. ముక్తికిట్టిమతము ఘంటాపథమైయొప్పుచుండ నద్వైతమతంబుతో నేమి ప్రయోజన మున్నదని పలికిన నవ్వుచు శంకరాచార్యుం డిట్లనియె.

బ్రాహ్మణులారా! బ్రహ్మాదిభూతము లెవ్వానివలన జనించుచుండునో యప్పరమాత్మయొక్కఁడే నిత్యుఁడు. అతనిం దెలిసికొనవలయు. సందుల కద్వైత బోధయే హేతువు. గావున వేదాంతవాక్యములు సదా వినుచుండవలయును. చతుర్ముఖ చిహ్నధారణము నింద్యము దానముక్తి లభింపదని యుక్తియుక్తముగాఁ జెప్పి వారి నొప్పించి శిష్యులగాఁ జేసికొనియెను.

పదంపడి వహ్నిమతస్థులు కొందఱరుదెంచి, స్వామీ! మేము వహ్ని సేవకులము. అగ్నిర్దేవోద్విజాతీనాం అను శ్రుతివలన బ్రాహ్మణులకగ్నియే దేవుఁడు మరియు శ్రు॥ అగ్నిరగ్రే ప్రథమో దేవతానాం అను ప్రమాణమువలన దేవతలకు సైతమగ్నియే ముఖ్యుఁడని స్పష్టమగుచున్నది అదియునుంగాక శ్రుతి॥ ఉద్దీప్యస్వజాతవేదోపఘ్నంనిర్ఋతింమమ॥ అను శ్రుతిచే ద్విజులెల్ల నగ్నినారాధింపవలయునను విధి విధింపఁబడుచున్నది స్ఫులింగాత్మకాని శకల ధారణమునఁ బవిత్రులగుచుందురు,

అగ్నియేసర్వోత్తముఁడు. తదారాధనము బ్రాహ్మణులకు ముక్తిప్రదము. దీనినెట్లు పూర్వపక్షముచేయుదురని పలికిన నాచార్యుం డిట్లనియె.

అగ్నిదేవతలకు సమానుఁడనియుఁ జెప్పఁబడియున్నది. అదియునుంగాక అగ్నిపరిచారకుండై దేవతలకు హవిర్భాగములఁ దీసికొనిపోయి యిచ్చుచుండును. మఱియు వహ్ని కర్మదేవత. అగ్నికారణ వాక్యంబులన్నియు భూతాగ్నిపరముగా నిరూపింపఁబడినవి. మీరు వహ్న్యధీనముగా గర్మలసేయుచుండుఁడు. శ్రద్ధమాత్ర మద్వైతజ్ఞానమందుంచవలయును. దానంగాని మోక్షములేదు. అని తత్ప్రవృత్తి యంతయు బోధించి శిష్యులఁగాఁ జేసికొనియె.

తరువాత రక్తచందనపుష్పాదులందాల్చి సూర్యోపాసకులు శంకరాచార్యు నెదుటకువచ్చి నమస్కరింపుచు యతీంద్రా ! మేము సౌరమతస్థులము. మామతప్రవృత్తి నాకర్ణింపుము. సూర్యుండు త్రిమూర్తిస్వరూపుండని వేదముఁజెప్పఁబడియున్నది. సృష్టిస్థితిలయముల కమ్మహాత్ముండేకారణుండు. అతండే ప్రత్యక్షదైవము. 'ఘృణి స్సూర్య ఆదిత్యః' అనుమంత్రము సంతతయు జపించుచుందుము. మామత మారు విధములుగా నొప్పుచున్నది. కొందఱు బ్రహ్మస్వరూపుండగు దనుయభాస్కరు నారాధింతురు. కొందఱు శివస్వరూపుండగు నాకాశమధ్యస్థభాస్కరుని సేవింతురు. మఱి కొందఱు విష్ణుస్వరూపుండగు నస్తమయభాస్కరుం గొల్చుచుందురు. కొందఱు కాలత్రయమందును త్రిమూర్త్యాత్మకమగు రవిబింబమును సేవించుచుందురు కొందఱు మండలేక్షణ వ్రతధారులై కాంచనశ్మశ్రుకేశాదియుక్తుండగు తన్మండల మధ్యస్థితు జూచుచు భవింపుదురు. వారు రవిబింబమును జూచి కాని భుజింపరు. కొందఱు తప్త లోహంబున లలాట భుజవక్షస్థలంబున మండలచిహ్నంబుల వెలయించుకొని యుపాసింతురు. షడ్విధసౌర మతస్థులును మూలమంత్రమునే జపించుచుందురు.

మఱియు దన్మండలమధ్యవర్తియగు పురుషుండు పరమాత్మయని యనేక శ్రుతులు ఘోషింపుచున్నవి. పురుషసూక్తంబున భానుఁడే ప్రధానుఁడని నిరూపింపఁ బడియున్నది. గీతలలోఁగూడ అదిత్యానామహం విష్ణుర్జ్యోతిషాం రవిరంశుమాన్॥ అని శ్రీకృష్ణభగవానుఁ డానతిచ్చియున్నాఁడు. బ్రహ్మాదిదేవతలు సూర్యునివలనం గలుగుచున్నారు. కావున ముముక్షువులు సూర్యునారాధించిన ముక్తినొందెదరిదియే మామతమని యెఱింగించిన శంకరాచార్యులు మందహాసముగావింపుచు నిట్లనిరి.

ఓ భాస్కరభక్తులారా! మీరు నుడివిన ప్రమాణములే మీమతమును బూర్వపక్షమును సేయుచున్నవి వినుండు. చంద్రమామనసోజాతః చక్షోస్సూర్యోఅజాయత అని పురుషసూక్తములో నున్నది. సూర్యుడు పరమపురుషుని చక్షుస్సులవలన జనించెనుగదా యేదిపుట్టుచున్నదో యది తప్పక లయమగునని తర్కశాస్త్రసిద్ధాంతము. అట్లనిత్యవస్తువులకు బ్రహ్మత్వ మెట్లు చెప్పెదరు? శ్రుతులు సూర్యునిపర బ్రహ్మను స్తుతియింపుచున్నవి. అదియునుగాక శ్రు॥ భీషాస్మాద్వాతః పవతె భీషోదేతిసూర్యః

భీషాస్మాదగ్నిశ్చేంద్రశ్చ॥ పరమాత్మకు జడిసి వాయువు వీచుచున్నది సూర్యుఁడు ప్రతిదినముదయింపుచున్నాఁడు అగ్ని యింద్రుఁడు లోనగు వారాజ్ఞావర్తులగుచున్నారని శ్రుతులు చెప్పుచుండగా సూర్యుఁడు పరమాత్మ యెట్లగును. మరియును,

శ్రు॥ నయత్రతసూర్యోభాతినచంద్రతారకం
నేమావిద్యుతో భాంతికుతోయ మగ్నిః
తమేవభాంతమను భాతిసర్వం
యస్యభాసాసర్వమిదం విభాతి.

ఏ పరమేశుని కాంతి పరిపూర్ణమై వెలుగుచుండ సర్వము ప్రకాశింపుచుండునో యట్టిపరమాత్మననుసరించి యంతయుం బ్రకాశింపుచుండును. అతని ప్రకాశములేనిదే సూర్యుఁడును జంద్రుఁడును దారలు మెఱపులు నగ్నియుఁ గూడఁ బ్రకాశింపవు. అని శ్రుతులు వక్కాణింపుచుండ సూర్యుఁడే పరమాత్ముఁడని చెప్పుటకన్న యవివేకమున్నదియా? జ్యోతిశ్శాస్త్రంబున సూర్యునినిర్మాత జెప్పఁబడియున్నది. ఇట్టి రవికి జగత్కారణత్వముఁ జెప్పెడి మీవిద్యామహిమ గొనియాడఁదగినదే మూఢబుద్ధిని విడిచి దాసనుక్తులయ్యెదరని యుపదేశించి వారినెల్ల శిష్యులుగా జేసికొనియెను.

జగద్గురుండట్లు చతుర్ముఖ వహ్నిసౌరమతస్థుఁ ద్రిసహస్రసంఖ్యాకుల నద్వైత మతావలంబకులం గావించి వారిలోఁ గొందరు శంఖములు పూరింపుచుఁ గొందరు ఘంటానాదంబులం గావింపుచుఁ గొందరు దాళంబులు వాయింపుచుఁ గొందరు వింజామరలు వీచుచుఁ గొందరు ఛత్రంబులంబట్టుచు సేవింపనస్తసుఖదుఃఖుండై యచ్చట గదిలి వాయవ్య దిగ్భాగమునకరిగి యందందు సంచరింపుచుఁ జనిచని గణపత్యాశ్రమంబు గణవరంబను పురంబుఁజేరి యందు గౌముదీ నదియందు గృతావగాహుండై గణపతినారాధింపుచు శిష్యులతోఁగూడ నందొకమాసము వసించెను. పరవిద్యాప్రభేదులు దిగ్గజములని బిరుదు వహించిన యమ్మహాత్ముని శిష్యులు పద్మపాదప్రభృతు లొకనాఁడు సాయంకాలమున నయ్యాచార్యశిరోమణిం బీఠంబున కూర్చుండఁబెట్టి ఢక్కాతాళప్రముఖ వాద్యవిశేషంబులఁ బూని యమ్మహాత్ముని స్తుతిజేయుచు నృత్యములు చేయుచు నిట్లుపాడిరి.

శ్లో॥ ప్రపూర్ణం బ్రహ్మాహంనిఖిలజనకం బుద్ధినిహితం
చిదానందం సత్యంసకలజగదాధారమమలం
అగమ్యంవాగాద్యైస్సుజితకరణైరాత్మనమై
స్సునిర్వాణం లబ్ధ్వాయదిహనపునస్సంసృతిరయః.

అట్లు పెద్దతడవు గురుభజనచేసి శిష్యులెల్ల నరసి పరమానందముతో గురుసమీపంబున వసించిరి.

## గాణాపత్య మతము

అట్టి సమయమున నప్పట్టణవాసులగు బ్రాహ్మణు లావింతఁజూచి యాక్షేపించుచు, అయ్యా ! యింతదనుక మీ స్తుతివాక్యములన్నియు వింటిమి. ఆకాశమువలె నిరాలంబమై యవాఙ్మానసగోచరమై యొప్పు నద్వితీయ బ్రహ్మము నట్టిదెట్లు తెలిసికొనఁగలఁడు. మీ మతమేమియు లెస్సయైనదికాదు. శుభములు కావలయునని యభిలాష గలిగినచో మా మతమును స్వీకరింపుడు. వినుఁడు మాది గాణపత్యమతము. అది యారుభేదములు గలదిగా నున్నది. దేవతలెల్లరు దీనినే పొగడుచుందురు. తుండైక దంత చిహ్నితుండగు మహాగణపతి శక్తిసహితు నెవ్వఁడు మూలమంత్రము పఠించుచు సేవించునో యతఁడే ముముక్షువు. శ్రు॥ ఆసిద్ధగణపతిస్త్వేక॥ అను శ్రుతి ప్రమాణము వలన గణపతియే జగత్కారణుఁడని తెలుపుచున్నది. ఆయన మాయచేతనే బ్రహ్మాదులు సృష్టింపఁబడిరి. దానంజేసియేకదా యతనికిఁ బ్రారంభమునఁ బూజ్యత్వము గలిగినదని యుక్తియుక్తముగా నుపన్యసించిన విని శంకరాచార్యులు మూర్ఖులారా ! వినుండు.

గణపతి రుద్రసుతుండగుటఁ బ్రసిద్ధిఁ జెందెను. అందులకు రుద్రుండు కారణుండు. కాని శ్రుతి ప్రమాణము కాదు. మీ నుడువు లంగీకరింపబడవనుటయు వారు మరల స్వామీ ! చిహ్నలేనివాఁడు గణపతి సన్నిధికిఁ బోవుటకు యోగ్యుఁడు కాడు. మీ కట్టిచిహ్న మేమియునులేదు. కావున దేవసన్నిధి నుండరాదని పలికిన గురుండిట్లనియె. ఓరీ ! పాషండులారా బ్రాహ్మణకులంబునఁ బుట్టినవాడు శిఖాయజ్ఞోపవీతంబులం దాల్చి వేదోక్తములగు కర్మలం జేయుచుండవలయు నట్లైన విప్రత్వము సిద్ధించును. వేదమునందును బురాణములయందును నిందింపఁబడిన చిహ్నలం దాల్చిన మీరెట్లు బ్రాహ్మణులగుదురు ? బాలిశులారా ! మీ దేహంబుల మూలాధారాది చక్రంబుల గణపతి విరాజిల్లుచుండె వాని సేవింపరాదా ? చిహ్నధారణంబున నణుమాత్రమైన ప్రయోజనము లేదు. వేదోక్తమగు పరమాత్మను దెలిసికొనుఁడు. ముక్తులయ్యెదరు. మరియుఁ బంచపూజాపరాయణులైతిరేని మీ యభీష్టము దీరఁగలదు అందు గణపతి యున్నవాఁడని యుపదేశించి వారి శిష్యులుగాఁ జేసికొనియెను. పిమ్మట హరిద్రా గణపతి మతవాది ముందరకు వచ్చి యతివర్యా !

శ్లో. పీతాంబరధరందేవం పీతయజ్ఞోపవీతినం
చతుర్భుజం త్రినయనం హరిద్రా లసదాననం
పాశాంకుశధరం దేవం దండాంబుజకరాభయం
ఏవయంయఃపూజ యద్దేవం సముక్తోనాతసంశయః

అని యున్నది.

హరిద్రాగణపతియే జగత్కారణుండు. బ్రహ్మాదు లాయన యంశంబున జనించిరి. మీరుకూడ నమ్మహాత్ముని సేవించిన గృతార్థులగుదురు. తుండైకదంతాకారములగు లోహంబుల భుజంబులం జిహ్నలుంచుకొనిన ముక్తికాంతుండనాయని పలికిన నవ్వుచు గురుండిట్లనియె, మూఢా! తుండాకారములగు లోహంబున గట్టిగ గాల్చి కొంటివేని తప్పక నీకు శరీరమోక్షము గలుగుట కెంతమాత్రము సందియము లేదు. గణాధిపతి జగత్కర్తయగుంగాక సర్వనామములు నమ్మహాత్మునికి జెల్లును. అతఁడు రుద్రసుతుండగుట నశాంశలకభేదముఁ జెప్పవచ్చును. ఎల్లవారు గణపతి నుపాసింపఁ దగినదే అందుల కేమియు నాక్షేపము లేదు. బ్రాహ్మణులకు గణేశాదిపంచాయతన పూజ విధింపఁబడియున్నది. కాని చిహ్నధారణము కడుదూష్యము. దాన బ్రాహ్మణ్య హాని యగునని బోధించి వారిని స్వమతప్రవర్తకులం గావించెను.

అప్పుడుచ్ఛిష్టగణపత్యుపాసకుఁడు జగద్గురు నెదురుపడి, అయ్యా, మా మతమునకు మహాగణపతి హరిద్రాగణపతి యుచ్ఛిష్ట గణపతి నవనీతగణపతి సువర్ణ గణపతి సంతాన గణపతియని యాయా విధముల నధిదేవతలు ప్రఖ్యాతులైయున్నారు. మొదటివారు నిరువురును మాయొక్కన్ని శిష్యులం జేసికొంటివి. నేనుచ్ఛిష్టగణపత్యుపాసకుఁడ. నా మతమునిరాకరింప నీకకాదు నిన్ను సృష్టించిన విరించికైన శక్యముకాదు, వినుము.

శ్లో. చతుర్భుజంత్రినయనం పాశాంకుశగదాభయం
తుండాగ్రతీవ్రమధుకం గణనాథమహంభజె
మహాపీఠనిషణ్ణంతం వామాంగోపరిసంస్థితాం
దేవీమాలింగ్యచుంబంతం స్పృశంస్తుండేనవైభగం

ఇట్టి స్వరూపముగల గణపతిని మేమారాధింతుము. జీవేశ్వరుల కైక్యము గలిగి నట్లాగణపతికిని దేవికిని నైక్యము గలిగియున్నది. ఫాలంబునంగుంకుమదాల్చుట మా మతాచారమై యున్నది. ఇచ్ఛాధీనములగు కర్మలంజేసిన మాకు దోషములేదు. మా మతంబున స్త్రీ పురుష జాతులు రెండేకాని యితర జాతిభేదములు లేవు. స్త్రీ పురుష సంయోగమువలన దోషనిరూపణము మా మతంబున యేమియుఁ జేయలేదు. ప్రతి వనితయు నిష్టమగు పురుషునితో భోగింపవచ్చును. దీనికి పీఠదేవతి యని దైవమని నిరూపించెనా యేమి? స్త్రీ పురుష సంయోగమువలనఁ గలిగిన యానందమే ముక్తియని మా మతసిద్ధాంతము. తదానందస్వరూపుఁడే గణేశుఁడు. బ్రహ్మాదులు తదంశసంభూతులు. శ్రు॥ సకర్మణాన్నప్రజయా అను శ్రుతి కర్మమువలనఁ బ్రయోజనము లేదని చెప్పుచున్నదిగదా! దానంజేసి మా కేమియు కర్మము లేదు. పుణ్యపాపములఁ దుల్యములగుచున్నవి. ఇంత సుఖమైన మతము మరియొకటిలేదు. సుఖమిచ్ఛయించినవారెల్ల నీమతమే కైకొనవలయు నిదియే ముక్తి పదమని పలికిన విని యాచార్యుం డిట్లనియె.

ఓరీ మూర్ఖ! నీ మతము ముక్తిపదమని నీవేకొనియాడుకొనవలయును.

శ్రు॥ సురాం నైవపిబేత్ నైవపరదారాన్ గచ్ఛేత్. కల్లు త్రాగఁగూడదు పరదారలగూడఁ గూడదని శ్రుతులు ఘోషింపుచుండ వానివలన ముక్తిగలుగునని చెప్పుచుంటివి. అహో నీపాండిత్యము. నకర్మణా. అను శ్రుతి కర్థమేమియో యెఱుంగుదువా? అది తత్త్వవేది యగు యతినిమిత్తము చెప్పఁబడినదికాని మీబోటులకు గాదు. పాపాత్ములు నరకార్హులుఁ నీవుపతితుండవుఁ ప్రాయశ్చిత్తము కావింతము. పంచపూజాపరాయణుండవుకమ్ము. అజపాదమంత్రంబుల జపింపుము. ముక్తుండవయ్యెదవని చెప్పి ప్రాయశ్చిత్తపూర్వకముగాఁ దత్త్వోపదేశముఁజేసి వారి మతస్థులతోఁగూడ శిష్యులఁగా జేసికొనియెను.

అట్లె తక్కిన మూఁడు మతములవారునువచ్చి యాచార్యునితోఁ బెద్దతడవు వాదించి తదీయోక్తి ప్రహరణములచే గొట్టఁబడి శిష్యులై సేవించిరి. అట్లు శంకరాచార్యులు క్రమంబున శాక్తశైవ వైష్ణవ సౌరగాణాపత్యమతంబుల ఖండించి తద్దేవతల బంచాయతనము లనిత్యముఁ బూజించుకొమ్మని యుపదేశించి వారెల్ల శిష్యులై సేవింపుచు తోడరా నటకదలి కాంచీపురంబునకరిగిరి. అందమ్మహాత్ముండు శిష్యులతోఁకూడ నొక మాసమువసించి శంకరప్రతిష్ఠాపూర్వకముగా శివకాంచియను పట్టణముగట్టించి తత్సేవకై పెక్కండ్ర బ్రాహ్మణుల రప్పించి శుద్ధాద్వైతబోధఁ గావించి వేదాంత తాత్పర్యనిష్ఠులై యొప్ప సందు నిలిపెను. ఒకనాఁడు తామ్రపర్ణీ తీరమునుండి కొందరు బ్రాహ్మణులరుదెంచి గురువువరుని చరణంబులకు నమస్కరింపుచు నిట్లనిరి. స్వామీ యీలోకంబున దేహాదులకు భేదము ప్రత్యక్షముగా గనంబడుచున్నది. పరలోకంబున సైతమా మా యీకర్మలవలన నాయా యీ దేవతలనుపాసించుటచే నాయా యీ లోకములు కలుగునని వినుచుండుట భేదమే నిజమైనట్లు తోచుచున్నది. అభేదవాదనకు నిదర్శనమేమని యడిగిన నాచార్యుం డిట్లనియె.

విప్రులారా! పరమార్థతత్త్వము దెలియకపోవుటచే మీరిట్లంటిరి. వినుండు.

శ్రు॥ యత్రతత్త్వస్యపరమాత్మైక్య వాభూత్తత్కేన కంపశ్యేత్ అను శ్రుతి ప్రమాణమువలన దత్త్వజ్ఞానాగ్నిచే దగ్ధమగు పాపపంజరముగలవానికి ముక్తిదశయందు భేదభావము దెలియఁబడును.

శ్రు॥ తత్సృష్ట్వాతదేవాను ప్రావిశత్॥

అను ప్రమాణమువలన జగత్కర్తయగు పరమాత్మయే జీవరూపముగా జగములో బ్రవేశించెనని స్పష్టమగుచున్నది. మరియు దేవతలెందఱని శంకించికొని ముప్వురా? మూఁడువందలా! మూఁడువేలా? ముప్పదిమూఁడువేలా? ముప్పదిమూఁడు కోటులా! యని యనేకత్వము నిరూపించుకొని యంతర్యాగక్రమంబున నొక్కఁడే దేవుఁడని నిర్ణయింపఁబడినది. మొదట బ్రహ్మకే యనేకత్వము జూపఁబడెఁనదిగదా.

శ్రు॥ బహుస్యాం ప్రజాయేయేతి. అని శ్రుతిచే భోక్తృభోగ్యాత్మకమగు సకల ప్రపంచకమునకుఁ బరమాత్మరూపత్వము ప్రతిపాదింపఁబడినది కావున సర్వజ్ఞు నిత్య శుద్ధబుద్ధస్వభావు సకలవివర్తాధిష్ఠాను బరబ్రహ్మను ముముక్షువులుపాసింపఁదగినది.

మీయను జీవపరమాత్మ భేదమును దేవతాభేదమును విడిచి శుద్ధాద్వైతబ్రహ్మోపాసనఁ జేయుఁడు. ముక్తులయ్యెదరని యుక్తియుక్తముగా నుపదేశించినఁ దెలిసికొని కాంభోజాశ్రమపర్ణీ దేశవాసులగు బ్రాహ్మణులెల్ల నద్వైతజ్ఞానభూయిష్ఠులైయొప్పిరి.

అట్లాచార్యవర్యుండు నిజపాదసేవాపరాయణులై నానాదేశములనుండి యరుదెంచిన బ్రాహ్మణుల నద్వైతజ్ఞానబోధచేఁ గృతార్థులంగావించి యచ్చటనుండి వేంకటాచలమున కరిగి యందు వేంకటేశ్వరునిచే నారాధించి పదంపడి విదర్భరాజధానికింజని కథకై శివకేశ్వరునిచే నర్చితుండై శిష్యులతోఁగూడ నప్పట్టణంబునఁ గొన్ని దినంబులు వసించెను.

—:●:—

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

## 53 వ మజిలీ

## షష్ఠోల్లాసము

## క్రకచుని కథ

గీ. మానవ కపాల మొకకేలఁ బూనిభూరి
శూలమింకొక కేలఁ దాల్చుచు శ్మశాన
భసితలిప్తాంగుఁడై జటాపటల మొప్పఁ
గ్రకచనామక కాపాలిక ప్రభుండు.

స్వతుల్యవేషులగు కాపాలికులు పెక్కండ్రు సేవింపఁ గర్ణాటదేశంబున నొలగంబుండి యొకనాఁ డాప్తులతో నిట్లు సంభాషించెను.

క్రకచుఁడు—వయస్యా ! విద్యుజ్జిహ్వ ! శంకరుండను దాంభిక సన్న్యాసి గగనపుష్పసమానమగు క్రొత్తమత మొకటి కల్పించి యెల్లమతస్థులం బరిభవించుచు

మిగుల జంఝాటముతో రామేశ్వరాది క్షేత్రములఁ దిరుగుచున్నాఁడని మనము వింటిమి గదా.

విద్యుజ్జిహ్వుఁడు—స్వామి! వినుటయే కాక వానిమీద దండెత్తుటకై యస్మన్మిత్రులగు క్షపణకైన బౌద్ధాదిమతస్థులకు వార్తలనంపి నారినందఱను రప్పించితిమి. వారందరు వానితోఁ బోరెప్పుడు గలుగునని యుబ్బాటలూరుచున్నారు.

క్రకచుఁడు—ఆ మాయావి వృత్తాంత మరసి రమ్మని పంపిన కౌక్షేయకుఁ దరిగివచ్చెనా?

విద్యు—ఇదిగో! వాడిప్పుడే వచ్చెను. ఆ కథవినిపించుటకే వాని మీ యొద్దకుఁ దోడ్కొనివచ్చితిని. (అని వానిముందరికిఁ ద్రోయుచున్నాఁడు.)

క్రకచుఁడు— కౌక్షేయకా! యిప్పుడా కుక్షింభరి యెందున్నవాఁడు? వానిచర్య లెట్లున్నవి? ఎవ్వరేని వానిం బరిభవించిరా?

కౌక్షేయకుఁడు—స్వామి! దేవరగాక యాసన్న్యాసిని బరిభవించువాఁ డీపుడమిఁలేడు. వాని ప్రభుత్వము నిరాటంకముగా సాగుచున్నది. వినుండు నేను వానిఁ గాంచీపురంబులో నుండఁగలసికొంటి.

క్రకచకుఁడు—అచ్చటి విశేషములేమి?

కౌక్షేయ—చెప్పెద నాకర్ణింపుఁడు.

సీ. ఒకవంకలోక నాయకులోలి నకలంక
నుతిఁదత్పదార్చనా రతిభజింప
నొకచాయనువినేయ నికరమామ్నాయాంత
సంప్రదాయార్థముల్ చర్చ సేయ
నొక క్రేవయుక్తి ప్రయుక్తులబద్ధులై
కుమతవాదులు తపంబులుసలుఁదగ
నొకమూలమూల వాక్యోపదేశజ్ఞాత
తత్త్వులై జనులు నృత్యములు సేయ.

గీ. నందఱకు నెన్నిరూపులై యాత్మబోధ
నాచరింపుచు విప్ర సభాంతరమునఁ
బ్రమథవితుఁడగు భావభవవిరోధి
కరణి నొప్పారి నప్పారికాంక్షి యెపుడు.

దేవా! యా సన్న్యాసి బ్రాహ్మణసభాంతరాళంబున వసించి యుపన్యసింపుచుండ నతనితేజము దుర్నిరీక్ష్యంబై యుండుఁగదా.

క్రకచుఁడు—మూర్ఖా! యీ స్తోత్రపాఠములు నాదగ్గరఁజేసెద వేమిటికి చాలు. చాలు. తరువాత నచ్చట నతండు గావించిన చర్యలం జెప్పుము.

కౌశేయకు—చిత్తము. అతండా కాంచీపురంబున హరిహరులకు సద్వృత మైన యాలయప్రాకార మంటపాదులఁ గట్టించి యందందనేక భూసురసమాజముల నివసింపఁజేసెను.

క్రకచు—తరువాత.

కౌశేయ—పదివేలమంది శిష్యులతో నచ్చటినుండి కదలి వేంకటాచలమునకు వచ్చి యందు మూఁడుదినములుండి తరువాత విదర్భ రాజధానిం జేరిరి.

క్రకచు—ఓహో? మేకపిల్ల పులియున్న పొదదాపునకే వచ్చుచున్నదే. తరువాత తరువాత.

కౌశేయ—అయ్యతిశేఖరుండు సపరివారముగా నావిదర్భ నృపాలునిచే నర్చితుండై తద్దేశజనుల కామోదము గలుగఁజేయుచు నందుఁ బదిదినములు వసించెను.

క్రకచుఁడు—వానిదాంభికము చక్కఁగా సాగుచున్నదే. తరువాత తరువాత.

కౌశేయకు—అప్పుడు దేవరయౌద్ధత్యంబు శంకరుని కర్ణగోచరమగుటయు మన దేశమునకు రాఁ బ్రయాణమగుచున్న యతని యుద్యమము వారించుచు విదర్భ నృపాలుండు.

క్రకచుఁడు—ఏమి వాని సాహసము. రానిమ్ము. రానిమ్ము.

చ. అకట మదీయతాంత్రిక మహత్త్వము తెల్లముగాఁగ వాని మ
స్తకము రుశూలధారచే శిరంబుగఁ జేసి సురన్ ఘటించి యం
దకలుష ప్రవృత్తిభైరవున కాహుతిగా నొనరింపకుండినన్
గ్రకచుఁ డటంచు నన్బిలువ గాఁదగ దింకిట మీరలెవ్వరున్.

కానిమ్మట్టితరి నా నృపాలుం డాబోడి సన్యాసితో నేమని చెప్పెను ?

కౌశేయకు—వినుండు.

ఉ. భైరవతంత్రపారగులు పాపమతుల్ దురితక్రియారతుల్
క్రూరులు బాలిశుల్కలహ కోవిదు లచ్చటివారు భీకరా
కారులు వేదదూషకులు గావున మీరటకేఁగరాదు తే
జోరహితుల్ యశస్కరులఁ జూచి సహింపరుగా ధరిత్రిలోన్.

క్రకచుఁడు—ఏమేమీ ! విదర్భ నృపాలుండు మనలఁ గ్రూరులగాను, తేజోరహితులగాను వర్ణించి యాడాంబికుని సత్తమునిగాఁ గొనియాడెనా ? కానిమ్ము! భైరవతంత్రప్రభావం బెఱింగిన పిమ్మట నిట్లనఁడులే. తరువాత. తరువాత.

కౌశేయకు—ఆ మాటలు విని శంకరసన్యాసి యంతొకవంక ధనుర్ధరుండై సేవించుచున్న సుధన్వుండను నృపాలు మొగముపరికించెను.

క్రకచు—ఆ మహావీరుండతని సహాయుండా యేమి ?

కౌక్షేయకుఁడు—అగుంగాబోలు. విసుం దప్పదా వీరుండు కేలనున్న కోదండంబు దీటుచు,

మ. భయమేలా ? యతిపాలసేవకుఁడ నీ భక్తుండ నేనుండ వి
స్మయమేపార మదీయబాహుగధ సుజ్యాముక్తబాణావళిన్
లయమొందింతుఁ గపాలిసంఘముల నెల్లంబట్టి తద్భీకరా
వయవంబుల్గుతుకంబుతో ఖగకుల వ్రాతంబు భక్షింపఁగాన్.

క్రకచుఁడు—అన్నా ! యస్సిచుఁ కండకావరమెట్లు ప్రేలించుచున్నది. కానిమ్ము తదీయమస్తకరుధిరమాధుర్యంబు భగవంతుఁడగు భైరవుండెరుగనున్నాఁడులే. తరువాత తరువాత.

కౌక్షేయకుఁడు—అన్నరపతి మాటలు విని యయ్యతిపతి మందహాసము చేయుచుఁ గాపాలికులం జయింపఁ గర్ణాటదేశంబునకుఁ బయనంబు సాగింపుఁడని శిష్యులకానతిచ్చెను.

క్రకచుఁడు—మేలు మేలు. సాధు. సాధు. కౌక్షేయకా ! మంచివార్త చెప్పితివిగదా ఆ ప్రయాణ సన్నాహము తుదముట్టసాగినదా నడుమ విఘ్నమేదియైన రాదుగద.

కౌక్షేయకుఁడు—రాదు. రాదు. వారు బయలుదేరి పెక్కుదూరము వచ్చు వరకు నేనక్కడనే యుంటిని. పదివేల బ్రాహ్మణులతోఁ జతురంగబలసమేతుఁడగు సుధన్వుఁడను నరపాలుఁడు సేవింప నా సన్న్యాసి మనదేశమునకు వచ్చుచున్నాఁడు. తరువాతి కృత్యము విచారించుకొనుఁడు. అందరివలె నయ్యతిశేఖరుని సామాన్యముగా దలంపవలదు సుఁడీ.

క్రకచుఁడు—కౌక్షేయకా ! నీ వతని స్తోత్రములు చేయుచు నాకు వెరపుఁ జూపెదవేల ? చాలు. చాలు. పోపొమ్ము. విద్యుజ్జిహ్వా ! ఆ సన్న్యాసి మనదేశమునకే వచ్చుచున్నాఁడట. వింటివా ?

విద్యుజ్జిహ్వుఁడు—వింటిని. ఆ బ్రాహ్మణుల యాయువులు మూడినవి కాఁబోలు. పాపము వాండ్రు మనతో విద్యావాదములు చేయు తలంపుతో వచ్చుచున్నారు. ఆ సంగరహితులతో మనము సంగరమా ప్రసంగమా చేయునది ?

క్రకచుఁడు—వారు సంగరహితులని నీవే చెప్పుచున్నావు. ప్రసంగములు మనకేల ? సంగరము చేయుదము. మన కాపాలికుల నెల్ల యుద్ధసన్నద్ధులై యుండుఁడని యాజ్ఞాపింపుము.

గీ. బోడిబాపనయ్య లీడకువచ్చిన
తోరమూగిమనము తొడలు మెడలు
విరుగనరికినవారి శిరముల సురనికి
భైరవుని దృప్తి పరుపవలయు.

విద్యు—చిత్తము. చిత్తము. అంతయు సిద్ధము గావింతునని పల్కుచు నందరు నిష్క్రమించుచున్నారు.

శంకరాచార్యులట్లు కాంచీపురంబున విచిత్రగోపురమంట పాలయ ప్రాకారాదులం గట్టించి యచ్చటనుండి వేంకటాచలముమీదుగ విదర్భరాజధాని నలంకరించి యందుండి కాపాలిక కులసంకులంబగు కర్ణాటదేశంబునకుం జనిరి.

అందొక దేవాగారంబున వసియించి తద్దేశవాసవ్యులనెల్ల నద్వైతమతావలంబకులం గావింప బోధించి యా సమయంబున సుధన్వప్రేషితుండై శంకరాచార్యుని శిష్యుండొకండు క్రకచు నొద్దకు బోయి సావలేపముగా !

సీ. కుమత వాద్యున్మత్త కుంభికంఠీరవుం
డాగమశీర్ష తత్త్వార్థవేది
దర్శితాద్వైత విద్యా రహస్యవిశేషుఁ
డఖిలదిక్ప్రయతట వ్యాప్తకీర్తి
యంగభూగర్వ ప్రభంగపావనమూర్తి
ప్రౌఢార్థయుతసూత్ర భాష్యకర్త
ఘనవాదజి తపంకజ భూకళత్రుండు
సమధికకారుణ్య సాగరుండు.

గీ. సకలవేదపురాణ శాస్త్రప్రసంగ
చతురమతిశంకరాచార్య చక్రవర్తి
యిందువిచ్చేసెఁ గకచ ! వాదేచ్ఛనీకుఁ
గలిగెనేనిఁ బ్రసంగింపఁ గదలిరమ్ము.

అని చదువునంత నక్కుటిలుండు కటకటంబడి కటంబులదరి జటుల భ్రుకుటీ వికటముఖుండై శూలకపాలంబులు గేలందాలిచి యతిరయంబున నయ్యతిపతి నికటంబున కరుదెంచి యుల్లసమాడుచు నిట్లనియె.

పురుషాధమా! నీవు కపటమతంబొకటి కల్పించి లోకులవంచించుచున్నావని యాకర్ణించి నీదర్పంబడంప నీ కడకు రానుంటిని లోకం నగ్నిజ్వాలంబడు మిడుతచందంబున నీవే నా యొద్ద కరుదెంచితివి.

నీవుభసితంబుదాల్చితి విదిమాకు సమ్మతమే కాని పరమపవిత్రంబగు నరశిరః కపాలము విడిచి యీమట్టిపాత్ర దాల్చితివేల ? భైరవార్చ నేమిటికిఁజేయవు? మధురాశనములగు కపాలకుశేశయములచే భైరవు నారాధింపక నీకు మోక్షము దొరకునా? యీచెడు మతమువిడిచి మాకాపాలికమతము స్వీకరింపుము. ముక్తుండవయ్యెదవని పలుకుచుండఁగా విని సుధన్వుండు తనయధికారులచే నాక్రకచుని నాసభనుండి దూరముగా ద్రోయించెను.

అప్పు డయ్యతిసపరాభవంబు సైపఁజాలక యక్కాపాలికుం డోష్ఠంబులు చలింప వికటముఖుండై పటుకోపంబునఁ బరశ్వధంబు గిరగిరం ద్రిప్పుచు మీ శిరస్సు లన్నియు నరికి భైరవునర్పింపకుండిన నేను క్రకచుండఁగానని శపథముచేసి తటాలునం జని బ్రహ్మణబ్రువుల వధించిరండని కపాలిలోకంబుల నియమించెను.

ప్రళయమేఘగర్జారావములతో కపాలిసంఘంబులు పెక్కులొక్కసారి నానావిధాయుధంబులంబూని యాబ్రాహ్మణ బృందమును ముట్టడించుటయు సుధన్వుండు రథికుండై కోదండంబుదాల్చి కాండవర్షంబు గురిపించుచు నక్కాపాలిక తండంబులతో ఖండనంబు సేయుచున్న సమయంబున.

క. క్రకచనియుక్తులు కాపా
లికులొకపదివేలు భువి చలింపంగా వే
ఱొకత్రోవవచ్చి విప్ర
ప్రకరములను జుట్టిపట్టి బాధించె వెసన్.

సీ. జపతపోనుష్ఠాన సత్క్రియల్గాక బ్రా
హ్మణుల కేటికియుద్ధ మనెడివారు
సకలసంగత్యాగి సన్న్యాసి కేటికి
ఘనదిగ్విజయయాత్ర యనెడువారు
సాధులబోధింపఁ జనుఁగాని యతికి దు
ర్జనభర్జనంబేటి కనెడివారు
అటనుండియింటి కేగుటమాని యిటకేల
వచ్చితిమనిచింతఁ జొచ్చువారు.

గీ. నైమహీసురులెల్ల భయంబుతోడ
బ్రహ్మసూత్రములూడ దోవతలువీడ
హరి శంకర! మాంపాహి పాహియనుచు
శరణుజొచ్చిరి యతినాథు చరణయుగము

అట్లు శమనకింకర నికాశములగు కాపాలికానీకములుగావించు రాయిడికోడి వారలెల్ల నయ్యతితల్లజుని పాదపల్లవముల మరుఁగుఁ జొచ్చుటయు నాదయాళుండు వారినెల్ల నాదరింపుచుఁ బ్రళయకాలవారి వాహనిర్ఘోష భయంకరమగు హుంకారము గావించె. దానంజేసి చటచ్చటారావముతో విస్ఫులింగము లురుల నావిర్భవించిన వీతిహోత్రుండు త్రుటికాలములో నాకాపాలికులనెల్ల భస్మావశేషులఁ గావించెను.

ఆత్మీయులు మడియుటయు భూసురులు మూర్ఛిల్లియుండుటయుం జూచి క్రకచుం డవిదూయమానమానసుండై శంకరు సన్నిధికంబున కరుదెంచి, వంచకుఁడా! దీనికిఫలం బనుభవించెదు. చూడుము మదీయ ప్రభావంబని పలుకుచు మానవకపాలంబు చేతులందాల్చి కన్నులు మూసికొని యించుక వెనుకకువంగి భైరవుని ధ్యానించెను. తదీయ మంత్రప్రభావంబెట్టిదో యంతలో నాకపాలము మద్యాపపూరితంబై యుప్పొంగుటయు నాక్రకచుండు దానిలో సగముగ్రోలి వెండియు భైరవుని ధ్యానించెను. అట్టి సమయమున నక్కపాలాంతరమునుండి.

మ. జ్వలనజ్వాలల సజ్జటావలితో శస్త్రాస్త్రశూలావళీ
విలసద్బాహువుతోఁగ పాలరచిత స్ఫీతప్రదామాళితోఁ
బ్రళయాంభోదరవాట్టహాసములతో బ్రహ్మాండ మెల్లన్ భయా
కులమైతొట్రుపడంగ భైరవుఁడు బల్క్రపంబుతో ముంగిటన్.

ఆవిర్భవించుటయుంగాంచి క్రకచుండు కేలుమోడ్చి ఫాలంబున గీలించి, స్వామీ! మీ భక్తజనులకు ద్రోహంబుగావించు నీనీచుంబరిమార్పుము. ఇదియే మదీయ వాంఛితంబని శంకర యతీంద్రునిపైఁ బ్రయోగించుటయు నమ్మహాత్ముం డోరా! క్రూరాత్మా మదీయాత్మస్వరూపుండగు శంకరునియందే ద్రోహముచేయఁ బూనితివా? చాలు చాలు. నీపాతకంబు నిన్నే చెందెడుంగాక యని పలుకుచుఁ గ్రకచుని శిరంబే తునుమాడి నాట్యము గావింపఁదొడంగెను. అప్పుడు శంకరాచార్యుండయ్యాశ్చర్యమూర్తి ననేక ప్రకారంబులఁ గొనియాడుచు స్వామీ! సంహారభైరవ! వేదశాస్త్రపురాణముల యందు బతిపాదితంబగుకర్మ బ్రాహ్మణులకవశ్యకర్తవ్యము. అట్టికర్మచేయుటవలన ధర్మమభివృద్ధినొందునని నా యభిప్రాయము. ధర్మంబునం బాపనాశనంబగు, పాపనాశనమగుడు మనశ్శుద్ధిగలుగును. మనశ్శుద్ధివలన నాత్మసాక్షాత్కారమగును. అని యీరీతి నేను బ్రాహ్మణసభయందుపన్యాసముఁ జెప్పుచుండగా విని నీభక్తుండాక్షేపించుచుఁ గర్మవలనఁ బ్రయోజనములేదనియు వేదశాస్త్రాదుల సంగతార్థావబోధరవము లనియు జాతులతో నిమిత్తములేదనియుఁ బాషండధర్మముల యుక్తియుక్తముగా నాసభ యందు వక్కాణించెను.

అప్పుడు మదీయశిష్యులు వానింబట్టికొని దూరముగా గెంటివైచిరి. దానఁ గోపించి వాఁడు నిన్ను మంత్రబద్ధుంజేసి రప్పించెను. ఇటువిప్పుడు సందలి సత్యాసత్యంబుల నిరూపింప నీవ ప్రమాణమని పలికి శంకరాచార్యులూరకుండెను.

అప్పుడు భైరవుండయ్యతిపుంగవునిఁ గొనియాడుచు, శంకరా! నీవు సర్వజ్ఞుండవు. పూజ్యుండవు. వేదపదార్థములెఱింగిన విద్వాంసుల నీకంటె మఱియొకఁ డెందును లేఁడు. నీచెప్పిన యుపన్యాసంబు వేదశాస్త్రాదులకు సమ్మతియై యున్నది. అదియే యథార్థంబు. ఈ జాతులన్నియు బ్రాహ్మణాచారతత్పరులం

గావింపుము. వాం౦డకు నేను మంత్రబద్ధుండనగుటచేఁ బ్రత్యక్షమైతినిగాని ధర్మముచేతఁ గాదు సుమీ యని పలుకుచు నద్దేవుండంతర్హితుండయ్యెను.

అప్పలుకు లాకర్ణించి వటుకప్రముఖ కాపాలికులు విస్మయము నొందుచు శంకరాచార్యపాదంబులఁబడి మహాత్మా! మూఢమతులమగు మమ్ము రక్షింపుము రక్షింపుము కరుణాహృదయా! మాకు నిష్కృతిఁ గావింపుమని ప్రార్థించినంత నప్పుణ్యాత్ముండు వారినెల్ల బ్రాహ్మణాచార తత్పరులం గావింపుఁడని పద్మపాదాది శిష్యుల కాజ్ఞాపించెను.

## కాపాలిక మతము

అప్పుడు వృద్ధకాపాలికుఁడొకఁడవ్వార్త నాలించి వటుకాదుల నాక్షేపించుచు శంకరాచార్యునెదుటకువచ్చి నమస్కరించుచు స్వామీ! మీకు మమ్ము బలత్కారముగా మతభ్రష్టుల జేయుట యుచితము కాదు తగుసమాధానముఁజెప్పి యొప్పించవలయును. మామకమత ప్రవృత్తి లెస్సగా వినక విమ్మట నాక్షేపించినను సమంజసమగును నీశిష్యుల మూలమున నేమాటజెప్పుటకు నవకాశములేకున్నది. నోరెత్తువఱకు మొత్తుచుందురు. ఇది ప్రసంగపద్ధతికాదు దౌష్ట్యమని చెప్పుకొనుచున్నాను. ఇప్పుడు నేను మీతో నెంతయోచెప్పవలసివచ్చితిని నా యుపన్యాసము ముగియువఱకు మీ శిష్యుల నాటంకము సేయకుండ నాజ్ఞాపింపుడు. ఇదియే నా కోరిక యని చెప్పుకొనియెను.

ఆ మాటలు విని యతీంద్రుండు మందహాసము సేయుచుఁ గాపాలిక! మా శిష్యులనియమించితిని. నీయుపన్యాసమేదియో వినిపించుమని యానతిచ్చినంత నాకాపాలికుం డిట్లనియె.

మీరు మనుష్యులలో జాతిభేదములం జెప్పుచు బ్రాహ్మణజాతి యొక్కుడని వాదించుచున్నారు. అందులకు మేముసమ్మతింపము. సర్వదేహములు భౌతికవికారము లగుటచే జాతిభేద మెట్లు చెప్పందగినది. శరీరమునుఁజూచి మీరు జాతినిర్ణయింపఁగలరా? స్వకల్పితములగు నీజాతిభేదములకుఁ బ్రమాణము గానిపించదు. స్త్రీపురుష జాతులుఁ రెండే యొప్పుకొనదగినవి. దేనిసంసర్గవలన నెక్కుడు సంతోషము గలుగుచున్నదో, యట్టిస్త్రీజాతి పురుషజాతికన్న శ్రేష్ఠతమమని చెప్పకయే తేలుచున్నదిగదా. ఇదిస్వీయ ఇది పరకీయ దీనింగూడవచ్చును దానిఁగూడరాదను భేదవాసనలు మా మతములో లేదు. అందఱిని దనవారిగా నెంచి యిష్టమైన యానంద మనుభవింపవచ్చును.

సంతసముకొఱకు గావించెడు చరమయదేహముల సంయోగమువలన జీవిఁ దేమియనర్థముసఁ బొందెడిని? అట్టి యానందము గలుగఁజేయు స్త్రీపురుషసంయోగము కన్న మోక్షమనునది మరియొకటి కలదా! జీవునియొక్క తృప్తియే మోక్షమనఁబడు చున్నది. సంయోగంబునన నానందరూపమగు నెట్టివ్యక్తి గలుగుచున్నదో యట్టివ్యక్తియే

భగవంతుఁడగు భైరవుండు దేహపాతంబున జీవులకుఁ గలుగఁజేయుచుండును. సర్వజనసులభసాధ్యమగు నిట్టిముక్తి మామతమందుకాక మఱియొక మతమం దెందేనిం గలదా? యని యుపన్యసించిన విని శంకరాచార్యులు.

ఓరీ! కాపాలిక. నీవు స్త్రీజాతియంతయు గమ్యయేయని చెప్పుచున్నావు. సంతసించితిమి. కాని నీతల్లి యెవ్వనికూఁతురో చెప్పుము.

కాపాలికుఁడు — దీక్షితుని కూఁతురు.

శంకరా — దీక్షితుండన నెవ్వడు.

కాపా — మా తండ్రియే.

శంకరా — ఎట్లయ్యెను?

కాపాలి — తాళవృక్షసంజాతమగు మద్యమును ద్రాగుటచే తద్రసంబుఁ గ్రోలుటచే విశేషంబు ప్రత్యక్షముగాఁ గనంబడుచుండలేదా? జనులు నితరములఁ బానము చేయుదురనుట మా సుప్రసిద్ధము కాదా? సేవించినవారి నానందసాగరమున ముంచు సురాపానలాభంబునం జేసి యదీక్షితుం డగుచున్నాఁడు. మద్యగంధవిముఖులు మా మతమున నిషేధింపఁబడుచున్నారు.

శంకరుఁడు — ఓహో! కాపాలికా! నీమతము సర్వోత్తమమైనది మీరు వెలఁదియుఁ బానము నిషేధములు కావు. నీవు నీ యిష్టము వచ్చినట్లు సంచరింపుము. మేము బ్రాహ్మణులను దండించి సుబుద్ధులం జేయ గంకణము గట్టికొంటిమి కాని యితరులగొడవ మాకేల? పోపొమ్ము సంభాషణార్హుండవు కావని పలుకుచుండగనే శిష్యులు వానిం బట్టికొని దూరముగా గెంటి విడిచిపెట్టిరి.

## చార్వాకాది మతఖండనము

అట్టిసమయమునఁ జార్వాకసౌగతక్షపణకాదు లొకచో సభజేసి యొండొరు లిట్లు సంభాషించుకొనిరి.

చార్వాకుఁడు — సౌగతా! జగంబంతయు మూర్ఖజనులచే నెట్లు వ్యాపింపఁబడినదో చూచితివా? ఈ సన్న్యాసి యాత్మను దేహాద్వ్యతిరిక్తమైనదానిఁగా వక్కాణించుచు లోకుల మోసపుచ్చుచుండ వానినే యెల్లరును సేవింపుచున్నారు. న్యాయవాదులమైన మనలను జూచువాఁ డొక్కఁడును గనంబడఁడేమి?

సౌగతు — లోకము మూఢబాహుళ్యమగుటచేతనే వీనిమాటలయందు విశ్వాసముకలదై యున్నది. పంచభూతవికారంబగు శరీరములకు స్నానదానాదికర్మ వలన శుద్ధియగునని చెప్పుచుండెడి వీని వచనములెంత సత్యములైనవో విచారించితివా?

క్షపణకుఁడు — అతం డెంత వంచకుండైనను దైవబలసంపన్నుం డగుటచే వానిమాటలు సాగుచున్నవి. కానిచోఁ గాపాలిక కులనాయకుండైన క్రకచు నెదురఁబడి

యెవ్వండైన బ్రతికివచ్చెనా? అట్టివానిని సకుటుంబముగా నిర్మూలించిన యతనియెదుర మనబోటివారము నిలువఁబడి వాదింపలేము.

జైనుఁడు—క్రకచునిచే నాహూయమానుండగు భైరవుండు క్రకచుని శిరంబే హరించెనఁట ఇది యేమిచిత్రము? తత్పరస్పరముగా మన మాశంకరునిఁ బరిభవించవలయునని తలంచితిమి. యేదియును లేకపోయెనే.

బౌద్ధులు—మంత్రబలంబున సన్యాసి క్రకచునికన్న నధికుండగుటచే నట్లు జరిగినది. కానిందు మనమీమూలఁ గూర్చుండి యాలోచింపనేల? యెదురఁబడి యనఁగుదము రండు. అతండు పరమశాంతుండఁట. మనమాటలకు సదుత్తరము లీయక మానఁడు.

జైనులు—అతఁడు మంచివాఁడేకాని శిష్యులు కడు క్రూరులు వృద్ధకాపాలికు నెట్లు కావించిరో చూచితిరా?

బౌద్ధులు—వాని నేమి చేసిరి?

జైనులు—అతండు తన మతప్రవృత్తి యంతయుం జెప్పుకొనుటకు నవకాశమిమ్మని సన్యాసిని కోరికొనియెను.

బౌద్ధులు—సన్న్యాసి యందుల కంగీకరించెనా ?

జైనుడు—వానిమాటలన్నియు జిరునవ్వుతో నాకర్ణించి చివర నెక్కసక్కెములాడి పొమ్మని పలుకునంతలో వాఁడు మొఱపెట్టుచుండఁ దదీయశిష్యజనంబులు సారమేయతండంబులు వరాహపోతంబునుంబోలెఁ బట్టికొనికరపదప్రహరణంబుల బాధింపుచు దూరముగాఁ దోలివచ్చిరి.

బౌద్ధులు—అది యసహ్యమే యెద్దియో యుపాయంబున మనము వారి బారిఁ బడకుండ వాదించి రావలయును.

జైనులు—వినయమునుం జూపిన వారేమియుంజేయును.

బౌద్ధులు—వ్యతిరేకము తోచినప్పు డాలాగుననే చేయుదము.

జైనులు—చార్వాకుఁడు వాదాలుండగుట మొదట వానిం బ్రసంగింపఁ జేయుదమని యొండొరు లాలోచించుకొని యందరు నయ్యతిపురందరుని చెంతకుంజని నమస్కరింపుచుఁ దమతమ మతలక్షణంబుల వక్కాణింతుమని చెప్పి తదనుజ్ఞ వడసిన పిమ్మట.

చార్వాకుఁడు—స్వామీ ! మీరు తత్త్వవేత్తలుగదా ! ముక్తి లక్షణమెట్టిదో యెరింగితిరేని వక్కాణింపుఁడు. మరణానంతరమున ముక్తిగలుగునని మీరు చెప్పుచుందురు. అది యేమియు సత్యముకాదు. దేహముతో జీవునికి విడుపుగలుగుటయే ముక్తియని చెప్పఁదగినది. సముద్రమందు లయమైన నదులు తిరిగి పచ్చుట దటస్థించెనేని మరణము నొందినవారికి మోక్షముగలుగు. మృతినొందినవారిని శ్రాద్ధాదికమువలన దృప్తినొందించుట ఆరిన దీపమును జమురుబోసి వృద్ధినొందించునట్టిదే. అంతకన్న

యవివేకి మెందైనం గలడా ? మరియుఁ బరంబున స్వర్గనరకంబులున్నవని పుణ్యపాప ములచే నాయా లోకంబులఁజని యందందు సుఖదుఃఖము లనుభవించి తిరుగ భూలోకంబున జనియించుచుందురనియుం జెప్పుదురు. ఆ మాట పట్టిబూటకము. ప్రమాణశూన్యమైనది. యేమిటికంటిరేని వినుండు.

సుఖదుఃఖానుభూతి యైహికమునందేయున్నది. తదుభయమున స్వర్గనర కములనిపేరు. సుఖభోక్త స్వర్గియనియు దుఃఖభోక్త నిరయస్థుండనియుం జెప్పఁబడు చుందురు. ఇట్టి ప్రత్యక్షానుభూతి విడిచి పరోక్ష కల్పనలుచేసి లోకులను వంచించుట దౌష్ట్యము కాదా ! దేహేంద్రియాదిభూతములిచ్చటనే నష్టములగుచుండఁగాఁ బరంబున కరుగువాఁడెవ్వఁడు. జీవుండంటివేని ఘటనాశనమందు ఘటాకాశమువలెనే రూపహీనునికి గమనంబెప్పుడును సంభవింపదు. కావున మా మతమే లెస్సయైనది. మీ మతము ప్రత్యక్షవిరోధమైనదని పలికినవిని శంకరాచార్యులిట్లనిరి.

మూఢుఁడా ! చార్వాకుఁడా ! నీ మతము శ్రుతిబాహ్యమైనదగుట మన్నింపఁదగినదికాదు. చెడుబుద్ధివిడిచి మంచిమతంబెఱింగించెద నాకర్ణింపుము. ఆత్మ స్వరూపుండగు నా జీవుండు దేహాదులకు భిన్నుండై పరమాత్మయని చెప్పఁబడును. అప్పరమాత్మ అప్రబోధవలన విముక్తుండై జ్ఞానలాభంబున దేహపాతము నొందక పోవుటయే ముక్తియని చెప్పఁదగినది. అంతియకాని నీవు చెప్పినది ముక్తికాదు. నీవు భ్రమపడి యట్లనుచున్నావు. నిశ్చయము. శ్రుతి జ్ఞానము వలననే ముక్తియని చెప్పు చున్నది.

శ్లో. జ్ఞానాగ్ని దగ్ధకర్మాణో
యాంతి బ్రహ్మసనాతనం॥

జ్ఞానాగ్నిచే దహింపఁబడిన కర్మలు కలవారు అనగా బ్రహ్మవేత్తలు సనా తనమగు బ్రహ్మను బొందుచున్నారని శ్రుతివాక్యములు గలవు.

శ్రుతిప్రమాణము సమ్మతింపనంటివేని నీ మాటలే నమ్మదగినవియా? కుత్సితదేహంబు వహ్నిచే దగ్ధంబగుచుండగా జీవుండు లింగశరీరముతోఁ గూడుకొని పరలోకంబున కరుగును. జ్యోతిష్టోమాది వాక్యములే యిందులకుఁ బ్రమాణములు. జీవుడు జలగవలెనే యీ దేహమునుండి దేహాంతరమును స్వీకరించి పరలోకమున కరుగునని శ్రుతి వాదించుచున్నది. మరియు మృతుని ప్రేతత్వవిముక్తి కొరకుఁ బుత్ర మిత్రాదులు శ్రాద్ధాదికము చేయవలయును. గయాదులయందుఁ బిండదానాదికముచే బితరులు పుణ్యలోకము నొందుదురనియు ననేక పురాణములలో జెప్పఁబడియున్నది. కావున జీవుండు మరణావసానంబున లింగశరీరము నాశ్రయించి పక్షివలెనే యరుగ నని శ్రుతసిద్ధాంతమైయున్నది. నీ మూఢత్వమును విడువుము. నా మాటల విశ్వాస ముంచి యాశ్రయింపుము. మరుమాట పలికితివేని గెంటించెదసుమీ యని బలికినఁ

జార్వాకుండు తదుపదేశాలాభంబునంజేసి యాత్మీయ వేషభాషల విడిచి పుస్తకముల మోయుపనిఁబూని యతిని నాశ్రయించెను.

తరువాత సమ్యక్పురందరుం డెదుర నిలువంబడియున్న పీనకాయుండగు సౌగతుంజూచి నీవెవ్వండవు ఏమి చెప్పెదవని యడిగిన నమస్కరించుచు నిట్లనియె. స్వామీ ! మూర్ఖభావంబునంజేసి కర్మశీలురగువారు స్నానదానాదికములచే శరీరమును క్లేశపరచుచుందురు భౌతిక శరీరము స్నానాదులవలన శుద్ధియగునా ? జీవుండు దేహపాతంబున వెండియు కర్మఋణాపనయనార్థమై జనియించునని చెప్పుదురు. ఇదియు మరియు మూర్ఖతగదా. దేహాంతరమున నేమియు లేకపోవుటచేత ఋణమైనంజేసికొని ఘృతము త్రాగవలయునని మా సిద్ధాంతము.

శ్లో. దేహాంతేవాఋణాభావాదృణం
కృత్వాఘృతంపిబేత్.

ఇత్యాది ప్రమాణ వాక్యంబులవలన సర్వదా దేహపుష్టి చేసికొనఁదగినది. బుద్ధిమంతుఁడైనవాఁడు అక్కఱకొఱకు ధనము సంపాదించుకొని సుఖముగాఁ దినుచుండవలయును సర్వభక్షణశీలుఁడే నేర్పరి. ధనభోగమే స్వర్గమని తలంపవలయును. నియమంబుల దేహమును బాధింపఁగూడదు. ఒక దేహము కష్టపడి మఱియొక దేహమును సుఖపెట్టుటెట్లు తటస్థించెదని. కర్మబూటకమని పలికినవిని శంకరాచార్యులు నవ్వుచు నిట్లనిరి. మూర్ఖుఁడా ! దానంజేసియే గాఁబోలు నీవిట్లు శరీరమును బోషించుకొని బలసియుంటివి చాలు. చాలు. నీ మతము చతుర్విపరీతము శ్రుతిస్మృతీతిహాసాదులయందుఁ గర్మభోగము కొఱకుఁ బరలోకగమనాదికము శతసారులు వర్ణింపఁబడియున్నది. కావున పూజాదికము చేయఁగూడదు చేసెనేని తదనుభవమునకు జన్మమెత్తవలయును. నీవీ యజ్ఞానబుద్ధి విడిచి సన్మార్గమవలంబింపుమనుటయు వాఁడు మరల నిట్లనియె. అయ్యా మహర్షియైనసుగతుండు భూమినంతయుం జూచి విస్మయమునొందుచుఁ బ్రాహ్మణ్యోపాసన తత్పరుండై జగద్ధితముగా నెల్లరకు నిట్లుపదేశించెను.

శ్లో. అహింసా పరమోధర్మః అని యెల్లప్పుడు స్మరించుకొను చుండవలయును. అహింసకన్న పుణ్యకర్మ మెందును లేదు భూతదయయే సర్వధర్మములును. అహింస వలననే ముక్తినొందెదరని యానతిచ్చెను. కావున నేనును తద్వచనమేనమ్మి జీవహింసకు వెఱచుచు నియమముగా వర్తింపుచుంటిని.

వైదికులు యాగాదులయందు, బశుహింస గావింపుచుందురు అది మహాపాతకము. మా మతమే పరమధర్మస్థానమైనది. మీరు సైతము దీనిం గైకొనుడని పలికిన శంకరుండిట్లనియె. సౌగతా ! యూరక ప్రేలెదవేల ? దుష్టుడా ! నీకు ధర్మసూక్ష్మమేమి తెలియును ? యాగంబులం జెప్పఁబడిన హింస పరమధర్మమని నిగమంబునఁ జెప్పఁబడియున్నది అగ్నిష్టోమాదిక్రతువులయందుఁ గావించిన పశుహింస

వలన స్వర్గము వచ్చునని చెప్పఁబడియున్నది. తద్వాక్యముల నాక్షేపించువారు వేద బాహ్యులగు పాషండులని చెప్పఁబడుచున్నారు.

శ్లో॥ వేదనిందాపరాయేతు సదాచారవివర్జితాః।
తేసర్వేనరకంయాంతి యద్యపిబ్రహ్మవీర్యజాః॥

పూర్వాచారములను విడిచి వేదనింద గావించుచుండెడివారు బ్రాహ్మణబీజ సంభూతులైనను నరకమును బొందుదురని మనువు చెప్పియున్నాఁడు కావున బ్రాహ్మణాదివర్ణములు వేదమందుఁ జెప్పఁబడిన యాచారములు చేయవలయును. నీవు చెప్పిన ధర్మములు తద్విరుద్ధములగుటచే నింద్యములైనవి. మరియొకసారి ప్రయోజనశూన్యముగా సంభాషించితి యేని దండింపఁజేయుదునని పలికినంత వాఁడు సంతుష్టినొంది తత్పాదు కావాహకుండై తిరుగుచుండెను.

తరువాతఁ గౌపీన మాత్రధారియై క్షపణకుండు గౌలయంత్ర మొకచేతను, దురీయంత్రమొకచేతను ధరించి శంకరుని మ్రోలనిలువంబడి స్వామీ! నా మతము కడువిచిత్రమైనది. మంగళప్రదమైనది విఘ్నండు కాలప్రవర్తకుఁడగు సూర్యుని నీయంత్రద్వయమునుచేతను గట్టిపైచి సమయజ్ఞాన కౌశల్యమునంజేసి త్రిలోకములకు శుభాశుభ ఫలంబుల చెప్పఁగలను కాలమే పరమాత్మయనుట మా మత సిద్ధాంతము. ఇట్టి మతమును నిరాకరింప నీ తరమా? పరేశుండైన సమర్థుండు కాఁడు. అనుటయు శంకరాచార్యులు "ఓరీ క్షపణక! తెల్పగాఁ బలికితివి. నీవు కాలవేదివని యెఱుంగుదుము. నీవు సన్న్యాసియించి యుండుము. పరీక్షాకాలము వచ్చినప్పుడు పరీక్షింతుము" అని పలికిన వాఁడందులకు సమ్మతించి యది మొదలయ్యతి నాశ్రయించి తిరుగుచుండెను.

పిమ్మట జైనుండు కౌపీనము ధరియించి యొడలంతయు మలముఁ బూసికొని బిందువులేపంబుగా ధరియించి భయంకర వేషముతోఁ బిశాచమువలె నొప్పుచుఁ బెక్కండ్రు శిష్యులు సేవింప శంకరుని మ్రోలకు వచ్చి అర్హన్నమోయని పలుకుచు నిట్లనియె.

మ. జినదేవుండెసమగ్రము క్షిదుఁడు సర్వింపంగనన్నాత్ముఁడా
యనయే ప్రాణులహృత్సరోజముల జీవాత్మస్వరూపంబునం
దనరారున్వతతంబు తద్వసతినం తచ్చుద్ధిధ్యానించుచే
ఘనవిజ్ఞానమనంబడున్ గలుగుము క్తత్వంబుతత్ప్రాప్తిచేన్.

స్వామీ! జినదేవుండు సమస్త ప్రాణుల హృదయంబున వసియించి శ్వాస ప్రదుండై దేహపాతంబున జీవునిఁ బరిశుద్ధునింజేసి ముక్తునిం గావింపుచుండును. దానం జేసి జీవుండు శుద్ధుఁడగును. దేహము మలపిండసదృశమైనది. స్నానాదిక్రియలవలన నెప్పుడు నిది శుద్ధముకానేరదు. కావున స్నానాదికము చేయఁగూడదు. మాలిన్యదేహముతోనే తిరుగుచుండవలయును. ఇట్లుండ జినదేవుని కరుణవలన దేహపాతంబున శుద్ధత్వము

గలుగు. నిదియే మా మత సిద్ధాంతమని పలికిన శంకరుం డిట్లనియె. జైనుఁడా! జీవునికి స్థూలసూక్ష్మకారణ భేదములచే మూడుదేహములు గలిగియున్నవి. ఆ శరీరత్రియము క్రమముగాలయమైన పిమ్మట జీవుండు సచ్చిదానందస్వరూపుండగును. నేనీశ్వరుని కంటె భిన్నుండనని పలుకుట యజ్ఞానము. కావున సభేదబుద్ధితో హృదయస్థుండైన యీశ్వరుందెలుసుకొనుము. ముక్తుండ వయ్యెదవు. అంతియకాని దేహపాతమేమోక్షమని పలుకుట యవివేకము. మోక్షము కడుదుర్లభమైనది. యద్వైతజ్ఞానము సంపాదించుకొనుము. ముక్తుండవయ్యెదవని పలికిన వాని శిష్యసహితముగా సంస్కరింప పద్మపాదాది శిష్యులకు శిష్యునిం గావించెను.

తరువాత శబలుండను బౌద్ధుండు వచ్చి శంకరునితో నీ బోధవలన ప్రయోజన మేమియును లేదు. నరశృంగ సమంబగు నీయభేదజ్ఞానము సర్వోత్తమమని వాదించుచు లోకుల వంచించుచున్నావు ప్రత్యక్షఫలమును విడిచి నీవు కడుదూరమైన యదృష్టఫలమును గోచుచున్నావు. స్పష్టద్రోహివైతివి. శూన్యమగు పరోక్షము ఫలంబెట్లీయ జాలెడిని. ఆహా! నిరీవమగుట నీమతమపార్థమైనది. మామతమందు హృదయప్రేరకుండై సుఖాత్మయై జీవుండు నిత్యముక్తుండగుచున్నాడు. మఱియు నేనే కర్తను నేనే పరానంద స్వరూపుండనని తలంచుచు నెంతవఱకు నీదేహప్రకృతి యిష్టమగునో యంతకాల మీ దేహంబునఁ గ్రీడించుచుఁ బిమ్మట శరీరమును విడిచిపోవును అదియే ముక్తియని మా మతసిద్ధాంతము. అన విని శంకరుం డిట్లనియె. బౌద్ధుండా!

శ్లో॥ సత్యశౌచపరోయస్తు దేవతాతిథిపూజకః
సయాతిబ్రాహ్మణో లోకం యావదింద్రా శ్చతుర్దశ॥
అగ్నిష్టోమం దేవతాప్రీతిదం చేత్కుర్యాదసౌ దింద్రలోకం సయాతి
సత్యాఖ్యం సత్పౌండరీకా త్ప్రయాతి తత్తద్దేవోపాసకాస్తంతమేవ
యోయోయంయాంతనుంభక్తశ్శ్రద్ధయార్చితుమిచ్ఛతి
తస్యతస్యాచలాం శ్రద్ధాంతామేవవిదధామ్యహం.

ఈ మొదలైన పురాణవచనములంబట్టి పరలోక గమనాదికము ప్రసిద్ధమై యున్నది. అన్నమయదేహపాత మాత్రమునసే ముక్తియని చెప్పుట యవివేకము. ప్రమాణశూన్యమైనది. జ్ఞానమునగాని మోక్షము సిద్ధించదని వేదము చెప్పుచున్నది. కావున బరమాత్మను దెలిసికొని ముక్తుండవగుము.

అనర్థప్రదాంబయి నిల్చిత్సున నీవిభ్రాంతిని విడువుము. సచ్చిదానంద స్వరూపమునగాఁ దెలిసికొనుము మూఢభావమును విడిచి స్వస్థుఁడవై యద్వైత జ్ఞానము సంపాదించుకొనుమని పలుకఁగా విని యాబౌద్ధుండు శంకరాచార్యుం గొని యాడుచు వందిమాగధ సూతసంఘములలో సద్మహాత్ముని సేవింపుచుండెను.

అట్లు శంకరాచార్యులు కర్ణాటదేశంబునఁ బ్రబలియున్న కాపాలిక చార్వాక జైనాది కుమతంబుల ఖండించి యందుండి శిష్యులతోఁ గూడ ననుమల్లమను పట్టణమున కరిగిరి.

అందు మల్లాసురహరుండగుట మల్లారియను పేరుతోనున్న వేల్పుంపూజింపుచు నందున్నవారు తద్వాహనమైన కుక్కల ననుదినము సేవింపుచుందురు. వారు గవ్వలపేరుల గంఠంబుల దాల్తురు. మూడుకాలములయందును నాట్యవాద్యాదికములచే నా మల్లారి నర్చించుచు నతఁడే ముక్తిప్రదుండని వాదింపుచుందురు.

శ్రుతి॥ శ్వభ్యశ్శ్వపతిభశ్చవోనమః॥ అను శ్రుతివలన శ్వానములె వందనీయములని ప్రమాణములు చూపుదురు. శంకరాచార్యులా గ్రామమున నిరువదిదినములు వసియించి తన్మతమును ఖండించి వారినెల్ల ప్రాయశ్చిత్తపూర్వకముగా సన్మార్గప్రవర్తకులఁ గావించెను.

పిమ్మట నగ్గురువరుండు శిష్యసహితముగా నచ్చటినుండి పశ్చిమ మార్గమున నరిగి మరుంథ మను గ్రామమునకరిగెను. అందు విచిత్ర గోపురమండితంబైన విష్వక్సేనుని యాలయమొకటి గట్టించి దానికిఁ చూపుగాఁ బాసియశాలను నిర్మించి యుదార్యుండా యాలయములోనికిఁజని స్వామిని సేవించెను.

మరియు నందు గల విష్వక్సేన మతస్థులకు సాధుబోధగావించి పాషండ చిహ్నహీనుల్గాంగావింపుచు నాత్మభక్తులంజేసికొనియెను. అచ్చటనుండి యుత్తరమార్గముగా మాగధమను పట్టణమునకరిగి యందు నింద్రకుబేరమతస్థుల యజ్ఞానంబుఁ బోగొట్టి పంచపూజాపరాయణులం గావింపుచు శంకరుండచ్చటినుండి యమప్రస్థపురంబున కరిగెను. అప్పురంబున మాసము వసించి యందు యమతస్థులఁ బాదాక్రాంతులం గావించుకొని కృతార్థులంజేసి పిమ్మట నచ్చటనుండి ప్రయాగ కరిగి యందు వాయు వరుణ మతస్థుల వినేయులం జేసికొని కొన్నిదినములు వసియించి త్రివేణీతీర్థసేవ గావింపుచుండెను.

అంతొకనాఁడు శూన్యవాది శంకరాచార్యు నెదుటకువచ్చి నిలువంబడుటయు నాజగద్గురుండు నీవెవ్వండవని యడిగెను అప్పుడు వాఁడు స్వామీ! నేను నిరాలంబన నామధేయుఁడ. మాతండ్రిపేరు క్లప్తుఁడు. నేనిప్పుడు వచ్చుచుండ దారిలో మృగతృష్ణా జలంబున స్నానముఁజేసి యాకాశకుసుమమాలికలం జుట్టికొని శశశృంగవిరచితమగు కోదండంబుధరియించి వంధ్యాపుత్రుండొకఁ డెదుర పడియెను. వాని జూచి సంతసించుచు దేవభావము వహించి నమస్కరించి యిప్పుడే తమదర్శనముఁ గావింపఁజనుదెంచితిని. వాడెవ్వఁడో యెరింగింపుడనుటయు శంకరాచార్యు లిట్లనిరి. శూన్యవాదీ! నీ యభిప్రాయము వే నెఱుంగుదును. శూన్యమగుట నీమతము సంద్యమైయున్నది.

శ్రుతి॥ తమేవ భాంతమను భాతిసర్వం॥ అను శ్రుతివలన బ్రహ్మము

శూన్యముకాని యట్లు స్పష్టపడలేదా? మూఢత్వమును విడచి యద్వైతవిద్యను గ్రహింపుమని పలికిన విని వాఁడు మఱల నిట్లనియె.

స్వామీ! ఖం బ్రహ్మ॥ అను శ్రుతివలన ఆకాశమే బ్రహ్మయని విశదమగుచున్నయదిగదా!

శ్లో॥ ఆకాశస్సర్వభూతేషు జ్యాయానస్తిపరాయణం
తం ప్రత్యేవాస్తమాయాంతీత్యేవం హి శ్రుతిరబ్రవీత్॥

సర్వభూతములలో నాకాశమే శ్రేష్ఠమైనది. తచ్చిహ్నముగలదగుటచే ఆకాశమునకుఁ బ్రహ్మత్వము చెప్పఁచున్నాము. కావున మామతము నింద్యమెట్లగును? అనుటయు జగద్గురుండు. ఓహో! శబ్దగుణకమాకాశమని వినియుండలేదా? సగుణమును బ్రహ్మమునుగాఁ జెప్పవచ్చునా? కార్యకారణబోధకమైయున్నది. కావున శబ్దమువలన దెలియబడుచుండెడి యాకాశము బ్రహ్మముకానేరదు. ఎవ్వనికిని నాకాసాదులకంటె నాధిక్యము వేదమందుఁజెప్పబడినదో యట్టి సచ్చిదానందస్వరూపమైన పరమాత్మ నద్వైతబుద్ధితో దెలిసికొనుము ముక్తుండవయ్యెదనని పలికిన విని యాశూన్యవాది యమ్మహాత్ముని బాదంబులంబడి ఆర్యా! భవద్దర్శనంబునఁ గృతార్థుండనైతి. మూఢుండనైన నన్నుఁ బ్రహ్మోపదేశంబునఁ గృతార్థుంగావింపుమని వేఁడుకొనుటయు నతండు వానిని శిష్యునిగాఁ జేసికొనియెను.

ఆ రీతినే యయ్యతిపతి వరాహసాంఖ్యకాపిలాణుక శేషచంద్ర పితృమతస్థులఁ దత్తద్దేవతారాధకుల నద్వైతబోధచేఁ గృతార్థులం గావింపుచు నఁగియరిగి పశ్చిమసముద్రతీరంబున విరాజిల్లుచున్న గోకర్ణక్షేత్రమున కరిగెను.

—:●:—

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

## 54 వ మజిలీ

## సప్తమోల్లాసము

అందు మహాకాళనాథు సేవించి తదాలయమున వసియించియున్న సమయంబున హరదత్తుండనువాడు శిష్యులకు వేదాంత ముపదేశించు నీలకంఠుండను తన గురువునొద్దకు జని యల్లన నిట్లనియె.

## నీలకంఠుని కథ

ఆర్యా! నీవు వ్యాససూత్రములకు శైవపరముగా భాష్యము చేసియుంటివి. ఇప్పుడు శంకరుండను సన్యాసి భట్టమండనాది బౌద్ధ పండితులం జయించి శిష్యులుగాఁ జేసికొని వారితోఁగూడ దిగ్విజయము చేయుచు నిన్ను జయించు తాత్పర్యముతో నీయూరుచేరి మహాకాళుని యాలయములో వసియించియున్నాడఁట. అతండు అద్వైతపరముగా సూత్రభాష్యముఁజేసి దేశమెల్లెడల వ్యాపకము చేయుచున్నాడఁట ఇప్పుడు మనసూత్రభాష్యమును ఖండించుననియు వాదమునకై రప్పింప వలయుననియుఁ దచ్ఛిష్యుఁ డొక్కరుడు నాతోఁ జెప్పినాఁడు. వానిశిష్యులే లోకాతీతులని వింటిని. తరువాతి కృత్యము మీరే యోచించుకొనుడని పలికిన విని శైవాగ్రేసరుఁడైన నీలకంఠుం డిట్లనియె.

హరదత్తా! నీ విట్లు పిరికితనముగా మాట్లాడుచున్నావేమి ? నా సామర్థ్యము మఱచితివా? పరపక్షాఖర్వములైన తర్కములచే నిప్పుడే వాని విభవం గావింపుచుండ నీవే చూతువుగా వినుము.

శా. పారావారజలంబులెల్ల గడు దర్పంబొప్ప నింకింప నీ
ధీరుండై దివినుండి భాస్కరుని ధాత్రింద్రెళ్ళఁద్రొబ్బింప నీ
ధారాళంబుగ నాకసంబు నురువస్త్రంబట్లు కైఁజుట్ట నీ
సార్వజ్ఞంబును జయింప యతికిన్ శక్యంబుగా దెన్నఁడున్.

అని బీరములు పలుకుచు నత్యంతకోపాటోపంబున బయలుదేరి రుద్రాక్షమాలికావిరాజితకంఠుండై నీలకంఠుడు శిష్యులతోఁగూడ శివాలయంబున కరిగి యందు

నల్ప తేజఃపుంజంబున రెండవ శంకరునివలె నొప్పు శంకరుంగాంచి విస్మయహృదయుండై వాదసన్నద్ధుండై యున్న సమయంబున సురేశ్వరుం డాచార్యున కిట్లనియె.

స్వామీ! మీరు క్షణకాలము విశ్రమింపుఁడు. ఈ నీలకంఠుఁడు మించినవాఁడుకాఁడు. వీనిం బ్రుదటిలో బరిభవించి యంపెద. మదీయ వాదశక్తిఁ జూతురుగాక యని పలికిన విని నీలకంఠుం డీసుతోఁ జూచుచుం జూచుచు సురేశ్వరున కిట్లనియె.

అయ్యారే! సురేశ్వర! లజ్జావిహీనుండవై యీ సభామధ్యంబునఁ దలయెత్తి యెట్లు సంభాషింపుచున్నావో విచిత్రమగుచున్నది. సన్యాసితో వాదించి తానోడుటయేకాక భార్యనుగూడ సభ యెక్కించియు గెలుపుఁగొనక దాసుండవై యతని వెంటం దిరుగుచున్న నీవా నాతో వాదించుట? ఏమి నీయద్వైతనిష్ఠత. మొన్నటివఱకుఁ గర్మవాదివై బలవంతమున సన్యాసి వైతివి. పోపొమ్ము. నీవు సంభాషణార్హుండవుకావు. రెంటికిం జెడితివని పలుకుచు శంకరున కభిముఖుండై నిలువంబడియెను.

అప్పుడయ్యతిపుంగవుం డోహో? నీలకంఠా! నీవీ సురేశ్వరుని బ్రజ్ఞ నెఱుంగక చులంగఁదూలనాడితివి. కానిమ్ము. నీకే విద్యయం దభిమానమో చెప్పుము. నీవు వ్యాససూత్రములకు శివపరముగా భాష్యము జేసినావఁట యేదీ నీ భాష్యము చూచి యభినందింతుమని పలికిన విని నీలకంఠుండు తన భాష్యమును చదివి వినిపించెను.

అప్పుడు శంకరాచార్యుండు పరపక్షబిసావళీ మరాళంబులగు వచనంబులచే నతనిభాష్యమును శతధాఖండించి యతనిచేతనే దానినిఁ బూర్వపక్షమైనదానిగా నొప్పించెను.

అప్పుడు నీలకంఠుండు స్వపక్షరక్ష జేసికొనలేక చింతించుచు శంకరకృతమగు సూత్రభాష్యము నిట్లు పూర్వపక్షము చేయఁబూనెను.

యతీంద్రా! మీరు తత్త్వమస్యాది నిగమాంత వచనములచేఁ దేజస్తిమిరములకుంబోలె విరుద్ధధర్మములుగల జీవేశ్వరులకైక్యమును జెప్పుచుందురు. అది యసంగతము.

మూఢత్వాదిగుణవిశిష్టుండగు జీవుండు సర్వజ్ఞత్వాది గుణ సమంచితుండగు నీశ్వరుం డగుటయెట్లు? ఇది శుద్ధావివేకము. అద్వైతము బౌద్ధమతమువంటిది.

అని యిట్లనేక యుక్తిప్రయుక్తులచే నద్వైతసూత్ర భాష్యమును బూర్వపక్షము సేయుటయు నవ్వుచు శంకరాచార్యుం డిట్లనియె.

నీలకంఠా! నీ యకుంఠితపాండిత్యప్రౌఢిమ యంతయు దేటపడినది. మదీయ భాష్యము సురేశ్వరుని యొద్దఁ బాఠముఁ జదువుకొనిన నీకు మంచిబుద్ధి గలుగును. ఇంతకన్న బ్రౌఢములైన పూర్వపక్షముల ద్వైతమతముపై జేయబడినవి. వాని కన్నింటికి సమాధానములు సైతము చెప్పియుంటిమి. తత్పూర్వపక్ష సిద్ధాంతములన్నియు మా భాష్యమున దేటతెల్లముగా వ్రాయఁబడియున్నవి. అవి యన్నియు నీవు చదువుకొనుము. చక్కఁగాఁ దెలియగలవు. జీవేశ్వరులకు వాచ్యార్థముచే విరుద్ధధర్మ

ములు గలిగియున్నవి. కాని లక్షణార్థముచే లేవు. చిత్స్వరూపదాసామ్యంబున నిరుపు రికు నభేదమే చెప్పదగినది. పెక్కులేల ? నీ శంకలన్నిటికి మామక భాష్యమందే సమాధానము చెప్పఁబడియున్నది. సురేశ్వరా ! వినుపింపుమని పలికిన నప్పండితుండు భ్రూభంగవిశేషంబున నతని నాక్షేపించుచు నందుఁగల పూర్వపక్ష సిద్ధాంతము లన్నియు నీలకంఠునికిఁ జదివి వినిపించి చక్కగా బోధించెను.

అప్పుడు నీలకంఠుఁడా భాష్యమును విని సిగ్గుపడి గర్వముతో గూడఁ దన భాష్యమును విడిచి శంకరాచార్యుని చరణసరసిజముల శరణుఁ బొందెను.

అట్లు శంకరాచార్యులు నీలకంఠుని జయించిరనువార్త విని యద్వైతమత విరోధులగు నుదయనాదిపండితులు భయపడి విదేశములకుం బాఱిపోయిరి.

పిమ్మట శంకరాచార్యులు సౌరాష్ట్రాదిదేశముల కరిగి యందందు దన భాష్యమును వ్యాపకముఁ జేయుచు విబుధ ప్రశస్యమానులరై ద్వారవతీపురి కరిగెను.

అందుఁ బాంచరాత్రులను వైష్ణవమతవిభేదులు దప్తశంఖచక్రాకృతి వ్రణ పూరితావయవులరై యొప్పుచుందురు. వారెల్ల స్వమతాధిక్యమును బ్రతిష్ఠించు తలం పుతో గుమిగూడి వాదమునకు వచ్చునంత విచ్చలవిడిఁ బద్మపాదాదిశిష్యవరు లతి ప్రగల్భవాక్యోపన్యాసముల గజయూధంబుల సింహపోతంబులట్ల యప్పాంచరాత్రుల నెల్లఁ బరాపంచలఁ గావించిరి.

అట్లు జగద్గురుండు శాక్త్రశైవవైష్ణవసౌర గాణపత్య కాపాలిక ప్రముఖ ప్రౌఢ మతంబుల ఖండించి తన్మతస్థుల నద్వైతబోధచే నుద్ధరించి పంచపూజాపరాయణులం గావించిన కతంబున నమ్మహాత్మునికి షణ్మతోద్ధారకుండని బిరుదమువచ్చినది. పదం పడి భట్టభాస్కరుం డుద్దండపండితుండని విని యతనితో వాదించుతలంపుతో నగ్గురుం డుజ్జయినీపురంబున కరిగి యందుఁ గాళీశ్వరుని యాలయంబునఁ గల్యాణమంటపంబున విశ్రమించి పద్మపాదుంజూచి వత్సా ! మనరాక భట్టభాస్కరున కెఱింగించి రమ్ము. అతం డిందుఁ బ్రౌఢవాదియని పలికిన విని సమ్మోదమేదురహృదయుండై యతండరిగి విబుధకులావతంసభూతుండును పునఃపునరావృత్తనిగమ సంఘాతుండును బ్రతివాది ధ్వాంత భాస్కరుండునగు భట్టభాస్కరుంగాంచి యర్చితుండై స్వాగతపూర్వకముగా నాగమనకారణం బడుగఁబడి గంభీరస్వరంబున—

సీ. కుమతవాద్యున్మత్త కుంభికంఠీరవుం
డాగమశీర్ష తత్త్వార్థవేది
దర్శితాద్వైత విద్యారహస్యవిశేషుఁ
డఖిలదిక్ప్రయుతద వ్యాప్తకీర్తి
యంగభూగర్వ ప్రభంగ పావనమూర్తి
ప్రౌఢార్థయుత సూత్ర భాష్యకర్త

ఘనవాదవిజిత పంకజ భూకళత్రుండు
సమధికారుణ్య సాగరుండు

గీ. సకలవేదపురాణ శాస్త్రప్రసంగ
చతురమతి శంకరాచార్య చక్రవర్తి
వచ్చియున్నాఁడు నీతోడి వాదమునకు
భట్టభాస్కర ! రమ్ము నీ ప్రజ్ఞఁజూప.

గీ. అధమభాష్యంబులెల్ల జక్కాడి యతఁడు
ప్రౌఢిరచియించె నద్వైత పరముగాఁగ
సూత్రభాష్యంబు దానికి సుమతి సమ్మ
తింతువేని శుభంబు కాదేని వినుము.

క. రూఢాస్మదుగ్రతర్క-
ప్రౌఢోక్తిస్వదుని సాత పరిఘాతములన్
గాఢముగఁ ద్రెళ్ళకుండఁగ
మూఢాభవనీయపక్షములఁగావుమిఁకన్.

అనుటయు నమ్మాటలాలించి భట్టభాస్కరుం డించుకయులుక మొగంబునం దీపింప మందహాసముఁ జేయుచుఁ బద్మపాదున కిట్లనియె.

చ. ఎఱుఁగరుమీరు మామక సమిద్ధకథా విభవంబొకింత పెం
పఱఁ బరికిత్రిదండికల నక్కసికైవడి మావిదేశముల్
దిరిగి సుధీజనోత్తముల దిక్కరితుల్యుల శాస్త్రవాద సం
గరమున నోడఁబుచ్చిన యఖండుఁడ నాకదనే ? ప్రతాపముల్.

ఉ. అక్కపిలప్రలాపముల నల్పముగాగణియింతు నెంతయున్
లెక్కఁగొనం గణాదునవలీలగనెన్నుదు పక్షపాదు ని
న్నెక్కిలిసర్వశాస్త్రపరి విష్టితబుద్ధి వినేయ ! యిట్టినా
చక్కినుతింతు వాదునిక సాధుగతింబలుశాస్త్రవేత్తగాన్.

అన విని పద్మపాదుండు నవ్వుచు——

గీ అవనిభృత్కోటి విదళించు నట్టిటంక
మించుకయు వజ్రమణిని భేదించనోప
నట్లునీవెట్టి గురుమతి వైన నమ్ము
హాత్ము గెలువఁగలేవు విద్యార్థివగుము.

క. పలుపలుకులేల నీకే
తెలియఁబడుఁగాదె తత్ప్రధీవరు విద్యా
బలము దినుచు రుచులడుగఁగ
వలయునె వడిలేచి భట్టభాస్కరా ! రమ్మా !

అని యత్యంతావహేళనపూర్వకముగాఁ బలికిన భట్టభాస్కరుండౌరా ? యెంతెంతమాటలాడుచుంటివి. పోపొమ్ము. మేము వచ్చుచున్నామని శిష్యులతోఁగూడ శంకరాచార్యు నొద్ద కరిగెను.

పిమ్మట భాస్కరమస్కరి ప్రవీరులిరువురు వాదమునకుఁ బూనికొని వీరాలాపములాడుకొనుచు నొండొరుల నాక్షేపించుకొనుచు వాక్యచాతుర్యంబులం జూపుచు సకలశాస్త్రప్రవీణతల గాన్పించుచు యుక్తిపాటవంబులఁ దేటపరచుచు నన్యోన్యమత ఖండనంబులఁ గావించుచు మతాంతరంబుల నిందించుచుఁ బ్రకృతిపూరుషుల భేదమును గురించియు జీవేశ్వరుల యభేదమునుగురించియు మూడహోరాత్రంబు లేకరీతిఁ బ్రసంగము గావించిరి.

అందు భట్టభాస్కరుని ప్రౌఢవాక్యవిలాసంబులు పెసఁగొనంగ యతిపురందరుండు యుక్తికౌశేయకముల ఖండింపుచు సిద్ధాంతపాండిత్యప్రకర్ష తేటపడఁ గ్రమంబున నతని నిరుత్తరుం గావించెను.

అట్లు యుక్తిశతములచే భట్టభాస్కరుని వశపరచుకొని శంకరయతి సార్వభౌముండు శ్రుతిభావవిరోధకంబులగు విమతగ్రంథముల నెల్లను నిరాకరించెను.

దుర్మతవాదియగు భట్టభాస్కరుండట్లు శంకరునిచేఁ బరాజితుండగుట విని తద్దేశవాస్తవ్యులైన బ్రాహ్మణయూథాది పండితులాచార్యు నాకర్ణించి యనుమోదించి శిష్యత్వము వహించి యరిగిరి.

పిమ్మట నమ్మహాత్ముండు బాహ్లికదేశమున కరిగి యందుంగల కుమతవాదుల ఖండించి యనంతరము నైమిశారణ్యమునకరిగి యందుఁగల తాపసుల కామోదముఁ గలుగఁజేసెను.

తరువాత నాపరివ్రాట్శేఖరుండు దరదభరత శూరసేన కురుపాంచాలాది దేశములకరిగి యందుఁగల పండితులనోడించి తనభాష్యమును వ్యాపకముచేయుచుఁ గ్రమంబున ఖండనకారుండగు శ్రీహర్షు నొద్ద కరిగెను. అప్పండితుండు ప్రభాకర భట్టపాద భట్టభాస్కరాది సూరివరేణ్యుల లెక్కగొనకఁ గర్వించియున్నమేటి. అట్టి ఖండకారుని బటుయుక్తి పరంపరలచే సూచియాచి వశంవదునిగాఁ జేసికొని యయ్యతి చక్రవర్తి యచ్చటనుండి కామరూపములను దేశవిశేషములకరిగి యందు శాక్తభాష్యము రచియించి ప్రసిద్ధినొందియున్న యభినవగుప్తుఁడను పండితుని వాదమునకుఁ జీరినంత నతండాత్మీయ శిష్యులతో నిట్లని విచారించెను.

అభినవగుప్తుడు—శిష్యులారా! శంకరసన్యాసి యిప్పుడు మన గ్రామము వచ్చి యాలయములో వసియించి యున్నవాఁడఁట. వాదమునకు రమ్మని యిప్పుడే పిలిచిపోయెను. ఏమి చేయవలయును.

శిష్యు—శాక్తభాష్యము రచించి జగత్ప్రసిద్ధి వహించిన ధన్యుఁడవు. ఆ సన్యాసి నిన్నేమిచేయఁగలఁడు. నీపేరువినినంత నీదేశవాస్తవ్యులెల్ల జడియుచుందురే. అట్టినీవాతనితో వాదించి గెలుపుగొనుట యేమి యాశ్చర్యము !

అభినవ—అతఁడు సామాన్యుడుకాఁడు భట్టపాదమండనమిశ్ర నీలకంఠ భాస్కరాది పండితులనోడించి దిగ్విజయము చేయుచున్నాఁడు. నేనకాదు. వేదాబ్జబాల భాస్కరుండగు నామస్కరీంద్రునితో సమముగా వాదించు పండితుడీ మూడులోకము లలో లేఁడు.

శిష్యులు—అయ్యో యీదేశమున మనకుఁగల ప్రఖ్యాతి చెడిపోవుచున్నదే. ఇఁక మనలను మన్నించువారెవరు? భవదీయ మంత్రశక్తి యంతయు వృథగాఁ బోవలసినదే?

అభినవ—అట్లుచేసిన లోకాపవాదవహింతుము. కపటోపాయంబున లోక కంటకుండైన వీనింబరిమార్చుట యుచితము. మదీయ మంత్రసామర్థ్యంబుజూతురుగాక యతనికి శిష్యుఁడనై వెనువెంటఁదిరుగుచుఁ బ్రాణంబులంగొనెదను. ఈ మాట హృదయంబుల నుంచుఁడు.

అని యాలోచించుకొని యభినవగుప్తుండు శిష్యునితోఁగూడ శంకరాచార్యు నొద్దకరిగి దదీయపాదంబులంబడి మహాత్మా! నేనభినవగుప్తుండ. యిప్పుడు నీకుఁ బ్రియ శిష్యుండనైతి. నీ ప్రభావము లోకాతీతమైనదానిఁగా వినుచుంటిని. భవదీయదర్శనాభి లాషినై యున్నవాఁడనేఁగా కృతార్థుండనైతినని యనేక ప్రకారముల వినుతించెను.

అప్పుడాచార్యులు ఓహో అభినవగుప్తా! నీ ప్రఖ్యాతిఁజాల దూరమునుండి వినుచుంటిమే. ఏది నీవు శాక్తభాష్యము చేసితివఁట వినిపింపుమనుటయు నతండు, స్వామీ! చంద్రుఁడులేని సమయముననగదా నక్షత్రములు ప్రకాశించునవి. భవదీయ భాష్యార్కబింబము వెలుగుచుండ క్షుద్రగ్రంథాంధకారంబులు నిలువఁబడునా? నా భాష్యము దేవర చూచుటకుఁ దగదు. వినేయుని శిక్షింపుఁడని వేఁడుకొనియెను.

తృణచ్ఛన్నకూపమగు నద్దురాత్ముని కపట మెఱుంగక శంకరాచార్యులు శిష్యునిగా నంగీకరించి యతండు తోడరా మగిడి వంగవంగ కోసలాదిదేశముల కరిగి యందుగల కుమతంబుల ఖండింపుచుఁ గ్రమంబున గౌడదేశమునకుం బోయిరి.

అందుఁ బ్రసిద్ధులైన మురారిమిశ్ర ధర్మగుప్తమిశ్రోదయనాది పండితుల నద్దండవాదంబున నోడించి తనకీర్తి వారిచేఁ గొనియాడింపఁజేసెను.

అట్లు శంకరయతి సార్వభౌముండు భూమండలమెల్లఁదిరిగి కుమతకంటక లతావితానంబుల నున్మూలించి యాత్మీయయశోవిసరాంకురముల నాటించి సర్వజను లద్వైతమతావలంబకులంగావించి విరాజిల్లుచున్న సమయంబున నభినవగుప్తుండు వెను వెంటఁ దిరుగుచు తదుచ్ఛ్రియముఁ జూడనోపక రహస్యముగా నాభిచారిక హోమముఁ గావించి వైద్యులకు మానుపశక్యముకాని భగందరరోగమాయనకుఁ జనించునట్లు ప్రయోగముచేసి యామాంత్రికుం డెందేనింబోయెను.

అమ్మరునాఁడే యావ్యాధి యమ్మహాత్మునిఁ బీడింపఁ దొడంగినది. సంతత శోణితస్రావంబున కాటిపటంబు పంకిలంబగుటఁజూచి తద్వస్త్రంబు లుదుకుతోటకా చార్యులు పరితపించుచు సత్తెఱంగు పద్మపాదాదిశిష్యుల కెఱింగించెను.

అప్పుడయ్యంతేవాసులెల్ల జింతాక్రాంతస్వాంతులై విలపించుచు దద్వ్యాధిం బరిగణింపక యుపేక్షించియున్న గురువరుం బ్రార్థించి తదనుమతిఁ బెక్కండ్ర రాజ వైద్యులం దీసికొనివచ్చి చికిత్సలం జేయించిరి. కాని యించుకయు బ్రయోజనము లేక పోయినది. తద్వ్యాధికృతంబగు పరితాపంబు క్రమంబునఁ బ్రబలుచుండుటఁజూచి యాచార్యుండు సకలార్తిహరుండగు పురహరు భక్తివివశుండై స్మరించెను.

భక్తజనవత్సలుండగు వృషభరంగుండు కరుణాపూరితాంతరంగుండై తద్వ్యాధి మాన్ప నశ్వినీదేవతల నాయనయొద్ద కనిపెను. ఆ దేవవైద్యులు బ్రాహ్మణ వేషంబులతో వచ్చి తచ్ఛిష్యులచే నర్చితులై యారోగము పరీక్షించి యోహో! యీ వ్యాధి శాక్తికప్రయోగమువలనం జనించినది. చికిత్సకు సాధ్యమైనదికాదు. ప్రయోగము నకు ప్రతిప్రయోగమే వైద్యమని చెప్పి యాసురవైద్యు లరిగిరి.

అప్పుడు పద్మపాదుండు ముప్పిరిగొను కోపముతో నోహో మఱియ గురు నట్లు రోగపీడితునిఁ జేసిన పాపాత్ము నిప్పుడే ముప్పు నొందించెదఁగాక. అయ్యో! దీని ప్రవృత్తి దెలిసికొనలేక యిన్నాళ్ళుపేక్ష గావించితిగదా; ఈ సాధుశిరోమణి నిష్కారణమట్లు బాధించిన క్రూరుని శిరము నూఱువక్కలు చేయకుందునాయని చింతాక్రోధంబులు హృదయంబునవేధింప నప్పుడే నియమము వహించి స్వాభీష్టదేవత యైన నారసింహదేవుని సమంత్రముగా నారాధించెను.

తదారాధనా విశేషంబునం జేసి యమ్మరునాఁడే యభినవగుప్తుఁడారోగము చేతనే పీడింపఁబడి హతుండయ్యెను. శంకరాచార్యులును స్వస్థులైరి. బుద్ధిపూర్వకముఁగా మహాత్ముల నపకారము గావించినవాఁడు చెడిపోవక సుఖించునా!

# గౌడపాదముని దర్శనము

అట్లు రోగవిముక్తుండై శంకరాచార్య లోకనాథుడు గంగానదీ సైకతంబునఁ గూర్చుండి నిర్ఝరాద్రివాతపోతంబులు మేనికి హాయిసేయ నాత్మధ్యానము సేయుచున్న సమయంబున.

మ. శుకశిష్యుండు తపోధనుండు సకల శ్రుత్యర్థపారంగతుం
డకలంకాత్ముఁడు గౌడపాదముని హస్తాగ్రప్రదీప్తాక్ష మా
లికసోణాంబుజమమన్ భ్రమన్ భ్రమరముల్వేష్టించిరా దివ్యరుచిన్
ద్రికటప్రజ్ఞయతీశ్వరుంగ నెదు తాత్పర్యంబుదీపింపఁగన్.

అచ్చోటికి విచ్చేయుటయుంగాంచి హర్షపులకాంకితశరీరుండై యాచార్యుండు శ్రద్ధాభక్తిపూర్వకముగాలేచి తదీయ పాదపంకేరుహంబులపై వ్రాలి కన్నులకద్దికొనుచు యథావిధి నర్చించి నిటలతట ఘటితాంజలిపుటుండై యెదుర నిలువబడుటయు.

శా. క్షీరాంభోనిధివీచికానిచయనా చివ్యాంచితా పాంగ నీ
హారాశిన్ యతిశేఖరుం దడుపుచు న్స్వాహార్ద మేపారగం
భీరప్రక్రియగౌడపాద యతిరా డ్వేదండుఁడు ద్యద్భ్రద
స్ఫారశ్వేతరుచిప్రకాశముల నాశల్వెల్లఁబల్కెంగృపన్.

మ. కుతుకంబొప్ప మదిందలం తెయనఘా! గోవిందతీర్థోప దే
శితవిద్యుం బరతత్త్వ మేమరవగా సేవించునే శిష్య సం
తతితత్త్వగ్రహణేచ్ఛ నిత్యరిపులం దండింతువేశాంతి దాం
తితితిక్షాదిగుణంబులందగుదె సాధింతేసదా యోగమున్.

వ. అని యయ్యద్వైతాచార్యవర్యుండు ప్రేమానుబంధపూర్వకముగా నడుగుటయు శంకరయతీంద్రుఁడు భక్త్యుద్రేకమున గనుల నానందబాష్పంబులు గ్రమ్మ శిరంబున నంజలిపట్టి యల్లన నిట్లనియె.

ఆహా! మీరడిగినట్టి దంతయు నేల సిద్ధింపకుండెడిని? కారుణ్యాబ్ధియగు మీ కటాక్షపాత్రుండగు జంతువునకు దుర్లభం బేమియున్నది? భవదపాంగాలోకన ప్రసారమాత్రంబుననే మూగ వక్తయగుంగదా. మందుండు పండితుడగును. పాపాచారమతుండు సుకృతులలో గణింపబడును. కామాసక్తుడు నిస్పృహులలోఁ గీర్తిమంతుడగును. ఆహా! సీమాతీతమగు భవన్మాహాత్మ్యలేశ మగ్గింప నెవ్వనికిని శక్యం బగును? జాతమాత్రంబుననే విరక్తినొందిన శుకమహర్షికి ప్రియశిష్యుండవైన మహానుభావుండవు. జ్ఞానపాథోనిధివి. ఇట్టి నీపాదద్వంద్వము మదీయ నేత్రగోచరమయినది. మామకభాగధేయ మమేయమైనదని నన్నాదరింపనేల ! యని యనేక ప్రకారంబుల

బొగడిన సమ్మహాత్ముం డిట్లనియె. వత్సా! శంకర! నీవు మిగుల గుణవంతుడనియు శాంతిమతి వనియు సాధుతత్త్వవేది వనియు మత్కారికావారిజ జగద్బంధువులగు భాష్యాది ప్రబంధములఁ జెప్పి గావించినావనియు నీగురుమంతగు గోవిందతీర్థుం డెఱింగింప విని సంతసించి నిన్నుఁ జూచు తాత్పర్యముతో నరుదెంచితి. నీరచించిన గ్రంథంబుల వినిపింపుమని యడిగినంత శంకరాచార్యులు.

గీ. గరిమమాండూక్యగతములౌ గౌడపాద
కారికాభాష్యమును వేదసారభావ్య
మను విశేషించి యమ్మహామునివరునకు
జదివి వినిపించె శంకరాచార్యుడపుడు.

క. మాండూక్యభాష్యంబును
రెండును బఠియింపగా బరిస్ఫుటగతి న
ప్పండితవర్యుడు విని ముది
తుండై కరమాప్రశిష్యుతో నిట్లనియెన్.

గీ అనఘ! భవదీయభాష్యము లస్మదీయ
కారికాభావభేదము లామిజేసి
సరగవర్ధ్వరణోక్త హార్దంబునీకు
వరమొసగనన్ను ప్రోత్సాహ పరచుచూవె.

వ. కావున నీ యభీష్టం బెయ్యది తెలుపుమని యడుగుటయు శంకరుం డార్యా! శుకమహర్షి తుల్యుండగు నీవు సంతసించి ప్రత్యక్షమై వరంబడుగుమని కోరితివి. ఇంతకన్న వరంబేమియున్నది? నీవే భగవంతుడవు గదా! అయినను వలదన నేల? మదీయ మానసం బెప్పుడు పరతత్త్వచింతనమం దాసక్తి గలిగియుండునట్లను గ్రహింపుము. ఇదియే నాయభీష్టమని పలికిన సంతసించుచు గౌడపాదమహర్షి యవ్వరం బొసంగి యంతర్హితుం డయ్యెను.

పిమ్మట శంకరయతీంద్రుండా వృత్తాంతం బంతేవాసుల కెఱింగింపుచు నారాత్రి వెళ్ళించెను. అమ్మఱునాడు ప్రాతఃకాలంబున శిష్యులతోఁగూడ నయ్యతి పుంగవుండు గంగానదియందు నిత్యక్రియా కలాపములు దీర్చుకొని తత్తీరంబునఁ గూర్చుండి నిదిధ్యాసనలాలసుండైయున్న సమయంబున

సీ పుడమియంతటికి జంబూద్వీపము త్తమ
మందు భారతవర్ష మధికమందుఁ
గాశ్మీరదేశము గడుప్రశస్తము శార
దాపీఠమచ్చోటఁ దనరుకతనఁ

దచ్చారదానికాంతమునకు నాల్గు వా
కిళులొప్పు నాల్గుదిక్కుల విబుధులు
గాచుచుందురు వాని ఘనపరీక్షలఁ దేరి
సర్వజ్ఞుఁ డవ్వాసనమునెక్కు.

గీ. వలయు నితరుల కడిచేర నలవిగాదు
దాక్షిణాత్యులలో సమర్థత వహించు
పండితుఁడు లేమిఁజేసి తద్ద్వారగత క
వాటములు మూయఁబడియుండు వరుసనెపుడు.

అని యెవ్వరో చెప్పుకొన నవ్వార్త నాలించి పద్మపాదుండు గురునితో, స్వామీ ! కాశ్మీరదేశమున శారదాపీఠ మొకటి యున్నదఁట అద్దేవతామందిరమునకు నాలుగు వాకిళులు గలవఁట ? అందు దక్షిణద్వార కవాట మెప్పుడును మూయబడి యుండునఁట. సర్వజ్ఞుఁడుకానివాఁడా పీఠము దరిఁజేరలేఁడఁట. అందుఁ బెక్కండ్రు కుమతవాదులు కాచివచ్చిన పండితునిఁ బరీక్షించుచుందురఁట. అప్పీఠాధిరోహణమునకు దేవరయే సమర్థులు. వేగమ యప్పటికిం బోవలయు నిన్నిదినములీవార్త మనకేమిటికిఁ దెలియకున్నదో గదా.

అవ్వాసన మెక్కితిరేని భవదీయ దిగ్విజయయాత్రకు బూర్ణఫలంబగునని చెప్పిన విని శంకరాచార్యులు సంతసించుచు నప్పుడే కదలి శిష్యులతోఁగూడ నక్కాశ్మీరదేశమున కరిగి యందు—

శా. వేదాంతోదవనాశ్రయంబు విలస ద్విజ్ఞానరూపంబు దు
ర్వాదివ్రాతగజేంద్రకుంభదళన ప్రఖ్యాతపిస్సార వి
ద్యాదంష్ట్రాన్వయదంబు శంకరమహా హర్యక్షమేతెంచెఁ బొం
డో దూరంబుగఁ క్షుద్రజంతువుల చెండుసి ద్వైతకాంతారమున్.

అని శిష్యులు వేగపాఠులై విజయనాదంబులు సేయుచు ముందునడుచుచుండఁ గ్రమంబున శారదామందిర దక్షిణద్వారంబుఁ జేరంజని కవాటం బుద్ఘాటించి లోనఁ బ్రవేశింపఁ బ్రయత్నము చేయుచున్న సమయంబున నందున్న వాదిగణ మడ్డమువచ్చి-

శా. ఏమీ ! సంభ్రమ మిట్లుసేసెదవు నీ వెవ్వాఁడవో కార్య మిం
దేమైనంగలదేని చెప్పుమొగి నీ పీఠికి వ్యగ్రక్రియా
సామర్థ్యంబు వహింపఁ జక్కఁబడునే సత్కార్యమీవాకిలిన్
ధీమంతుం డఖిలజ్ఞుఁ డేగవలయు నీటోంట్లకున్ శక్యమే ?

వాదిగణము—మిగుల జంఝాటముతో వచ్చుచున్నావు. నీ వెవ్వఁడవు.

నీవు సర్వజ్ఞుండవైతివేని యీ తలుపులు తెఱచి లోపలికి బొమ్ము. ఇతరులకు నీదారిని రా శక్యముగాదు.

శంకరాచార్యులు—నేను సకలవిద్యలలోఁ బరీక్ష నియ్యఁగలను నాకుఁ దెలియని దేమియునులేదు. ఎవ్వనికేదానియందుఁ బాటవమోయం దడుగవచ్చును.

కాణాదమతస్థులు—నీవు సమర్థుండవైతివేని మా మతరహస్య మొక్కఁటడిగెదము చెప్పుము.

శంక—నిస్సంశయముగా నడుగవచ్చును.

కాణా—షడ్భావము లేవియో యెఱుంగుదువా ?

శంక—ద్రవ్యగుణకర్మ సామాన్య విశేషసమవాయము లారును షడ్భావములని మీమతమునఁ బేరు పెట్టుకొనిరి.

కాణా—సరియే. వినుము. సంయోగమును బొందిన పరమాణుద్వయము నుండి సూక్ష్మమైన యణుద్వయము గలిగినదనిగదా మామతము.

శంక—అగుఁ దఱువాత.

కాణా—ద్వ్యణుకాశ్రితమగు నణుత్వ మేఢిగలదో యది దేనివలన జనించుచున్నదో చెప్పుము.

శంక—చెప్పిననేమి.

కాణా—నీవు సర్వజ్ఞుండవని యొప్పుకొనియెదము.

శంక— అట్లయిన వినుండు. పరమాణుద్వయనిష్ఠమైన ద్విత్వసంఖ్యయే ద్వ్యణుకగతమైన యణుత్వమునకుఁ గారణమగుచున్నది

కాణా—నీవు సర్వజ్ఞుండవౌదువు. నీకు నమస్కారము. నీవీ పీఠ మధిష్ఠింప సమర్థుండవే.

అని కాణాదులు తొలంగినంత నైయాయికు లడ్డమువచ్చి—నీవు సర్వజ్ఞుండవని యొప్పుకొనియెదము.

కాణా—దమమతముకన్న గౌతమమతమునంగల ముక్తివిశేష మెట్టిదో చెప్పుము.

శంక—ఇదియేనా చెప్పవలసినది వినుండు. గుణసంబంధ మత్యంతనాశమగుచుండు నాకాశమువలె నొప్పుచున్నస్థితి యేడిగలదో యదియే ముక్తియని కాణాద మతసిద్ధాంతము. ఆ స్థితియానందసంవిత్తుతో గూడుకొనుట ముక్తియని గౌతమమతస్థులు చెప్పుచుందురు. ఇదియే భేదము.

నైయా—పదార్థభేదము లెట్టివి ?

శంక—కణాదమతమున ద్రవ్యగుణకర్మసామాన్యవిశేష సమవాయాభావములనిపదార్థములేని సుపిధములు గౌతమపక్షమందు బదార్థములు ప్రమాణా ప్రమేయ సంశయప్రయోజనదృష్టాంతసిద్ధాంతావయవతర్క నిర్ణయ వాదజల్ప

వితండా హేత్వాభాసచ్ఛలజాతి నిగ్రహములని పదారువిధముల నొప్పుచుండును. తత్త్వజ్ఞానమువలన మోక్షము గలుగుననియు గణాదమతంబునంబోలె నీశ్వరుండు సర్వజగన్నిమిత్తకారణభూతుండనియు గౌతమమతంబునను జెప్పఁబడియున్నది.

నైయాయికులు—స్వామీ ? నీవు శారదాపీఠారోహణ సమర్థుండవని మేమొప్పకుంటిమని గౌతమమతస్థులు తొలంగినంతఁ గపిలమతస్థు లడ్డమువచ్చి నిలునిలు మా మాటలకు నుత్తరము చెప్పి యరుగుము.

శం—మీరేమి యడిగెదరు.

సాంఖ్యులు—వినుము మూలప్రకృతి స్వతంత్రురాలై జగత్కారణమగుచున్నదా ! లేక చిదధిష్ఠితజగత్కారణమా ! చెప్పుము.

శం—ఆమూల, ప్రకృతియే - సత్త్వరజస్తమోరూపత్రిగుణాత్మకయై బహురూపభాగినియై స్వతంత్రురా లగుచున్నదని కాపిలమత సిద్ధాంతము కాని వేదాంతపక్షమందీమూలప్రకృతి యస్వతంత్రురాలని చెప్పఁబడియున్నది.

సాంఖ్యులు— భవదీయ ప్రజ్ఞాప్రభావంబు లచ్చెరువు గొల్పెడిని నీ యిచ్చ వచ్చిన ట్లరుగుము. అని సాంఖ్యులు మరలినంత బాహ్యార్థ విజ్ఞానశూన్యులై వాదములు గావింపుచు సౌత్రాంతిక వైభాషి యోగాచార్య మాధ్యమిక మనావలంబనులగు బౌద్ధు లడ్డమువచ్చి యోహో ! మాకు సదుత్తరములిచ్చి యరుగుము. సిన్నూరక పోనిచ్చువారము కాము. వారిపీరింబలె మమ్ముదాటిపోవ నీకు శక్యమా.

శం—వృథాప్రలాపములతోఁ బనిలేదు మీరడుగవలసిన యర్థములేవియో యడుగుడు.

బౌద్ధు—బాహ్యార్థ మెన్నివిధములు.

శం—రెండువిధములు సౌత్రాంతికమనియు వైభాషికమనియు.

బౌ—దానికిఁగల తారతమ్యమేమి.

శం—సౌత్రాంత్రికమతంబున వేద్యజాతమంతయు ననుమాన గమ్యముగాఁ జెప్పఁబడియున్నది. వైభాషికమతంబునఁ బ్రత్యక్ష గమ్యముగాఁ జెప్పఁబడియున్నది. రెంటిపదార్థములకు క్షణభంగురత్వము సమానమే. రెంటికిని ననుమాన గమ్యత్వాక్ష గమ్యత్వారూపమయిన భేదము గలిగియున్నది.

బౌ—మా విజ్ఞానమునకును వేదాంతవాదుల విజ్ఞానమునకును భేదమేమి యున్నదో చెప్పుము.

శంక—విజ్ఞానమునకును క్షణికత్వము బహుత్వము కలవని మీలో విజ్ఞాన వాదులు చెప్పుదురు. వేదాంతులు స్థిరమయిన జ్ఞానమొక్కటియేయని చెప్పుదు రిదియే భేదము.

అని యీరీతి సర్వశాస్త్రములయందును సర్వమతంబులయందును గిన సమత్తరములిచ్చినంత నందున్నవారెల్ల నయ్యాచార్యుం బూజించి, మహాత్మా !

నీకు సాటియెవ్వరును లేరు. సర్వమతములు నీకే తెలియును. నీయెఱుంగనిది యొక్కటియు లేదు. సర్వజ్ఞుండను బిరుదు నీకొక్కనికే చెల్లును. శారదాపీఠ మెక్క నీవొక్కండవే సమర్థుండవని యనేక ప్రకారముల స్తోత్రములుచేయుచు వాదులందరు తొలంగినంత నమ్మహాత్ముండు శిష్యులెల్ల జయజయశబ్దములు గావింపుచుండ మరియు –

సీ. చిత్రభానుండాత పత్రంబు వహియింపఁ
    కోటకుంతలరి పాదుకలువట్ట
  మోదమొప్పవిరించి పాదభానుమరీచు
    లియగదఁజాచు చామరములిడగ
  నానందగిరి యుశుద్ధాత్ముండు వైత్రసూ
    త్రవృత్తిముంపరటవా బిరుదులు సేయ
  కృష్ణదర్శన శుద్ధ కీర్తులు తోరణ
    దంతములుప్పాని చెంతలనటింప.

గీ. చిద్విలాసాది శిష్య ప్రశిష్యకోటి
  యనుసరింపఁగ జయజయ ధ్వానలతోడఁ
  బద్మపాదుని కెదండఁ బట్టికొనుచుఁ
  గదలె యతినేత శారదా సదనమునకు.

క. అరితిభద్రపీఠం
  బారోహణమాచరింప దరుగంగఁగని యా
  శారద యిట్లనిపలికె శ
  రీర విహీనోక్తినతిప రిస్ఫుటలీలన్.

సంయమీంద్రా! నీవు పూర్వమే సర్వవిద్యలయందును పరీక్షింపఁబడితివి. నీయందు సర్వజ్ఞత్వము పరిపూర్ణముగానున్నది. లేకున్న విరించి రూపాంతరుండగు మండనమిశ్రుండు నీకుశిష్యుం డెట్లగును? అది యట్లుండనిమ్ము. ఏతత్పీఠాధిరోహణము నకు సర్వజ్ఞత్వమే ప్రధానముకాదు. పిసుమాత్మశుద్ధియుం గావలసియున్నది. అది నీ యందుఁ గలదో లేదో క్షణకాలము విచారించుకొని పీఠమెక్కుము.

నీవు యతిధర్మనిష్ఠుండవయ్యు గామకలారహస్య గ్రహణవ్యాసక్తయి యంగ నాశతముతో గ్రీడించితివి. యాకళంకమును మరచి యిపుడీ సింహాసనమెక్కుట కుద్యోగపడుచుంటివి. చాలుచాలు నిలునిలుమని పలికిన విని యెల్లరు నద్భుతపడిరి. అప్పుడు శంకరాచార్యులు అంబా! నేను జనించినదిమొదలు ఈశరీరముచేత నట్టికిల్బిష మేమియుఁ జేయలేదని నిశ్చయముగాఁ జెప్పఁగలను. దేహాంతరము సంశ్రయమున గావించిన క్రీడాకళంకము దీనినేలయంటెడిని? అది మఱియొక శరీరము కాదా? చిత్తవికారంబున బాపంబు దీనికిం సంక్రమించునంటివేని అట్టి వికారము నా మదికి

లేదుగదా ? కావునందదంగనా సంగమ కళంకము నాకు దోషమునకుగాదని శాస్త్ర ప్రమాణము జూపగలను. ఇప్పుడేమి చెప్పెదవని యడిగిన విని యప్పలుకు వెలంది సమ్మతించినటుల ప్రశంసింపుచు నేమియు బలుకక యూరకుండెను.

అటుల సరస్వతియు బండితులును గొనియాడుచు పీఠారోహమున కంగీకరించి రంత శంకరాచార్యులు వినోదముగ సర్వజ్ఞపీఠారోహణము గావించి గార్గ్యచేతను కహోళప్రముఖులగు మునులచేత గొనియాడబడిన యాజ్ఞవల్క్యుండుబోలె మిక్కిలి విరాజిల్లె. నట్టిసమయంబున –

క. గురునాథు శిరముపైని
దరవరులంబరమునుండి సంతానసుమో
త్కరవర్షంబులు గురిపిం
చిరి దుందుభిరవములపుడు చెల్వుగ మ్రోయన్.

అటుల శంకరాచార్యులు స్వాభిమానమునకుగాక స్వమతాధిక్యతకొరకు సర్వజ్ఞపీఠం బధిష్టించి యందు గొన్ని దినంబులుండి తన శిష్యులలో నొకనిని తత్పీఠాధికారిగా నొనరించి యచ్చటనుండి బదరికారణ్యమునకు జనియెను.

క. చని యయ్యతిపతి బదరీ
వనమున దపమాచరించు బ్రహ్మర్షులకున్
దనసూత్రభాష్యమల్లన
వినిపించుచు గొన్నినాళ్లు వేగించెనటన్.

గీ. ఆపదుద్ధారక మఘ సంహారకంబు
తాపవారక మర్త్య మందారకంబు
జేరె జనితారకంబు కేదారకంబు
శిష్యసంయుక్తుడై యతిశేఖరుండు.

మ. అతిశీతంబున నార్తినొందుచుఁ దదీయచ్ఛాత్రులచ్చో సహా
యతివర్యా! చలి నిల్వలేమిచట దేహంబు ల్వణకెం బ్రతీ
కతతుల్మొద్దగుచున్న విప్పగదయా! కావంగదే శీత బా
ధితులన్మమ్ము దయానిధీ! యనుచుఁ బ్రార్థింపంగృపార్ద్రాత్ముఁడై.

క. సకల జగదీశశిశు చం
ద్రకలా శేఖరు భజించి తద్ధరనా శీ
ర్థకర ప్రముఖుడుష్ణో
దకముం బ్రార్థించె శిష్య తతిరక్షింపన్.

గీ. చంద్రధరుఁ డాత్మపదవారిజములనుండి
కలుగఁజేసెను తప్తోదక స్రవంతి
జరగఁ జాటింపుచున్న దిప్పటికి గురుని
మహిమనటదప్తతో యయన్ లహరియొకటి.

తచ్ఛిష్యులెల్ల దప్తోదకంబని గృతాపగాహులయి శీతబాధం బొరయక కృత కృత్యులయి జగద్గురు సనేక ప్రకారముల నగ్గించిరటుల శంకరయతి సార్వభౌముండు ముప్పది రెండేడులలో బుధమియంతయుం గ్రుమ్మరి కుమతవాదులనోడించి యద్వైత జ్ఞానరత్నంబు లెల్లెడ వెదజల్లి సుజ్ఞాన ప్రతిబోధకములగు ప్రబంధములు వేనవేలు రచించి సురేశపద్మపాదహస్తామలక తోటకాచార్యుల నలువుర నాలుగు దెసలం బొలు పొందు శృంగేరి ప్రముఖ మఠంబుల పీఠాధిపతులుగ నొనరించి కృతార్థుండయి కేదా రంబున మహామునులతో గొన్ని దినములు సద్గోష్ఠి గాలక్షేపము జేయుచుండె. మరియు,

గీ. స్వహితపరుడుగాక సన్యాసియై చిన్న
తనమునందె సర్వ ధనమువిడచి
దెసలదిరిగి జ్ఞానరసము నిండించిన
యతడు దేవుడనుట యబ్బురంబె.

సీ. కావించెఁగ్రైవల్య ఘంటాపథములైన
భాషాదిభూరి ప్రబంధములను
వెలయించె నద్వైత విద్యాపినూత్న మా
ర్గంబువిశిష్యకంటకంబుగాగ
స్థాపించె బుధమి నష్టాదశపీఠంబు
లందాదిశక్తుల బొందుపడఁగ
వాదించెబౌద్ధ చార్వాకాదికుమత వా
దులటోడ దుష్క్రియల్ దొలఁగునట్లు

గీ. కీర్తిమీరఁగ నద్భుత క్రీడితముల
వెరగుపడఁజేసి దిక్కులఁ బరమ బోధ
నావులఁ గృతార్థులుగజేసె యతికినింక
జేయఁ దగినట్టి పనులేమొ చెప్పరయ్య.

అట్లు ద్వాత్రింశత్సంవరంబులు పరిపూర్తినొందిన యనంతరంబ.

చ. హరి పరమేష్ఠి నాకవిభుఁ డాదిగగల్గు సమస్తదేవతా
వరులు వియచ్చరుల్ ప్రమథ వారము సిద్ధులువచ్చి యప్పు డం
బరమురురత్న కాంచన విమానపరిష్కృతమై యొసంగ నిఁ
ర్భరతరుపుష్పవృష్టి బెలుచం గురిపించుచుఁ బల్కిరల్లనన్.

ఉ. ఓపరమేశ! నీవు భువనోదయహేతువ వాదిమూర్తి వీ
వేపనికై ధరియిత్రి నుదయించితివో యదితీరె నింక రా
వే? పరితోష మొప్ప భవదీయ జగంబు నలంకరింపవే
తాపసవంద్య! మాకుఁ బ్రమదం బొనరింపవె తొంటిరూపునన్.

క. అనివేల్పులు ప్రార్థించిన
విని యతి నిజ భువనమునకు విచ్చేయఁదలం
చినయంతఁ జెంతనిలచెన్
దనవృషభము పార్శ్వభూషిత ప్రమథంబై.

శా. ఇంద్రోపేంద్ర దిగింద్ర ముఖ్యసురలెంతే భక్తినగ్గింపగా
సాంద్రంబై దివిదేవయాన చయముల్పమ్మర్థముం జేయ బు
ష్పేంద్రంబల్లన నెక్కి శంకరుఁడు వాణీశుండు గేలీ యొయ
గింద్రుల్ గొల్వఁగఁజేరె రాజితమహీధ్రేంద్రంబు పూర్వాకృతిన్.

సీ. మంగళంబద్రిజా మహిళాకు చాలిప్త
వరచందనాంచిత వక్షునకును
జయమంగళము నసురకోటి కిరీట
ఘనమణీరుచిరాఘ్రి కమలునకును
శుభమంగళము బాలశుభ్రభానుకళా వి
శోభితపటుజటా జూటునకును
వరమంగళముఁరూప్య ధరహారడి డీర
ఘనసారవరశుభ్ర గాత్రునకును.

గీ. భవ్యమంగళమఖిల తాపస సమాజ
మానసాంభోరుహసహస్ర భానునకును
దివ్యమంగళమమల భూతిస్ఫురత్స
మగ్రమూర్తికిఁ గర్పూర మంగళంబు.

అని యెసంగించి మణిసిద్ధుం డప్పుడు వేళయతిక్రమించుటయు గథ చెప్పుట చాలించి పరమానందకందళిత హృదయారవిందుండైయున్న శిష్యునితో గూడం గ్రమంబున నవ్వలిమజిలీ జేరెను.

ఇది శ్రీమధిర సుబ్బనదీక్షితకవి రచితమైన కాశీయాత్రా
చరిత్రమను మహాప్రబంధమున శంకరాచార్యచరిత్రము
సప్తమోల్లాసము సంపూర్ణము
శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

## 55 వ మజిలీ

## అష్టమోల్లాసము

క. శ్రీకళ్యాణ నికేతన
  లోకానీకస్తుతా ఘలుంటాకాభి
  ఖ్యాకలిత విబుధజన ర
  క్షాకల్పక సుకృతిశరణ కరుణాభరణా.

దేవా! యవధరింపు మట్లమ్మణి సిద్ధుండు శిష్యునకు శ్రీ శంకరాచార్య చారిత్రమంతయు నెఱింగించి వెండియు నిట్లనియె. వత్సా! యమ్మహాత్ముని గురించి చెప్పికొనెడు కథావిశేషములు కొన్ని గిలవని గ్రంథస్థములు కాకపోయినను లోకంబున ప్రఖ్యాతముగా జెప్పుకొనుచుండిరి. వారినెల్ల వివరింతు సావధాన మనస్కుండవై యాకర్ణింపుము.

### మహాశక్తిని గురించి జరిగిన కథ

శ్రీ శంకరాచార్యుండు శాక్తమత ఖండనము గావించిన కొన్ని దినంబుల కొకనాడు శిష్యులతో గూడుకొని యొక యరణ్యమార్గంబున నరుగుచుండెను. యా మానవశేష దివసంబున నడుచుచుండెడి యాశిష్యబృందమునకు గమన శ్రమవాయ హాయిగా నప్పుడొక గాలి వీవ దొడంగినది. అందులకు సంతసించుచు నయ్యంతేవాసులెల్ల గురుతల్లజుని పాదపల్లవముల ననుసరించి నడుచుచున్నంత నమ్మందమారుతంబు క్రమ్మక్రమంబున నభివృద్ధినొందుచు నాకులు రాలునట్లు కొమ్మలు విరుగునట్లు మొదళ్లు విడలునట్లు కొండ లెగురునట్లు విసరం దొడంగినది. శంకర శిష్యులెల్లరు నయ్యాంధ ప్రళయమునకు వెరచుచుం గొంతసేపు ధూళి కలుషితములగు నేత్రంబుల జేతుల గప్పికొని క్రమాకుల మూలముల నొదిగియుండియు గొమ్మలు విరిగి మీదబడిన జడియుచు బయళ్లకు బోవుచు నందు నెదురుగాలిం గాళ్లు నిలువలేక కొట్టికొని పోవుచుం జెట్టుమొదళ్లం గౌగలించుకొని [illegible] ప్రయాసంబుగానక వానితోగూడా దూదిపింజల

పై నెగిరిపోవుచు 'హా! శంకరా! గురువరా! రక్షింపుము. రక్షింపుము.' అని మొర లిడ దొడంగిరి.

శిష్యజనుల పరిదేవనము జూచియు వారింపనోపక విచారించుచు శంకరుండు తానును ఝంఝూవాత ఘాతంబున శిష్యజనుల కెనమై పెద్దదూరము కొట్టికొనిపోయెను. అతండు వంగి నేలంట బండికొనుచు జేతుఁకు దొరకిన వానిం గట్టిగ బట్టుకొనుచు నానక వారితోగూడ నెగసిపోవుచు నీరీతి బోయిపోయి యొకచో సజలంబైన నేలం బడి యాబురదలో దన రెండుపాదంబులను మోకాళ్ళవరకుందిగబడుటయు గదలక చేతులా కర్దముపైనాని నిలువంబడి యుండెను. ఎంత వడిగా విసరినను వదముడి యమ్మహాత్మునందుండి యించుకయు గదల్పలేకపోయెను.

సీ. కనకామలకవృష్టి గలిగించి విప్రకా
మినినెవ్వ బాపిన మేటితనము
పూర్ణానదిని బెంకి బొంతకు రప్పించి
జనుల మెప్పించిన సాహసంబు
మూకాంబికాగేహమున గతాసునిభూసు
రార్భకు బ్రతికించి నట్టిశక్తి
మిన్నంటఁ బొంగి భూమినిముంచునర్మదా
ధునిఁ గుంభమునఁ నిమిడ్చినమహత్వ.

గీ. మెందదంగెనొ యేమూల కేగెనొక్కొ
భవమహా పంకమునఁగూరఁ బడెడుజనుని
పగిదిశంకరు డమ్మహా పంకమందు
గాలు గదలింపలేక చీకాకు నొందె.

అహా! కాలంబెంత వారినైన వగ్గను జేసికొనక మానదు. క్రమంబున నాగాలి చల్లారినవెనుక నమ్మహాత్ముండా కర్దమమునుండి యీవలకు రావలయునని యెంతయో ప్రయత్నము జేసెను కాని లాభమేమియు లేకపోయినది. కరపాదంబులు లేపనికిని బ్రసరింపఁజేయుటకు శక్తియుడిగినది. క్రమంబునఁ గాయంబా బురదలోనికిఁ దిగిపోవ దొడంగినది. బెండుపడిమేనం బ్రాణములు నిలుచుట గష్టముగా దోచినది. అప్పుడమ్మహాత్ముండాలోచించి యోహో! మోహావేశంబునంజేసి నేనిట్టి యిక్కట్టు జెందితిని. కానిచో నిలయంబునఁగాక నెన్నఁడైన మనుష్యుల నెగరజిమ్మెడు తెమ్మెరలు వీచునా? మదీయాంతస్సారమిట్లు బెండుపడుట చిత్రముగానున్నదే. అక్కటా! నే నెరియక నేదేవతకైన నపకారము గావించితినాయేమి? యూరక యిట్టి యుపద్రవము తటస్థించునా యని యాప్రాజ్ఞుండు పెక్కువిధంబులఁ దలంచుచుఁ గన్నులు మూసికొని చేటోముఖాలంబునఁ గిరించి,

గీ. తెలియకెవ్వరినైన నిందించియిట్టి
వెతలఁగాంచితి నేనిసద్వృత్తినిపుడు
మన్నికొనియెద నా బుద్ధిమాంద్యమెల్ల
వేగ రక్షింపరయ్యయో వేల్పులార!

అని ప్రార్థించుచున్న సమయంబున నాప్రాంతమందు నూరేండ్లప్రాయము గలిగి శరీరమంతయు ముడుతలు వారినను పండుటాకు వంటి కాంతితో నొప్పుచు వింతశోభ సంపాదింపఁ జనుకీనాలంబులం బోలె నొప్పారు నెరసిన వెండ్రుకలు ధమ్మిల్లముగా దిద్దికొని సుందర ఫాలంబునఁ జంద్రవంకంబోని కుంకుమ రేఖందీర్చి కుడిచేత దండం బూతగాఁబూని నిలువంబడి రెండవచేయి యళికంబున సూర్యకిరణ ప్రసారమున కడ్డముగానిడి యొకవృద్ధాంగన అయ్యా! దారిఁ దెలియక యిక్కడఁ జిక్కులుపడుచుంటిని. సన్మార్గమేదైన మీకుఁ దెలిసినచో వక్కాణింపుదురాయని బురదలోఁ జిక్కికొనియున్న శంకరాచార్యు గూర్చి పలికినది.

ఆ ధ్వని విని యతం డబ్బురపాటుతోఁ గన్నులందెరచి యాప్రాంతమందు దండమూతగాఁబూని నిలువంబడియున్న జరాంగనం గాంచి విస్మయము జెందుచు అవ్వా! నేను దారి తెలియకయేవచ్చి యీ బురదలోఁ జిక్కుకొనియుంటి దీనిందాటివచ్చుటకు శక్తిలేకున్నది. నీ దండము గొంచెమూత యిత్తువేని దీనివెరలి రాఁగలనేమోయని యాసగలుగుచున్నదని పలికిన నవ్వృద్ధ యిట్లనియె. సౌమ్యా! నీ మాటలు వినఁ గడు చిత్రముగానున్నది నేనీదండమం దిచ్చినంతనే లేని శక్తి యెట్లువచ్చెడిని. అదియునుంగాక నేను నూరేండ్లదాన నీవు ప్రాయములోనుంటివి. శక్తిలేదని చెప్పినను నీవంటివారు పంకమునుండి యుద్ధరింప సమర్థులుకాని మేమట్టివారముకాము. మాబోటులున్నను లేనివారలలోనే లెక్క. నీయుక్తప్రాయమట్లేయున్నది గదా! పోనిమ్ము నాకీవితర్కమేల మంచిమార్గ మెరింగియుండిన వక్కాణింపుము లేకున్న నాకుఁదోచిన దారింబడిపోయెదనని పలికినంత మేనంబులక లుద్భవిల్ల నాచార్యవర్యుండు చేతులెత్తి మ్రొక్కుచు దేవీ! నీవాదిశక్తివని తెలిసికొంటి నిన్ను లేదని వాదించిన యపరాధంబున కీశిక్ష విధించితివికాఁబోలు.

శా. దేవీ! పురాణశక్తివి భవద్దివ్యప్రభావంబు మా
యా విష్టాత్మ గ్రహింపనేర కటుల న్యక్ఖాంతి వర్తించితిన్
గావంగాఁదగు నీదుభక్తుఁగరుణన్ గాయత్రి సావిత్రియున్
నీవె యాత్మవటంచు నేడెరిగితిన్ నిక్కంబు గాత్యాయనీ.

అని స్తుతియించినంత సంతసించుచు నద్దేవి దివ్యరూపంబుధరించి యయ్యతిశేఖరు నాజంబాలంబునుండి లేవనెత్తి యొదలు నివురుచు నల్లన నిట్లనియె.

వత్సా! శంకర! నీవుత్తమ తత్వజ్ఞాన సంపన్నుండవగుదువు పరమార్థోప

దేశంబున లోకులలెల్లఁ గృతార్థులం గావింపుచుంటివి. నిన్నుఁబోలిన విజ్ఞాతలేఁడు మెప్పువచ్చినది. నీకుమాత్రప్రభావం బెరిగింపం దలంచి యిట్టిమాయఁ గల్పించితి. హరి హరాదులైన మదీయ మాయామోహితులై నాప్రభావంబు దెలిసికొనలేరు. ఇందులకొక యితిహాసముగల దాకర్ణింపుము.

## త్రిమూర్తుల కలహము కథ

తొల్లి నారదుం డొకనాఁడు బ్రహ్మలోకమునకుంబోయి పరమేష్ఠిచే సన్మానింపఁబడి సుఖాసనాసీనుండైయున్న సమయంబున విరించి నారదా! యెందుండివచ్చుచుంటివి విశేషములేవేని గలిగిన వక్కాణింపు ముబుసుపోకున్నదని యడిగిన నక్కమలాసనుం డించుక యాలోచించి యిట్లనియె తండ్రీ! సకలజగన్నిర్మాణ దక్షుండవగు నీకును నుబుసుపోకుండునా! అయినను నాయెఱింగినంత వక్కాణించి పని గలిగించెద నాలింపుము. నిన్ననాకములో నొకసభ జరిగినది. అందు బృందారకులను తాపసులకు త్రిమూర్తుల తారతమ్యము గురించి పెద్దగా వివాదము సంప్రాప్తించినది. అందరి సారాంశము దేవర కెఱింగింప నాడెందంబు సందియమందుచున్నది.

తండ్రికైన యవమానము కుమారునికిఁగాదా? ముఖస్తుతి వచనములచే దేవర ననేక పర్యాయములు గొనియాడినవారే వేరొక రీతిపలికిన నేమనందగునని యేమేమో సంభాషించిన నాలించి విరించి యించుక యలుక నభినయించుచు పీఠామునికిట్లనియె. పుత్రా! యథార్థము జెప్పుటకు సందియమందెదవేల? ఏమేమి ప్రసంగము వచ్చినది. మాలోనెవ్వఁ డధికుండని నిశ్చయించిరి. అందుఁ బెద్దలెవ్వరైనఁ గలిగియుండిరా యని యడిగిన లజ్జాభయంబు లభినయించుచు దేవముని యిట్లనియె తండ్రీ! నీ యొద్దనిఁక దాఁచనేల అందుండవలసినవా రందరు నుండిరి చేయవలసిన ప్రసంగమంతయుం జేసిరి. అప్పుడు హరిహరుల తారతమ్యము గురించి ప్రసంగించిరికాని నీమాట యించుకయుం దేరైరి. ఆ తరినుత్తలమందు చిత్తముతోనే నూరకొనలేక హరిహరులకన్న నీవే యధికుండవని నొక్కివక్కాణించితిని.

నా మాటలువిని యందున్నవారందరు పకపక నవ్విరి. లజ్జావిషాదమేదుర హృదయుండనై యప్పుడేమియు మాటాడక తత్కృతావమానంబు వదనంబునం బొడగట్టుచుండ నట్టె లేచియందరి విశేషమేమి యేనిం గలదేమోయని యాసభముగియకుండ నీయొద్ద కరుదెంచితిని. అక్కటా! నిన్ను హరిహరులతో సమానుండనియు జెప్పరాదట. నేనిదివరకు త్రిమూర్తులు సమానులనియే తలంచుచుంటిని అందరి నిక్కువమేదియో వక్కాణించి నాసందియము దీర్పుమని ప్రార్థించిన విని కటమ్ములదర రోమహర్షమ్ములఁ బొగలెగయ భ్రుకుటీ వికటముఖుండై చతుర్ముఖుం డిట్లనియె.

నారదా! దేవసభలో దేవతలు మునులు నేక వాక్యముగా నన్నధమునిగా నెన్నిరేమి? అగునగు నతిపరిచయంబున నవజ్ఞత వచ్చునను న్యాయంబేలతప్పును.

నేను దేవతలకును మునులకు నాపదలు వచ్చినప్పుడు సులభముగా దర్శనమిచ్చి వారి మొర లాలించువాఁడనులే! దానంజేసి వారికట్టిబుద్ధి పుట్టినది. కానిమ్ము నాస్వామిత్వ లతో వారికేమిపని యన్నది. నా ప్రసంగమేల తేవలయును. ఆ మాట యడుగక పోయితివా? యని పలికిన సురయతి. తండ్రీ? నేనెంతవాడను సేయక యేమియు నడుగక యింతదూరము వచ్చితినా! నీ యవమానము నా యవమానముకాదా! అన్నిటి కిని సమాధానము చెప్పఁజాలియే విషాదముగలిగినదని మరియుఁ దదీయరోషాగ్ని నింధనాయమానంబులగు వచనంబులచేఁ బ్రజ్వరిల్లంజేసెను.

అప్పుడు రౌద్రావేశముతో వాణీశుండు నారదా! నీవు మరలఁబోయి దేవత లతో హరిహరులకన్న నేన యధికుండననియు మదీయ సామర్థ్యము చూడవలయునని కోరిక కలిగియుండినచోఁ జూపింతుననియు మునులు వినఁ జెప్పిరమ్ము. నేను సృష్టి జేయనిచో హరిహరులేమిచేయుదురో చూతము. గోడయుండినగదా రంగులు వేయు దురు. మందమతులన్నంతనే నేనల్పుండ నగుదునాయని నుడివిన విని మరల నమర ముని యిట్లనియె. తండ్రీ! నీతో చెప్పనేమిటికని యూరకొంటిని. కాని యట్టి తాత్ప ర్యము వైకుంఠునకు స్వైరము గలిగియున్నదనుమీ? ఒకనాఁడు నాతోఁ దనయభి ప్రాయము వెల్లడించెను. అనుటయు నట్లనూతి యేమి? వాసుదేవుడను దనకంటె నేనల్పుఁడనని యభిప్రాయమున్నదా? దేవతలు తెలియని మూఢులనిన సందురుగాక సర్వజ్ఞుండైన దామోదరునకు స్వాతిశయబుద్ధి యేమిటికిఁ గలుగవలయును? ఏమని ప్రశ్నించుకొనియెనో చెప్పుమని యడిగిన నారదుం డిట్లనియె

లోకేశా! నేనీనడుమ వైకుంఠంబునకుంబోయి రెండుమూడునాళలందుండి వాసుదేవు నారాధించితిని. నాకిపుడునకు నాలెన్నాళ్ళు పెక్కు గోష్ఠులు వచ్చినవి. ఆ కథ లలో నీప్రస్తావముదెచ్చి బ్రహ్మ యిట్లు చెప్పుచున్నాడని చెప్పితిని. అప్పుడయ్యచ్యు తుండు పెదవి విరచుచు బాఁడేమియెరుంగు సురజ్యేష్ఠునకే విషయము దెలియదని పలి కెను. ఆ మాటలలో స్వాతిశయ బుద్ధియు బరనిందావ్యాపారము సూచించు చున్నది. అప్పుడే నా మదికిఁ గష్టముగాఁ దోచినదికాని యంతవానిముందర నేమనిన నేమి యపరాధమో యని వెరచితిని. నీవు సురలలో నధికుండవేగాని తమతో సమమైన వాడవుకావని వారి యభిప్రాయము. వారికే యట్టుండ దేవతలు మునులు నేమందురు. వారిమీద నలిగిన నేమి లాభము. అలిగిన జతుర్భుజునిపై నలిగి పంతము చెల్లించు కొనుమని పలికెను.

అప్పు డప్పరమేష్ఠి వత్సా! నీవనినట్లే కావించెద. నీవిప్పుడు నీవు మరల వైకుంఠమునకుంబోయి నీమాటలువిని పద్మగర్భుండు బాల చింతించుచున్నాడనియు నీకంటె నేనేమిట దక్కువవాడనని పలికితివనియు నట్టి యభిప్రాయ ముండినం జూచు కొనవచ్చుననియు నామాటగా జెప్పిరమ్ము. మఱియు నీయట్టివారి కిట్టి యల్పబుద్ధులు

తగవని బోధింపుము ? పొమ్మనిపలికి చింతాకులస్వాంతుండై శతానందు దంతః పురమునకు బోయెను.

అప్పుడు దిగ్విజయంతి తన యుద్యమము కొనసాగుచున్నది గదా యని యంతరంగమున సహర్షించుచు హిరణ్యగర్భుని వీడ్కొని యప్పుడ వైకుంఠమునకుం బోయి ద్వారపాలురవలన దనరాక నారాయణున కెఱింగించుటయు కమ్మహాత్ముండు సంతోషింపుచు సవినయముగా నద్దేవమునింతోడిదేర నేకాంతభక్తులం బనిచెను. వా రత్యంత భయభక్తి విశ్వాసములతో నారదుం దోడ్కొనిపోయి వైకుంఠమున కాసన్న ప్రదేశమున నిడిన పీఠంబుపై గూర్చుండబెట్టిరి.

అప్పుడు విష్ణుండు మందహాస శోభిత ముఖుండై మునీంద్రా ! ఇప్పు డెందుండి వచ్చుచుంటివి. ఎవ్వరికైనం గయ్యంబులుపెట్టి కడుపు నిండించుకొనుచుంటివా విశేషము లేమియని యడిగిన నవ్వుచు నారదు డిట్లనియె. మహాత్మా ? అల్లుల పోట్లాటవలన నాయాకలి యేమి తీరెడిని. దేవసభలో మొన్న సురలకును మునులకును గొంచెము సంవాదము జరిగినది. అక్కలహంబు నాపొట్ట కేమూలకును జాలినది కాదు. ఆ జగడమువిని యందుండి బ్రహ్మలోకమునకుంబోయి చతురాననుం దర్శించి యిప్పు డిచ్చటికి వచ్చితిని. ఇదియే విశేషములని చెప్పిన నప్పుండరీకాంక్షుం డిట్లనియె. నారదా ! మునులకు సురలకు నేమిటికి సంవాదము జరిగినది. అత్తెరం గెఱింగింపు మనుటయు నమ్ముని శిఖామణి దేవా ! మరేమిటికిగాదు. హరిహర హిరణ్యగర్భులలో నెవ్వ రధికుండని ప్రశంస వచ్చినది అందుల గురించి కలహము వచ్చినదని చెప్పెను. ఆ మాటవిని రమానాథుండు. యతీంద్రా ! అయ్యాలగములో దుదకెవ్వ రధికులని నిశ్చయించిరి సంవాద మేరీతి జరిగినదో నుడువుమనుటయు నతం డిట్లనియె.

దేవా ! నుడువుట కేమియున్నది. మునులందరు శివుండధికుం డనిరి. సుర లందరు దేవరయే యధికుండనిరి. బ్రహ్మ యిరువురకన్న నొకయంతరము తక్కువ వాడని యందరుంబల్కిరి. మునులతో వాదింప దేవతలకు సాధ్యము గలదా ? పెద్ద తడవు ప్రసంగించి చివర కేమియు నోరు మెదల్ప లేక సమాధానమును జెందక యూరకొనిరి. ఇదియే యచ్చట జరిగిన విశేషములని చెప్పుటయు గలక జెందిన డెందముతో ముకుందుం డిట్లనియె.

నారదా ! మునులకింత వివేకము లేకపోయినదేమి ? తత్త్వజ్ఞాన సంపన్ను లును బ్రమాదము జెందుదురా ! శివునికన్న నన్నల్పునిగా దలంచిరా కానిమ్ము. అట్లనిన మునుల నామంబులేమియో వ్రాకువ్వము. సురలు శాపంబులకు వెరచి తగిన సమాధానము చెప్పక యూరకొనిరి. కాని మునుల పొటి తెలివితేటలు వేల్పులకు గలిగియున్నవి. వారు కడు బుద్ధిమంతులు పనిపాటలేని ఛాందసులతో నూరక వాదించి

కాలహరణము చేసికొన నేలయని మాటలాడితి నారసియు దలంచెదను. సమయము రాక పోవునా ! మునులు నాయొద్దకు రాకపోవుదురాయని యసూయా కలుషితమతియై పలికిన విని నారదుండు వాసుదేవున కిట్లనియె.

అచ్యుతా ! జగత్కారణులగు త్రిమూర్తుల ప్రభావము దెలిసికొనుటకు మాబోట్లకు శక్యమగునా, ఏదో మాకు దోచినటుల పక్కాణించితిమి. మునులయెడ మీరును సురలయెడ శివుండు నిరువురయెడ బరమేష్ఠియు నలుక బూనియున్నచో మా బ్రతుకులెటుల సాగును. బ్రహ్మ మీయిరువురకన్న దన్ను దక్కువవాడని సురలును మునులును బలికి మిమ్మెక్కుడుగా బ్రశంసించిరని నావలన విని తగని కోపము బూని వారినెల్ల బరిభవింతునని శపథముజేసి యున్నవాడు. మీ యిరువురకన్నదానే ప్రధాన దేవతయని వాదించి గెలువగొనగలడట. అంత నప్పుడు నాయెదుట దానధికుండను ప్రమాణవచనము లెన్నియేని జదివెను. వేదమంతయు దనపరముగా నున్నదని యర్థము జెప్పెను.

మీ మహిమ మీకుగాక యొరులకు దెలియ శక్యమగునా యని పలికిన విని కమలనాభుండు మఱియుం బలుకుచు, నారదా ! మదీయ నాభికమలంబున బొడమి కర్తవ్యమెఱుంగక చింతించుచున్న బ్రహ్మకు నేను బ్రత్యక్షమై పుత్రవాత్సల్యముతో సృష్టి క్రియా సామర్థ్యము గలుగజేసితి. నా నాభికమలంబున హిరణ్యగర్భుండు నాకంటె నధికుండనని గర్వపడిన నేమనదగినది ఆ మాటలు విని నీవెట్లు తగిన సమాధానము జెప్పక యూరకొంటివి.

అన్నన్నా ! కాలమెట్టి విపరీతబుద్ధులు పుట్టించును. తపసులు నన్నెక్కుడని పలికిరనివిని యాసు జెందనేమి ? అల్పప్రభావసజ్జు లట్లే వచించుదురు. నారదా ! నీవుపోయి బ్రహ్మతో నామాటగా బోధింపుము. నీయందు బుత్రవాత్సల్యముంచి గాచుచున్నది. యెఱుంగక నాకంటె నధికుండనని గరువము జెందుచున్నవాడవట. మత్పరాక్రమము చవిచూడ నభిలాష గలిగియుండిన నట్లు తలంపుము. వద్దు వద్దు నీ యధికారమునకు దగినట్లు మాట్లాడుమని చెప్పరమ్మని పలికిన నంతరంగం బుప్పొంగ సంగాశనుం డిట్లనియె. స్వామీ ! బ్రహ్మ మీ యనుగ్రహపాత్రుండని యెల్లర నెఱింగినదే. తాను సర్వాధికుండనని గర్వపడిన లోకులు సమ్మతింతురా ! నేనామాట లిదివరకే యాయనతో జెప్పితిని. అమాట యటుండనిండు. హరిహర తారతమ్యము గురించి యేవిద్వాంసులు శంకాస్పదులగుచున్నారు. పాపభయంబున మునులకు వెరచి సుర లూరకొనిరని మీ రంటిరికాని మునులుచెప్పిన ప్రమాణవచనములు వినిన బాలునకైన శివుం డధికుండని తెలియకమానదు. మీ విషయమై వాదించునాడు విద్యాబలశూన్యులగుట దగిన ప్రమాణము చూపలేకపోయిరి. మీయొద్ద దాచనేల అప్పటందరికి మునుల వాక్యములయందు విశ్వాసము గలిగినదిసుండీ !

అప్పుడు నేను దేవర భక్తుండనగుట నూరకొనలేక సురలకు రోష మెక్కించి

వాదమునకు బురికొలిపితిని. కాని వారు మదీయ భక్తి విశ్వాసములు గ్రహింపనేరక
కడుపు నింపించుకొనుటకై యత్నించుచున్నానని తలంచి పెదవి గదపక మునివచనముల
కగ్గపడిరి. దేవా! వాడి యల్పమతియైనచో మత్ప్రాబల్యము తగ్గునా? యనుటయు
నా శ్యామలాంగః ప్రజ్వరిల్లు నగ్నిహోత్రుండువోలె మండుచు నారాయణుండు పీఠము
నుండి లేచి నిలువంబడి చక్రము గిరగిరం ద్రిప్పుచు నిట్లనియె.

నారదా! అప్పుడు నేను విశ్వరూపముదాల్చి విజృంభించుచున్నాను, మదీయ
చక్రధార జతుర్దశభువనములతో గూడ శివునిరూపుమాపెదను. అందు శివుండధికుండని
నుడివిన మునుల నడ్డుపడమని చెప్పుము. ఇంద్రునకింత బుద్ధిలేకపోవలయునా! మును
లన్న మాట కాదనక యూరక వినుచుండునా. అప్పుడు నాచక్రధార గాచుకొను
వాడెవ్వడో చూడమని రౌద్రావేశముతో బలుకుటయు వారించి ముకుళితకరకమలయై
కమల యెదుర నిలువంబడి యల్లన నిట్లనియె

ప్రాణేశ్వరా! శాంతస్వభావముగల మీ రిట్లలిగిన నెవ్వరు నిలువగలరు.
మునులనినమాటకు శివునిపై గోపింపనేల. అదియునుంగాక యీతపసి కలహమె భోజ
నముగా గలవాడు. ఈ జడదారి మాటలెంత సత్యములో విచారింపక లోకముల నాశ
నము చేయుదురేల? ఎవ్వరికే పోరాటములుపెట్టి కడుపు నింపించుకుంటివా యని
యీతడు వచ్చినప్పు డడుగలేదా, అన్నియు మరచి యలుగుట తగదు.

శివుండు మిమ్మెదిరించినప్పు డేమిచేసినను నుచితమని యేమేమో బోధించి
వైకుంఠుని గోపాగ్నిని గొంత జల్లార్చినది. అప్పుడు దామోదరుం డించుక శాంతుండై
తలయూచుచు, నారదా! నీమాటల గొంత విమర్శింపవలసియున్నది. నిక్కముగా దేవ
లోకములో సభ జరిగినదా? మునులును సురవరులును వాదించిరా ? యని యడిగిన
నేనందు స్వామీ! నే మీముందరనే బొబ్బరలాడుదునా బ్రహ్మచెప్పిన మాటలన్నియుం
జెప్పిన నన్ను గొండెకాడనిపోవుదురనియే వెల్లడించితినికాను. ఈ మహాదేవి చెప్పి
నట్లు మీ జోలికిరాని శివునిపై నలుగుట యుచితముకాదు. నేను ప్రచ్ఛన్నముగాబోయి
యాయన యభిప్రాయ మెట్లున్నదో తెలిసికొని వచ్చెద. నిమ్మట యథానుసారము
గావింతురుగాని యని యేమేమో చెప్పి యచ్యుతు నొప్పించి యప్పుడే యప్పారికాంశి
కైలాసమున కరిగెను.

అప్పుడు పార్వతీ పరమేశ్వరులు కైలాసశిఖరాగ్రమున మందార తరు
ప్రాయమున జంద్రకాంత శిలావేదిక పయిన గూర్చుండి వినోద కథాకాలక్షేపము
చేయుచుండిరి. పార్వతి నారదునిరాక ప్రమథులవల్ల విని, ప్రాణేశ్వరా! యీతండు
మహర్షియయ్యు గలహప్రియుండయ్యెనేమి. ఎట్టి సంక్షోభము కలిగినను సంశయింపక
తగవులుపెట్టి యానందింపుచుండునుగదా? మేనవునకు హిరణ్యమునకు పోరాటము
పెట్టుటచే లోకములు తల్లడిల్లలేదా? అతండు కొండెగాడని నిరసింపక మీరేటికతని
సత్కరింపుచుందు రేలయని యడిగిన బరమేశ్వరుండు నవ్వుచు నిట్లనియె. దేవీ!

యతండు త్రికాలవేదియగుట నాటోవునది యెఱింగియే యది యనివార్యమని యట్టి పోరాటములు పెట్టుచుండును. అతనికి గామ క్రోధాదులులేవు. నిస్సంగుండగుట నతని యెడ యందరికిఁ గౌరవము గలిగియుండ నని చెప్పుచుండగనే సిద్ధు లతనిం దీసికొని వచ్చి శివునెదురనున్న రత్నపీఠముపైఁ గూర్చుండఁబెట్టిరి. నారదుండు పార్వతీపరమేశ్వరులకు నమస్కరించి తదాజ్ఞ నుచితపీఠంబునం గూర్చుండెను.

అప్పుడు శివుండు శరచ్చంద్ర చంద్రికానిచయములతో మందహాస జ్యోత్స్నలు వియ్యమందుచుండ నారదునితో, మునీంద్రా! నీవెచ్చటనుండి వచ్చుచుంటివి? సురలోకవార్త లేమైనం గలవా? సర్వలోక విశేషములం దెలుప నీవు వార్తాపత్రికవంటి వాడవు. వింతల నెఱింగింపుమని యడిగిన నాజడదారి యిట్లనియె. దేవా! నీ వాదిదేవుడవు నీవెఱుంగని దేమున్నదిఁ నాకడుపులో నేరహస్యము దాగదని మీరందరు నెఱింగినదేకదా? బ్రహ్మయు విష్ణుండు నిట్లే యడిగిరి. నిజము జెప్పినంత వారికిఁ గోపము వచ్చినది. అన్నన్నా దామోదరున కింత కోప మున్నదని యెన్నఁడు నెఱుఁగను. లక్ష్మి యడ్డమువచ్చినది కాని లేనిచో లోకము లీపాటికి భస్మములై యుండునుకాబూ! ఎప్పుడును నిజము చెప్పరాదు. ఆ వార్తజెప్పిన మీరుమాత్ర మలుగకుందురా మీకు రుద్రనామము సహజమై యున్నది.

మీకు నిజము చెప్పనేల, లోకసంక్షోభము గావింపనేల. మీ దర్శనమైనదింతియచాలును. అనుజ్ఞయిండు, పోయి వచ్చెదనని పలికిన నవ్వుచు మహేశ్వరుం డిట్లనియె. నారదా! బ్రహ్మయు విష్ణుండును నిన్నేమడిగిరి, నీవేమిచెప్పితివి. వా రేమిటి కలిగిరి. ఆ వృత్తాంత మేదియో చెప్పుము. వినుదనుక మనస్సు తొందరపడుచున్నది. నీవార్త జెప్పిన నాకును గోపము వచ్చునా? పోనిమ్ము వచ్చిన వచ్చుగాక నీ కేల యదార్థము జెప్పుమని సానునయముగా నడుగుటయు కొంతసే పాలోచించి సంశయించు వాఁడువోలె నభినయించుచు నతం డల్లన నిట్లనియె.

మహాత్మా! నిజము చెప్పెదవినుండు. ఈ నడుమ దేవలోకములో సభ జరిగినది. అందు త్రిమూర్తుల తారతమ్యముగురించి దేవతలకును, మునులకును బెద్ద సంవాదము జరిగినది. మునులు మీరధికులనియు సురలు విష్ణుండధికుండనియు బ్రహ్మను గూర్చి మరికొందరు ప్రసంగించిరి. అందరును మీ యిరువురకన్న విరించి యల్పుండనియే నిరూపించిరి. మీరధికులని వాదించిన వారు బ్రహ్మర్షులు యోగులు మొదలగువారు. విష్ణుదధికుండని వాదించినారు భోగులు, సురలు. ఆ సంవాదము పెద్దతరవు జరిగినది. ఆ ప్రసంగము విని సంతసించుచు నేను బ్రహ్మలోకమునకుంబోయి విరించిని దర్శించితిని. అతండును నన్ను వచ్చుటకుగల విశేషము లేమని యడిగిన దేవసభని సంవాద ప్రకారం బెఱింగించి నాయొద్ద నిజము దాగదుగదా! మీ యిరువురకన్న దన్నల్పునిగ దలంచిరని వేల్పులపయి, మునులపయి దగని కోపముజెందుచు సుర

జ్యేష్ఠుండు నా యెదుట దానధికుండని తెలుపు వచనముల బెక్కు చదివి యామాట మీ యిరువురకుం జెప్పిరమ్మని చెప్పెను.

అప్పుడు నేను వెరచుచు మరుమాట పలుకక యటగదలి వైకుంఠమునకుం బోయి హృషీకేశుని దర్శించితిని అతండు నన్ను మన్నించుచు లోకవిశేషము లేమని యడిగెను. దాచనేరక దేవముని సంవాదప్రకారము బ్రహ్మవచన ప్రవృత్తియు నెఱింగించితిని.

అప్పుడు వాసుదేవునికి బ్రహ్మపయి నంతకోపము రాలేదుగాని మీ రెక్కుడని పలికిన మునులపయి వచ్చిన కోపమిట్టిదని చెప్పజాలను. ఆహా! లోకము లేలువారికి యట్టి యాగ్రహము గలిగినచో సామాన్యుల నెన్ననేల! అమ్మునుల జంపుదననియు, లోకముల భస్మము చేయుదుననియు జక్రము గిరగిర ద్రిప్పుచు దేవరపయి గూడ రోషమును బూనెను. అక్కటా! దామోదరుడు దేవరమహిమ నెఱుంగడు. ఏమూహించుకొండెనో. అతని చక్రము మీ త్రిశూలము కొనకు దగిలికొనిన జక్కిలము లాగున విరిగి ముక్కలు కాకపోవునా? మీ రాగ్రహించిన నిలుచువారెవ్వరు, భైరవ వీరభద్రాదులు మీయంశజాతులుకారా! కేశవునికిట్టి స్వాతిశయబుద్ధి యేమిటికి గలుగవలయునో తెలియదు. ఇవియే యిచ్చటజరిగిన విశేషములు. ఇక్కి వారింపనిచో నీపాటికి చక్రధార మీ త్రిశూలమునకు దగిలికొనకపోవునా యని చెప్పటయు త్రిలోచనుండు రోషారుణలోచనుండయి యిట్లనియె.

నారదా! దేవసభలో నేనధికుండని పొగడినంతనే మునులపయి వైకుంఠునకు గోపము వచ్చినదిగా! రానిమ్ము రానిమ్ము. మదీయ శాంతత్వమే యతని నిట్టుల వాచాలుని గావించినది. గర్వము యుక్తాయుక్తవివేకము గలుగనీయదుగదా! మరియు నతం డలిగి యేమేమి మాటలాడెనో వక్కాణింపుము. మదీయ రుద్రావతారచరిత్ర మరచెనుగాబోలు. భళిరా! యని యడిగిన నారదుండు స్వామీ! నాచే బలుమారేల జెప్పించెదరు దామోదరునకు దా నధికుండనియు మీరు తక్కువవారనియు గట్టియభిప్రాయము గలిగియున్నది మీరుచేసిన తప్పులన్నియు నతండు సహించుచున్నాడట లేనిచో లోకము లీపాటికి నాశనము నొందునట. మీ బలములు మీరు విచారించుకొనవలసినవే మాబోటులకు దెలియ శక్యముగాదని పలికి రోషమెక్కించెను.

అప్పుడు ఫాలాక్షుండు రూక్షవీక్షణంబుల వీక్షించుచు దెసల్ద్రువ నట్టహాసముజేసి కేల త్రిశూల ముంకించుచు నౌరా? నారాయణుండెట్టి వీరుండయ్యెను అతని యండబాని నేను లోకముల బాలించుచున్నానా? చక్రము నాపయిం బ్రయోగింప యత్నించెనేమి? బాగు బాగు రమ్మనుము. ఫాలేక్షణము దెరచి తృటిలో గొడుకు పోయిన దాని జూపెదను. అప్పుండని సమానప్రతిపత్తి యొసంగి మన్నించుచున్నందులకు మంచి యభిప్రాయమే కలిగినది. బ్రహ్మకన్న దన యతిశయమేమియున్నది మదీయ చరణశిరః ప్రదేశముల దెలిసికొనలేక యిరువురు తిరిగిరాలేదా మృషలాడెగాన

విరించి శర్వుండయ్యు నంతియే తారతమ్యంబు లేల యాక్రమంబుగాని సంగరమునకు రమ్మని మాధవునితో జెప్పుము.

అప్పుడు మా యిరువుర ప్రభావములు దేవతలకు, మునులకు దెల్లమగునని మహా రౌద్రావేశముతో వృషాంకుండు విజృంభించి పలుకుచున్నంతఁజూచి నారదుండు మారుమాట పలుకుటకు వెరచుచు యొదిగి యుండెను. అప్పుడు పార్వతిలేచి నమస్కరించుచు, మహాత్మా ! యీ నారదుండు కలహప్రియుండు. ఏమేమో నాలుగుమాటలు చెప్పి పోరులు కల్పించుచుండును ఈతని పలుకులునమ్మి వాసుదేవునిపై నలిగెదరేల? నారాయణుండు దూరదర్శకుండు శాంతస్వభావు డూరక తొందరపడువాడుకాదు. కావున విమర్శించి యాగ్రహము బూనుడని స్తుతిపూర్వకముగా నుడివిన విని పినాకపాణి శాంతుండై అవును మాబోటులకవిమృశ్యకారిత్వ ముచితమైనదికాదు. నారదా ! నీ వరిగి సుపర్వాది మూడుకోట్ల వేల్పులతో సేంద్రాది దిక్పాలురతో, మునులతో బ్రహ్మతో గరుడధ్వజు నిచ్చటికి దీసికొనిరమ్ము. వెండియు సభజేయుదుము.

ఆ సభలో మేము ప్రసంగింతుము మా బలాబలములు విమర్శించి మునులును దేవతలును ప్రధానత్వము నిశ్చయింతురుగాక వేగము పొమ్మని యానతిచ్చిన విని నారదుండు పరమానందము జెందుచుం దుధరు వీడ్కొని యట గదలి—

గీ. హరిహరుల కింకనుగ్ర సంగరముగాక
మానదుర లోకసంక్షోభ మైనఁగాని
కడుపునిండంచుకొన మంచికాలమిదియ
నాకు నిటువంటి తృప్తి యెన్నటికిరాదు

అని పీణంబాడుకొనుచు వైకుంఠంబునకుంబోయి దైత్యారింగాంచి నమస్కరించుటయు శ్రీకాంతుండు మందహాసముఁజేయుచు, నారదా ! కైలాసమున కరిగితివా? మహేశ్వరుండు కుశలియైయున్నవాడా ? విశేషములేమని యడిగిన నమ్మునితిలకుండు మహాత్మా ! నేనిప్పుడు కైలాసమునుండియే వచ్చితిని. శంభుండు భద్రముగా నున్నవాడు. మీకు నాలుగుచేతులు గలిగియుండ నాయనకైదు మొగములును, మూడునేత్రములును గలిగియున్నవి. మీచేతచక్రముకన్న నాయన చేతనున్న శూలము బదిమడుగుల బరువెక్కువ గలిగియున్నది మీ యిరువురు నొకటికొకరు తీసిపోయెడువారు కారు. దామోదరా ! నా కిదివరకే కొండీడని బిరుదుకలిగియున్నది. అచ్చట చేష్టలం జెప్పితినేని మీకు గోపమురాకమానదు. పిమ్మట మీ యిరువురును గలహింతురుదాన లోకసంక్షోభమగును ప్రజలు నన్ను నిందింతురు కావున నచ్చటి నావార్తలేమియు మీ కెఱిగింపకయే పోయెద ననుజ్ఞ యిమ్మని కోరిన నారాయణుండు నవ్వుచు నిట్లనియె.

నారదా ! ఒరులన్నమాటలు చెప్పుటచే నీకేమి తప్పుగలదు. అదియునుంగాక మదీయ సందేశమువిడనేకాదా నీవు కైలాసమునకుంబోయితివి. తిరిగివచ్చి యచ్చటి వార్తల జెప్పకపోవునా ? నీకేమియుఁ గొదువలేదు. జరిగిన కథయంతయుం జెప్పుమని

యడిగిన నాజడధారి యిట్లనియె. కేశవా! నీ యాదేశమునఁ బోయి నేను జంద్రశేఖరుం గాంచితి. అతండు నన్ను గౌరవించుచు నెందుండి వచ్చుచున్నావని యడిగెను. నేను దేవరసన్నిధానమునుండి వచ్చితినని చెప్పితి. అచ్చట జరిగిన కథయంతయు సిద్ధుల వలన నంతకుముందు విని యున్నవాఁడు కావున నన్నుఁజూచి, నారదా! దామోదరుండు నాపైఁ జక్రమువైవ నుద్యుక్తుండయ్యెనటకాదా? తానే యధికుండని విఱ్ఱవీగుచున్నా వాఁడట తాను నన్ను గాపాడుచున్నానని నీ యొద్ద జెప్పెనట నిజమేనాయని యడిగిన నేను నివ్వెరపడి, స్వామీ! అది మంచి సమయముకాదు. వాసుదేవుండు మీ కాప్తుండు కాదా? కాల విశేషమున నాప్తులు తొందరపడినను శాంతస్వభావము గలవారు మన్నింతు రని యెంతయో బోధించితిని. కాని నా మాటలు వినినకొలఁది యతని కాగ్రహమెక్కు డైనది. రుద్రరూపముదాల్చి యట్టహాసము జేయుచు దశూలము గిరగిరం ద్రిప్పదొడం గెను. తదీయరూపముఁజూచి నేను వెరచి పారిపోవ బ్రయత్నించుచుంటలో నా ప్రాంత మందున్న పార్వతి మంచిమాటలు జెప్పి కోపము జల్లార్చినది. మీ తగవులు మేము తీర్పజాలుదుమా! దేవతలను, మునులను, దిక్పాలురను, బ్రహ్మను వెంటబెట్టికొని తన యొద్దకు దీసికొనిరమ్మని చెప్పెను. మరల సభజేసి యందులో వాదించునట. తాను రమ్మనిన దేవతలు, మునులును, దిక్పాలురు వత్తురుగాని తదాజ్ఞాబద్ధులై మీరు వత్తురా? మీరక్కడికి బోవనేల తానే మీ యొద్దకు రారాదా? ఈ మాటలక్కడనే చెప్పవలయు నని తలంచితిని కాని ప్రభువుతో బలుపలుకులు పలుకరాదు. మొదటనే విశ్వరూపము దాల్చియున్నవాడు గదాయని తలయూచి మీ యొద్దకు వచ్చితిని. పిమ్మట దేవరచిత్త మని పలికి యూరకొనియెను.

అప్పుడు చతుర్ముఖుండు మేలుమేలు మంచిసందేశము దీసికొని వచ్చితివి. పరోక్షమునందు ప్రగల్భములు కొట్టినట్లు సమక్షమందు వాగవు మునులును, సురలును, దిక్పాలురును మహాప్రతాపము గన్నులార జూతురుగాక వేగబోయి వారిందీసికొనిరమ్మ్మ ని పలికిన నారదుండు, స్వామీ? మీరు కైలాసమునకు వత్తురా! యీ సభ యెక్కడ జరుగునని చెప్పవలయును. వైకుంఠమునందే యీ సభ జరిగించిన యుక్త ముగా నుండునని నా యభిప్రాయము. అకొండరుప్పలకన్న యీ పట్టణభూములు రమ్యములు కావాయని యడిగిన దానవాంతకుండంచుక చింతించి అవును మన మతని యొద్దకుబోనేల అతనినే యిచ్చటికి రమ్మనుము. లేనిచో మువ్వురకు సంబంధములేని చోట సభనేర్పరుపవలయు. నీ మాట శివున కెరింగించిరమ్మని చెప్ప- నారదుండు సంత సించుచు వాసుదేవుని యానతింగైకొని బ్రహ్మయొద్దకుంబోయి హరిహర కలహ ప్రకా రము సభావృత్తాంతమును జెప్పి యతనికి రోషమెక్కించి మూడు లోకములందుగాక వేరొకచోట సభజేసినచో వత్తునని యుత్తరం వ్రాయించిపుచ్చుకొని యప్పుడె కైలాస మునకు బోయెను.

శంకరుండు నారదుంజూచి వాసుదేవ చతుర్ముఖులతో నాసందేశము దెలిపి

తివా? వచ్చుటకు సమ్మతించితిరాయని యడిగిన దేవమునిని చేతులు నలిపికొనుచు, స్వామీ! ఇప్పుడు మునుపటి హరియు వెనుకటి బ్రహ్మయు ననుకొనుచున్నారు కారు కారు. వారి యభిప్రాయములు చాలమారినవి. కపాలపాణి యాజ్ఞానుసారము వచ్చుటకు మేము కింకరులమాయేమి యని నా మాటలు విని యాక్షేపించిరి. మిమ్మె యచ్చటికి రమ్మని పలికిరి. అప్పుడు నేనొక యుపాయము చెప్పితిని. యీ సభ మీ మందిరములయందు గాక మేరుపర్వతశిఖరమున గావించుటకును అచ్చటికందరు వచ్చుటకు నిరూపించితిని. అందులకు మీరును సమ్మతింపవలసినదే అంతయు గలసినపిమ్మట నా సభయందు వారి నీ మాట నుదరింపవచ్చును. ఇప్పుడేమియు నడుగవలదని చెప్పి యొప్పించి సభాదివసంబు నిరూపించి తదనుజ్ఞనుగయికొని వాసుదేవ చతుర్ముఖుల యొద్దకరిగి వారికత్తెరం గెరింగించి సభకు వారివారి పరివారములతో వచ్చునట్లొడంబడిక జేసి యటగదలి నాకంబునకుం బోయి పురుహూతునిచే సత్కృతుడై యిట్లనియె.

దేవేంద్రా! యిప్పుడిందుగూడ సావకాశముగా మాట్లాడుటకు సమయము కాదు. ఇప్పుడు త్రిమూర్తులకు నలవికాని కలహములు బలసినవి. ముగ్గురుం గలసికొని ప్రసంగములు జేయుదురట. మేరు శిఖరాగ్రమున సభజేయుటకు నిశ్చయించిరి. తత్ప్రదేశమంతయు మూడు దినములలో బాగుచేయించి యలంకరింపవలయునని త్రిమూర్తులును నీతో జెప్పుమనిరి వేయేల హరిహర హిరణ్యగర్భుల పట్టణములకన్నను, స్వర్గముకన్నను తత్సభాభవనము సొంపుగా నుండవలయును దేవతలతో, మునులతో, దిక్పాలురతో, సిద్ధులతో, సాధ్యులతో, విద్యాధరాది పరిచారకులతో వచ్చి నీవందు వేచియుండవలయు నేటికి నాల్గవనాటి కందరు నచ్చటికి వత్తురని యెన్నియో చెప్పి నారదుం డెందేనిం జనియెను అని యెరింగించి యమ్మహాశక్తి శంకరాచార్యునికి దదనంతరోదంతం బిట్లని చెప్పదొడంగెనని మణిసిద్ధుండు గోపాలునితో నవ్వలిమజిలీయందా కథాశేషము వక్కాణింప దొడంగెను.

అని యెరింగించి మణిసిద్ధుం డప్పుడు వేళయతిక్రమించుటయు గథ జెప్పుట చాలించి పరమానందకందళిత హృదయారవిందుండైయున్న శిష్యునితోగూడ గ్రమంబున నవ్వలిమజిలీ జేరెను.

ఇది శ్రీ మధిర సుబ్బన్నదీక్షితకవి రచితమైన కాశీయాత్రాచరిత్రమను మహాప్రబంధమున శంకరాచార్యచరిత్రము. అష్టమోల్లాసము.

స ం పూ ర్ణ ము

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

## 56 వ మజిలీ

## నవమోల్లాసము

సత్యలోకములో సరస్వతీమహాదేవి వీణాగానవినోదమునఁ గాలక్షేపము చేయుచున్న సమయంబున సఖురాలు సాధ్వసవిస్మయరసావేశ హృదయయై యరుదెంచి, అమ్మా! అమ్మా! అయ్యగారు నేడేమియో పడుకొనియున్నారు. కారణమేమియో తెలియదు. మాదేవర సృష్టిక్రియావిముఖుండగుటచే లోకమునకుఁ గీడు సంభవించుం గావున నీవు వేగవచ్చి తద్విరక్తికిఁ గారణమేమియో తెలిసికొనవలయునని పలికిన విని పలుకులవెలంది తలంచుచు నిట్లనియె.

ఏమీ పరమేష్ఠి సృష్టివ్యాపారము మాని పడుకొనియెనా! పగటివేళ విధాత యెప్పుడు నట్టిపనిచేయఁడే! మేరు శిఖరాగ్రమున జరిగిన సభకుఁబోయిన యలసటచే విశ్రమించిరని తలంచెదను. అయ్యో! అచ్చట నేమేమి విశేషములు జరిగినవియో తెలిసికొన మరచితినే! వచ్చినవెంటనే యడుగవలయునని తలంచితినికాని యప్పుడు కోపముఖముతో నుండుటచేఁ బల్కరించితినికాను? ఆ సభలో నీయన కేమయిన యవమానము రాలేదుగదాయని యాలోచించుచు విపంచి పాడుట చాలించి యప్పుడు ప్రాణేశ్వరునొద్ద కరిగి మంచముపయిఁ గూర్చుండి ముసుంగించుకయెత్తి, ప్రాణేశ్వరా! నిమిషమునకనేక జీవరాసుల సృష్టించెడు మీరిట్టుల పడుకొనిన లోకములకుఁ బ్రళయముకాదా లోకేశా! మీరెవ్వరిపై గోపింతురు! కోపకారణం బేమి వక్కాణింపుడని యెంతయో నైపుణ్యముగా నడిగినది.

విధాతయేమియు మాటాడక యరకనుమోడ్పుతో నుస్సురని నిట్టూర్పు నిగుడింపుచు నవ్వలకు దిరిగి మరల ముసుఁగు లాగికొని పడుకొనియెను. సరస్వతి యెన్నిగతులఁ బరిమాలినను మాటాడక లేవక పల్కరించక యట్టె పడియుండెను. అప్పుడప్పల్లవపాణి తల్లడిల్లుచు అయ్యో! ఆ యోలగములోఁ గమలోదరునకేదియో యవమానము గలిగినది. కాకున్న నిమ్ముఖుండిట్లుత్సాహ విముఖుండగుకాడు. అత్తెరం గేదియో వైకుంఠమునకుం బోయి లక్ష్మీమహాదేవి వలనం దెలిసికొనియెద.

అక్కాంతకుఁ గాంతుండంతయు వక్కాణింపక మానఁడు. అని తలంచి సఖీజనంబుఁగూడి కొని మయూరవాహనారూఢయై యప్పుడు వాణీదేవి వైకుంఠమునకుం బోయినది. అందు గోవిందునిగురించి భక్తులెద్దియో గుజగుజ లాడుచుండ వెరగుపడుచు నత్తరుణీ లలామ మెల్లన కమలానిలయంబునకుఁ జని యంతఃపురదాసీజనుల లక్ష్మీమహాదేవి యెందున్నదని యడిగినది. శుద్ధాంతకాంతలు సరస్వతీ మహాదేవిం గురుతుపట్టి యుచిత సత్కారంబులం గావించి బసింపగద్దెపయిం గూర్చుండబెట్టి గమనశ్రమ వాయఁ జామరముల వీచుచు, దేవీ ! యిందిరా మహాదేవి యింతకుముందె దామోదరుని సౌధంబున కరిగినది.

అమ్మహాత్ముండేమియో లోకరక్షావిముఖుండై కోపగృహంబునఁ బడు కొని యున్న వాఁడనువార్త విని యార్తిజెందుచు నందు వోయినది. మీరాకవిన్న నిప్పుడే రాగలదని చెప్పిరి. భాషావధూటి యా మాటలు విని తనసఖుల మొగముచూచుచు మేలుమేలు మంచి చోద్యములే వినంబడుచున్నవి. అని యాశ్చర్య మందుచు సుందరులారా ! గోవిందునకు గోపించుటకుఁ గారణమేమి వచ్చినదని యడిగినది అయ్యంగనలత్తెరంగేమియు మేమెఱుంగము మేరుగిరినుండి వచ్చినదిమొదలు లోరులతో మాటాడుట లేదట దేవీ ! నీవిందు గూర్చుండుము సత్వరమునఁ గమలాదేవి నిచ్చటికిఁ దీసికొని వత్తుము నీ రాకవినిన సద్దేవి యనుమోదించునుగదా యని పలికి కొందఱిందుముఖులువోయి భార్గవి కత్తెరం గెఱింగించిరి. లక్ష్మియు మురియుచు సరగ నత్తెరవ యొద్దకు వచ్చినది. ఒండొరులు గౌఁగలించు కొనిరి.

అప్పుడు సరస్వతి లక్ష్మితో అత్తా ! మత్పుత్ర వైకల్యంబు నీకెఱింగించుటకై వచ్చితిని నీకును మనస్స్వాస్థ్యము లేనట్లు తోచుచున్నది. మామగారు కోపించి పడుకొని యుండిరఁట నిజమేనాయని యడిగిన లక్ష్మి, సాధ్వీ ! నారాయణుండిట్లు దీనవదనుండై పడుకొనియుండుట నేనెన్నఁడును జూచి యెఱుంగను. కల్పాంత సమయంబున మహాసముద్ర మధ్యంబున జీవజాలంబులనెల్ల నుదరంబున నిడికొని వటపత్రంబున శయనించునని చెప్పుదురు. ఈ యకాండ ప్రళయంబునకుఁ గారణమేదియో తెలియదు. ఎంత పిలిచినను బలుకరు. లోకరక్ష యెట్లగునో తెలియదనిచెప్పి నీచిత్త వైకల్యంబునకు హేతువేమని యడిగినది వాగ్దేవియుఁ జతుర్ముఖుని విరక్తి ప్రకారమంతయుం జెప్పి యప్పడఁతిని వెరగుపడ జేసినది.

అప్పుడిరువురు విచారించి యత్తెరగు మహేశ్వరివలనఁ దెలియగోరి పరివారములతోఁ బార్వతీ మహాదేవి యొద్దకుంబోయిరి అప్పుడు పార్వతియుఁ బరమేశ్వరుండు విలయక్రియా విముఖుండై మౌనముద్ర వహించి తనతో మాటాడుట మాని వేసెనని సఖులతోఁ జెప్పుచు విచారించుచున్నది. పిమ్మట లక్ష్మీ సరస్వతుల రాక విని యా యింతిర యానందించుచు నెదురువోయి వారిం దోడ్కొనివచ్చి సత్కార పూర్వకముగా గనకాసనములపైఁ గూర్చుండబెట్టి యాగమన కారణం బడిగిన వారు

దమశమ వృత్తాంతంబులం నెఱింగించిరి. అప్పుడు పార్వతి విస్మయంబభినయించుచు సఖీమణులారా ! ఇది కడు చోద్యముగా నున్నయది మేరుకూటమునుండి వచ్చినది మొదలు మదనవైరియు నెవ్వరితో మాటాడక కైలాసగుహాంతరాళంబున బడుకొని యున్న వాఁడు ఆ సభలోఁ ద్రిమూర్తులకు నేమి ప్రసంగము జరిగినదో తెలియదు. నారదమహర్షియే యీ సభకుఁ బ్రోత్సాహకుఁడు. ప్రాణముల వలె వర్తించెడు హరిహర బ్రహ్మలకు వైరములు గల్పించి కడుపు నిండించుకొనియెను.

ఆ యోగములో జరిగిన విశేషములు దెలిసికొనినంగాని వీరి కోపములకుఁ గారణములు దెలియవు. ఆవార్తలు తెలిసికొన నందీశ్వరునికి వార్తనంపితి, నింతలో మీరు వచ్చితిరి కూర్చుండుఁడు అతండు వచ్చి సభావిశేషముల వక్కాణింపఁ గలఁడని పలుకుచుండఁగనే నందీశ్వరుఁడిచ్చోటికి వచ్చి పార్వతీ మహాదేవికి నమస్కరించెను. కాత్యాయని నందీశ్వరుని గారవింపుచు, వత్సా ! మహేశ్వరులు దేవసభనుండి వచ్చినది మొదలు మౌనము వహించియు దీక్షాభావముతో నున్నవాఁరు భక్తుల మొరలాలింపరు. ఇందులకు గారణమేమియో తెలియదు. ఈయనయేగాక బ్రహ్మాచ్యుతులుఁగూడ నిల్లె పడుకొని యున్నవారట. లక్ష్మీ సరస్వతులు పరితపించుచు నవ్విధం బెరింగి నా యొద్దకు వచ్చిరి. ఆ సభలో వీరి మువ్వురు కలుషించిరా యేమి ? అచ్చట జరిగిన వృత్తాంత మంతయు వక్కాణింపుమని యడిగిన నందీశ్వరుఁడు ముకుళిత కరకమలుండై, తల్లీ ! ఈ యుపద్రవమునకంతకు నారదుడే కారణుఁడు వినుమని యిట్లని చెప్పదొడంగెను. సభాదివస నిరూపణంబు గావించి నారముఁదజిగిన యనంతరమ.

సీ. భసితాంగరాగలిప్త సమస్తగాత్రుఁడై
పులితోలు గంకటంబుగ బిగించి
ఘనజటావితతిఁ జక్కఁగఁ దీర్చి ముడివైచి
కదలకుండఁ గజేంద్రకళ నమర్చి
గరళవహ్నిస్ఫులింగములఁ గక్కెడుమహో
రగభూషణముల గాత్రములఁదాల్చి
కరముల ఘనపినాక త్రిశూలప్రముఖ సా
ధనముల ధరియించి తతపిశాచ.

గీ. భూతభేతాళసేనా సమూహములును
ప్రమథగణములు వీరవేషములఁదాల్చి
యనుసరింపఁగ వృషభవాహనమునెక్కి
తరలెఁ బురవైరిమేరు భూధరముకడకు.

మరియుఁ దైత్యారితోఁ గలహింపఁ బురాంతకుండరుగుచున్న వాఁడని విని నముచి, శంబర, పులోమాది దానవులు చతురంగబలల పరివృతులై మార్గమధ్యంబున

హరునిం గలసికొనిరి. అంతకుబూర్వమే చతుష్పుటంబును జతుర్ముఖుండును తమ తమ పరివారములతో వచ్చి మేరుశిఖరాగ్రమలంకరించిరి. వారెల్ల నారదనిర్దిష్టప్రకారంబున నింద్రాదులచే నలంకరింపఁబడిన మేరుశిఖర విశాలశాలాంతరాళంబున నమరింపఁబడియున్న పీఠంబులం గూర్చుండిరి. ఆ సభాభవనంబున నగ్రస్థానంబున రత్నపీఠం బొండు వేయబడియున్నది దానికి దిగువగా మూడుపీఠము లమరింపఁబడియున్నవి. వాటిమీఁదనే మొదటఁ ద్రిమూర్తులు గూర్చుండిరి. వారినంటియే దిక్పాలురు, దేవతలు, మునులు దమతమకుఁ దగిననెలవులం గూర్చుండిరి.

అప్పుడు నారదుండా సభాంతరాళమున నిలువంబడి చేయెత్తి ఓహో! మునులార! దేవతలార! దిక్పాలురార? యిప్పుడు లోకాధిపతులు మువ్వురు నిందున్నవారు. త్రిమూర్తులలో నెవ్వరధికుండని మీకు సందియము గలుగవచ్చును, అది మీ కిప్పుడు తీరఁగలదు. అని పలికి త్రిమూర్తులనుద్దేశించి మహాత్ములారా? మీలోనెవ్వరధికుండో యని తెలియ లోకులు పెద్దకాలమునుండి సందియమందుచున్నారు. ఇప్పుడా భ్రాంతి వదలింప వలయును. అదిగో యగ్రసింహాసనము. మీలోఁ బ్రధానుఁడెవ్వడో లేచి దానిపయిం గూర్చుండవలయునని పలికి యమ్మునిపతి కూర్చుండెను. అప్పుడు రాక్షసులు భూతభేతాళములు ప్రమధులు మహేశ్వరా! మహేశ్వర శబ్దము నీకుఁగాక యెవ్వనికున్నది. నీవే సర్వాధీశుండవు కావున, నీవాపీఠ మలంకరింపుమని శివునిం బురికొల్పిరి.

విష్ణుపక్షపాతులు మరికొందరు దేవా! విష్ణుండు సర్వోత్తముండని శ్రుతులు ఘోషింపుచున్నవి. ఈ పీఠము నెక్కుటకు దేవరగాక భూతపతి యెట్లర్హుండు ఉపేక్షించుచుంటివేల లేచి యాసింహాసనముపై గూర్చుండుడు ఎవ్వఁడడ్డము వచ్చునో చూతము గాదాయని ప్రేరేపించిరి. బ్రహ్మపక్షపాతులైన రక్కసులు కొందరు ఆహా! విష్ణుకింకరు లింతపొగరుపట్టి యున్నారేమి ఆ సింహాసనం బెక్కిన శివుం డెక్కవలయును లేకున్న బ్రహ్మ యెక్కవలయును. ఈ కపటాత్ము నెక్కనిత్తుమా యని బీరములు పలుకుచు లెమ్ములెమ్మని పీఠమెక్క వాణీధవుని ప్రోత్సాహపరచిరి.

అప్పుడు త్రిమూర్తులకు నిట్టిసంవాదము జరిగినది.

శివుడు — ఇదిగో! నేను పీఠమెక్కఁబోవుచున్నాను. వలదను వాఁడెవ్వఁడో చూతునుగా! [అని లేచుచున్నాడు]

నారదుఁడు — విష్ణుమొగము జూచి కనుసన్నఁ జేయుచున్నాడు.

విష్ణుండు — ఆ ఆ. నిలు నిలు పశుపతీ. నాయనుమతిలేక పీఠ మెక్కఁగలవా!

శివుఁడు — గోపాలా నీ యనుమతి నాకేల! వలదనుటకు నీవెవ్వఁడవు.

విష్ణుండు — నాకంటె నీవేమిట నధికుండవని పీఠమెక్కెదవు? నీకు నేను జేసిన యుపకారములన్నియు మరచి నన్నే వెక్కిరించుచున్నావుగా వినుము.

సీ॥ భస్మాసురునిచేతఁ బడిసిగ్గకుందువా ?
శాంబరి వానినే జంపకున్న

శివుఁడు — బృందకై యున్మాద వృత్తిగై కొనినాఁడె
మఱియవే ! నేభూతి నిడకయున్న

విష్ణు — బాణునేమిటికిఁ గాపాడలేవైతివి
వానివాకిలి గాపువాఁడ వగుచు

శివు — బలిచక్రవర్తి వాకిలిగాచుచలనాఁడు
పారితివేల రావణునిఁ గాంచి.

విష్ణు—గీ॥ వార్ధిమునుగుచునుంతఁగ వ్వఁపుగొంత
నిలుపలేవైతివేమి వేల్పులునుతింప

శివుఁడు—గరళముదయించి యందు లోకములఁజెరుప
దాల్పలేకను గిరిక్రింద దాగితేమి.

విష్ణుడు—అహా ? అవసరము మీరిన పిమ్మట నేమియనిన ననవచ్చును.

ఉ. నీవును బ్రహ్మయుం దెలియ నేరక సంస్తుతి జేసినంత దై
త్యావళికిన్వరంబుల ననర్థముగాఁగ నొసంగివాండ్రు దు
ర్భావముతోడ లోకముల బాధలొనర్పుతరిన్ జగంబులం
బ్రోవఁగలేక మచ్చరణముల్ శరణంబులు గోరకోరకో.

అదియంతయును మరచి యిప్పుడేమో సర్వాధికుండవని పీఠాధిరోహణం
బున కుద్యుక్తుండవగుచున్నావే ? చాలు చాలు.

మ. అవతారంబుల నెత్తినేమరు సముద్యద్దర్పమేపార దా
నవులం బ్రదుళ్ళడగించి వెండియుమహిమన్ ధర్మంబునేనిల్పకు
న్న విధిప్రజ్ఞయు నీమహత్త్వమది యెన్న డెల్లమౌనేటికా
నవు ? రక్షించిన దానికిన్నలమిదేనా ? చండికావల్లభా.

శివుఁడు—ఓహో ? నీవేనియో యవతారములనెత్తి నన్ను రక్షించినట్లుగాఁ
జెప్పుచుంటివి. అది ప్రమాదము వినుము. వీరభటుల విజయంబులు ప్రభువులకే చేర
గలవు. ప్రేష్యులకు మీఁనకార్యములు మాత్రమే ప్రభువులు చేయుచుందురు. అందు
వలననే నీవు నాకు ప్రేష్యుండవని చెప్పుచుంటిని

విష్ణు—ఔరా ! పశుపతీ ? మదీయావతార చరిత్రమంతయు నీదాసత్వము
నకే హేతువైనదా ? బాపురే యెంతమాట వింటిని.

శివుఁడు—కాకమరేమి ?

మ. పురదైత్యుల్వరశక్తిలోకముల నున్మూలింపగాదేవత
లొక్కరపెట్టన్విని నాపాలేదా మరి తత్పూర్వామరశ్రేణి
సంగరమందేమిటికి స్వధింపవది శక్యంబైనచో నాఁడు
చ్చరణంబుల్ శరణంబువేడినది కృష్ణా! జ్ఞాపకంబుండెనే.

విష్ణు—గీ సఖుడవని యెంచి ప్రీతితో సంతతంబు
నీపనుల నెల్లఁ బూనియే నేఁయొనర్ప
భటుఁడవనిపల్కితా భళి బాగు బాగు
కన్ను మీదికివచ్చెనే గరళకంఠ!

శివు—గీ తుల్యగౌరవసంపత్తితో సుమిత్ర
బుద్ధిమన్నించుచుండఁటఁబో ముకుంద
పీఠమెక్కంగవలదని ప్రేలినావు
నడుమసిరినీకు రాబట్టి చెడితిపిట్లు.

నారదుండు—[బ్రహ్మతో] తండ్రీ? నీహరిహరులు సమముగా పోట్లాడు చుండ నీవేమియు మాటాడవేమి నీ యాధిక్యతగూడ వెల్లగపరుపుము.

బ్రహ్మ—నారదా! తొందర యేమివచ్చినది. వారిలో నొకడు పీఠమెక్కి నపుడుగదా తగవు పెట్టఁదగినది.

నారదు—పీఠమెక్కు మాటయఁటుండనిమ్ము. లోకాధిపతులము మేము మేమని వారిలోవారే తగవుపడుచున్నారు. నీమాట యెక్కడను ప్రశంసించుటలేదు. నీ యభిప్రాయము వేరుగానున్నది పోయి కలియఁబడి వాదింపుము.

బ్రహ్మ—వారు ప్రశంసింపకపోయినచో నాయాధిక్యత తగ్గునాయేమి?

నారదు—[హరిహరులతో] ఈ చతుర్ముఖుండేదియో చెప్పుచున్నాడు వింటిరా!

హరిహరులు—ఏమనుచున్నాఁడు.

నార—మీ యిరువురకన్నఁ దానే యధికుండట. పీఠము దానే యెక్క నర్హుడఁట.

విష్ణు—ఈ భూతపతికన్న వాని తక్కువయేమి. ఎక్కవలసినదే?

శివుఁడు—ఈ వాసవావరజునికన్న బ్రహ్మయే యధికుఁడని నా యభిప్రాయము

నారదుఁడు—అయ్యో! శివునికన్న బ్రహ్మకొక్క మొగమేగాదా తక్కువ విష్ణువుకన్న నాలుగుఁజేతులెక్కువ గలిగియున్నవి. మీ యిరువురకు సతండు తీసి పోవఁడు.

బ్రహ్మ—మొగములతోఁ జేతులతోఁ బనియేమి. నేను సృష్టి చేయనిచో వీరేమి చేయుదురో చూతునుగాక !

నారదుఁడు—చూడవలసినదే.

విష్ణు—పరమేష్ఠీ ! సర్వజ్ఞానభిజ్ఞుండవై నీవును శివుండువోలె సంభాషింపు చున్నావేమి ?

బ్రహ్మ—ఆత్మభావంబునఁ బలుమారు నీ యొద్దకు వచ్చుచుండుటంబట్టి కదా నన్నిట్లు చులకనగాఁ బలుకుచుంటిరి ? కానిండు ఇప్పుడు నా ప్రభావమంతయుం బ్రకటించెద వీక్షింతురుగాక !

శివుఁడు—[నవ్వుచు] మదీయ నఖాగ్రంబు నీశిరచ్ఛేదంబున గావించి నప్పుడే నీ ప్రభావము తెల్లమైనదిగదా ?

బ్రహ్మ—ఆహా ? ఆ కపాలమేగదా ! నీకింత యన్నమిడుచున్నది.

విష్ణు—బిచ్చమెత్తి తినుటకు నీకపాలముఁ లేకున్న మరియొక చిప్పయేదియు దొరకదాయేమి ?

శివుడు—బిచ్చమిడిన వానినే యనుగ్రహించిన కృతఘ్నులే యాక్షేపించు చుండ నేమని యుత్తర మీయందగినది.

నారదుడు—మీరనినమాట సత్యమే.

బ్రహ్మ—యిరువురకు నేనదమునని యున్నది నేను సృష్టించనిచో చూతురుగా. [అని కోపముతో లేచిపోవుచున్నాడు.]

విష్ణు—మదీయరక్ష క్రియలేనిచో నీ సృష్టితోఁబనియేమి నీవిక సృష్టించినను నేను రక్షించనని పలుకుచు విష్ణుండు లేచిపోయెను.

శివుడు—నేను లయము జేయుచుండుటకదా సృష్టిస్థితుల కవకాశము గలుగుచున్నది. నా పని నేను జేయనిచో వీరేమి చేయుదురో చూచెదంగాకయని శివుండు కోపించి యరిగెను.

అమ్మా ! యిట్లు త్రిమూర్తులు ముప్పురు రివ్వునలేచి కోపముతో నరిగిన వెనుక దేవతులు, మునులు, దిక్పాలురు భయభ్రాంతిస్వాంతులై కిక్కురమనక గ్రక్కున వచ్చిన చక్కినెక్కుడి వారక్కడనేపోయిరి.

వారికిట్టి పోట్లాట పెట్టి నారదుఁ డేదారిపోయెనో యెవ్వరికిం దెలియదు.

తల్లీ ! తత్కారణంబునంజేసి త్రిమూర్తులును సృష్టిస్థితిలయ వ్యాపారముల మానుకొని పడుకొనియున్నారని చెప్పుచున్నగనే ముప్పదికోట్ల వేల్పులయిల్లాండ్రు దిక్పాలుర ప్రోయాండ్రు పరివేష్టింప నింద్రాణి యచ్చటకువచ్చి లక్ష్మిసరస్వతు లిరు వంకలం గూరుచుండి సంభాషింపుచుండ నెద్దియో ధ్యానింపుచున్న కాత్యాయనీ మహాదేవింగాంచి నమస్కరించినది.

అప్పుడు వారినెల్ల నాదరించి పార్వతీమహాదేవి స్వాగతపూర్వకముగా నాగమన కారణ మడిగిన శచీదేవి యిట్లనియె.

దేవీ! యిప్పుడు లోకమునకు సంభవించినయుపద్రవ మిమని మనవి చేయుదును! మేరుగిరికూటంబున జగదీశ్వరులు మువ్వురును స్వాధికృతగురించి కలహించి విధికృతంబుల మానివేసి విరక్తి జెంది యున్నవారట దాన జేసి.

చ. హోమము జంతువేదియును బుట్టిన వన్నియు సాధురక్ష జొ
ప్పదమినసమగ్రతేజమున భాసిలరెప్పటికిన్నశింప వ
క్కదపటికాలమంత యును గాని జగంబులకిట్టియార్తి గ
ల్గదికనెకటా! జగత్ప్రభువులే యిటులగ్గిన నేమిదిక్కికన్.

సీ. ఇంద్రాదిదిక్పాలు రెల్ల వేల్పులుమునుల్
బలహీనులై కూలబడిరియుండ్ర
వర్షముల్గురియవు వారివాహంబులు
మహియెల్ల భగ్గున మండుచుండె
చాలినగతిమంచి గాలివీచదొకింత
ప్రజ్వరిల్లదుగదా పావకంబు
క్షుత్పిపాసలురు సంక్షోభంబుగాపింప
తెకితెకిచావు పుట్టకలులేక.

గీ. స్రుక్కుచున్నారు భూప్రజల్ జూచవమ్మ
కలుగదిటువంటియార్తి లోకములకెపుడు
ప్రోవగదమ్మ! యోయమ్మ! భువనకోటి
పెంపుమీరగ బతికి బోధింపవమ్మ.

దేవీ! యిదియేమి మాయయోకాని పదునాలుగు జగంబులలో పిపీలికాది బ్రహ్మపర్యంతము పురుషజాతియంతయు వృద్ధిక్షయములులేక బలహీనమై కదలక మెదలక యట్లెపడియుండెను. స్త్రీజాతి మాత్రము తేజోవిలాసముగాక యథాపూర్వకముగా నొప్పుచున్నదిందులకు గారణంబరసి యీ యకాండప్రళయము వారింపుమని యింద్రాణి శర్వాణిం బ్రార్థింపుచున్న సమయంబున నంతరిక్షమునుండివచ్చి యనంతదివ్యరత్నప్రభాధగద్ధగితమై కన్నులకు మిరుమిట్లు గొలుపుచు విమానలలామం బొండయ్యెంద జయాసలదంద నిలువంబడినది. అవ్విమానరత్నమున మువ్వురు పువ్వుబోణులు నిలువంబడి యున్నవారు. వారింజూచి పార్వతీ ప్రముఖపద్మముఖులు వెరగుపడుచుండ నందుండియయ్యెందు వనితలు గ్రిందికిందిగి వారికి నమస్కరింపుచు నిట్లనిరి.

సాధ్వులారా! మేము త్రిమూర్తులకు జననియైన యాదిశక్తికి బరిచారికలము ఇప్పుడు త్రిమూర్తులు ప్రధానత్వమునుగురించి కలహించి నియతవ్యాపారముల మాని వేసి పడుకొని లోకములకు భీతి గలుగఁజేయుచున్నారని విని యాయాదిశక్తి వారిం దమ యొద్దకు దీసికొనిరమ్మని యీ విమానమిచ్చి మమ్మంపినది. ఆ శక్తి యనేకకోటి బ్రహ్మాండముల కధినాయకురాలు. వీరు కడపటి బ్రహ్మాండాధిపతులు. ఈవార్త మీ భర్తల కెరింగింపుడని చెప్పుటయు గౌరీ లక్ష్మి సరస్వతి లొండొరుల మొగములు జూచి కొనుచు నోహో యిది కడు చిత్రముగానున్నది. మనభర్తలకుఁ దల్లియున్నదని యెన్నఁడును వినియుండలేదే? ఆహా యిట్టి పుత్రులంగనిన యాయమ్మ సామర్థ్యము మిక్కిలి స్తోత్రపాత్రమై యున్నదిగదా.

అయ్యారే! ప్రధానత్వమును గురించి వీరిలోవీరే తగవులాడుకొనుచుండ వీరిపై మరియొక ప్రభ్వియున్నఁదట. అనేకకోటి బ్రహ్మాండములలో వీరొక బ్రహ్మాండమును బాలించుచున్నారఁట. అద్దేవి వీరిని మందలించుటకై పిలిపించికొనుచున్నది. బాపురే యీసారి వీరుగర్వములు వదలి వర్తింప గలరని సంభాషించుకొనిరి.

పిమ్మట పార్వతీదేవి యల్లన ప్రాణవల్లభుసొద్దకుఁబోయి యాదిశక్తి సందేశ ప్రకారమంతయు వినిపించినది. అప్పుడు ముక్కంటి యక్కజమందుచు లేచి యేమేమీ మాకొకతల్లియున్నదా? వింతలు వినంబడుచున్నవే ఏరీ ఆ దూతికల నిటుదీసికొనిరా? తెలిసికొనియెదనని చెప్పిన శర్వాణి యప్పుడే పోయి శక్తి పరిచారకులఁ దోడ్కొని వచ్చినది.

పురారి వారింజూచి మీరెవ్వరు ఏమిటికై వచ్చితిరని యడిగిన నప్పడతులు, దేవా? మేమనేకకోటి బ్రహ్మాండ జననియైన యాదిశక్తి యంతిక చారిణులము. అంత్య బ్రహ్మాండాధిపతులు తగవులాడి సృష్టిస్థితివిలయ వ్యాపారములుమాని లోకసంక్షోభము గావించుచున్నారని దూతలవలన విని మాదేవి మిమ్ము దీసికొనిరమ్మని మమ్మంపినది. ఆమె వసించులోక మిచ్చట కనేకకోట్లయోజనముల దూర మున్నది. ఈ విమాన మెక్కిరావలయు నిదియే మావృత్తాంతమని చెప్పినవిని యమ్మహేశ్వరుం డించుక చింతించుచు, నంచుటోలు హరి బ్రహ్మ మూర్తులు యొద్దకుఁబోయి వారి కీవార్త నెఱింగించి విమాన మెక్కించుకొని యిచ్చటికి దీసికొనిరండు. నేనును బయనమై సిద్ధముగా నుండెదనని చెప్పుటయు నాదూతిక లతిరయంబున విమానమును దీసికొనిపోయి శతానందగోవిందుల కత్తెరంగెరుంగజెప్పి వారివిస్మయ వారి రాశిమునుంచుచు నవ్విమాన మెక్కించుకొని పంచశరారియొద్దకు దీసికొనివచ్చిరి.

అప్పుడు హరిహరబ్రహ్మలు మువ్వురు గలసికొని, అక్కటా! మనము

మిక్కిలి ప్రమాదము నొందితిమి. కొండెగాడైన వేల్పు తపసి దుండగం బెరుంగలేక యూరక పోట్లాడితిమి. ఆహో! మనలనెట్టి మోహ మావేసించినది.

అయ్యో! అతఁడు కలహాశనుండని యెఱింగియు మన మతని మాటలనమ్మి సామాన్యులవలె మోసపోయితిమికదా! పోనిండు దీన మనకొక విశేషము తెలియఁబడుచున్నది. మనకు తల్లియున్న తెఱగము. ఆమె యెందున్నదో తెలిసికొనుట యావశ్యకమే. కావున మనము పోవుదమని హరిహరుల మంతనము లాడికొని వైరములు విడిచి యా ప్రభావముతో నా లోకపాలకులు మువ్వురును సంతసముతో నావిమాన మెక్కిరి.

అప్పుడు శక్తిదూతికలు దేవయానము నూర్ధ్వలోకమునకు నడిపింపఁదొడంగిరి. అవ్విమానరత్నము త్రుటికాలములో ననేకసహస్ర యోజనములు పోయినది. ఆ మూర్తులు తమ వైరముల గురించి మాటాడుకొనుచుండగా నొకచోట మరియొక బ్రహ్మయు విష్ణుడు శివుండును వారియొద్దకువచ్చి నమస్కరించి పోయిరి. వారింజూచి వెరగుపడుచు నాభువనాధిపతులు శక్తిదూతికలతో వీరెవ్వరనియడిగిన నప్పడతులు అయ్యా! మనమిప్పుడు మీ బ్రహ్మాండము దాటివచ్చితిమి. ఇది మరియొక బ్రహ్మాండము. వీరు దీనింబాలించు త్రిమూర్తులని చెప్పుచుండఁగనే యవ్విమానము వారిని మరియొక బ్రహ్మాండమునకుఁ దీసికొని పోయినది.

అచ్చట మరియొక హరిహరబ్రహ్మలువచ్చి వారితో ముచ్చటించి యరిగిరి. వారి వృత్తాంతము విని త్రిమూర్తులు లజ్జావిషాదమేదురహృదయులై యిట్లు వితర్కించుకొనిరి.

ఆహా! మనమే యీ లోకములకెల్ల ప్రభువులమని గర్వపడి యింతవారల నాక్షేపించుకొంటిమి. ఇప్పుడు క్రిమికీటకాదులకంటె నధములమని తోచుచున్నది. మనవంటివారు కోటానకోటులున్నారు. ఇందరిలో మన యెక్కువేమియని పశ్చాత్తాపచిత్తులై విచారింపుచున్న సమయంబున నవ్విమాన మత్యంతవేగముగా బోవదొడంగినది. అప్పుడు బ్రహ్మవిష్ణుమహేశ్వరు లూరక యవిచ్ఛిన్నముగా గాయగుత్తులవలె వారికిఁ గనంబడంజొచ్చిరి.

అప్పుడు వారున్మత్తులవలె మతులుచెడి తామెవ్వరో యెఱుంగక పలవరింపఁ దొడంగిరి.

అట్లు మనోజవంబున నద్దేవయానంబు శతకోటిబ్రహ్మాండంబులంగడచి యమ్మహాదేవియున్న లోకమునకుం బోయినది. ఆ లోకం బంతయు దివ్యతేజోమయంబై తేరిచూడ శక్యముగాక మెఱయుచున్నది. దుర్నిరీక్షమైన తదీయప్రభావిశేషమునకక్కజమందుచుఁ త్రిమూర్తులును గరకమలంబులు ముకుళించి యమ్మహాశక్తి ననేక ప్రకారముల నగ్గింపఁదొడంగిరి.

అట్లు స్వాభిమానశూన్యులై సిగ్గుతో నగ్గింపుచున్న త్రిమూర్తులయెడఁ గనికరముగలిగి మహాశక్తి తీక్ష్ణతేజ ముపసంహరింపుచు నిజరూపము జూపినది.

అప్పుడు వారు తదీయపాదంబులంబడి, తల్లీ ! మేమెఱుంగక మేమే లోకప్రధానులమని గర్వించి జగత్పీడ గావించితిమి. బుద్ధి వచ్చినది. యీ తప్పు సైరింపుము. పుత్రుల నేరములు తల్లి లెక్కింపదుగదా. రక్షింపుము. రక్షింపుము. మత్కోపకారణంబునంజేసి భవదీయపాద దర్శనంబైనది. ఇదియే యిందులకు ఫలమనియు మురిచియున్నవారమని యనేక ప్రకారముల స్తోత్రములుచేయుచు నీవింతకాలముదనుక మాకు దర్శనంబిచ్చితివికావేమి యెఱింగింపుమని యడిగిన ప్రసన్నయై యమ్మహాదేవి యిట్లనియె.

బిడ్డలారా ! మీ వంటివారు కోటానకోటులు నా పాలనములో నున్నారు. అవసరము వచ్చినప్పుడుగాని నే నెవ్వరికిం గనంబడను. నా యునికి యెవ్వరు నెఱుంగరు. మీరిప్పు డన్యోన్యము బద్ధమత్సరులై స్వాతిశయబుద్ధితో నియతవ్యాపారముల మానిరని తెలిసి మందలించుటకై రప్పించితి. నింక నెప్పుడు నిట్టి పెడత్రోవలకుం బోకుఁడు. కాలానుసరణముగా వర్తింపుఁడు. పొండని యమ్మహాదేవి యానతిచ్చి యంతర్ధాన మొందినది.

పదంపడి త్రిమూర్తులును దేవీప్రభావము వేతెఱంగులఁ గొనియాడుచుఁ దత్ప్రసాదలబ్ధ సమధిక ప్రభావ సంపన్నులై తృటికాలములోఁ దమ నెలవులంజేరి గర్వవిముక్తులై యథాపూర్వకముగా లోకపాలనము గావింపుచుండిరి.

శంకరా ! అట్టి యాదిశక్తి ప్రభావ మెఱుంగక నీవు శక్తిలేదని వచించితివి. లోకాతీతమగు నీ ప్రవృత్తి నెఱుఁగుటంబట్టి నీకు బోధింప నరుదెంచితిని. అమ్మహాశక్తిని నన్నుగా భావింపుము. ఏమరక పూజింపుమని బోధించిన సంతసించుచు నాచార్యవర్యుండు చేతులు జోడించి, అంబా ! నేను నిన్ను లేవని వాదింపలేదు. శాక్తేయులు గావించు దురాచారముల నిందించితిని. ఇదియ నా నేరము. నీ వాత్మస్వరూపిణివని యెఱింగితి నన్నుఁ గృతకృత్యునిఁ గావించితివని పెక్కుస్తోత్రములు గావించెను. పిమ్మట నద్దేవియు నా విశ్వాత్మవరుని కనేక విద్యల నొసంగి యంతర్ధానము నొందినది. శంకరుఁడు నాటంగోలె శక్తియందు భక్తి విశ్వాసములు గలిగి పుడమి యందుఁ బ్రసిద్ధినొందిన శ్రీశైలాది ప్రదేశముల దశపీఠంబుల శక్తిస్థాపన గావించి కృతార్థుండయ్యెనని యెఱింగించి మణిసిద్ధుండు వెండియు శిష్యున కిట్లనియె.

## ఈడిగి కాపుల కథ

వత్సా ! విను మాచార్యులవారు మండనమిశ్ర పండితుని జయింప మాహిష్మతీ నగరంబునకుంజని యందుఁ జీమకైనఁ దూరశక్యముగాని సమున్నత ప్రకారములచే నావరింపఁబడియున్న మండనుని మందిరాభ్యంతరము ప్రవేశింపనేరక చింతించుచు నప్పురబాహ్యోద్యానవనంబులఁ గ్రుమ్మరుచు శిష్యులతో నిట్లు విచారించెను,

అయ్యో ! మండనుఁడు యతిమార్గవిరోధకుండై సన్న్యాసులు తమ యింటికి వత్తురను భయముతో సర్వదా తలుపులు వైచికొని గూఢముగా నున్నవాఁడు. వాని యింటి ప్రహరి మిక్కిలి యెత్తుగా నున్నది. లోపలఁ బ్రవేశించుట యెట్లో తెలియదు. సాధన మేమియుం దోచకున్నదని విచారింపుచున్న సమయంబున నొకచోట నొక యీడి గవాఁ డొక యాతచెట్టు కట్టెదుర నిలువంబడి యేదియో యుచ్చరించెను. అప్పుడా మ్రాను వాని పాదంబులకు నమస్కరింపుచున్నదో యనునట్లు శిరము నేలంటి వంగినది. తరువాత నీడిగవాఁడంతకుముందు దానందు దగిలించియుంచిన కుండలలోని కల్లు దీసికొని వెండియు నా ఘటంబుల వాని గెలలకు దగిలించి మరల నేదియో యుచ్చ రించెను.

అప్పుడా యాతమ్రాను రివ్వునఁబోయి యథాప్రకారము నిలిచినది. ఆ యీడిగవాఁడందున్న యాతచెట్లకెల్లా నా ప్రకారము గీచుచుండెను. ఆ వింతఁ గన్ను లారఁజూచి శ్రీ శంకరాచార్యులు మిగుల వెరగుపడుచు, నోహో ! యీశ్వరసృష్టిలో నెన్ని విశేషములైనం గలవుగదా ! నాకు వీనివలన నీ విద్య సంగ్రహించుట కర్తవ్యము. ఈ విద్య నాకు లభించెనేని మండనమిశ్రు నింటిలోఁ బ్రవేశించుట సులభమని తలంచుచు వాని దాపునకుఁబోయి మన్నించుచు నిట్లనియె. ఓరీ ! నీ పేరేమి? నీ కాపురం బెచ్చట ? నీవీ విద్య యెవ్వని వలన సంపాదించితివి. నిన్నుఁజూడ నాకు మిగుల సంతసముగా నున్నది. నీ వృత్తాంతము కొంతఁ జెప్పుమని యడిగిన వాఁడు నమస్క-రింపుచు యతీంద్రున కిట్లనియె.

స్వామీ! మండన పండిత పుండరీక మండితంబైన మాహిష్మతీపురము నా కాపురము. మేమీడిగవాండ్రము. నాకీవిద్య మా తండ్రియే యెఱింగించెను. మేమిట్లు చేయుచున్న విషయమై లోకులెవ్వరు గ్రహింపలేరు. మీరు దెలిసికొంటిరి. దీన మీరు మహానుభావులని తెల్లమగుచున్నదని వాఁడయ్యాచార్యవర్యు ననేక ప్రకారముల స్తుతి యించెను.

అప్పుడు శంకరులు ఓరీ ! నీకీవిద్యవలన శ్రమ కొరంతపడుట తప్ప వేరొక లాభమేదియును లేదుగదా? నీవు నాకీవిద్య నెఱింగింపుము. నీకు నేను బంగార మయ్యెడి యోగ మెరింగించెద. దాన నీకు విశేషలాభము కాఁగలదని పలుకుటయు నయ్యీడిగవాఁడు మిగుల సంతసించుచు నిట్లనియె.

మహాత్మా! యీవిద్య పుత్రులకుఁగాక యితరుల కెఱిగింపరాదని మాతండ్రి నాకుపదేశించునప్పుడు నావలన ప్రమాణికము జేయించుకొనెను. ఈవిద్య నే మీకిచ్చితి నేని నిక మా కులమున నిలువదుగదా? మీరిచ్చు విద్యవలనఁ గులవృత్తితో బనిలేనంత భాగ్యము గలిగెనేని మీకీవిద్య నిచ్చెద లేనిచో రెంటికిం జెడినవాఁడనగుదును. మరియు మిగుల విలువఁగల విద్యనిచ్చి సల్పవిద్య నావలనం గ్రహించిన మీకేమి లాభము? విచారించుకొని దయచేయుఁడని పలికెను. అప్పుడు శంకరులు వాని మాటలకు మెచ్చు

కొనుచు, నోరీ! మాకు భాగ్యముతోఁ బనిలేదు. వైరాగ్యముగాఁ దిరుగుచుందుము. లోకోపకారమునకై పాటుపడుచుంటిమి.

నాయిచ్చు విద్యవలన నీకులమునకు మిగుల భాగ్యమును, వాడుకయు రాగలదు. కావలసినంత బంగారము నిత్యము నీవు చేసికొనవచ్చును. ఇఁక నీకి నీచ వృత్తితోఁ బనిలేదని చెప్పుటయు నయ్యాడిగవాఁ డంగీకరించి శంకరులకుఁ దొలుతఁ దన విద్య నెరిఁగించెను. పిమ్మట శంకరులు ఖర్పరయోగము వాని కెరిఁగించెను. అట్టి విద్య సంగ్రహించి శంకరులు మండను గృహము దాపునకుఁబోయి ప్రహరీచుట్టును దిరిగి యాగోడప్రక్క నుండియున్న నారికేళవృక్షముల మంత్రించి వంగినంత వానిపైనెక్కి పైకెగసి కోటలోఁ బ్రవేశించి శ్రాద్ధకాలంబున నప్పండితునిఁగాంచి సంభాషించి పిమ్మట ప్రసంగంబు గావించి యోడించెనని యొకవాడుక యున్నది.

అయ్యాడిగవాడును శంకరులవలనఁ గనకయోగ విద్యను గ్రహించి తన్త్రభావమువలన ననంతమైన బంగారమును జేయునఁ గాసులగాబోయించి లోకమున వ్యాపింపఁజేసెను వానినే యాడిగ కాసులని యిప్పటికిని వాడుచుందురు. ఆ కాసులిప్పటికి నక్కడక్కడ దొరకుచుందును. హఠయోగాది విద్యల ప్రవీణుండై యాకాశ సంచారము చేయనేర్చిన శ్రీశంకరాచార్యులవారికి మండనుని ప్రహరి దాటుట శక్యము
౧౦ మైనది కాదని చెప్పుట హాస్యాస్పదమై యున్నదికాని యల్పులవద్దనుండియైన విద్యా విశేషము సంగ్రహింపవలయునను న్యాయము ననుసరించి దానివలనఁ దనకొక ప్రయోజనము లేకపోయినను గాంచనయోగము జెప్పి యావిద్య గ్రహించియుండవచ్చును.

నాస్తికులలో వాదించునప్పుడు వారు దైవముగలఁడని నిదర్శనము జూపగలవా యని యడిగిన శంకరులు సహస్రసంభమంటపమున నిలువంబడి యొకతాళ వృక్షము చేతంబూని స్తంభములకుఁ దగులకుండ గిరగిరం ద్రిప్పి వారి నాత్మశిష్యులగాఁ జేసికొనియెను. మరియొకచోట దైవముగలఁడని యెర్రగాఁగాచిన సీసము పాలం బోలె గ్రోలి జెక్కుచెదరక మెరయుచుండెను. మరియొకచోటఁ గొండయెక్కి నేల కురికెను.

ఈరీతి పుడమిగల దుర్మతంబులనెల్ల ఖండించి ప్రజలనెల్ల సన్మార్గ ప్రవర్తకులఁగాఁజేసి యమ్మహాత్ముండు ముప్పదిరెండేడులు పూర్తియైనంతఁ దత్వబోధము గావింప శిష్యులు పీఠాధిపతుల గావించి పిమ్మట బృందారక బృందప్రార్థితుండై వెండియు వెండికొండకు విచ్చేసెనని

క. అద్వైతగురుచరిత్రము
సద్వేద్యంబిది పఠింప సద్భక్తిమెయిన్
విద్వన్నుత నిర్వృతి సం
పద్వైభవములు లభించుఁ బరిపూర్ణముగాన్.

అని మణిసిద్ధుం డెరింగించుటయు గోపాలుండు పరమానంద కందళిత హృదయారవిందుండై తన్ను గృతార్థునిగా దలంచుకొనుచు నద్వైతజ్ఞానసాధనముల పరిశ్రమజేయఁ దొడంగెను.

## మంగళమహాశ్రీవృత్తము

స్వస్తియగుఁగాత బుధశాలమున కెప్పుడు ప్రకాశిత భూపతిధర్మ
న్యస్తమతిఁ బ్రోవుత ఘనంబుగ ఘనంబు లుచితావసరమందు ననువృష్టుల్
నిస్తులముగాఁగ భువిసించుత ధరాస్థలి ఫలించుతను మంగళమహాశ్రీ
విస్తృతగతిన్ సదభివృద్ధిగాత సురభివ్రజము వత్సములతోడన్.

గీ. హవ్యవాహనగుణ వారణాంబుకారి
సంఖ్య నొప్పారు వరశాలిశకమునందు
దనరుచుండు విరోధి కృద్వత్సరమున
దీని రచియించి ప్రకటించితిని ధరిత్రి.

గద్యం. ఇది శ్రీమద్విశ్వనాథపదసంసేవాసంపాదిత కవితావిచి
త్రాత్రేయముని సుత్రామగోత్ర పవిత్ర మధిరకులకలశ
జలనిధిరాకాకుముదమిత్ర లక్ష్మీనారాయణ పౌత్ర
కొండయార్యపుత్ర సోమిదేవీగర్భశుక్తిముక్తా
ఫలవిబుధజనాభిరక్షిత సుబ్బన్నదీక్షితకవి
విరచితంబగు కాశీయాత్రావసరచరి
త్రమను వచన ప్రబంధమందు
పంచమభాగమున శ్రీశంక
రాచార్య చరిత్రము
సంపూర్ణము.
శ్రీ

—:●:—

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

## ఉత్తర ఖండానుబంధము

# కాదంబరి

## శూద్రక మహారాజు కథ

గీ. పుడమి గలిభయమునఁ బ్రోగుపడిన కృత యు
గంబనఁగ సర్వధర్మ ప్రకాశమగుచు
సారవేత్రవతీనదీతీరమందు
విదిశయను రాజధాని సంపదలఁబొదలు.

అప్పట్టణంబున కథానాయకుండై శూద్రకుండను రాజు సకల నృపశిరస్సంధానిత శాసనుండై రెండవ పాకశాసనుండువోలె భూమండలమంతయు నేకాతపత్రముగఁ బాలించుచుండెను.

అన్నరవరుం డనవరత దాన జలార్ద్రీకృతకరుండై దిగ్గజంబువోలెఁ బ్రతిదివసోపజాయమానోదయుండై ప్రభాకరుని చందమున నొప్పుచు సర్వశాస్త్రములకు దర్పణమనియు, గళల కుత్పత్తిస్థానమనియు, సుగుణములకుఁ గులభవనమనియు, మిత్రమండలమున కుదయశైలమనియు, రసికుల కాశ్రయుండనియు, ధనుర్ధరులకుఁ బ్రత్యాదేశమనియుఁ బొగడ్త కెక్కెను.

మరియు, దృఢముష్టినిష్పీడనంబునం బయలువెడలిన జలధారయుంబోలె నా భూపాలు కేలం గ్రాలు కరవాలంబు కంకటలదగళిత మదజలాసారదుర్దినములగు సంగర సమయములయందు వీరభటకవచ సహస్రాంధకార మధ్యవర్తినియై యున్న జయలక్ష్మి నభిసారికవోలెఁ బెక్కుసారులతని చెంతకుఁ దీసికొనివచ్చినది.

అయ్యవనీపతి కువలయభరంబు వలయంబువోలె నవలీలనిజ భుజాగ్రంబున ధరించుచుఁ బలుమారు నీతిశాస్త్రము లెల్ల నవలోకించి బుద్ధిబలముచే బృహస్పతినైనం బరిహసించుచుఁ బ్రబుద్ధులని వాడుకఁ జెందిన కులక్రమాగతులగు మంత్రులు సేవింప సమాన వయోవిద్యా విభూషితులు ప్రేమానురక్త హృదయులు నసమసమరక్రీడాభిరతులునగు రాజసుతులతోఁ గూడికొని క్రీడించుచుఁ బ్రథమవయస్సు సుఖముగా వెళ్ళించెను.

సీ. అతులస్వరంబు లుప్పతిలంగ వీణ గై
కొనిపాడు వేయిగాఁ గొంతసేపు
మహితప్రబంధనిర్మాణక్రియారత
స్వాంతుఁడై యుండుఁ గొంతసేపు
దర్శనాగత తపోధనజనారాధనా
కుతుకాత్ముఁడై యుండుఁ గొంతసేపు
చర్చించు సకలశాస్త్ర ప్రసంగంబులఁ
గోవిదావళిఁగూడి కొంతసేపు.

గీ. కోర్కెఁ జిత్తరువులు వ్రాయుఁ గొంతసేపు
గుఱపుగణము లాలించుఁ గొంతసేపు
జంతుసంతతి నాడించుఁ గొంతసేపు
అంగనాభోగ విముఖుఁడై యనుదినంబు.

మిగుల సుందరుండగు నా నృపనందనుండు ప్రథమ వయస్సున స్త్రీ జనమును దృణముగాఁ జూచుచు సంతానార్థులగు మంత్రులచే బోధింపఁబడియు సురత సుఖంబు నందలి విరోధంబునం బోలె దారసంగ్రహం బనుమతింపఁడయ్యెను.

ఒకనాఁడు ప్రొద్దుట నప్పుడమిఱేఁడా స్థానమంటప మలంకరించియున్న సమయంబున సంగనాజన విరుద్ధముగ వామకక్షమునఁ గౌక్షేయకమిడికొని సన్నిహిత పన్నగంబగు చందనలతవోలె భీషణరమణీయమగు నాకారముతో ప్రతీహారి యరుదెంచి జానుకరకమలంబులు పుడమిసోక మ్రొక్కుచు నిట్లనియె.

దేవా! కుపితుండగు దేవేంద్రుని హుంకారంబున నేలంబడిన త్రిశంకుని రాజ్యలక్ష్మియో యన దక్షిణదేశమునుండి మాతంగకన్యక యొక్కర్తు పంజరముతో నొక చిలుకను దీసికొనివచ్చి ద్వారదేశమునఁ నిలువంబడి దేవరతో నిట్లు విజ్ఞాపన చేయుచున్నది. భువనతలంబునఁగల రత్నములకెల్లఁ గల్గోనీ వల్లభుండు వలెనె దేవరయే యేకభాజనమని తలంచి యాశ్చర్యభూతమగు నీ విహంగమరత్నము నేఁడు పాదమూలమును జేర్ప తలంపుతో నరుదెంచితిని. దర్శనసుఖం బనుభవింపఁ గోరుచున్నదాన.

అని తత్సందేశ మెఱింగించిన ప్రతీహారి వచనంబులు విని యా భూనేత కుతూహలోపేతుఁడై యాసన్నవర్తులగు మిత్రులమోములు పరికించుచు దీనం దప్పేమి యున్నది, ప్రవేశపెట్టుమని యాజ్ఞాపించుటయు నా ప్రతీహారి సత్వరము యరిగి యమ్మాతంగ కుమారిం దీసికొని వచ్చినది.

ముదిమిచేఁ బండిన శిరమునుగలిగి నేత్రకోణము లెఱ్ఱని జీరలతో నొప్పుచుండ యవ్వనముడిగినను బరిశ్రమ గలుగుటచే శిథిలము కాని దేహ బింకముతోఁ దెల్లని వస్త్రములు ధరించి వృద్ధమాతంగుఁ డొకఁడు ముందు నడచుచుండఁ బైడిశలాకలచే

రచింపఁబడినను జిలుకరెక్కల కాంతులచే మరకత మయమైనదివోలెఁ బచ్చపడియున్న పంజరమును జేతఁబూని కాకపక్షఁబులు చలింప నొక చండాల బాలకుఁడు తోడరా నసురాపహృతంబగు నమృతంబు వేల్పులకిడ నవతరించిన మధుసూదనుని మోహినీ రూపమును బురడించు మీఁగాళ్ళదనుక మేలిముసుగు వైచికొనుటచే సంచరించు నింద్ర నీలపు బొమ్మవలె నొప్పుచు సంశతము వెన్నుని యురమందు వసించుటఁ దదీయ శ్యామప్రభాసంక్రమణంబున నల్లబడిన మహాలక్ష్మియుంబోలె బలరాముని హలాపకర్షణ భయంబునఁ బారివచ్చిన యమున దాడ్పునఁ గుపితహరనయన దహ్యమానుండగు మదనుని ధూమమున మలినీకృతయగు రతినసుకరించుచు నచిరోపారూఢ యౌవనయై వచ్చుచున్న యామాతంగకన్యక నిముషలోచనుండై యారాజమహేంద్రుఁడు వీక్షించి విస్మయా వేశితహృదయుఁడై యిట్లు తలంచెను.

అన్నన్నా! తగనిచోట హాటకగర్భున కక్కజమగు రూపుగల్పించు ప్రయత్న మేమిటికిఁ గలుగవలయును. అక్కటా! నిరతిశయ సౌందర్య విశేషంబునం జొలుపొందు నియ్యిందువదనను ముట్టరాని నికృష్టకులంబునం బుట్టించెగదా! మాతంగ జాతి స్పర్శభయంబున స్రష్ట ముట్టకయే యిప్పూఁబోఁడిని నిర్మించెనని తలంచెదను. కానిచోట దదీయ కరతలస్పర్శక్లేశితములగు నంగములు కింత వింత కాంతియు లావణ్యము గలిగియుండునా? ఇసిరో! సరసిజ భవుండెప్పుడు నసదృశ సంయోగమునే చేయుచుండును గదా? అతిమనోహరాకృతిగల యీనాతి క్రూరజాతియం దుదయించుటచే నిందిత సురతయై యసుర సంపదవలె నభోగ్యమై యున్నదని నాడెందము మిక్కిలి పరితాపము జెందుచున్నది.

అని యతఁడు తలంచుచుండ నక్కన్యారత్నము మ్రోలకువచ్చి యుంచుక వంగి ప్రోదవలె నమస్కరించి యమ్మణికుట్టిమంబున నోరగా గూచుచున్నంత నావృద్ధ మాతంగుఁడు పంజరములో నుండగనే చిలుకను చేతితో నందీ నవరించుచు గొంచెము దాపునకువచ్చి జేనికిం జూపుచు నిట్లనియె. దేవా! యీ చిలుక సకలశాస్త్రార్థములు గుఱ్ఱెయుంగును. రాజనీతియందును పురాణకథాలాపమునందును దీనికి మంచి నైపుణ్యము గలదు. కావ్య నాటకాలంకార గ్రంథములు జదువుటయేకాక స్వయముగా రచింపఁ గలదు. వీణావేణుమురజప్రభృతి వాద్యవిశేషముల సారమిదియే చెప్పవలయును. చిత్ర కర్మయందు ద్యూత వ్యాపారమునందును గజతురగ స్త్రీలక్షణ జ్ఞానమందును దీనిని మించినవారు లేరు. ప్రణయకలహ కుపితులగు కాముకులందేర్చు నేర్పు దీనికే కలదు. పెక్కులేల? యాపతత్రిప్రవరంబు సకలభూతల రత్నభూతమని చెప్పనొప్పును దీని పేరు వైశంపాయనము. సర్వరత్నములకు జలనిధివోలె దేవర ముఖ్యభాజనమని తలంచి మా భర్తృదారిక యీ చిలుకను మీ పాదమూలమునకుఁ దీసికొనివచ్చినది. దీనిం

దయతోఁ బరిగ్రహింపుఁడని పలుకుచు నాపంజర మాన్నృపకుంజరుని ముందర నిడి యా వృద్ధుం డించుక యెడముగాఁ బోయెను.

అప్పు డప్పతంగ పుంగవము రాజాభిముఖముగా నిలువంబడి కుడిచరణ మెత్తి మిక్కిలి స్పష్టములగు వర్ణస్వరములచే సంస్కరింపఁ బడిన వాక్కులతో జయ శబ్దపూర్వకముగా నీపద్యమును జదివినది.

గీ. అనఘ! భవదరి నృపవధూస్తన యుగంబు
చిత్రగత శోకదహనంబు చెంత నిలిచి
యశ్రుజలపూరమునఁ దీర్థమాడి మరి వి
గతమహా హారమై ప్రవిష్టితిదనప్ప

ఆ చిలుక పలుకులు విని యాన్నృపతిలకుండు వెఱఁగు జెందుచు సంతస ముతోఁ జెంతనున్న కుమారపాలితుండను వృద్ధమంత్రిం జూచి, ఆర్యా! యా చిలుక పలుకుటయందలి స్పష్టతయు మాధుర్యమును వింటివా? ఇది వర్ణమాత్రాను స్వారస్వర సంకరము గాకుండ నభివ్యక్తముగాఁ బలుకుటయే మొదటి చిత్రము. మఱియు మను జుండువోలె బుద్ధిపూర్వకమగు ప్రవృత్తితో నభిమతవిషయమై కుడిచరణమెత్తి జయశబ్ద పూర్వకముగా నతిపరి స్ఫుటాక్షరముగా పద్యము జదువుటఁ గడుంగడు నబ్బురము గలుగఁజేయుచున్నది తరుచు పక్షులును, బశువులును నిద్రాహారమైథున భయ సంజ్ఞా మాత్రవేదులుగదా?

అని పలుకుటయు గుమారపాలితుఁ డించుక నవ్వుచు, దేవా! ఇది యేమి చిత్రము. శుకశారికాప్రభృతి విహంగము విశేషములు మనుష్యులచేఁ చెప్పబడిన మాటలంబల్కుచుండుట దేవర యెఱుంగనిదియా? పూర్వము చిలుకలు మనుజులవలె బలుకుచుండునవి అగ్నిశాపంబునం జేసి శుకవచనము లపరిస్ఫుటములైనవి.

అని యతండు సమాధానము జెప్పుచుండఁగనే ఛండకిరణుండంబరతల మధ్యవర్తి యయ్యెనని తెలుపు భేరీనినాదముతోఁ గూడ మాధ్యాహ్నిక శంఖధ్వని బయలువెడలినది.

ఆ ధ్వని విని యమ్మహారాజు స్నానసమయమయ్యెనని తటాలున సింహా సనము నుండి లేచి రాజలోకమెల్ల సంభ్రమోత్సేకముతో గద్దియలు విడిచి వినయ వినమితోత్తమాంగులై నిలువంబడిన శిరఃకంపమున నాటికిఁ బోవుట కనుజ్ఞ నిచ్చుచు నచ్చండాల కన్యకతో మేము వచ్చు నందాక నిందుండుమని నియమించి యచ్చిలుకను లోపలకుఁ దీసికొనిపోయి స్నానపానాశనాదివిధులం దీర్పుమని తాంబులకరండ వాహి నికిఁ జెప్పి సముచిత మిత్రలోకము సేవింప నభ్యంతర మందిరమున కరిగెను.

అందు స్నానసంధ్యావందన దేవపూజాది నిత్యక్రియాకలాపములు

---

శ్లో॥ స్తనయుగమశ్రుస్నాతం సమీపతరవర్తిహృదయశోకాగ్నేః॥

నిర్వర్తించుకొని రాజబంధువులతో గూడ నభిమతరసాస్వాదంబున బ్రీతుండగుచు భోజనముగావించి ప్రతీహారిమార్గ మెఱింగింప మనోహరాలంకారమండితంబైన విశ్రమ మంటపమునకుఁబోయి శయనతలంబునఁ గూర్చుండి తాంబూలము వైచికొనుచు నాప్త వర్గంబు చుట్టునుం బరివేష్టించి వినోదకథలచే చిత్తము రంజింపఁజేయుచుండ నిండు వేడుకలతో నుండి యాభూమండలాఖండలుఁడు వైశంపాయనమును దీసికొనిరమ్మని ప్రతిహారి కాజ్ఞాపించుటయు నదిపోయి యత్యంత శీఘ్రముగా నా చిలుక పంజరము దెచ్చి రాజు ముందుంబెట్టెను. అప్పుడా భూపతి చిలుకంజూచి పతంగపుంగవా ! అభిమత భోజనంబున దృప్తుడవైతివే ? యని యడిగిన నది దేవా ! సమదకోకిల లోచనరుచిం బురడించు జంబూఫలంబు లెన్నేని యాస్వాదించితిని. హరినఖరభిన్న మాతంగ కుంభార్ద్రింబులగు ముక్తాఫలంబులం బోలిన దాడిమీబీజంబుల రుచి యేమనవచ్చును ? అన్నన్నా ! నళినీదళంబులు వోలె హరితములగు ద్రాక్ష ఫలముల మాధుర్య మెప్పటి కైన మఱువవచ్చునా? అయ్యారే! ప్రాచీనములగు నుసిరికాయల పస యనుభవించి తీర వలయును. పెక్కేల ! భవదంతః పురకాంతలు స్వయముగాఁ గరతలములచే నాకుఁ దినిపించినవన్నియు నమృతాయమానంబులై యున్నవని పెద్దగాఁ బొగడెను.

ఆ మాట లాక్షేపించుచు నా క్షితిపతి పక్షీంద్రమా! యది యట్లుండనిమ్ము. నీవే దేశమునం జనించితివి ? నీ తలిదండ్రు లెవ్వరు ? నీకు వేదశాస్త్రపరిచయ మెట్లు గలిగినది ? ఇతర విద్యావిశేషము లెట్లు గ్రహించితివి ? జన్మాంతరానుస్మరణమా ! లేక వరప్రదానమా ? అదియునుం గాక శుకరూపము దాల్చి ప్రచ్ఛన్నముగాఁ దిరుగుచున్న యొకానొక దివ్యుఁడవా ? నీకెన్ని యేండ్లున్నవి ? యింతకుముందు నీ వెందుంటివి ?

నీకి పంజరబంధము చండాలకన్యకాహస్తప్రాప్తియు నెట్లు కలిగినది ? నీ వృత్తాంతము విన మిక్కిలి కుతూహలమగుచున్నది. యెఱింగించెదవే యని యడిగిన నాపతంగప్రవర మాత్మగతంబున నించుక ధ్యానించి యిట్లనియె.

## చి లు క క థ

దేవా ! నాయుదంతము కడు పెద్దది. వినుటకు దేవర కిష్టమేని వక్కా ణించెద నాకర్ణింపుఁడు. వింధ్యారణ్యాంతర్భాగంబగు దండకారణ్యమునఁ బ్రసిద్ధిజెంది యున్న పంచవటీతీరమునఁ కనతిదూరములో నున్న పంపాసరోవరము పశ్చిమ భాగం బున శ్రీరామ శరప్రభంజితములగు సప్తతాళముల ప్రక్క నొక్క వృద్ధ శాల్మలీ వృక్షము గలదు.

అ త్తరువరంబు మూలఁబు దిక్కరి కరఁబులఁబోని జరదజగరంబుచేఁ జుట్టుకొనఁబడి యాలవాలము గట్టఁబడినట్లొప్పుచు శాఖా సమూహములచేఁ దిగంతముల నావరించి విలయవేళాతాండవ ప్రసారిత భుజుండగు శంకరు ననుకరించుచు సాగర

జలంబులం గ్రోలి యిటునటు సంచరించుచుఁ బక్షులవలె శాఖాంతరములయం దడఁగి యున్న మేఘంబుల చేఁగూడ నావరింపఁబడని యగ్రభాగముగలదై రవితురంగములకు నవరోధము గలుగఁజేయుటచే నలయిక జెందిన యశ్వారుపంబుల ముఖములనుండి వెల్వడు ఫేనపుంజమో యనఁబడు సితతూలికామాలికలచే నగశాఖలు ప్రకాశింప నాకల్పస్థాయియగు నున్నత స్కంధముతో నొప్పుచు నబ్బూరుగు మేరువువలెఁ బ్రఖ్యాతి జెందియున్నది.

మఱియు నత్తరువు విస్రబ్ధముగా జనులకారోహింప శక్యము కానిదగుట ఘాతుకులవలనఁ దమ కపాయము రాదని తలంచి శాఖాంతరముల యందును గోటరోదరముల యందును బల్లవాంతరముల యందును జీర్ణవల్కల వివరములయందును మిగులనవకాశము గలిగియుండుటచేత నానాదేశములనుండి వచ్చి శుకసంతతులు గూడులు కట్టుకొని హాయిగా సుఖించుచున్నయవి.

అందొక జీర్ణకోటరమందు జాతిపులుఁగులతోపాటు కులాయము నిర్మించుకొని భార్యతోఁ గూడ మాతండ్రి చిరకాలము సుఖించెను. విధివశంబున నతనికి ముదిమియందు నేనొక్కరుండ పుత్రుండ నుదయించితిని. నేను బుట్టిన యాక్షణము నందే యతిప్రబలమగు ప్రసవరోగంబున మా తల్లి పరలోకమున కతిథిగా నఱిగినది.

అభిమతజాయావినాశ శోకంబున గ్రుక్కుచుండియు మా తండ్రి సుతస్నేహంబున నాశోక మడచికొని తానొక్కరుండ యేకొరంతయు రానీయకుండ నన్నుఁ బెంచుచుండెను.

నా తండ్రి మిగుల వృద్ధుడగుట శిథిలములగు రెక్కలతో నెగరలేక వణకుచు గ్రుక్కినముక్క కొనచేత ఫలములజీర నశక్తుండై పరసీదములక్రింద నక్కడక్కడ జారిపడిన ఫలశకలంబులును తండుల కణంబులునుదెచ్చి నాకిచ్చుచు మద్భుక్తావశిష్టములచేఁ దాను సైత మాకలియడంచుకొనచుఁ గొన్నిదినములు గడిపెను.

ఇట్లుండ నొకనాఁడు ప్రాతఃకాలమున లేతయెండచే వనతరు శిఖరపల్లవంబులు వింతకాంతిఁ బ్రకాశింపుచుండ గొన్ని చిలుకలు మేతకై దిక్కుల కరుగ, మరికొన్ని పిల్లలతో గూడ గూడులయం దడఁగియుండ నిశ్శబ్దంగా నవ్వనస్థలి శూన్యమైనదివోలె నొప్పుచుండెను.

అప్పుడు నా తండ్రియు నన్ను రెక్కలలోఁ బెట్టుకొని ముద్దాడుచుండ నేనును బాల్యంబున నెగురుటకు రెక్కలురామింజేసి యతని యక్కులోఁ జిక్కి మిక్కిలి సంతోషముతో నుంటిని. అట్టి సమయమున నవ్వనమందు నాకస్మికముగా గుహాసుప్తంబులగు మృగేంద్రంబులఁ దద్దరిల్ల వనచరంబులుపరవ వరాహంబులార్వ శార్దూలాది క్రూర మృగసమూహంబు వెరబునంబార గంగాప్రవాహంబు ననుకరించుచు

సీ. ఇటు రండు గఱను లిచ్చటనుండు తుండ వి
ధ్వస్తపంకేజ గంధంబు వెదలె

నిండఁ దప్పక వసియించఁ గ్రోడములవి
  మసలుముస్త వాసనలు గడంగె
వనమహిషంబులవ్వలనుండు, తేఁగె గొ
  మ్ములఁ జిమ్మ వల్మీకముల రజంబు
కరికలభంబు లక్కడఁ గూడు, సల్లకీ
  రసకషాయామోగమెసఁగ నెసఁగె.

గీ. రుధిరపాటల కరికుంభ రుచిర మౌక్తి
కాంచితాంబీపదంబు లిందలరు సింహ
గణములవె చూడఁ దళినవఘాసకబళ
హరిణరోమంథ ఫేనసంహతులు దోఁచె.

చ. ఇదె చమరీమృగాళి వసియించెడు తాఁపఁ నాభివాసనల్
బొదలెడుఁ బారుచున్న వవె మూకలుగా మెకముల్ సమంబుగా
వదలుఁడు వేటకుక్కలను భద్రమువింట శరంబుగూర్పుఁడ
ల్లదె మెక మేదియోచనె రయంబునఁ గొట్టుఁడు పట్టుఁడుద్ధతిన్.

అని యొండొరులతోఁ బలుకుచున్న వేటకాండ్ర ఘోషమొండు వినంబడినది.

అశ్రుతపూర్వమగు నారొద విని నేను బాలుండనగుట చెవులు బీటలువార భయముచేత మేను గడగడ వడంక వివశత్వము నొంది సమీపమునందున్న తండ్రి యొక్క జరాశిథిలములగు రెక్కల సందున దూఁతిని.

అప్పుడా యరణ్యమంతయుఁ బారుచున్న గ్రూరసత్వముల యార్పులచే నల్లకల్లోలమైనది. మఱికొంతసేపునకా రొదయంతయు నణఁగి యయ్యడవి కల్లోలశూన్యమగు సాగరము లాగున నిశ్శబ్దమై యొప్పినది.

అట్టి సమయమున నేను శైశవచాపల్యంబునంజేసి యదియేమియో యని మా తండ్రి రెక్కలసందునుండి బైటికి వచ్చి కంఠముచాచి భీతిచే గదలుచున్న తారకలతో యారొదవచ్చిన దెసకే దృష్టి బఱికించితిని

అప్పుడా వంకనుండి కార్తవీర్యార్జున భయంబున బారి వచ్చుచున్న నర్మదానది పగిది జంఝామారుత విశీర్ణమగు తమాలకాననము వడువున నేకీభూతమగు కాళరాత్రి సంఘాతముభాతి సూర్యకిరణాకులమైన యంధకారము తీరున నయ్యరణ్యమంతయుఁ జీకటిఁగలుగఁజేయుచు ననేక సంఖ్యాకమగు శబరసైన్యము నా కభిముఖముగా వచ్చుచుండఁ జూచితిని.

ఆ సైన్యమధ్యంబున నుక్కుచే రచియింపబడినవో యనునట్లు కర్కశములగు నవయవములు గలిగి శ్యామలదేహ ప్రభాప్రవాహంబున నయ్యడవి యంతయు

నిండింపుచు నెఱ్ఱని దృష్టులు వింధ్యశిలాతల విశాలంబగు నురంబును మెఱయ స్థూల వరాటికా మాలికలచే నలంకరింపంబడి పతులం బంపవలదని తన్నుఁ బ్రతిమాలికొన వచ్చిన యాఁడు సింగంబులోయనఁ గౌలేయకుటుంబిను లనుసరింపఁ జమరీ వాలంబులు గజదంతంబులు కరిగండ ముక్తాఫలంబులు మయూరపింఛంబులు పిసితాహారంబులుగ్గకొని శబరపరిజనులు వెంటనరువఁ గృతాంతుని యంశావతారమన మహామోహిని సోదరునివలె నొప్పుచుఁ బ్రథమ వయసుననున్న మాతంగుడను పుళిందనాథుం గాంచితిని. వారాడుకొను మాటలు వినుటచే వాని పేరు మాతంగుఁడని యెఱింగితిని.

ఆహా! వీని జీవితము మోహప్రాయము. చరితము సాధుజన గర్హితము. ఆహారము మద్యమాంసాదికము. పరిశ్రమయంతయు జీవహింసయందు, ద్రాగుటయే యుత్సవము, చెరబట్టిన యుత్తమస్త్రీలే కళత్రములు, మృగములతో సహవాసము, పశురక్తంబున దేవతార్చనము, మాంసమున బలికర్మ యిట్టి వీనికిఁ గరుణ యెట్లుకలుగును. శాంతి పేరైనం దెలియునా? క్షమకెంతదూరము. వీనికి వివేకమెన్నఁడైనఁ గలుగునేమో! యని నే నాలోచించుచుండఁగనే యమ్మాతంగుఁ డరణ్య సంచార ప్రయాసమపనయించుకొనుటకై యా బూరుగు నీడ కరుదెంచి కోదండ మెక్కుడించి పరిజనోపనీతంబగు పల్లవాసనంబునఁ గూర్చుండెను.

అప్పుడు శబరయువకుఁ డొకండు వడివడి నాసరోవరంబున కరిగి చేతులతో జలంబుపైనున్న మలినంబు విడఁద్రోయుచుఁ గమలినీపత్ర పుటంబున నీరువట్టి బిసతంతువులఁ గొన్నిటిని కోసికొనివచ్చి యాయేలిక కర్పించెను. వాఁడా జలంబులం గ్రోలి చంద్రకిరణంబులం గ్రసియించు రాహువువలెఁ దామరతూడుల నమలి క్షుత్పిపాసల నపనయించుకొనియెను. వాఁడట్లు మాచెట్టునీడఁ గొంతసేపు విశ్రమించి పిమ్మట పుళింద సేనాపరివృతుండై యెందేనింబోయెను.

వారిలో నొక వృద్ధపుళిందుఁడు తినుటకు మాంసమబ్బమింజేసి యాఁకలిగొని వారితోఁబోవక యత్తరుమూలమున ముహూర్తకాలము జాగుజేసి మా యాయువుల గ్రోలువాడువలె నెఱ్ఱనిగడ్డలుగల దృష్టులతో నా వృక్షమెక్క నిశ్చయించి యామూల చూడముగాఁ దలపైకెత్తి చూచెను.

ఆ చూపువలననే శుకకులముల ప్రాణముల కుత్క్రాంతి సమయమైనది. కటకటా! అక్కటికము లేనివారికిఁ జేయరాని కృత్యము లుండునా? అనేక తాళోచ్ఛ్రాయముగల యాపాదపమును సోపానములు గలదానివలె సులభముగానెక్కి యెగిరి యెగరని పిల్లలను, ఎగరనున్న సిసువులను, గొన్ని దినముల క్రిందటఁ బుట్టిన పిట్టలను, రెక్కలు వచ్చుచున్న కూనలను శాల్మలీకుసుమ శంకాజనకములగు పోతముల నరసి యరసి శాఖాసందులనుండియు, గోటరములనుండియు, వేరువేరు ఫలములనువలె పెక్కురకముల శుకశాబకముల గ్రహించి ప్రాణములను పోగొట్టి నేలం బడవైచుచుండెను.

అప్పుడు మాతండ్రియు నకాండమునఁ దటస్థించిన యప్రతీకారము ప్రాణ

హరమునగు నుపద్రవమునుజూచి మరణభయంబున మేను గంపమునొంద నుద్భ్రాంత దృష్టులతో నలుమూలలు సూచుచుఁ దాలువులెండ నన్ను రక్షించు నుపాయంబుగానక తన రెక్కలసందున నిముడ్చుకొనిఁ గర్తవ్యతామూఢుండై ముక్కునఁ గరచుకొని యుండెను.

పిమ్మట నప్పాపాత్ముఁడు క్రమమ్మునఁ గొమ్మల పైకెక్కి మేమున్న తొఱ్ఱలో యమదండమునుంబోలు తన బాహుదండమును జొనిపి సారెసు ముక్కు కొనచేఁ గరచుచు నరచుచున్న మా తండ్రిని గట్టిగఁబట్టి పైకిఁదీసి గొంతునులిమి ప్రాణములు బోఁగొట్టెను.

మిగుల నల్పదేహము గలిగి భయముచేఁ దండ్రి రెక్కలసందున నడఁగి యున్న నన్ను నాఁడాయుశ్శేషము గలుగఁబట్టి బరికింపఁడయ్యెను.

ప్రాణములువిడచి తల్క్రిందులైచిన నా తండ్రిని యానిర్దయుండు అధోముఖముగా నేలంబడవిడచెను. నేనును మాతండ్రితోఁగూడ నేలం బడితిఁగాని దైవ వశంబునఁజేసి రాశిగానున్న యాకులపై బడుటచే నా కింతయేని యాయాసము గలిగి నదికాదు.

అక్కిరాతుండు చెట్టుదిగకమున్న నేను బాలుండనగుట దండ్రిచావు గణింపక ప్రాణపరిత్యాగ యోగ్యమగుకాలంబున నైన మించుక ఱెక్కలు విదళించుచుఁ గొంచెము కొంచెమెగిరి కృతాంతముఖ కుహరమునుండి వెల్వడినట్లు నాతిదూరములో నున్న యొక తమాలవిటపిం గాంచి దట్టమైన యా చెట్టు మొదలుచేరి పక్షసవర్ణములగు పర్ణముల సందున దాగియుంటిని.

అక్కిరాతుఁడు క్రమముగా నా చెట్టునంగల పిట్టల నెల్లఁబట్టి చెట్టుదిగి యసువులూడి క్రిందఁబడియున్న చిలుక నిసువులను జిక్కములోఁ బెట్టుకొని మాతంగుఁ డరిగిన తెరవుబట్టి యతివేగముగాఁ బోయెను.

తరువాత నేనించుక తలయెత్తిచూచుచు నాకు కదలినను వాఁడే వచ్చుచున్న వాఁడని బెదరుచు పితృమరణశోక ఖిన్నుఁడనై మిగుల దాహమగుచుండ నీరుండుతావర యుచు నామూలమునుండి యెగర దొడంగితిని. ఱెక్కలతో నెగరలేక పాదములతో నడచుచు ననభ్యాసంబునం జేసి యడుగడుగునకు నేలఁబడుచు నెగరబోయి యడ్డముగా బడి యొంటిఱెక్కతో నానుచు నొగర్చుచు మేనెల్లధూళిగాఁగఁ నిట్లాయాసముతోఁ గొంచెము దూరమైనను నడువలేక మిక్కిలి దాహము వేధింప మనంబున నిట్లు తలంచితిని.

అహో ? అతి కష్టములైన యవస్థలయందుగూడఁ బ్రాణులకు జీవితమందు నిరపేక్షత్వము గలుగదుకదా ? జంతువులకు జీవితముకన్న నభిమతమైన వస్తువు వేరొండులేదు. నా యందు మిగుల ననురాగముగల తండ్రి పరలోకగతుండైనను నాకు జీవితాశ వదలకున్నది. కటకటా ! నా హృదయమెంత కఠినమైనదో ? అతండు

నా తల్లిపోయినది మొదలు సకల క్లేశములుపడి నన్నుఁ బెంచెనే? అట్టివాని ప్రేముడి యంతయు గడియలో మరచిపోయితిని. నా ప్రాణము లెంత కృపణములో? ఉపకారము జేసిన తండ్రి ననుగమించినవి కావు. ఇట్టి సమయములో సైతము నన్ను జలాభిలాష బాధింపుచున్నయది. పితృ మరణమును లెక్క సేయని పాతకము నన్నిట్లు బాధింపు చున్నది కాబోలు అయ్యో! జలములు దాపునలేవు, నాలుక యెండిపోవుచున్నది. నడువలేను. వనభూమియంతయు నా తపముచే దప్తమైయున్నది. దాహమునను నిమిషము తాళజాలను. చూపులకుం జీకటిగ్రమ్ముచున్నది. కటకటా! విధియెంత ఖలుఁడో నాకు వేగము మరణమైనను గలుగజేయకున్నాఁడని యనేక ప్రకారములఁ దలపోయు చుంటిని.

ఆ ప్రాంతమందు జాబాలియను మహర్షి యాశ్రమముగలదు. అతని కుమారుఁడు హారీతకుండను వాఁడు సకలవిద్యా పారంగతుండు. సమవయస్కులగు మునికుమారులతోఁ గూడుకొని రెండవ మార్తాండునివలెఁ దపస్తేజంబున వెలుంగుచు నమ్మార్గంబున స్నానార్థమై పంపా సరస్సునకుఁ బోవుచు దాహపీడితుఁడనై నోరు తెరచుకొని దారిలో నొగర్చుచు బడియున్న నన్నుఁ జూచెను.

సత్పురుషుల హృదయములు కరుణాబంధురములు గదా! అట్టి యవస్థతో నున్న నన్నుఁజూచి యమ్మహాత్ముం డంతరంగంబునఁ బరితపించుచుఁ దోడి మునికుమారునితో వయస్యా! అటు చూడుము! ఆ శుకపోతము అజాతపక్షమై తలవాల వైచుకొని యున్నది. శ్యేనాదికము దీనిం బాధింపఁబోలు. దీని ప్రాణములు కంఠగతములై యున్నవి. నీరుకొరకుఁ గాబోలు మాటిమాటికి నొగర్చుచు నోరు దెరచుచున్నది. పాపము దీని ప్రాణములు వాయకమున్న జలప్రదేశమును జేర్పవలె మ్ము. దీని ప్రాణములు కాపాడిన కడుపుణ్యము రాగలదని పలుకుచు మెల్లన నన్ను మృదులమగు హస్తములతోఁ బట్టికొని యా సరస్తీరము జేర్చి దండకమండలము లోకచోటంబెట్టి యతి ప్రయత్నముతో ముక్తాఫలంబులంబోని జలబిందువులఁ గొన్నిటి నా నోటం బోసెను.

అప్పుడు నా మేనంతయుఁ జల్లబడినది. పోయిన ప్రాణములు తిరిగి వచ్చినవి. శరీరమున ధారుఢ్యము గలిగినది. పిమ్మట నన్నొక చెట్టునీడ నిలిపి తాను స్నానము గావించి నిర్వర్తిత నిత్యక్రియాకలాపుండై యమ్ముని కుమారుండు మిత్రవర్గముతో జలము వెడలి నన్నొకచేత బట్టికొని తన యాశ్రమమునకుఁ బోయెను.

అధికమహిమాస్పదంబగు నయ్యాశ్రమమున గురుతరయోగ నిష్ఠాగరిష్ఠుండై యున్న జాబాలిం జూచి నే నంతర్గతంబున నిట్లు తలంచితిని.

ఆహా! తపఃప్రభావము! ఈ మునిమార్తాండుని యాకారము శాంతమయ్యు మెరుపుతీగెయుంబోలెఁ జూపులకు మిరుమిట్లు గొలుపుచున్నయది. ఇమ్మహర్షి యుదాసీనుండైనను ప్రభావసంపన్నుఁడగుట మొదటఁ జూచినవానికి వెరపు గలుగక

మానదు. మహాత్ముల నామము స్మరించినంత నెట్టి పాపములైనం బోవుననుచో దర్శనము వచ్చు సుకృతము మాట జెప్పనేల ? సకల విద్యలు నీ మహర్షి ముఖమున నటించుచున్నయవి. అన్నన్నా ? ఈ ముదిమి కెంత భయములేదో ! యీ మహానుభావుని జటాకలాపమును సైతము తెలుపుజేసినది. తేజశ్శాలులలో నీతండగ్రేసరుఁడు. ఈ ముని కుంజరుఁడు కరుణారసప్రవాహము. సంసార సముద్రమునకు సేతువు, సంతోషామృతసారము, శాస్త్ర రత్నములకు నికషపాషాణము, ఈ పుణ్యాత్ముని తపోమహిమచేతఁగదా! మృగములిందు జాతివైరము మాని సంచరించుచున్నవి. అయ్యారే? మహాత్ముల ప్రభావము ఎంత విచిత్రమైనది. అని పెక్కు భంగుల నతని మహిమ నభినుతించుచున్న సమయంబున నన్నా హారీతకుఁడు రక్తాశోకతరు మూలమునకుం దీసికొనిపోయి యొకచోట నిలిపి తండ్రికి నమస్కరించి తానొక మూలఁ గూర్చుండెను.

అప్పుడచ్చటనున్న మునులు నన్నుఁజూచి శంకించుచు దీని నెచ్చటనుండి తెచ్చితివని హారీతకు నడిగిన నతండిట్లనియె.

నేను స్నానార్థమై పద్మ సరస్సునకుఁ బోవుచుండగా దారిలో నొక చెట్టు క్రిందఁ నెండతాపమున వాడి దుమ్ములో నోరు దెరచుకొని యొగర్చుచు నీ శుకపోతము నాకుఁ గనంబడినది.

అప్పుడు నాకు దయపుట్టి దీనిని సరస్సునకుఁ దీసికొనిపోయి తోయము ద్రాగించి సేదదీరినంత నిచ్చటికిఁ దీసికొనివచ్చితిని. రెక్కలు వచ్చువరకు నిందొక తరుకోటరమున నిడి, నీవార కణనికరముల చేతను, వివిధ ఫలరసముల చేతను నేనును నీ మునికుమారులును దీనిం బోషించువారము. రెక్కలు వచ్చిన తక్షణము గగన తలమున కెగిరి యిష్టము వచ్చిన చోటికిఁ బోవునది. ఇదియే నా యభిప్రాయమని పలికిన విని జాబాలి యించుక వేడుకతోఁ దలయెత్తి పుణ్యజలముల చేతఁ బవిత్రము చేయువాడుంబోలె నిర్మలమైన దృష్టులచే నన్ను వీక్షించుచు సారెసారెకు సాభిప్రాయముగా వితర్కించి నన్నుఁ జూచి తలయూచి తానుఁ జేసికొన్న యవినయమునకు ఫలం బనుభవించుచున్నాఁడని పలికెను.

తపఃప్రభావ సంపన్నంబగు దివ్యదృష్టిచేత సకల ప్రపంచమునంగల కాలత్రయ విశేషములు కరతలామలకముగాఁ జూడనోపిన యమ్మహానుభావుఁడట్లు పలికిన తోడనే యందున్న మునులందరు వెరగుపడి, మహాత్మా! ఇది పూర్వజన్మమందెవ్వరు? ఎట్టి యవినయ కృత్యము జేసి యిట్టి జన్మమెత్తినది ? దీని పేరేమి ? ఈ వృత్తాంతము వినుటకు మిగులఁ గుతూహలముగా నున్నది, వివరింపవే ! యని ప్రార్థించిన నతండు మునులారా ? దీని చరిత్రము కడువింతయైనది. మనకు స్నాన సమయమగుచున్నది.

మీరును నిత్యానుష్ఠానములు దీర్చుకొని ఫలహారములఁ దృప్తులై రండు. రాత్రి సావకాశముగా నుడివెదనని పలుకగా వారందరు సంతసించి వడిగాఁబోయి కాల్యకరణీయములం దీర్చుకొని తత్కథా శ్రవణకౌతూహలముతోఁ గ్రమ్మరం జనుదెంచి యమ్మహాముని సమక్షమందు యథానిర్దిష్టముగాఁ గూర్చుండిరి. అర్ధయామావశిష్టమగు రాత్రియందు సుధాకరకిరణములచే జగంబంతయు వెండిపూసినట్లు ప్రకాశింపుచుండ మలయమారుతములు మేనులకు హాయిసేయ హరీతకుఁడు మధురఫలరసంబుల నన్నుఁ దృప్తుంజేసి మునులతోఁగూడ నతని యొద్దకుఁ దీసికొనిపోయి వేత్రాసనంబునం గూర్చుండి జాబాలిశిష్యుండు పవిత్రపాణియై మెల్లగాఁ దాళవృంతమున వీచుచుండ రెండవ పరమేష్ఠివలె నొప్పుచున్న యా జాబాలికి నమస్కరించి సన్నెదుర నిలిచి వినయంబున నిట్లనియె.

తండ్రీ! యీ మునులందరు నీ చిలుక వృత్తాంతము వినుటకు మిక్కిలి వేడుకపడుచున్నారు. ఇది తొలిజన్మమందెవ్వరు! ఎందుండునది? ఏమి కారణమున నిట్టి జన్మమెత్తినది? సవిస్తరముగా నుడువుఁడని యడిగిన నజ్జడదారి సంతసించుచు వారినందరను గలయఁ గనుంగొని యిట్లని చెప్పందొడంగె.

## తారాపీడుని కథ

క. కలదుజ్జయినీ నగరం
బిలను మహాకాళ నామకేశ్వరలింగా
మలదీప్తి దీపితాలయ
కలితంబై చారుసౌధ కమనీయంబై.

అప్పీటి కథనాయకుండై తారాపీడుండను రాజు రాజ్యంబు సేయుచుండెను. అతండు నృగ, నల, నహుష, భరత, భగీరథ, ప్రభృతులగు పూర్వనృపతుల నతిశయించిన కీర్తిగలవాఁడై నీతిశాస్త్ర పారంగతుండును, ధర్మజ్ఞుండును యజ్ఞపూత విగ్రహుండునునై రెండవ ధర్మదేవతవలెఁ బ్రజలం బాలింపుచుండెను.

అతనియొద్ద సకలకలానిపుణుఁ డగు శుకనాసుండను మంత్రి ముఖ్యుండు గలఁడు. అతఁడు బ్రాహ్మణుండయ్యును, క్షాత్రంబున నత్యంత ప్రసిద్ధిఁ జెంది యుండెను. చంద్రునకు వెన్నెలవలె నమ్మహారాజునకు నలంకారమై విలాసవతి యను విలాసినీ లలామంబు మహిషీపదం బధిష్ఠించి యొక్కుడు మక్కువగలుగఁ జేయుచుండెను.

ఆ రాజు సప్తద్వీపముద్రితంబైన ధరావలయం బంతయు భుజబలంబున జయించి మంత్రి న్యస్తరాజ్యభారుండై యచ్చరలం బురడించు మచ్చెకంటులం గూడికొని గృహదీర్ఘికలయందును శృంగార సరోవరంబులయందును కేళీకోద్యానములయందును

క్రీడాశైలముల యందును సభీష్టకాముఁడై విహరింపుచు యౌవనమున ననవద్యమగు సుఖం బనుభవించెను.

ఒకనాఁడా యెకిమీఁడు విలాసవతీ భవనంబున కరుగుటయు నప్పుడప్పుడఁతి చింతాస్తిమితదీనదృష్టులతో శోకంబున మూకభావము వహించి చుట్టును బరిజనంబు బరివేష్టింపఁ గన్నీళ్ళచేఁ దుకూలము దడుపుచు నెడమచేతిపై మోమిడుకొని శయ్యపైఁ గూర్చుండి చింతించుచు భర్తరాకఁ దెలిసికొని ప్రత్యుదానాదివిధులం దీర్చినది.

అప్పుడా నరపతి యాసతీవతంసంబును దొడపై నిడుకొని కన్నీరు దుడుచుచు దేవీ! నీవేమిటి కిట్లు ముక్తాఫలజాలంబుఁ బోనియశ్రుబిందుసంతోహంబుల రెప్పల గుప్పుచుంటివి ? కృశోదరీ ! ఏమిటి కలంకరించుకొంటివి కావు ? నీ విరక్తికిఁ గారణమేమి ? నేను నీకెద్దియేని యనిష్టమైన పనిఁ గావించితినా చెప్పుము. నా జీవితము రాజ్యము నీ యధీనమై యున్నవి. వేగము విచారకారణం బెరింగింపు మని బ్రతిమాలు కొనియెను.

అప్పుడయ్యంబుజాక్షి తాంబూలకరండవాహిని మకరికయనునది మల్లన నా భూవల్లభుని కిట్లనియె. దేవా ! దేవర దేవిగారివిషయమై కొంచెతయేమియుం జేసి యుండలేదు. వినుండు. నాకీమహారాజుతో సమాగమము విఫలమైనది గదా యని యమ్మగారు చింతించుచుండఁగనే చాలాకాలము గతించినది. శయనాసనస్నానభోజన భూషణ పరిగ్రహాదులగు దివసవ్యాపారములఁ బరిజనప్రోత్సాహంబున నెట్టకే కష్టంబునఁ గావింపుచుండునని, అట్టి వికార మెన్నఁడును హృదయ పీడాజీహీర్షచేఁ దెలియ నిచ్చినదికాదు. నేఁడు శివరాత్రియగుట మహాకాళనాథు నారాధింప దేవళమున కరిగినది. అందొకచో మహాభారతము జదువుచుండఁ గొండొకసేపు కూర్చుండి యాలకించినది. అందు సుతులు లేనివారికి గతులు లేవనియుఁ బున్నామ నరకము బుత్రులుగాని తప్పింపలేరనియు లోనగు వృత్తాంతము విని యింటికివచ్చినది మొదలా విషయమే ధ్యానించుచు మేమంత బ్రతిమాలినను గుడువక కట్టక ప్రత్యుత్తరమీయక యిట్లు దుఃఖించుచున్నది. ఇదియే యీయామె శోకకారణమని పలికి మకరిక యూరకొన్నది.

ఆ కథవిని యొడయుం డొక్కింతతడవు ధ్యానించి వేడినిట్టూర్పు నిగుడింపుచు నిట్లనియె. దేవీ! యూరడిల్లుము. దైవాయత్తమగు కార్యమును గురించి మన మేమిచేయఁ గలము? దేవతలకు మనయెడ, గనికరము లేకపోయినది. వెనుకటిజన్మమున మంచి కర్మ చేసితిమి కాము, ఇటుపిమ్మట మనుష్యులకు శక్యమైన పనులనెల్లఁ గావింతముగాక. గురుభక్తి నిల్పరిగాఁ జేయుము. దేవపూజలు విశేషముగాఁ గావింపుము. మునిజనసపర్యల నాదరముతోఁ జేయుము. వారు దుర్లభములైన వరముల నీయఁగలరు. చండకౌ ప్రసాదంబున బృహద్రథుండు జరాసంధుండను పుత్రుం బడయలేదా? దశ వృద్ధుండయ్యు విభండకనందను నారాధించియే కాదా ! రామలక్ష్మణ లను పుత్రులంగాంచెను. మునిజనసేవ యెన్నఁడును వ్యర్థమ

కేమని వక్కాణింతును. రాత్రింబగళ్ళు ననపత్యతా దుఃఖాగ్ని నన్ను దహించుచున్నది. రాజ్యంబును, జన్మంబును విఫలమని తలంతును. తలోదరీ! శివులగర్భుండు మనకు ప్రసన్నుండు కాదయ్యెను. నేనేమిజేయుదును. నీశోకానుబంధము విడువుము ధైర్య మవలంబింపుము. బుద్ధిని ధర్మకార్యములందుఁ బ్రవేశపెట్టుము. అని శోకాపనోద నిపుణంబులగు ప్రియవాక్యంబులచే నత్తలోదరి నాశ్వాసించి కొంతతడవందుండి యతండు నిజభవనంబున కరిగెను.

అది మొదలమ్మదవతియు దేవతారాధనములయందు బ్రాహ్మణ పూజా యందును వెనుకటికన్నఁ బెద్దగా నాదరముగలిగియుండెను. పుత్రోదయ హేతుభూత మగు వ్రత మెవ్వరెట్టిది జెప్పినను గష్టములకోర్చి యట్టిది గావించునది చండికాయ తనంబుల శయనించి యనేకోపవాసములఁ గావించినది. వృద్ధగోపవనితలు మన్నింప స్వరలక్షణ సంపన్నంబులగు గోవుల పొదుగులదాపున నిలచి సర్వౌషధీమిశ్రితంబులగు పాలతో స్నానంబు కావించినది. కనకమణి వినిర్మితములగు తిలపాత్రముల దానము లిచ్చినది. అనేకసిద్ధాయతనముల సేవించినది. ప్రసిద్ధములగు నాగహ్రదంబుల మునింగినది. అశ్వత్థప్రభృతివనస్పతులకుఁ బ్రదక్షిణము లొనర్చినది. నడివీధుల దధ్యోదనము వాయసములకు బలివైచినది. భక్తితోనగ్న క్షపణకాదుల నెందరినో ప్రశ్నలడిగినది. నిమిత్తజ్ఞుల నారాధించినది. వృద్ధులు చెప్పిన రహస్య క్రియలన్నిటిని గావించినది. ఉపశ్రుతుల నాలించినది నిమిత్తముల గ్రహించినది. తనకువచ్చు స్వప్న విశేషంబుల గురువులకు నివేదించునది.

ధృతవ్రతయై యయ్యువతి యట్లు చేయుచుండ నొకనాఁడు తారాపీడుండు అల్పావశేషమగు రాత్రియందు సమున్నత సౌధాగ్రవర్తినియై యున్న విలాసవతీదేవి మొగంబున సకల కలాపరిపూర్ణుండగు చంద్రుండు ప్రవేశించుచున్నట్లు కలఁ గాంచెను. దిగ్గున లేచి సంతోషాతిశయముతో నాక్షణమ సంజే శుకనాసుని రప్పించి యా వృత్తాంత మెరిఁగించుటయు హర్షపులకిత గాత్రుండై యతండిట్లనియె.

దేవా! సీ... లములో మన ప్రజల మనోరథములు సఫలములఁ గాగలవు. కొలఁదిదిన... శరముఖావలోకనసుఖం బనుభవింపఁగలము. మద్ధర్మపత్ని యొక బ్రాహ్మణుండు దివ్యవస్త్రాలంకారభూషితుండై ...ంబగు పుండరీక మిడినటు నాకును నిన్న రాత్రియే కల నంబడుచున్నవి. శుభోదర్కము దాపుననే యున్నదని చేయి బట్టుకొని హృదయానందమును వెల్లడించుచు యిరువుర స్వప్న వృత్తాంతములను విలాసవతి నోలలాడించెను.

...ప్రభుకా ...ములలోఁ గుమా ...నోరమ తొడయం ...సహస్రదళ శోభిత ...నిమిత్తములు గ ...కుం దలసి

...ంచినంత దేవతా ప్రసాదంబున విలాసవతి గర్భ ...నాసి యొకనాఁడా వృత్తాంతము శుకనాశునితో

సుచ్చరించుచున్న దాని చెవిలో వైచినది. అశ్రుతపూర్వమగు నవ్వాక్యము విని యజనపతి మేనంబులకలుద్భవిల్ల సంతసమభినయించుచు శుకనాసుని మొగ ముపలక్షించెను. శుకనాసుండయ్యుత్సవము గ్రహించి దేవా! మనకు వచ్చిన కలలు సత్యములైనవా యేమి? వినుదనుక నా హృదయము తొందరపడుచున్నదని యడిగిన నతండు సంతోషముతో దాదిచెప్పిన మాటల నెఱింగించెను.

రాజప్రధాను లిరువురు నిరతిశయ సంతోష సముద్రమున మునుంగుచు నప్పుడే శుద్ధాంతమున కరిగి యావార్త సత్యమని తెలిసికొని బ్రాహ్మణులకు షోడశ మహాదానంబులును గావించి పుత్రోదయ సమయ మరయుచుండిరి.

అంతఁ గాలక్రమంబునఁ బ్రసవసమయము సంపూర్ణమైనంత నద్ధరాకాంత నిల్లాటు శుభదివసంబున నుత్తమలగ్నంబున నంబుద మాలిక యిరమ్మదమునుబోలె సకలలోక హృదయానందకరుండగు కుమారుం గాంచినది.

అప్పు డంతఃపురజనులు భూమి చలింప నిటునటు పరుగులిడువారును మంగళగీతముల బ్రయోగించువారును, తూర్యనినాదములు వెలయించువారునై కోలాహల ధ్వనులచే నాదేశము నెల్ల నిండింపఁ జేసిరి. ఆ నగరమందే కాక యా దేశమందెల్ల జను లుత్సవములు సేయందొడంగిరి.

తారాపీడుఁడు శుకనాసునితోఁగూడ బుత్రుం జూచు వేడుక బ్రబలదూర్వా ప్రవాళమాలాలంకృతంబైన సూతికా గృహంబున కరిగి యందుఁ బొలుత నుదకము నగ్నిని స్పృశించి పిమ్మట విలాసవతి తొడపై దీపమువలెఁ బ్రకాశించుచున్న కుమారు దూరవిస్ఫారితములగు నేత్రములచేఁ బానము జేయువాఁడుంబోలె వీక్షించుచు మిక్కిలి సంతోషించెను. తన్నుఁ గృతకృత్యునిగాఁ దలంచుకొనయెను.

అప్పుడు శుకనాసుండా బాలకుని యవయవములన్నియు నిరూపించుచు నిట్లనియె. దేవా! చూడుము. గర్భసంపీడనవశంబునం జేసి యంగశోభ స్ఫుటము గాకున్నను జక్రవర్తి చిహ్నములఁ బ్రకటనజేయుచున్నవి.

సంధ్యాకిరణరక్తుండగు బాలశశిరేఖం బురడించు లలాటపట్టిక యందు నళినీ తంతువులం బోలిన సూక్ష్మరేఖలెట్లు ప్రకాశించుచున్నవో పరిశీలింపుము. ఆకర్ణాంత విశాలములై పుండరీకమువలెఁ దెల్లనై కుటిలములైన కనుబొమ్మలచే ముద్దులు మూట గట్టుచు వెలికాంతుల వెదజల్లుచున్న వీని కన్నులఁగంటివా?

సీ. కరతలంబులు సుకోకనదకుట్మలలోహి
తములు చక్రాదిచిహ్నములనొప్పె
బదయుగంబమరఁదు పల్లవమృదులంబు
కులిశ ధ్వజాది రేఖలఁదలిర్పె

ఫాలంబు శిశునిశాపాలాభిరామంబు
సార్వభౌమాంకలక్షణత మెఱసె
గనుఁగవ సితపద్మ క్రమంబు త్రిభువన
ప్రభుతానుభావమై వక్షము దెలిపె.

గీ. గంటివే వీనిరూపముత్కంఠవొదమె
నోనరేశ్వర ! వింటివే వీనికంఠ
రవము దుందుభివలె సుస్వరత నెసంగె
వీఁడు త్రోవఁగఁజాలు నీవిశ్వమెల్ల.

అని యబ్బాలిక శిఖామణి యంగశోభావిశేషముల వర్ణించుచున్న సమయంబున ద్వారస్థులనెల్ల ద్రోసికొనుచు నతిరయంబున నొక పురుషుం డరుదెంచి తేసికి మ్రొక్కి దేవా ! విజయమగుఁగాక. శుకనాసుని భార్య మనోరమకు రేణుకకుఁ బరశురాముండు వోలెఁ గుమారుం డుదయించెనని యెఱింగించెను.

అమృతోపమితములగు నప్పలుకులు విని యజనపతి బాష్పపూరిత నయనుండై యోహో ! కల్యాణపరంపర ! మిత్రమా ! శుకనాస ! విధి సమాన సుఖదుఃఖత్వమును సూచింపుచు నీదవోలె నన్ననుగమించెంగదా ? అని పలుకుచు నా వార్త తెచ్చిన పురుషున కపరిమితముగాఁ బారితోషికమిచ్చి యప్పుడమియొడయఁడు ప్రగ్గడతోఁగూడ నతనియింటి కరిగి తత్సుతముఖ దర్శనంబు గావించి పుత్రోత్సవము పంచి పెట్టించెను.

క్రమంబునఁ బురిటిరాత్రులు గడచినంత మహావైభవముతో యథావిధి జాతకకర్మాది విధులు నిర్వర్తించి, స్వప్నంబునఁ జంద్రమండలము సతీముఖంబునం బ్రవేశించుచున్నట్లు చూడఁబడుటం జేసి రాచపట్టికిం జంద్రాపీడుఁ డని పేరుపెట్టెను.

శుకనాసుఁడును, రాజానుమతి బ్రాహ్మణకులోచితములైన విధులన్నియుం దీర్చి కుమారునకు వైశంపాయనుడని నామకరణము జేసెను.

కాలక్రమంబున నాఁబాలునకు శైశవ మతిక్రమించినంతఁ దారాపీడుఁడా నగరమున కనతిదూరములో మనోహర మణిశిలా లలితమగు విద్యామందిరము గట్టించి సకలవిద్యాపారంగతులగు నుపాధ్యాయులఁ బెక్కండ్ర నియమించి వైశంపాయనునితోఁ గూడఁ జంద్రాపీడుం జదివింపుచుండెను.

రాజపుత్రుఁడు మంత్రిపుత్రునితోఁగూడ ననన్యగతమానసుండై యచిరకాలములో నాచార్యులవలన మణిదర్పణముల వలె నక్రమముగా సమస్త విద్యలుం గ్రహించెను.

సీ. మరి పదవాక్యప్రమాణంబులను శబ్ద
శాస్త్రమ్మునం దర్థశాస్త్రమందు

నయశాస్త్రముల నభినయశాస్త్రములఁ జాప
 చక్ర కృపాణాది సాధనముల
గజతురంగాది శిక్షలఁ జిత్రరత్న ప
 రీక్షల యంత్రతాంత్రికములందు
గావ్యనాటక వరాఖ్యాయి కాదుల సర్వ
 లిపి సర్వభాషా విలేఖనముల.
గీ. గ్రంథరచనల శిల్పకర్మల నశేష
కళల శృంగారరస దలంకారములను
సకలవిద్యల నక్కుమారకుల కపుడు
కలిగె నత్యంత పాండిత్య కల్పనంబు.

మరియు నారాజపుత్రునకు బాల్యమునందె సర్వలోక విస్మయ జనకమగు మహాబలంబు గలిగియుండెను.

యదృచ్ఛముగా నెమరుపడిన కరికలభంబుల చెవులు పట్టుకొని వంచిన నవి సింహపోతభంజితములవలెఁ గదలలేక నిలువంబడునవి.

కదళీకాండమువలెఁ దాళవృక్షముల నొక్కవ్రేటున నఱికివైచును. పరశురాముండువలె నతండేయు బాణములచేఁ బర్వతములు గూడఁ జిల్లులు పడుచుండును. పదుగురు మోయలేని యినుపదండ మవలీలఁ గేలం దాల్చి గిరగిరఁ ద్రిప్పును.

ఒక మహాశక్తి తక్క తక్కిన విద్యలన్నియుఁ జంద్రాపీడునితో సమముగా వైశంపాయనుఁడు గ్రహించెను. విద్యాపరిచయ బహుమానంబున శుకనాసునియందుఁ గల గౌరవమునఁ బుట్టినది మొదలు పాంసుక్రీడ లాడుచు నేకముగాఁ బెరుగుట లోనగు కారణములచే రాజపుత్రునకు వైశంపాయనుఁడు రెండవ హృదయమువలె విస్రంభపాత్రమగు మిత్రమై యొప్పుచుండెను. నిమిషమైన వాని విడిచి యొక్కఁడు వసింపఁడు.

వైశంపాయనుఁడును సూర్యుని దివసమువలె విడువక సంతత మనుసరించి తిరుగుచుండును. అట్లు విద్యాభ్యాసము చేయుచుండ బ్రదోషమునకుఁ జంద్రోదయము వలె సముద్రున కమృత రసమట్లు కల్పపాదపమునకు ప్రసూనోద్గమముభంగి కమల వనమునకు సూర్యోదయము భాతి సౌందర్యమున కధికశోభ దెచ్చుచు నా నరేంద్ర నందనునకు యౌవనోదయమైనది.

సమయము నరసి మన్మథుఁడు సేవకుఁడువలెనే వారి నాశ్రయించెను. లక్ష్మితోగూడ వక్షస్థలము విస్తరించెను. ఇట్లు వారు సమారూఢ యౌవనులును సమాప్త సకల విద్యగులు నగుచుండ వారి వార్తవిని తారాపీడుఁడు మిగుల సంతసించుచు బలాహకుఁ డను సేనాపతిఁ బిలిచి శుభముహూర్తమున వారిం దోడ్కొని రమ్మని యాజ్ఞాపించెను.

అతండును విద్యాగృహమునకుఁ బోయి వైశంపాయనునితో విద్యాభ్యాసము చేయుచున్న చంద్రాపీడునిం గాంచి నమస్కరించి తదానతి నుపవిష్టుండై యిట్లనియె.

భర్తృదారక ! నీవు సకల విద్యలయందును బ్రౌఢుఁడవైనట్లు విని తారాపీడుఁ డెంతేని సంతసించి చంద్రదర్శనమునను సముద్రుండువలె నిన్నుఁ జూచుటకుఁ గోరుచున్నవాఁడు. మీరు విద్యాభ్యాసమునకుఁ బ్రారంభించి పది సంవత్సరము లయినది ఆరవయేటఁ బ్రారంభించుటచే నేఁటికిఁ బదియారేఁడుల ప్రాయము గలిగి యుంటిరి. మీ తల్లులు మిమ్ముఁ జూచుటకు మిగుల వేడుకపడుచున్నారు. యౌవన సుఖముతోఁ గూడ రాజ్యభోగ మనుభవింపుము. రాజలోకమును సన్మానింపుము. బ్రాహ్మణులఁ బూజింపుము. ప్రజలఁ బరిపాలింపుము. ఇంద్రాయుధమను తురగ రత్న మిదిగో యర్పించిరమ్ము. మీ తండ్రిగారికి దీనిఁ బారశీకదేశపు రాజు సముద్రములోఁ బుట్టినదనియు నతివేగము గలదనియుఁ గానుకగాఁ బంపెను. దీనింజూచి పరీక్షించిన వారు ఉచ్చైశ్శ్రవమునకుఁగల చిహ్నము లున్నవని చెప్పుచున్నారు. చూడుఁడని పలుకగా విని యా రాజకుమారుఁడు వైశంపాయనునితోఁ గూడ నా యశ్వలక్షణములన్నియుం బరీక్షించి వెరగందుచు నది యమానుషమని చెప్పుచు దానికి ముమ్మారు వలగొల యాగుర్ర మెక్కెను.

అప్పు డ త్తత్తడి సంతసింపు దానివలె తోక నాడించుచు సకిలించినది. అదియే శుభశకునముగాఁ దలంచి విద్యాగృహము బయలువెడలి వైశంపాయనుఁడును వేరొక తురగ మెక్కి తోడరా రాజమార్గంబున నడచుచుండెను.

రాజపుత్రుండు సమాప్త సకలవిద్యుండై విద్యాగృహమునుండి వచ్చుచున్నవాఁడను వార్త విని పౌరకాంతలెల్ల నుల్లము లుత్సుకోత్పుల్లములై యొప్పు దెప్పున నప్పురుషరత్నముం జూడ వేడుకపడుచు సగముసగముగా నలంకరించుకొనియుఁ బూరికాకుండఁగనే సౌధాంతరంబులం జేరి మరకతవాతాయన వివరములనుండి యా నరేంద్రనందను నీక్షింపఁదొడంగిరి.

అప్పుడా మేడలనుండి మకరధ్వజవిజయ నినాదము ననుకరింపుచు రమణీమణుల మణిభూషణ ఘోషము శ్రోత్రపర్వముగాఁ బయలువెడలినది. మురహర రక్షాములో నంతఃపురములన్నియు యువతిజన నిరంతరములగుట శ్రీ మయములైనట్లు ప్రకాశించినవి.

కౌతుకప్రసారిత నయనలై చూచుచున్న యమ్ముగువల హృదయంబు లద్దములవనె నారాజసూనుని యాకృతి నాకర్షించినవి. అప్పుడా విఖ్యాత మదనరసావేశహృదయలై యమ్మదవతు లొండొరులు సపరిహాసముగా సాక్షేపముగా సాభ్యసూయముగా సోత్ప్రాసముగా నిట్లు సంభాషించుకొనిరి.

ఓసీ ! వేగముగాఁ బరిగెత్తుచుంటివి. నేనుఁగూడ వచ్చెదఁ గొంచెము నిలువుము.

ఆహా ! నీ మోహము ! రాజపుత్రుం జూచినతోడనే యున్మత్తురాలవై పోయితివే ? యుత్తరీయము స్వీకరింపుము.

చపలురాలా ! మోముదమ్మిం గ్రమ్ముచున్న యలకమ్ముల ముడిచికొని మరియుం జూడుము.

మూఢురాలా ! శిరముపై చంద్రలేఖ వ్రేలాడుచున్నది. సవరించుకొనుము ! జవ్వనీ ! ఏమి నీ యౌవనమదము నన్ను నొక్కిఁ గ్రుక్కఁ జేయుచుంటివి. వెనుకకు జరుగుము.

సిగ్గులేనిదానా ! కట్టిన దుకూలము జారుచున్నది చూచుకొమ్ము.

మత్సరురాలా ! ఎంతసేపు చూచెదవు ? నీవుకాని యితరులకు వేడుక లేదనుకొంటివి కాబోలు ! తొలగి నాకుఁ జోటిమ్ము.

అమ్మా ! కాణాచివి. నీవే ముందరకు రమ్ము.

నీవొక్కరితవే గవాక్షమరికట్టితి వేట్లు ?

ఓహోహో ! నీ మిథ్యావినీతత్వ మెఱింగితినిలే. ఈ వారచూపువేల ? విస్రబ్ధముగాఁ జూడుము.

ముగ్ధురాలా ! మదనజ్వర పులకజాలము మేనం బొడమినది. కప్పికొనుము.

అనంగపరవశురాలా ! నాకట్టిన వస్త్రము నుత్తరీయముగాఁ బూనుచుంటివి విడువుము ?

శూన్యహృదయురాలా ! నీవిప్పు డెక్కడ నుంటివో తెలిసికొనలేకుంటివే ?

అత్తగారు చూచి యాక్షేపించుననియా ? పరుగిడి లోపలికి బోవుచుంటివి ?

లఘుమతీ ! రాజపుత్రుం డవ్వలకు బోయెఁ గన్నులం దెరువుము.

ఓహో ! పతివ్రతాశిరోమణీ ! చూడఁదగిన వస్తువుల జూడక నీ కన్నులం వంచించుచుంటివి గదా !

ప్రియసఖీ ! పరపురుష దర్శనపరిహారవ్రతము విడిచి త్రిలోకమోహజనకుండు రతివిహితుండు నగృహీతమకరధ్వజుండు నగు నీమకరధ్వజు నీక్షింపుము. ధన్యురాల వగుదువు.

ఆహా ! ఆ మోము అయ్యారే ? ఆ తళుకు చెక్కులు, బాపురే ? ఆ బాహువులుఁ భళిరే ! పేనురంబు. ఈ సుకుమారుని బుత్రునిగాఁగనిన విలాసవతి యెంత

ధన్యురాలో ! నీనిం భర్తగాఁబడయఁబోవు పూవుఁబోడి యెంత తపంబు గావించి నదియో ? అని యంతఃపురకాంతలెల్ల స్తుతియింపుచుండఁ జిత్రగమనంబులఁ బెక్కండ్రు వారవధూ రౌతులు చుట్టును పరివేష్టించి నడుచుచుండ గ్రమంబునఁ బోయిపోయి యాస్థాన సమీపమున కరిగి ద్వారదేశమునందే గుర్రమును డిగి వైశం పాయనుని కైదండఁగైకొని బలాహకుఁడు వినయముతో ముందు నడచుచు దారిఁజూపు చుండఁ గక్ష్యాంతరములు గడచి కైలాసగిరి విలాసమునం బ్రకాశించు గృహసభా మంటపంబు చేరంజని యందు,

సీ. కనకవేత్రములఁ గైకొని దర్పము దలిర్ప
ద్వారపాలురు బరాబరులు సేయ
ఆహిదీప్త పాతాలగుహలట్లు పొలుచు నా
యుధశాలలను యోధులోలగింప
జము నోలగమున నొజ్జం బోలెఁ దగులేఖ
కులు శాసన సహస్రములు లిఖింప
క్షితినాథ దర్శనాగతసర్వదేశభూ
పతితతిస్తవ రవార్భటులు సెలఁగ.

గీ. వేశ్యలిరువంక చామరల్ వీచుచుండ
గవులు గాయక వందిమాగధ విదూష
కులు భజింపఁ నిలింపయు కుఁడు మహేంద్రు
కరణిఁ గొలువున్న ధరణీంద్రుఁ గనియె నతఁడు.

కర విన్యముడై నమస్కరించుచున్న పుత్రుం జూచి, తండ్రీ ! రమ్ము రమ్మని చేతులు సాచుచు నానందభాష్పపూరిత లోచనుండై రాజు మేనం బులక లుద్భవిల్ల పుత్రుం కౌగలించుకొనియెను.

తరువాత సుతనిర్విశేషుండగు వైశంపాయనునిం గూడ గాఢాలింగము గావించి ముహూర్తకాలము వారిం బరీక్షించి చూచుచు, వత్సా ! మీ తల్లి నిన్నుఁ జూచు కై వరితపించుచున్నది సత్వర మామెయొద్ద కరుగుమని నియమించుటయు చంద్రుడికి నమస్కరించి వైశంపాయనునితోఁ గూడ విలాసవతీ యంతఃపురమున కరిగి యామెకు నమస్కరించెను.

ఆమెయుఁ దొందరగా లేచి బరిజనముస్నను తానే యవతరణమంగళ కృత్యంబుల నిర్వర్తించి తనదిష్టద్ది నభిలషించుచు శిరమునూర్కొని గాఢాలింగనము గావించుచు నానందభాష్పములచే నతని శిరంబు తడిపినది. తరువాత వైశంపాయనుని గూడ నాదరించి కరతలంబునఁ గుమారుని శిరంబు దువ్వుచు, వత్సా ! నీ తండ్రి కడు గఠినుడు సుమీ ! నిన్నింతకాలము నాకుఁ గనఁబడకుండ దూరముగానునిచి కష్ట పర

చెనే? కఠినమగు తండ్రిగారి యాజ్ఞ నీవెట్లు కావించితో తెలియదు. నీవు పిల్లవాఁడ
వైనను నీ హృదయము శిశుజన క్రీడాకౌతుకలాఘవము గాదు. ఎట్లయినను గురు
ప్రసాదంబున సమస్తవిద్యాయుక్తుండవై చూడఁబడితివి. ఇఁక ననురూపవధూయుక్తుండ
వగు నట్లు చూడఁగోరుచుంటినని పలుకుచు లజ్జాస్మితావనత ముఖుండైయున్న పుత్రుని
చెక్కులు ముద్దుపెట్టుకొన్నది.

చంద్రాపీడుం డట్లు కొంతసేపందుండి తల్లి యానతి బూని వైశంపాయను
నితోఁ గూడ నటనుండి శుకనాశుని భవనమున కరిగి యందనేక నరపతి సహస్రమధ్య
వర్తి యగు శుకనాశునికి వినయముతో దూరమునుండియే యనతమౌళియై నమస్కా
రము గావించెను.

అమ్మంత్రి సత్తముం డతని లేవనెత్తి యానంద బాష్పపూరితనయనుండై
వైశంపాయనునితోఁ గూడ గాఢాలింగనము గావించెను. రాజపుత్రుండును, మంత్రి
పుత్రుండును సముచితాసనోప విష్టులైయున్న సమయంబున నందున్న సామంతరాజు
లెల్లఁ దమ పీఠంబుల విడిచి నేలం గూర్చుండిరి. అప్పుడు మేనం బొడమిన పులక
లచే హృదయగతహర్ష ప్రకర్షము వెల్లడించుచు శుకనాసుం డిట్లనియె.

తాత! చంద్రాపీడా! సమాప్తవిద్యుండవు సమరూఢయౌవనుండవు నగు
నిన్నుఁజూచుటచే నిప్పటికి మాతేనికి భువనరాజ్య ఫలప్రాప్తి గలిగినది. గురుజనాశీర్వా
దము లన్నియు నిప్పటికి ఫలించినవి. అనేక జన్మోపార్జితమగు సుకృతము నేటికి
పండినది. కులదేవత లిప్పటికి ప్రసన్నులైరి. పుణ్యహీనులకు మీ వంటి యుత్తమును
పుత్రులుగా జన్మింతురా? నీ వయసెంత? అమానుషశక్తి యెంత? విద్యాగ్రహణ
సామర్థ్య మెంత? అహా! ఈ దేశ ప్రజలందరు ధన్యులుగదా? ఈ భూభార
మంతయు దంష్ట్రిచే మహావరాహమువలెఁ దండ్రితోఁగూడ వహింపుము.

అని పలుకుచు స్వయముగాఁ గుమాలకులకుఁ గుసుమాభరణాంగరాగాదు
లొసంగి యాదరించెను. తరువాత నాతని యనుమతివడసి రాజపుత్రుండు మిత్రునితో
గూడ మంత్రిపత్ని మనోరమంజూచి యామె దీవెనలు నంది యటఁ గదలి తండ్రి
గారిచేఁ గ్రొత్తగాఁ దమకై నిర్మింపబడిన రాజకులముయొక్క ప్రతిచ్ఛందకము వలె
నున్న మేడకుం బోయెను.

మరకతమణులచేఁ దోరణములు గట్టఁబడినవి. అనేక కనకదండ చిత్రపతా
కము లెగురుచుండెను. తూర్యనాదము ప్రమోగించిరి. మహావైభవముతో నమ్మేడఁ బ్రవే
శించి చంద్రాపీడుఁడు వైశంపాయనునితోఁ గూడ వేడుకగాఁ గొన్నిదినములు
గడిపెను.

మఱియొకనాఁడు కైలాసుండను కంచుకి పత్రలేఖయను నంబుజ నేత్రను
వెంటఁ బెట్టుకుని యచ్చటికి వచ్చెను. శక్రగోపకా తుల్యమగు నరుణాంశుకము ముసుం
గుగావైచికొని బాలాతపమునఁ బ్రకాశించు తూర్పుదిక్కువలె మెఱయుచు రాజకుల

సంవాసప్రగల్భయయ్యు వినయమును విడువక రాహుగ్రాసభయంబునఁ జంద్రకిరణముల విడిచి పుడమికవతరించిన జ్యోత్స్న యోయన లావణ్యయుక్తమును తెల్లనిదేహకాంతి గలిగి సర్వాంగసుందరియు సకలాభరణ భూషితయునై తొలిప్రాయంబున నొప్పు చున్న యా యొప్పుల కుప్పం జూచి రాజపుత్రుండు వెరగుపాటుతో నీవెవ్వంత యీబాలిక నేమిటికిఁ దీసికొనివచ్చితివని యడిగినఁ గైలాసుండు వినయముతో నమస్కరించుచు నిట్లనియె.

కుమారా! విలాసవతీ మహాదేవిగారు తమ కిట్లాజ్ఞాపించుచున్నారు. ఈ చిన్నది కులూతేశ్వరుని కూఁతురు దీనిపేరు పత్రలేఖ. మీ తండ్రిగారు దిగ్విజయము సేయుచుఁ గులూతరాజధానిం జయించి వంది జనముతోఁగూడ నీచేడియం దీసికొని వచ్చి యంతఃపుర పరిచారికా మధ్యంబున నుంచిరి.

నేనీ బాలికామణి వృత్తాంతము విని యనాథయని జాలిగలిగి రాజపుత్రిక యని గౌరవించుచుఁ బుత్రికానిర్విశేషముగా లాలించుచు నింత దనుకఁ బెనిచితిని. ఇప్పుడిప్పుడఁతి నీకుఁ దాంబూల కరండవాహినిగా నుండునని యాలోచించి యమ్మించు బోఁడి నీకడకనిపితిని. నీవీ పువుఁబోఁడిం బరిజనసామాన్య దృష్టిం జూడఁ గూడదు. బాలికనువలె లాలింపవలయును. చిత్తవృత్తివలెఁ జపలక్రియలవలన మరలింపవలయును. శిష్యురాలిగాఁ జూడఁదగును, మిత్రుఁడువోలె విస్రంభకార్యములకు నియోగింపవలయును. పెనిచినమోహంబునం జేసి కన్నబిడ్డలయందువలె నాకు దీనియం దెక్కుడు మోహము గలిగియున్నది. మహారాజ కులప్రసూత కావున గౌరవింప నర్హురాలు. కొలఁది దినములలో దీని సుగుణసంపత్తి నీకే తెలియఁగలదు. దీనిశీలమెఱుఁగవు కావున నింతగాఁ జెప్పుచుంటిని.

అని చెప్పి కైలాసుఁ డూరకున్నంతఁ దనకు నమస్కరించుచున్న యా చిన్నదాని నొక్కింతతడవు తెప్పవాల్పక చూచి రాజపుత్రుండు, కైలాసా! అమ్మగారెట్లాజ్ఞాపించిరో యట్లు కావింతునని చెప్పుము, పొమ్ము. అని పలికి వానినంపెను.

అది మొదలమ్మదవతియు నిద్రించుచున్నను, మేల్కొన్నను, దిరుగుచున్నను రాత్రిం బగలునీడవలె రాజపుత్రుని పార్శ్వము విడువక సేవించుచుండెను. చంద్రాపీడుండును బత్రలేఖం జూచినది మొదలామెయందుఁ బ్రతిక్షణము వృద్ధిఁబొందు చున్న ప్రీతిగలవాఁడై తన హృదయముతో సమానముగఁజూచుచు విస్రంభకార్యములను నియోగింపుచుండును.

అట్లు కొన్నిదినములు గడచినంత నాభూకాంతుఁడు పుత్రకుని యౌవ రాజ్య పట్టభద్రునిఁగా జేయదలంచి సంభారములన్నియు సమకూర్చుచుండెను. అప్పు డొకనాఁడు దర్శనార్థమై వచ్చిన చంద్రాపీడునిం జూచి శుకనాసుఁడు సంతసించుచు రాజనీతి నిట్లుపదేశించెను.

# రా జ నీ తి

తాత ! చంద్రాపీడ ! సమస్త శాస్త్రములు నభ్యసించి వేదితవ్య మంతయు గురుతెఱింగిన నీకు మేమేమియు నుపదేశింపనవసరములేదు. స్వభావముచేతనే వ్యాపించిన యౌవనతమము సూర్యప్రభచేతను రత్నకాంతులచేతను, దీపరుచులచేతనుఁ బోవునదికాదు. లక్ష్మీమదము సైతము దారుణమైనదే, యైశ్వర్యతిమిరాంధత్వము అంజనసాధ్యమైనదికాదు. దర్పదాహజ్వరము శిశిరోపచారముల నుపశమింపదు. విషయ విషాస్వాదనమోహము మంత్రశతంబున నశింపునదికాదు. రాగమలావలేపనము స్నానంబునం బోవునదిగాదు. గర్భేశ్వరత్వము, యౌవనత్వము, అనుపమసౌందర్యత్వము, నొక్కొక్కటియే యవినయమునకుఁ దావలమగుచుండ నన్నియు నొక్కచోనుండు నప్పుడేమి చెప్పఁదగినది ?

యౌవనారంభమందు శాస్త్రజలములచేఁ గడుగఁబడినను బుద్ధికాలుష్యము నొందకమానదు తరచుమౌనుల దృష్టి రాగముతోఁగూడుకొని యుండును. నీ వంటి వారే యుపదేశమున కర్హులు. స్ఫటికమణి యందుఁ జంద్రకిరణములువలె నిర్మలమగు మనంబున నుపదేశగుణములు ప్రవేశించును. గురువాక్యము నిర్మలమైనను జలమువలె దుర్జనులకు శ్రవణగతమై శూలము గలుగఁజేయును. అనాస్వాదిత విషయ సుఖుండవగు నీకిదియే యుపదేశసమయము. కుసుమశర ప్రసార జర్జరిత హృదయులగు వారికుపదేశము జలమువలెనే నిలవక జారిపోవును. చందన వృక్షమునఁ బుట్టినయగ్ని మాత్రము దహింపకుండునా ? బడబాగ్ని యుదకముచేత నడంగునా ? జనులకు గురూపదేశము ప్రక్షాళనము వంటిది. విశేషముగా రాజుల కుపదేశించువారులేరు. జనులు ప్రతిధ్వని వలెనే రాజవాక్యముల ననుసరించి పలుకుదురు

ధనమదులు దర్పశ్రవణపూరితములగు చెవులుఁగలవారై గురూపదేశములను వినరు. విన్నను గజములవలె గన్నులు మూయుచు నుపదేష్టలను బాధింపుచుందురు. ధనము అతిశాభిమానముఁ గల్పించును. రాజ్యలక్ష్మి తంద్రీప్రదమైనది. రాజ్యలక్ష్మి సరస్వతీయుతుం డగువాని నసూయంబోలె జూడనీయదు. గుణవంతు నపవిత్రు పగిది ముట్టనీయదు సుజను ననృతునివలెఁ బరిహసించును. వినీతు మహాపాతకుపగిది దాపుఁ జేరనీయదు అది తృష్ణావిషవల్లులకు సంవర్ధనధార, ఇంద్రియమృగములకు వ్యాధగీతి, మోహదీర్ఘనిద్రకు విభ్రమశయ్య, ధనమద పిశాచములకుఁ దిమిరసంహతి, అవినయమున కుత్పత్తిస్థానము. అన్నన్నా ! రాజ్యలక్ష్మిచేత నాలింగితులగు రాజు లొడలెఱుంగ దురా ? అభిషేక సమయమందే మంగళకలశ జలములచే దాక్షిణ్యము కడగఁబడుచున్నది.

అగ్ని కార్యధూమముచేత హృదయము మాలిన్యము బొందుచున్నది. పురోహితుని కుశాగ్ర సమార్జనముచేత శాంతి పోవుచున్నది. చామరపవనముచేతనే సత్యవాదిత యెగిరిపోవుచున్నది.

అతి చంచలమగు రాజ్యసంపదలను జూచుకొని గర్వించుచు రాగమగ్నులై యరుదైనను ననేక సహస్రములఁ బాతిబోచు నింద్రియ సుఖములచేత వివశత్వము నొందుదురు. అహా! ధనమదులు ఆసన్న మృత్యులవలె దగ్గిరనున్న బంధువులను సైతము గురుతెరుంగరు. ముఖరోగులు వలె గద్దముగా మాట్లాడుదురు. అంధులవలె దాపున నున్నవారి సైతము జూడలేరు.

జూదము వినోదమనియు, వేట పాటవమనియు, పానము విలాసమనియు, స్వదారపరిత్యాగము అవ్యసనత్వమనియు, నృత్యగీత వేశ్యా ప్రసక్తి రసికతయనియు దోషములను సైతము గుణములుగా వర్ణించుచు స్వార్థనిష్పాదనపరులు ధనపిశితగ్రాసగృధ్రులు నగు వంచకుల మాటలను సంతసించు రాజుల శిరి యల్పకాలములో నశించును.

అమానుషోచితములగు స్తోత్రవాక్యములు విని యాత్మారోపణము చేసికొను వారు సర్వజనులకుఁ బరిహాసాస్పదు లగుదురు. కుమారా! నీ వెన్నఁడును ఇట్టి దుర్వృత్తుల జీతమునుఁ జొరనీయకుము. వంచకుల సంతికమునకుఁ జేరనీయకుము. సర్వదా సజ్జనగోష్ఠిని మెలంగుము. సాధుఁ దిరస్కరింపకుము. కర్ణేజపులమాటల వినకుము. పరిచారకులకుఁ జనువీయకుము. రాగలోభాదుల హృదయంబున నంటనీయకుము. అభిజాతునైనను, పండితున్నైనను, ధీరునైనను రాజ్యలక్ష్మి దుర్వినీతుని జేయుం గావున నీకింత సెప్పితిని నీకు నా బోధయేమియు నవసరములేదు. రాజ్యభారము వహింపుము. ప్రజల దయతోఁ బాలింపుమని రాజనీతి యంతయు నతని కుపదేశించెను.

అప్పుడు చంద్రాపీడుఁడు శుకనాసుని వాక్యంబులచేతఁ బ్రక్షాళితుండు వోలె నభిషిక్తుని వగిది నభిలిప్తుని చందమున నలంకృతుని భాతిఁ బ్రీతహృదయుండై కొంతొకవడి ధ్యానించి యతని యనుమతి నాత్మీయభవనమునకుఁ బోయెను.

అంతట దారాపీడుఁడు శుభముహూర్తమునఁ జతుస్సముద్ర జలంబులం దెప్పించి బ్రాహ్మణాశీర్వాద పురస్సరముగాఁ జంద్రాపీడుని యౌవరాజ్య పట్టభద్రునిం జేసెను.

అప్పుడు ప్రజలందరు నానందసాగరమున నీదులాడిరి. చంద్రాపీడుఁడు సింహాసనమెక్కిన గొద్దిదినములకే తండ్రియనుమతి వడసి శుకనాసుని శాసనప్రకారము చతురంగ వాహినీ పరివృతుండై వైశంపాయనుఁడు తోడరాఁ జిత్రలేఖతోఁగూడ దిగ్విజయయాత్ర వెడలి క్రమంబున బూర్వదక్షిణ పశ్చిమోత్తరదేశములఁ దిరిగి శరణాగతుల రక్షించుచు దుర్మార్గుల శిక్షించుచు భీతుల నోదార్చుచు రాజపుత్రుల కభిషేకము జేయించుచు రత్నముల స్వీకరించుచు నుపాయనములఁ గైకొనుచుఁ బన్నులఁ దీసికొనుచు విజయచిహ్నము లాయాచోట్ల స్థాపించుచు శాసనముల లిఖింపుచు బ్రాహ్మణులఁ బూజించుచు మునుల కాశ్రమములఁ గల్పించుచు బరాక్రమము వెల్లడించుచు గీర్తిని వెదజల్లుచు భూమండలమంతయు దిరిగి విజయస్తంభంబుల నాటి మరలి తన పురంబున కరుదెంచుచు నొకనాఁడు కైలాససమీపమునఁ జరించెడు హేమ

అటులను కిరాతులకు నివాసస్థానమై పూర్వసముద్రమున కనతి దూరములోనున్న సువర్ణపురమును జయించి స్వీకరించెను.

మరియు రాజపుత్రుఁడు ఆ నగరమందు నిఖిల ధరణీతల పర్యటనమువలన నలసిన తన బలమునకు విశ్రాంతిగలుగుటకై కొన్నిదినములు వసించెను.

# కిన్నర మిధునము కథ

ఆ రాజకుమారుం డొకనాఁడు ప్రాతఃకాలమున నింద్రాయుధ మెక్కి యొక్కరుఁడ విహారార్థమై యా ప్రాంతారణ్యమునకుఁ బోయి యందందు సంచరించుచు దైవయోగంబున నొకచోఁ బర్వత శిఖరము నుండి దిగుచున్న కిన్నరమిధునమునుఁ జూచెను.

అపూర్వవస్తు విశేషదర్శనంబున మిగుల సంతసించుచు నతం డమ్మిధునమునుఁ బట్టుకొనఁదలంచి తురగమును మెల్లగా దాని దాపునకుఁ బోనిచ్చెను.

అప్పు డెప్పుడును జూడని పురుషునిం గనుటచే నమ్మిధునంబు వెరపు గదురఁ గాలికొలఁది పరువెత్తఁదొడంగెను

చంద్రాపీడుండును మడమలచేఁ గొట్టుచు నత్తత్తడి వడిగాఁ బరుగిడ సేనానివేశమునువిడచి యమ్మిధునమువెంట నొక్కరుండ మిక్కిలి దూరముగాఁ బోయెను.

అతని తురగ మతివేగముగాఁ బోవుచుండుటచే నమ్మిధునము దొరకునట్లే కనంబడుచు నెక్కడను జిక్కక యొక్క ముహూర్త మాత్రములోఁ బదియేనామడ నడచి యతండు చూచుచుండగనే యందున్న పర్వతశిఖర మెక్కినది

అంతవరకు నొక్కఁడు లాగునవచ్చి యప్పటఁ బ్రస్తర శకలము లత్తురగ గమనమున కంతరాయము గలుగఁజేయ శ్రమజెంది మేనెల్లఁ జెమ్మటలు గ్రమ్మ నడచుచున్న గుఱ్ఱమునునిలిపి తనకుఁదా నవ్వుకొనుచు నతం డాత్మగతంబున నిట్లు తలంచెను.

అన్నన్నా ? చిన్నవాఁడువలె నేను కిన్నర మిధునము వెంటవచ్చి యూరక శ్రమపడితిని. దొరికినను దొరకకున్నను దీనితో నాకేమి ప్రయోజనమున్నది బాపురే ? నిరర్థకవ్యాపారమున నాకింత యాసక్తి యేలపుట్టవలయును ? చేసిన కార్యము లేమైనం దీనజెడిపోవుచున్నవా ? లేక మిత్రులకుఁజేసి నయుపకృతి నిలుపఁబడుచున్నదా ? అయ్యారే ! విచారింప దీనివెంట నేనింతదూర మెందులకు వచ్చితినో తెలియకున్నది. తలంచుకొన నాకే నవ్వువచ్చుచున్నది అయ్యయ్యో ! ఇప్పటికి నాబలమెంత దూరములో నున్నదియు తెలియదు. నాతురగము నిమిషములోఁ బెక్కుదూరము నడువనోపును. నేను గిన్నర మిధునమందు దృష్టియిడి యతివేగముగా వచ్చుటచే నిప్పుడు తిన్నగా నేదారినిఁబోవలయునో తెలియకున్నది. ఈ యరణ్యములో బ్రయత్నముతోఁ వెదకినను దారిజెరిగించు మనుష్యుఁడెవ్వఁడును గనంబడకున్నాడు. యిది దేవభూమివలె

తోచుచున్నది. ఇందు మనుష్యసంచార ముండదు. ఇది యుత్తరదేశముగావున నేను దక్షిణముగా బోయి చూచెదను. నాను జేసిన కర్మలయొక్క ఫలము ననుభవింప వలయునుగదా ? అని యూహింపుచు మెల్లగాఁ దురగమును దక్షిణదిశకు మరలించెను.

అట్లు మరలించి అయ్యో! యిప్పుడు సూర్యుఁడంబరతలమధ్యవర్తియై యున్నవాఁడు. ఈ ఘోటకము మిక్కిలి యలసినది. యిది కొంచెము మేసినతరువాత నీరుద్రావించి నేనును నీరుద్రాగి యలసట దీర్చుకొని ముహూర్తకాలము విశ్రమించి పిమ్మటం బోయెదను.

అని నిశ్చయించి నీరందు లావిరయుచుండ నొకదండ జలపక్షులెగురు టయుం గనిపెట్టి యమ్మార్గంబున బోవబోవ మనోహర తరుషండ మండితమగు నచ్ఛోదమను సరోవర మొండు గనంబడినది. చూచినంతమాత్రమున మార్గాయాస మంతయు నపనయింపఁ జేసిన యక్కాసారంపు శోభంజూచి యతండాత్మగతంబున నిట్లు తలంచెను.

అహా? కిన్నరమిథునానుసరణము నిష్ఫలమైనను ఇప్పుడీసరోవరము గనఁ బడుటచే సఫలమైనదే తలంతును. నా కన్నులు గలిగి సందులకుఁ జూడఁదగినవస్తు వునుఁ నేటికిఁజూచితిని రమణీయమగునాసలో నిది విశదిగా భావింతును. దీనిసృష్టించిన స్రష్టతిగా నమృతసరస్సేమిటికి సృజించెనో తెలియదు ఇది యమృతమువలె సకలేంద్రియముల నాహ్లాద పెట్టుచున్నది. దీనింజూచియే భగవంతుండగు వాసుదేవుండు జలశయనము విడువకున్నాడు అన్నన్నా! అమ్మహాను భావుం డిట్టిదాని విడిచి లవణరసపరిపూర్ణంబగు జలధి జలముల నేటికి శయనించెనో తెలియదు. నిక్కము. ప్రళయకాలమందుం బలె జలలేశము గ్రహించి మహావలాహకములు భూమినంతయు ముంచుచున్నయవి.

అని యిట్లు విచారించుచు సికతాతలవిలసితమగు తదీయ దక్షిణతీరమునఁ దురగమును దిగి దానినీరు ద్రాగించి యొక తరుమూలమునఁగట్టి యత్తటాకతీరమున మొలచిన దూర్వా ప్రవాళ కబళములఁ గొన్ని స్వయముగాఁ బెరికితెచ్చి దానిముందు వైచెను.

తరువాత నాతఁడందుదిగి కరచరణములఁగడిగికొని బాలకమువలె జలమ్ముఁగ్రోలి స్మరశరాతురుండుం బోలె నళినీదళముల నురమున గాల్పుచు గొంతసేపవ్విధాన మంతయుంజూచి తలయూచి మరలఁ దీరముజేరి యందొకశిలాతలంబునఁ దూఁడులతోఁ గూడ నళినీదళంబులం గొన్ని దెచ్చికొనివచ్చి యాస్తరణముగా వైచి యందు శిరంబున జుట్టికొన్న యుత్తరీయము పరచి కూర్చుండెను.

ముహూర్తకాలమట్లు విశ్రమించినంత నాప్రాంతమున మేయుచున్న యింద్రాయుధము మేతమాని చెవులు నిక్క బెట్టుకొని యట్టిక్కు చూచుటయుఁ జమత్కారణమరయ నతఁడుచెవులు వీణాతంత్రీ ఝుంకార మిశ్రితమగు నమానుషగీత మొండు వినంబడినది.

విగతమర్త్యసంపాతముగల యీప్రదేశమునందు నిట్టి గీతధ్వని పుట్టుటకుఁ గారణమెద్దియో? యని శంకించుచు నక్కమలినీపత్ర సంసరణము నుండిలేచి యతఁడు ఆ గీతానాదము నేతెంచిన దిశకు దృష్టి ప్రసరింపఁజేసెను. ఆ ప్రదేశ మతిదూరముగా నుండుటచేఁ బ్రయత్నముచేతఁ జూచినను నేమియుఁ గనంబడినదికాదు, అనవరతమా గాన స్వానము మాత్రము వినంబడుచున్నది. అప్పుడా గీతముకారణమరయుటకు మిక్కిలి కౌతుకమందుచు నారాజకుమారుఁడు ఇంద్రాయుధము నెక్కి గీతప్రియమున ముందుగా బయలువెడలిన వనహరిణములు మార్గమును జూపుచుండ నేలా లవంగ లవలీలతాలోల కుసుమ వాసితములకు సప్తచ్ఛద తరువులచే మనోహరమైన తత్తటాక పశ్చిమతీరము ననుసరించి యరిగెను.

అట్లు పోవంబోవఁ దదుత్తరతీరంబున మనోజ్ఞతరులతావేష్టితమైన సిద్ధాయతనమొండు అతనికి నేత్రపర్వము గావించినది. స్ఫటికశిలావినిర్మితమగు నమ్మంటపమధ్యభాగంబున మందాకినీ పుండరీకములచే నర్చింపఁబడిన స్ఫటికలింగ మొండు విరాజిల్లుచున్నది.

అమ్మహాలింగమునకు దక్షిణభాగంబున బ్రహ్మాసనము వైచుకొని హంస శంఖ ముక్తాఫల గజదంత పారదసాధ ధవళవస్తుజాతమును గరగించి యమృతరసముతోఁ బదునుపెట్టి చంద్రకరకూర్చంబుచే సవరించి పోసెనోయనఁ దెల్లనిమేనికాంతి దీపింప బాలార్కప్రభాసదృశములగు జటామాలిక యుత్తమాంగమున ముడివైచికొని నక్షత్రక్షోదముఁబోసి భస్మము లలాటమున మెఱయ నమలకీఫలస్థూలములగు ముక్తాఫలములచేఁ గట్టఁబడిన యజ్ఞసూత్రము గంఠమునం గట్టికొని కుచమధ్యంబునం బిగియంగట్టిన కల్పతరులతావల్కలోత్తరీయము ఏకహంసమిధున సనాథయగు శ్వేత గంధం బురడింప స్వభావముచేఁ దెల్లనైనను బ్రహ్మాసనమందుఁ దానముగా నిడిన చరణకాంతి సంక్రమించుటచే లోహితాయమానమగు దుకూలములచేత నావృతమగు నితంబముగలిగి నఖమయూఖములు ప్రతిఫలింప దంతమయమైన వీణను దక్షిణ కరంబునం బూని మూర్తీభవించిన గాంధర్వ దేవతయోయనఁ దంత్రీనాదములతోఁ గంఠస్వానము మేళగించి పాడుచుఁ బాశుపతవ్రత మనుసరించి దివ్యాకృతితో నొప్పుచున్న యొక చిన్నదానిం గాంచి మేనుపులకింప నాస్పృహనందనుఁడు సంభ్రమముతో నాతురంగమును దిగ్గి యావారువమును చేరువ నొకతరు మూలమునం గట్టి యమ్మహాలింగము చెంతకుంబోయి నమస్కరించుచు నక్కాంతారత్నము ననిమేషదృష్టుల మరల నిరూపించి చూచి తదీయ రూపాతిశయమునకుఁ గాంతివిశేషమునకు వెరగందుచు నిట్లు తలంచెను. అన్నన్నా! జంతువులకు నప్రయత్నమునవే వృత్తాంతరములు దోచుచుండునుగదా! నేను యదృచ్ఛముగా వేటకు వెడలినంత గిన్నర మిధునమునఁ దివ్యజనసంచారయోగ్యమగు ప్రదేశమును గానంబడినది. అందు సలిలము వెదకుచుండ

సిద్ధజనోపస్పృష్ట జలమగు సరోవరము జూడనయ్యె. తత్తీరమున విశ్రాంతివహించి యుండ నమానుష గీతము విననయ్యె. దానిననుసరించి రాఁగా సిందుమానుష దర్శన దుర్లభయగు నీచిన్నది కన్నులకు విందు గావించినది.

ఇక్కురంగనయన దివ్యాంగనయని తదాకారమే చెప్పుచున్నయది, ఆహా! మనుష్యాంగనల కిట్టి సౌందర్యమును గాంధర్వమును గలిగియుండునా? దైవవశంబున నీ యోషారత్న మంతర్ధానముఁజెందని యెడ నీవెవ్వతెవు? నీపేరేమి? ప్రథమవయస్సున నిట్టి వ్రత మేమిటికిఁ బూనితివని యడిగెదనుగదా! అని తలంచుచు నాస్ఫటిక మంటపములో వేరొక స్తంభము మాటునం గూర్చుండి యమానుషగీత సమాప్త్యవసరము ప్రతీక్షించుచుండెను.

ఆ నాతియుఁ గీతావసానమున పీఁటంగట్టి లేచి యమ్మహాలింగమునకుఁ బ్రదక్షిణము చేయుచు నొకమూల వినమ్రముఖుండై యున్న యారాజకుమారుని నిర్మల మగు దృష్టి ప్రసారముచేతఁ బవిత్రము చేయునదివోలె వీక్షించుచు నిట్లనియె.

అతిథికి స్వాగతమే? ఈ మహాభాగుండీ భూమి కేటికివచ్చెనో! అతిథి సత్కారమంత లేచి నాతో రావలసియుండెనుగదా? యని పలికిన విని యచ్చంద్రాపీడుండు తత్సంభాషణ మాత్రముననే తన్ననుగ్రహించినట్లు తలంచు కొనుచు భక్తితో లేచి నమస్కరించి భగవతీ! భవదాజ్ఞానుసారంబున మెలంగువాఁడ నని వినయమునుఁ జూపుచు శిష్యుండువోలె నయ్యించుబోఁడి ననుగమించి నడచుచు నిట్లు తలంచెను. మేలుమేలు? నన్నుఁ జూచి యీ చిన్నది యంతర్ధానము నొంద లేదు. ఇదియు మదీయహృదయాభిలాష కనుకూలించియే యున్నది. తపస్విజనదుర్లభమగు దివ్యరూపముగల యీకలికికి నాయెడ నింత దాక్షిణ్యము గలుగునో యట్లు మెలంగువాఁడ. అడిగినచో తనవృత్తాంత మిత్తన్వి నాకుఁ జెప్పకమానదు, కానిమ్ము. సమయమరసి యడిగెదనని తలంచుచు నూరడుగులు అప్పడఁతి వెంట నడిచెను.

పగలైననుఁ దమాలతరుచ్ఛాయలచే రాత్రింబవలె తోచు నమ్మార్గం బున నడువ మణికమండలు శంఖమయభిక్షాపాత్ర భస్మాలాబుకాదివస్తువులచే నొప్పుచుఁ గ్రాంతనిర్ఝరీజలకణములచేఁ జల్లనైయున్న గుహయొకటి గానంబడినది.

అయ్యిందుముఖి యచ్చంద్రాపీడుని గుహాముఖశిలయందుఁ గూర్చుండఁ గనుసన్న జేయుచు నవ్వీపంచిని వల్కలతల్ప శిరోభాగ మందుంచి పణస్పుటంబున నిఘుర్ఝరజలంబుఁబట్టి యర్ఘ్యముగా నిచ్చుటయు నతండు భగవతీ! చాలుచాలు అత్యాదరమును విడువుము. నీకటాక్షలేశమే మదీయ పాపసముదాయముల బోగొట్టినది శిష్యు నన్ననుగ్రహింపుమని పలుకుచున్నను విడువకచ్చేడియ బలాత్కారముగా నతని కతిథి సత్కారము దీర్చినది. అతండును వంచిన శిరస్సుతో నతివినయముగా నయ్యాతిథ్య మందుకొనియెను.

అట్లాతిథ్యమిచ్చి యచ్చేడియ వేరొక శిలాతలమునఁ గూర్చుండి యొక

క్షణ మూరకొని పిమ్మట నతని నాగమనకారణం బడుగుటయు నారాజపుత్రుండా పద్మనేత్రకు తాను దిగ్విజయయాత్రకు వెడలినది మొదలు కిన్నరమిథునానుసరణముగా వచ్చి యచ్చిగురుబోడిం జూచు వరకు జరిగిన వృత్తాంత మంతయుం జెప్పెను.

అతని వృత్తాంత మంతయును విని యాజవ్వని సంతసించుచు భిక్షా కపాలమును గైకొని యవ్వనతరువులయొద్దకుం బోయెను.

అప్పుడు స్వయంపతితములైన ఫలములచే నా పాత్ర నిండినది. వానిం గొనివచ్చి యచ్చిన్నది యుపయోగింపుడని చంద్రాపీడు నొద్ద నుంచినది.

ఆ చిత్రమంతయుం జూచి యతండు తలయూచుచు అన్నన్నా! తపంబునకసాధ్యమైనది లేదుగదా? అచేతనములగు నీవృక్షములుగూడ నీమె దయనుం గోరుచున్నవిపోలె వినమ్రతతో ఫలములనిచ్చినవి. ఆహా! ఇంతకన్న నబ్బురమెద్ది అదృష్టపూర్వములగు నాశ్చర్యములం గంటినని మిగుల విస్మయము జెందుచు లేచి యచ్చటికింద్రాయుధమును దీసికొనివచ్చి యనతిదూరమునం గట్టి యందున్న నిర్ఝరజలంబున స్నానముజేసి యమృతరసమధురములగు నా ఫలముల దిని చల్లని నీరు గ్రోలి నాయువతిగూడ ఫలాహారము చేసివచ్చువరకు నేకాంతప్రదేశమునం గూర్చుండెను.

నిత్యక్రియాలాపములు దీర్చుకొని ఫలరసముల ననుభవించి యాయింతు బోడియు నొక శిలాతలంబునం గూర్చుండునంత నాప్రాంతమునకుం బోయి చంద్రాపీడుండు ననతిదూరంబునం గూర్చుండి యతి వినయముతో నిట్లనియె.

భగవతీ! భగవదనుగ్రహ ప్రాప్తిప్రేరకమైన సంతోషముచేతం బ్రోటు పడుచు మానుషసులభమైన లాఘవము నన్ను నిచ్చలేకున్నను ప్రశ్నకర్మకుం బ్రోత్సాహపరచుచున్నది. ప్రభువుల యనుగ్రహలేశము గూడ నధీరులకుం బ్రాగల్భ్యము గలుగఁజేయును. సహవాసము కొంచమైనను బరిచయమును గలుగజేయక మానదు. ఉపచార పరిగ్రహ మల్పమైనను ప్రణయ మారోపించును. నీకు ఖేదకరము కాదేని నాయడుగు ప్రశ్నమున కుత్తరమియ్య వేడెదను. నిన్నుఁ జూచినది మొదలు నాకీ విషయమై మిగుల కౌతుకము గలిగియున్నది. సురముని గంధర్వ గుహ్యకాదులలో నీజన్మము చేత నెవ్వారి కులము పావనమైనది? కుసుమ కోమలమగు నీవయసున నిట్టి కఠిన వ్రతమేమిటికిం బూనితివి? అన్నన్నా! ఈప్రాయమేద? యీయాకారమేద? యీలావణ్యమేద? యీతపమేద? నాకు మిక్కిలి యక్కజముగా నున్నది?

సురలోక సౌఖ్యములు గల యాశ్రమములను విడిచి నిర్జనమగు నీ యడవిలో నొంటిగా నేమిటికి వసించితివి? యిట్టి చిత్రములు నే నెచ్చటను జూచియుండ లేదు. నీ వృత్తాంత మంతయు నెఱింగించి నా సంశయమును దీర్చుమని మిక్కిలి వినయముతోఁ బ్రార్థించెను.

అతని మాటలు విని యవ్వనిత యెద్దియో హృదయంబున ధ్యానించి

ముహూర్తకాల మూరకొని నిట్టూర్పులు నిగిడింపుచు ముక్తాఫలంబు బోలిన యశ్రుజల బిందువులు నేత్రకోణంబులనుండి వెల్వడి స్తనవల్కలమును దడియఁజేయఁ గన్నులు మూసికొని వెక్కి వెక్కి యేడువఁదొడంగినది.

అట్టికారణముగా విచారింపుచున్న యాయన్నుమిన్నం జూచి వెరగందుచు నతఁ డాత్మగతంబున నిట్లు తలంచెను. అన్నన్నా ! వ్యసననిపాతములు దుర్నివారములై యవిగదా ? మనోహరమగు నిట్టివంటి యాకృతులను సైతము దమవశముఁ జేసికొనుచున్నయవి. శరీర ధర్మము గలవారి సంతాపము లంటక మానవు. సుఖదుఃఖముల యొక్క ప్రవృత్తి బలమైనది ఈమె గన్నీరు గార్చుటచే నేతత్కారణ మరయ నాకు మరియుఁ గుతూహల మగుచున్నది. అల్పకారణంబున నిట్టివారు శోకింపరు. క్షుద్రనిఘాత పాతంబున భూమి గదలునా ? అని యిట్లు తద్విధం బరయ దలంచి మదీయ శోకస్మరణమునకుఁ దానే కారణమని భయపడుచు లేచి యంజలిచేఁ బ్రస్రవణోదకము దెచ్చి మొగము గడిగికొమ్మని యమ్మగువ కందిచ్చెను.

అయ్యింతి సంతతముగాఁ గారుచున్న యశ్రుధారలచేఁ గలుషములగు నేత్రముల నాయుదకంబునఁ గడిగికొని వల్కలోపాంతముచే నద్దుకొనుచు నుష్ణముగా నిట్టూర్పులు నిగిడించుచు మెల్లగా నతని కిట్లనియె.

రాజపుత్రా ! మందభాగ్యురాల నా వృత్తాంతముతో నీకేమి లాభమున్నది ! అయినను వేడుకపడుచుంటివి కావునఁ జెప్పెద నాకర్ణింపుము.

## మహాశ్వేత కథ

దక్షుని ప్రసిద్ధి నీవు వినియేయుందువు. అతనికి మనియు, నరిష్టయనియు నిరువురు పుత్రికలు జనించిరి. అందు మనికిఁ జిత్రరథుండను కుమారుం డుదయించెను. ఆ చిత్రరథుండు సమస్తగంధర్వులకు నధినాయకుండై యింద్రునితో మైత్రి సంపాదించి యీశ్వరప్రసాదంబున మనోహరముగా నిందు చైత్రరథమను పేర నీయుద్యానవనమును అచ్ఛోదమను నీ సరస్సును నిర్మించెను.

అరిష్టకొడుకు హంసుడనువాఁడును ద్వితీయ గంధర్వకులమునకుఁ బ్రభువగుచు గౌరి యను కన్యకను జంద్రకిరణములం బుట్టిన దానినిం బెండ్లియాడి యా కాంతామణితో సంసారసుఖము లనుభవింపుచుండెను.

ఆ దంపతులకు సమస్త దుఃఖములకు భాజనమైన నొక్కరితను పుత్రికగా నుదయించితిని. నాతండ్రియు ననపత్యుఁడగుటచే నప్పుడు సుతజన్మాతిరిక్తమగు నుత్సవమును జేయుచు మిక్కిలి సంతోషించుచు జాతకకర్మానంతరమునందు నాకు మహాశ్వేత యని పేరుబెట్టెను.

నేను పితృగేహంబున మధురములగు మాటలచే బంధువులకు సంతోషము గలుగఁజేయుచు నవిదితశోకాయాస మనోహరమగు శైశవము సుఖముగా వెళ్ళించితిని.

అంతఁ గాలక్రమంబున నామేన వసంతసమయంబునఁ బుష్పాంకురమువలె యౌవనము పొడసూపినది. సమారూఢ యౌవననైయున్న నొక్క వసంతకాలమునఁ దల్లితోఁగూడ స్నానార్థమై యాసరోవరమునకుఁ జనుదెంచి యందందు శిలాతలముల వ్రాయఁబడిన శంభుమూర్తులకు నమస్కరించుచుఁ గుసుమోపహార రమ్యములగు లతామంటపములను పుష్పించిన సహకారతరువులను వనదేవతాప్రేంఖనలోభనములగు లతాడోలికలను కుసుమరజఃపటల మృగములగు కలహంస పదలేఖలచే మనోహరములగు తీరభూములనుం జూచినంత మనంబున నుత్సాహంబు దీపింప గొంతసేపు ప్రియవయస్యలతో నేనందు విహరింపుచుంటిని.

అట్టిసమయమునఁ గానన కుసుమవాసనలం బరిభవింపుచు ననాఘ్రాతపూర్వమగు పరిమళమొండు వనానిలానీతమై నాకు నాసాపర్వము గావించినది.

ఓహో! అమానుషలోకోచితమగు నీసౌరభము నా కెట్లు కొట్టినది? యని వెరగందుచు గన్నులు మూసికొని యాసుగంధ మాఘ్రాణించి యాఘ్రాణించి శిరఃకంపముచేయుచుఁ దదుత్పత్తిస్థానమరయు తలంపుతో లేచి నూపుర రవఝంకారమునకు సరఃకలహంసల ననుసరించి రాఁగా గొన్నియడుగులు నడిచి నలుమూలలు పరికించి చూచితిని.

అప్పుడొకవంక నఖిలమండలాధిపత్యమును గైకొన ధృతవ్రతుండయిన శశాంకుండో యనఁ ద్రిలోచనుని వశముఁ జేసికొనఁ దపం బొనరించుచున్న కుసుమశరుని పగిది మనోహరాకారముతో నొప్పుచు మందారవల్కలముఁ దాల్చి హస్తంబున దండకమండలములు మెరయ ఫాలంబున విభూతిరేఖయు కటితటి మౌంజీమాలికయు గరంబున స్ఫటికాక్షమాలికయుం ధరించి మూర్తీభవించిన బ్రహ్మచర్యము భాతిఁ బుంజీభవించిన శ్రుతి కలాపమట్లు దీపించుచు దేహకాంతులచేఁ బ్రాంతభూజముల బంగారుమయములుగాఁ జేయుచు సవయస్కుండగు మునికుమారుతోఁగూడ స్నానార్థమై యరుదెంచిన తాపసకుమారుం డొకండు నాకన్నులకుఁ బండువ గావించెను. అతని చెవియందుఁ గృత్తికానక్షత్రమునుం బోలిన యదృష్టపూర్వమగు పుష్పమంజరి యొండు అమృతబిందువుల స్రవించుచు విరాజిల్లుచున్నది. దానింజూచి నేను ఓహో! మదీయ ఘ్రాణమునఁ దృప్తిపరచిన సౌరభ మీ గుచ్ఛంబునఁ బుట్టినదే యని నిశ్చయించుచు వెండియు నత్తపోధన కుమారు నీక్షించి మనంబున నిట్లు వితర్కించితిని.

అయ్యారే! చతుర్ముఖుని రూపాతిశయ వస్తునిర్మాణకౌశలమెంత చిత్రముగానున్నది! మొదటఁ ద్రిభువనాద్భుతరూప సంభారుఁడగు మన్మథుని సృష్టించి వానికన్న నెక్కువరూపము గలవానిఁ జేయు సామర్థ్యము కలదో లేదో యను తలంపుతో మునిమాయచేత రెండవ సుమకోదండునిగా నితనిఁ జేయఁబోలు. మున్ను మున్న కుముదానందకరుండగు చంద్రుని, లక్ష్మీలీలాభవనములగు పద్మములును సృజించుట పరమేష్ఠి కితని మొగముఁ జేయు పాటవము నేర్చుకొనుటకే యని తలం

చెదను. కానిచో నతనికి సమానవస్తుస్పష్టితో నేమి ప్రయోజనమున్నది. బహుళపక్షక్షపాకరుని కిరణములను దరుణుండు హరించుచున్న వాఁడనుమాట యలీకము ఇమ్ముని కుమారుని శరీరమందే యణంగుచున్నవి. కానిచోఁ గేవలబహుళమగు తపంబున నొప్పుచున్నను వీని మేనిఁత లావణ్య భూయిష్ఠమై యుండనేల ?

అని ఇట్లు విచారించుచున్న నన్ను రూపైక పక్షపాతి యగు కుసుమశరుఁడు బరవశనుఁగా జేసెను.

నిట్టూర్పులతోఁగూడఁ గుడికన్నుంచుక మూసి తిర్యగ్దృష్టిచే నతనిరూపము పానము చేయువానివలె నెద్దియో యాచించువానివలె నీదాసనైతినని పలుకునట్లు హృదయ మర్పించుపగిది మనోభవాభిభూతురాలనగు నన్ను రక్షింపుమని శరణుజొచ్చుమాడ్కి నీ హృదయంబు నాకవకాశ మిమ్మని కోరుతీరునఁ జూచుచు అన్నన్నా ! ఇది యేమి మోసము కులస్త్రీ విరుద్ధమగు బుద్ధిపుట్టినది ఇది గర్హితమని యెఱింగిన దాననైనను నింద్రియప్రవృత్తుల మరలించుకొన వశముకాక స్తంభింపఁబడినట్లు వ్రాయబడినట్లు మూర్ఛబొందిన చందమున నవయవములు కదల్పలేక యట్టె నిలువంబడితిని. అప్పటి నాయవస్థ యిట్టిదని చెప్పుటకు శక్యముకాదు. పూర్వము శిక్షింపబడినదికాదు.

తద్రూప సంపత్తుచేతనో మనస్సుచేతనో మన్మథుని చేతనో యౌవనము చేతనో యనురాగముచేతనో దేనిచేతను జేర్పబడితినో కాని యట్టియవస్థ నేనెన్నఁడు నెఱుంగను.

అట్లు పెద్దతడవుచూచి యెట్టకేలకుఁ జిత్తమును దృఢపరచుకొంటిని అప్పు డతని హృదయమున నిల్పుట కవకాశ మిమ్మటకుఁ గాబోలు నిశ్వాసమారుతములు బయలువెడలినవి. హృదయాభిలాష దెలుపుచున్నదివోలె గుచయుగళము గగుర్పొడిచినది. సిబ్బితిం గరుగుచున్నట్లు మేనెల్ల జెమ్మటలు గ్రమ్మినవి. మదనశరపాతభయంబునఁబోలె గంపము పొడమినది. అట్టి సమయమున మనంబున నేనిట్లు తలంచితిని.

అయ్యయ్యో! సురతవ్యతిరేక స్వభావుఁడును మహానుభావుండునగు నిమ్ముని కుమారునియందు దుర్మదుండగు మన్మథుండు నాకిట్టి యనురాగము గలుగఁజేయుచున్నవాఁడేమి ? అనురాగము విషయయోగ్యత్వమును విచారింపదు, స్త్రీ హృదయం బెంత మూఢమైనదో కదా! ప్రాకృత జనులచేఁ బొగడఁబడుచుండెడు మన్మథవిలాసము లెక్కడ? తపోమహత్వ మెక్కడ? మన్మథవికారములచేఁ బొట్టుపడుచున్న నన్నుఁ జూచి యీతండు చిత్తంబున నెట్లు తలంచునో ? అట్లెఱింగియు నీ వికారమణగింపలేకున్న దాన నెంతచిత్రమో? ఇది మదీయచిత్తదోషముకాదు తదీయరూపవిశేషమం దట్టి మహిమ యున్నది ఈతఁడు నా వికారములఁ జూడకమున్న ఇందుండి లేచిపోవుట యుక్తము. అప్రియములగు స్మరవికారములఁజూచి కోపముతో శాపమిచ్చునేమో! ముని స్వభావము పరిభవమును సహింపదుగదా.

అని మరలిపోవుటకు నిశ్చయించియు నతని యాకృతివిశేషము పదములకు

నిగళమైతగులఁగొని కదలనీయమింజేసి మునిజాతి యశేష జనపూజనీయమయినదికదా? నమస్కరించి యరిగెద, దీనం దప్పేమియని యప్పుడే దాపునకుఁబోయి అతని మొగమునందు చూపులిడుచు బాదంబులకు నమస్కరించితిని.

దుర్లంఘ్య శాసనుండగు మదనుం డప్పుడు మదీయాకార దర్శనంబున నపహృతధైర్యుఁ డగు నతని హృదయమునుగూడ పవనుండు దీపమువలెనే చాంచల్యమందఁజేసెను.

యౌవనము అతిసయ్యసాహసమైనది కదా! అప్పు డతనికి గ్రొత్తగాఁ జిత్తమును జొచ్చుచున్న మదనుని నెదుర్కొనుచున్నట్లు రోమాంచము పొడమినది నాయొద్దకు వచ్చుచున్న హృదయమునకు దారిజూపుచున్నట్లు నిట్టూర్పులు వెడలినవి. ప్రతిభంగమున భయపడుచున్నదివోలె గరతలమందున్న జపమాలిక జారిపడినది.

అప్పుడు నేనతని వికారమును జూచి హృదయంబున మదనావేశము రెట్టింప నిట్టిదని చెప్పుటకు నలవికాని యవస్థం జెందుచు డెందమున నిట్లు తలంచితిని.

అనేక సురత లాస్యలీలావిశేషముల నుపదేశింప నుపాధ్యాయుండగు మన్మథుండే విలాసములను నేర్పునుగదా! లేనిచో శృంగారచేష్టలయందుఁ బ్రవేశింపని బుద్ధిగల యీమునికుమారుని దృష్టిప్రసార మింత మనోహరముగా నెట్లుండును.

ఈతని హృదయాభిలాషనంతయు నతని చూపులే చెప్పుచున్నవి. అని తలంచుచు దాపునకుఁబోయి యతని సహచరుండగు తెంతవ మునికుమారునితోఁ బ్రణామపూర్వకముగా నిట్లంటిని.

ఆర్యా! ఈ మునికుమారుని పేరేమి? యెవ్వని కుమారుండు? ఈయన శ్రవణాభరణముగా ధరించిన పుష్పమంజరి యేవృక్షమునఁ బుట్టినది? దీని సౌరభ మాఘ్రాణించినది మొదలు నాహృదయ మెంతేని సంతస మందుచున్నది. ఇట్టి సుమ మెన్నడును జూచియుండలేదని పలుకగా విని యమ్ముని కుమారుం డించుక నవ్వుచు నాకిట్లనియె

బాలా! నీ ప్రశ్నముతోఁ బ్రయోజనమేల? కౌతుకమేని వక్కాణించెద వినుము.

## పుండరీకుని కథ

దేవలోకంబున శ్వేతకేతుండను మహాముని కలఁడు. అతని యాకారము త్రిభువనసుందరమైనది. అమ్మహాముని యొకనాఁడు దేవతార్చన కుసుమములఁ గోయుటకు మందాకినీ నదికిఁ బోయెను. అందు బద్మములు గోయుచున్న యమ్మునిపుంగవునిం జూచినంత పద్మసన్నిహితయైన లక్ష్మికిఁ జిత్తచాంచల్యమైనది.

అలోకమాత్రంబుననే సురతసమాగమసుఖ మనుభవించిన యమ్మహాదేవికిఁ దత్క్షణంబుగానున్న యప్పద్మంబునంద కుమారుం డుదయించెను.

ఆ శిశువును గ్రహించి యాఁడిష్మ దేవా ? యీతండు నీకుమారుండు గైకొనుమని పలుకుచు వాని నాశ్వేతకేతున కిచ్చినది. అమ్మునియు బాలజనోచిత కృత్యములన్నియు వానికి నిర్వర్తించి యాతండు పుండరీకమునం బుట్టుటచేఁ బుండరీకుఁడని నామకరణముచేసి యతనికి సమస్తవిద్యలను నేర్పెను. ఆ శ్వేతకేతుసూనుండే యీతండు. మరియు నీ కుసుమగుచ్ఛము క్షీరసముద్రజాతమగు పారిజాతతరువునం బుట్టినది. ప్రతివిరుద్ధముగా నీపూవితని శ్రవణసంగత మెట్లయ్యెనదియుం జెప్పెద నాకర్ణింపుము. ఈ దివసము చతుర్దశియని యీతండును నేనును దేవలోకమునుండి కైలాసగతుండగు శితికంఠు నారాధించుటకై నందనవనము మీదుగా బోవుచుంటిమి.

అప్పుడా నందనవనలక్ష్మి యీ పారిజాతమంజరిని హస్తమున ధరించి వచ్చి యీతనికి మ్రొక్కుచు నిట్లనియె అయ్యా ! త్రిభువన దర్శనాభిరామమగు నీ రూపమున కిది యనురూపమైనది. దీని శ్రవణా వసంతముగాఁ దాల్పుము పారిజాతము, జన్మము సాఫల్యము నొందునని పలుకగా నితం డాత్మస్తుతివాదమునకు లజ్జించుచుఁ గన్నులు మూసికొని యామెమాటఁ బాటింపక నడువఁదొడంగెను.

అప్పుడాదేవియు నీపూవుఁదాల్చి విడువక వెంట వచ్చుచుండుటఁ జూచి, నేను మిత్రుఁడా ? దీనదోషమేమి ? యెది యద్దేని యనుగ్రహ పరిగ్రహముకాదా ! గైకొనుమని పలుకుచు నితం డిచ్చగింపకున్నను నేనుఁ బుచ్చుకొని బలాత్కారముగా దీని నతని శ్రవణాభరణముగా నిడితిని ఇదియే దీని వృత్తాంతమని చెప్పి యతండూరకుండెను.

పిమ్మట నప్పుండరీకుఁడు మందహాసోపశోభిత వదనారవిందుఁడై నన్నుఁ జూచి కామినీమణీ ! నీకీ ప్రశ్నాయాసముతోఁ బనియేమి ? కావలసినచో నీ పుష్పగుచ్ఛమును బుచ్చుకొమ్మని పలుకుచుఁ దన చెవియందున్న లతాంతమును దీసి నా శ్రవణపుటంబున నుంచెను.

నాకప్పుడు తత్కరతల స్పర్శలోభంబునంజేసి యవతంసస్థానమున నా పూవు రెండవ హృదయములాగున దోచినది. అతండును మత్కపోలతల స్పర్శసుఖంబున వడంకుచున్న కరతలంబునుండి జారిపడిన జపమాలికను సైతము సిగ్గుచేత గురుతెరుంగడు.

నేనప్పుడా జపమాలికను నేలంబడకుండ గ్రహించి విలాసముగాఁ బద్మపాశములచేఁ గూర్పఁబడిన కంఠగ్రహసుఖం బనుభవించు దానివలెఁ గంఠాభరణముగా మెడలో వైచుకొంటిని.

అట్టి సమయమున ఛత్రగ్రాహిణి నాయొద్దకు వచ్చి రాజపుత్రీ ! మీతల్లి స్నానము జేసినది. ఇంటికిఁబోవు సమయమగుచున్నది. కావున వేగము స్నానము చేయుమని పలికినది. ఆమాట విని నేను గుండె దిగ్గుమన నిష్టములేకున్నను నతి ప్రయ

త్నముతో నతని మొగమునుండి దృష్టి, మరలించుకొనుచు స్నానము చేయుటకుఁ బోయితిని. పిమ్మట రెండవ మునికుమారుఁడు ఆ ప్రకారము ధైర్యస్ఖలితుఁడైన యప్పుండరీకుం జూచి యించుక యలుక మొగంబునఁ దోప నిట్లనియె.

మిత్రుడా ! పుండరీక ! క్షుద్రజనులచేఁ ద్రొక్కంబడిన యీ మార్గము నీకుఁ దగినదికాదు. సాధులు ధైర్యధనులుకదా ! ప్రాకృతుండువోలె వివశంబగు చిత్తము నరికట్టవేమి ? ఇప్పుడు నీకపూర్వమైన యింద్రియచాంచల్యము గలిగినదే ? ధైర్యము, వశిత్వము, ప్రశాంతి బ్రహ్మచర్యనియమము, ఇంద్రియ పరాఙ్ముఖత, యౌవన శాసనత్వము మొదలగు నీసుగుణము లన్నియుఁ నెందుబోయినవి ? నీ చదువంతయు నీటఁగలిపితివే, నీవివేకమంతయు నిరర్థకమైనదే. అయ్యయ్యో! కరతలము నుండి జారిపడిన జపమాలికను సైతము గురుతెరుంగకుంటివి ? యేమి నీ మోహము ? ఒకవేళ ప్రమాదముచే బుద్ధి చాంచల్యమందినను వివేకముతో మరల్చుకొనరాదా ? యున్మత్తునిక్రియ వర్తించుచుంటివేయని పలికిన విని యించుక గుందుచు నతనితోఁ బుండరీకుం డిట్లనియె.

వయస్యా ! కపింజల ! నన్ను మరియొకలాగునఁ దలంపకుము. నే నట్టి వాఁడను కాను. దుర్వినీతయగు నీనాతి నా జపమాలికను గ్రహించిన యపరాధమును నేను మరచిపోయితి ననుకొంటివా ? చూడుమని యసత్యకోపము దెచ్చుకొని యతిప్రయత్నముతో భ్రూభంగము గాపింపుచుఁ జుంబనాభిలాషఁ దోతెఁ బెదవిగరచుచు నా కడకు వచ్చి యిట్లనియె.

చపలురాలా ! నా జపమాలిక నాకియ్యక యిందుండి యెందు వోయెదవు? ఇచ్చి కదలుమని పలుకగా విని నేనును నా మెడనుండి యేకయష్టిగల ముత్తెపుపేరును దీసి, ఆర్యా ! ఇదిగో ! మీ మాలికను స్వీకరింపుఁడని పలుకుచు, మన్ముఖమునందు దృష్టినిడి శూన్యహృదయుఁడై చూచిన యతని చేతియందమ్మాలనిడి స్వేదసలిలస్నాత నయినను వెండియు స్నానము చేయుటకుఁ దటాకమునకుఁ బోయితిని.

అందు గ్రుంకి తల్లితోఁ గూడ మెరకకుఁబోవు ప్రవాహమువలె నతి ప్రయత్నముతో నింటికివెళ్ళి కన్యాంతఃపురము ప్రవేశించి యతని స్మరించుచు నది మొదలు విరహవిధురనై యిట్లు తలంచితిని.

అయ్యో ! నేనచ్చటనే యుండక యింటికేమిటికి వచ్చితిని ? ఆ ! రాలేదు. నేనచ్చటనే యుంటిని. కాదు యిది గృహమే. ఇప్పుడు నేను నిద్రబోవుచున్నానేమో ! స్వప్నములో నిట్లు కనంబడినది కాబోలు. అయ్యో ! నా కన్నులు తెరవఁబడియే యున్నవి. స్వప్నమెట్లు వచ్చును ? ఇది రాత్రియా పగలా ? నాకి తాపము రోగమేమో ? నేనిప్పుడెచ్చట నుంటిని ? యెచ్చటికిఁ బోవుదును ? ఎవ్వరితోఁ

జెప్పుకొందును ? దీనికిఁ బ్రతికారమెద్ది ? అని పెక్కు తెరంగుల నున్మత్తవలెఁ బలవరించుచు సంతఃపురమున కిరవుల నాయుండ సియ్యకొంచి యొంటిగా నొక గవాక్షము దాపునఁ గూర్చుండి ఆ దిక్కునే మిక్కుటమయిన దానిగాఁ దలంచుచు నా దిశనుండి గాలివచ్చినను మనోహరమయిన దానిగాఁ నెంచుచు మౌనమవలంబించి యాతని రూపమును, లావణ్యమును, యౌవనమును మాటిమాటికి స్మరించుకొనుచు మేనం బులకలు వొడమ, దత్కరతలం స్పర్శ సుఖం బభినయించుకొనుచు క్షణమొక యుగములాగున గడుపుచుంటిని.

అంతలో నా తాంబూలకరండ వాహిని తరళిక యనునది నా యొద్దకు వచ్చి నా యవస్థ యంతయుంజూచి చింతించుచు నిట్లనియె.

రాజపుత్రీ ! అచ్ఛోదకమునందు స్నానముజేసి నీవు నన్నుఁ బరామర్శింపక ముందుగా నింటికి వచ్చితివి కదా ! నీవు వచ్చిన తరువాత నొక విశేషము జరిగినది, యాకర్ణింపుము. దివ్యాకారములతో నిరువురు ముని కుమారులు అచ్ఛోదసరస్తీరంబున మనకుఁ గనంబడిరి కదా ? వారిలో నీకి పుష్పమంజరి నిచ్చిన యతండు రెండవవానికి గనంబడకుండఁ బుష్పించిన లతావితానముల మాటుగా నా యొద్దకు వచ్చి, బాలికా ! యిప్పుడిక్కడ స్నానము చేసిన కన్యక యెవ్వని కూతురు ? పేరేమి ? యెచ్చటికిఁ బోయినదని నన్నడిగెను.

అప్పుడు నేను వినయముతో ఆర్యా ! నా చిన్నది హంసుడను గంధర్వ రాజు కూతురు. దీనిపేరు మహాశ్వేత. యిప్పుకాత్మీయ నివాసస్థానమైన హేమకూటమను పర్వతమునకుఁ బోయినదని చెప్పితిని.

నా మాట విని యతండు ముహూర్తకాల మూరకొని యేద్దియో ధ్యానించుచు దేనినో యాచించువాఁడుంబలె రెప్ప వాల్పక నన్నుఁ జూచుచు నానునయముగా వెండియు నా కిట్లనియె.

కల్యాణీ ! నీవు చిన్నదానవైనను నీ రూపము నీ గౌరవమును, యోగ్యతను వెల్లడిచేయుచున్నది. నిన్నొండు యాచించుచున్నవాఁడ, కాదనక యాచరింతువే యనుటయు నేను వినయముతో నంజలి ఘటించుచు నుల్లన నిట్లంటి.

మహాభాగ ! మీ రట్లు పలుకుటకు నేనెవ్వతెను. త్రిభువన పూజనీయులగు మీ వంటి మహాత్ములు పూర్వపుణ్యవశంబునంగాక మా యట్టి కృతులయందు దృష్టి ప్రసాదమైనఁ బరగింపరనుటో నాజ్ఞాపించుమాటఁ జెప్పనేల ? దాసురాలయెడఁ గనికరముం చేయఁదగిన కార్యమెద్దియో చెప్పుఁడు. నమ్మకముగాఁ జేసి యనుగ్రహపాతురాల నగుదునని పలికితిని

అప్పుడు నన్నతండు సఖురాలిగా మన్నించుచు సంతసముతో నా ప్రాంతమందున్న తమాలతరుపల్లవమును దెచ్చి తీరప్రస్తరముపై వైచి నలిపి రసముదీసి మా రసమున వల్కలోత్తరీయ మింతజించి దానియందు కనిష్ఠికానఖ శిఖరముతో

నెద్దియో వ్రాసి, కనకగాత్రి ! నీవీ పత్రికం గొనిపోయి యా రాజపుత్రి కేకాంతముగా నున్నప్పుడిమ్ము. పొమ్మని పలుకుచు నది నా కిచ్చెను. నేనును దాని బదిలముగా దెచ్చితి నిదిగో చూడుమని తాంబూలభాజనమునుండి యా పత్రికం దీసి నా కందిచ్చినది.

నేనును దత్సంభాషణముల చేతనే మేన రోమోద్గమము జనింప నతనముట్టి నట్లు సంతసించుచు నా పత్రిక నందుకొని కల్లి లిఖితాక్షరంబులం జూచి కన్నుల నద్దికొనుచు మదనావేశముతో నిట్లు పఠించితిని.

ఉ. తామరతూడువోలె విశదంబగు ముత్తెపు పేరుచేత నా
హా ! మహి లోభపెట్టబడు హంసవిధంబున నాశఁజెంద నెం
తో మదుదారమానస సముద్భవభూరితరాభిలాష నీ
చే మహిళావతంసమ ? రుచింగొనిపోఁబడెఁజూవె దవ్వుగాన్.

అట్టి పద్యము జదివించినంత నాలుకగోసిన మూగవానివలెఁ గల్లుఁదావిన యున్మత్తునపగిది స్మరాతురమగు నా హృదయము ప్రవాహము చేత వ్యాకులమయిన సరిత్తువలె విహ్వలత్వము గైకొనినది.

మరియు, నా పత్రికం జూచుటచే, త్రిలోక రాజ్యవైభవ మనుభవించినట్లు సంతసించుచు దానిఁ గపోలములయందును అలకలయందును బెట్టుకొనుచుఁ దరళికా ! చెప్పుము. చెప్పుము. అతండు నీచే నెట్లు చూడబడియెను ? ఏమేమి చెప్పెను ? నీ యొద్ద నెంతసేపు నివసించెను ? అని పలుమారు దాని నడుగుచు నెట్టకేలకు నా దివసము గడిపితిని.

పిమ్మట నా హృదయముతోఁ గూడ సూర్యబింబము కృతరాగసంపిళాగము కలదియై యొప్పినది. అప్పుడు ఛత్రగ్రాహిణి వచ్చి, రాజపుత్రి ! అమ్మునికుమారులలో నొకఁడు వచ్చి ద్వారమున నిలిచి జపమాలిక నడుగుటకు వచ్చియున్నాడని చెప్పుచున్నారు. అనుజ్ఞయేమని యడుగగా నేను మునికుమారనామగ్రహణముచే మిగులఁ దొందరపడుచు నతనిరాక శంకించుకొనుచు వేగమ తీసికొనిరమ్మని యాజ్ఞాపించితిని.

అమ్ముని కుమారుని వయస్యుఁడయిన కపింజలుని నది వోయి తీసికొని వచ్చినది. అతని యాకారముఁజూడ విషాదముతోఁ గూడినట్లు కనంబడినది. అప్పుడు

శ్లో॥ దూరంముక్తాలతయా బిససితయా ప్రలోభ్యమానో మె
హంసఇవదర్శితాశో మానసజన్మా త్వయానీతః.

తా. ముత్తెపుపేరును చూచి తామరతూడనుకొని యాసతో దూరముగాఁ బోయిన హంసవలెనే నీ చేత నా మనోరథము దవ్వుగా దీసికొని పోఁబడినదని తాత్పర్యము.

నేను దటాలున లేచి నమస్కరించి యాదరముతో స్వయముగాఁ బీఠము దెచ్చివైచితిని. పీఠపరివేష్టుండయిన యతని యడుగులను వలదనుచుండ బలాత్కారముగాఁ గడిగి యుత్తరీ యాంచలముచేఁ దడియొత్తి యతనికిఁ దాపుగాఁ గూర్చుంటిని.

అతం డట్లొక మూహూర్తమాత్రము విశ్రమించి యెద్దియో చెప్పఁదలచు కొని నాదాపుననున్న తరళికపై దృష్టి నెఱయించెను దాన నతని యభిప్రాయము గ్రహించి దేవా! యది నా శరీరము వంటిది. వక్తవ్యాంశము నిస్సంశయముగాఁ జెప్ప వచ్చునని పలుకగాఁ గపింజలుఁ డిట్లనియె.

రాజపుత్రీ! నేనేమని చెప్పుదును? సిగ్గుచేత నా వాక్కు వక్తవ్యాంశమును గ్రహింపకున్నది కందమూలములం దినుచు శాంతముగా నడవులఁ గ్రుమ్మరు ముని జనమెద? మన్మథవిలాసములెద? అంతయు విపరీతముగానే యున్నది. దైవమెట్లు చేయుటకు సంకల్పించెనో చూడుము. భగవంతుఁ డప్రయత్నముచేతనే పురుషునిఁ బరిహాసాస్పదునిగాఁ జేయునుకదా! ఇది యే ధర్మోపదేశమో నాకుఁ దెలియకున్నది. నా సందేశము చెప్పక తప్పదు. మఱియొక యుపాయ మేదియు గనంబడకున్నది. కొంటొక ప్రతిక్రియయుఁ దోచదు. ప్రాణపరిత్యాగముచేత నయినను మిత్రుని రక్షింపఁ దగినదని చెప్పుచున్నాను. వినుము. నీ దాపుననే నిష్ఠురముగా నట్లు కోపపడి యట నుండక పుష్పములు కోయుటమాని మఱియొక చోటికిం బోయితిని. పిమ్మట నీవు నిందిటిఁ బోయితివి కదా! అప్పుడు నే నితం డొక్కరుఁడు నేమిచేయుచున్నవాఁడో చూత మని మరలివచ్చి యచ్చటి కొమ్మల సందున దాగి యా ప్రదేశమును జూచితిని కాని యతండందు గనంబడలేదు.

మే మిరువురము పుట్టిననాఁటనుండియు నొకక్షణమైన నెడఁబాసి యుండ లేదు. కావున సుహృత్స్నేహతరత్వంబున హృదయంబు తొట్రుపడుచుండ నిట్లు తలంచితిని.

అయ్యో! నా మిత్రుడు మదనపరాయత్తచిత్తుండై యామతకాశిని వెంటఁ బోయి తిరిగి నా యొద్దకు వచ్చుటకు సిగ్గుపడియెఁ గాఁబోలు, లేక కోపముచేత నన్ను విడిచి యెచ్చటికేనిం బోయెనేమో! ధైర్య స్థలనవిలక్షణుఁడై న యతండేమై పోయెనో కదా యని యమంగళము తలంచుకొనుచుఁ దరుల బాగహనములు, చందనవీథులు, లతా మంటపములు, సరఃకూలములు మొదలగు ప్రదేశములు పెద్దతడవు తద్దయు శ్రద్ధతో వెదకితిని.

అంత నొక సరస్సమీపమందు లతామంటపమున చిత్తరువు మాడ్కి, స్తంభితునిపగిది యోగసునిభంగి గదలక మన్మథశాప భయంబున బోలె నడఁగి నిష్పందనిమీలితమగు కనుదోయినుండి బాష్పజలము ధారగా వెడలుచుండ హృదయ మునఁ బ్రజ్వరిల్లు మదనాగ్నిజ్వాలను గైకొని వెడలు నిట్టూర్పు గాడ్పులచేఁ గ్రాంత

లతాకుసుమ కేసరముల వాఁడఁజేయుచు వామకరతలంబునఁ గపోలం బిడుకొని యున్మత్తుని క్రియఁ బరాయత్త చిత్తుండై యున్న పుండరీకుం గంటిని.

అపగత నిమేషములగు చక్షుస్సులచే దదవస్థ యంతయుంజూచి హృదయంబున విషాదంబు జనింప నిట్లు తలంచితిని.

మన్మథుఁడు దుర్విషహ వేగముఁగలవాఁడు కదా! నిమిషములో నితని దీర్పరాని యవస్థ పాలుచేసెను. అన్నన్నా! జ్ఞానరాశియంతయు నొక్కమాటు వ్యర్థమయినదే అయ్యారే! ఎంత చిత్రము. ఈతండు పిన్ననాటినుండియు ధీరస్వభావుండు. అస్ఖలిత చిత్తవృత్తిగలవాఁడై మాటోటులకు సైతము నీతి గరపుచుండువాఁడు. అట్టివాఁ డిప్పు డితరుండువోలె జ్ఞానము లెక్కసేయక తపఃప్రభావము నున్మూలించి గాంభీర్యాదిగుణంబులు మట్టుపరచి మన్మథునిచేత జడీకృతుండయ్యె. కానిమ్ము. ఇది యౌవనమహిమకదా యని తలంచుచు నేన మెల్లగా వాని దాపునకుఁబోయి యా శిలాతలమందు వెనుకగాఁ గూర్చుండి భుజముమీఁద జేయి వైచుచు, సఖా! పుండరీక! ఇట్లుంటివేమని యడిగితిని.

అప్పు డతం డతిప్రయత్నముతోఁ గన్నులు దెరచి మందరమగు దృష్టితో నన్ను జూచి ఇస్సురని నిట్టూర్పు నిగుడించుచు సిగ్గుచేత విరళాక్షరములు గలుగు మాటలతో వయస్యా? కపింజలా! నా వృత్తాంత మెఱింగియు నీ విట్లడిగిన నేనేమి చెప్పుదునని మెల్లగా బలికెను.

అప్పుడతని యవస్థజూచి త్రిప్పరానిదని నిశ్చయించియు మిత్రుని సన్మార్గ ప్రవర్తునిగాఁ జేయుట యుచితము, శక్తికొలది చెప్పిచూచెదంగాకయని తలంచి వెండియు నిట్లంటిని.

పుండరీక! నీవృత్తాంతమెఱుంగబట్టియే యిట్లడుగుచున్నవాఁడ. నీవవలంబించిన వ్యాపారము గురూపదిష్టమా, శాస్త్రపఠితమా, నియమ విశేషమా, ముక్తిప్రాప్తి కారణమా, మనస్సుచేతనయినఁ స్మరింపఁదగినదేమో చెప్పుము. అజ్ఞానుండువోలె, మన్మథహతకునిచేతఁ బరిహాసాస్పదత్వమును బొందింపఁ బడుచుఁ దెలియకుంటివేమి? ప్రాకృత జనాళి మతములగు నింద్రియవిషయంబుల సుఖాభిలాష నీకెట్లుకలిగినది. పరిణయవిరసంబులగు నింద్రియసుఖంబుల బుద్ధిఁ జొనుపుట మహారత్నమను భ్రాంతితో నంగారమును ముట్టినట్లగునని యెఱుఁగవో? విషయ తత్త్వముల నెఱింగియు స్ఖలితమయిన జ్ఞానముద్ధరింపవేమి? ఇంద్రియముల నివారింపవేల? చిత్తమును నియమింపవేమి? ఈ మన్మథుఁడన నెంతవాఁడు? ధైర్యమవలంబించి వానిని పరిభవింపుము. అని నేను బలుకుచుండగనే నామాటల నాక్షేపించుచుఁ గన్నీరు దుడుచుకొనుచు నా చేయిపట్టుకొని యతం డిట్లనియె.

కపింజలా! పెక్కుమాటలతోఁ బ్రయోజనమేమి? ఆశీవిషవేగముగల విరితూపుల పోటుపడని వాఁడెన్నేని బరుల కుపదేశింపవచ్చును. ఇంద్రియములు మనంబును

నెవ్వనికిఁ గలిగియుండునో శుభాశుభవివేచన మెవ్వఁడెఱింగియుండునో వాఁడుపదేశము నకుఁ దగినవాఁడు. నాకవి యన్నియును దవ్వైనవి. యుపదేశకాల మతిక్రమించినది. జ్ఞానము నిలుపుకొనుసమయము మించిపోయినది. నీకంటె నాకు సన్మార్గముపదేశించు వాఁడు లేఁడు. నీయుపదేశము నేను వినఁదగినదే కాని నామానసవికారము మరలించుకొను టకు శక్యము కాకున్నది. నేనేమి చేయుదును? మదనసంతాపముచే నా యంగము లన్నియు నుడికిపోవుచున్నవి. దీనికెద్దియేని ప్రతిక్రియ యెఱుంగుదువేని యాచరించి నీ ప్రియమిత్రునిఁ బ్రతికించుకొమ్మని పలికి యూరకుండెను.

అప్పుడు నేను మరల నతని మతిమరలింపఁదలంచి శాస్త్రదృష్టాంతముల నితిహాస నిదర్శనంబులు నగు మాటలచే నెంతేని నీతి నుపదేశించితిని కాని యతం డేమియుఁ జెవియొగ్గి వినకపోయెను.

ఇఁక నుపదేశములతోఁ బ్రయోజనములేదని నిశ్చయించి నేను లేచి యత్తటాకములోనికిఁబోయి తామరతూడులను, కమలినీ దళములను, గలువలను, పద్మములను గోసికొనివచ్చి యందున్న లతామంటపమునందలి శిలాతలంబునం బానుపుగా బరచి యతనినందు బరుండఁబెట్టి చందనతరుపల్లవంబులం దెచ్చి రసముదీసి స్వభావ సురభియగు నా రస మాహ్లాదముగా నతనిమేనం బూసి కదళీదళంబున వీచుచుంటి.. మిక్కుటమగు తాపముచే నాచేయు శైత్యోపచారము లన్నియుఁ నిష్ఫలములగుచుండఁ జూచి నేనిట్లు తలంచితిని అన్నన్నా! మన్మధునికి సాధ్యముకానిదిలేదుకదా! హరిణమువలెఁ గ్రుమ్మరుచు స్వభావముగ్ధునగు నీతం డేడ? వివిధవిలాస రసరాశియగు గంధర్వ రాజపుత్రి యేడ? యెట్లు సంఘటించెనో చూడుము సాగర గంభీరుఁడగు నితని దృణమువలెఁ దేలికపఱచెనే? యింతకన్న ప్రౌఢిమ యేమిగలదు? అన్నిగతుల చేతఁ దీర్పరాని యాపద తటస్థించినది ఏమిచేయుదును? ఎక్కడ జొత్తును? ఎవరితోఁ జెప్పుదును? యెట్లు వీని ప్రాణములు నిలుచును? ఉపాయమెద్ది? కర్తవ్యమేమి? యని యనేక ప్రకారములఁ దలంచుచు అయ్యో! యీవెఱ్ఱియాలోచనతోఁ బనియేమి? తత్కాంతాసమాగమముకన్న వేరొకండుసాధనమున వీఁడు బ్రతుకఁడు అట్టిపనియే చేయఁదగినది. తాపసజనులకిది యనుచితమని నేనిప్పుడూరకుంటినేని యేకోచ్ఛ్వాస జీవితుండగు నితండు కాలమును సహింపక మృతినొందఁగలఁడు. గర్హితకృత్యముచేత నయినను మిత్రాసువుల రక్షింపఁదగినదికదా! కావున నేనిప్పు డన్నిగతులచేత నానాతి యొద్దకుఁబోవుటయే యుచితముగా నున్నయది. ఇతని యవస్థ యంతయు నాయింతి కెఱింగించెదనని నిశ్చయించుకొనుచు నెన్నఁడును దుర్వృత్తియందుఁ బ్రవేశింపని యతండు నన్నుఁ జూచి సిగ్గుతో నావృత్తి మరలించుకొనునేమో యని యెద్దియో మిషబన్ని యతనితోఁ జెప్పక యచ్చోటు బాసి నీయొద్దకు వచ్చితిని. తరువాత చేయం దగినకృత్యమెద్దియో యాలోచింపుమని పలికి నా మొగంబునఁ జూడ్కి నిలుపుచు నామాట విను తాత్పర్యముతో నూరకొనియెను.

అతని మాటలు విని నేను సుధామృతమయమగు ప్రవాహంబున మునింగిన దానివలె సంతసించుచున్నప్పుడు బొడమిన సిగ్గుచేతఁ దలవాల్చుకొని కన్నుల నానంద బాష్పములు గ్రమ్మ మనమ్మున నిట్లు తలంచితిని. పాపము, మన్మథుఁడు నన్నుఁ బలెనే యాతనింగూడ బరితాపము నొందఁజేయుచు నాకు మంచియుపకృతి గావింపు చున్నవాఁడు. అతం డట్టి యవస్థ ననుభవింపుచున్నాఁడను మాట నిక్కువము. స్వప్న మందైనను గపింజలుఁడు అసత్యమాడువాఁడుకాఁడు. ఊరకింత దూరమువచ్చి యేల ప్రయాసము జెందును. ఇప్పుడితనికి నేనేమని చెప్పుదును? ఏమికావింపఁదగినది? యుపాయమెద్ది? యని యనేక ప్రకారములఁ దలంచుచున్న సమయంబునఁ బ్రతీహారి వచ్చి రాజపుత్రీ! నీవస్వస్థతగా నుంటివనుమాట విని నిన్నుఁ జూచుటకై మీ యమ్మ గారు వచ్చుచున్నారని చెప్పెను.

ఆ మాట విని కపింజలుఁడు మహాజనసమ్మర్దభయంబున నటనుండ వెరచి లేచి, రాజపుత్రీ! సూర్యుండస్తమించుచున్నవాఁడు, నేనుఁ బోయివచ్చెద; మిత్రప్రాణముల రక్షించుటకై యిదిగో యంజలి ఘటించుచున్నవాఁడ. కర్తవ్యమెద్దియో యోచించి యట్లు కావింపుమని పలుకుచుఁ బ్రత్యుత్తరమును బొందకయే బయలుదేరి పెక్కండ్ర పరిచారికలలో నామెతల్లి వచ్చుచున్నది కావున నాసమ్మర్దములోఁ దప్పించుకొని యెట్లో దాటిపోయెను.

మజ్జననియు నాకడకువచ్చి కొంతసేపు నివసించి తిరిగివెళ్ళిపోయినది. ఆమె నాయొద్దకువచ్చి యేమిచేసినదో యేమిపలికినదో శూన్యహృదయ నైన నేనేమియు నెరుంగను.

అంతలో సాయంకాలమగుటయు నప్పుడు కర్తవ్యమెద్దియో తెలియక తరళికతో నిట్లంటిని. తరళికా! నాహృదయము మూఢమైనదనియు నింద్రియములు వికలములైనవనియు నీ వెరుంగవా యేమి? ఇప్పుడేమి చేయఁదగినదో నాకుఁదెలియకున్నది. కపింజలుఁడు చెప్పిన మాటలన్నియు నీవు వింటివికదా! చక్కఁగా నాలోచించి నాకుపదేశింపుము. నేనితరకన్యలవలె సిగ్గును విడిచి జనాపవాదమును లెక్కింపక సదాచార మతిక్రమించి తండ్రి యనుమతి వడయక యచ్చోటికిఁబోయి యప్పుండరీకునిం గలసికొంటినేని గురుజనాతిక్రమణదోషంబున నధర్మము రాగలదు.

ధర్మోపరోధభయంబున నేను బోకుంటినేని తప్పక మృత్యువునే యంగీకరింతును. దానంజేసి క్రొత్తగా స్నేహముగలిసిన కపింజలు తోడఁ బ్రణయరస భంగము కాగలదు. అదియునుంగాక నాయందాసయుంచుకొనిన పుండరీకుఁడు సైతము ప్రాణత్యాగము చేయును. దాన మునిజనవధ మహాపాతకము రాఁగలదు. ఈ రెంటిలోఁ నేది యుత్తమమో నిరూపింపుమని పలుకుచుండఁగనే చంద్రోదయమైనది.

రతికలహ కుపిత రోహిణీచరణాలక్త కరసలాంఛితుండు వోలె నుదయ కాలంబున నెఱ్ఱఁబడిన చంద్రునిఁజూచి విహ్వలనై తరళికోత్సంగంబున శిరంబిడి

తదీయకిరణజాలంబులు చల్లనివైనను దాహజ్వరఖిన్నునిపై నిప్పులవర్షము గురిసినట్లు సంతాపము గలుగఁజేయ మూర్ఛపోతిని.

అప్పుడు తరళిక నన్నుఁ బలుమారు పిలిచి పలుకకుండుట గ్రహించి తొట్రుపడుచు శైత్యోపచారము లెన్నియేని గావించినది. అప్పుడు నాకించుక తెలివి వచ్చి కన్నులం దెరచితిని.

చందనపంకార్ద్రంబులగు కరంబులు జోడింపుచుఁ దరళిక నన్నుఁజూచి, దేవీ! నీవిక సిగ్గుపడిన లాభములేదు. ధర్మమునకు వెరచితివేని ప్రమాదము రాక మానదు. నీ సంతాపమంతకన్న నెక్కుడగుచున్నది. నా యందు దయయుంచి పుండరీకుఁడున్న చోటికిఁ బోవుదములెమ్ము. తదీయబాహునాళములఁ బెనవైచినప్పుడు కాని నీ మేనికాక దగ్గదని వినయముగాఁ బలుకుచున్న తరళికంజూచి, ఓసీ! మనసుని మాట చెప్పనేల? ఇప్పుడీ శశాంకుఁడే ప్రాణములను హరింపుచున్నవాఁడు. అదే పోవుదములెమ్ము. అతిప్రయత్నముతోఁ బోయి హృదయవల్లభుని సంతోషపెట్టెదనని పలుకుచు మూర్ఛాఖేద వివశములగు నవయవములచే నెట్టకేలకుఁ దరళికం బట్టుకొని బయలుదేరితిని.

అట్టి సమయమున నాకుఁ గుడికన్ను నదరినది. అయ్యో! దైవ మిదియేమి యిట్టి సూచన గావింపుచున్నాఁడు. మరియు నేమిచేయఁ దలఁచుకొనెనో కదా యని శంకించుకొనుచుఁ బరిజనమునకు సైతము తెలియకుండ దాంబూలాంగరాగాది సుగంధద్రవ్యములు గైకొని తరళిక వెంటరా నాపాదతాడన మంజీరియే ధరించి యామేడ వదలి నీలపటావకుంఠనముతో రహస్యమార్గమున నచ్ఛోదసరస్సమీప వనమునకుఁ వచ్చుచుంటిమి.

అహో? అడుగు గదిపినఁ బెక్కండ్రు పరిచారికలు వెంట నడచి వచ్చుచుండ నేనట్లు తరళికా సహాయినినై పోవుచుండ నించుకయు వెరపులేకపోయినది. ప్రియునింగూర్చి యేకాంతముగా బయలువెడలు వారికి నారోపితశరాసనుండై పుష్పబాణుండు సహాయముగా వచ్చుచుఁ బరిచర్యక్రియల నుపదేశింపుచుండు ననుగదా!

లజ్జను వెనుకకుఁద్రోసి నాకంటె ముందుగా నింద్రియములతోఁ గూడ హృదయము పరుగిడఁ దొడంగినది. అప్పుడు నేను తరళికం జూచి, సఖియా! ఈ యింమహాతకుఁడు నన్నుఁబలె పుండరీకుని సైతము గరంబు బెంగెట్టి యభిముఖముగా దీసికొని రాఁడుగదా! యని పలికిన నదియు నవ్వుచు, రాజపుత్రీ? నీవు ముగ్ధరాలవు సుమీ? ఇతని కతనితోఁ బ్రయోజనమేమి? మదనాతురుండువోలె నీ యందనిష్టచేష్టలం గావింపుచున్నవాఁడు చూడుము. ప్రతిబింబకైతవంబున స్వేదకణికాంచితమగు నీ కపోలముఁ జుంబింపుచున్నవాఁడు. లావణ్యభూయిష్టమగు కుచభారంబునం బడుచుండెను. కాంచీరత్నములు గరంబున నంటుచుండెను, నిదిగో నఖాంక మూర్తియై పరంబుల బడుచున్నవాఁడు మఱియుం దాపంబుకతన నీ మేను పసుపువన్నె లేపమాయెను

రత్నము వహించి యున్నదో లేదో నిదానింపుము. అని మఱియుం బెక్కు తెఱంగులఁ దత్కాలోచితముగా నర్మసంభాషణములఁ గావింపుచుఁ గ్రమంబున నత్ప్రదేశమునఁ జేరితిమి.

అట్టి సమయమున నాసరోవరము పశ్చిమతీరంబున దవ్వగుటచే ననతివ్యక్తముగాఁ బురుష రోదనధ్వని యొకటి వినంబడినది. కుడికన్ను దదిరినది మొదలు శంకించుచున్న నా హృదయమా ధ్వని వినినంత మిక్కిలి తొట్రుపడుచుండ, తరళికా ? యిది యేమని వెరపుతో బలుకుచు మేను గంపమునొంద నతిత్వరితముగా దదభిముఖముగాఁ బోయితిమి.

ఆ సమయము నిశ్శబ్దముగా నుండుటచే దూరమయినను మఱియు నాధ్వని యిట్లు వినవచ్చె.

హా ! పుండరీక ? హా ! ప్రాణమిత్ర ! హా ! మహాభాగ ! మన్మథహతకుఁడు నీ కెట్టి యుపద్రవము సంఘటించెనురా ! అన్నన్నా ! దుర్వినీతయగు మహాశ్వేత మూలముననేకదా ? యింత పుట్టినది. కటకటా ! శ్వేతకేతున కెంతవచ్చినది ? ధర్మమా ! నిన్నికఁ నెవ్వరు స్వీకరింతురు ? తపంబా ! ఇఁక నీ కాశ్రయమెవ్వరు ? సరస్వతీ ? విధవవైతివే ? సత్యమా ! నిన్ను నాథఁగాదలంచెదను. మీయాశ్రయుండస్త లోకమునకుఁ బోయె. అయ్యో ! మిత్రమా ? నన్నుఁ జూడవేమి ? నిన్ను విడిచి యొక నిమిషమయిన నుండగలనా ? నన్ను విడిచిపోవుట నీకు న్యాయమా ? యొక్కసారి మాట్లాడుము. నాకు మిక్కిలి వేడుకగానున్నది. ఇఁక నేనెక్కడికిఁ బోవుదును ? ఎవ్వరితో దిరుగుదును ? నా యందుగల సుహృత్స్నేహమంతయు నెందుబోయినది ? ఎప్పుడును నవ్వుచునే మాట్లాడువాఁడవే, ఆ ప్రజ్ఞయంతయు నెందుబోయినది ? అయ్యయ్యో అక్కటా ! హా ! హా ! అని యీరీతి గపింజలుఁడు విలపించుచున్నట్లు వినంబడినది.

అప్పుడు నాకుఁ బ్రాణములు పోయినట్లేయెను. ప్రయత్నముతో నడచుచున్నను నిమ్నోన్నతములు నరయలేక అడుగులు తడఁబడుచుండ నెవ్వరో బలాత్కారముగాఁ దీసికొని పోవునట్లెట్టకేల కాప్రదేశముఁజేరి మణిశిలాతలంబున వనకుసుమములచే విరచింపఁబడియున్న శయ్యయందు దీర్ఘనిద్రాముద్రిత నయనుండై చందనరసచర్చితమగు నవయవముల మృణాళనాళముల నలంకారములుగా ధరియించి మన్మథవ్యథ సహింపజాలక నిశ్చేతనుండై సుఖించుచున్నట్లు అపూర్వప్రాణాయోగం బభ్యసించుచున్నట్లు అనంగయోగ విద్యనవధరించుచున్నట్లు విగతజీవితుండయినను దేజంబుదప్పకపడియున్న పుండరీకుని మహాపాపాత్మురాలనగు నేను జూచితిని.

కపింజలుఁడు నన్నుఁ జూచి రెట్టించిన శోకముతో నతని కంఠమును గౌఁగలించుకొని మఱియు నెక్కుడుగా విలపింపఁదొడంగెను. అప్పుడు నేను మూర్ఛాంధకార

వివశనగుట నేమని విలపించితినో యేమయితినో యెఱుంగను. నాఁటినుండి ప్రాణములు సైతమేమిటికిఁ బోయినవికావో నాకుఁదెలియదు. మరికొంతసేపటికి నాకుఁ దెలివి వచ్చినది. అప్పుడు నా దేహమును నగ్నియందుబడినట్లు అసహ్యశోకదహ్యమానమై నేలంబడి కొట్టుకొనుచుండఁ జూచితిని.

హా ! యిదియేమి యుపద్రవము, ఇట్లు వచ్చినదని పెద్ద యెలుంగున హా ! అంబ ! హా ! తాత ! హా ! సఖులారా ! యని యరచుచు, హా ! నాథ ! జీవితసంబంధన నన్నొంటిమైవిడిచి యెక్కడికిఁబోయితివో చెప్పుము నీనిమిత్త మెట్టియవస్థ ననుభవించితినో తరళిక నడుగుము, దివసమొక్కటియే సహస్రయుగప్రాయముగా గడిపితిని.

ఒక్కసారి మాటాడుము ? భక్తవత్సలత్వము జూపుము. నా మనోరథము పూరింపుము. భక్తురాల, ననురక్త, బాల, ననాథ, మదనపరిభూత, నిట్టి నాయందేటికి దయసేయవు ? నేనేమి యపరాధము చేసితిని ? అయ్యో ! నీవు నాకతంబున నెట్టి యవస్థఁబొందితివి. నాకీ బ్రహ్మహత్యాపాతకంబెట్లు పోవును. నేను మహాపాతకురాలను. ఇట్టి నిన్ను విడిచి ఇంటికిఁ బోయితిని. ఇఁకనాకు దల్లిదండ్రులతోఁ బ్రయోజనమేమి ? బంధువులేమిటికి ? దైవమా, నన్ననుగ్రహింపుము, వనదేవతలారా, అనాథను రక్షింపరా ? తల్లీ ! భూదేవి ! లోకానుగ్రహకారిణి ? నాయందు నీకైనం దయలేదా ? యని యనేక ప్రకారముల నేమియుం దెలియక గహాపిష్టురాలి చందమునఁ బ్రేలుచు విలపింపఁ దొడంగితిని, మరియుఁ దచ్ఛరీరంబునంబడి కపోలములు మొట్టుచు జటాకలాపములు సవరించుచు హృదయంబున నిడిన నళినీదళంబులఁ దీసివేయుచు మాటిమాటికి మోముచుంబించుచు సారెసారెకు గంఠగ్రహణముచేయుచు, ఆర్యా ! యీతనిం బ్రతికింపుమని కపింజలుని పాదంబులంబడుచు, దరళికం గౌఁగలించుకొనుచుఁ బెక్కుగతుల విలపించితిని.

అప్పుడు నా నోటనుండి అశ్రుతపూర్వములగు ననుపదిష్టములు నగు చాటూక్తులెన్నియేని వెడలినవి. తలంచుకొన నాకావిలాపవచనము లెట్లు వచ్చినవో నాకే చిత్రమగుచున్నది. అదియొక యవస్థగదా. జలయంత్రమువలె నశ్రుప్రవాహములు బయలు వెడలుచుండెను. నోటినుండి యుపసరించుచున్నట్లు ప్రలాపములు వచ్చుచుండెను. అన్నన్నా ! ఆ యవస్థ తలంచుకొనినంత మేను గంపము నొందుచున్నదని పలుకుచున్న యామహాశ్వేత చేతనము మూర్ఛ హరించినది.

తద్వేగంబునం బడుచున్న యామెను జంద్రాపీడుఁడు కరంబునం దాని పట్టుకొని యశ్రుజలములచేతఁ దడసిన తదుత్తరీయముచేతనే మెల్లగా వీచుచుఁ గొంతసేపునకుఁ దెలివివచ్చి కన్నులఁ దెరచిన యామెంజూచి దైన్యంబుతో నిట్లనియె.

భగవతీ ! నాకతంబున నీశోకము వెండియు దాపము గలుగఁ జేసినది. ఇఁకపైనఁ జెప్పకుము, విరమింపుము, నేను సైతము వినఁజాలకున్నాను. గతించిన వైనము సుహృజ్జనదుఃఖములు స్మరించినప్పుడు అనుభవసమమగు వేదనఁ గలుగ

జేయునుగదా. అతిప్రయత్నముతో ధరించిన యీ ప్రాణముల శోకానములకు నింధనములఁ జేయకుమని పలికిన విని యక్కలికియు నిట్టూర్పు నిగిడింపుచుఁగన్నుల నశ్రువులు గారుచుంత విషాదముగా నిట్లనియె.

రాజపుత్రా! అట్టి దారుణ శోకసమయమందే విడువని యీ కృపణప్రాణములు నన్నిప్పుడేల విడఁచును? నిక్కము. పాపాత్మురాలనగు నాకంతకుఁడు సైతము దర్శన మీయవెరచుచున్నాడు. కఠినాత్మురాలనగు నాకిప్పుడీ శోకమేమిటికో? ఇది శోకమా? అశోకము, సిగ్గులేనివారలలో నేను మొదటిదానను. వజ్రమయమగు హృదయముతో నట్టిదుఃఖమనుభవించితిని. కాని యనుభూతమయిన దానిం జెప్పిన నేమి లెక్కయున్నది? తదనంతర వృత్తాంత మాకర్ణింపుము.

నేనట్లు పెక్కు తెరంగులఁ బలవరింపుచుఁ దరళికం జూసి, బోటీ! ఇఁక నా జీవితమేమిటికి? జింతయేమిటికి? చితి రచింపుము, అగ్నిం బడి ప్రాణేశ్వరుం గలసికొందునని పలికితిని.

అట్టి సమయమున నంతరిక్షమున జంద్రమండలము నుండి వెల్వడి యమృతడిండీరపాండురమగు నుత్తరీయాంశుకము నంసదేశమున వ్రేల మనోహరాలంకార భూషితుండై మహాపురుష లక్షణోపేతుండై దివ్యాకృతితో నొప్పు నొక్క మహానుభావుఁడు ధవళదేహప్రభావిలాసములు దిగంతముల వ్యాపింపమెల్లన నచ్చటికి వచ్చి అతిశీతల స్పర్శములుగల నంగుళులతో నొప్పు నైరావతకరపీవరములగు బాహువులచే నందు గరాసుఁడైపడియున్న పుండరీకుని దేహము నెత్తుచు నన్నుద్దేశించి దుందుభి నాదగంభీరమగు స్వరముతో, వత్సా! మహాశ్వేత! నీవిప్పుడు ప్రాణములు విడువకుము. నీకితనితో వెండియు సమాగమము కాగలదు. అని తండ్రివలె నన్నోదార్చి యతండు పుండరీక శరీరముతోఁ గూడ గగనతలమున కెగసి యరుగఁ జుండెను.

అప్పుడు నేను భయవిస్మయ కౌతుకంబులు చిత్తంబుల పెట్టఁ దలపైకెత్తి చూచుచు, అర్యా! ఇదియేమి యద్భుతమో చెప్పుమని కపింజలు నడిగితిని.

అతండు నాకేమియుఁ బ్రత్యుత్తర మియ్యకయే తొందరగాలేచి అంతకా? దురాత్మా! నామిత్రు నెచ్చటికిఁ దీసికొనిపోవుచున్న వాఁడవని యలుకతోఁ బలుకుచు నుత్తరీయవల్కలము నడుమునకు బిగించి యమ్మహాపురుషు ననుగమించి యంతరిక్షమున కెగసెను. మేము చూచుచుండగనే తారనక్షత్ర మండలములలోఁ బ్రవేశించి యంతర్ధానము నొందిరి.

ప్రియతమ మరణంబునం బోలెఁ గపింజలుగమనంబున శోకం బిబ్బడింప నా హృదయం బప్పుడు భేదిల్లినది. అప్పుడు కింకర్తవ్యతా మూఢత్వంబునం దరళికం జూచి, యోసీ! ఇప్పుడు నాకేమియుం దెలియకున్నది, యెరింగితివేని నీవు నాకుఁ దెల్లముగా వక్కాణింపుమని యడిగిన నదియు మదీయ మరణమున సహింపక నాకిట్లనియె.

దేవీ! పాపాత్మురాల నాకేమియుం దెలియదు. ఐనను నీ దివ్యపురుషుఁడు నిన్నుఁ దయతోఁ దండ్రియుంబోలె నోదార్చుటఁజూడ మిక్కిలి వింతగానున్నది. ఆలోచింప నసత్యముగా నిట్లు పలుకుట కేమియుఁ గారణము గన్పడదు. కావున నిప్పుడు ప్రాణపరిత్యాగ వ్యవసాయమునుండి మరలుటయే యుత్తమము. ఆ పురుషు నసుసరించి కపింజలుఁడుగూడఁ బోయెనుగదా! అతనికట్లు పలుకుట కేమియవసరమో యించుక యాలోచింపుము. మరణమునకేమి తొందర! పిమ్మట బొందవచ్చును కపింజలుఁడు మరల వచ్చువరకైనఁ బ్రాణములు దాల్చియుండుము, తరువాతఁ జూచుకొనవచ్చునని పలుకుచు నా పాదంబులం బడినది.

జీవితాశ యెల్లరకు దుర్లంఘ్యమయినది. కావుననే నే నట్లు చేయుటయే యుత్తమమని తలంచి జీవితమును విడువఁజాలక కపింజలుని రాక గోరుచు నతి దారుణమైన యా రాత్రి తరళికా సహాయినినై సహస్ర యుగప్రాయముగా వెళ్లించితిని.

మరునాఁ డరుణోదయంబున నాసరస్సులో స్నానముచేసి పుండరీకునికిఁ బ్రీతిగాఁ దత్కమండలము తద్వల్కము దక్షమాలికను ధరించి సంసారమసారమనియు వ్యసననిపాతము లప్రతీకార సాధ్యములనియు శోకము దుర్నివారమైనదనియు దైవము నిష్ఠురుఁడనియు సుఖములనిత్యములనియు నిశ్చయించి తల్లిదండ్రుల లెక్కసేయక పరిజనములతోఁ గూడక సకలబంధుజనులకు మనసుచేతనిరసించి యింద్రియ సుఖముల యందుఁ గోరకుండ చిత్తమును నియమించి బ్రహ్మచర్య వ్రతమును గైకొని భక్తజనవత్సలుం డగు నీ పురహరు నారాధింపఁ దొడంగితిని.

నావృత్తాంతమును విని సకలబంధుపరివృతుండై నా తండ్రివచ్చి యింటికి రమ్మని యెంతేని బ్రతిమాలెను కాని నామనము తిరిగినదికాదు. పుత్రికాస్నేహంబున నతండు పెద్దతడవు నాకొరకు నిరీక్షించుకొని చివరకు నిరాశుడై దుఃఖముతో నింటికిఁ బోయెను.

నాటంగోలె నేనిందు నమ్మహాపురుషుని కృశమోక్షణ మాత్రంబున కృతజ్ఞత జూపించుకొనుచు జపవ్యాజమునఁ దద్గుణముల లెక్కించుకొనుచు బహువిధములగు నియమములచేత శరీరమును వాడజేయుచు నిత్యంబునుసేవింపుచు నాతరళికతోఁ గూడ నీగుహయందు వసించియుంటిని.

మహాభాగ! ఆ బ్రహ్మహత్యా పాతకురాలను నేనే. ఇదియే నా వృత్తాంతమని పలికి యక్కలికి వల్కలోపాంతభాగంబున మోము దప్పించుకొనుచు దుర్నివారమైన బాష్పవేగము సద్దుకొనుచు నుచ్చస్వరముతో నేడువఁదొడంగినది.

చంద్రాపీడుఁడు తదీయ వృత్తాంతమంతయు విని యా కృతజ్ఞతా విశేషమున కత్యంత సంతోషింపుచు మెల్లగా నిట్లనియె భగవతీ! క్లేశభీరుఁడు నకృతజ్ఞుడు నగు జనుండు స్నేహసదృశమైన కార్యమును జేయలేక నిష్ఫలమైన యశ్రుపాతమాత్రముచేతనే మైత్రిం బ్రకటించుకొనును.

అట్టితాక క్రియచేతనే కృతజ్ఞతను వెల్లడించెడి నీవును నిట్లు నిందించు కొనియెద వేలకి ? అతని నిమిత్తము మహైశ్వర్య సుఖములన్నియుఁ దృణముగానెంచి విడిచితివి ! తల్లిదండ్రులఁ దొరఁగితివి. పరితాపజనదుష్కరములగు నియమములచే గాయమును గ్లేశపరచుచుంటివి.

ఇదియునుంగాక శోకాభిభూతులచేత నాత్మ యనాయాసముగా విసబడుచున్నది. అతిప్రయత్నమున గాని క్లేశముల యందుంచబడదు. మరణమనునది యపండితులు గావించుచుందురు. తండ్రిగాని, తల్లిగాని, భర్తగాని, మిత్రుడుగాని మృతి నొందునప్పుడు తానును మృతినొందుట కంటె యవివేకములేదు. దీనివలన వాని కేమైన నుపకారము జరుగునా ? తిరుగాఁ దీసికొనివచ్చునా ? పరలోకసౌఖ్యమిచ్చునా ? దర్శనమిచ్చునా ? యేమియుం జరుగదు. ఆత్మహత్యా పాతక మొందుమాత్రము వేధించి నిరయము నొందఁజేయును.

బ్రతికియుండి జలాంజలిదానాది విధులచే నుపకృతి జేయవచ్చును. రతీదేవి వృత్తాంతము స్మరించుకొనుము. ప్రియుండు హరనయన హుతాశన దగ్ధుండైనను దాను మృతినొందక పేరొకరీతి నాతని పొందు గలిగియున్నది. మరియుం బెక్కండ్రు కాంతలు ప్రియులు లోకాంతరగతులైనను ప్రాణములు విడువక నిలిచియుండి సుఖించుచుండుట వినియుండలేదా ? అదియునుంగాక భగవతిచే స్వయముగానే పునస్సమాగమ సూచకమగు వచనము వినఁబడినదికాదా ? ఆ మాట వితథమెట్లగును ? నిస్సంశయముగా నమ్మహానుభావుండు తిరుగా సురలోకమునుండి రాగలఁడు. మహాత్ముల ప్రభావమచింత్యమైనది. పరలోకమునకేగి మరల వచ్చిన చరిత్రలు పెక్కు మనము పురాణముల వినుచున్నవారము. పుండరీకుండు నట్లు రావచ్చును. రాకున్నను నేమి చేయగలము ? ఎవ్వరిని నిందింపము ? విధి బలవంతమైనది. దైవహతకుని విలాసము లతిపిశునములు. అయతస్వభావములు దుఃఖములు, అనాయత స్వభావభంగురములు సుఖములు. ఒక జన్మమునందు సమాగమము, జన్మాంతర సహస్రములయందు విరహము గలుగుచుండును. ఆత్మను నిందించుకొనరాదు. సంసారమే యతిగహనమైనది. దీని ధీరులుగాని దాటలేరు కదా !

అని యిట్లు మృదువులైన సాంత్వన వచనములచే నామె నోదార్చుచుఁ జంద్రాపీడుఁడు వెండియు నిర్ఝర జలంబుదెచ్చి బలాత్కారముగా నశ్రుజలకలుషిత మగు నామె మొగమును గడిగించెను.

అంతలో మహాశ్వేత వృత్తాంతమును వినుటచే శోకించువాఁడుంబలె దివస వ్యాపారము విడిచి రవి యధోముఖుం డయ్యెను.

అని యెఱింగించి మణిసిద్ధుండు గోపా ! యిప్పుడు వేళ యతిక్రమించినది,

తర్వాతివృత్తాంతము విస్తారముగా నున్నయది కావున ముందటి మజిలీలో దర్వాతికథ జెప్పెద నిప్పుడు లేచి కట్టెలం దెమ్ము. వంటఁజేసికొని భుజింతమని పలికి యెట్టకేలకు వాని సమాధానపరచి యట్లు కావించెను.

మరియు నయ్యతీశ్వరుని వెంట గావడి మోచుకొని నడచుచు వాఁడు నడుమ నడుమ అయ్యా ! అమ్మహాశ్వేతతోఁ బుండరీకుఁడు వెండియు గలిసికొనునా? చంద్రాపీడుఁడు తరువాత నేమి చేసెను ? ఎచ్చటికి బోయెను ? ఏమి జరిగినది ? అని యడుగుచుండ హస్తసంజ్ఞచే వారింపుచు నెట్టకేలకా పారికాంక్షి తరువాత మజిలీ చేరి తదనంతరోదంత మిట్లెరింగించెను.

—:●:—

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

## కాదంబరి కథ

అట్లు సాయంకాలమగుటయు మహాశ్వేత మెల్లగా లేచి పశ్చిమ సంజ నుఁపాంసిచుచుఁ గమండలు జలంబులఁ బాదములఁ గడిగికొని వల్కలతల్పమున నతికష్టముగా గూర్చుండెను.

చంద్రాపీడుండును సంధ్యాప్రణామములు గావించి రెండవ శిలాతలమున మృదులతాపల్లవములచేత శయ్యగల్పించుకొని కూర్చుండి యమ్మహాశ్వేతవృత్తాంతమునే పలుమారు తలంచుకొనుచు మన్మథ ప్రభావమునకు వెరగుపడుచు వినయముతో వెండియు నామె కిట్లనియె.

భగవతీ ! వనవాస వ్యసనమిత్ర మగు నీ పరిచారిక తరళిక యెందు బోయినది ? అని యడుగుటయు నా సాధ్వి మహాభాగా ! చెప్పెద వినుము. గంధర్వ కుల నాయకుఁడగు చిత్రరథుని ప్రసిద్ధి మీరు వినియుందురు. అతనికిఁ గాదంబరి యను కూఁతురు కలదు. అబ్బాలిక నాకు రెండవ హృదయము వంటిది. పిన్ననాటినుండియు నశనపానశయనాదు లేకముగానే మా యిరువురకు జరిగినవి. శిశుక్రీడలను నృత్య

గీతాది కళాపరిచయము మా కొక్కచోటనే కలిగినది. ఆ రీతి మా యిరువురచేతను బాలభావము గడుపఁబడినది

ఆ కాంత యిప్పుడు నా వృత్తాంతములు విని మిక్కిలి శోకించుచుఁ దాను గూడ నిట్లు శపథము చేసినది. నా వయస్యయైన మహాశ్వేత దుఃఖించియుండగా నేను బెండ్లియాడను. మా తండ్రి నాకు బలవంతముగా బెండ్లి చేసినచో రజ్జు, సర్ప, విష, పావకాదుల మృతినొందుదానని సఖుల చెంతపల్కు పలుకులు కర్ణాకర్ణికగా విని దాని తండ్రి చిత్రరథుఁడు మిక్కిలి పరితపించుచు నేకాపత్యుఁడగుటచే నేమియు దానిని మందలింపలేక వితర్కించి మరియొక యుపాయ మేమియుంగానక నా యొద్దకు క్షీరోదుఁడను కంచుకి నంపి వత్సా ! మహాశ్వేత ! నీ నెచ్చెలి కాదంబరి సంపూర్ణ యౌవనయయ్యు వివాహమాడనని మూర్ఖము చేయుచున్నది. యెవ్వరు చెప్పినను వినకున్నది. నీ కన్న దాని చిత్తమును మరల్చువారు లేరు. ఎట్లైనను నీవీ కష్టమును మాకుఁ దొలగింపుమని నాకు వార్త నంపెను. నేనా వార్త విని గురువచనమందలి గౌరవముచేతను సఖురాలి యందలి మక్కువ చేతను "అయ్యో కాదంబరీ ! దుఃఖించుచున్న నన్ను మిక్కిలి దుఃఖింపజేయుచున్నావేమి ? నాకు సంతోషము గలుగజేయు తాత్పర్యము నీకుఁ గలిగియున్నచో నా మాట విని తండ్రిచెప్పిన చొప్పున నడువుము. ఇదియే నాకు ప్రియము"

అని నా మాటగా చెప్పుమని తరళికను క్షీరోదుని వెంట నీ దినముననే యంపితిని. అది వెళ్ళిన కొంచెము సేపునకే దేవర దయచేసితిరని పలికి యూరకుండెను.

అంతలోఁ జంద్రోదయమైనది. అప్పుడు మహాశ్వేత వల్కల తల్పంబునం బరుండి నిద్రబోయినది చంద్రాపీడుఁడును మనంబున అయ్యో ! యిప్పుడు వైశంపాయనుఁ డేమి చేయుచుండునో నన్నుఁగానకెంత చింతించుచుండునో 'పత్రలేఖ యేమనుకొనునో' రాజపుత్రు లేమందురో యని ధ్యానించుచునే నిద్రబోయెను.

నిశావసానంబున మేల్కాంచి మహాశ్వేతయు నా రాజపుత్రుఁడును కాలకృత్యములు నిర్వర్తించిరి. ఇంతలో మనోహరమైన వేషముతో కేయూరకుండను గంధర్వ కుమారునితో గూడఁ దరళిక యచ్చటికి వచ్చినది. ఆ ప్రాంతమందుఁ గూర్చునియున్న రాజపుత్రునింజూచి యాతరళిక విస్మయమందుచుఁ దదీయరూపమహిమం గ్రోలుచున్నట్లు సవిశేషాదరముగా జూచిచూచి తల యూచుచుఁ బిమ్మట మహాశ్వేత యొద్దకుఁబోయి నమస్కరించి తదీయ జపావసానమువరకుఁ దాపున గూర్చుండెను.

మహాశ్వేతయు జపము ముగించినవెనుక తరళికంజూచి, బోటీ! కాదంబరి సుఖముగా నున్నదా? నామాటలం జెప్పితివా? యేమన్నది? సమ్మతించెనా? యని యడిగిన విని యవ్వనితయు వినయముతో శిరమువంచి, రాజపుత్రీ ! నేనువోయి

కాదంబరిని జూచితిని. ఆమె సుఖముగానున్నది. నీ సందేశమంతయు వినిపించితిని. కన్నీరుగార్చుచుఁ గేయూరకుఁడను తన వీణావాహకుని కేదియో చెప్పి యిచ్చటికంపినది. సర్వము నతండే నివేదించునని పలికి యూరకుండెను.

అప్పుడు కేయూరకుడు లేచి నమస్కరించుచు దేవీ? మా రాజపుత్రి నీకిట్లు విజ్ఞాపనజేయుమని నన్నంపినది. వయస్యా! ఇప్పుడు తరళిక చెప్పిన మాటలన్నియు వింటిని. నాచిత్తమును బరీక్షించుటకో లేక గృహవాసాపవాదమును గూర్చి నిపుణముగా నధిక్షేపించుటయో స్నేహపరిత్యాగమో కాక కోపమో కాని యిట్టివార్తన్ నంపుట నాకు మిక్కిలి వ్యసనముగా నున్నది. మిత్రురాలు చింతించుచు నటవిఁ గ్రుమ్మరుచు వ్రతముల గృశించి కష్టముల ననుభవింపుచుండ నాకు ఆహా! సుఖ మెట్లనుభవింప నగును? నిర్వృత్తి యెట్లు గలుగును? సంభోగమెట్లు రుచ్యమగును? పెక్కేల! నవ్వు సైతము వచ్చునా?

క్రూరుఁడగు మన్మథుఁడు నిన్నిట్టి యవస్థ నొందజేసెనే? అట్టి కాముని సకామునిగా నెట్లు చేయుదును? పద్మినులు దివసకరాస్తమయ విధురములగుచుండ సహవాస పరిచయంబునం జేసి చక్రవాకయువతి సైతము సమాగమసుఖమును విడుచుచున్నదే? నీయందలి ప్రేమచేతనే గురుజనాజ్ఞ నుల్లంఘించి స్వాతంత్ర్య మంగీకరించితిని. గురువచనము తిరస్కరించితిని. లోకాపవాదము గణింపనైతిని. స్త్రీలకు మండనమగు సిగ్గు విడిచితిని. ఇప్పుడు తిరిగి యెట్లు స్వీకరింతును?

అంజలిఘటించి ప్రార్థించుచున్నదాన, నన్ననుగ్రహింపుము. నా జీవితము తోడనే నీవు వనములోఁ బ్రవేశించితివి. కోపము సేయక యూహింపుము. నన్నప్పుడు మందలింపవలదు. నా చిత్తము మరలదు. అని చెప్పి కేయూరకుఁడూరకుండెను.

అతనిమాటలు విని మహాశ్వేత గొంతసేపాలోచించి తలయూచుచుఁ గానిమ్ము. కేయూరక! నీవు పొమ్ము. నేను వచ్చి పరిశీలించెదనని పలికి యతని నంపి చంద్రాపీడునింజూచి, రాజపుత్రా! కింపురుష రాజధానియైన హేమకూటమున కిప్పుడు పోవలసియున్నది. అదియు నిచ్చటికి దాపుగనే యుండును. అదృష్టపూర్వములగు పట్టణ విశేషములం జూడ వేడుక గలిగియున్నచోఁ జూచి వత్తువుగాని రమ్ము. మద్విశిష్ట యగు కాదంబరిని సైతము చిత్తవిభ్రమమునుండి తొలగింపనగు నొక దివసమేయుండి పోవచ్చును. అకారణబంధుండవగు నిన్నుఁ జూచినది మొదలు నా హృదయ పరితాప మొకింత తొలంగినది. సజ్జన సమాగమము శోకమును బోగొట్టును కదా! మీవంటివారు పరులకు సుఖముగలుగుటయే చింతించుచుందురని పలికిన విని చంద్రాపీడుఁ డచ్చేడియ కిట్లనియె.

భగవతీ! నిన్నుఁజూచినది మొదలు నాకును హృదయమున నెద్దియో యపూర్వమగు నుత్సాహము గలుగుచున్నది. నిశ్శంకముగాఁ గర్తవ్యములకు నన్ను

నియోగింపుము. అన్యునిగా భావింపకుమని పలికి యతండు హేమకూటమునకు వచ్చుట కంగీకరించెను.

మహాశ్వేతయుఁ జంద్రాపీడునితోఁగూడ శుభముహూర్తంబునఁ బయలుదేరి క్రమంబున హేమకూట రాజధానికిం జని గంధర్వ రాజకులము నతిక్రమించి కాంచన తోరణ విరాజమానములగు కక్ష్యాంతరములనేడింటిఁ దాటి కాదంబరీ కన్యకాంతఃపుర ద్వారదేశమును జేరెను.

అందు అమ్మహాశ్వేతం జూచినతోడనే తొందరగా దూరమునుండియే ప్రతీహారిజనము వేత్రలతా యుక్తములగు హస్తములతో మ్రొక్కుచు మార్గమెరింగింప నసంఖ్యేయ కన్యకా సహస్రములచే నిండియున్న లోపలఁ బ్రవేశించి యంగనాద్వీపము వలె మెఱయుచున్న యందద్భుతలావణ్య పూర్ణవిగ్రహలై దివ్యాలంకార శోభితలై యిటునటు తిరుగుచున్న గంధర్వ స్త్రీలం గాంచి రాజపుత్రుండిది స్వప్నమేమోయని భ్రాంతిజెంది యామెవెంట నడుచుచుండెను.

అందున్న గంధర్వ కన్యకా జనమునకు సఖిహస్తావలంబనములే పాణిగ్రహణ మహోత్సవములు. వేణువాద్యములయందే చుంబనవ్యతికరములు. వీణలయందే కరరుహవ్యాపారములు కందుకక్రీడలయందే కరతలప్రహారములు భవనలతానేక కలశకంఠములయందే భుజలతా పరిష్వంగములు లీలాడోలికయందే జఘనస్తన ప్రేంఖితములు. అశోకతరుతాడనములయందే చరణాభిఘాతములు కాని సురత విలాసములేమియు నెఱుంగరు. తత్ప్రక్రియలచే శృంగారచేష్టల నభ్యసించుచున్నట్లు కనంబడుచుండిరి.

అట్టి వినోదములం జూచుచుఁ జంద్రాపీడుఁడు మహాశ్వేతవెంట నరుగుచు మరికొంతదూరము వోయినంతఁ గాదంబరీ ప్రత్యాసన్నలగు పరిజనుల మాటలిట్లు వినంబడినవి.

లవలికా ? కేతకీకుసుమధూళులచే లవలీలతల కాలవాలములు గట్టుము.

సాగరికా ! గంధోదక కనకదీర్ఘికలయందు రత్నవాలుకల జిమ్ముము.

మృణాలికా ! కృత్రిమపద్మలతలయందుఁ గుంకుమజల్లి చక్రవాక మిథునముల విడువుము.

మకరికా ! గంధపాత్రములఁ గర్పూరపల్లవరసంబునఁ బరిమళింపఁ జేయుము.

రజనికా ! భవనదీర్ఘికలయందలి తమాలవృక్షములచేఁ జీకటిగానుండు తావుల మణిదీపములఁ జేర్పుము.

కుముదినికా! దానిమ్మపండ్లను బత్తుల దినకుండ మెత్తపు పేరులం బెట్టుము.

నిపుణికా! మణిసాలభంజికల కుచములయందు కుంకుమరస పత్రభంగ ముల రచింపుము.

ఉత్పలికా! కనకసమ్మార్జనులచేఁ గదళీగృహములయందలి మణివేదికలం దుడుపుము.

మాలతికా! సిందూరరేణువులచేఁ గామదేవగృహదంతవలభికకు రంగు వేయుము.

కేసరికా! భవన కలహంసలకుఁ గమల మధురసం బొసంగుము.

కదళికా! గృహమయూరముల ధారాగృహము జేర్పుము.

కమలినికా! చక్రవాకశిశువులకు మృణాళక్షీరరసం బిడుము.

లవంగికా! చకోరపంజరములయందుఁ బిప్పలీతండులకలంబులఁ బోయుము.

మధురికా! కిన్నరమిథునములకు సంగీతశాలల విడువుము.

అట్టి వినోద సంభాషణములన్నియు నాలింపుచుఁ గ్రమంబునఁ బోయి కాదంబరీ భవనసమీపమును జేరిరి. అందు సేవార్థమై యరుదెంచి యుభయపార్శ్వముల వసించియున్న యన్నుమిన్నల మణికనక విభూషణ కిరణ జాలంబులు నదీ ప్రవాహమువలె వ్యాపించుచుండెను. దివ్యరూప సంపన్నలగు గంధర్వ కన్యకలు మండలముగాఁ జుట్టునుం బరివేష్టించి కూర్చుండ దివ్యమణి ప్రభాధగద్ధగితమగు శ్రీమంటప మధ్యంబునఁ నీలాంశుక విరచితంబగు హంసతూలికాతల్పంబునఁ దెల్లని తలగడపైఁ జేతులాని మహావరాహ దంష్ట్రావలంబితయగు భూదేవివలె నొప్పుచు దిక్పాలకాంతాజాలంబు పెన్పు పెరుగ భుజలతావిక్షేప పరిభ్రమణములచే నిరలించుచుండిరో యనఁ జామరగ్రాహిణులిరువంక వీచుచుండ నొయ్యారముగాఁ బడుకొను సఖులతో ముచ్చటింపుచుఁ బర్యంకము దాపున నేలం గూర్చుండి కేయూరకుండను వీణాధారుండు మహాశ్వేతయొద్దకు వెళ్ళివచ్చిన వర్తమానములం జెప్పుచుండ సచ్చైతన్యముతో నాలింపుచున్న కాదంబరీ తరుణీలలామంబు చంద్రాపీడునకు నేత్రపర్వము గావించినది.

భూలోకములో మహాసుందరులని పేరుపొందిన యింతులు గంధర్వ కన్యలకు దాస్యము సేయఁబనికిరారు. అట్టి గంధర్వకాంతలలో నిరుపమానసౌందర్య శాలిని యని ప్రఖ్యాతి వడసి గంధర్వకుల చక్రవర్తి కూఁతురై సరతిశయభాగ్య వైభవంబులఁ బ్రకాశించు కాదంబరి నా దివ్యస్త్రీల నడుమఁ గనకమణి శ్రీమంటపమధ్యమున హటాత్తుగాఁ జూచినంతఁ జంద్రాపీడుని హృదయ మెట్లుండునో వ్రాయుట దుర్ఘటము. తద్భూషణమణి కిరణజాలంబులు కన్నులకు మిరిమిట్లు గొలుప విభ్రాంతుండై యొక్కింతతడవేమియుం దెలియక మోహములోనుండి యంతలోఁ దెప్పిరిల్లి

అహో! నాకన్నులెట్టి పుణ్యము చేసికున్నవో? ఇట్టి లోకైకసుందరి ననివార్యముగాఁ జూడఁగలిగినవి. అయ్యారే! విరించి సర్వరమణీయవస్తువులనేరి యీనారీరత్నమును సృజించెనని తలంచెదను. ఓహోహో! అక్కమలగర్భుండు రూపాతిశయపరమాణువుల నిన్నిటి నెక్కడ సంపాదించెనో? తెలియదు.

నిక్కమీకాంచనగాత్రిం నిర్మించుచున్న విరించనుని కరతల పరామర్శక్లేశంబున నామె కన్నులనుండి జారిపడిన జలబిందువులనుండియే భూమియందుగల కుముద కమలసౌగంధికాది వస్తువు లుత్పన్నంబులైనవి. బాపురే! ఈపూఁబోఁడి మోమంతయుఁ గన్నులుగానే కనంబడుచున్నది? ఇది కొమ్మయా? బంగరుబొమ్మయా? అని వితర్కించుచున్న యన్నరనాథసూనుని దృష్టిప్రసారము కాదంబరీనయనయుగంబున వ్యాపించినది.

అమ్మదవతియు నదరుపాటుతో నతనింజూచి రూపాతిశయ విలోకనము వలనం గలిగిన విస్మయముచే రెప్పవాల్పకుండ సూటిగాఁ జూపులతనిపై వ్యాపింపఁజేసినది. తల్లోచన ప్రభావ్యాప్తిచేఁ దెల్లఁబడి కాదంబరీ దర్శన విహ్వలుండై యతండు కాదంబరీ దర్శన విహ్వలుండగు బలరామునివలెఁ బ్రకాశించెను.

కాదంబరి యట్లా రాజపుత్రు నబ్బురపాటుతోఁజూచి మేను గగుర్పొడువ భూషణరవమేపార నట్టిలేచి మేనెల్లం జెమ్మటలుగ్రమ్మఁ గంపముతో నతికష్టంబునఁ గొన్నియడుగు లెదురువోయి చిరకాల దర్శనమువలనఁ గలిగిన యుత్కంఠతో నాకలకంఠినిఁ గంఠాశ్లేషము గావించినది.

మహాశ్వేతయుఁ బ్రత్యాశ్లేషము గావించుచు సఖీ! ఈతండు రక్షిత ప్రజాపీడుండగు తారాపీడుండను భూలోకచక్రవర్తి కుమారుండు నిజభుజాస్తంభ విక్రాంత విశ్వంభరాపీఠుండు చంద్రాపీడుండనువాఁడు. విజయయాత్రాప్రసంగమున నీభూమి కరుదెంచెను. చూచినది మొదలు నాకితండు నిష్కారణబంధుఁడై యొప్పెను. పరిత్యక్త సకలసంగనైన నాచిత్తవృత్తిని స్వభావసరళములగు సుగుణములచే నితం డాకర్షించెను. దాక్షిణ్య పరవశుండు సత్ప్రతిమ హృదయుండు విదగ్ధుండనగు నినిన్ మిత్త్రుండు దొరకుట దుర్ఘటము గదా?

నేనువీనికి వీరుగుణ నిసుకుమారనింజూచి వాణీభవుని నిర్మాణ కౌశలము పృథివికిఁ గల బాల్యభాగ్యము మర్త్యలోకము సురలోకమును మించుటయు మనుజస్త్రీలయొక్క నేత్రసాఫల్యము సర్వకళలు నొక్కచోటనుండు విధముం దెలిసికొనఁగలవని బలవంతముగా నీతని నిచ్చటికిఁ దీసికొని వచ్చితిని. నిన్ను గురించి యాతనితోఁజాల చెప్పియున్నదానఁ గావున నితండు క్రొత్తవాఁడని సిగ్గుపడక అవి జ్ఞాతశీలుఁడని శంకింపక నాయందెట్టి ప్రీతిగలిగి యుంటివో వీనియందుఁగూడ నట్లే వర్తింపవలయును.

ఈతఁడే మనకుఁ బరమమిత్త్రుఁడు. ఈతఁడే మనకు దగ్గిరచుట్టము.

శీలఁడే మనకు నమ్మఁదగిన పరిజనుఁడు అని చెప్పినది. అప్పుడు చంద్రాపీడుఁడు కాదంబరికి నమస్కారము గావించెను.

అట్లు నమస్కరించిన చంద్రాపీడు నత్యంత ప్రీతిపూర్వకముగా వార చూపులచేఁ జూచుచున్న కాదంబరియొక్క నేత్రకోణములనుండి శ్రమజలకణములవలె నానంద బాష్పబిందువులు రాలినవి. మొగంబున సుధాధవళములగు స్మితజ్యోత్స్నలించుక వ్యాపించినవి. ప్రతి ప్రణామంబున నతని సత్కరింపుమని శిరంబున కెరిగించు నదివోలె భ్రూలతలు పైకెగసినవి.

అప్పు డందున్న గంధర్వకన్యకలు తిర్యగ్విలోకనముల నతని సోయగము పరికింపం దొడంగిరి.

కాదంబరి సంభ్రమముతో నతనికి నమస్కరించి మహాశ్వేతతోఁగూడఁ బర్యంకమునఁ గూర్చుండెను. పిమ్మటఁ బరిజనులచే దొందరగాఁ బర్యంకశిరోభాగ ప్రాంతమున వేయబడిన హేమపాదాంకితమగు రత్నపీఠంబునఁ జంద్రాపీడుఁ డుపవిష్టుం డయ్యెను.

అప్పుడు ప్రతిహారులు కాదంబరీ మహాశ్వేతల సంవాదప్రకారము వినుతలంపుతో సంవృతముఖన్యస్తహస్తలై హస్తసంజ్ఞచే వేణువీణాది గీతధ్వనులు వంధిమాగధ జయశబ్దముల నంతటను నాపివేసిరి.

అంతలో గాదంబరిలేచి పరిజనోపనీతమగు నుదకముచే మహాశ్వేతపాదములు గడిగి యుత్తరీయాంశుకమునఁ దడియొత్తి వెంకియుఁ దల్పంబునఁ గూర్చుండెను.

పిమ్మటఁ గాదంబరికిఁ బ్రాణసఖురాలు అనురూపరూపలేఖ, మదనలేఖ యనునది రాజపుత్రుం డిచ్చగింపకున్నను బలవంతమున నతని పాదంబులం గడిగి తడియొత్తినది.

అప్పుడు మహాశ్వేత కర్ణాభరణ మణికిరణ కిమ్మీరిత మగు కాదంబరి యొక్క భుజముపైఁ జేయివైచి చామరపవనంబునఁ జారుచున్న కుసుమంబు వెండియు వేణికాబంధంబునం గూర్చుచు సఖీ! కాదంబరీ! కుశలముగా నుంటివా? అని యడిగిన గాదంబరియు నిజగృహనివాసంబున నపరాధము జేసినదివోలె సిగ్గుపడుచు నిట్లుత్తరము చెప్పినది.

చ. ప్రియసఖి నార చీరల ధరించి భయంకర భూరికందరా
లయమునుండి యాశలములన్ భుజియింపుచు దారుణ వ్రత
క్రియలను గాలము న్గడుప బ్రీరహితాత్మకనైన నాకనా
మయమున నేమిలోటిట సమస్తసుభోగములన్ భజింపగన్ ॥

వ॥ అని పలికి,

గీ. కలికి తత్కాలజనిత శోకప్రవృత్తి
ప్రియవయస్యనుఁ జూచుచుండియుఁ గదంక
నాపలేదయ్యెఁ దనచూపు లతనిమీఁదఁ
బడక యుండఁగ నెన్ని యుపాయములను॥

అశ్రుజలపూరితనయనయై యంజలిజనయన మహూర్తకాల మూరకొని యంతలోఁ దనకుఁ దాంబూలమీయఁబోవుఁడు వారించుచు మహాశ్వేత యిట్లనియె. సఖీ! మనమందరము క్రొత్తచుట్టమైన యీ రాజకుమారు నారాధింపవలయును. కావున ముందుగా నతనికిఁ దాంబూల మిమ్మని పలికిన విని యక్కలికి యించుక యధముగా మొగము వంచి సన్నని యెలుంగున ప్రియసఖీ! పరిచయము లేకపోవుటచే నిచ్చుటకు నాకు సిగ్గగుచున్నది. దీనిఁ గైకొని నీవే వానికిమ్ము. అనవుఁడు మహాశ్వేత ముఖరసనా చలన సంజ్ఞచే వారించుచు నట్లనకుము. నీవే యీయవలయునని పలుమారు బోధింప నెట్టకే యంగీకరించినది.

మహాశ్వేత మొగమునుండి దృష్టుల నాకర్షింపకయే మేను గంపము నొందఁ గన్నులుమూసికొని నిట్టూర్పులు నిగుడించుచు నొడలంతయుఁ జెమ్మటలు గ్రమ్మ సాధ్వసపరవశయై యతిప్రయత్నముతో నవపల్లవపాణి తాంబూలగర్భ హస్త పల్లవము చాచినది.

అప్పుడు చంద్రాపీడుఁడును దనుర్గుణాకర్షణకృత కిరణశ్యామలమయ్యు స్వభావపాటలమై యరుణనఖకిరణ లలితములగు నంగుళులచేఁ బొలుపొందు కరతలంబు తాంబూల మందికొనుటకై చాచెను.

అప్పుడు తద్విలాసములం జూచుటకు వేడుకకలిగియుం బోలె నెక్కడి నుండియోవచ్చి రసములన్నియు నామెయందుఁ బ్రవేశించినవి.

స్వేదజలపాతపూర్వకముగా మన్మథునిచేత నీదాసజనము నీకీయఁబడినది. స్వీకరింపుమని తన్నర్పించుకొనునట్లు ఇది మొదలు మదీయ జీవితము నీ హస్త మందుండఁగలదని స్థాపించుచున్నట్లు కాదంబరి యతనిచేతఁ దాంబూలమిడినది. పిమ్మట భుజలతానుసారముగాఁ గరకిసలయమును లాగికొనుచు ననంగశరభిన్న మధ్యమగు హృదయమువోలెఁ జేతనుండి జారిపడిన రత్నవలయమునుఁ దెలిసికొనజాలదయ్యెను.

మఱియొక తాంబూలము మహాశ్వేతకిచ్చి యచ్చేడియ పచ్చపిల్లుని రాయిడిం బడియున్న సమయంబున నొకశారిక వారికడ కరుదెంచి తన్నుఁ దరిమికొనివచ్చిన చిలుకం జూపుచుఁ గాదంబరి కిట్లనియె.

భర్తృదారికా? కాదంబరీ! నన్ను బాధింపుచున్న యతి దుర్వినీతుఁడగు నీపతంగాధము నేమిటికి వారింపవు? వీనిచేఁ బరిభవింపఁబడుచున్న నన్నిఁక నుపేక్షిం చితివేని నీ పాదములాని తప్పక ప్రాణముల విడిచెదను జుమీ! అని పలికినంతఁ గాదంబరి యించుక నవ్వినది.

అప్పుడు మహాశ్వేత విస్మయముతో నీహారిక యేమనుచున్నదని మదనలేఖ నడిగిన నప్పడతి యిట్లనియె. దేవీ? యీహారికను. గాళింది యను పేరుపెట్టి మా రాజపుత్రికయే పెంచుచు బరిహాసమను పేరుగల యీ చిలుకకు స్వయముగాఁ బెండ్లిజేసి భార్యాభర్తలగాఁ బిలుచుచున్నది. నేఁడు ప్రాతఃకాలమునఁ గాదంబరీ తాంబూలకరండవాహిని యగు నీ తమాలికతో నేకాంతముగా నేదియో మాటాడుచుండ నా చిలుక జూచినదఁట. అప్పటినుండియు నీర్ష్యారోష కషాయిత మతియై యీహారిక యీచిలుకం జూడదు. మాటాడదు చేరనీయదు. మేమెంత బ్రతిమాలినను బ్రసన్నురాలు కాకున్న దిదియే దీని వృత్తాంతమని చెప్పిన విని మందహాసము గావించుచు జంద్రాపీడుఁ డిట్లనియె.

అగు నగు నీవాతన్ నిదివరకే మేము వినియుంటిమి. కాదంబరీ దేవియొక్క తాంబూలకరండ వాహినియగు తమాలికను వరించి పరిహాసమను చిలుక విరహవేదన జెందుచున్నదని లోకమున జనులు చిత్రముగాఁ జెప్పుకొనుచున్నారు. ఈ వృత్తాంతము కర్ణపరంపరచే రాజకుల మంతయు వ్యాపించియున్నది. సిగ్గుమాలిన యీ తమాలిక మూలమున పతత్రము కళత్రమును విడుచుట వాచారమై యున్నది. అది యట్లుండ నిండు. చపలయగు నీదుష్టదాసినిఁ గాదంబరి యేమిటికి మందలింపదు? అగు నీహారిక నీ చిలుకకుఁ బెండ్లిజేయుసప్పు డెన్నియో బుద్ధులు గరపియేయుండునవి నిలిచియున్నవియా? స్త్రీలకు సాపత్నీ పరిభవంబు ప్రధానకోపకారణంబు పెద్ద హేతువుగదా? ఇట్టి పరాభవములయందుఁ దఱుచు స్త్రీలు విషమైనం దిందురు. అగ్నినైనం బడుదురు. ఈహారిక గట్టిదియే! అట్టిపని యేదియుం జేయలేదు. ఇప్పుడు మనమే చిలుకచే నీ తప్పు గావుమని దీనిం బ్రతిమాలింపఁ జేయుదము. అప్పుడు ప్రసన్నురాలై భర్తనీసు మన్నించుగాక అట్లు మన్నింపదేని యీహారికదే తప్పుగా గణించి దీని విడిచివేయుదము. పరాభవముజేసి విడిచిన దీని నెవ్వరాలాపింతురు? యెవ్వరు మన్నింతురు? ఎవ్వరు పోషింతురు? ఇదియే దీనికిఁ బ్రాయశ్చిత్తమని పలికిన విని కాదంబరీ పరిచారికలెల్లఁ దచ్ఛుకాలాపము గ్రహించి నవ్వుకొనిరి.

అప్పుడా చిలుక యతని నర్మాలాపము లాలించి యిట్లు పలికినది. దూతన్! రాజపుత్రా! యీహారిక రాజకుల సంపర్కమువలనఁ జతురమతియై యున్నది. నీవుగాని, యితరులుగాని దీనిని భయపెట్ట జాలరు. ఇవి పరిహాసజల్పితములని తెలిసికొనఁ గలదు. ఈ వక్రోక్తులు దీనిముందరఁ బనికిరావు. కోపప్రసాదములయొక్క కాలకారణ ప్రమాణ విషయంబులఁ బాగుగా నెఱుంగును. శృంగారభాషితముల కిది నెలవని పలుకుచున్న సమయంబునఁ గంచుకి యరుదెంచి ఆయుష్మతీ! మహాశ్వేతా! చిత్రరథుండును భార్య మదిరామహాదేవియు నీ రాక విని మిగుల నానందించుచున్నారు. నీతో ముచ్చటించుటకుఁ దొందరపడుచు వేగఁ దీనికొని రమ్మనిరని పలికినది.

అప్పుడు మహాశ్వేత కాదంబరీ! నేను నీ తలిదండ్రులఁ జూడఁబోవు

చున్నాను. నేను వచ్చుదనుక నీతం డెందుండవలయునని యడిగిన నప్పుడంతి స్త్రీల హృదయస్థానముల యందలి మనసున ననుకొని ప్రకాశముగా నిట్లనియె. సఖీ! నీవు నన్నిట్లడిగెదవేం? చూచినది మొదలు శరీరమునకు, భవనమునకు విభవమునకు నీతండే పరివృఢుండని తలంచుచుంటి. ప్రియసఖీ! హృదయమునకుఁ గాని యాయనకుఁ గాని యెందిష్టమో యందే యుండవచ్చునని చెప్పిన మహాశ్వేత యిట్లనియె.

సఖీ! అట్లయిన నీ మేడ సమీపమందున్న ప్రమద వనమునందలి క్రీడా పర్వతముఁ గట్టఁబడిన మణివేశ్మమందు నివసింప జేయుఁమని యుపదేశించి మహాశ్వేత గంధర్వసార్వభౌముం జూడఁబోయినది.

చంద్రాపీడుండును మహాశ్వేతతోడనే బయలుదేరి వీణావాదినులు వేణు వాద్యనిపుణలు సంగీత విద్యాపారంగతులగు గంధర్వకన్యకలు పెక్కండ్రు కాదంబరీ సమాదిష్టలై తన్ననుసరించిరాఁ బూర్వపరిచితుండగు కేయూరకుండు ముందు నడచుచు మార్గము జూపుచుండ రెండవజయంతమువలె నొప్పుచున్న యమ్మణిమందిరమున కరిగెను.

పిమ్మటఁ గాదంబరియుఁ బరిజనములెల్ల విడిచి యొక్కరితయే మేడయెక్కి తల్పంబునం బడుకొని యాత్మీయంబులగు వినయముగ్ధతా కుమారభావ కులమర్యాదాది విశేషంబులం దలంచుకొని యగ్గలంబగు సిగ్గు జెందుచు నిట్లు విచారించినది.

అయ్యో! మోహాంధురాలనై యిప్పుడు నే నెట్టిపని గావించితిని? అతం డదృష్టపూర్వుండు. కనబడఁగూడదని యించుకయు శంకింపనైతి. నన్ను లోకులు లఘుహృదయనుగాఁ దలంతురని సిగ్గెఱుఁగనైతిని. గురుజనములకు వెరవక లోకాపవాదమునకు భయపడక మహాశ్వేత దుఃఖితయైయున్న దనుమాట యాలోచింపక పరిజనము జూచునని తెలియక నష్టలజ్జనై దుష్టమార్గమని భావించితిని. నా ప్రమాదము స్థూలబుద్ధులుగూడఁ జులకనగాఁ దెలిసికొనిరి. కాలదురనిన నను భూతకందర్పవృత్తాంత యగు మహాశ్వేతయు సకలకళాకుశలలగు నుభయాంధ్రులను రాజకుల సంచారచతురులగు పరిజనులును, గ్రహించుట యేమి యబ్బురము? అంతఃపురదాసు లిటువంటి పనులఁ దెలిసికొన నతి నిపుణదృష్టి గలవారుగదా?

అన్నివిధముల నే నిప్పుడు భ్రష్టురాలనైతిని. నాకిప్పుడు మరణమే శ్రేయము. బ్రతుకుట లజ్జాకరము. ఈ వృత్తాంతము విని నా తలిదండ్రులేమందురో! ఏమి జేయుదును? ఇందులకుఁ బ్రతీకారమేది? ఏయుపాయమున నీస్ఖలితమును గప్పికొందును? నా యింద్రియ చాపల్యమెవ్వరితోఁ జెప్పికొందును?

అయ్యయ్యో! నాసఖు లందరఁ బెండ్లియాడనని శపథముజేసి యా వాతన్ కేయూరక ముఖముగా మహాశ్వేతకుఁ దెలియజేసితినే? ఆమాట యించుకయు జ్ఞాపకము లేకపోయినది. శరవిధి యా చంద్రాపీడు నాకడ కేలిటికిఁ దీసికొనిరావల యును? అతఁ డెవ్వఁడు? ఎప్పుడైన జూచితినా? వింటినా? తలంచితినా?

వానిం జూచినంతనే నా యింద్రియము లన్నియు విత్తమిచ్చి కొనఁబడినట్లు

తద్వశములై పోయినవే? తెలిసికొంటి నా చపలునితో నాకేమియుం బనిలేదు. అని క్షణకాలము ధ్యానించి యంతలో మన్మథునిచేఁ బాణములతోఁగూడ నీధైర్యావలేప మప నయించెదఁ జూడుమని భయపెట్టబడినదివోలెఁ గ్రమ్మరఁ దనహృదయమ్ముఁ జంద్రా పీడాభిముఖమ్ముఁ గావించి ప్రేమావేశంబునఁ బరవశురాలై యట్టిలేచి వాతాయనమునం గూర్చుండి యాక్రీడాపర్వతమునుఁ జూచుచుండెను.

చంద్రాపీడుండును రెండవ కాదంబరీ హృదయమువలె నొప్పుచున్న యమ్మణిమందిరము ప్రవేశించి యందు బహువిధోపధానములతో వెలయుచున్న కుథ యందుఁ బరుకొని యథానిర్దిష్ట స్థానోపవిష్టలై గంధర్వకన్యకలు సంగీతము బాడు చుండఁ గేయూరకునితొడపై యడుగులిడి దోలాయిత చిత్తుఁడై యిట్లు తలంచెను. ఆహా! ఈ గంధర్వరాజ పుత్రిక విలాసములు సకల లోకమనోహరములు. ఆరా ధింపఁదయే ప్రసన్నుండై మకరధ్వజుండు నాకీ వైభవము గలుగఁజేసెను. అనురాగ ముతోఁగూడిన క్రేగంటిచూపులచే నన్నాచపలనేత్ర విలోకించుట, తచ్ఛరిహాసంబునం గాదే? నేనామె మొగంబు జూచినప్పుడు చిరునగవుతో నాచూపులఁ దనపై వ్యాపింప జేసికొనుచున్నది.

మఱియు సిగ్గుచే వదన మవ్వలకుఁ దిప్పుకొనియుఁ బ్రతిబింబ ప్రవేశ లోభంబున బోలెఁ గపోలదర్పణంబున నాకర్షించినది. నాకు దాంబూలమిచ్చి యలసి నదివోలెఁ దమాలపల్లవమున వీచుకొన్నది. ఇదియంతయుంజూడ నాచేడియ నాయందు బద్ధానురాగయై యున్నట్లు తోచుచున్నది సందియము లేదని తలంచుచు నయ్యో! మానుష సులభమగు లఘుత్వము మిథ్యాసంకల్ప సహస్రములచే నన్నిట్లాయాసపెట్టు చున్నది. యౌవనమదము వివేకమును హరించును. యువుల దృష్టి తిమిరోపహతమై నల్పమునుగూడఁ బెద్దదానిగాఁ జూచును. ఆత్మగౌరవత రూపాభిమానముగల కులటవలె దన లోపము దెలిసికొనఁజాలదు. ఇంద్రజాల పింఛకవనె నాశ లేనిదానినైనను నట్లు తోపించును అని యాలోచించుచు నోహో! నే నిట్లు వృథగా మనసును ఖేదపెట్టు చుండనేల? నిజముగా నీగజగామినికి నా యందనురాగము గలిగెనేని మనోభవుఁడే యవిలంబముగాఁ దెలుపఁగలఁడు. నా సందియమతఁడే తీర్పఁగలడని వితర్కించుచుఁ గొంతసేపు సంగీతవిద్యా వినోదంబుల నలరారి యంతలో లేచి యుపవనాలోకన కౌతూహలచిత్తుండై క్రీడాపర్వత శిఖరమెక్కెను.

కాదంబరియు నారాజకుమారుం గాంచి అయ్యో! మహాశ్వేత యింకను రాలేదా? వచ్చుచున్నదేమో చూచెదంగాక యని యాగవాక్షమునుండి లేచి యనంగ తప్తచిత్తయై మేడపై కెక్కినది. అప్పుడు పరిజనులు కూడఁబోయి యెండదగులకుండఁ జతుర్దండ యుక్తంబగు ఛత్రంబు బట్టిరి. కొందరు వింజామరలతో విసరుచుండిరప్పుడు.

సీ. ఒకసారి యంబుజమాలిక యంసమునఁ జేతు
లానియొయ్యారములభినయించు
నొకతెప మదలేఖ నుపగూహనముసేసి
క్రమశృంగారవైఖరుల నెరపు
నొకపరి యలచిట్టకముల వెలయించి
ధృతిదండముల హస్తములనాను
నొకమారు ద్వారపాలికల వేత్రాగ్ర భా
గములఁ జెక్కుల నాని గమనజూపు.

గీ. గప్పురపు వీడె మధరాంతికమునఁ జేర్చు
నవ్వుతో వానిఁ జూచుచు నానలిననేత్ర
యతనిచేఁ జూడఁబడఁ దానట్టులందు
నెంతసేపాలసించెనో యెఱుఁగదయ్యె॥

మహాశ్వేత వచ్చినదని ప్రతీహారి చెప్పఁగా విని యదరుపాటుతో సమ్మద దిగి స్నానాదిక్రియలయందుపేక్ష గలదైనను మహాశ్వేతానురోధంబున దివసవ్యాపారము నిర్వర్తించినది.

చంద్రాపీడుండును పర్వతశిఖరావరోహణంబు గావించి యభీష్ట దేవతల నారాధింపుచు నమ్మణిమందిరమందే యాహారాది వ్యాపారముల జరిగించెను. భుజించిన తరువాత నతనాక్రీడాశైలము తూరుపు భాగమున లతామంటపము క్రింద సంగీత గృహము ప్రక్కనొప్పుచున్న మరకతశిలాతలంబున గూర్చుండి తాంబూలము వైచికొనుచు సంపలి విశేషంబులం బరికింపుచుండ నమ్మృదుహాసంబున నాకసంబుఁ బూయబడినట్లు చందనరసవర్షంబున దిగంతములు దడుపఁబడినట్లు తెల్లనితేజ మొండతని కన్నులంబడిన వెరగందుచు నిట్లు తలంచెను.

ఆహా! భగవంతుఁడగు శీతభానుం డకాండమున నిందుదయించెను? లేక పాండురజలయంత్రధారలు విడువఁబడినవియా? కాక పవనవిశీర్యమాణములగు శీకరములచే భువనమంతయుఁ దెలుపఁజేయుచు నాకాశగంగ భూమికి దిగుచున్నదియా? అని యాలోచించుచు దదాలోకానుసారముగా దృష్టి వ్యాపింపఁజేసెను.

సీ. సుమచిర చ్ఛత్రచామరములఁ బూని గం
ధర్వ కన్యకలు ప్రాంతముల నడువ
మాలతీ వరపుష్ప మాలికఁ గేలఁ గై
కొని తమాలిక వార్శ్వ మనుసరింప

ధౌతకల్పద్రులతా దుకూలములఁ జే
 కొని ముందుఁ గేయూరపుండు నడువ
నంగరాగసనాథన మగు పాత్రమును బూని
 ప్రతిహారికై చందనబట్టి కొలువ॥

గీ. వెన్నెలకు జీవితంబైన వివిధరత్న
ముల యశోరాశి యనఁగ జూపులకుఁ దెలుపు
ప్రభవనీనెడు తారహారంబు బూని
వచ్చె మదనలేఖ తరళికా వసితతోడ॥

వారింజూచి చంద్రాపీడుండి తెలుపుసగఁ గారణం బామె చేతనున్న రత్న హారంబని నిశ్చయించి దూరమునుండియే ప్రత్యుత్థానాది సముచితోపచారములం గావించి తనకు నమస్కరించుచున్న మదనలేఖం లేవనెత్తి యమ్మరకత శిలాతలంబున గూర్చుండఁబెట్టెను.

అప్పడఁతియు నొక్కింత తడవు విశ్రమించి యంతలో లేచి యతని యంగములఁ జందనాద్యంగరాగంబుల నలఁది యాదుకూలంబులఁ గట్టఁజేసి చూలలీ దామంబభిరామముగాఁ దచ్ఛిఖం జుట్టి యప్పేరు చేతంబూని పేరోలు నవరించుచు నిట్లనియె.

రాజకుమారా! నీ సౌకుమార్య మేజనుని బ్రీతిపరవశునిఁ జేయకుండెనిని? మనోహరాకారముగల మిమ్మేకామిని జీవితస్వామిగాఁ గోరకుండెనిని? అకారణ వాత్సల్యముగల మీ చరిత్ర మెవ్వారికి బంధుత్వము గలపకుండెనిని? స్వభావమధుర మగు మీ వ్యవహార మెవ్వారికి మైత్రిగూర్పకుండెనిని? మీ యనునయమే మా బోటులకు మీతో మాటాడుట కవకాశ మిచ్చుచున్నది. ప్రథమదర్శనము నందే నమ్మకము గలుగఁజేసిన మీ యాకారమునే యుపాలంభింపఁదగినది. స్వయముగా హృదయమునే మాకర్పించిన జీవితస్వామి కేమి యియ్యఁబడదు? మా భర్తృదారిక యీ రూపముగాఁ బ్రణయమును దెల్పుచున్నది. కాని విభవము గాదు. మా నిమిత్తమై జీవితమైన నర్పించి పశ్చాత్తాపము జెందదు సత్పురుషుల మహిమ దాక్షిణ్యము గలవగుటఁ బ్రణయజనుల నిరాకరింపదు. ఈ వస్తుప్రదానమునఁ గాదంబరి మీ విషయమై యపరాధము జేసినదానవలె సిగ్గుపడుచున్నది.

హారమునంగల నాయకమణి సముద్ర మథన కాలంబునం బుట్టినది. శేషాభిఖ్యచే నొప్పుచున్నది. దీనిం తొలుత సముద్రుఁడు తన గృహంబున కరుదెంచిన వరుణునకుఁ గానుకగా నిచ్చెను. వరుణుండొకానొక సమయంబునఁ జిత్రరథున కిచ్చెను. అతండు కాదంబరి కిచ్చెను.

ఆమె మీ రూపమున కనురూపమగు నాభరణ మిదియని మీ కడకంపినది.

మీ వంటి వారిటిక దత్తాభరణ భారము వహింపరు. కాని కాదంబరికిఁ బ్రియముగా దీనిం ధరింపవేడుచున్నాను. యిది తప్పుగా గణింతురేని మహాశ్వేతను నిందింపుఁడు. ఆమెయే యిట్లు చేయమని తరళికనుగూడ బంపినది. అని పలుకుచు మదనలేఖ యా హారమును మేరుపుమీఁద దారాచక్రమునువలెఁ దద్వక్షస్థలమున సంఘటించినది.

అప్పుడు చంద్రాపీడుఁ డామాటలు విని వెరగుఁజెందుచు సబహుమానముగా నిట్లనియె. తరుణీమణీ? నీవు మంచి నిపుణురాలవు గదా ? ప్రత్యుత్తరావకాశము లేకుండఁగనే యుపన్యసించితివి ముగ్ధురాలా ? దీని స్వీకరించుటకు మానుటకు మే మెవ్వరము ? ఆ కథ ఇపుడు కే యస్తమించినది సౌజన్యశాలినులైన మీ గుణములచేత నీ జనుండు కొనఁబడియెను. మీ కిష్టమైన వ్యాపారములకు నియోగించుకొనుఁడు. మిక్కిలి దాక్షిణ్యము గల కాదంబరియొక్క సుగుణము లెవ్వానివశము జేసికొని యుండెడివని పలికి పెద్దతడవప్పుడు తిని గూర్చిన కథలే చెప్పికొనుచు గొంతవడికి నమ్మదనలేఖననిపి వెండియుఁ గ్రీడాపర్వత శిఖర మధిష్ఠించెను.

కాదంబరియు మదనలేఖవలన నందు జరిగిన వృత్తాంతమంతయుం దెలిసికొని ఛత్రచామరాది చిహ్నముల నేమియుం బూనక తమాలికను మాత్రము వెంట బెట్టుకొని క్రమ్మర నా మేడయెక్కి యుదయగిరిగతుండగు చంద్రునివలె నొప్పు నప్పురుష రత్నమును జూచి వివిధవిలాస తరంగితములగు విలోకవనములం నతని మనసు హరించినది.

ఆలింగన మొనరింపుమని సంజ్ఞచేయు దానివలె బవనచలితంబగు నంబరంబు సవరింపు నెపంబున గుచంబుల రెండు చేతులంగప్పుచు స్మరశరవిధురాలనైతినని తెల్పు చందంబునఁ బుష్పంబుల విరజిమ్ముచు నమస్కరించు దానివలెఁ గేశపాశమునుండి పూవులలాగి బోసిటంబట్టుచు నీరీతి సాయంకాలమువరకు ననేకలీలలు ప్రకటించినది.

అంతలో నంబరమణి యపరాంబునిధి మగ్నుండగుటయుఁ గాదంబరీ హృదయరాగ సాగరంబునంబోలె సంధ్యారాగంబున జీవలోకంబు బూరింతంబయ్యె. క్రమంబున దిఙ్ముఖంబులు నీలాయమానంబులై మెల్లమెల్లనఁ జీకటులు వ్యాపింప దొడంగినవి. అంతలోనే లాంచన ఛలంబున శర్వరీ భార్యా నురంబునదాల్చి కుముదినులచే గృహీతపాదుండై ప్రత్యక్షంబైన చందంబున దిక్కులఁ బ్రకాశింపఁ జేయుచు రోహిణీ కళత్రుండు నేత్రపర్వము గావించెను.

కుసుమాయుధాధి రాజ్యైకాతపత్రుండై కుముదమిత్రుండు పండు వెన్నెలలుఁ గాయుచుండ జంద్రాపీడుండు చందనరసప్రక్షాళితంబగు ముక్తామంటపమున వసించి యందలి వింతలంజూచుచు వెన్నెలల సేవించుచున్న సమయంబున గేయూరకుం డరుదెంచి రాజపుత్రా ! కాదంబరి మీ దర్శనము జేయ వచ్చుచున్నదని విన్నవించుటయు నతండు సంభ్రమముతోఁ జూచుచుండఁ దత్కాల రమణీయంబగు

వేషంబున సాక్షాచ్చంద్రోదయ దేవతవలె నొప్పుచుఁ గాదంబరి మదనలేఖ చేయి పట్టుకొని మందగమనంబునఁ జనుదెంచి ప్రీతిపేశలత్వమునఁ బ్రకటింపుచుఁ బ్రాకృతురాలివలెఁ బరిజనోచితమగు శిలాతలంబున గూర్చుండెను.

వలదు. వలదు. అని మదనలేఖ బ్రతిమాలుకొనుచున్నను వినక చంద్రాపీడుఁడు తాను గూర్చున్న మరకతశిలావేదికిం దిగి యొదిగి యా ప్రాంతమున నేలనే కూరుచుండి మెల్లన నిట్లు నుపన్యసించెను.

దేవీ ! దేవీ ! దృష్టిపాత మాత్రమునకే సంతసించు దాసజనుని విషయమై సంభాషణాది ప్రసాద మవసరము లేదు. అట్టి యనుగ్రహమే కలిగినచోఁ జెప్పవలసిన దేమి ? నిపుణముగా నాలోచించిన నీ కిట్టి దయగలుగుటకు గుణలేశమైన నా యందున్నట్లు కనంబడదు. అభినవ సేవకునిగూడ నిట్లు చూచుచున్నది నీ సుజనత్వ మతి సరళమైనది గదా? ఓహో ! నీవెవ్వనిఁబనులకు నియోగింతువో వాఁడే ధన్యుఁడు. కనుసన్న జేసినంతనే పనులు గావించెడు భృత్యుని విషయమై నీ కిట్టి యాదర మేమిటికో తెలియదు. ఈ శరీరము పరోపకారమున కుపకరణమై యున్నది. జీవితము తృణముకన్నఁ దేలిక యగుచున్నది. నీ గౌరవమే కానుకగాఁ గోరి యరుదెంచిన మేమును, ఈ శరీరము ఈ జీవితము, ఈ యింద్రియములు, నీ యధీనములు. నీ యిష్టము వచ్చిన పనికి నియోగింపుము. అని పలికిన విని మదనలేఖ యించుక నవ్వుచు నతని మాటల కడ్డమై యిట్లనియె. రాజపుత్రా ! నీ వనినదే సత్యము కాని యతియంత్రణచేఁ గాదంబరి ఖేదమును సిగ్గును బొందుచున్నది. ఎందుల కిట్లు పలికెదవు ! నియమనము తక్క తక్కినవన్నియు నామె యంగీకరించుచున్నది. ఉపచార ఫల్గువగు వచనంబుల నీ బాలికను సందేహడోలిక నెక్కించి యూపుచుంటివిగదా ? అని పలుకుచు ప్రస్తావముగా మీ తండ్రి తారాపీడుం డెట్టివాఁడు. విలాసవతి యెట్టిది ? మీ రాజధాని యుజ్జయిని యిక్కడికెంత దూరమున నున్నది ? మీరతపవనం బెట్లుగా నుండును ? మర్త్యలోక విశేషము. లేపాటిరమణీయము లని యడుగుటయు నతండు తదనుగుణ్యము లగు మాటలచే సంతోషము గలుగఁజేసెను.

ఇట్లు కాదంబరి కొంతసేపందుండి కేయూరకునిఁ జంద్రాపీడుని సమీపమున విడిచి శయనసౌధంబునకుం బోయినది. చంద్రాపీడుండును గేయూరకుఁ డడుగు లొత్తుచుండఁ గాదంబరియొక్క నిరభిమానత్వ గంభీరత్వాభిరూపత్వాది గుణంబులును మహాశ్వేత యొక్క నిష్కారణ వాత్సల్యము మదనలేఖయొక్క సౌజన్యము గంధర్వ రాజలోక సమృద్ధి కింపురుష దేశరమ్యత్వమును మనసున వితర్కించుచు నామరకతశిలాతల పర్యంకమున శయనించి సుఖముగా నిద్రబోయెను.

మరునాఁ డరుణోదయంబున మేల్కాంచి రాజపుత్రుండు కాల్యకరణీయంబులం దీర్చికొని తాంబూలము చేతంబూని కేయూరకునితో నోయీ ! నీవు పోయి మహాశ్వేత యెందున్నదో కాదంబరి యేమి చేయుచున్నదో చూచిరమ్మని పంచుటయు

నతం డతిరయంబునం బోయి వచ్చి, నమస్కరించి, దేవా తెల్లని విభూతిరేఖలు ఫాలమునఁ గ్రాల జపమాలికలం ద్రిప్పుచుఁ బాశుపతవ్రతచారిణులై కాటిపటంబులం దాల్చి యున్న పరివ్రాజికలును జటాజినమౌంజీ వల్కలాషాఢధారులైన తాపసులును సాక్షాన్మంత్ర దేవతలవలె దేవతాస్తుతి శ్లోకములఁ జదువుచు జుట్టునుం బరివేష్టింప మందరప్రాసాదము క్రింద సంగతసౌధవేదికయందుఁ గూర్చుండి దర్శనాగతులగు గంధర్వ బంధువృద్ధుల సన్మానింపుచు మహాశ్వేత కాదంబరితో ముచ్చటింపుచున్నదని యెఱిగించెను.

పిమ్మట గేయూరకుఁడు మార్గ మెఱిఁగింపఁ జంద్రాపీడుఁడు అంతఃపుర విశేషంబులం జూచుచుఁ గ్రమంబున మహాశ్వేత యొద్దకుఁబోయి నమస్కరింపుచు నా వేదికయందే కూర్చుండి క్షణకాలమూరకొని మహాశ్వేత మొగంబు పరికింపుచుఁ గపోలముల బ్రకాశించునట్లు మందహాసము గావించెను. అప్పుడు మహాశ్వేత యభిప్రాయము గ్రహించి కాదంబరి కిట్లనియె.

సఖీ! చంద్రకిరణములచేఁ జంద్రకాంత మణివలె నీ కనులచే నార్ద్రీకృతహృదయుండై చంద్రాపీడుండు పెక్కు నిశ్చగించి నేమియు మాటాడఁజాలకున్నవాఁడు. ఇతని వృత్తాంత మేమియుం దెలియక రాజచక్రము తొట్రుపడుచుండును. దూరమందున్నను బద్మినీ పద్మబాంధవులకుం బోలె నుభయ పర్యంతము మీ యిరువురకు నీ ప్రీతి స్థిరమై యుండక మానదు. ఈ కుమారుని కిరుగట కనుజ్ఞ యిమ్మని పలికిన విని కాదంబరి నెచ్చెలీ! జనానురక్తుఁగా నీజన మీ కుమారునకు తన యంతరాత్మ వలెనే స్వాధీనమై యుండ నిందుల కవరోధమేమి? అట్లే పోవచ్చునని పలుకుచు గంధర్వ కుమారులం జేరి వీరిం స్కంధావారమును జేర్పుఁడని యాజ్ఞాపించినది.

అప్పుడు చంద్రాపీడుఁడు లేచి తొలుత మహాశ్వేతకు నమస్కరించి తరువాతఁ గాదంబరికి మ్రొక్కి ప్రేమపూరితమగు తదీయదృష్టి చేతను, మనసు చేతను గ్రహింపఁబడుచు దేవీ! ఏమందును? లోకము బహుభాషకుల నాదరింపదుగదా? నన్నుఁ బరిజనకథలయందు స్మరింపుచుండవలయు నిదియే నా కోరిక యని పలికి యతం డయ్యంతఃపురము నుండి బయలుదేరెను.

అప్పుడు కాదంబరితక్క తక్కిన యంతఃపురకాంత లందరు తద్గుణ గౌరవముచే నాకర్షింపఁబడి పరవశలై బహిర్ద్వారము వరకు నతని ననుగమించి యరిగిరి. అందఱి వలనను నామంత్రణము వడసి యతఁడు కేయూరకానీతమగు నింద్రాయుధమెక్కి గంధర్వ కుమారులతోఁ గూడికొని నడుచుచున్న యతనికి హృదయమందే కాక లోనన్ని కడలను గాదంబరి యున్నట్లు కనంబడుచుండెను. అతని మనంబు తన్మయంబగుటఁ బోవలదని వెనుకనుండి లాగుచున్నట్లును మాంద్యము వచ్చినట్లును దోచుచుండెను. అట్టి విరహముతో నతండు క్రమంబున మహాశ్వేతా

శమము మీదుగా నచ్ఛోదసరస్తీరమున కరిగియందుండి యింద్రాయుధ ఖురపుటాను సారముగా స్కంధావారముం జేరి గంధర్వకుమారుల నంపివేసెను.

తన్నుఁ జూచి మ్రొక్కుచున్న రాజలోకమును మన్నించుచు నెదురువచ్చిన వైశంపాయనునిఁ గౌఁగలించుకొని పత్రలేఖ నాదరించి లోపలిభవనమును బ్రవేశించి యేకాంతముగాఁ బత్రలేఖ వినుచుండ వైశంపాయనునితోఁ దాను జూచివచ్చిన విశేషము లన్నియుఁ జెప్పుచుఁ దత్కథాలాపములతోడనే యారాత్రి సుఖముగా వెళ్ళించెను.

మఱునాఁడుదయకాలమున రాజపుత్రుడు సభాభవనమలంకరించి కాదంబరినే ధ్యానించుచుండ నంతలో ద్వారపాలుని వెంటవచ్చుచున్న కేయూరకునిఁ జూచెను. అతఁడు దూరముననుండియే మౌళిచుంబిత ధరాతలుండై నమస్కారము గావించుటయుఁ రాజపుత్రుం డోహోహో! గంధర్వపుత్రా! రమ్ము. అని పలుకుచుఁ జేతులు సాచి గాఢాలింగనము జేసి తన సమీపమందే కూర్చుండఁ బెట్టికొని వత్సా! పరివారయుక్తముగాఁ గాదంబరి సుఖియైయున్నదా? మహాశ్వేతకు భద్రమా! అని యడిగిన నతం డిట్లనియె.

దేవా! అందరును సుఖులై యున్నారు. కాదంబరి యంజలిపట్టి దేవర నర్చించుచున్నది. మహాశ్వేతయు కుశలవాక్య పూర్వకముగ నమస్కరించుచున్నది. మదనలేఖయుఁ దమాలికయుఁ బాదప్రణామ పూర్వకముగా నారాధించుచున్నారు. మఱియు మహాశ్వేత దేవరకిట్లు విన్నవింపుచున్నది. నీవెవ్వరికిఁ జక్షుర్గోచరుండ వగు చుంటివో వారు ధన్యులు. నీ సమక్షమునఁ జంద్రకిరణములవలెఁ జల్లనైన నీగుణములు వియోగమందుష్ణకర కిరణములై బాధించుచున్నవి. ఇందలి జనంబులు నిన్నటిదివసంబు నమృతోదయవాసరంబువలె స్మరించుచున్నారు. నీచే విడువబడిన యీగంధర్వరాజనగరంబు వినివృత్త మహోత్సవమైనదిగాఁ దోచుచున్నది. నన్ను సకల సంగపరిత్యాగురాలని యెఱుంగుదువుగదా? అయిన నకారణబంధుఁడవగు నిన్నుఁ జూచుటకు నా హృదయ మిచ్చగించుచున్నది. అదియునుంగాక భవదీయస్మేరానన విలాసముల స్మరించుచుఁ గాదంబరి యస్వస్థశరీరయైయున్నది. కావున బునర్దర్శన గౌరవంబున నామెను సన్మానింపఁగోరుచున్నాను. ఇట్టిసందేశ మనుచితమైనను నీసుజనత్వమే మాకిట్టి ప్రాగల్భ్యమును గలుగఁజేయుచున్నది. ఇదిగో కాదంబరి నీకిచ్చిన శేషాహారమును తల్పంబున మరచిపోయితివి. దీనిఁ బంపితిఁ గైకొనవలయునని తదీయసందేశ మెఱింగించుచుఁ గాదంబరిచే నంపఁబడిన బిసతంతువులచేఁ గట్టఁబడియున్న తామరాకు దొన్నె నతనియెదుట విప్పి యందభిజ్ఞానముగా నుంచఁబడిన యాకులును, పోకలును, కర్పూరమును మృగదామోదమనోహరంబగు చందన విలేపనంబును దీసి రాజకుమారున కర్పించెను.

అప్పుడు చంద్రాపీడుండును ఆహా? నా భాగ్యము పరిజనకథలయందైన స్మరింపఁదగని నన్నుఁ గాదంబరి మిక్కిలి గౌరవింపుచున్నది. ఇది యంతయు మహా

శ్వేతయొక్క పాదసేవవలనఁ గలిగిన ఫలమని పలుకుచు నావస్తువుల నాదరముతో గ్రహించి వామకరంబున నతని భుజము బట్టికొని రాజలోకమునెల్ల విడిచి మెల్లగా గంధమాదనమను నేనుఁగను జూడఁబోయెను. అందొకింతకాలము నిలిచి యటనుండి వాజిశాలకుఁబోయి యందలిగుఱ్ఱములఁ బరీక్షించుచు నింద్రాయుధపృష్ఠభాగము నందలి యవకుంతనపటం బొకింత జారుటయు సవరించుచుఁ దన్ముఖంబున దృష్టినిరోధముగా వ్రేలాడుచున్న కేసరముల నెగదువ్వుచు నమ్మందిర ద్వారమునకుఁ జేరఁబడి కౌతుకముతో నిట్లనియె

కేయూరకా! నేను వచ్చినతరువాత నయ్యంతఃపురమున యేమి జరిగినది? కాదంబరి యావాసరమెట్లుగడపినది? మహాశ్వేత యేమి జేసినది? మదనలేఖ యేమి భావించినది? నన్నుగురించి యంతఃపుర కాంతలెల్ల నేమిజెప్పికొనిరి? సవిస్తరముగాఁ జెప్పుమని యడిగిన నతం డిట్లనియె.

దేవా! వినుండు. దేవర యరిగినవెనుకఁ బరిజనముతోఁగూడఁ గాదంబరి సౌధమెక్కి తురగఖురధూళిలేఖా ధూసరమగు మీమార్గమాలోకించుచు మీరు తిరోహితులైనంత మదనలేఖయొక్క భుజంబున శిరంబిడి ప్రీతిచే నాదిగంతమునే చూచుచుఁ బెద్ద తడవందేయున్నది. తరువాత నతికష్టమున నామేడ దిగి యాస్థానమంటపమున క్షణకాలము గూర్చుండి యంతలో లేచి మీరు నివసించిన క్రీడాపర్వతమున కరిగినది

అందుఁ బరిజనులు రాజకుమారు డీలతామంటపమున నీ చలువఱాతఁ గూర్చుండెను. నీమణిశిలయందున స్నానముగావించెను. నిందు నింమధరు నారాధించె, నిందు భుజించె, నిందు శయనించెనని యెఱింగింపుచుండ నాయాచిహ్నముల విలోకింపుచు నాపగలు గడిపినది. సాయంకాలమున మహాశ్వేత బలవంతము సేయ నెట్టకేనా శైలశిలాపట్టణమున భుజించినదిఁ అంతలోఁ జంద్రోదయ మగుటయు శశికరంబులకుఁ గపోలములపైఁ గరంబు లడ్డము పెట్టుకొని కన్నులుమూసి యేదియో ధ్యానించుచు క్షణకాలమందుండి యంతలో లేచి శయ్యాగృహమున కేగి పడుకొనినది.

అది మొదలు ప్రబలమగు శిరోవేదనయు దాహరూపంబగు జ్వరంబును బాధింప నేదియో వ్యాధిచేఁ గొట్టికొనుచు నెట్టకేనారాత్రి వేగించినది. నేఁటియుదయంబు నన్నుఁజేరి మీసేమము దెలిసికొనుటకై సోపాలంబముగా మీకడకనిపినది. ఇవియే యక్కడివార్తలని యెఱింగించిన నాలించి రాజనందనుఁడు తొందరగానందుబోఁదలంచి గుఱ్ఱము గుఱ్ఱమని కేకపెట్టెను. అప్పుడశ్వరక్షకుఁడు జీనుగట్టి యింద్రాయుధము నెదురబెట్టుటయు పత్రలేఖను వెనుకఁ గూర్చుండఁబెట్టుకొ వైశంపాయనుని స్కంధావారమున నుండ నియమించి వేరొక గుఱ్ఱమెక్కి కేయూరకుండు వెంటరా నాహయంబెక్కి యతిరయంబున నాహేమకూటమున కరిగి కాదంబరీ భవనద్వారంబున గుర్రమునుదిగి పత్రలేఖ వెంట నడువ లోపలకుఁ బోవుచు నెదురుగా వచ్చుచున్న మరియొక గంధర్వకుమారునిఁ గాదంబరి యెందున్నదని యడిగెను.

అతఁడు నమస్కరించుచు దేవా! క్రీడాపర్వతము క్రిందు భాగమునఁ గమల వనదీర్ఘికాతీరంబున రచింపఁబడిన హిమగృహంబున వసించియున్నదని యెఱింగించెను. ఆ మాటవిని కేయూరకుఁడు ముందు నడుచుచు మార్గము దెలుపఁ బ్రమదవనము నడుమనుండి పోవుచు నందలి కదళీవన ప్రభలచే రవి కిరణంబులు పచ్చనగుట వింతగాఁ జూచుచు నవ్వనమధ్యంబున నళినీపలాశములచేఁ గప్పఁబడిన హిమసదనంబు చెంత కరిగెను.

సీ. లలితమృణాళదండములను బిసతంతు
మయములై యొప్పుచామరల బూని
కదళీదళంబులఁ గమలినీ పత్రముల్
బాలగుత్తులు ఛత్రములుగఁ బట్టి
మలయజరసముతో మెదిసి మర్దించిన
కర్పూరధూళి పంకంబుదాల్చి
తతకేతకీగర్భ దళదీపిత తమాల
కిసలయ మాలికల్ కేలఁబూని.

గీ. చెలులు శైత్యోపచారముల్ సేయుచుండ
హిమగృహంబునఁ బుష్పతల్పంబునఁ బండుఁ
కొని దురంత వియోగ వేదన దపించు
చిత్రరథపుత్రిఁగాంచె నాక్షితిపసుతుఁడు

అంతట నెందుఁగాఁబోలు తదాగమన మెఱింగించుచున్న పరిజనముతో నా! ఏమి? నిజముగా నతఁడు వచ్చెనా? మీరు చూచితిరా? ఎంతదూరములో నున్నవాఁడని యడుగుచుండఁగనే యతండు గన్నులంబడుటయుఁ దొలిపులకలతనిపై వ్యాపింపఁ జేయుచు జారిన యుత్తరీయాంశుకము హారమును నురంబున సవరించుచు నా విరి బోఁడి పూసెజ్జనుండి యట్టె లేచినది.

చంద్రాపీడుండును సమీపించి పూర్వమువలెనే మహాశ్వేతకుఁ గాదంబరికి నమస్కారములు గావించెను. కాదంబరి ప్రత్యుత్థానము గావించి యాపుష్పశయ్య యందుఁ గూర్చుండెను. అప్పుడు ప్రతిహారి కాంచనాసనపీఠం బొకండు దెచ్చి వైచుటయు నది కాలితో ద్రోసి చంద్రాపీడుండు వినయమభినయించుచు నేలయందే కూర్చుండెను.

అప్పుడు కేయూరకుఁడు దేవీ! ఈ చిన్నది యీ రాజకుమారుని తాంబూల కరండవాహిని, యీమె పేరు పత్రలేఖ. వీరికి మిక్కిలి యనుగ్రహపాత్రయని యెఱిం గించెను. కాదంబరియు నాకన్యంజూచి యోహో! మానవస్త్రీలయందుఁ బ్రజాపతికింత పక్షపాతమున్నదా? అని తద్రూపాతిశయమున కచ్చెరువందుచు నమస్కరింపుచున్న యాయన్ను మిన్నను రమ్మురమ్మని సాదరముగాఁ బిలుచుచుఁ దన వెనుకప్రక్కం

గూర్చుండఁబెట్టుకొని పరిజనులెల్ల వెరగుపాటుతోఁ జూచుచుండఁ గరకిసలయమున స్పృశించుచుండెను.

చంద్రాపీడుండు నట్టి యవస్థ నున్నఁ గాదంబరిం జూచి అయ్యో ! నా హృదయమింత మెద్దువాఁ డదేమి ? యిప్పుడుకూడ సందేహమే చెందుచున్నది. కానిమ్ము. నేర్పుగా నడిగి తెలిసికొందునుగాక. అని తలంచి ప్రకాశముగా నిట్లనియె.

దేవీ ! అవిశసంతాప తీవ్రంబగు నీ వ్యాధి నీకెట్లు కలిగినది ? భవదంగభవ పరితాపంబు జూచి సత్యము జెప్పుచున్నాను. నీకంటె నన్నెక్కుడుగా బాధించుచున్నది. పెక్కేల ? దేహమిచ్చియైన నిన్ను స్వస్థురాలిగాఁ జేయఁదలచుకొంటి నిందులకు నా హృదయము మిక్కిలి తొందరపడుచున్నది. అయ్యయ్యో ? మన్మథునికి శరీరభూతములగు నీఘజలకను సంతాపవృష్టులచే గండజేయుచుంటివి ? అశ్రుబిందు పాతంబున ముక్తాభరణత్వము గలిగి యొప్పుచుంటివి. పరార్థ్యములగు మంగళప్రసాదనముల వహింపుము. నవలత సకుసుమశిలీముఖయై శోభించునుగదా ? అని యడిగిన విని కాదంబరి బాలయు స్వభావ ముగ్ధయునైనను గంధుర్వసిచే నుపదేశింపబడిన ప్రజ్ఞచేఁ దద్వాక్యము లందలి శ్లేషార్థమును గ్రహించియు నేమియుఁ బ్రత్యుత్తర మీయక యన్యాపదేశముగా మందహాసము గావించినది అప్పుడు మదనలేఖ రాజకుమారా ! ఏమందును. ఈ సుందరి సంతాపము కథనీయమైయున్నది. సుకుమారభావముతోఁ గూడిన యీచేడియ కేది సంతాపముగాకుండెడిది ? పద్మినికి వెన్నెలయు నెంతగా నుండునుగదా ? కిసలయతాళవృంతమున విసరుకొనుచున్న యీ పూఁబోడి మనోభవ ఖేదమేమికకి తెలిసికొనఁజాలవు ? ఈమెకు ధీరత్వమే ప్రాణసంధారణహేతువు. అని ప్రత్యుత్తర మిచ్చుటయు నాయాలాపములే యతని మాటలకు సరిపడియున్నవని కాదంబరి హృదయంబునం దలంచినది.

చంద్రాపీడుండు నమ్మాటలయందుఁగూడ సర్థస్వయము గలిగియుండఁబట్టి తన డెందంబున గలిగిన సందియము దీరమింజేసి పరిపరి విధంబులం దలంచుచుఁ బ్రీత్యుపచయచతురములు మధురాలాపగర్భములు నగు కథలచే మహాశ్వేతతోఁ గూడఁ గొంత గాలక్షేపము జేసి యతిప్రయత్నముతో నామెను విడిచి స్కంధావారమునకుఁ బోవుటకు బయలుదేరెను.

గుర్రమెక్కఁబోవు సమయంబున గేయూరకుం డరుదెంచి దేవా ? మదనలేఖ యిట్లు విజ్ఞాపనజేయుచున్నది. ప్రథమదర్శన ప్రీతిచేఁ బత్రలేఖ నిందుంచి వెళ్ళుమని కాదంబరి కోరుచున్నది. వెనుక నంపఁగలదు. దేవర చిత్తమేమనవుఁడు రాజనందనుఁడు కేయూరకా ! మాపత్రలేఖ ధన్యురాలు. దుర్లభమైన దేవీప్రసాదమునకుఁ బాత్రురాలగు

చున్నది. అట్లే యుంచుకొనుడని పలుకుచుఁ నామెను విడిచి తురగ మెక్కి యతివేగ ముగా సేనానివేశమునకుఁ బోయెను.

అంతకుముందు తండ్రియొద్దనుండివచ్చియున్న లేఖావాహుం జూచి యువరాజపుత్రుఁడు దూరమునందుండియే గురుతుపట్టియోరీ ! మహారాజు కుశలుఁడేనా ? అంబకు భద్రమా ? రాష్ట్రమంతయు సుఖముగా యున్నదా ? యని యడిగిన వాఁడును విన్నవించెదితము చిత్తమని పలుకుచుఁ దనచేతనున్న పత్రికాద్వయ మతని కందిచ్చెను. అతండా పత్రిక విప్పి యిట్లు చదివెను.

స్వస్తిశ్రీ మహారాజాధిరాజ ! తారాపీడమహారాజ మార్తాండుఁడు శ్రీమంతుఁ జంద్రాపీడు నుత్తమాంగమున ముద్దిడుకొనుచు వ్రాయునది.

ప్రజలు సుఖులై యున్నవారు నీవు దిగ్విజయ యాత్రకుఁబోయి చిర కాలమయినది నిన్నుఁ జూచుటకు మాహృదయము మిక్కిలి యుత్కంఠ నొందు చున్నది. నీతల్లియు నంతఃపుర కాంతలతోగూడ గృశించియున్నది. యించుక జాగు సేయక యీ పత్రికం జదివి ముగించిన సమయమే ప్రయాణకాలముగాఁ జేసికొని రావలయును.

శుకనాసుఁడు వ్రాసిన రెండవపత్రికలోఁగూడ నట్లేయున్నది. వైశంపాయ నుఁడు సైతమట్టి యర్థముతోఁ దనకును వచ్చిన యుత్తరమును నరసి చూపెను.

అప్పుడు చంద్రాపీడుఁడు మిక్కిలి తొందరపడుచు వెంటనే ప్రయాణభేరి గొట్టింప నాజ్ఞాపించెను. మేఘనాథుఁడను సేనాధిపతినిపిలిచి యోరీ ! నీవిందుండుము. ఇచ్చటికిఁ బత్రలేఖను గేయూరకుఁడు దీసికొని వచ్చును. దానితోఁగూడ నీవింటికి రమ్మని పలికి వెండియు నిట్లనియె.

మానవజాతి దుష్కృతిగలది. నీ యుపకారమున్నియు నాత్మార్పణము చేసి నీయకారణవాత్సల్యత గణింపక బాణాశ్వినసములకు భిన్నార్థత్వము గలుగజేసి తినని తలంచెను కాబోలు. ఆస్థానమందెక్కడు దయజూపిన నీసాధుత్వ మెన్నటికిని మరువఁదగినదే ? నా గుణముల నీయొద్ద మిక్కిలిగా స్తుతిజేసిన మహాశ్వేత నిప్పు డెత్తిపొడుచుచుండునని నా హృదయము మిక్కిలి సిగ్గు జెందుచున్నయది. నే నేమి చేయుదును. తండ్రియాజ్ఞ యెక్కుడుదిగదా ! అది శరీరమాత్రమునకే యుపయో గించును. హేమకూట నివాసవ్యసనముగల నామనస్సుచేత జన్మాంతర సహస్రముల యందు నీకు దాస్యము చేయుదునని బట్టము వ్రాసి యియ్యఁగలను.

ఇప్పుడు తండ్రియాజ్ఞ నుజ్జయినికిఁ బోవుచున్నవాఁడ. యీ కృతఘ్నుని బరిజన ప్రసంగమునందైన స్మరించుచుండవలయును. ప్రతికియుండిన నెప్పటికైన వెండియు దేవీ చరణారవిందవందన సుఖంబనుభవించువాఁడ, మరియు మహాశ్వేతా పద పద్మములకు శిరంబున మ్రొక్కువాఁడ, మదనలేఖ సేమమడిగితిని. తమాలికనుఁ గౌఁగలించుకొంటిని.

అని యిట్లుత్తరము వ్రాసి మడిచి యా పత్రికం గేయూరక ముఖముగాఁ గాదంబరి కంపింపుమని మేఘనాథునితోఁ జెప్పుచు, వైశంపాయనుని స్కంధావారముతో మెల్లగా రమ్మని నియమించి తానతిజవంబున నింద్రాయుధ మెక్కి వారువపు రౌతులు సేవింప కతిపయ ప్రయాణముల నుజ్జయినికిఁ బోయెను.

అకస్మికముగా నతండు వచ్చుటచేఁ బౌరులు సంభ్రాంతులై సంతసించుచు నెదురువచ్చి నమస్కరింపుచుండఁ గైకొనుచు నతండతర్కితుండై రాజనగరిఁ బ్రవేశించెను.

అప్పుడు ద్వారపాలు రతని వార్తజెనికి నహమహమికఁగాఁ బోయి చెప్పిరి. యా వృత్తాంతము విని తారాపీడుఁడు పట్టరాని సంతోషముతో నతనికిఁ గొంత దూర మెదురేగెను.

చంద్రాపీడుఁడును దూరమునందే తండ్రిం జూచి తురగమునుదిగి యతని పాదంబుల సాష్టాంగముగా బడి నమస్కరించెను.

అతండు నప్పుడు పుత్రకుని గ్రుచ్చియెత్తి గాఢముగా గౌఁగలించుకొనుచు నప్పుడే విలాసవతీ భవనమునకుఁ దీసికొనిపోయెను.

ఆమెయుఁ బుత్రునింజూచి యపార సంతోషముతో వదనము వికసింప నాలింగనము చేసుకొని యాత్రామంగళములు దీర్చుచు దిగ్విజయ యాత్రా సంబద్ధము లగు కథలచేఁ బెద్దతడవం డుంచుకొనియెను.

చంద్రాపీడుఁడు పిమ్మట శుకనాసుని యింటికిఁబోయి వైశంపాయనుండు స్కంధావారముతో వచ్చుచున్నాడని చెప్పి, మనోరమకుఁ బ్రీతి గలుగఁజేసి యా దివసమంతయు తల్లియొద్దనేయుండి మరునాఁడు తనదగు కుమారభవనమునకుఁ బోయెను.

అతి మనోహరమగు నమ్మందిరము కాదంబరీ వియోగ చింతా సంతాపంబునఁ బొరలుచున్న యక్కుమారుని హృదయమునకు శూన్యంబువలె దోఁచినది.

అట్టి పరితాపముతో నతండు గొన్నిదినములు గడిపినంత నొకనాఁడు మేఘనాథునితోఁగూడ పత్రలేఖ హేమకూటమునుండి వచ్చుటయు దూరమునందు చూచి మోము వికసింప నమస్కరింపుచున్న దాని గ్రుచ్చియెత్తి మిక్కిలి గారవింపుచు నించుబోఁడీ! కాదంబరీ మహాశ్వేతలు సుఖులే కదాయని యడిగిన నప్పడఁతియు వారి యనామయము జెప్పి, వెండియుం గాదంబరి తమసేమ మడిగినదని వక్కాణించెను.

అప్పు డతఁడయ్యింతి చేయి పట్టుకొని యభ్యంతర మందిరమునకుఁబోయి యందు స్తబకవతీసీ పలాశచ్ఛాయచేఁ జల్లనై యున్న మరకత శిలామంటపమున నిద్రించు మరాళి విధమున జోలి యందుఁ గూర్చుండి యల్లన దానితో నిట్లనియె. పత్రలేఖా! నేను వచ్చిన తరువాత నచ్చట జరిగిన విశేషము లెట్టివి? నీవందెన్నిదినము లుంటివి? నిన్నెట్లు చూచినది? యేమేమి గోష్ఠి వచ్చినది? కాదంబరి నామాట యెప్పు

దైన స్మరించినదా! యని యడిగిన నట్లేది దేవా! దేవర వచ్చిన తరువాత సంమ జరిగిన విశేషములం జెప్పెద దత్తావధానులరై వినుండని యిట్లనియె.

మీరల్లనాఁ డుదయంబునఁగదా! యరిగితిరి. మీరు వెళ్ళిన గొంతసేపటికి కాదంబరి పరిజనులను విడిచి నన్ను బాహ్యోద్యానవనమునకుఁ దీసికొనిపోయి అందు మరకత సోపానములచే దీపించు ప్రమదవన వేదికయందు మణిస్తంభమూతగాఁ గూర్చుండి ముహూర్తకాల మూరకొని యెద్దియో పలుక నిశ్చయించి చెప్పనేయక పెద్దతడవు నామొగము చూచినది.

అప్పుడు నే నామె యభిప్రాయము గ్రహించి, అయ్యో! తొయ్యలీ! భయపడియెదవేల? యెద్దియేని జెప్పవలసియున్న జెప్పుము. నన్నన్యఁగా దలంపకుమని పలికిన విని యక్కలికి పాదాంగుష్ఠంబున నేల వ్రాయుచు మాటిమాటికి నలుమూలలు చూచుచు జెప్పఁదలఁచు కొనియు సిగ్గుపెంపున గంఠము గద్గదికమూన నెలుంగురాక యూరకొని తలవంచి కన్నులనుండి ప్రవాహంబుగా నీరు గార్చినది.

మఱియు నేను పలుమారు, మగువా! నీకిది తగునా? కారణ మెద్దియో చెప్పుము. ఊరక కన్నీరు నించెదవేలనని యడుగగా నతి ప్రయత్నముతోఁ గన్నీరు దుడిచికొనుచు వక్షస్థ్యాంశమును నఖశిఖరములచేఁ గేతకిదళముల వ్రాసి యంతలో జించివైచి తెగువమై సిగ్గు దిగద్రోచి తలయెత్తి యత్త్వ సారెసారెకుఁ గన్నులప్ప ళించుచు నాకిట్లనియె.

సఖీ! పత్రలేఖా! నిన్నుఁ జూచినది మొదలు నా హృదయము వయస్యలందరికన్న నీయందు విశ్వాసము గలిగియున్నది. కారణమేమియో తెలియదు. బోఁటీ! నాపరిభవ మెవ్వరితోఁ జెప్పుకొందును? నా దుఃఖము పంచుకొని యనుభవించువారెవ్వరు? ఇప్పుడు నా ప్రాణసంకట మెఱింగింప నీకన్న నా కాప్తులు గనఁబడలేదు. కాంతా! నా సంతాపమంతయు నీ కెఱింగించి జీవితము విడుచుచున్నదాన, నిష్కళంకమైన కులము కళంకపరచి కులక్రమాగతమగు సిచ్ఛృతిమల్పుచేసి సామాన్యకన్యలవలె నాబోటి బోఁటి చిత్తచాంచల్యమందఁ దగినదా! అన్నన్నా! అనాథవలె నీచపలఁ బలాత్కారముగాఁ జంద్రాపీడుని కారణంబున నిందాపాత్రురాలనయితినే! అయ్యో! గొప్పవారికిట్లు చేయుట దగునేమో చెప్పుము. పరిచయమున కిదియా ఫలము! అభినవ బిసనకుమారమగు నామనం బతండిట్లు పరిభవింపవచ్చునా? కటకటా! యూవలకు గుమారికాజనము పరిభవింపఁ దగినదే? సఖీ! నా హృదయము దహించుచున్నది. ఇంక నేను బ్రతుకజాలను. జన్మాంతరమందైన నీ సాంగత్యమే కోరుచున్నదాన. నీవంటి వయస్య నాకులేదు. నా కళంకమును ప్రాణపరిత్యాగ ప్రాయశ్చిత్తంబునఁ గడిగికొనియెదనని పలికి యూరకుండెను.

అప్పుడు నేనవ్విధమేమియు నెఱుఁగమింజేసి మిక్కిలి భయపడుచు విషాదముగా నిట్లంటి.

దేవీ ! చంద్రాపీడుఁడేమి యపరాధము జేసెను ? కుసుమకోమలమగు నీ మనంబు నేయవినయమున ఖేదపెట్టెను ? వినుట కిచ్ఛగించుచున్నదాన వడిగాఁ జెప్పుము ? విని మొదట నేను మేనుబాసిన తరువాత నీవు జీవితము విడుతువుగాక యని యడిగిన నత్తరుణి యిట్లనియె.

బోటీ! వినుము. అధూర్తుండు కలలో వచ్చి నచ్చి శుకశారికలచే రహస్యసందేశముల నంపుచుండెను. వ్యర్థమనోరథ మోహితుండై నిజానురాగంబునంబోలె నా చరణముల నలక్తకరసంబున రంజింపఁజేయును. గపోలస్వేదమును ముఖమారుతమునఁ బోగొట్టుచుండును. ఉపవనంబున నేనొంటిగాఁ గ్రుమ్మరుచు గ్రహణభయంబునఁ బారిపోవ నడ్డమువచ్చి బిగ్గరగా గౌఁగలించును. స్తనతటంబునఁ బత్రరచనలు చేయును. కచగ్రహణముచేసి సురాగండూషములఁ బలుమారు నా ముఖంబున నిడుచుండెను.

పత్రలేఖా ! ఆ నిశ్చేతన నేనెట్లు పట్టుకొందునో చెప్పుము. అనుటయు నేనామె మాటలు విని చిత్తంబున నన్నా ! ఈ చిన్నది చంద్రాపీడుని గురించి మన్మధునిచే మిక్కిలి దూరముగా నాకర్షింపబడినది. నిక్క మీ చక్కెరబొమ్మ మూలమున నతండును పుష్పకోదండుని బారిం బడియుండెను.

అని మనంబునఁ దలంచుచు యువతీ ! నీవిధ మెఱింగితిని. కోపము విడువుము. కామాపరాధంబున నా చంద్రాపీడుని నిందింపకుము. ఈ చేష్టలన్నియు శఠుండగు మన్మధునివే కాని మా దేవరవికావు అని పలికిన నక్కలికి సంతసించుచు మోమెత్తి యిట్లనియె.

కామినీ ! కాముండన నెవ్వఁడు ? వాని రూపమెట్టిది ? వాని చేష్టలెట్టివో ! చెప్పుమన నేను తరుణీ ! వానికి రూపములేదు. శరీరము లేకయే దహింపఁగలఁడు. జ్వాలావళిజూపకయే సంతాపము కలుగఁజేయును. పొగ లేకయే కన్నీరు పుట్టించును. అట్టి భూతమీ భువనత్రయంబునను లేదు. ఎట్టి ధైర్యముగలవారినైన బారింబడిరేని వేధింపక మానఁడు. మఱియు నతనిచే నావేశింపఁబడిన స్త్రీలకు గగనమంతయు ప్రియుని ముఖచంద్రులుగనే తోచుచుండును. భూమియంతయు దయితాకారములే కనంబడును. వారి చర్యలు కడువిపరీతములుగా నుండునని పలికిన విని యత్తన్వి శిరఃకంపము చేయుచు నాకిట్లనియె.

పత్రలేఖా ! నీవిప్పు డెట్లు చెప్పితివో మన్మధుఁడు నన్నట్లు వేపుచున్నవాఁడు. నీవు నాకుఁ బ్రాణమువంటిదానవు కావున నడుగుచుంటిని. ఇప్పుడు నేనేమి చేయఁదగినదో చెప్పుము ? ఇంతకు మున్నిట్టి వృత్తాంతములేమియు నేనెఱుంగను. ఎవ్వరికిఁ జెప్పరాని యిట్టి కష్టములఁ బడుటకంటె మృతినొందుటయే మేలని నా హృదయంబునఁ దోచుచున్నదేమి ? చెప్పుమని యడుగగా నేనిట్లంటి.

దేవీ ! వలదు వలదు. అకారణమరణముతో నీకేమి ? ఆరాధింపకయే ప్రసన్నుఁడగు మన్మధుఁడే నీకార్యము చక్కపెట్టును. స్వయంవర విధులచేఁ బతుల

వరించిన సతుల నెందరం జెప్పను! నీమనంబునం బుట్టినతలంపు అసత్యమైనది కాదు. శాస్త్రసమ్మతమైనది. దేవీ! మరణోద్యోగమును విడువుము. నీ పాదములతోడు! వేగపోయి యాతనిం దీసికొనివచ్చెదను. నన్నుఁ బంపుమని పలికిన విని యక్కలికి ప్రీతిద్రవార్ద్రములగు చూపులచే నన్ను జూచుచు సిగ్గువిడిచి యుత్తరీయము సవరించుచు మెడనుండి ముక్తాహారమును దీసి చేతంబూని ప్రహర్షవివశయై యిట్లనియె.

నాతీ! నీ ప్రీతి నేనెంతునుంగుదును. శిరీషమృదుప్రకృతిగల కన్యకా జనమునకుఁ బ్రగల్భవాక్యము లెట్లువచ్చును. ఇప్పుడు నేనేమని చెప్పవలయునో నాకుఁ దెలియదు. నీవు నాకతిప్రియయుంతవైతివంటినేని పునరుక్తిదోషముకదా. నాకు నీయందనురాగ మెక్కుడనిన వేశ్యాలాపమగును. నీవులేక నేనుజీవింపననిన ననుభవవిరోధము. నన్ను మన్మథుఁడు పీడించుచున్నాఁడనిన నాత్మదోషోపాలంభము. నన్ను బలాత్కారముగా హరించితివనిన బంధకీధార్ష్ట్యము. తప్పక రావలయుననిన సౌభాగ్య గర్వమగును. నేనవచ్చుచున్నదాన నంటినేని స్త్రీచాపల్యముగదా అనన్య రక్తవన స్వభక్తి నివేదనలాఘవదోషమువచ్చును. మదీయ మరణంబున నాకు నీయందుఁగల ప్రీతినిఁ దెలిసికొనఁగలవు అనిన సంభావముగదా!

• [ఇంతవరకు కాదంబరీ పూర్వభాగము ఇంతవరకే బాణకవి కవిత్వము]

కావున నేమన్నను దోషమే కనంబడుచున్నది. నాఁడు అంబరంబునఁ గళానిధిజ్యోత్స్నావితానంబున దెసల వెదజల్లుచుఁ బ్రకాశింపుచుండఁ గ్రీడాపర్వతక నితంబంబు నందలి కాసారతటంబున శిలా పట్టణమునఁ బ్రకాశించు హిమగృహంబునఁ బుష్పశయ్యయందుఁ బండికొని యక్కుమారునిచేఁ జూడఁబడితిని. రెండుసారులువచ్చి నాయవస్థ యంతయుం జూచి యుపేక్షజేసిపోయెనే? ప్రియసఖీ! నీతో నేమందును? కూర్చున్నను, దిరుగుచున్నను, నిద్రించుచున్నను, మేల్కొన్నను, రాత్రింబగలా శ్రీమంటపమున నాయుద్యానవనమున నాలీలాదర్శిక యందుఁ గ్రీడాపర్వతమందా కుమారునిఁ జూచుచునే యుంటి. నా మాటయే నీకుఁ జెప్పుచుంటిఁ గదానయనకథతో నికఁజాలు. ఎక్కడి రాక. అని పలికి యక్కలికి శోకవేగంబున భుజలతలయందు శిరమువంచి మూర్ఛవోయినదివోలె నూరకున్నది.

నేనామాట విని అహా! వియోగులు జీవించుట కష్టముగదా! సంకల్పము యుండగు ప్రియుండు గులాంగనల బాధించును. సంకల్ప క్రీడలతోఁ బొద్దుపుత్తురు. అని నేను దలంచుచుండఁగనే సూర్యాస్తమయమైనది. అప్పుడు బాలికలు పెక్కండ్రు వచ్చి వింతవింతగాఁ దీపములు వెలిగించిరి. నేనామెంజూచి దేవీ! నీవు దుఃఖింపకుము. నేను వేగమపోయి యారాజకుమారునిఁ దీసికొని వచ్చెదనని పలికినంత భవదీయ నామ

---

[• ఇంతవరకు రచించి బాణకవి స్వర్గస్థుఁడయ్యెను. తరువాతఁ జివరకు నతని కుమారుఁడు రచించెను.]

సంకీర్తనముచేత విషాపహరణ మంత్రంబున సర్పదష్టుండువోలె గన్నులందెరచి స్పృహతో నన్నుఁ జూచుచు నెవ్వరక్కడనని పరిజనమును బిలిచినది. అప్పుడు పెక్కండ్రు జవరాండ్రు ఏమియాజ్ఞ అని పరుగెత్తుకొని వచ్చిరి. వారియందుఁ జూపుల వ్యాపింపఁ జేయుచు మరకతశిలాతలమున గూర్చుండి నాకిట్లనియె.

పత్రలేఖా! ఇది ప్రియమని చెప్పుటకాదు నీరాక జూచుచుఁ బ్రాణముల ధరించి యుండెదను శీఘ్రముగాఁ గార్యము సాధించుకొని రమ్మని పలుకుచు నాహారము నా మెడలోవైచి తాంబూలాంబరాభరణాదు లొసంగి నన్నుఁ బంపినది. అని చెప్పి పత్రలేఖ యించుక తల వంచుకొని వెండియు నిట్లనియె.

దేవా! నూతనమగు కాదంబరి ప్రసాదాతిశయంబునం గలిగిన ప్రాగల్భ్యము చేత దుఃఖించుచు విజ్ఞాపన జేయుచున్నదాన. దేవరకు సైతమట్టి యవస్థలోనున్న గంధర్వరాజపుత్రిక నుపేక్షించి వచ్చుట యుచితముకాదు. ఆపన్నవత్సలులగు మీరు తగనికార్యము జేసితిరి. అని యాక్షేపించుటయుఁ జంద్రాపీడుఁడు లలితమైనను బ్రౌఢమైన తదాలాప మాలించి రెప్పవేయక యించుక యాలోచించి బాష్పోపప్లుత నేత్రుఁడై స్వభావధీరుండైనను వ్యాకుల చిత్తుండై బాష్పవిక్షేపంబునఁ వ్యాకులమైన యక్షరములు గలుగునట్లుగాఁ బెద్ద యెలుంగున నిట్లనియె.

పత్రలేఖా! నేనేమిచేయుదును? శృంగారలీలల నుపదేశించెడు చెఱుకు పచ్చవిల్తునిమూలమున నాపుచ్చేకిందితన హృదయంబునఁ బొడమిన వికారముల నాకుఁ దెల్లముగా నివేదించినదికాదు. దేవతా స్త్రీలయొక్క రూపానురూప లీలా సంభావనాదుల దృష్టపూర్వములగుట నదియంతయు సహజాయుగాగ మేమో యని సందేహడోలిక యెక్కి యూగుచు న్యాపోయాసం నిరహాగ్నిపాలుసేసి నీచే నిందింపనిట్లుఁ బడితిని.

మఱియు నాకీ మనోవ్యామోహము గలుగుట శాపదోషమేమో యని యాలోచించుచుంటిని కానిచో నాచిన్నది యతిస్ఫుటముగా మదన చిహ్నములఁ బ్రకటింపుచుండ నేనెందులకుఁ దెలిసికొనలేక పోయితిని? నాబుద్ధి నుడిగిపోయినది పోనిమ్ము! స్మితావలోకన లీలావిశేషము లతి సూక్ష్మములగుటఁ దెలిసికొనుట కష్టము. మఱియొక కారణము వలనం బుట్టుచుండును.

చిరకాలమునుండి తన కంఠమందున్న రత్నహారము నూరక నా మెడయందువైచునా? అప్పుడైనం దెలిసికొనరాదా? అదియునుం గాక హిమగృహకథా వృత్తాంతము నీవుగూడఁ జూచినదేగదా! అప్పుడైనఁ బ్రణయకోపమునం గాబోలు శ్లేష గానే పలికినది కాని స్పష్టముగాఁ జెప్పినదికాదు. అదియంతయు నామెదోషమే కాని నాది కాదు.

పత్రలేఖా! ఇప్పుడు గతమునకు వగచినఁ బ్రయోజనములేదు. నా హృదయమెట్లామెకుఁ దెలియునో యట్లు ప్రవర్తించువాఁడనని పలుకుచుండఁగనే ప్రతీహారి జనుదెంచి నమస్కరించుచు, దేవా! విలాసవతీ మహాదేవి పత్రలేఖతోఁగూడ మిమ్ము

రమ్మని యాజ్ఞాపించుచున్నది. పత్రలేఖ దేశాంతరమునుండి వచ్చినదని విన్నదట వేగరండని విన్నవించుటయుఁ జంద్రాపీడుఁడామాటవిని అయ్యో! నా జీవితము సందేహడోల యెక్కి యూగుచున్నది. నా తల్లి నిమిషమైన నన్నుఁ జూడలేదు. కాదంబరి యవస్థ పత్రలేఖ యెఱింగించినది. జననీ స్నేహ మాజన్మ క్రమాహితమగుట బలమైనది.

పితృశుశ్రూషయు నట్టిదే. గంధర్వ రాజసుతానురాగ మంతకన్న బలమైనది. జన్మభూమి విడువందగినదికాదు. కాదంబరియుఁ బరిగ్రహింపఁ దగినది. ఇప్పుడేమి చేయుదును? అని యాలోచించుచు బత్రలేఖ చేయిపట్టుకొని తల్లియొద్దకుఁ బోయెను.

విలాసవతియు వానిం గారవించి వీడు నిత్యమొక్కసారి యెప్పుడోవచ్చి నాకన్నులంబడుచుండవలయును లేనిచో నేనోపజాలనని పలుకుచు నాదివసమెల్ల దన యొద్ద నుంచుకొని యంపినది చంద్రాపీడుఁ డది మొదలు కాదంబరీ విరహవేదనాకులుండై మదనాగ్నిచే బాధింపఁ బడుచు, శుష్కించిపోవుచు గడియ యొక్కయేఁడుగా గొన్నిదివసములు గడిపెను.

మఱియొకనాఁ డతండు పత్రలేఖవెంటరాఁ బాదచారియై బాహ్యోద్యానవనంబున కరిగి యందు విహరింపుచుండఁ గొంతొక దూరములో విచిత్రగమనంబుల వారువము నడిపించుచు వచ్చుచున్న యొక రౌతు నేత్రపర్వము గావించుటయు నతం డెవ్వఁడోచూచి రమ్మని యొకపరిచారకు నంపి తద్వార్త నరయుటకై యెదురుచూచుచుఁ బత్రలేఖా! అతఁడు గేయూరకుఁడువలెఁ గనంబడుచున్నాఁడు చూడుమని పలుకుచుండఁ గనే యతండచ్చట కరుదెంచి గుఱ్ఱమును డిగ్గనురికి రాజపుత్రునకి నమస్కరించెను.

చంద్రాపీడుఁడు ప్రీతిచేఁ జేతులుసాచి రమ్ము రమ్ము. అని పలుకుచు నతని గాఢాలింగనము జేసికొని కేయూరకా! నీదర్శనముచేతనే కాదంబరి సేమముగా నున్నదని తెలియఁబడుచున్నది నీ యాగమనకారణము విశ్రాంతి వహించి యెఱింగింతువుగాక! అని పలుకుచుఁ బత్రలేఖా కేయూరకులతోఁగూడ నొక యేనుఁగనెక్కి నిజభవనంబునకుం బోయెను.

లోపలి కెవ్వరిని రానీయవలదని ద్వారపాలురకు నియమించి పత్రలేఖా కేయూరకులతోఁగూడ గృహారామము లోనికిం బోయి యందున్న పరిజనులఁ దూరముగాఁ బొమ్మని రాజపుత్రుండు కేయూరకుని కిట్లనియె. గంధర్వపుత్రా! కాదంబరి యొక్కయు మహాశ్వేత యొక్కయు మదనలేఖయొక్కయు సందేశమేమియో యెఱుంగ జెప్పుమని యడిగిన నతం డిట్లనియె.

రాజపుత్రా! అచ్చటి విశేషములు వినుము? బత్రలేఖను దీసికొనివచ్చి మేఘనాథుని కప్పగించి తిరుగాఁబోయి దేవరయొక్క యుజ్జయినీ గమనవృత్తాంతము చెప్పి మీయుత్తరము చేతికిచ్చితిని. అది చదివి మహాశ్వేత తలయెత్తి యొద్దియో

యాలోచించి సిట్టూర్పు నిగుడించుచు విదారముతో లేచి శపంబుజేయుచున్నదై వెంటనియుం దనయాశ్రమమునకుఁ బోయినది.

కాదంబరియు నీవార్త విని హృదయము బాదుకొనుచు నెత్తి మోదుకొనుచు మూర్ఛ మునింగి నేలంబడి యంతలో లేచి మహాశ్వేత యడిగిన విధమెరుఁగక కన్నులం దెరచి శిరఃకంపముచేయుచు, గేయూరకా ! యీ సంగతి మహాశ్వేతతోఁ జెప్పుమనియు మదనలేఖా ! చంద్రాపీడుఁ డెట్టిపని చేసెనో చూచితివే ! యిట్టివాఁడెం దేనిం గలడాయనియు సోపహాసముగాఁ బలుకుచు లేచి పరిజనులవిడిచి యొక్కతియ యేకాంత గృహమునకుఁబోయి తల్పంబున మేనుజేర్చి ముసుఁగువైచుకొని మదనలేఖతో సైతము మాటాడక తత్పరితాపము లోపలనే యనుభవింపుచు నాదినము గడపినది.

అమ్మరునాఁడుదయమున నే నామె సమీపమున కేగినంత ఆహా ! మీయట్టి యాపులు గలిగియున్నను, నేనిట్టి యుత్కంఠాకష్టములం జెందుచుంటినే యని యాక్షేపించునదియుంబోలెఁ బాష్పపూరోద్రేకముచేఁ బర్యాకుల మగు దృష్టిచే నన్నట్టె చూచినది.

ఆ చూపులవలననే తదీయహృదయాభిప్రాయము గ్రహించి యామెతోఁ జెప్పకయే దేవరం జూడవచ్చితిని. మీనిమిత్తమామత్తపధబాకాళిని మిక్కిలి చిన్నది. ఆమె పడెడు నిడుములఁ జెప్పనలవిడుకాదు. అబలాజనముయొక్క హృదయము మృదువైనను ముక్తాఫలత్వము నొందిన జలమువలె నుత్కంఠితమయి కఠినమగునని తలంచెదను. కానిచో నామెచిత్తమెన్ని వ్యసనములు జెందినను నశింపకున్నది ఆహా ! స్త్రీలకు వల్లభసమాగమాశ దురంతమయినదికదా ! అట్టి కష్టములతోడ నయిన ప్రాణముల ధరించియున్నది.

రాజకుమారా! అత్యుత్కటమైన యాకలకంఠి యుత్కంఠ నీతోనేమి చెప్పుదును? ఏ యుపాయంబునఁ బ్రదర్శింతును? దేనితోఁబోల్చి చెప్పుదును ? ఆమె తాపంబు ప్రచండ దినకర సహస్రాతపమును మించియున్నది. శయనముగా వేయబడిన పద్మపత్రము లెంతచూర్ణములైపోవుచున్నవి. కామునిచే మధింపఁబడు నా యాచేష్టలం జేయుచున్నది. వినుండు. మదనవేదన సహింపఁజాలక పరితపించుచుండ సఖులు కుసుమ శయనంబునఁ బరుండఁబెట్టి కిసలయతాళవృంతముల వీచుచు సంతాపముచేఁ జీర్ణమైన యలక్తకరసంబున నెఱ్ఱఁబడిన శయనకుసుమంబులం జూచి కుసుమశర ప్రహార జనితరక్తమని యనఁదలంచుందురు. మీపేరు తలపెట్టినంత మేనఁగవచమువలె రోమాంచము వహించును. ఆమె యవస్థయంతయుం జెప్పుటకుఁ బదిదినములు పట్టును, పెక్కులేల? అక్కడి కథలన్నియుఁ ద్వదాలాపముద్రితములై యున్నవని యెఱింగించుటయుఁ జంద్రాపీడుఁడు కేయూరకా! చాలుచాలు. పైనఁ జెప్పకుము. వినలేకున్నాను

పలుకుచుఁ గన్నులు మూసికొని మూర్ఛయావేశింపఁ గాదంబరిని ధ్యానించుచున్న వాఁడుం బోలె మహాశ్వేత కాంతము పేనెఱుంగక యంతలో దెలిసి గద్గదస్వరముగా నతని కిట్లనియె.

కేయూరకా! పత్రలేఖవలననే కాదంబరీ సంతాపమంతయుఁ దెలిసినది. నేనేమి చేయుదును? కాదంబరియొక్క యాజ్ఞనే నిందింపుము. అపరస్పందపాతము ననే నియోగములను జేయుచున్న నా విషయమై యిన్ని చిక్కులు పడనేమిటికో విచారింపుము. ఆ యువతి లజ్జావతి యైయో బంధుజన సకంతఁ బ్యామోహమేల? ఆ లలనను మదనలేఖ రెండవ హృదయము కదా! తన్ముఖంబున నయినఁ దెలుపరాదా?

అన్నన్నా! నిష్కారణము అమ్మదవతి మానుసిచేఁ బ్రాణసంకటము నొందుచున్నదే! ఇది యాముదితకుఁ బొరబాటుగాఁ దలంచెద. కానిలో నేనశ్వముఖాను సారముగా దేవభూమి కెట్లు పోవుదును? పోయియు మహాశ్వేత నెట్లు కాంతును? కనియు మరలక హేమకూటమేటికిఁ బోవుదును? పోయియుఁ గాదంబరిం జూడనేల? చూచియు నితర్కింపక వ్యర్థమనోరథుండనై యింత దూరమేలవత్తును? ఇది యంతయు దైవహతకుని కపటమూలమైన మతియొకటికాదు. కావున వేగముపోయి యా యింతి నోదార్చుటకు యత్నింపవలయునని పలుకుచుండగా మార్తాండుం దపరగిరి శిఖర మధిష్టించి కిరణ సహస్రమునుపసంహరించుకొనియెను.

అప్పుడు చంద్రాపీడుండు కేయూరకునితోఁగూడ నిస పడకకుఁబోయి కాల్యకరణీయములం దీర్చి చంద్రోదయ సమయంబునఁ జంద్రమణి శిలాతలంబున శయనించి కేయూరకుఁడడుగు వృత్తుమండకలనితోఁ, కేయూరకా! మనము పోవువరకుఁ గాదంబరి ప్రాణంబుల దాల్చియుండునా? మదనలేఖ యామెనోదార్చుచుండదు? మహాశ్వేత తద్వృత్తాంతమువిని వచ్చి ధైర్యము గలపనుండునా? హరిణశోభకాయ తేక్షణమగు నమ్మగువ నెమ్మోము ప్రగ్మురఁజూడఁగలుగుదునా? యని యడుగ నతఁడు దేవా? ధైర్యమవలంబింపుము. వెరవకుము వేగముగమనయత్నము చేయుమని పలికెను.

అప్పుడతం డాత్మగతంబున అయ్యో! ఇప్పుడు మా తల్లిదండ్రుల కెఱింగింపక పోయితినేని వారు పుత్రశోకంబునం గుందుచున్నారయటకై వెడలి పుడమియంతయుం ద్రవ్వుదురే? అట్టివారిం గష్టపెట్టుట నాకేమి శ్రేయము? పోకున్నఁ గాదంబరి ప్రాణత్యాగము చేయును. రెండు విధంబులచేతఁ బ్రత్యవాయమే తోచుచున్నది. యేమి చేయుదును? ఎవ్వరితో చెప్పుదును? ప్రాణతుల్యుండగు వైశంపాయనుండైన దాపునలేడే! యని యనేక ప్రకారములఁ దలపోయుచు నిద్రించి నెట్టకేలకు గడిపెను.

అతండు మరునాఁడుదయంబున లేచి స్కంధావారము సమీపమునకు వచ్చి యున్న దనుట మాట వినియెను. అప్పుడు మిక్కిలి సంతసించుచు కేయూరకా! మన

కార్యసిద్ధి హస్తగతమయినదానిగా భావింపుము. నా ప్రాణమిత్రుఁడు వైశంపాయనుఁడు వచ్చుచున్నవాఁడని పలికెను.

పిమ్మట కేయూరకుఁడు ఆ రాజకుమారునికి మ్రొక్కుచు దేవా! దేవర వైశంపాయనుఁడు వచ్చువరకుఁ గాలక్షేపము చేయఁదగియే యున్నది. అచ్చటిసంగతి మీకు విశదపరచితినికదా! దేవర తత్సందేశమును గ్రహించిరి. కావున నన్ను ముందు బంపుఁడు. నేను బోయి భవదీయ వృత్తాంతమంతయు నా కాంత కెఱింగించి జీవనధారణోపాయ మాకలించెద. మీవార్తా శ్రవణమూలకముగాఁ బూని యానెలంతఁ బ్రాణములు ధరించు నను గ్రహింపుఁడని పలుకఁగావిని యారాజనందనుండు వెనుకఁగూర్చుని యున్న పత్రలేఖం జూచుచు మేఘనాదుఁ డెక్కడనని యడిగెను.

అంతలో మేఘనాదుం డెదుర నిలఁబడుటయు నతనిం జూచి యోరీ! నీవు వెనుక పత్రలేఖం దీసికొనివచ్చుట కెందుంటివో యిప్పుడిచ్చటికి పత్రలేఖం దీసికొని కేయూరకునితోఁగూడ ముందుగాఁ బొమ్ము. నేనును వైశంపాయనునితో మాట్లాడి వెనుక వచ్చెదనని నియమించి కేయూరకా! నీవు కాదంబరి సందేశము నాకుఁ దీసికొనిరాలేదు. నేనే నీచేత నామెకు సందేశము పంపుచుంటిని. అధికమగు సిగ్గుయొక్క భారమును వహించుటచే నిన్నాయాసపెట్టుచున్నాను. అని దేవితో విజ్ఞాపన చేయుము తక్కిన సంగతులన్నియుఁ బత్రలేఖ యెఱింగింపఁగలదు. అని పలుకుచు నమంగళశంకచే నశ్రుజలంబు నరికట్ట యత్నించుటయు నాపలేక కన్నీరుగార్చుచుఁ దనపాదంబులకు నమస్కరించుచున్న పత్రలేఖ దిక్కు మొగంబై యంజలిపట్టి యిట్లనియె.

పత్రలేఖా! ఈ యంజలితో మచ్ఛిరఃప్రణామము లర్పించి కాదంబరి కిట్లు విజ్ఞాపన చేయుము. దయగలదగుట ప్రథమదర్శనమందే యనుగ్రహాతిశయమునుఁ జూపిన యామెను నమస్కారము చేసనైన గౌరవింపక విడిచివచ్చిన కృతఘ్నుండనగు నా సుగుణమేదిఁ జూచి తిరుగఁ బరిగ్రహింపుమని ప్రార్థింతును. ఆమె మాత్ర మెట్లంగీకరించును? ప్రకృతిపేశలమగు నామె హృదయమపహరించి వెళ్ళలేదనియా? ప్రాణసంకటమగు నవస్థ జూచియు నుపేక్ష చేయలేదనియా! సర్వదోషాశ్రయుండనైనను బలుమారామె పాదసేవ జేసితిననియా? సర్వగుణవిహీనుండనైనను నామె సుగుణంబులే నన్నవలంబించునని యాసగలిగి యుంటిని. పాపపతితుండనగు నన్ను దద్వాత్సల్యము భయపెట్టుఁడని తలంతును. సిగ్గులేనివాఁడనై తిరుగ నామె మొగంబు జూచుటకు యత్నించుట తద్గుణంబులే కారణములు. ఆమె సెలవులేకయే దూరముగా వచ్చిన నన్ను బలాత్కారముగాఁ దద్గుణములే వెండియు నామె పాదమూలమును జేర్చుచున్నవి. ఇష్టములేని గమనాజ్ఞచే వెడలిపోయితినని యేవాక్కుచే విజ్ఞాపన జేసికొనుచుంటినో ఆ వాక్కే నీ కిట్లు చెప్పుచున్నది. ఇటుపైన మదాగమన మెట్లు వ్యర్థస్వప్నముగాదో జగమెట్లు శూన్యముగాదో యట్లు దేవి యాత్మ నిలుపుకొనుట కాత్మచేతనే యత్నము చేయవలయును. అని చెప్పుమని చెప్పి వెండియు నతండు ప్రియ

సఖీ ! నీవు దారిలో మద్వియోగపీడచేఁ గుందుచు శరీరసంస్కారము నుపేక్ష జేయుదువు సుమీ ! సమయమున కాహారమును గుడుచుచుఁ దెలియని దారిం బోవక విమర్శించి బస జేయుచుండవలయును. ఏమి జేయుదును ? నీ కంటెఁ గాదంబరీ ప్రాణములు ప్రియములని నిన్నొంటిగాఁ బంపుచున్నాను. నా ప్రాణములు నీ చేతిలో నున్నవి కావున నీ యాత్మ జాగరూకతతోఁ గాపాడికొనుమని పలుకుచు నాలింగనము జేసికొని కేయూరకుని కప్పగించి నన్ను వెండియు మహాశ్వేతాశ్రమములో గలిసికొనవలయునని యుపదేశించి వారినంపెను.

వారు పోయిన వెనుక నితండు వీరు వేగముగా నందుఁ బోవుదురా ? దారిలో నేదియైన యంతరాయము రాదుగదా ! ఎన్ని దినములకుఁ బోయి యామె నూరడింతురు ? అని యాలోచించుచు శూన్యహృదయుండై క్షణమందు వసించి స్కంధావార మెంత దూరమందున్నదియో తెలిసికొని రమ్మని వార్తాహరునిఁ బంపి వైశంపాయను నెదుర్కొనుటకుఁ బంపుమని యాచించుటకై తండ్రిగారి యొద్ద కరిగెను.

దూరమందె నమస్కరించుచున్న పుత్రుంజూచి తారాపీడుఁడు నిర్భర స్నేహగర్భమగు స్వరంబున వత్సా ! రమ్ము, రమ్ము, అని చేతులు సాచుచుఁ గౌగలించుకొని దాపునఁ గూర్చుండఁబెట్టుకొని ప్రత్యవయవము పాణిచే స్పృశించుచు దాపుననున్న మంత్రి ముఖ్యునితో నిట్లనియె.

ఆర్యా ! శుకనాస ! ఆయుష్మంతుఁడగు చంద్రాపీడునిం జూచితిరా ? ఇతని మేన యౌవనము పొడచూపినది. వివాహయోగ్యమగు దశ వహించియున్నవాఁడు. విలాసవతితో నాలోచించి వీనికిఁ దగిన రాజకన్యక నరసి పెండ్లి చేయవలయుననుటయు శుకనాసుఁడు దేవా ! దేవర లెస్సగా నాలోచించితిరి. ఇతడు విద్యలన్నియు గ్రహించెను. దిగ్విజయము చేసెను. ప్రజల కుత్సాహముగలుగఁజేసెను ఇఁక మిగిలిన కృత్యము పరిణయమేకదా ! అవశ్యము దానిగురించి యాలోచింపవలయునని పలికెను.

అట్టి సమయమునఁ జంద్రాపీడుఁడు సిగ్గుచే తల వాల్చుకొని యాత్మగతంబున భళిరే ! వీరి సంవాదము కాదంబరీ సమాగమమునకు సుప్రశుతివలెఁ దోచినది. నా విషయమై మా తండ్రి కిప్పుడిట్టి బుద్ధి పుట్టుట సముద్రంబునఁ బడినవానికి యానపాత్రము దొరికినట్లుగా నున్నది. అని పెక్కుతెరంగుల నాలోచించుచు సంతలో వైశంపాయనుని ప్రస్తావన వచ్చుటయు నతని నెదుర్కొనుటకు ననుజ్ఞ యిమ్మని చంద్రాపీడుఁడు శుకనాసముఖముగాఁ దండ్రికిఁ విజ్ఞాపన జేసికొనియెను.

తారాపీడుఁడు వైశంపాయను నెదుర్కొనుటకు బుత్రునకాజ్ఞ యిచ్చుటయు నతండత్యంత సంతోషముతో నా రాత్రి వేగించి సుహృద్దర్శన లాలసుండై వేగుజామున నే లేచి ప్రాతఃకాలకృత్యముల నిర్వర్తించి యుచిత పరివారముతో నింద్రాయుధ మెక్కి యతివేగముగా సేనాభిముఖముగఁ బోయెను.

స్కంధావారమును ప్రవేశించినతోడనే గుఱ్ఱముపై నుండియే యత్యాతురముతో వైశంపాయనుఁ డెచ్చట నున్నవాఁడని యడిగెను. ఆ మాట విని యందున్న స్త్రీలు కొందఱెద్దియో పని తొందరలో నుండి యతని గురుతుపట్టఁజాలక కన్నీరు విడుచుచు అయ్యో! ఇంకెక్కడి వైశంపాయనుఁడు? అతని నడిగెదరేమిటికని పలికిరి.

ఆ మాటలు విని ఆ! పాపులారా! అట్లనియెదరేల? యని హృదయంబు ఝల్లుమన వారినడలించుచు మఱియొకరినడుగక భయపడుచు గుంపువీడిన లేడిపిల్లవలె బెదరుచు నేమియుం జూడక యేమియు మాటాడక యేమియును వినక యెవ్వరింజేరక హా! యిప్పుడు నేనెక్కడనుంటిని? యెక్కడికి వచ్చితిని? యేమిటికి వచ్చితిని? యెక్కడికిఁ బోవలయును? యేమి చేయవలయును? అని తలంచుచు నంధునివలె మూకునిపగిది జడునిభాతి నందుఁ గ్రమ్మరుచుండెను.

అప్పుడు తురగమును గురుతుపట్టి రాజకుమారులు చంద్రాపీడుఁడు చంద్రాపీడుఁడని పిలుచుకొనుచుఁ దొందరగా నానిం జుట్టుకొనుటయు నతండు వారిని వైశంపాయనుఁడెక్కడ నున్నవాఁడని గద్గదస్వరముతో నడిగెను. వారు దేవా! సర్వము నివేదింతుము. గుఱ్ఱము దిగి యీ వృక్షచ్ఛాయను విశ్రమింపుడని దీనముఖులై పలుకుటయు నట్లుచేసి తదీయాగ్రోరజిం గనిపెట్టి యతండు చిత్తము విభ్రాంతి వహింపఁ బెక్కుతెరంగులఁ దలంచుచు నపరాధము చేసినవాడుంబోలెఁ దల వాల్చుకొని మెల్లగా వానితో నిట్లనియె

నేను పోయిన వెనుక దారిలో సంగ్రామము తటస్థించినదా? లేక శీఘ్రములో నసువుల గ్రసియించు వ్యాధియెద్దియేని వచ్చినదా? పిడుగు పడినట్లు వైశంపాయనుని కింత యుపద్రవ మేల రావలయును? వేగమ చెప్పుడనుటయు వారందరు చెవులుమూసికొని శివశివా! అట్లనియెదరేల? పాపము వైశంపాయనుండు జీవించియే యున్నవాఁడు. ఇంక నూరేండ్లు బ్రతుకునని పలుకగా విని యారాజనందనుండు డెందంబానంద సాగరంబునమునుంగ వారిఁగంత గ్రహణముజేయుచు వెండియునిట్లనియె.

వైశంపాయనుండు బ్రతికియుండిన నాయాజ్ఞమీరి మఱియొక చోటికిఁ బోవువాఁడు కాడని యట్లంటి మంచిమాట జెప్పితిరి. అతండిప్పు డెచ్చటికిఁ బోయెను? ఇచ్చటికేలరాడు? అతనివిడిచి మీరేమిటికి వచ్చితిరి? వినువరకు నాచిత్తము తలమందుచున్నది. వేగమచెప్పుఁడని యడిగిన నమస్కరించుచు వారిట్లు చెప్పఁదొడంగిరి.

## వైశంపాయనుని కథ

దేవా! యవధరింపుము. వైశంపాయనునితోఁగూడ మీరు మెల్లగా రండని మాకు జెప్పి దేవర యరిగితిరిగదా! ఆ దినము మేము ప్రయాణసాధనముల సవరించుకొని మఱునాఁడుదయంబునఁ బ్రయాణభేరిని గొట్టించి నంతలో వైశంపాయనుండు

వచ్చి వారించుచు నీప్రాంత మందచ్ఛోదమను పుణ్యసరస్సుగలదు. అందు తీర్థమాడి శంభునర్చించి రేపుపోవుదము. ఈ పుణ్యభూమి కెప్పుడైనను వత్తుమా? యని పలుకుచుఁ బదగమనముననే నాయచ్ఛోదమునకుఁబోయెను.

ఆ ప్రదేశమంతయు రమణీయముగా నుండుటచే నందందు దృష్టి బరగింపుచు నందందు మెలంగుచు సస్యవిశేషములఁజూచుఁ గ్రుమ్మరుచున్నంత నత్తీర ప్రాంతమున మణిశిలామంటపమొండు గనంబడినది.

దానిని జిరకాలమునకు గనంబడిన సోదరుని వలెఁ బుత్రకుని భాతి మిత్రుని చందమున నత్యంత ప్రీతితో రెప్పవాల్పక చూచుచు స్తంభితుని యట్ల కదలక నిర్వికార హృదయుఁడై యెద్దియో ధ్యానించుచు నధోముఖముగా నందుఁ గూర్చుండుటయు మే మతనింజూచి మనోహర ప్రదేశాలోకంబునంజేసి తదీయచిత్తమట్లు వికృతి బొందినదని తలంచి కొంతసే పూరకుంటిమి.

ఎప్పటికిని రాకున్న మేము దాపునకుఁబోయి ఆర్యా! వేళ యతిక్రమించుచున్నది. స్నానము చేయుము. పయనమునకు సైనికులు మీరాక వేచియున్నారు. ఈ ప్రదేశ మెంతసేపు చూచినను జూడవలయుననియే యుండును. ఆలస్యము చేయకలెండని పలికిన మా మాటలు వినిపించుకొనక కదలక మాకేమియుఁ బ్రత్యుత్తరము జెప్పఁడయ్యెను. ఆ లతామంటపమును మాత్రము రెప్పవేయక నిశ్చలదృష్టితోఁ జూచుచుండెను.

పలుమారు మేము తొందరపెట్టుటయు నెట్టకేలకు మమ్ము జూడకయే "నేను రాను. మీరిందుండరాదు. అతండరిగి పెద్దతడవయినది. వేగము పొండని" పలుకగా విని అయ్యో! యీతం డకారణముగా వైరాగ్యమును జెందెనే! యని శంకించుకొనుచు సానునయముగా బోధించియు నిష్ఠురముగాఁ బలికియు నీకీ మోహము తగదు. వడిగా రమ్ము చంద్రాపీడుఁడు నిన్ను విడిచి వచ్చిన మమ్ము దండించునని యెన్నియో రీతులం జెప్పిన నెట్టకేలకు విలక్షణహాసయుక్తముగు మొగముతో మా కిట్లనియె.

ఇప్పుడు నాకేమియుం దెలియకున్నది. నన్ను మాటిమాటికి గమనమునకు మీరు బోధన చేయుచున్నారు. నేను చంద్రాపీడుని విడిచి యెప్పుడైన నుంటినా? అంతయు నాకెఱుక యగుచున్నది. కాని నేనేమియుం జేయలేను. తెలిసినను జేయుటకు శక్తుఁడఁ గాకుంటిని. చూచుచున్నను నాదృష్టి మఱియొకచోటికిఁ బ్రసరింపదు. పాదములు గదలవు. ఇచ్చట స్థాపనజేయఁబడినదివోలె నాతనువు కదలకున్నది. కావున నేను వచ్చుటకు సమర్థుఁడను కాను. నన్నొకవేళ మీరు బలాత్కారముగాఁ దీసికొనిపోయెదరేని నామేనఁ బ్రాణములు నిలువవని తోచుచున్నది. ఇచ్చటనే యుండినచో నాహృదయంబున నెట్లో యున్నది. ప్రాణములు ధరింతునని ధైర్యమున్నది. కావున మీరు నన్ను నిర్బంధింపకుఁడు. మీరుపోయి యావజ్జీవము చంద్రాపీడుని దర్శన సుఖంబను భవింపుఁడు నాకట్టి సుఖములేకుండ దైవము విడదీసెనని పలికిన ప్రేమదలుచు నదికై

తపమనుకొని అయ్యో! యిట్లు పలికెదరేల? చంద్రాపీడుని దాపునకు రారాయని నిర్బంధముగా పెక్కుసారు లడిగిన నతం డిట్లనియె.

అక్కటా! మీరూరక నన్ను నిర్బంధించెదరేల? చంద్రాపీడుని జీవితము తోడు! నాకేమియుఁ దెలియకున్నది. నేను వచ్చుటకు సమర్థుఁడనుకాను. కారణము నాకుఁ దెలియదు. మీరు చూచుచునే యడిగెదరేల? మీరు పొండు పొండని పలికి ముహూర్తకాలమూ కొని యందు రమ్యములైన లతాగృహములు సరస్తీరములు గ్రుమ్మరుచు నావేళాయతనమున నెద్దియో మరచిపోయినట్లు వెదకుచు నితరదృష్టి లేక తిరుగుచుండెను.

మేము పొదలమాటుననుండి రెండుయామములవరకు నతని చేష్టలం గని పెట్టి తిరిగిపోయి రమ్మని నిర్బంధింప నతఁ డయ్యో! నన్నిట్లు వేపెదరేల నాకు నా జీవితముకన్నఁ జంద్రాపీడుని ప్రాణములు ప్రియములు కదా! అని యతని విడిచి బలాత్కారముగా నాయొద్దకు వచ్చినను గార్యము లేదని తోచుచున్నది. ఇంక మీరేల నిలిచెదరు? పొండని పలికి లేచి యందు స్నానముచేసి కందమూలఫలము లాహారముగా బుచ్చుకొని వనవాసోచితవ్యాపారమును గైకొనియెను.

అప్పుడు మేము విస్మయమందుచు మూఁడహోరాత్రములు వేచి యుంటిమి కాని యతనిబుద్ధి తిరిగినది కాదు. అప్పుడు నిరాశలమై యందుఁ గొందర గావలియుంచి మేము బయలుదేరి వచ్చితిమి

అని యెఱింగించిన వారి మాటలు విని చంద్రాపీడుఁడు చింతా విస్మయము లొక్కమాటు చిత్తం బుత్తలపెట్ట నిట్లు తలంచెను.

అయ్యో! వైశంపాయనుని కింతలో వైరాగ్య ప్రవృత్తి బూనుటకుఁ గారణ మేమియుం గనంబడదు. తారాపీడుఁడు నన్నువలె వానినిసైతము గారవించును. ప్రజలకు సైతము నాయందుకన్న వానియందే మిక్కుటముగు మక్కువగలిగియున్నది. శుకనాసుఁడు మనోరమయు నతని నేవిషయములోను మందలించి యెఱుఁగరు. అతనికిఁ భ్రాంతికైన నిది సమయమునుకాదు ఇదివరకు విద్వజ్జనోచితమైన గార్హస్థ్యమందే ప్రవేశింపలేదు. ఇదియేమియో యని పెక్కు తెఱంగులఁ దలంచుచు నతివేగముగా నట్టేటికి బోవఁదలంచియు దల్లిదండ్రుల కెఱిగింపక పోరాదని నిశ్చయించి యప్పుడే తురగమెక్కి యత్యంతరయంబునఁ దనపట్టణమునకు వచ్చెను.

ఆ వీటిలో ప్రజలందరు గుంపులుగాఁ గూడుకొని వైశంపాయనుని వృత్తాంతమే చెప్పుకొనువారును, వినువారును, అడుగువారును, విచారించువారునై వీధులయం దుండుటఁజూచి చంద్రాపీడుఁడు అక్కటా! యీవార్త నాకన్న ముందర పట్టణములోనికివచ్చినది. మాతండ్రిగారికిని శుకనాసునికిగూడఁ దెలిసియేయుండును. వైశంపాయనునిగురించి బాహ్యజనంబే యింత విచారింపుచుండఁ దల్లిదండ్రుల కెట్లుండునో? ననేమని శంకింతురో యని పెక్కుతెఱంగులఁ దలపోయుచుఁ గ్రమంబున

బహిర్ద్వారము దాపునకుఁబోయి యందు గజ్జమును దిగి యాస్థానమునకుఁ బోవు చున్నంతఁ దారాపీడుఁడు విలాసవతితోఁగూడ శకనాశని గేహమునందున్న వాఁడను వార్త వినంబడినది.

అప్పు డతండును మరలి కానుగూడ నచ్చటికిఁ బోవుచుండఁ సమీపముగా నిట్టిధ్వని వినంబడినది.

హా! వైశంపాయనా? హా వంశపావనా! మదీయాంకసీమయందు లాలింపఁ బడుచుండెడి నీవిప్పుడు వ్యాళశతభీషణమయిన కాంతారములో నొంటిగా నెట్లుంటివి? అందు శరీరరక్షణ కెట్లు జరుగుచున్నది. నీకు నిద్రాసుకమిచ్చుశయ్య నెవ్వరు గల్పించు చున్నారు? నీయాకలి గనిపెట్టి యన్నమిడువారెవ్వరు? పట్టీ! ఏట్టియవస్థవచ్చినది. అయ్యో! నీవు వచ్చినతోడనే మీతండ్రితో జెప్పి తగిన కన్యను వివాహము జేయవలయు నని తలంచియుంటినే! మంగళాశ్వరాలనగు నాకట్టి యదృష్టమెట్లుపట్టును. నన్నును మీతండ్రిని నీవున్న చోటికి దీసికొనిపొమ్ము. నిన్నువిడిచి మేము క్షణమైనఁ దాళలేము. ఇంత నిష్ఠురత్వము నీవేటికి బూనితివి? చంద్రాపీడునిఁ విడిచి క్షణమైన నుండువాడవు కావే? తద్వియోగమిప్పు డెట్లు సైచితివి? ఆస్నేహమంతయు నేమయిపోయినది? నీవట్టి వైరాగ్యము బూనుటకుఁ గారణమేమి? అయ్యయ్యో! ఎంతవచ్చినది? ఏమిచేతును? పుత్రా! యని యీరీతి పెక్కు తెరంగులఁ బుత్రశోకంబున విలపించుచున్న మనో రమ గంఠధ్వని విని యతండు విహ్వలుఁడై మూర్ఛవోయి యంతలో దెప్పిరిల్లి క్రమంబునఁ దండ్రియొద్దకుఁబోయి యతనిం జూచుటకు సిగ్గుపడుచుఁ దలవంచుకొని నమస్కరింపుచు దూరముగాఁ గూర్చుండెను.

ఆ రాజు పుత్రుం జూచి బాష్పగద్గదస్వరుండయి వత్సా! చంద్రాపీడ! నీకు వైశంపాయనునియందు జీవితముకన్న నెక్కుడు ప్రీతియని యెఱుంగుదుము కాని యతనివృత్తాంతము వినినది మొదలు నాహృదయము నీయెడ ననుమానము జెందు చున్నదేమని పలికిన విని యతనిమాట లాక్షేపించుచు శుకనాసుం డిట్లనియె.

దేవా! అగ్ని చల్లబడినదనినను సూర్యుని సంధకారము గ్రమ్మినదనినను సముద్రదమింకినదనినను నమ్మవచ్చును కాని చంద్రాపీడుఁ డట్టి దోషమును జేయునని తలంపరాదు. కృతయుగావతారమని చెప్పనోపిన చంద్రాపీడుని సుగుణముల విమ ర్శింపక మిత్రఘాతకునిగా సూచించితిరేల? విచారింప వైశంపాయనుఁడే దుర్మదుఁ డని తలంచెదను. లోకంబునఁ బుత్రులంగనుట వంశవృద్ధికొరకుఁగదా! తండ్రి యానతిఁబూనక నేనెట్లు వైరాగ్యమును బూనుదునని యించుకంతయు వాని స్వాంత మునఁ బుట్టినదికాదే! అట్టి దుర్మార్గుని విషయమై దయదలుపఁ నేటికి? వాఁడు పెంచిన చిలుకవలె దేవరచేఁ బోషింపఁబడి యంతయు మరచి యిప్పుడు కృతఘ్నుఁడై విలంప విడిచివెళ్ళెనే? ఆత్మద్రోహము చేసిన వానితో మనకేమి? అప్రాపాత్రుని బనసను మనకు శోకమునకే కారణమైనది. అని పలికి కన్నీరు నించుచు నిట్టూర్పులనిగుడించెను.

అప్పుడు తారాపీడుఁడు దలయూఁచి యార్యా! యారడిల్లుము వ్యజనానిలముచేత వాయువును వృద్ధిఁజేసినట్లుకదా! మీకు మేము బోధించుట! బహుశ్రుతుండైనను బ్రాజ్ఞుండైనను వివేకియైనను ధీమంతుఁడైనను దుఃఖాతిపాతంబునఁ జిత్తచాంచల్యమందకమానఁడు. మనస్సు చెదిరినవానికేమియుం దెలియదుకదా! వైశంపాయను గురించి కోపావేశముతోఁ బలుకుచున్న నీమాటలు వినుటచే నాకు మిక్కిలి వ్యసనముగానున్నది. యతనియెడఁ గోపమును విడువుము. వాఁడు మిక్కిలి గుణవంతుఁడు. కారణమెఱుఁగక వాని నిందింపరాదు. చంద్రాపీడునంపి శీఘ్రముగా నిచ్చటికి రప్పించి యట్టి విరక్తి నేమిటికిఁ బూనెనో యరయుదముగాక! యరసినపిదప యథాన్యాయముగా నాచరింతమని పలికిన విని వెండియు శుకనాసుం డిట్లనియె.

దేవా! నీకు వైశంపాయనుని యందుగల మక్కువచే నిట్లనుచున్నావు. నీయౌదార్యమట్టిదియేకాని యువరాజునువిడిచి యాత్మేచ్ఛచే నుండుట గష్టమని పలికిన విని చంద్రాపీడుఁడు తండ్రియన్నమాట హృదయంబున ములికివోలె నాఁటియుండ గన్నీరునించుచు గూర్చుండియే మెల్లగా దాపునకుఁబోయి శుకనాసున కిట్లనియె.

ఆర్యా! వైశంపాయనుని విషయమై నావలన నేమియు దోసములేదని చెప్పకపోయినను నేనెఱుంగుదు. అయినను మా తండ్రిగారి కనుమానము దోచుచున్నదని పలికిరికదా! లోకులు నైతమట్లే భావింతురు. అసత్యమయినను లోకాపవాదము భరించుట గష్టము, అయశఃప్రసిద్ధి లోకంబున వ్యాపించెనేని పరలోకహాని కాగలదు. కావున దీనికిఁ బ్రాయశ్చిత్తముగా వైశంపాయనుని దీసికొని వచ్చుటకు నన్ను నియమింపుము. మఱియొకరీతి నాకు నిష్కృతిగలుగదు. తురగ యానంబునఁబోయిన నాకేమియు నాయాసము గలుగదు. గమనాభ్యనుజ్ఞ యిమ్ము. నేనుబోయి ప్రియమిత్రునిం దీసికొని వత్తును. అతండు రానిచో నేనునైత నచ్చటనే యుండెదనని పలికిన విని శుకనాసుఁడు తారాపీడునితో దేవా! యువరాజు గమనమునకు విజ్ఞాపన జేసికొనుచున్నవాఁడు. సెలవేమియని యడిగిననతం డిట్లనియె.

ఆర్యా! మనమొకటి దలంచికొనియుండ దైవము వేరొకటి తెచ్చిపెట్టెను. కానిమ్ము. వైశంపాయను నవశ్యముగా యువరాజు దీసికొనిరావలయును. అతని విడిచి యితఁ డొక నిమిషమైనఁ దాళలేఁడు. తప్పక పోవలసినదే. యతని దీసికొనివచ్చుటకు నాయుష్మంతుని మాట జెప్పనేల, విలాసవతినైనఁ బంపెదనుసుమీ! యని పలికి దైవజ్ఞులరప్పించి యప్పుడే ప్రయాణమునకు ముహూర్తము నిశ్చయించి పిమ్మటఁ జంద్రాపీడునిం జూచి రాజు వత్సా! నీవీవార్త మీ తల్లికిం జెప్పి వేగపొమ్మని పలుకుచు శుకనాసునితోఁగూడ దన భవనమునకుఁ బోయెను.

తరువాత నా రాజకుమారుఁడు తల్లియొద్దకుఁబోయి నమస్కరించుచు దాపునం గూర్చుండి మిక్కిలి విచారింపుచున్న మనోరమ కిట్లనియె. తల్లీ! నీ పుత్త్రుం

బున జింతిల్లకుము. వైశంపాయనుని దీసికొని వచ్చుటకు మా తండ్రి నా కానతిచ్చెను. నేను వెళ్ళి యనతికాలములో నాతనిం దెచ్చెదను. నీవుగూడ ననుజ్ఞయిమ్ము. పోయి వచ్చెదననుటయు నామె యిట్లనియె.

వత్సా ! నేను వెళ్ళెదనను మాటచే నాకు శోకోపశమనము జేసెదవేల ? నాకు నతనియందులన్న నీయందు మక్కువ మెండు. నీవు పోయిన నెవ్వరిం జూచి కొని ధైర్యమవలంబింతును ? నీవు పోవలదు. దైవానుగ్రహము గలిగినం దానే రాగలండు. లేక మరియెవ్వరినేని బంపుదుముగాక. యని పలికినవిని విలాసవతి యిట్లనియె. సఖీ ! మన యిరువురకు వారిరువురయందును సమానప్రేమ గలిగియున్నది. వానిం జూడక నేను మాత్రము సైరింపగలనా ! వారింపకుము. మనము వారించినను జంద్రాపీడుండు నిలుచువాడుకాడు. యనుజ్ఞ యిమ్మని పలికిన నక్కలికియు నెట్టకేలకు సమ్మతించినది.

అంతలో సాయంకాలమగుటయుఁ జంద్రాపీడుండు ఆ రాత్రి భోజనము చేసి తల్పంబున శయనించి సంకల్పశతములచే మనోరథములఁ బూరించుకొనుచు నిట్లు తలంచెను.

నేను ముందుగా నచ్ఛోద సరస్సునకుఁబోయి యందు వెనుక వెనుకగా నరిగి వైశంపాయనుని కంఠగ్రహణముచేసి నీవింకెందు బోవఁగలవని పలికిన నతండు నా మాట ద్రోయనేరక నాతో వచ్చునుగదా. పిమ్మట మహాశ్వేత యాశ్రమమున కరిగి యందుఁ బరిజనము నునిచి యామెతోఁగూడ హేమకూటమునకుఁ బోయెదను.

అందు నన్నుంజూచి కాదంబరి పరిజనము తొందరగా నిటునటు తిరుగుచు నమస్కరింపుచుండ నగ్రమంబునఁ గాదంబరి యున్న తావరసి యరిగిన నత్తరుణియు నా రాక సఖులచే నెరింగి తటాలున బుష్పశయ్యనుండి లేచి యత్యాతురముతో స్వాంగాలంకారముల సవరించుకొనుచు సిగ్గుచేఁ దలవంచుకొని శయ్యాసమీపంబున నిలువంబడియున్న యన్నారీలలామమునుగాంచి కన్నులకలిమి సార్థకము గావించెదను కదా.

తరువాత మదనలేఖను పత్రలేఖను గేయూరకుని యథోచిత గౌరవంబున మన్నించుచు సాహసముతో వివాహప్రయత్నము చేయుటకు జిత్రరథునకు వార్త నంపెదను.

పిమ్మట నా కొమ్మను శుభముహూర్తమునం బెండ్లియాడి బహువిధకుసుమ దామ భూషానులేపనాది వస్తుమండితమగు భవనంబునఁ బుష్పశయ్యపై మత్సమీపమున గూర్చుండి వయస్యలరిగిన వెనుక తాసును మొగమువంచి యవుగఁబోవు నయ్యంబున బలాత్కారముగా సందిటిలో నిమిడ్చికొని తల్పంబునఁజేర్చి పిమ్మటఁ బొదయం దిడుకొని యెడమచేతితోఁ గేశపాశము గైకొని కుడిచేతితో నధరము పుడుకుచుఁ గపోలములఁ జుంబించుచు సురలకు సైతము దుర్లభమగు నధరామృతము తనివితీరఁ గ్రోలెదను.

అంత నింతింతనరాని సంతసముతోఁ గంతుసంతాపమునఁ గృశించియున్న యవయవములకు గాఢాలింగన సుఖరస భరంబున నుబ్బుగలుగఁ జేయుచుఁ దరువాత నా నాతితోఁగూడ మదనాగ్ని నార్పునదియు నింద్రియములకు సుఖమిచ్చునదియుఁ బెక్కుసారు లనుభవించుచున్న దైనను గ్రొత్తదానివలె దోచునదియు నిట్టిదని చెప్పుటకు నలవి కాని సంతోషము గలుగఁజేయునదియు నిర్వాణ సుఖసాదృశ్యము గలదియు నచింత్యమయినదియు నగు సుఖ మనుభవించుచు నిమిషమైనను విడువక రమ్యప్రదేశములఁ గ్రీడింపుచు యౌవనమునకుఁ దృప్తిగలుగఁజేసెదను.

ఆ రీతిఁ గాదంబరికి సంతోషము గలుగఁజేసి మదనలేఖను వైశంపాయనునకుఁ బెండ్లిచేసెదను. అని యిట్లు పెక్కుతెరంగుల నంతరంగమ్మునఁ దలపోయుచు మేను గరుపుజెంద నప్రభూతుఁడైన వాఁడుంటోరె నా రాత్రి నిద్దురంబెందక త్రుటి లాగున గడిపి యుదయంబున లేచి సముచిత పరివారంబు సేవింప నింద్రాయుధ మెక్కి యక్కుమారుం డప్పురము వెడలి కతిపయప్రయాణంబుల నచ్ఛోదసరస్తీరము నకుఁ బోవుచు నించుకదూరములో నెదురుపడిన మేఘనాధునింజూచి యత్యాతురముగా నిట్లనియె.

మేఘనాధా ! అచ్ఛోదసరస్తీరంబున నీకు వైశంపాయనుఁడు కనంబడి యెనా ? చూచి మాటాడితివా ? ఏమనియెను ? ఇప్పటి కైనం బశ్చాత్తాపముఁజెంది యింటికి రావలయునని తలంచుచున్నవాఁడా ! నామాట యేమైనం దెల్పెనా ? యతనికి తల్లిదండ్రులు జ్ఞాపకముండిరా ? యని యడిగిన నతం డిట్లనియె.

దేవా ! దేవర ఇదిగో నేను వైశంపాయనునితో మాటాడి నీ వెనుకనే వత్తునని చెప్పితిరి కదా ! మేమటుపోయి మీ రాక వేచియుండ నెప్పటికి వచ్చితిరి కారు. అప్పుడు పత్రలేఖయుఁ గేయూరకుఁడు నన్నుఁ జూచి మన చంద్రాపీకుని వర్షాకాల మగుటచేఁ దల్లితండ్రులు రానిచ్చిరి కారు. నీ విచ్చోట నొక్కరుఁడ వుండనేల ఇంటికిఁ బొమ్మని పలికి వారిరువురు హేమకూటమునకుఁ బోయిరి.

నేను మరికొన్ని దినములందుండి తిరుగా నింటికి వచ్చుచున్నవాఁడ నింతియకాని వైశంపాయనుని వార్త నాకేమియుం దెలియదు. అతం డచ్ఛోదసరస్సునకుఁ బోవుటయే నేనెరుఁగనని చెప్పినవిని యా రాజకుమారుఁడు వెండియు వానితో నోరీ ! అట్లయిన సరియేకాని పత్రలేఖ యిప్పటికి హేమకూటము జేరునో లేదో చెప్పఁ గలవా ? యని యడిగిన వాఁడిట్లనియె.

దేవా ! దైవికమైన యంతరాయమేదియు రాకుండిన నది యాలస్యము చేయునదికాదు. కావున నేటిఁ కటోప్పటిఁ హేమకూటము జేరుననియే, నాయభిప్రాయము. అని చెప్పిన సంతసించుచుఁ జంద్రాపీడుఁడు వానితోఁ గ్రమంబున వైశంపాయనునిం జూచు వేడుకతో నచ్ఛోదసరస్సునకుఁ బోయి యందు గుర్రపురౌతుల కిట్లనియె.

వైశంపాయనుఁడు వైరాగ్యవృత్తింబూని యీ వనములో నెచ్చటనో

యడఁగియున్న వాఁడు. మనలను జూచి పాఱిపోవును. కావున మీ రందరు గుఱ్ఱముల నుండియే లతాగహనములను తరుమూలములు లతామంటపములు మొదలగు ప్రదేశము లలో విమర్శగా నరయుఁడని పలుకుచుఁ దాను మిక్కిలి శ్రద్ధాపూర్వకముగా నతని వెదకెనుకాని యెందును అతనిచిహ్నము లేమియుం గనంబడినవికావు.

అప్పు డతండు పెక్కు తెఱంగులఁ జింతించుచు వైశంపాయనుని వార్త మహాశ్వేతకేమైనం దెలియునేమోయనియుఁ గాదంబరికి విశేషములుగూడఁ దెలియబడు ననియు నూహించి తురగసైన్యమంతయు దదీయాశ్రమమున కనతిదూరంబున నుండ నియమించి సముచితపరివారముతోఁ దానింద్రాయుధమెక్కి యామె యాశ్రమమునకుఁ బోయి గుహాముఖంబున వారువమును డిగ్గి సన్నని పత్రముల దాల్చి యక్కుండరాంతరమునకుఁ బోయెను.

అందు శోకవేగంబున నవయవంబులు చలింప గన్నులనుండి ధారగా నీరుగార్చుచుఁ గాలివానతాకుడున వాడినలతిగెయుంబోలె మొగమువంచి తరళికకేలు బట్టుకొనఁబడియున్న మహాశ్వేతఁ జూచి యతండు విభ్రాంతుండై అయ్యో! కాదంబరి కేద్ది యేని యప్రియము జరిగియుండఁబోలుఁ! గానిచో నిమ్మానిని యిట్లుండదు. ఏమి దైవమా! యని ప్రాణంబులెగిరిపోయినట్లు సారెసారెకుఁ దొట్రుపడుచు మెల్లగాఁ దాపు నకుఁ బోయి బోటీ! యీమె యిట్లున్న దేమి? యని తరళిక నడిగిన నప్పడతియు నేమియుం జెప్పక యట్టి యవస్థలోనున్న మహాశ్వేత మొగము జూచినది. అప్పుడా సాధ్వియే క్రమంబున శోకవేగం బడంచుకొని గద్గదస్వరముతో నన్నరవగసూతి కిట్లనియె.

మహాభాగ! సిగ్గులేని యీపాపాత్మురాలేమిటికి జెప్పకుండును? వినుండు. కేయూరక ముఖముగా భవదుజ్జయినీగమన వృత్తాంతమును విని మనమెఱియ అయ్యో! మదిరాచిత్రరథుల మనోరథమును దీర్పలేక పోయితిని. కాదంబరికోరికయు సఫలము చేయలేకపోయితిని. యారాజకుమారుని యభీష్టము తీర్చినదికాదు. నేనువచ్చి యేమిచేసితి నని సిగ్గుపడుచుఁ గాదంబరీ స్నేహపాశములంగోసి వెండియు దపంబుజేయుటకై యీ యాశ్రమమునకువచ్చి యిచ్చట దేవరఁబోలియున్న యొక్క బ్రాహ్మణకుమారుం డెద్దియో వెదకుచున్నట్లు శూన్యహృదయుఁడై నలుమూలలు జూచుచుండ గంటిని.

అప్పు డతండు నాయొద్దకు మెల్లగావచ్చి యదృష్టపూర్వుండై నన్ను నెన్నఁడో యెఱిఁగిన వాడుంబోలె నాముఖము రెప్పవాల్పక చూచుచు నా కిట్లనియె.

శోభనాంగి! లోకంబున నెవ్వరును జన్మకును వయసునకును రూపము నకును దగినట్లు మెలంగిరేని నిందాపాత్రులుకారు. నీవట్లుగాక తగని వ్రతమును చేయుచుంటివేమి? కుసుమసుకుమారమగు నీమైదీగె నుత్కృష్టతపశ్చరణక్లేశంబున నిట్లు వాడఁజేయనేమిటికి? సుమనోమనోహరంబగు లతయుంబోలె నీయాకృతి ప్రాయము నకుఁ దగినయట్లుగా రసాశ్రయమగు ఫలముతోఁ గూడుకొనకుండుట లెస్సయే. తపంబు

పరలోకసుఖప్రదంబు. రూపగుణహీనులు సైత మైహికసుఖంబు లనుభవించుచుందురు. ఆకృతిమంతులమాటఁ జెప్పనేల ? తుషారబిందుపాతంబున పద్మినీలతయుంబోలె స్వభావసుందరమగు నీశరీరమిట్లు తపఃక్లేశంబునం గృశియించుట జూచిన నాకు మిక్కిలి విచారమగుచున్న యది. మఱియొక నీవంటివాండ్లందఱే యింద్రియసుఖంబుల నిరసించి వైరాగ్యమును బూనియుండ నిఁక దర్పకుని పుష్పసాయక ధారణము వ్యర్థము సుమీ! చంద్రోదయముతోఁ బనియేమి ? వసంతమలయానిలములరాక నిరర్థకమే ! కువలయ కల్హార కమలాకర విలసనములు నిష్ప్రయోజనములు మనోహరోద్యాన భూము లెవ్వరికిఁ గావలయునని పెక్కు తెరంగుల వక్కాణించెను.

పుండరీకునికథ జరిగినది మొదలు నేనుత్సాహముడిగి యుంటిని కావున వానిమాటలువిని నీవెవ్వఁడవు? నీ పేరేమి? నీవృత్తాంతమెట్టిది? నన్నిట్లు పలికెదవేల యని యడుగకయే యచ్చటినుండి మఱియొకచోటికి బోయి దేవతార్చన పుష్పములం గోయుచున్న తరళికం జీరి యిట్లంటిని.

తరుణీ! యీతరుణుండెవ్వఁడే ? వీని యాకారముఁజూడ బ్రాహ్మణకుమారుఁ డట్లతోచుచున్నయది. నన్నుజూచినంత వీనిస్వాంతమున వెఱ్ఱి చేష్ట లంకురించుచున్నయవి. కావున వాని నిచ్చటికి రాకుండునట్లు చేయుము. కూడఁ గూడ తిరుగుచున్న వాఁడు. నివారించినను వచ్చెనేని తప్పక యమంగళమును జెందగలఁడని పలికితిని.

అదియు నతనితోఁ దగినట్లు చెప్పినది కాని మదనహతకునివృత్తి దుర్నివార్యమైనదగుటచే వానిచిత్తము మరలినదికాదు.

మరికొన్నిదినములు గడచినంత నొకనాఁడురాత్రి జ్యోత్స్నాపూరముచే జగంబంతయు నిండియుండ సంతాపంబువాయ నేనొక శిలాతలంబున శయనించి మంద మందముగా నచ్ఛోదానిల పోతములు వీచుచుండఁ బుండరీకుని వృత్తాంతమే స్మరించుకొనుచు నిద్రపట్టమిం జేసి యిందుబింబవిలాస మరయుచుఁ గన్నులుమూయక యట్టె చూచుచుంటిని.

అట్టిసమయమున నా బ్రాహ్మణకుమారుఁడు మదనావేశితహృదయుండై మెల్లగా నడుగులిడుచు నాయొద్దకువచ్చెను. నిస్స్పృహురాలనైనను వానిఁజూచినంతనే స్వాంతమున భయము జనింప నిట్లు తలంచితిని. అయ్యో! మంచియాపద తటస్థించినదే ! వీఁడు నన్నుముట్టినంత మాత్రమునఁ బ్రాణములు విడువవలసినదేకదా. పుండరీకునిరాక నిరీక్షించి యిన్నిదినములు ప్రాణములు దాల్చినది వ్యర్థమైపోవునే యని యాలోచించుచున్న సమయమున నతండు నాదాపునకువచ్చి యిట్లనియె.

ఇందుముఖీ! కందర్పునితోఁగూడ నన్నిప్పు డీచందురుఁడు చంపుటకుఁ బ్రయత్నించుచున్నవాఁడు కావున నిన్ను శరణు జొచ్చితిని. అనాధునాతుస్ నప్రతీకారాతు భవదాయత్తు నన్ను రక్షింపుము. శరణాగత పరిత్రాణము తపస్విజన

ధర్మమేకదా. నీవిప్పుడు నన్నాత్మ ప్రదానంబున రక్షింపవేని తప్పక నీకు బ్రహ్మహత్యాపాతకము రాఁగలదని పలికెను.

దానిమాటలు విని నేను రోషానలంబున భస్మము చేయుదానివలె బాష్పస్ఫులింగదృష్టిచే వానింజూచుచు నావేశించిన దానివలె నొడలెఱుంగక కోపవేగ రూక్షాక్షరముగా హుమ్మనిపలుకుచు నిట్లంటి.

ఓరీ పాపాత్ముడా ! నన్ను నీవిట్లనిన నీతల పిడుగుపడినట్లు నూఱువక్కలయినదికాదేమి ? నీజిహ్వ లాగికొనిపోలేదే ? సకలలోక శుభాశుభ సాక్షిభూతములగు పంచభూతములు నీయందులేవాయేమి ? వాని చేతనయిన మడియవైతివే ? మూఢుఁడా! ఇట్టి కామవృత్తి గలిగిన నీవు తిర్యగ్జాతియందు బుట్టక యిట్లేల పుట్టితివి ? వక్రముఖానురాగము కలిగి స్వపక్షపాతమాత్ర ప్రవృత్తితో నొప్పుచు స్థానాస్థాననిరూపణవిధంబెఱుంగక చిలుకవలె హతవిధిచేఁ బలికింపఁబడితివి. శుకజాతియందైన బుట్టకపోయితివేమి ? అత్మవచనానుగుణమగు జాతియందుఁ బుట్టితివేని యిట్లు నన్నుఁ గామింపఁబోవుదువు కదాయని పలుకుచుఁ జంద్రమండలమున దృష్టియిడి దేవా ? సకలలోకచూడామణీ ! లోకపాలా ! నేను బుండరీకునిఁ జూచినది మొదలు యితర దృష్టిలేక యతనినే ధ్యానించు దాననైతినేని వీఁడు నా మాటచే హీనజాతియందుఁ బుట్టునని పలికితిని.

అప్పుడతండు మదీయశాపముననో మదనజ్వర వేగముననో పాప విపాకముననో తెలియదుకాని నేనట్లు పలికినతోడనే నరకబడిన తరువులవలెఁ జేతనముబాసి నేలంబడియెను అతండట్లు గతాసుండగుటయుఁ దత్పరిజనము పెద్దయెలుంగున రోదనము జేసెను. అయ్యాక్రందనము వలననే యతండు దేవర మిత్రుఁడని తెలియవచ్చినదని పలికితలవంచుకొని మిక్కుటమగు నశ్రుధారచే భూమినిఁ దడిపినది.

అట్టి మాటలు విని చంద్రాపీడుఁ డాకర్ణాంత విశాలమగు నేత్రములు మూయుచు, భగవతీ ! కాదంబరితో నన్ను గూర్చుటకు నీవు తగిన ప్రయత్నము చేసితివి. మందభాగ్యుండనగు నా కట్టి యోగ్యత లేనప్పుడు నీవేమి చేయగలవు ? ముందుజన్మమునకైనఁ గాదంబరీ చరణ పరిచర్యాసుఖము గలుగునట్లనుగ్రహింపుమని పలుకుచునే హృదయము భేదిల్లినట్టై నిలువంబడి ప్రాణములు విడిచెను.

చంద్రాపీడుఁడు వయస్యుని మరణవార్తను వినినతోడనే డెందము పగిలి జీవితము వాయుటఁజూచి తరళిక మహాశ్వేతను విడిచి యతనిం బట్టుకొని అయ్యో ! చేడియా ! యింకను సిగ్గేమిటికే ? యీతఁడు ప్రాణములను విడిచినట్లు తోచుచున్నది. మెడనిలుపక వాలవైచెను. చూడుము. శ్వాసమారుతము లేశమును వెడలుట గనంబడదు. కన్నులు మూయఁబడియున్నవి ? హా ! చంద్రాపీడ ! కాదంబరీప్రియ ! యిప్పుడిప్పుడతిని విడిచి యేడకుఁ బోయితివి. యా ప్రేముడియంతయు నెందుఁబోయె

నని పెద్ద యెలుంగున నేడ్చుచుండఁజూచి మహాశ్వేతయు నతని మొగమునఁ జూడ్కి నిలిపి వైవర్ణ్యమును గనిపెట్టి గాఢశోకంబున జేష్టతక్కి పడియుండెను.

అప్పుడతని పరిజనము మా వృత్తాంతమెఱింగి హాహాకారములతోఁ బెక్కు తెరంగుల నమ్మహాశ్వేతను దూఱుచు నుచ్చస్వరంబున హా! రాజకుమార! హా! వైశంపాయన! హా! తారాపీడ! హా! శుకనాస! హా! విలాసవతీ! హా! మనోరమ! మీ కెట్టి యాపద సంప్రాప్తించినది. కటకటా! ప్రజలెంత భాగ్యహీను లయ్యెయ్యో! ధరిత్రి యనాథయయ్యెఁ గదాయని యనేక ప్రకారంబుల విలపింపఁ దొడంగెను.

అతని గుఱ్ఱము దైన్యముగా సకిలింపుచు బలుమారతని మోము చూచుచు ఖురపుటాఘాతంబున భూతల రేణువు లెగర విచారంబుసూచింపుచుఁ జిందులు ద్రొక్కఁ దొడంగినది.

అని చెప్పువరకు వేళ యతిక్రమించుటయు మణిసిద్ధుండు పై మజిలీ జేరి తదనంతర వృత్తాంతమిట్లు చెప్పందొడంగెను.

—:●:—

శ్రీరస్తు

# కాశీమజిలీకథలు

వత్సా! వినుము. అంతనక్కడఁ గాదంబరియు బత్రలేఖచే చంద్రాపీడాగమన వృత్తాంతము విని చంద్రోదయంబున సాగరవేలయుంబోలె నలరుచుఁ దల్లిదండ్రుల కెద్దియో మిషజెప్పి వెండియు సుందరముగా నలంకరించుకొని పెక్కండ్రు పరిచారికలు సురభిమాల్యానులేపనాద్యుపకరణములు గైకొని తోడరాఁ గేయూరకుడుఁ మార్గము జూపఁ బత్రలేఖకై దండగొని నడుచుచు మదనలేఖతో బోఁటీ! యీ పత్రలేఖ చెప్పిన మాటలు వింటివా? అతని విషయమై నేను యశ్రద్ధ జేసితినఁట. నా యవస్థయంతయుఁ జూచియు హిమగృహంబున నైపుణ్యముఁగా బలికిన యతని వక్రభాషితములు నీకు జ్ఞాపకములేదా? నీవు నైతమప్పుడు నవ్వుచుఁ జూచి యతని మాటలకుఁ దగినట్లు ప్రత్యుత్తరము జెప్పితివి. అట్టివాఁడిప్పుడు మాత్రము నన్ను విమర్శించునా?

పయనము మాట దలపెట్టక పాపము నా నిమిత్తమీ మత్తకాశిని యుత్తలపడుచున్నదని చిత్తంబునం దలంచుచున్నవాఁడు గాబోలు! కానిమ్ము! నేనతనింజూచి యేమియు మాట్లాడను. పాదంబులంబడినను గ్రహింపను. మదనలేఖా! నీవిప్పుడు నాతో నేమియుం జెప్పవద్దుసుమీ! పెద్దతడవు చిక్కులుపెట్టి పిమ్మట మాట్లాడెదనని యతని గురించిన మాటలే చెప్పుకొనుచు మార్గమున వేగము గుఱుతెఱుంగక క్రమంబున జంద్రాపీడుని జూడ మిక్కిలి తొందరపడుచు నమ్మహాశ్వేతాశ్రమమునకు వచ్చెను.

అట్లు వచ్చి యందు అమృతరహితమగు సముద్రంబు చందంబున నున్న గతజీవితుండై పడియున్న చంద్రాపీడునింజూచి కాదంబరి హా! ఇది యేమి కష్టమని మూర్ఛాక్రాంతస్వాంతయై నేలం బడుచుండ మదనలేఖ తటాలునఁ బడకుండ బట్టుకొనినది. పత్రలేఖయుఁ గాదంబరి యొక్క కైదండ విడిచి మోహావేశముతో నొడలెఱుంగక నేలంబడిపోయినది.

కాదంబరియుఁ గొంతసేపటికి దెప్పిరిల్లి మూఢయుంబోలె నేమియు నెఱుంగక యూర్పులు విడుచుట సైతము మరచి రెప్పపాటు లేక నిశ్చలతారకలతో నతని మొగమే చూచుచు వ్రాయఁబడిన ప్రతిమవలె కదలక యట్టె నిలిచియుండం జూచి మదనలేఖ యామె పాదంబులఁబడి సఖీ! నీవి శోకమును విడువుము. స్వభావమృదు సరసమగు నీ హృదయము అతివృష్టి ధారంబున వచ్చిన తటాకమువలె భేదిల్లును సుమీ! ఈతండు చైతన్యంబుబాసి పరలోకమున కరిగినట్లు తోచుచున్నది. ఇంక వీనికొరకుఁ జింతింపనేల? యింటికింబోయి తల్లిదండ్రుల కామోదము గలుగఁ జేయుము. నిన్నుఁజూడక వారు నిముషము తాళలేరని పలికిన విని కాదంబరి నవ్వి యవ్విద్రుమోష్ఠి కిట్లనియె.

ఓసి వెర్రిదానా! నా హృదయమును మృదువుగా జెప్పుచుంటివేమి? వజ్రసారకఠినమైనది. కాకున్న నిట్టి యవస్థఁజూచియు బగులకుండునా? మఱియు జీవించువారికిగదా తల్లిదండ్రులు బంధువులు పరిజనము కావలయును. నాకిక వారితో బనియేమి? స్వర్గగమనోన్ముఖుఁడైన వీనికి నమంగళముగా నేను రోదనముగూడ జేయను. పాదధూళియుం బోలెఁ బాదముల ననుసరించియే పోయెదను. ఎవ్వనికొరకు కులమర్యాద విడిచి ధర్మము గణింపక తల్లిదండ్రుల లెక్కసేయక జనాపవాదము నిరసించి సిగ్గువిడిచి వయస్యల గష్టపెట్టి మహాశ్వేతను గురించి చేసిన శపథము సైతము పరామర్శింపక ప్రవర్తించితినో యట్టివాఁడు నా నిమిత్తము ప్రాణములు విడువ నాయసువుల నెట్లు పాలించుకొందునో చెప్పుము. నాకిప్పుడు మరణమే శ్రేయముగా నున్నది. నాయెడ నీకుఁ గనికరమున్నయెడ నా చెప్పిన చొప్పున జేయఁ బూనుకొనుము. వినుము.

గీ. శూన్యమగు నాదు భవనంబు జూచి చూచి
సఖులు పరిచరులును బంధుజనము లెట్లు

వగవకట పెద్కఁ బూర్వంబువలె మెలంగు
దురొ యటులు సేయుమిదియ నాకరయ హితము.

క. నాదగు భవనాంగణమున
బోదివెలయనొప్పు చూతపోతకమునకుం
బైఁ దనరు మాధవీలత
కాదరమునఁ బెండ్లిసేయు మనుకొనినగతిన్.

సీ. పదకటింటను దల్పప్రక్కఁగట్టిన కామ
పటము వ్రక్కలుచేసి పారవేయు
యువిద ! ముద్దుగఁ బెంచుచున్న నా లేడి పి
ల్లను విడు మొక తపోవనమునందు
గలికి ! నా క్రీడానగము నాశ్రమముగాఁగ
నర్పింపుమొక్క మహాతపస్వి
కలివేణి ! శుకశారికల స్వేచ్ఛవిహరింప
విడువుము నా మేని తొడవులెల్ల.

గీ. విప్రకాంతల కిమ్ము నా వీణ నీవు
పుచ్చుకొని పాడుకొనుచుండు మిచ్చవచ్చి
నట్లు చేయుము తక్కిన యన్ని వస్తు
వులను నాకుఁ బ్రియంబుగాఁ జెలియ నీవు.

మ. రమణి ! మదీయపాదతల రంజితమైన యశోకభూజపో
తము జిగురించె నిప్పుడది తత్కిసలంబుల నేరుకఁజన్ పూ
రమునకు నైన ముట్టుకొనరాదు సుమీ ! మరిమాలతీలతా
సుమముల దేవతార్చనకేసూ ! లవసం బొనరింపఁగాఁదగున్.

క. ఆ వనిమానుషి తాపసిఁ
బో విడువుము కానకేసు బోషించెదు నా
జీవం జీవక మిథుము
గావంగాఁదగును కేళికాశైలమునన్.

మరియు నాపాదసహచారి యగు హంసకమున కొకరివలన నపాయము లేకుండ రక్షించుచుండుము. ప్రాణసఖి! నీవేనాకుఁబుత్తుండవై పరలోకగతనగు నాకుఁ జలాంజలు లొసంగుచుండుము. నేనీచంద్రాపీడుని కంఠమును గౌఁగలించుకొని ప్రాణం

బుల విడుచుదాన నని పలుకుచు నాప్రాంతమందు నిశ్చేష్టితయై పడియున్న మహాశ్వేతను గౌఁగలించుకొని మరియు నిట్లనియె

ప్రియసఖీ! నీవు ప్రియుండు వెండియు వచ్చునని మరణముకన్న నెక్కుడగు నిడుములంబడుచుఁ బ్రాణములఁదాల్చి యాసతో నుంటివి. నాకట్టి యాసయైన నుంచుకొన నవసరము లేదుకదా! కావున నాకు మరణమునకు ననుజ్ఞ యిమ్ము. జన్మాంతర మందైన నీ స్నేహము గలుగునట్లు కోరుచున్నదాన నాతప్పుల మన్నింపుమని పలుకుచు లేచి వనకుసుమ కిసలయములచే నతనిపాదము లర్చించి హస్తములచే నెత్తి తొడయం దిడుకొని కూర్చుండెను.

అప్పుడు తత్కరసంపర్కంబునంజేసి చంద్రాపీడుని దేహమునుండి యమృతతేజం బొండు బయలువెడలి యా ప్రాంతమంతయుఁ దుషారమయము గావింపుచు నంతరిక్షములోఁగలసి యశరీరముగా నిట్లు పలికినది.

కాదంబరీ! నీవు చింతింపకుము. చంద్రాపీడుఁడు శాపదోషంబునఁ బ్రాణములఁబాసెను. వీని శరీరమును విడువక నీవు కాపాడుచుండుము. శాపాంతమందుఁ బ్రగమ్మరజీవించు నీ శరీరమున కగ్నిసంస్కారము చేయవలదు నీ కరసంపర్కంబునఁ దేజంబు దప్పక యట్లే యుండునని పలికిన విని యందరు శిరములెత్తి రెప్పలువాల్పక గగనమును జూడఁదొడంగిరి

అప్పుడు పత్రలేఖయుఁ దన్తేజస్పర్శశీతలత్వమునం దెప్పిరిల్లి లేచి యావేశించిన దానివలె పరుగిడి యింద్రాయుధము కళ్ళెము పట్టుకొని చంద్రాపీడుఁడు లేక మనమేటికని పలుకుచు నా తురగమును లాగికొని పోవుచు దానితోఁగూడ నచ్ఛోదసరస్సులో దుమికెను.

ఆ వెంటనే యా సరస్సులోనుండి తాపసకుమారుం డొకండు బయలు వెడలి దూరమునుండి చూచుచున్న మహాశ్వేతదాపునకుఁబోయి శోక గద్గదస్వరముతో గంధర్వరాజపుత్రీ! నన్నెరుంగుదువా? యని యడిగెను.

అప్పు డప్పడతియు శోకానంద మధ్యవర్తియై తొందరగా లేచి యతనికి నమస్కరించుచు దేవా! కపింజల! పాపాత్మురాలనగు నేనిట్లు సిగ్గులేక పుండరీకుఁడు స్వర్గగతుఁడైనను జీవించియుంటిని. అతం డెచ్చటికిఁబోయెను. ఎందుండెను? నీవెప్పుడైనఁ జూచితివా? యాతనివిడిచి నీ వొక్కరుండవు వచ్చితివేమని యడిగెను.

అప్పుడు చంద్రాపీడుని పరిజన మతనిం జుట్టుకొని వింతగాఁ జూడఁ దొడంగెను. పిమ్మటఁ గపింజలుఁ డామెతో నిట్లనియె.

# కపింజలుని కథ

గంధర్వరాజపుత్రీ ! వినుము. నీవట్లు శోకసాగరంబున మునింగియుండ గగనవాణి ననుసరించి నే నెగిరితినికదా! అతండు నాకుఁ బ్రత్యుత్తర మియ్యకయే యాకాశమార్గంబునఁ బోయిపోయి క్రమంబునఁ జంద్రలోకమునకరిగి యందు మహోదయంబను పేరుగల సభయం దొప్పుచున్న పర్యంకంబున నా పుండరీక శరీరమును పదవైచి నాకిట్లనియె

కపింజలా! నన్నుఁ జంద్రునిగాఁ దెలిసికొనుము. నేను జగదుపకారమునకై యుదయించి ప్రకాశింపుచుండ నీ ప్రియమిత్రుఁడు పుండరీకుఁడు కామాపరాధంబున శరీరమును విడుచుచు నన్నుఁజూచి యిందు హతకా! నీ కతంబున నేను ప్రియాసమాగమసుఖం బనుభవింపకయే ప్రాణముల విడుచుచున్నవాఁడ గావున నీవుసైత మిట్లే కర్మభూమియైన భారతవర్షంబునం జనియించుచు జన్మజన్మకు ననురాగముగలిగి ప్రియాసమాగమసుఖం బనుభవింపక తీవ్రమైన విరహవేదన ననుభవించి మృతినొందఁగలవని శపించెను.

అప్పుడు నేను అయ్యో! అపరాధమేమియు లేకయే నన్నిట్లు శపించితివేల నని కోపాగ్ని ప్రజ్వరిల్ల నతనిం జూచుచు నాయట్టి కష్టముల నీవుగూడ ననుభవించుమని క్రమ్మర శపించితిని

అంతలోఁ గోపమడంచుకొని వివేకబుద్ధిచే విమర్శింపుచు మహాశ్వేత మత్కిరణసంజాతమగు నప్సరఃకులంబునఁ బుట్టినఁ గౌరివలన జనియించినది. దానం జేసి నాకాప్తురాలుగదా! అమ్మహాశ్వేతచే వరింపఁబడిన నిమ్మునికుమారుఁడుసైతము బంధువుఁడేయగును. నిష్కారణము శపించితినే కానిమ్ము. జన్మజన్మకు నని పలుకుటచే రెండుజన్మములెత్తినఁజాలు. నాతోఁగూడ నితఁడు మర్త్యలోకంబున రెండుసారులు జనియించునని తలంచుచు శాపదోష మంటక నిట్లనియె.

పూర్వ మతని శరీరము గ్రహించి యశరీరవాణిచే మహాశ్వేత నూరడించుచు నిచ్చటికి వచ్చితిని. ఇది పుండరీకుని శరీరము, శాపాంతమువరకు నిచ్చటనే యుండును. నీవుపోయి యీ వృత్తాంతము శ్వేతకేతున కెఱిగింపుము. అమ్మహాను భావుఁ డెద్దియేని ప్రతిక్రియఁ జేయనోపునని పలికి నన్ను విడిచెను.

అప్పుడు నేను మిత్రశోకంబున నంధుండుబోలె గీర్వాణమార్గంబున బరుగిడుచుఁ జూడక యొక వైమానికునిం దాటితిని.

దాన నతండు కోపించి నన్నుఁ జురచురం జూచుచు దురాత్మా! మిథ్యా తపోబల గర్వితా! మిక్కిలి విస్తీర్ణమగు గగనమార్గంబున గుఱ్ఱమువలె నన్ను దాటితివి. నీ కెందును జోటు దొరికినదికాదు కాబోలు. కానిమ్ము. నీకిట్లు దాటుట యుత్సాహమని తోచుచున్నది నీవు తురంగమై భూమియందు జనింపుమని శపించెను.

అప్పుడు నేను గన్నుల నీరుగార్చుచు నంజలిఘటించి, దేవా! నేను మిత్ర శోకాంధత్వంబున నిన్ను దాటితినిగాని తిరస్కారభావంబునంగాదు. అనుగ్రహించి యాశాప ముపసంహరింపుమని వేడుకొనుటయు నతండు వెండియు నిట్లనియె.

ఆర్యా ! నా శాపము త్రిప్పనలవికాదు. నీవు గర్భమవై యెవ్వని వహింతువో వాని యవసానమున స్నానముచేసినంత ముక్తుండవయ్యెద. ఇదియే నాచేయు నుపకారమని పలికిన నే నిట్లంటి.

దేవా ! అట్లయిన నేనొండు విజ్ఞాపనజేయుచున్నవాఁడ శాపదోషంబున నా మిత్రున కిప్పుడు చంద్రునితోఁగూడ బుడమియందుఁ బుట్టవలసియున్నది కావున దేవర దివ్యదృష్టిచేఁజూచి యశ్వజన్మమందు సైత మతనిఁ గలసి కాలముగడుపునట్లనుగ్రహింపుము. ఇదియే నా కోరికయని పలికిన విని యతం డొక్కింత విచారించి యిట్లనియె.

ధాత్రి నుజ్జయినీపురంబున నపత్యమునకై తపంబుజేయుచున్న తారాపీడునకుఁ బుత్రుండై చంద్రుం డుదయించును. నీమిత్రుండు పుండరీకుండును దదమాత్యుండైన శుకనాసునికి జనియించుం గావున నీవా రాజపుత్రుని యశ్వరత్నమై యుదయింపుము. నీయందుఁగల ప్రేమచే నింత దలంచితి పొమ్మని పలికినతోడనే నేనదో భాగముజూచి సముద్రములోఁబడి యశ్వమై పుట్టితిని. అట్టి జన్మమునందుగూడ నాకు జాతి జ్ఞానముకలదు. కావున నశ్వముఖమిథునము గనంబడినతోడనే వెంటంబడి యీ భూమికిదీసికొనివచ్చితిని. చంద్రాపీడుఁడు చంద్రుని యవతారము. పూర్వజన్మానురాగంబున నిన్నభిలషించి నీశాపాగ్నిచే దగ్ధుండైన వైశంపాయనుఁడే పుండరీకుఁడని పలికి యూరకుండెను.

ఆ మాటవిని మహాశ్వేత, హా ! దేవ ! హా ! పుండరీక ! నీవు లోకాంతర గతుండవైనను నిన్నే స్మరించుచుంటిని ? ఈ రక్కసితో నీకేమి ప్రయోజనమున్నది. నేను వినాశముకొరకే జనించితిని కాబోలు నన్ను సృష్టించి దీర్ఘాయు వొసంగుట పరమేష్టి కేమిప్రయోజనమో తెలియకున్నది. నే సమసితినేని నీకీయాపద రాకుండును గదా ! ఇప్పుడు నేనేమిచేయుదును ? ఎవ్వరితోఁ జెప్పుకొందును ? రక్షించువారెవ్వరు ? అయ్యో ! అయ్యో ! ఇంతకంతయుఁ దెలిసికొనలేకపోయితినే ? యని యనేకప్రకారముల విలపించుచు నురముబాదుకొనుచు నేలంబడుటయుంజూచి కపింజలుఁ డిట్లనియె.

గంధర్వరాజపుత్రీ ! నీవిట్లు నిందించుకొనియెదవేమిటి ? నీయందేమి దోషమున్నది ? వెండియు నిప్పుడు దుఃఖించుట కవసరమేమివచ్చినది ? యతఁడితరిలో సుఖమే యనుభవింపఁగలవు నీయిరువురు తచ్ఛాపాంతమునఁ బతులతో గలిసికొందురు. అశరీరవాణిని మీరు వినియుంటిరికదా ! అంతదనుక తపంబే చేయుచుండుఁడు. తపంబున నన్నికార్యములు చక్కఁబడును. తపంబునంగాదే ! శర్వాణి

ఈశ్వరుని యర్ధాంగశరీరము ధరించినది. చింతింపకుమని యూరడించిన మహాశ్వేతయు నతని మాటలచే దేరి స్వాంతమున సంతసము వహించినది.

అప్పుడు కాదంబరి కపింజలుంజూచి మహాత్మా! నీవును పత్రలేఖయు నొక్కసారియే యీ సరస్సులోఁ బడితిరికదా! పత్రలేఖ యేమైనదని యడిగిన నతం డిట్లనియె.

దేవీ! నీటిలోఁబడిన నేమిజరిగినదో నాకేమియుం దెలియదు. నేనిప్పుడు త్రికాలవేదియగు శ్వేతకేతునొద్దకుఁబోయి చంద్రాపీడునియాత్మ యెక్కడ నున్నదియో పుండరీకాపరరూపమైన వైశంపాయనుఁ డేమయ్యెనో పత్రలేఖ యెక్కడికిఁ బోయినదో యతని నడిగి తెలిసికొనివచ్చెదనని పలుకుచునే యాకాశమునకు నిర్గమించి యరిగెను.

అట్లతఁడరిగిన పిమ్మటఁ గాదంబరి మహాశ్వేతంజూచి ప్రియసఖీ! మన యిరువురకు సమానశోకంబు గలుగఁజేసిన భగవంతుఁ డిప్పుడు నన్ను నిలబెట్టెను. నిన్ను ప్రియసఖీ! యని పిలుచుట కిప్పటికి లజ్జింపకుంటిని. నాకిప్పుడు నెచ్చెలివైతివి. నాకిప్పుడు మరణమైనను దుఃఖము కొఱకుగాదు. నీవిప్పుడు నా కుపదేశింపఁ దగియుంటివి. నేనిప్పుడేమి చేయవలయునో నాకుం దెలియకున్నది. నీవు విమర్శించి కర్తవ్య ముపదేశింపుమని పలికిన విని యక్కోమలికి కాదంబరి కిట్లనియె

వయస్యా! ఈ విషయమై చెప్పుటకును వినుటకును నేమియున్నది. మనకు ప్రియసమాగమావేళ నేమిచేయుంచుడునో యట్లు చేయఁదగినదే! పూర్వము నాజ్ఞాత్రముచేతనే యోదార్పఁబడితిని. ఇప్పుడు కపింజలుఁడు పుండరీకుని వృత్తాంతమును గురించి స్పష్టముగా జెప్పెను కదా! నీవుమాత్ర మేమిచేయుదువు? నీటొంయం దుంచుకొని చంద్రాపీడుని శరీరమును విడువక వినాశనము కాకుండా నర్చింపుచుండుము. మృద్ధాతుశిలారూపములైన యప్రత్యక్ష దేవతల సేవించుట కంటె ప్రత్యక్షదైవమైన యీ చంద్రాపీడుని శరీరమును బూజించుటయే శ్రేయము. అట్లుచేయుము. ఎప్పటికైని యే దేవునకైన ననుగ్రహము రాకపోవునా? యని చెప్పిన విని కాదంబరి యప్పుడేలేచి తరళికామదనలేఖలు సహాయముచేయఁ జంద్రాపీడుని శరీరమును మెల్లగానెత్తి శీతవాతాతపాది దోషరహితమైన యొకశిలాతలమందుంచి శృంగారవేషము దీసికొని స్నానముచేసి పరిశుద్ధచిత్తయైన ధౌత దుకూలములు దాల్చి అధరకిసలయంబున దట్టముగాఁ బట్టియున్న తాంబూల రక్తిమమును బెక్కుసారులతోమి కడిగి మాటిమాటికిఁ గన్నీరు గార్చుచు ననభ్యస్తము నపూర్వము నైన నియమము ధరించి పూర్వము సురతోపభోగమునకై తెచ్చిన పూవులు గంధము నంగరాగము ధూపములు మొదలగువాని చేతనే చంద్రాపీడమూర్తి నర్చించుచు మూర్తీభవించిన శోకదేవతయుంబోలెఁ జింతించుచు మరణమునకన్న కష్టతరమైన యవస్థ ననుభవించుచు నాహారము గుడువక వెంకియు నతని యడుగులు తొడయం దిడుకొని యొత్తుచు నెట్టకేల కాదివసము గడిపినది.

మరునాఁడుదయంబున నూత్న తేజంబుతో నొప్పుచున్న చంద్రాపీడునిం జూచి వెరగందుచుఁ గాదంబరి మదనలేఖతో నాతీ! యీతని మేనికాంతి యెంతవింతగా నున్నదియో చూచితివా? ప్రేమాతిశయంబున నాకే యిట్లుతోచుచున్నదేమో! నీవు గూడ విమర్శించి చూడుమని పలికిన విని మదనలేఖ యిట్లనియె.

రాజపుత్రీ! ఇందు నిరూపింపవలసిన దేమియున్నది. యీతనికిం జైతన్య మొండు కొరంతగా నున్నది. కాని యథాస్థితిగానే యున్నవాఁడు కపింజలుఁడు చెప్పిన మాట యథార్థమని దీన స్పష్టమగుచున్నయది లేనిచో మృతుండైనవాఁ డిట్లుండుట యెందేనిం జూచియుంటిమా? ఇది శాపదోషముకాక మఱియొండు కాదని పలికి యక్కలికి నూరడించెను. కాదంబరియుఁ బ్రతిదినము చంద్రాపీడమూర్తిని దేవతా విగ్రహమునట్లు త్రికాలములయందుఁ బూజింపుచు ధృతవ్రతయై శాపావసానకాల మరయుచుండెను.

మరికొన్ని దినంబులకుఁ దారాపీడుఁడు చారముఖంబుగాఁ దద్వృత్తాంత మంతయును విని మిక్కిలి పరితపించుచు మనోరమా శుకనాసులనుగమింప విలాసవతింగూడి యుచిత పరివారములతో నయ్యాశ్రమమునకుఁబోయి యందు జంద్రాపీడుని యవస్థంజూచి పెద్దయుం బ్రొద్దు జింతించి శాపప్రకారమంతయు వినియున్నవాఁడు కావున నెట్టకే శుకనాసునిచే బోధింపఁబడి వైరాగ్యమును వహించి రాజ్యభారము మంత్రులయం దుంచి భార్యతోగూడ నా ప్రాంతమందున్న వనములో మునివృత్తిఁబూని కాలక్షేపము చేయుచుండెను.

అనిచెప్పి జాబాలి పక్కునవ్వి హారీతప్రముఖులగు మునులతో ననఘులారా! యీకథారసం బెంత వింతగా నున్నదియో వింటిరా? వక్తవ్యాంశమును విడిచి యతిదూరము చెప్పుకొని పోయితిని.

వినుండా పుండరీకుండు కామోపహతచిత్తుండై తాను జేసిన యవినయ దోషంబున దివ్యలోకమునకుఁ జెడి పుడమియందు శుకనాస తనయుండైన వైశంపాయనుఁడుగా జనియించెను.

వెండియు నతండు మహాశ్వేతచే శపింపఁబడి యిట్లు చిలుక యోని యందు జనియించెనని యెఱింగించినంత నాకప్పుడు నిద్ర మేల్కాంచినట్లుగా జాతిస్మరణగలిగి పూర్వజన్మోపాత్తవిద్య లన్నియుం స్ఫురించినవి మనుజుండువోలె స్పష్టముగా మాట్లాడుటయు సర్వవస్తు జ్ఞానము విద్యోపదేశకౌశలము మిక్కుటముగా లభించినది. పెక్కేల? శరీర మొక్కండుదక్క తక్కిన చర్యలన్నియు మనుష్యుండువలెనే చేయసామర్థ్యము గలిగినది. అట్టి జ్ఞానము గలిగి నిజవినయ శ్రవణంబునఁ గలి

గిన సిగ్గుచేత నించుక తలవంచుకొని కొంచెమునే పూరకొని నే నల్లన నా జాబాలి కిట్లంటి.

దేవా! నీ యనుగ్రహంబున మదీయ పూర్వవృత్తాంతమంతయు స్మరణకు వచ్చినది. యాప్తులనందరను స్మరించుకొంటిని. నా మృతిని వినినంత హృదయము భేదిల్లఁ జైతన్యమును విడిచి చంద్రాపీడుఁడు జన్మాంతరమున నే శరీరమును దాల్చెను? దయయుంచి వక్కాణింపుఁడు అతనితోఁ గలసికొంటినేని తిర్యగ్యోని యందున్నను నాకు సంతసముగానే యుండునని యడిగిన నమ్మహర్షి పుంగవుండు కన్నుగవఁ గెంపుగదుర నన్నుఁ జూచుచు, దురాత్మా! నీ చిత్తచాంచల్య మింకను విడువకున్నవాఁడవే! దాని మూలముననేకదా! ఇట్టియవస్థ ననుభవింపు చున్నవాఁడవు. ఇప్పుడు నీకు రెక్కలైనను బూర్తిగా రాలేదే! తొందర పడియెదవేల? ఎగురుటకు సామర్థ్యము వచ్చినపుడు నన్ని సంగతి నడుగుము చెప్పెదనని పలికినవిని హారీతకుం డిట్లనియె.

తాతా! ఈతండు మునిజాతియఁడు జనియించియు జీవితమును విడుచు నంతి కంతుసంతాపమును జెందెనేమి? దివ్యలోకి సంభూతున కల్పాయువు గలుగు టెట్లు? నాకు మిక్కిలి విస్మయముగా నున్నది ఎఱింగింపవే? యని యడిగిన నమ్మునిమార్తాండుండు వెండియు నిట్లనియె.

వత్సా! యీతండు కామరాగ మోహమయము నల్పసారమునైన స్త్రీ వీర్యమువలనఁబుట్టుటచే నట్లయ్యె. అల్పసారమగు స్త్రీవీర్యంబునం బొడమిన జంతువు గర్భంబుననే హరించును. లేక చచ్చియైనం బుట్టును. జీవించి పుట్టినను దీర్ఘకాలము బ్రతుకదని యాయుర్వేదంబున స్పష్టముగాఁ జెప్పఁబడియుండ దీనికి విస్మయమేల! దద్దోషంబునంజేసి వీఁడు కామరతుండై మదనజ్వర వేగంబున సమసె. శాపావసాన కాలంబున దీర్ఘాయుష్మంతుండై యొప్పునని చెప్పెను.

అప్పుడు నేను వెండియు మహాత్మా! నేను బాపాత్ముండనై యీ తిర్యగ్యోని యందు జనియించితిని. నీ యనుగ్రహంబు నాకు వాక్కు మాత్రము వచ్చినది. యద్భుతపూర్వమైన జ్ఞానము గలిగినది నాకే సుకృతంబున నీరూపము వాయగలదు? అయినెట్లు వర్తిల్లుదు? నే చేయవలసిన కృత్యమెద్ది? దయామయుఁడవై యెఱింగింపు మని ప్రార్థించిన విని యజ్జాబాలి దిఙ్ముఖంబులు సూచుచు, అయ్యో! ఈ కథామూలంబునఁ దెల్లవారిపోయినది. యనుష్ఠానవేళ యతిక్రమించినది. యది యట్లుండనిమ్మని పలుకుచు నాగోష్ఠి చాలించి లేచుటయు నమ్మునులందరు తత్కథారసాస్వాదనంబునఁ జేయదగిన కృత్యములు మరచి విస్మయమందుచు నెంతకష్ట

మని పలుకుచు నొక్కింతసేపుండి పిమ్మట దమదమ నివాసములకుఁ బోయిరి. హారీత కుండును నన్ను మెల్లగా జేతియందెక్కించుకొని పర్ణశాలయందొక వేదికయందు భద్రముగా నునిచి తాను స్నానార్థ మఱిగెను.

పిమ్మట నే నాత్మగతంబున అయ్యో! అనేక భవసుకృత పరిపాకంబునం గాని మానుషదేహంబు గలుగదు. దానియందును సకలజాతి విశిష్టమైన బ్రాహ్మణ్యము దుర్లభమైనది. అంతకన్న నా సన్నామృత పదము గల మునిత్వము విశిష్టతరమైనది. దివ్యలోక నివాసిత్వ మంతకన్న విశేషమైనది. అట్టి యున్నతపదమునుండి స్వదోష మూలముననే యధోగతిం బడి యిట్టి తిర్యగ్గాతియందుఁ బుట్టితిని. అన్నన్నా! ఎంత మోసము వచ్చినది. సీ! ఇఁక నాకి జీవితముతోఁ బ్రయోజనమేమి? ఈ శరీర మెట్ల యినను సరియే విడచి విధిమనోరథమును సఫలము జేసెదనని యూహించి జీవితమును విడుచుటకు నిశ్చయించుకొని యుంటిని.

ఇంతలో హారీతకుఁడు వచ్చి అన్నా! వైశంపాయన! నీ పుణ్యము మంచిది. నీ తండ్రియొద్దనుండి నిన్ను వెదకికొనుచుఁ గపింజలు డిప్పటి కిప్పుడు వచ్చెనని చెప్పుటయు నే నప్పుడు రెక్కలు వచ్చిన దానివలె నెగరబోయి యత్యంత సంతోషముతో నతం డెక్కడనని యడిగితిని.

అప్పుడు హారీతకుఁడు అతండు మా తండ్రి యొద్దనుండి మాటలాడు చున్నవాఁడని చెప్పినవిని నేను ఆహా! అతనిం జూచుటకు నా హృదయము మిక్కిలి పరితపించుచున్నది. నన్ను వేగము వాని చెంతకుఁ దీసుకొని వెళ్ళుమని ప్రార్థించు చుండగనే యా కపింజలుఁడు గగనమార్గమునఁ బూర్వరూపముతో నా యొద్దకు వచ్చెను.

వానిం జూచి నేను గన్నీరుగార్చుచు నట్లుండియు నెదురుకొనఁ బ్రయత్నించితినికాని రెక్కలు రామింజేసి శరీరము కదిలినదికాదు. అప్పుడు నేను దీనస్వరముతో వయస్యా! కపింజల! జన్మద్వయాంతరిత దర్శనుండవగు నీ రాక చూచి తొందరగా లేచి యెదురుకొనుచు జేతులుచాచి గాఢముగా నాలింగనము జేసికొనుటకును జేయి పట్టుకొని పీఠంబున గూర్చుండబెట్టుకొనుటకు సుఖాసీనుండవైన నీకు గమనా యాసంబువాయ నడుగులొత్తుటకు నాకు యోగ్యత లేకపోయినది కదా! యని చింతించుచున్న నన్ను గపింజలుడు తన రెండుచేతులతోడ నెత్తిపట్టుకొని యాలింగన సుఖంబనుభవించువాడుంబోలె వక్షమున నిడుకొనుచు శోకంబున మదీయచరణంబుల శిరంబున నుంచుకొనుచు బ్రాకృతుండువోలె బెద్ద యెలుంగున రోదనముజేసెను.

అట్లు పెద్ద యెలుంగున బ్రాకృతుండువోలె శోకించుచున్న యతని నూర

దించుచు నే నిట్లంటిని. సఖా ! కపింజల ! సకలక్లేశపరిభూతుండనగు నాకీ శోకము తగునుగాని నీవిట్లు విలపించెదవేమిటికి ? నీవు బాలుండవైనను సంసారబంధాత్మకము లగు రాగాది దోషముల నంటక వర్తింపుచుంటివి. ఈమూఢజనమార్గమును విడువుము. కూర్చుండి చెప్పుము. మా తండ్రి కుశలుఁడై యున్నవాఁడా ? నన్నెన్నఁడైన స్మరించునా ? ఈ వృత్తాంతము విని యేమనుచున్నవాఁడు ? కోపము సేయుచుండెనా ? యేమి ? అని నేనడిగిన నతండు హారీతకిమ్మునిచే వేయఁబడిన పల్లవాసనమున గూర్చుండి నన్నుఁ బొదయం దిడికొని హారీతకునిచే నీయఁబడిన యుదకముచే మొగము గడిగికొని నా కిట్లనియె.

మిత్రుఁడా ! మీ తండ్రి కుశలుఁడై యున్నవాఁడు మన వృత్తాంతమంతయు దివ్యదృష్టిచేఁజూచి ప్రతిక్రియకొరకుఁ బ్రయత్నించుచుండెను. అంతలో నేను తురగత్వమును విడిచి ఆయనయొద్దకుఁ బోయితిని. దూరమునందె నన్నుఁ జూచి కన్నుల నశ్రుజలంబుగ్రమ్మ భయపడుచున్న నన్నుఁ జేరదీసి గారవింపుచు నిట్లనియె.

వత్సా ! కపింజల ! వగవకుము ఈ తప్పు నాది కాని మీది కాదు. పుండరీకుఁడు పుట్టినప్పుడే వాని కిట్టి దోషమున్నదని యెఱింగియుఁ బ్రమాదంబున నా యుష్కరమగు కర్మ నిర్వర్తించితిని కాదు. ఇప్పుడన్నియుం దీర్చితిని. కొలఁది దినములలో నీ కష్టములన్నియు బోవగలవు. అంత దనుక నీవు నా యొద్ద నుండుమని యాజ్ఞాపించుటయు నే నిట్లంటి.

తాతా ! నీకు నాయందనుగ్రహము గలిగినచో నా మిత్రుఁడెందుండెనో యచ్చటికిఁ బోవుట కాజ్ఞ యిమ్ము. వానిం జూడ నాకు మిగుల నాతురముగా నున్నదని యడిగిన నమ్మహర్షి యిట్లనియె. వత్సా ! వాఁడిప్పుడు చిలుకగా నుదయించి యున్నవాఁడు. నీవు పోయియు వానిం దెలిసికొనఁజాలవు. వాఁడును నిన్నెఱుఁగడు. కొంత కాల తిరుగనిమ్మని యాజ్ఞాపించెను. నేనందే యుంటిని. నేఁటి యుదయంబున నన్నుఁ జీరి యా పారికాంక్షి వత్సా ! కపింజల ! నీ మిత్రుఁడిప్పుడు మహానుభావుండైన జాబాలి యను మహర్షి యాశ్రమములో నున్నవాఁడు. వానికిప్పుడు తత్ప్రసాదంబున బూర్వజన్మస్మృతి గలిగినది. కావున నీవిప్పు డతనిం జూడఁబొమ్ము. కర్మ పరిపక్వమగువరకుఁ నా మహాత్ముని యాశ్రమము విడువవలదని నా మాటగాఁ జెప్పుముఁ అని యుపదేశించెను. మఱియు నీ తల్లియగు లక్ష్మియు నీ దుఃఖము విని దుఃఖించుచు నీ విముక్తి కొరకై యమ్మునికిఁ బరిచర్య చేయుచున్నది. అదియు నీకిట్టి చెప్ప

మన్నది. అని పలుకుచు శిరీష కుసుమపేశల పక్ష్మములగు నా గాత్రముల దన మృదుకరతలంబున దువ్వుచు హృదయంబున మిక్కిలి పరితపించెను.

అప్పుడు నేనతనింజూచి వయస్యా ! నీవెందులకు విచారించెదవు ? మంద భాగ్యుండనగు నా మూలమున నీవు తురగమై పుట్టి యనేక కష్టము లనుభవించితివి. అయ్యయ్యో ! సోమపానోచితమగు నీ నోటియందు నురగతో గూడిన రక్తము స్రవింపుచుండ దగిలించిన యినుప కళ్లెము యొక్క క్షతము లెట్లుగా సహించితివి ?

కిసలయశయనోచితసుకుమారగాత్రుండవగు నీవు పడుకొనక సంతతము నిలబడి యెట్లుగానుంటివి ? మిక్కిలి కోమలములగు నీ యంగముల గశాఘాతము లెట్లుగా భరించితివి ? అక్కటా ? బ్రహ్మసూత్రభారమును వహించెడు నీ దేహమున బిడుగుపకినంత బాధగల పీడల నెట్లుగా సహించితివి బాబూ ! అని పలుకుచు వానితో బూర్వవృత్తాంతముల ముచ్చటింపుచుండ క్షణకాలము తిర్యగ్జాతి దుఃఖము మరచి యానందించితిని.

అంతలో మధ్యాహ్న సమయమగుటయు హరీతకునితోఁ గూడ గపింజ లుడు యథోచితాహారమున నన్ను దృప్తుం గావించి తాను కూడ భుజించి క్షణకాల మూరకొని వెండియు నా కిట్లనియె.

వయస్యా ! మీ తండ్రి నీకి వార్త జెప్పి నన్ను వెంటనే యక్కడికి రమ్మని యాజ్ఞాపించెను. నేనిక బోయి వచ్చెద. నీవు కర్మ పరిసమాప్తి వరకు నీ మహర్షి పాదమూలమును విడువరాదసుమీ ! అని పలికిన విని విషణ్ణవదనుండనై యిట్లంటి.

కపింజలా ! ఇట్టి యవస్థలోనున్న నేను దలిదండ్రుల కేమని సందేశ మంపుదును ? అంతయు నీవే యెఱంగుదువు. అనుటయు నతండు నన్నందుండి కదలనీయవలదని హరీతకునకుఁ బలుమారు జెప్పి యప్పగించి నన్ను మరియొకమారు కౌఁగలించుకొని మునికుమారులెల్ల విస్మయముతోఁ జూచుచుండ నంతరిక్షమున కెగిరి యంతర్ధానము నొందెను.

అతండరిగిన వెనుక హరీతకుఁడు నన్నారడించుచు స్వయముగా నా కాహారాదిక మిడుచు నేకొరతయు రాకుండఁ గాపాడుచుండెను. కొన్ని దినంబులకు నాకు రెక్కలు వచ్చినవి. ఇంచుక యెగురుటకు సామర్థ్యము కలిగినప్పుడే నాహృదగతం బున నిట్లు విచారించితిని. నా మిత్రుకు చంద్రాపీడుని మహాశ్వేతను జూచుటకు నా మనసుత్సుకము జెందుచున్నది. నేనక్కడికిపోయి వసించెదనని తలంచుచు నొకనాడు ప్రాతఃకాలమున విహారమునకుం బోలె బయలుదేరి యుత్తరదిక్కు ననుసరించి యెగిరి పోయితిని.

స్వల్పదినముల క్రితమే యెగరనేర్చితిని. కావునఁ గొంచెము దూరము పోయినంతనే నా యవయవములన్నియు విడిపోయినట్లాయాసము గలిగినది. దాహముచే నాలుక యెండఁ జొచ్చినది. శ్వాసలు బయలుదేరినవి. రెక్కలాడింపశక్యము గాకుండెను. కన్నులు తిరుగుచుండెను. ఇక్కడఁబడియెద నిక్కడఁ బడియెదనని తలంచుచుఁ దూలుచు నా సమీపమందున్న సరస్తీరమందలి జంబూతరు నికుంజముమీఁద నతికష్టమున మేనుఁజేర్చితిని.

కొంత సేపటికి గమనాయాసమించుక తగ్గినది. మెల్లగాఁ జెట్టుదిగి శీతలంబగు తచ్ఛాయ నాశ్రయించితిని. మరియు గింజల్కర జోవాసితంబగు నా సరస జలంబు దృప్తిగా ద్రావిత్రావి మృదువులగు కమలకర్ణికాబీజములచేతను, తీరతరుపర్ణాంకురముల చేతను, పండిరాలినఫలములచేతను ఆకలి యడంచుకొని యపరాహ్ణకాలంబునఁ దిరుగా బయలుదేరి నెంత దూరము బోవఁగలనో యని యాలోచించుచు మార్గగమన ఖిన్నములగు నవయవములకు విశ్రాంతి గలుగుటకై నీడతోఁ గూడిన తత్తరుశాఖ నాశ్రయించి మొదటిభాగముననే కూర్చుంటిని. అంతలో నాకు నిద్రపట్టినది. కొంత సేపటికి మేల్కొనిలేచి చూచువరకు త్రెంపరాని తంతుపాశములచేఁ గట్టబడి యుంటిని.

అప్పుడు పాశములేని కాలపురుషుని భాతి నుక్కుముక్కలచే నిర్మింపబడిన రెండవ ప్రేతపతిచందమునఁ బణ్యారాశికిఁ బ్రతిపక్షు వైఖరిని బాపమున కాశ్రయుం దట్ల తోచుచుఁ గోపకారణము లేకయే భ్రుకుటీరౌద్రములైన నేత్రములు గలిగి కృతాంతునికిఁ గూడ భయము గలుగఁజేయు వాఁడుంబలె నొప్పుచు మలినవసనాంగుడై యదృష్టాశ్రుత పూర్వుండైనను స్వరూప ప్రకటిత క్రౌర్య దోషుండగు నొకానొక పురుషు నెదురం గాంచితిని.

వానిం జూచినతోడనే నాకు జీవితమందు నిరాశ గలిగినది. అయినను నించుక ధైర్యము దెచ్చికొని వాని కిట్లంటి. భద్రా! నీవెవ్వడవు? నన్నిట్లేమిటికి గట్టితివి? మాంసలాలసత్వమున నంటివేని నిద్రలోనే నన్నుఁ జంపఁదగినది. నిరపరాధినగు నాతో నీకేమిపని? విలాసమున కిట్లు పట్టితినంటివేని కౌతుకము తీరినది గదా? ఇఁక వదలుము. మిత్రులంజూడ నేను దూరముపోవలసియున్నది. ఆలస్యమునకు నా హృదయము సహింపదు. నీవును బ్రాణిధర్మమునందే యుంటివి గదా! నీయెరుఁగని ధర్మంబులుండునా? అని ప్రార్థించిన వాఁడిట్లనియె.

మహాత్మా! నేను జాతిచే ఛండాలుండను. క్రూరకర్ముఁడను విలాసమునకు మాంసమునకు నిన్ను నేను గట్టలేదు. ఇక్కడి కనతి దూరములో నున్న మాలపల్లె యందు నా యధికారి గలఁడు. అతని కూఁతురు తొలిప్రాయంబున నొప్పుచున్నది. ఆమెకు జాబాలియను మహర్షి యాశ్రమమున మాటలు నేర్చిన చిలుక గలిగియున్నదని నీ వృత్తాంత మెవ్వరో చెప్పియున్నారు.

ఆ కథ విని యా చిన్నది మిక్కిలి వేడుకపడుచు నిన్నుఁబట్టి తీసికొని వచ్చుటకై బహుదినముల క్రితమే నావంటివాండ్రఁ బెక్కండ్ర నియమించియున్నది. నా పుణ్యము వలన నీవిప్పుడు నాచేఁ బట్టుపడితివి. నిన్నామె చెంతకుఁ దీసికొనిపోయెదను. నీ బంధమోక్షమునకా పద్మగంధియే సమర్థురాలని పలికిన విని నెత్తిపై పిడుగు పడినట్లు అంతరాత్మ బాధపడుచుండ నే నాత్మగతంబున నిట్లు తలంచితిని.

అక్కటా ! మందభాగ్యుండనగు నాయొక్క కర్మవిపాకము కడు దారుణమైనదిగదా ! సకలసురాసుర మకుటమణి కిరణ నీరాజిత చరణ కమలయగు మహాలక్ష్మికిఁ బిడ్డనై పుట్టి జగత్త్రియ పూజ్యుండగు శ్వేతకేతు మహామునిచేఁ బెంపఁబడి దివ్యలోకాశ్రమముల వసియించెడు నేనిప్పుడు మ్లేచ్ఛజాతికైనఁ బ్రవేశింపఁదగని మాలపల్లె కరుగవలసినదా ? చండాలురతోఁ గూడఁ గలసి యుండవలసినదా ? మాలెతలచే నీయఁబడిన కబళములచే దేహము పోషించుకొనవలసినదా ? చండాల బాలకులకు నాటవస్తువును గావలసినదా ? అహా ! దురాత్మా ! పుండరీకహతక ! ఛీ ! నీజన్మ కడు నింద్యమైనదిగా ! నీవు ప్రథమ గర్భమందే వేయి ముక్కలై చెడిపోయితివేని యీ యిక్కట్లు రాకపోవునుగదా ? తల్లీ ! లోకమాతా ! పద్మశరణా ! అశరణ జనశరణ చరణపంకజా ! నన్నీ నరకకూపమునం బడకుండఁ గాపాడలేవా ? తండ్రీ భువనత్రయత్రాణ సమర్థుండవు స్వయముగాఁ బెనిచిన నీ కులతంతువునగు నన్నీ యాపద నుండి రక్షింపుము. వయస్యా ! కపింజల ! నీవు వేగవచ్చి నాకీయాపద దాటింపక పోయితివేని జన్మాంతర మందైన నిక నాతోఁ గలిసికొనఁజాలవుసుమీ ? అని యనేక ప్రకారముల విలపించుచు వెండియు వినయముతో వాని నిట్లు ప్రార్థించితిని.

చంద్రదసఖ ! నాకు జాతిస్మృతి గలదు. నేనొక మునికుమారుండను ఈ సంకటము నుండి నన్ను దప్పించిన నీకును బుణ్యము రాఁగలదు. నన్ను బట్టిన దైవ్యరును జూచియుండలేరు విడిచినచో నీకుఁ బ్రత్యవాయ మేమియుం గలుగదు. కావున గరుణించి నన్ను వదలుమని ప్రతిమాలుకొనుచు వాని పాదంబులం బడితిని. పక్కుననవ్వి వాఁడు నాకిట్లనియె. ఓరీ ! మోహాంధుఁడా ! శుభాశుభకర్మలకు సాక్షిభూతములగు పంచభూతములు నీశరీరమున లేవా ? అవి చూచుచుండవా ? అకార్యకరణమునకు నేనంగీకరింపను స్వామ్యాజ్ఞచే నిన్నుఁ బట్టికొంటిని వదలుటకు వీలు లేదని పలుకుచు నన్నుఁ దీసికొని పక్కణాభిముఖుండై యరుగుచుండెను. నేను వాని మాటచే నెత్తిపైఁ గొట్టబడినట్లు మూకీభావము వహించి యే పాపముఁజేసి యిట్టిఫలమనుభవింపుచుంటినో యని ధ్యానించుచుఁ బ్రాణములు విడుచుటకు నిశ్చయించుకొంటిని. మఱియు వానితో నట్లు తీసికొని పోఁబడుచున్న సమయంబున ముందు జూచినంత,

సీ. కుక్కలతో గూడికొని గుంపు గుంపుగా
చండాల బాలకుల్ సంచరింప
దూషితమాంస మేదో వశాకర్దమ
ప్రాయకుటీరరాజితములు వెలయ
గుడిసెల చుట్టు బల్ గోటగాఁ గట్టిన
వెదురు కంపల దడుల్ పిదులంట
నస్థిరాసులఁ జేరి యరవులతో మీఱి
కుర్కురంబులు దాడి గ్రుద్దులాడ.

గీ. బురదగుంటలఁ బందులు పొర్లులాడ
విస్రగంధి రక్షోధూమ వితతమగుచుఁ
దలపఁజూడ నసహ్యమై తనరునట్టి
పక్కణము గాఁబడియె నప్పతగపతికి.

నరకవాసులకుఁగూడ నుద్వేగము గలుగఁజేసెడు నామాలపల్లెం జూచి జుగుప్స జెందుచు నాహా! ఆ చండాలకన్యక దూరమునందే నన్నుఁజూచి కరుణ జనింప వదలివేయుమనునా? పట్టిది పట్టిన జాతికిం దగని యట్టిపని యెన్నడుం జేయదు. కానిమ్ము. నాపురాకృత మిట్లున్నది ఏమి జేయుదును? నిమిషమైన నిందుండ జాలనని తలంచుచుండగనే వాఁడు నన్నామెకడకుఁ దీసికొనిపోయి తల్లీ! అవధాయ! ఇదిగో నీవు చెప్పిన చిలుకం దీసికొని వచ్చితిని. చూడుమని నమస్కరించి నన్నుఁ జూపెను.

ఆ మగువ మిగుల సంతోషించుచు మంచిపని గావించితివని వాని మెచ్చుకొని నన్ను వాని కరమునుండి తన రెండు చేతులతోఁ గైకొని పుత్రకా! నేటికిఁ దొరికితివి? ఇంకెక్కడికి బోఁగలవు? నీ కామచార దోషమంతయుఁ బోగొట్టెదఁ జూడుమని పలికినది. అప్పటికా చండాల బాలకుఁడు పరుగెత్తుకొనిపోయి లోమశంబై దుర్గంధ యుక్తంబగు గోచర్మముచేఁ గప్పఁబడిన దారుపంజర మొకదానిం దీసికొని వచ్చి యామె ముందర నుంచెను మహాశ్వేతావలోకన మనోరథములతోఁ గూడ నన్ను లాగి "యిందుండుము. కదలకుమని" పలుకుచు నన్నా పంజరములో వైచి తలుపు బిగించినది అప్పుడు నేనాత్మగతంబున నిట్లు తలంచితిని.

అయ్యో! నేనిప్పుడు గొప్ప యాపదలోఁ బడిపోయితిని. శిరస్సుచే నమస్కరించి నా యవస్థయంతయు నీమె కెఱిగించి వదలుమని బ్రతిమాలుకొందునా? సరిసరి నేను లెస్సగా మాటాడుదునసియేకాదా? యీ పైదలి నన్నుఁ బట్టించినది. కావున నట్లు బ్రతిమాలుకొనుట వలన లాభములేదు. నా బంధనపీడ యీమె నేమి బాధించును? తనయుండననియా! సోదరుండననియా? బంధువుఁడననియా? కావున

మౌనమే యవలంబించుట యుక్తము. దానఁ గోపించి యింతకంటెఁ గష్టదశ నొందిం చునేమో ! అవును. సందియమేలా ! దీనిజాతి క్రూరజాతికాదా ? ఇంతకన్నఁ గష్ట మగుంగాక ? యీ ఛండాలురతోఁ గలసి మాట్లాడుట అనుచితము. కావున మౌనమవ లంబించుటయే శ్రేయము 'ఇఁక మాట్లాడదు. ఈ మూకశుకంబు నాకేల' యని యెప్పుడైన విసుగుజెంది విడువవచ్చును. మాట్లాడుచున్న విడువనేరదు.

అహా ! దివ్యలోక భ్రంశము మర్త్యలోక జన్మము తిర్యగ్యోని పతనము, ఛండాల హస్తోపగమనము. పంజరబంధ దుఃఖము. ఇది యంతయు నింద్రియచాపల్య దోషంబునంగదా ! కలిగినది. అక్కటా ! ఒక్క వాక్కునేకాదు. సర్వేంద్రియములను నియమించెదనని తలంచుచు మౌనము వహించితిని.

పలికించినను, తర్కించినను, గొట్టినను, బలవంతముగాఁ బొడిచినను నేమియు మాటాడక కేవలము సీత్కారము మాత్రము జేయుచుంటిని.

పానాశనములం దెచ్చి పెట్టినను నేమియు ముట్టక యా దివసముపవాసమే కావించితిని. ఆ మఱునాఁడును నేనేమియుం దినకున్నంతఁ జింతించుచు నా కాంతా మణి స్వయముగా నానావిధములగు ఫలంబులు సురభిశీతలమగు జలంబులు దీసికొని వచ్చి నాకిచ్చినది నే నుపయోగించితికాను. అప్పుడు నన్నుఁ దేఱిచూచి చూచుచు నా చిన్నది నాకిట్లన్నది.

నిర్వికారచిత్తములు గలిగి క్షుత్పిపాసలనే దీపించు పశువులకును, పక్షుల కును సిద్ధమైన యాహార మెట్టిదైనను గుడుచుట ధర్మమైయున్నది. నీ వట్టిదానవుగదా? నీకి భోజ్యాభోజ్య వివేకన మేమిటికిఁ గలుగవలయును ? జాతిస్మృతి గలిగి యస్మ దీయంబగు నాహారంబు గుడువకుంటివా ? అట్లైనను తిర్యగ్జాతియం దుదయించిన నీకి నియమమవసరములేదు.

అత్యుత్తమమైన తాపసజాతియం దుదయించుటయుఁ దిర్యగ్జాతియందుఁ బుట్టఁదగిన పాపకర్మ గావించితివిగదా ? ఇప్పుడు నీకి విచారమేటికి ? మొదటనే వివే కము గలిగియున్నచో నీ ముప్పు రాకయేపోవును. ఇప్పుడు స్వకృతకర్మ విశేషంబు సంగలిగి జాతికిఁ దగిన యాహారము గుడుచుట నీకుఁ దోషము కానేరదు అదియునుం గాక గొప్పవారు గూడ నాపత్కాలముల యందు భక్షింపఁదగిన వానిం దిని ప్రాణ ములు నిలుపుకొందురు. నీ మాట చెప్పనేల ? మఱియు నీకు చండలాశన శంక గలుగ జేయు వస్తువులేమియు నేను దీసికొని రాలేదు. ఈ ఫలములం దినవచ్చును. పుల్కస భాండ గతముకన్న నేలఁబడిన యుదకము పవిత్రమని చెప్పుదురు. అట్టిదానినైనఁ ద్రాగరాదా ? ఊరక యేమిటికి క్షుత్పిపాసలచే నాయాసపడియెదవు ? మునిజనోచితమైన యీ ఫలముల నేమిటికి భక్షింపవు ? ఈ నీరేమిటికి త్రాగవు ? అని పలుకుటయు

జంటాలజాత్యనుచితములైన యా బోఁటి మాటలాలించి విస్మయము జెందుచుఁ జుగుప్స విడిచి జీవితాశచే క్షుత్పిపాసోపశమనమునకై యశనక్రియ నంగీకరించితిని. మౌనము మాత్రము విడువలేదు.

అట్లు కొంతకాలము జరిగినంత నేను తరుణత్వము వహించిన పిమ్మట నొకనాఁడు ప్రాతఃకాలమున నిద్రలేచి చూచినంత నావారు పంజర మేమైనదో తెలియదు. నేనీ బంగారుపంజరములో నుంటిని. ఆ కన్యక యిట్టి దివ్యరూపము గలదై యొప్పెను. దేవర జూచియే యున్నారుగదా! మఱియు నామాలపల్లి యమరనగర సమానమై ప్రకాశించుచుండఁ జూచి నేను పుల్కసపురవాస పరితాపము విడిచి యాశ్చర్యమందుచు నిది యేమని మౌనము విడిచి యప్పఁడతి నడుగుదమని యెంతలో దలంచు చుంటినో యంతలో నీకాంతారత్నము నన్నిక్కడికిఁ దీసికొని వచ్చినది

మహారాజా! ఈ సరోజానన యెవ్వతెయో యెందులకై యిట్లు చండాల రూపత్వము ప్రకటించినదో నన్నెందులకుఁ బట్టించినదో ఇప్పుడు సన్నిక్కడి కేమిటికిఁ దీసికొనివచ్చినదో నాకేమియుం దెలియకున్నది. దేవరవోలె నీకథ వినుటకు నేనుగూడ నుత్సుకము గలిగియుంటినని యా చిలుక చెప్పినది.

ఆ కథ యంతయును విని యమ్మహారాజు ఆ వార్త వినుటకు మిక్కిలి కుతూహలము గలవాఁడై వాకిటనున్న యా మాతంగకన్యం దీసికొని రమ్మని ప్రతీహారి కాజ్ఞాపించెను. అదివోయి యిటురమ్మిటు రమ్మని పలుకుచు నా కలికిం దీసికొనివచ్చి యెదుర నిలిపినది అప్పుడా వాల్గంటి భూమిసంటకయే నిలువంబడి తన తేజంబున సన్నృపునిఁ బరాభవింపుచుఁ బ్రౌఢముగా నిట్లు పలికినది.

భువనభూషణ! రోహిణీనాథ! తారారమణ! కాదంబరీలోచ నానందచంద్ర! ఈ దుష్టుఁడు తనయొక్కయు మీయొక్కయు వృత్తాంతమంతయు మీకు వినిపించెం గదా? జాబాలియాశ్రమము విడువవలదని తండ్రిగారిచే నియమింపబడియుఁ దదాజ్ఞ నుల్లంఘించి కామరాగాంధుండై మహాశ్వేతయొద్దకుఁ బ్రయాణమైనవార్తయు మీకు విదితమే.

నేనీ దురాత్ముని గన్నతల్లిని. మహాలక్ష్మిని. వధూదర్శనోత్సుకుండై యరుగుచున్న కుమారుని దుర్వృత్తి దివ్యదృష్టింజూచి శ్వేతకేతుఁడు నన్నుంజీరి నీ పుత్రుం డింకను నధోగతిం బొందునట్లు తోచుచున్నది. పశ్చాత్తాపంబునంగాని వాని చిత్తవృత్తి యుపశాంతి వహింపదు. నీవుపోయి వానికిఁ గర్మపరిపక్వమగుపనుక నొకచోటఁ గట్టిపెట్టి యనుతాపము గలుగునట్లు చేయుము. వేగమ బొమ్మని యాజ్ఞాపించుటయు నేనీ కల్పన యంతయుం గాంచితిని.

క. నీవా చంద్రాపీడుఁడ
వావైశంపాయనుండె యా నీశుకమో
భూవర! మీకిత్తరిశా
పావిలతోషావసానమై యొప్పుటచే.

మీ యిరువురను శాపావసానంబున సమముగా సుఖియింపఁ గలరని వీని నీచెంతకుఁ దీసికొనివచ్చితిని. లోకసంపర్క పరిహారమునకై చండాలజాతిం బ్రకటించితిని.

ఇప్పుడు మీ యిరువురు జన్మజరామరణాది దుఃఖబహుళములగు శరీరముల విడిచి యథేష్టజనసమాగమ సుఖంబుల ననుభవింపఁ గలరని పలుకుచు నమ్మాతంగ కన్యక మంజీరరవంబు ఘల్లురని మ్రోయఁ బాదంబులం నేలందట్టి యంతరిక్షమున కెగిరి యదృశ్యయై దివమునకుం బోయెను.

పిమ్మట నమ్మనుజపతి యయ్యువతి వచనములు వినినంత జాతిస్మరణ గలుగుటయుఁ గాదంబరిం దలంచుకొనుచుఁ గ్రమంబునఁ గాదంబరీ వియోగసంతాపంబునం గృశించి కందర్పశరాసారఘాతంబునం దుదకుఁ గాలధర్మము నొందెను. ఆ చిలుకయు శాపావసానమైనది కావున నయ్యొదయనితో గూడ నయ్యొడలు విడిచినది.

అంత నక్కడఁ గాదంబరియు నొక వసంతకాలంబునఁ గామోత్సవంబు గావించి వాడుకప్రకారము ప్రాతఃకాలంబునఁ జంద్రాపీడుని దేహము నర్చించి యౌత్సుక్యముతోఁ గంఠము గౌఁగలించుకొనినది.

అప్పు డమృత సేకంబునం బోలె నయ్యాలింగనసుఖంబునఁ జంద్రాపీడుఁడు మేనం బ్రాణములు జేరుటయు నాతపసంతాపంబున ముకుళించిన కలువసర త్కాలకౌముదిచే వికసించినట్లు మెల్లన హృదయ ముచ్ఛ్వాసభాసురంబయ్యె. ప్రాతః ప్రహృష్టేందీవర ముకుళము మాడ్కి కర్ణాంతాయతమగు నయనయుగము విడినది. మోము పద్మ వికాస వహించినది.

అట్లు నిద్రమేల్కాంచినట్లు లేచి చంద్రాపీడుఁడు మెడఁ గౌఁగలించి యున్న కాదంబరిని జిరవిరహ దుర్లభములగు లోచనములచే గ్రోలువాడుంబలెఁ జూచుచు గంఠంబు గౌఁగలించుకొని వాతాహత బాలకదళియుంబోలె వణంకుచుఁ గన్నులుమూసికొని తొట్రుపడుచున్న యాచిన్నదానికి మనోహరస్వరముచే నానందము గలుగఁజేయుచు నిట్లనియె.

బోటీ! నీవు వెరవకుము. నీకరస్పర్శంబుదగిలి నేను జీవించితిని. అమృత సంభవంబగు నప్సరఃకులంబున నీవు జనియించితివికదా. శాపదోషంబున నిన్నుదిన

ములు మనకు వియోగంబుగలిగె. అప్పుడు త్వద్విరహ దుఃఖ ప్రమాదమైన శూద్రకస్వప శరీరమును విడిచితివి. ఇఁక నీకు సుఖముగలుగును. నీ ప్రియసఖి మహాశ్వేతయొక్క ప్రియుండు సైతము నాతోఁగూడ శాపవిముక్తివడసె. నప్పఁడతియు సుఖించునని పలుకుచున్న సమయమందే నాగలోకమునుండి కపింజలుని కైదండఁగొని పూర్వము మహాశ్వేతచూచిన రూపమా కంఠమాల యాయజ్ఞసూత్ర మాకాటిపటముతోఁ బుండరీకుఁ డచ్చోటికి వచ్చెను.

అప్పుడు దూరమునం దతనింజూచి కాదంబరి చంద్రాపీడుని వక్షమునుండి లేచి యతివేగముగాఁ బరుగిడి మహాశ్వేతను గౌఁగలించుకొని తదాగమన వృత్తాంతమును జెప్పెను.

అంతలోఁ బుండరీకుఁడును జంద్రాపీడుని చెంతకువచ్చి యాలింగనము చేసికొనియెను.

చంద్రాపీడుఁ డతని బిగియఁగౌఁగలించుకొనుచు, వయస్యా! పుండరీక! ప్రాగ్జన్మసంబంధంబున నీవు నాకల్లుఁడ వైతివి. ఎట్లయినను మనము తదనంతర జన్మసంబంధ సముపగతమైన మైత్రిచేతనే వర్తింపఁ దగినదని పలుకుచున్న సమయంబునఁ గేయూరకు డా వార్త చిత్రరథహంసుల కెఱింగింప హేమకూటమునకుఁ బోయెను.

మదనలేఖయు వేగముగాఁబోయి యా ప్రాంతమునఁ దాపస వృత్తితో మృత్యుంజయ జపముచేయుచున్న తారాపీడుని పాదంబులంబడి చంద్రాపీడుఁడు జీవించిన వృత్తాంతమును జెప్పెను.

ఆ మాటవిని తారాపీడుఁడు విలాసవతితోఁగూడ నానందసాగరమగ్నుండై యత్యాతురముగా లేచి శుకనాశుఁడు తోడరాఁ మదనలేఖ వెంటఁ జంద్రాపీడుఁ డున్న చోటికిఁబోయి యందు బుండరీకునిమెడఁ గౌఁగలించుకొనియున్న కుమారునింజూచి నానందబాష్పములు నేత్రంబుల గ్రమ్మ నపారసంతోషపారావారంబున మునుంగుచుఁ బుత్రుం గౌఁగిలించుకొనియెను.

తల్లియుఁ బాలిండ్లు స్రవింపఁ దనయుంజూచి సంతోషవివశయై యుండెను. అప్పుడు చంద్రాపీడుఁడు దల్లిదండ్రులకు నమస్కరించుచు శుకనాశునికి సైతము గేలుమోడ్చి యతని యాశీర్వాదమందుకొనుచు ఆర్యా! వీఁడే వైశంపాయనుఁడు చూడుమని పుండరీకుం జూపెను.

ఆ ప్రస్తావములోనే కంపిజలుఁడు సమీపింప శుకనాశుని కిట్లనియె.

ఆర్యా! శ్వేతకేతుండు మీకిట్లు చెప్పుమనియె.

ఈ పుండరీకుఁడు నాచేతఁ బెంపఁబడుటయేగాని నీకే పుత్రుండు. వీనికిని

నీయందే ప్రేమగలిగియున్నది. కావున వీని వైశంపాయనుఁడే యనుకొని యవినయ కార్యములఁ బ్రవర్తింపనీయకుము. పరుఁడని యుపేక్షింపకుము. వీఁడు నీవాఁడే యనియే శాపావసానమున నైతము నీయొద్దకే పంపితిని.

అదియునుంగాక మదీయంబగు సాత్వికతేజం బిప్పు డింతకన్న నుత్తమ లోకంబునకుం బోవనున్నది.

అని యిట్లు శ్వేతకేతుని సందేశము కపింజలుండు చెప్పగా విని శుకనాయకుఁడు వినయావనమ్రముఁడై యున్న పుండరీకు నంసంబు బట్టుకొని కపింజలున కిట్లనియె.

కపింజల! సర్వజ్ఞుండైన శ్వేతకేతుం డిట్టివార్త బంపనేమిటికి? నేస్తంబున నిట్టిమాట వినినచో సంతోషము గలుగునా? అందరకు నమ్మహానుభావుని యాశ్రయమే కావలయునని యిట్లు పూర్వజన్మ సంస్కరణానురూపములైన యాలాపముల చేత నా దివసము గడిపెను.

అమ్మరునాఁ డుదయంబున గంధర్వకులనాయకులగు చిత్రరథ హంసులు సపత్నీకులై పెక్కండ్రు పరిచారకులు సేవింప నచ్చోటికి వచ్చి యల్లుండ్రు గూఁతుండ్రం జూచి యెంతేని సంతసము నెందుచుఁ దారాపీడ శుకనాశులచే మన్ననల వడసి కాల్యాలోచిత సంభాషణములచేఁ గొంత కాలక్షేపము చేసిరి.

అప్పుడు చిత్రరథుండు తారాపీడునింజూచి యార్యా! మిగుల వైభవము గల భవనములు గలిగియుండ నీ యరణ్యములో వర్తింపనేల? హేమకూటమునకుఁ బోవుదము రండని పలుకగా విని తారాపీడుం డిట్లనియె.

గంధర్వరాజా! ఎచ్చట నిరతిశయమగు సుఖముగలుగనో అదియే భవనము. ఇట్టిసుఖము నే నేభవనమునందును బొందియుండలేదు. అదియునుంగాక మదీయంబులగు భవనసుఖంబు లన్నియు నీ యల్లునియందే సంక్రమించినవి. నాకీయరణ్యమే శరణము. వధూయుతముగా నతనినే తీసికొని వెళ్ళుమని పలుకగా విని చిత్రరథుండు సమ్మతించి యప్పుడ తారాపీడుని యనుజ్ఞవడసి చంద్రాపీడాదులతోఁ గూడ హేమకూటనగరంబునకుం బోయెను.

అందు శుభముహూర్తమున సకలగంధర్వరాజ్యముల జిత్రరథుండు కాదంబరిని జంద్రాపీడున కిచ్చి వివాహము చేసెను.

హంసుండు నట్లే మహాశ్వేతనుఁ బుండరీకున కిచ్చి పెండ్లిచేసెను. అట్లు చంద్రాపీడ పుండరీకులు గంధర్వరాజ్యములతోఁ గూడ నచ్చేడియల స్వీకరించి యమ్మించుబోఁడులతోఁ గ్రీడించుచు దన్మాత్ర ముంచుకొనియున్న యంచువిశ్వాని కాప్యాయనము గావించిరి. మఱియొకనాఁడు కాదంబరి చంద్రాపీడునితో ముచ్చటింపుచున్న సమయంబున నామె యతని కిట్లనియె.

ఆర్యపుత్రా ! మనమందరము మృతిజెంది వెండియుం బ్రదికి యొండొరులము గలిసికొంటిమి. పత్రలేఖ సరస్సులోఁబడి తిరిగివచ్చినది కాదు. ఆమె వృత్తాంత మెట్టిదని యడిగిన నని చంద్రాపీడుఁ డిట్లనియె. ప్రేయసీ ! నా భార్యయగు రోహిణియే పత్రలేఖ. నేను పుండరీకునిచే శపింపఁబడి పుడమి జనించుచుండుటఁ జూచి నన్ను విడువలేక నా శుశ్రూషకై నాకన్న ముందుగనే భూమియం దుదయించినది. అంతకుఁ బూర్వము నేనును నెఱుఁగను. శాపాంతమైనది కావున నిప్పుడంతయు స్ఫురించుచున్న దని యెఱింగించెను.

చంద్రాపీడుఁడు పుండరీకునితోఁ గూడికొని కొన్ని దినంబు లుజ్జయిని యందును, కొన్ని దినంబులు హేమకూటమునందును, గొన్ని దినంబులు చంద్రలోకము నందును, గొన్ని దినంబులు లక్ష్మీసరస్సునందు వసించి దివ్యభోగము లనుభవించు చుండెను.

అని యెఱింగించి మణిసిద్ధుండు గోపా ! నీవు చూచిన చిత్రఫలకములోని యాకృతులు వీరివే. కాషాయవస్త్రము గట్టికొని గుహాప్రాంతమున నిలువబడినది మహాశ్వేత. చంద్రాపీడుని విగ్రహము నర్పించుచున్నది కాదంబరి. అది మదనలేఖ. అది తరళిక అని యీ వృత్తాంతమంతయు నెఱింగించుటయు నాలకించి యగ్గోపకుమారుండు సంతుష్టాంతరంగుఁడై యయ్యవారి ననేక ప్రకారములఁ గైవారము సేయుచు నతనితోఁ గూడఁ దదనంతరావసథంబుఁ జేరెను.

క. కాదంబరీ రసం బా
స్వాదించిన నించుకంత పరవశులై సం
మోదింతురు జనులనఁ ద
న్మాధుర్యం బెఱుకపడదె మరి విబుధులకున్.

గీ. బాణకవిచేత రచియింపఁబడియెఁ గొంత
యతనిసుతుచేతఁ బూరితమయ్యె నంత
మఱియు నిదియుఁ గథాసంగ్రహంబు దప్ప
కుండఁ దెనుగించినాఁడ గట్ట్యోపసరణి.

క. నీకర్పించితి నీకృతి
గైకొనుమా బాలచంద్ర కలిత లలిత ఫా
లా ! కాశీలోలా శై
లాకర శుభకర మహేశ హరవిశ్వేశా !

—:●:—

## గ ద్య ము

ఇది శ్రీమద్విశ్వనాథ సదను కంపాసంపాదిత కవితా విచిత్రాత్రేయ
గోత్ర పవిత్ర మధిర కులకలశ రాకా కుముద మిత్రాలక్ష్మీ
నారాయణ పౌత్ర కొండయార్య పుత్ర విబుధ జనాభి
రక్షిత సుబ్బన్న దీక్షితకవి విరచితంబగు కాశీ
యాత్రా చరిత్ర మను మహాప్రబంధ
మున నుత్తర ఖండానుబంధమను
నామాంతరముగలయాంధ్రీ
కృ త కా దం బ రి
సంపూర్ణము.
శ్రీ విశ్వేశ్వరార్పణమస్తు.

